National Bestseller

జీవాత్మప్రపంచ నియమాలు

THE LAWS OF THE SPIRIT WORLD

NOW IN TELUGU

ఖోర్షీద్ భావనగరి

"ఆత్మలోకంలో మతం లేదు. మేము ఒకే దేవుణ్ణి పూజిస్తాం"

JAICO

జీవాత్మప్రపంచ నియమాలు


"ఆత్మలోకంలో మతం లేదు. మేము ఒకే దేవుణ్ణి పూజిస్తాం"


THE LAWS OF THE SPIRIT WORLD

NOW IN TELUGU



ఖోర్షీద్ భావనగరి





జైకో పబ్లిషింగ్ హౌస్

అహమ్మదాబాద్ బెంగుళూర్ చెన్నై

ఢిల్లీ హైదరాబాద్ కోల్‌కత్తా ముంబై

మాకు అన్నీ సమకూర్చిన

దేవుడికి

&

నా ప్రియమైన కుమారులు

విస్పి, రతూలకి.

విషయసూచిక



ముందుమాట



నా జీవితమంతా ప్రశ్నలు వేస్తూనే ఉన్నాను. నాకున్న జ్ఞాన తపన వల్ల, అన్ని విషయాలను చాలామంది కన్న భిన్నంగా చూసేవాణ్ణి. చిన్నప్పటినుంచి నక్షత్రాలను చూస్తూ, ఈ విశ్వంలో మనం ఒంటరులం కాము అనీ, ఆత్మలోకంలో నాకు స్నేహితులున్నారనీ - నన్ను సదా ప్రేమిస్తూ, సంరక్షించే సంరక్షక దేవదూతలున్నారనీ భావించేవాణ్ణి.

అన్ని మతాలను గౌరవించాలని నా కుటుంబం నాకు నేర్పింది. నా మనసులో ఉన్న కుతూహలం నన్ను ప్రయాణానికి పురికొల్పింది. కాలక్రమంలో నేను షిరిడీ సాయిబాబాకు (షిరిడీ సాయిబాబా భారతీయ గురువు. 1918లో మృతి చెందారు. సాయి అనేది 'పవిత్రుడు'/'యోగి' అని అర్థమిచ్చే పర్షియను పదం. 'బాబా' అంటే భారతీయ భాషలలో 'తండ్రి' అని అర్థం. అందుకని ఆయనను పవిత్రమైన తండ్రి అనే, పవిత్రమైన యోగి అనే అర్థంలో సాయిబాబా అంటారు.) అకుంఠిత భక్తుణ్ణి అయ్యాను. భూలోకంలో ఆధ్యాత్మిక గురువు కోసం తపన పడుతున్నానని ఆయనకు చెప్పాను. అప్పుడు నాకు ఒక స్త్రీ పరిచయమయ్యారు. ఆమె పేరు ఖోర్షీద్ భావనగరి. నేనావిడను కలిసిన మొదటి రోజున, చనిపోయిన ఆమె కుమారులు విస్పీ, రతూలతో మాట్లాడాను. వాళ్ళు నన్ను "చిన్నతమ్ముడు" అనగానే ఏదో రక్త సంబంధం ఉన్నట్లుగా సంతోషించాను.

ఖోర్షీద్ భావనగరిని నేను ఖోర్షీద్ ఆంటీ అని పిలిచేవాణ్ణి. ఆవిడ ద్వారా మరణానంతర జీవితం గురించి నేను తెలుసుకున్న జ్ఞానం కొత్తగా కనుగొనడం కన్న గుర్తించడం. ఇది నా ఆత్మకు ముందే తెలుసు. నాకు మరణానంతరం జీవితం అంటే ఈ జీవితానికి కొనసాగింపు.

మనందరం బండిచక్రంలో ఉండే ఆకుల్లా ఒక కేంద్రాన్ని చేరుతుంటాం. ఆ కేంద్రం **దేవుడు**. అలా మనందరికీ సంబంధం ఉంది.

ఆమె దగ్గర 25 ఏళ్ళ పాటు నేర్చుకున్నాను. ఖోర్షీద్ ఆంటీ నాకు ఆధ్యాత్మిక గురువు కన్న ఎంతో ఎక్కువ. నాకు మంచి స్నేహితురాలు, నేను నమ్మగలిగే వ్యక్తి. మనసులో కల్మషం లేని, తీర్పులు చెప్పని, జాగ్రతంగా ఉండే, హాస్యకుశలత కలిగిన, దీప్తి కలిగిన స్పష్టత కలిగించే శక్తి ఉన్న వ్యక్తి.

అనుభవాల విలువను తెలుసుకొనడానికి ఆమె సాయం చేశారు. అనుకూలమైన అనుభవాలు నాకు లభించిన ఆశీస్సులని, వాటికి నేను కృతజ్ఞుడిగా ఉండాలని, ప్రతికూల అనుభవాలు చూసి భయపడకూడదని, అవే నాకు నిజమైన బోధకులని ఆమె నాకు అవగతమయ్యేలా చేశారు. ఆమె నోటి నుంచి వచ్చే 'దైవం చల్లగా చూస్తాడు', 'అంతా మంచే జరుగుతుంది' అనే మాటలు వింటే చాలు నా భయాలన్నీ పోతాయి.

నేనామెతో దాపరికం లేకుండా అన్ని విషయాలు చర్చించే వాణ్ణి - దేవుడు, నా బంధుత్వాలు, నా పని, మతానికి, ఆధ్యాత్మికతకు మధ్య ఉన్న తేడా, కర్మ, గత జన్మలు, పునర్జన్మ ఉద్దేశ్యం, ప్రవక్తలు, దేవదూతలు, సైకిక్ దృగ్విషయాలు, ఊర్ధ్వలోక జీవులు, మనుషులెందుకు ఆత్మవినాశనం చేసుకుంటారు, మరణం, వృద్ధాప్యం, ఒంటరితనం, భయం, క్రిస్టల్స్‌కున్న స్వస్థత చేకూర్చే గుణం, వర్తమానం ప్రాముఖ్యం, సంకల్పం, ఆలోచన, ప్రార్థనలకున్న శక్తి, దేవుడు దయామయుడా, శిక్షిస్తాడా? వీటన్నిటి అర్థం నేనెలా గ్రహించి మనిషిగా రూపొందాలి - దీని అంతటిలో నా స్థానం ఎక్కడో, ఏం చెయ్యాలో ఎలా తెలుసుకోవాలి అని అన్ని విషయాలు మాట్లాడేవాణ్ణి.

నా ప్రశ్నలన్నింటికీ ఖోర్షీద్ ఆంటీ సమాధానం చెప్పేవారు. అయితే ఎప్పుడూ చివరికి మాత్రం భూలోకంలో మంచిమనిషిగా ఉండడం, దైవనిర్దేశిత సన్మార్గాన్ని ఎల్లప్పుడూ అనుసరించడం ముఖ్యమని చెప్పేవారు. నా పనులకు నాదే బాధ్యత అని, వాటివల్ల ఏ ఫలితం వచ్చినా దేవుడిని కాని, మరెవరిని కాని నిందించకూడదని నేను గుర్తించేలా చేశారామె. నిస్వార్థమైన సేవ, మనసును నియంత్రించుకొనడం, దైవజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, ప్రియతములను కోల్పోయిన వారిని ఓదార్చడం ఆమె నాకు నేర్పారు. నాకు మార్గదర్శకత్వం బాగా అవసరమైనపుడు ఖోర్షీద్ ఆంటీ, ఆమె భర్త రుమి అంకుల్ నన్నెంతో ప్రేమగా ఆదరించారు. అంకుల్ నాకు అత్యంత ఆత్మీయులు. వారిద్దరి వివేకపూరిత, సంతోషభరిత సాన్నిహిత్యంలో నా ఆత్మకు పోషణ శిక్షణ లభించి స్వేచ్ఛ సంక్రమించింది.

ఇప్పుడు వారు జీవించిలేకపోయినా, ఆత్మలోకం నుంచి మరో ఇద్దరు దేవదూతలు నన్ను సంరక్షిస్తున్నారని నేను భావిస్తున్నాను. వారు లేరని నేను విషాదంలో మునగను. ఎందుకంటే వారు ఎప్పుడూ నాతోనే ఉన్నారని నాకు తెలుసు. అంతేకాకుండా అందరి గురువులకన్న విలువైన మార్గదర్శిని - ఆధ్యాత్మిక జ్ఞానాన్ని వారు నాకు ఇచ్చారు. దయచేసి ఈ పుస్తకాన్ని పక్షపాతం లేని మనసుతో చదవండి. సత్యం నిజంగా ఎంత సరళమైందో, శక్తిమంతమైందో తెలుసుకోండి. ఈ జ్ఞానాన్ని చిన్నపిల్లవాడు కూడా అర్థం చేసుకోగలడని, సత్యం ఎప్పుడూ సరళమైందని విస్పి ఎప్పుడూ చెప్పేవాడు.

అదృష్టవశాత్తు, ఖోర్షీద్ ఆంటీ, రుమి అంకుల్ నా ఒక్కడి జీవితాన్నే మార్చలేదు. 25 ఏళ్ళుగా వేలాదిమంది వారి వద్దకు వచ్చి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని, ఓదార్పును, స్వస్థతను పొందారు.

ఈ పుస్తకం మీకూ అలాగే ఉపయోగపడుతుందని ఆశిస్తాను.

దైవం చల్లగా చూడాలి.

షయామక్ దావర్.

పీఠిక



ఖోర్షీద్, రుమి భావనగరి భారతదేశంలో బొంబాయిలోని బైకుల్లాలో నివసించేవారు. వారికి ఇద్దరు కొడుకులు. విస్పి, ఆగస్టు 9వ తేదీ 1950లో, రతూ డిసెంబరు 13వ తేదీ 1951లో జన్మించారు. ఈ పిల్లలు మోటారు వాహనాలపై ఆసక్తి పెంచుకుంటూ పెరిగారు. తర్వాత విస్పి, రతూ కలిసి మోటారు సర్వీసులు, రిపేర్ల గారేజ్‌ని పెట్టారు. చాలా మోటారు ర్యాలీల్లో కూడా పాల్గొన్నారు.

దురదృష్టకరమైన 1980 సంవత్సరంలో 1,632 మైళ్ళ క్రాస్ కంట్రీ మోటార్ ర్యాలీలో విస్పి, రతూ పాల్గొనవలసి ఉంది. ర్యాలీ ఫిబ్రవరి 23న ఆరంభమవుతుంది. కారులో ట్రయల్‌రన్ కోసం బొంబాయి నుంచి ఖోపోలి వరకు వెళ్ళాలని విస్పి, రతూ అనుకున్నారు. పిల్లలు ప్రయాణం ఆరంభించేముందు ఏం జరిగిందో ఖుర్షీద్ చెప్పారు. "రతూ నన్ను గట్టిగా కౌగలించుకొని వెళ్ళొస్తానని చెప్పి బయటకు వెళ్ళాడు. కొన్ని మెట్లు దిగాడో లేదో (మేము 2వ అంతస్తులో ఉండేవాళ్ళం) మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చాడు. మళ్ళీ నన్ను గట్టిగా కౌగలించుకొని, ముద్దు పెట్టుకున్నాడు. ఇలా ఎందుకు చేస్తున్నాడో నాకు అర్థం కాలేదు. రతూ ఎప్పుడూ ఇలా చెయ్యడు. ఒక అంతస్తు కిందికి దిగి మళ్ళీ వచ్చి నన్ను గట్టిగా పట్టుకొని కౌగలించుకొన్నాడు. అప్పుడే విస్పి వచ్చి వెళ్ళొస్తానని చెప్పాడు. జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యమని చెప్పాను. 'అమ్మా, మా కోసం ఎదురు చూడకు. మేము ఖోపోలి వరకు వెళ్ళి తిరిగొస్తాం, లేకపోతే రాత్రికి అక్కడే ఉండి రేపు ప్రొద్దున్నే వస్తాం' అన్నారు.

వాళ్ళు కారులో కూర్చోగానే వాళ్ళ నాన్న కనిపించారు. రుమి వాళ్ళను జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యండి అని చెప్పారు. "ఎందుకు నాన్నా అంత భయపడుతున్నారు? మేము (గంటకు) ముప్ఫయి మైళ్ళకన్నా వెళ్ళలేం. ఇప్పుడే ఇంజన్‌ను ఓవర్‌హాల్ చేశాం. జాగ్రత్తగానే ఉంటాం".అని రతూ సమాధానం చెప్పాడు. అలా రాత్రి 8.30 గంటలకు విస్పి, రతూ ఉత్సాహంగా ఇద్దరు మెకానిక్‌లను, ఒక స్నేహితుణ్ణి తీసుకొని బయలుదేరారు. మర్నాడు ప్రొద్దున 8గంటలకు కూడా వారు రాకపోయేసరికి ఖోర్షీద్, రుమి ఆందోళన చెందడం ఆరంభించారు. 8.30కు గారేజ్ నుంచి ఒక మెకానిక్ వచ్చి, ఖోపోలి సమీపంలో ప్రమాదం జరిగిందని, విస్పి, రతూ ఇద్దరూ ఆసుపత్రిలో ఉన్నారని చెప్పాడు.

రుమి కొందరు స్నేహితులను తీసుకొని, ఖాపోలిలో ప్రమాదం జరిగిన చోటికి వెళ్ళారు. అక్కడ విస్పి, రతూల కారు చెట్టుకు గుద్దుకొని ఉండడం చూశారు. అక్కడెవరూ లేరు. కాని అబ్బాయిలను కొంచెం దూరంలోని ఆసుపత్రికి తీసుకుని వెళ్ళారని వారికి తెలిసింది. రుమి ఆసుపత్రికి వెళ్ళగానే, ప్రమాదం జరిగినప్పుడే విస్పి, రతూ చనిపోయారని, కారులో ఉన్న మిగిలిన వారు చిన్న గాయాలతో బ్రతికి బయటపడ్డారని తెలిసింది.

ప్రమాదం ఎలా జరిగిందని రుమి మెకానిక్‌లను అడిగారు.

"ఒక్క నిముషం పాటు మేము నిద్రపోయాం. తర్వాతి నిముషంలో ప్రమాదం జరిగింది" అన్నారు. అంతా ఏదో మాయలా అనిపించింది రుమికి. అదృష్టవశాత్తు ఆసుపత్రిలో వ్యవహారాలు చూడడానికి స్నేహితులు, ఇరుగు పొరుగు ఉన్నారు ఆయనతో. భారమైన హృదయంతో ఇంటికి వచ్చాడు కాని భార్యకు ఈ విషాదవార్త ఎలా చెప్పాలో తెలియలేదు

రుమి అపార్టుమెంటు మెట్లు ఎక్కుతుండగానే, లాండింగ్‌లో నిలబడి ఉన్న ఖుర్షిద్ "ఏమిటింతసేపు పట్టింది? విస్పి, రతూ ఏరి? తొందరగా నడవరేంటి?" అని అడిగారు. వార్త వినగానే ఖోర్షిద్ భోరుమన్నారు. జీవితం శూన్యం అనిపించిందామెకి. దేవుడిపైన ఖోర్షిద్ విశ్వాసం చెదిరింది. "నేను మతాన్ని నమ్మేదాన్ని. మొదటిసారి దేవుడున్నాడా అసలు అనిపించింది నాకు. ఒకవేళ ఆయనే ఉంటే నాకెందుకింత ఘోరం చేశాడు. ఎవరికీ వెంట్రుకవాసి అంత హాని చెయ్యని నాకు బిడ్డల్ని తీసుకుపోయి పుత్రశోకం ఎలా కలిగించాడు? దేవుడిని, మతాన్ని, జీవితాన్ని వదిలెయ్యడానికి సిద్ధపడ్డాను" అని చెప్పారు.

తర్వాత ఒక అద్భుతమైన విషయం జరిగింది. అంతిమ సంస్కారాలు పూర్తయిన 29వ రోజున ఖోర్షిద్‌కు, రుమికి పొరుగున ఉండే శ్రీమతి దస్తూర్ ఆశ్చర్యం గొలిపే కథ ఒకటి చెప్పారు. శ్రీమతి దస్తూర్ మరదలు ఒక సంగీతసభకు వెళ్ళింది. అక్కడ విశ్రాంతి సమయంలో ప్రమాదంలో చనిపోయిన ఇద్దరు అబ్బాయిలు తమ తల్లిదండ్రులకు ఒక సందేశం పంపాలని అనుకుంటున్నారని ఒకామె అనడం ఆమె విన్నది. దానితో శ్రీమతి దస్తూర్ గారి మరదలు ఆ స్త్రీ ఫోను నెంబరు తీసుకుని వచ్చింది.

మర్నాడు ఖోర్షిద్, రుమి ఆవిడకు ఫోను చేశారు. ఆమె వారిని తన ఇంటికి రమ్మంది. ఆమె తన సోదరుణ్ణి కోల్పోయింది. ఆత్మలతో జరిపే ఆధ్యాత్మిక సమావేశంలో అతడితో శ్రీమతి కపాడియా అనే శక్తిమంతమైన వాహకం (మీడియం) ద్వారా మాట్లాడగలిగింది. అలా ఒక సమావేశం జరుగుతున్నప్పుడు ఇద్దరు యువకుల రోదన వినిపించింది. తాము ఒక ప్రమాదంలో చనిపోయామని, తమ తల్లిదండ్రులు బాగా దుఃఖిస్తున్నారని చెప్పారు. తాము ఆత్మలోకంలో సంతోషంగా ఉన్నామని తమ తల్లిదండ్రులకు

తెలియజేయాలని అనుకుంటున్నామని, తాము వారిని చూడగలుగుతున్నాం కనుక బాధపడవద్దని చెప్పాలనుకుంటున్నామని చెప్పారు.

1980, మార్చి 22న నేపియన్‌సీ రోడ్‌లో ఉన్న శ్రీమతి కపాడియా నివాసంలో ఖోర్షీద్, రుమి ఆత్మలతో జరిపే ఆధ్యాత్మిక సమావేశానికి హాజరయ్యారు. వాహకమైన శ్రీమతి కపాడియా మధ్యలో కూర్చున్నారు. మిగిలిన వారందరూ ఆమె చుట్టూ కూర్చున్నారు. ఆమె ఒకరి తర్వాత ఒకరి దగ్గరికి వచ్చి చనిపోయిన వారి ప్రియతములతో మాట్లాడడానికి సాయం చేసింది. ఆమె భావనగరుల దగ్గరికి రాగానే "హలో మమ్మీ ఫాట్సో" అన్నారు మొదటగా. విస్పి ఎప్పుడూ తన తల్లిని ఇలా పిలిచేవాడు. తమ గురించి ఏమీ తెలియని కొత్త మనిషి ఇంత సన్నిహిత విషయాన్ని తెలుసుకున్నారంటే, మాట్లాడేది తమ పిల్లలే అని ఖోర్షీద్, రుమి గుర్తించారు. దీనివల్ల వారికి దేవుడిపై విశ్వాసం పునరుద్ధరింపబడింది.

తల్లిదండ్రులతో ఒంటరిగా మాట్లాడాలని విస్పి, రతూ చెప్పారు. అందుకని శ్రీమతి కపాడియా వారికి వృద్ధురాలైన శ్రీమతి రుషి అనే వాహకం పేరు చెప్పారు. కొన్నాళ్ళ తర్వాత భావనగరిలు శ్రీమతి రుషి ద్వారా తమ పిల్లలతో మాట్లాడారు. "అమ్మా, నాన్నా, విస్పి, రతూలం మాట్లాడుతున్నాం. మేము చనిపోయాం. చనిపోయిన కొన్ని నిముషాల్లోనే ఆత్మలోకం చేరాం. ఇది దైవేచ్ఛ. మనలో ప్రతి ఒక్కరికి ఏది మంచిదో దేవుడికి తెలుసు. దేవుడు మంచివాడు. మీరు మేము లేమని బాధపడవద్దు. మేము చాలా సంతోషంగా ఉన్నాం. మేము ఎప్పుడూ మిమ్మల్ని చూస్తూనే ఉన్నాం. సంరక్షిస్తున్నాం. మీరు పూర్తిగా బాధని మర్చిపోయి సంతోషంగా ఉంటే తప్ప మేము మీతో మాట్లాడలేం. ఏకాగ్రతా శక్తులను మీరు పెంపొందించుకోవాలి" అన్నారు విస్పి, రతూ. ఆమె ఇంకా భూలోకంలో ఉండాలని, తన ఆధ్యాత్మిక ధ్యేయాన్ని పూర్తి చేయాలని ఆమెకు చెప్పారు. ప్రజలకు సేవ చేయడము, ఆధ్యాత్మిక జాగృతిని పెంచడము ఆ ధ్యేయమని చెప్పారు.

తర్వాత కొన్ని నెలల పాటు తమ కుమారుల సాయంతో ఖోర్షీద్, రుమి సంపూర్ణ ఏకాగ్రతాశక్తులను, ప్రశాంతంగా ఉండడాన్ని నేర్చుకున్నారు. దీనితో తల్లిదండ్రులకు కుమారులతో 'అప్రయత్న లేఖనం' ద్వారా నేరుగా మాట్లాడడం సాధ్యమైంది. ఆమె ఒక కలాన్ని తేలికగా పుస్తకం మీద పట్టుకుంటారు. ఏకాగ్రంగా ఉంటారు. క్రమంగా చనిపోయిన ఆమె కుమారుల ఆత్మలు ఆమె చేతి ద్వారా కలాన్ని నిదానంగా, అస్తవ్యస్తంగా పేజీ మీద కదిలిస్తాయి. మొదట్లో గీతలే ఉండేవి. అభ్యాసం చేస్తున్న కొద్దీ పదాలు రాయడం మొదలైంది. ఆమె పైకి వినిపించేలా ప్రశ్నలు అడిగేవారు. పుస్తకం మీద సమాధానాలు రాసేవారు.

అబ్బాయిలు చనిపోయిన వెంటనే కుటుంబంలో ఒక సమస్య వచ్చింది. ఖోర్షీద్, రుమి

కోర్టుకు వెళ్ళాల్సి వచ్చింది. కేసు వెయ్యవద్దని కొందరు లాయర్లు చెప్పిన సలహాను వారు వినలేదు. టెలిపతి ద్వారా తమ పిల్లలు చెప్పిన సలహాతో ఒక లాయరును పెట్టుకున్నారు. వారికి ఆశ్చర్యం కలిగేలా, అన్ని అవరోధాలు పోయి కేసులో వీరు గెలిచారు. భావనగరిలకు మార్గదర్శకత్వం, రక్షణ లభిస్తున్నాయనడానికి మరొక నిదర్శనం ఇది.

కొంతకాలం తర్వాత, తాము ఆత్మలోక నియమాలను చెబుతామని ఇదే ప్రక్రియలో అప్రయత్న లేఖనం, టెలిపతిల ద్వారా వ్యక్తం చేస్తామని, దీనికోసం ఉన్నతాత్మల నుంచి అనుమతి పొందామని విస్పి, రతూ తల్లిదండ్రులకు చెప్పారు. అసలైన దైవనియమాలను, ఆత్మలోక నియమాలను తెలుసుకొనడం వల్ల మనుషులకు తగినంతగా ప్రయోజనం ఉంటుందని, వాటిని ఆచరిస్తే ఆధ్యాత్మికంగా పురోగమిస్తారని వారు భావించారు. ఈ పుస్తకాన్ని చెప్పాలనే కోరిక, ప్రచురించాలనే కోరిక, పంపిణీ చేయాలనే కోరిక విస్పి, రతూలది. అయితే తమ బోధనలను కాని, నమ్మకాలను కాని బలవంతంగా ఎవరిపైన రుద్దకూడదని విస్పి, రతూ స్పష్టంగా చెప్పారు.

ఖోర్షెద్ తన కొడుకులతో మాట్లాడుతున్నారని తెలిసి స్నేహితులు, కొందరు కొత్తవారు వీరి ఇంటికి వచ్చేవారు. ఇతరుల బాధలను నిస్వార్థమైన సేవతో తగ్గిస్తే, తమ బాధ కూడా బాగా తగ్గుతున్నదని ఖోర్షెద్, రుమి నిదానంగా గుర్తించారు.

ఈ రకంగా తమ కుమారులు చనిపోయిన తర్వాత వారికి ఓదార్పు లభించింది. యువకులకు, వృద్ధులకు కూడా వారు మార్గదర్శకత్వాన్ని, ఓదార్పును కలిగించారు. వారి కథను చెబుతూ, ఇటువంటి నష్టాన్ని అనుభవించినవారు దుఃఖంలో మునగకుండా నివారించారు. వ్యసనాలకు బానిసలైన వారి నుంచి, శారీరక హింసకు గురైన వారి వరకు అందరికి వారు సలహాలనిచ్చారు. ఆధ్యాత్మికంగా ఎదగాలనుకున్న వారి ఆత్మలకు పరిపోషక జ్ఞానాన్ని అందిస్తూ వచ్చారు. జనం వ్యక్తిగతమైన, ఆధ్యాత్మికమైన ప్రశ్నలు వేసేవారు. ఈప్రశ్నలలో చాలావాటిని ఈ పుస్తకంలోని రెండవ భాగంలో ఇవ్వడం జరిగింది.

ఆత్మలోకంలో మతం లేదు కనుక ప్రత్యేకంగా ఒక మతానికి సంబంధించి అడిగిన ప్రశ్నలను మాత్రం దీనిలో ఇవ్వలేదు.

రుమి భావనగరి 1996లోను, ఖోర్షెద్ భావనగరి 2007లోను మరణించారు. ఆత్మలోకంలో తమ కుమారులతో కలిసి సంతోషంగా ఉన్నారు.

గమనిక



ఖోర్షీద్ ఆంటీ విస్పితో రోజుకు రెండుసార్లు మాట్లాడేవారు. ఒకోసారి మూడు నాలుగుసార్లు కూడా మాట్లాడేవారు. అయితే సూర్యోదయానికి, సూర్యాస్తమయానికి మధ్యకాలంలోనే స్థిరమైన ఎజెండా, ప్రణాళిక లేకుండా మాట్లాడేవారు. వివిధ విషయాలకు సంబంధించి సందేశాలు అందుకొనేవారు. వాటిక్రమం, సంభాషించేతీరు, భాషను యథాతథంగా అందుకున్న విధంగానే ఉంచారు. ఆమె మాతృభాష గుజరాతీ అయినా ఇక్కడున్న సందేశాలన్నీ ఆమె ఆంగ్లంలో అందుకున్నవి.

భాగం - I



ఖోర్షీద్ భావనగరి రాతప్రతుల నుంచి ఆత్మలతో సంభాషణలు



14-04-1981

దేవుడి నిజమైన న్యాయాలు

ప్రియమైన అమ్మా, నాన్నా, ఆత్మలోకం నుంచి విన్పీ, రతూ మాట్లాడుతున్నాం. మీ ద్వారా భూలోకంలోని ప్రజలు సక్రమ మార్గం, అంటే సర్వశక్తిమంతుడైన భగవంతుడి నిజమార్గంలో ఎలా ప్రయాణించాలో తెలియజెప్పేందుకు మాట్లాడుతున్నాం. అమ్మా, మా కోసం ఈ పుస్తకాన్ని రాయండి. దీని ద్వారా మీ లోకంలోని వారికి ఆత్మలోకం గురించి, భూలోకంలో ఉన్నవారు తప్పుగా అర్థం చేసుకున్న దేవుడి సూత్రాలు, నియమాలు గురించి, ఆత్మలోకంలో ఉండే ఆవరణలు[1] గురించి తెలుసుకొనే అవకాశం ఇవ్వండి.

దేవుడి వాస్తవ న్యాయాన్ని గురించి పురోహితులు, గొప్ప తాత్త్వికులు చెప్పిన విషయాలన్నిటినీ నమ్మడం చాలా తప్పు. వారికి అన్నీ తెలియవు - వారికి గాని, మీకు గాని భూలోకాన్ని వదలి ఆత్మలోకంలోకి వచ్చినపుడే అన్నీ తెలుస్తాయి. నిజమైన న్యాయం ఏమిటో చెప్పడానికి కొన్ని పేజీలో, అధ్యాయాలో, పుస్తకాలో సరిపోవు. దేవుడు నిజంగా మన నుంచి ఏం కోరుకుంటున్నాడో తెలుసుకొనడానికి కొన్ని యుగాలు పడతాయి. అందువల్ల దీనిని మీకు చెప్పాలని మేం చేసే ప్రయత్నాలు అంత సంతృప్తికరంగా అనిపించకపోవచ్చు. అయినాగాని, మాకు ప్రియమైన మీరు, భూలోకంలో ఉండే అందరూ సత్యమేమిటో తెలుసుకోవాలని, ఏవో పనికిమాలిన నమ్మకాలతో ఆధ్యాత్మిక గురువో, తాత్త్వికుడో చెప్పాడని ఎన్నో తప్పులు చేస్తున్నారని తెలుసుకోవాలని మేము కోరుకుంటున్నాం. కొన్నిసార్లు వారు చెప్పేవి దేవుడి వాస్తవ నియమ నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉంటాయి.

1. ఆత్మ లోకంలో ఏడు ఆవరణలు ఉంటాయి. ఒకటో ఆవరణ అన్నిటికన్న కింద, ఏడో ఆవరణ అన్నిటికన్న పైన ఉంటుంది.

ఇప్పుడు భూమి మీద దుష్టాత్మలు, చెడు ఆత్మలు వర్ధిల్లుతూండగా, సదాత్మలు బాధింప బడుతూ ఉన్నాయి. చెడుఆత్మలు బాగా వర్ధిల్లుతూ, సదాత్మలు ఎందుకు బాధింప బడుతున్నాయో ఈ పుస్తకం మీకు వివరిస్తుంది. దేవుడు తమకు అన్యాయం చేశాడని మంచిఆత్మలు మన ప్రియమైన దేవుణ్ణి నిందించాలని చూస్తాయి. ఈ పుస్తకాన్ని చదవండి. ఇలా ఎందుకు జరుగుతుందో మీకు అర్థమవుతుంది.

15-04-1981

ఆత్మవిశ్లేషణ ద్వారా బాగుపడడం

చెడుఆత్మలు కోరుకుంటే సర్వశక్తిమంతుడైన భగవంతుడు వాటికి సాయం చేస్తాడు. తమని మార్చమని అంతఃప్రేరణతో దేవుడిని చెడుఆత్మలు ప్రార్థిస్తే, ఆయన తప్పనిసరిగా వాటికి సాయం చేస్తాడు. మంచిగాగాని, చెడుగాగాని ఉండడం అనేది ప్రతి ఒక్క ఆత్మ కోరుకునేదాన్ని బట్టి మాత్రమే ఉంటుంది. చెడుఆత్మలు సదాత్మలుగా మారాలంటే క్షణంలో మారవచ్చు. మనం భూమ్మీద తరచుగా "తప్పు ఒప్పుకోండి, దేవుడు తప్పకుండా క్షమిస్తాడు" అనే మాట వింటుంటాం. ఇది నిజమే. కాని మత గురువు దగ్గర కాదు తప్పు ఒప్పుకోవాల్సింది. మీ పాపాలను మీకు మీరే ఒప్పుకోవాలి. మతగురువు దగ్గర కాదు. మిమ్మల్ని క్షమించే అధికారం పూజారికో, మతగురువుకో లేదు. మిమ్మల్ని క్షమించడానికి మతగురువెవరు? అతను మీకంటె ఎక్కువ పాపాలు చేసి ఉండవచ్చు. అందుకని అతని దగ్గర మీ పాపాలు చెప్పకండి. మీకు మీరే చెప్పుకోండి. మీకు మీరే నేను చెడ్డవాడినని చెప్పుకోండి, దేవుడిని మీకు సాయం చేయమని కోరండి. ఆయన చేస్తాడు. అయిష్టంగా కోరితే ఇది కుదరకపోవచ్చు. మీరు నిజాయితీగా, మారాలని భావిస్తూ ఆయనను కోరితే, మీరు మంచివారుగా మారడానికి ఎంతోకాలం పట్టదు.

ఉదాహరణకి ఒక వ్యక్తి తాను మంచివాడినని భావిస్తుంటాడు. కాని వాస్తవంలో అతడు మంచివాడు కాడు. అటువంటి ఆత్మల మాటేమిటి? చాలామంది తాము దైవసూత్రాల ప్రకారమే పనిచేస్తున్నామని భావిస్తారు. కాని తామెంత పాపాత్ములో వారికి కొంచెం కూడా తెలియదు. వాళ్ళిలా అంటారు, "నేను దేవుడిని నమ్ముతాను. పవిత్ర గ్రంథాలు చదువుతాను. ప్రతిరోజూగాని, ప్రతివారం గాని నేను గుడికో, చర్చికో వెళతాను. ఎంతోదానం చేస్తాను. బీదసాదలకు ఆహారం, బట్టలు, ఉద్యోగాలు ఇస్తాను. ఎవరైనా ఇంతకన్న ఏం కోరుకుంటారు? నేను తప్పకుండా స్వర్గానికి వెళతాను". ఇలా అంటున్నందుకు క్షమించండి. స్వర్గద్వారాలు తమకోసం బార్లా తెరిచి ఉంటాయని వాళ్ళు అనుకుంటున్నారు. కాని వారు స్వర్గపునిచ్చెన చివరి మెట్టును కూడా ఎన్నడూ చేరలేరు. భూమ్మీద ఉండే వారికి దీనిని అర్థం చేసుకొనడం కూడా కష్టమే. కాని స్వర్గపునిచ్చెన అడుగు మెట్టుకు కూడా వారు చేరలేరనేది మాత్రం నిజం. మనసును

ప్రశాంతంగా ఉంచుకొని చెప్పేది వినండి. వారు రోజూ గుడికో, చర్చికో ఎందుకెళుతున్నారు? కొందరు తామెంతో పవిత్రంగా తరచుగా దేవుని గురించే ఆలోచిస్తామని **ఇతరులకు ప్రదర్శించి చూపడానికి** గుడికి వెళతారు. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. సర్వశక్తిమంతుడైన భగవంతుని ఎప్పుడైనా మోసం చేయగలమా?" **మీ తోటివారిని మోసం చెయ్యవచ్చు కాని సర్వశక్తిమంతుడైన భగవంతుని మీరు ఎన్నడూ మోసం చెయ్యలేరు.** దైవభీతి ఉన్న వ్యక్తినని మీ గురించి మీరు చెప్పుకుంటారు కదా? ఒకవేళ మీరు నిజంగా దైవభీతిగల వ్యక్తి అయితే దేవుడిని మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తారా?

కొంతమంది ప్రతిరోజూ, ప్రతివారం గుడికి వెళ్ళి మరింత ధనాన్ని, మరింత సంతోషాన్ని, మరింత విజయాన్ని కోరుకుంటారు. ఇదేంటి? మీ స్వార్థ ప్రయోజనం కోసం మీరు వెళుతున్నారు – దేవుడి కోసం కాదు, మీ కోసం. స్వార్థ ఉద్దేశ్యం మిమ్మల్ని స్వర్గానికి తీసుకెళుతుందా?

మీరు బాగా దానం చేస్తారనుకోండి. ముందుగా ఎందుకు చేస్తున్నారో మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. దానం చెయ్యడం వెనుక మీ ఉద్దేశ్యమేమిటి? **మీ ఉద్దేశ్యం చాలా ముఖ్యం.** ఒకవేళ మీ ఉద్దేశ్యం పూర్తిగా నిస్వార్థమైతే – ఉదాహరణకు మీ ఉద్దేశ్యం ఎవరికో సాయం చేయడానికి అయితే, అది అనుకోకుండా చేస్తే – అప్పుడు దేవుడు సంతోషిస్తాడు. తనముందు మంచివాడినని చూపుకోవడానికి గాకుండా, మీరు దేనికోసం ఇచ్చారో ఆయన గ్రహిస్తాడు. మీ ఉద్దేశ్యం "నేను ఈ పేదవ్యక్తికి ఇది ఇస్తే, దేవుడు నన్ను స్వర్గానికి పంపుతాడు" అని అయితే మీరు దేవుడిని మెప్పించలేరు. ఆయనకు మీ ఉద్దేశ్యం తెలుసు. ఆయన మిమ్మల్ని స్వర్గానికి పంపడు. **మీరు పరస్పరం మోసగించుకోవచ్చు, మిమ్మల్ని మీరు మోసగించుకోవచ్చు. కాని సర్వశక్తిమంతుడైన భగవంతుని మోసం చేయలేరు.** అందువల్ల మీరు చేస్తున్న దానధర్మాల వెనుక ఉన్న ఉద్దేశ్యం చాలా చాలా ముఖ్యం. మీరు చేసే పనిని నిజాయితీగా చెయ్యండి. మీరు నిజాయితీగా ఉంటే పిసరంత దానమైనా సరే మిమ్మల్ని స్వర్గానికి చేరుస్తుంది. స్వార్థంతో సర్వశక్తిమంతుడైన భగవంతుడిని మోసం చేయాలని చూస్తే ఎంత ఎక్కువగా దానం చేసినా నరకానికే పోతారు. అందువల్ల స్వర్గానికో, నరకానికో పోవడం మీ చేతుల్లోనే ఉంది. అవునా? కాదా?

16-04-1981

న్యాయం

మనం చేసే పనులు రైటా, తప్పా అని దేవుడికి రుజువులు అవసరం లేనందుకు మనం ఆయనకు కృతజ్ఞులం. ఆయన న్యాయం సంపూర్ణం. మీ ప్రపంచంలో ఎంతో ఉన్నతమైన న్యాయమూర్తులు కూడా అన్నివేళలా సరైన న్యాయం

చేయలేకపోవచ్చు. కాని దైవం చేసే న్యాయం ఎప్పుడూ సరైనదే, ఎందుచేతనంటే ఆయనకు మీ తప్పొప్పులన్నీ తెలుసు. మీ తోటివారి నుంచి ఏదైనా దాచాలనుకుంటే దాయగలరేమో, కాని సర్వశక్తిమంతుడైన భగవంతునికి తెలియకుండా ఏమీ దాచలేరు. ఆయన న్యాయం నిర్దుష్టం. దీనిని గనుక మీరు నమ్మితే ఎప్పుడూ తప్పు చెయ్యరు. ఇది పూర్తిగా సత్యమని, మీరు ఏం చేసినా, చెప్పినా అది రికార్డయి ఉంటుందని మీరు నమ్మండి. అందువల్ల నీతిబద్ధంగా, నిజాయితీగా, దయాళువులుగా జీవించండి.

మిమ్మల్ని మీరు మెరుగుపరచుకొనడానికి ప్రయత్నించుకోండి. భూమ్మీద ఎవరూ పరిపూర్ణ మానవులు కారు గనుక నేను మాత్రం పరిపూర్ణంగా ఎలా ఉండగలనని అనుకోకండి. ప్రియమైన పాఠకులారా, ఆత్మలోకపు ఉన్నత ఆవరణలో ఉన్న మేము కూడా పరిపూర్ణులం కాము, మీరెలా కాగలరు?

చెడును వదిలిపెట్టి, మంచిని ప్రోది చేసుకుంటూ పరిపూర్ణులం కావాలని మేం ఎంతో కష్టపడుతున్నాం. ప్రతి ఆత్మకూ స్వయంవికాసం లక్ష్యంగా ఉండాలి. - అప్పుడు పరిపూర్ణజీవిగా సర్వశక్తిమంతుడైన భగవంతుని చేరగలరు. ఆయనను చేరడానికి ఎన్నో యుగాలు పడతాయి. అందువల్ల మీ జీవితకాలంలో మంచిని చెయ్యడానికి కష్టపడండి. మంచినే మాట్లాడండి. తోటివారికి హాని చేయకండి. నిర్దయతో వ్యవహరించకండి. చెప్పేది ఒకటి, చేసేది మరొకటి (హిపోక్రేట్) అనే విధంగా ప్రవర్తించకండి. కోరుకుంటే మీరు దీనిని సాధించగలరు. కాని ఆ కోరిక మీకు ఉండాలి.

ఇప్పుడు, మీరు భూమి మీదే ఉన్నారు గనుక మిమ్మల్ని మీరు మెరుగుపరచు కొనడానికి ఇంకా అవకాశం ఉంది. ఒక్కసారి ఆత్మలోకంలో అడుగుపెట్టారంటే, మీ ప్రగతి నిదానంగా సాగుతుంది. మిమ్మల్ని మీరు బాగుపరచుకొనాలంటే, ఇప్పుడే చెయ్యండి. అవును, ఇప్పుడే చాలా ముఖ్యం.

ఆత్మలతో మాట్లాడడం

మనందరం బాగుపడాలని ప్రయత్నిస్తున్నాం; మీరు భూలోకంలో, మేము ఆత్మ లోకంలో. కానీ మనిద్దరి మధ్య ఎంతో తేడా ఉంది. మీకు అన్ని సత్యాలూ తెలియవు. కాని మాకు వాటిలో చాలా తెలుసు. మీ తోటివారు ఎంత మంచివారో, ఎంత చెడ్డవారో మీకు తెలియదు. కాని వారెంత మంచివారో, చెడ్డవారో మాకు తెలుసు. మీరొకరి మనస్సు మరొకరు తెలుసుకోలేరు. మేము కొంతవరకు మనసును తెలుసుకోగలం? మీరు మమ్మల్ని చూడలేరు, మేము చెప్పేది వినలేరు. మేము మిమ్మల్ని చూడగలం, మీరు చెప్పేది వినగలం, మీ మనసులో ఏముందో, మీ ఆలోచనలేమిటో మేము తెలుసుకోగలం. మీ గురించి మీకన్న మాకు బాగా తెలుస్తుంది.

ఇదంతా వట్టిదే. కోతలు అనుకుంటే మీకో ఉదాహరణ చెబుతాను. మేము చెప్పేది రాస్తున్న మా అమ్మకు తన చుట్టూ ఉన్నవారి నిజస్వరూపం ఏమిటో తెలియదు. ఆమెకి ఒక వ్యక్తి అంటే చెడు అభిప్రాయం ఉండేది. కాని అతను చాలా మంచివాడని మాకు తెలుసు. మంచివారని ఆవిడ అనుకొనేవారు పెద్ద హిపోక్రాట్లు - ఈర్ష్యాళువులు, హాని చేసేవారు. అందుకని మేము ఆమెకు సలహా చెప్పాం. ముందు ఆమె మేము చెప్పింది నమ్మలేదు. కాని ఆమె, మా నాన్నగారు చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకొని, మేము చెప్పింది నిజమని నమ్మి ఆశ్చర్యపోయారు. వారి చుట్టూ ఉన్న వ్యక్తులు (ఆత్మలు) ఎంత చెడ్డవారో, పాపాత్ములో మేము చెప్పకపోతే వారికి తెలిసేది కాదు.

అందువల్ల, ప్రియమైన పాఠకులారా, ఆత్మలోకంలో ఉన్న మీ ఆత్మీయులతో మీరు మాట్లాడగలిగితే, వారి నుంచి మార్గదర్శకత్వాన్ని మీరు పొందగలిగితే, ఏ వ్యక్తి మంచివారో, ఎవరు చెడ్డవారో మీకు కచ్చితంగా తెలుస్తుంది. ఎన్నో విషయాల పట్ల మీకు స్థిరమైన అభిప్రాయాలుండడం వల్ల మీరు పొరపాటు పడతారు. అందువలన ఇలా మాట్లాడుతూ మేము మీకు మార్గదర్శకత్వం ఇస్తున్నాం. దుష్టాత్మలను బాగు చేయడం చాలా కష్టం. అయితే ఒకసారి వారి విశ్వాసాన్ని చూరగొంటే దుష్టాత్మలను బాగు చేసే అవకాశాలు లెక్కలేనన్ని వస్తాయి. ఆత్మలతో సంభాషించడం ద్వారా ఎన్నో అద్భుతాలు జరిగాయి. మీ ప్రపంచం నుంచి వెళ్ళిపోయిన ఆత్మల నుంచి సందేశాన్ని పంపి భూమ్మీద ఉన్న వారి బాధను పోగొట్టవచ్చు. అందరూ ఆత్మలోకం నుంచి సందేశాలను అందుకోలేరు. కాని ఇలా అందుకోగలిగిన వారు ఇతరులకు సాయం చేయడానికి ముందుకొస్తున్నారు. భూమి మీద మనుషులు కొన్నిసార్లు చాలా తెలివితక్కువగా ఉంటారు. సంతోషం నింపిన కప్పు కళ్ళ ముందు ఉన్నా, అది విషంలాగా వారికి అనిపిస్తుంది. ఆత్మలతో మాట్లాడడం వాళ్ళు నమ్మరు. ఆత్మను, మరణించిన తర్వాత జీవితాన్ని విశ్వసించకపోవడం వారి తెలివితక్కువ తనం. వారు ఆత్మలోకానికి వచ్చినప్పుడు నిర్ఘాంతపోయారు. అటువంటి వారిని (ఆత్మలను) చూసి మేం జాలిపడుతున్నాం.

18-04-1981

వృద్ధుడు - సెలయేరు

కొద్దికాలం కిందట ఆత్మలోకంలో ఏం జరిగిందో మీకు చెప్పాలనుకుంటున్నాం. మాకిష్టమైన సెలయేరు ఒడ్డున ఒక వృద్ధుడు కూర్చుని ఉన్నాడు. ఇక్కడ వృద్ధులు కనిపించడం చాలా అరుదు. ఎందుకంటే ఇక్కడ ఒక ఆత్మకు వివేకం కలగగానే దాని వయసు తగ్గుతుంది. అందువల్ల అతడిని చూసి మేం ఆశ్చర్యపోయాం.

"కొత్తగా వచ్చారాండీ?" అని అడిగాం.

"అవున్నాయనా. మీకెలా తెలుసు?" అన్నాడు.

"అంతఃప్రేరణ!" అన్నాం.

"మీరు చాలా తెలివైన వారిలా ఉన్నారు. ఇంటికి వెళ్ళేదారి చూపిస్తారనిపిస్తోంది నాకు" అన్నాడు.

"మీ ఇల్లెక్కడ?" అని అడిగాం. భూలోకంలో తన చిరునామా చెప్పాడు.

మేం నవ్వి ఇలా చెప్పాం, "అయ్యా, మీరు భూలోకంలో లేరు, మీరు ఆత్మలోకంలో ఉన్నారు." ఆత్మలోకానికి మీరు కొత్తగా వచ్చారని అతనికి చెప్పాం.

మేము ఏదో పిచ్చాసుపత్రి నుంచి వచ్చినట్టుగా మమ్మల్ని చూస్తూ, మెల్లగా "మీరు తెలివైన వారు అనుకున్నాను, నేనెలాగో ఈ సెలవుల విడిదికి వచ్చిపడ్డాను. నేనిక్కడకి నిజంగానే కొత్తగా వచ్చాను" అన్నాడు.

"సెలవులా? అయ్యా, మీరు సెలవుల తర్వాత ఇంటికి వచ్చారు" అన్నాం.

"ఓరి దేవుడా, వీళ్ళు నిజంగానే పిచ్చివాళ్ళు. నేనిక్కణ్ణించి వెళ్ళిపోవాలి" అంటూ అతను పరిగెత్తాడు. అతడిని చూసి జాలిపడ్డాం. మాలోని ఒక ఉన్నత ఆత్మను పిలిచి, మళ్ళీ అతని దగ్గరకు వెళ్ళాం.

మమ్మల్ని చూడగానే అతని ముఖం పాలిపోయింది. "దేవుడా! ఇప్పుడు ముగ్గురు పిచ్చివాళ్ళున్నారు. నేనేం చేయను?" అని ఏదో పేరు పిలవడం ఆరంభించాడు. అది భూలోకంలో ఉన్న అతని కుమారుడి పేరని తరువాత మాకు అర్థమైంది. మేం ఎంత చెప్పినా ఆత్మలోకం ఇంత అందంగా ఉంటుందని అతను నమ్మలేకపోయాడు. భూలోకంలో చచ్చిపోయిన తరవాత ఇంత అందమైన ప్రపంచంలో నివసిస్తామంటే అతనికి నమ్మకం కలగలేదు.

మేము ఇంకా కొన్ని ఉన్నతాత్మలని పిలిచాం. వారు నేర్పుగా అతనికి పరిస్థితిని చెప్పారు. మేమందరం కలిసి అతనికి అన్నీ చూపించాం. కొద్దిసేపటి తరవాత అతను మేము చెప్పేది నమ్మాడు. నిజమే చెప్పామని గుర్తించాడు. తరవాత ఎంతో స్నేహపూర్వకంగా ఇలా అన్నాడు. "ఇప్పటివరకూ భూమ్మీద చనిపోవడానికి చాలా భయపడ్డాను. చనిపోయాక శాశ్వత శాంతితో దేవతలు విహరించే శూన్యంలో నీళ్ళు లేని మేఘంపై నిద్రిస్తామని భావించాను."

మేము నవ్వి, ఇక్కడ దేవతలు విహరించడం మేము చూడలేదు అని చెప్పాం. "అయితే! మనం స్వర్గంలో లేమన్నమాట. ఇంక స్వర్గం ఇంకెంత బాగుంటుందో కదా!" అన్నాడు.

మళ్ళీ మేము ఇలా వివరించాం అతనికి, "ఇది ఉన్నత ఆవరణ. ఇదే స్వర్గం. అత్యున్నత ఆవరణ ఇంకా చాలా అందంగా ఉంటుంది. మన ఊహకు అంద నంతగా". అప్పుడతని ఉపచేతనాత్మక[2] మనస్సులో వివేకం ప్రవేశించి, తెరచుకొనడం ఆరంభ మైంది. అతని వయస్సు కొంచెం తగ్గింది. అతనికి కొంచెం వివేకం కలిగింది కాని అతడు నేర్చుకోవలసింది చాలా ఉంది. "శాశ్వత శాంతి" ప్రదేశం ఇంత అందంగా ఉంటుందని, ఇక్కడ నిద్రించకుండా మేమందరం ఎంతో చురుగ్గా, ఉత్తేజ పూరితంగా ఉండటం చూసి అతను ఆశ్చర్యపోయాడు.

ఈ కథను బట్టి భూలోకంలోని వారికి ఆత్మలోకం గురించి ఏమీ తెలియదని, నిజంగా ఇది ఎలా ఉంటుందో చూసి వేదన చెందుతారని మీకర్థమై ఉంటుంది. అందుకని భూమ్మీద ఉన్న ఆత్మీయులారా, ఆత్మలతో మాట్లాడుతూ ఆత్మలోకానికి రావడానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి. దైవిక సన్మార్గంలో నడుస్తూ ఉన్నత ఆవరణలకు చేరడానికి ప్రయత్నించండి.

19-04-1981

దైవనియమాలను అర్థం చేసుకొనడం

భూలోకంలో ఉన్నవారికి దైవనియమాలు తెలియవు కనుక వాటిని వారందరికీ తెలియజెప్పాలని మాతోటి ఆత్మలు మమ్మల్ని కోరు తున్నాయి. ఈ జ్ఞానాన్ని వారికి అందజెయ్యాలని, వారు మమ్మల్ని నమ్ముతారని ఈ జ్ఞానాన్ని పూర్తిగా మానవాళి మంచికే ఉపయోగిస్తారని మాకు పూర్తి నమ్మకం ఉంది. అసలైన దైవనియమాల నుంచి దారి తప్పించే ఎన్నో అపోహలతో కూడిన ఎన్నో నమ్మకాలు మీకున్నాయి.

దైవ నియమాలను చాలావాటిని తప్పుగా అర్థం చేసుకొనడం జరిగింది. ఈ ఆటను ఆడి చూడండి – మేము చిన్న పిల్లలుగా ఉన్నపుడు పార్టీలలో ఈ ఆట ఆడేవారం. ఒక వలయంలో కూర్చోండి. ముందుగా ఒకరు తన పక్కనున్న వ్యక్తి చెవిలో ఒక వాక్యం చెప్పాలి. అలా అందరూ ఆ వాక్యాన్ని ఒకరి చెవిలో ఒకరు చెబుతూ పోవాలి. అలా చెప్పుకొనడం పూర్తయి, ఆ వాక్యాన్ని చెప్పిన మొదటి వ్యక్తి వంతు వచ్చేసరికి అది పూర్తిగా అతను ముందు చెప్పిన దానికి భిన్నంగా ఉంటుంది. ఇదేవిధంగా

2. ఉపచేతనాత్మక మనస్సు అంటే విశ్వ ప్రకారం మీ నిజమైన ఆధ్యాత్మిక మనస్సు. దీనినే ఉన్నత మనస్సు లేదా అంతరాత్మ అంటాం. ఉపచేతనాత్మక మనస్సుకున్న ఇతర నిర్వచనాలతో దీనిని కలపకూడదు.

సర్వశక్తిమంతుడైన దేవుడు నిర్దేశించిన నియమాలు మొదట కచ్చితంగానే అమలైనా, యుగాలుగా ఒకరి నుంచి మరొకరికి చేరుతూ ఆ సత్యాలు కొన్ని మార్పు చెందాయి. పూర్తిగా కాదు. పాక్షికంగా.

20-04-1981

మేము చనిపోయిన విధానం - ఆత్మలోక ఆవరణలు

ఇప్పుడు ఆత్మలోకం గురించి ఇంకా ఎక్కువగా మీకు చెప్పాలనుకుంటున్నాం. ఇక్కడ మేమెట్లా నివసిస్తామో మీకు తెలుస్తుంది. దైవం నిర్దేశించిన విధంగా సన్మార్గంలో జీవిస్తే మీరెంత అద్భుతమైన ఆత్మలోకంలో ఉండగలరో మీకు తెలుస్తుంది. కింది ఆవరణలు ఎలా ఉంటాయో, దుష్టాత్మలకు ఏం లభిస్తుందో, సదాత్మలకు ఏం లభిస్తుందో మీకు చెప్పాలనుకుంటున్నాం.

మేము చనిపోయిన దగ్గర్నించి మొదలుపెట్టి, ఏం జరిగిందో, మేం ఆత్మలోకంలోకి ఎలా వెళ్ళామో, ఆత్మలోకం ఎలా ఉందో ముందుగా మీకు చెబుతాం.

అంతకుముందు బాగు చేసిన ఇంజను ఎలా ఉందో తెలుసుకొనడానికి కారులో నిదానంగా ప్రయాణిస్తున్నాం. మేము రహదారిలో కారు నడుపుకుంటూ ఇంటికి వస్తున్నాం. నేను, (విస్పి) నిదానంగా కారు నడుపుతున్నాను. మిగిలిన వాళ్ళంతా నిద్రపోతున్నారు. రోడ్డు గతుకులమయంగా ఉండడంతో కుదుపులు ఎక్కువైతే అందరూ నిద్రలేస్తారని నేను మరింత నిదానంగా నడుపుతున్నాను.

మేము ఇంటికి వస్తున్నాం. కాని వాస్తవానికి నేను, రతూ ఆత్మలోకంలోని మా ఇంటికి ప్రయాణిస్తున్నామని అప్పుడు నాకు తెలియదు.

హఠాత్తుగా నల్లగా, పెద్దగా, భయంకరంగా ఉన్నదేదో నాదారికి అడ్డువచ్చింది. కారును ఎడమవైపుకి తిప్పాను బ్రేకులు వెయ్యాలని చూశాను. అవి పాడైపోయాయి. నాముందొక చెట్టు కనిపించింది. కారువెళ్ళి చెట్టుని గుద్దుకొంది.

నేను నా భౌతిక శరీరంలోంచి బయటకు రావడం చూశాను. నా శరీరం గడ్డిలోపడి ఉంది. నేను నా శరీరంలో లేనని గుర్తించాను. తేలికగా ఉన్న ఆధ్యాత్మిక శరీరంలో నేనున్నాను. నాకేమీ నొప్పిగాని, అసౌకర్యంగాని లేదు. భూమ్మీద నేను చచ్చిపోయానని అప్పుడే నాకు అర్థమైంది చుట్టూ చూశాను. ఎవరూ కనపడలేదు. "ఓరి దేవుడా, ఆత్మలోకంలోకి నన్ను ఆహ్వానించడానికి ఎవరూ రాలేదు" అన్నాను. కొన్ని క్షణాల తర్వాత నా ప్రక్కన ఒక ఆత్మ కనబడింది. నా తమ్ముడు రతూలా కన్పించడంతో చాలా సంతోషించాను. నేనతణ్ణి కౌగలించుకొని ముద్దు పెట్టుకున్నాను. "కనీసం మనం

ఇక్కడ కలిశాం" అన్నాను. ఆత్మ చిరునవ్వుతో ఇలా అంది, "విస్సీ, నేను రతూని కాను. రతూ అక్కడున్నాడు. భౌతిక శరీరంలో ఇంకా శ్వాసిస్తున్నాడు." నేను కిందకి రతూ వైపు చూశాను. ఆత్మ కూడా అచ్చం రతూలా ఉండడంతో "మీరెవరైనా సరే, దయుంచి రతూని రక్షించండి ప్లీజ్ – అతను చనిపోతే అమ్మా, నాన్న ఒంటరులై పోతారు. వాళ్ళనెవరు చూస్తారు?' అని వేడుకొన్నాను. అతనెంతో దయగా "నాన్నా, విస్సీ ఇది మన చేతులలో లేదు. అంతా భగవంతుని చేతుల్లోనే ఉంది. విస్సీ, నేను మీ తాతని" అన్నాడు. అయితే ఈయన మేం పప్పా/పాప్పీ అని పిలిచే తాతయ్య, అమ్మవాళ్ళ నాన్న. 1974లో ఆయన చనిపోయేటప్పటి కన్న ఇప్పుడు చాలా చిన్నగా కనిపించడంతో నేనాయనను గుర్తుపట్టలేకపోయాను. చనిపోయేటప్పటికి ఆయన వయస్సు 93 ఏళ్ళు. ఇప్పుడు 1980లో మేం భూమిని వదిలి వచ్చినప్పుడు 30ఏళ్ళ వ్యక్తిలా ఉన్నాడు. నా తమ్ముడు రతూ పోలికలు చాలా ఉన్నాయి ఆయనకి. నేనాయనని కౌగలించుకొని, రతూని రక్షించమని ప్రాధేయపడ్డాను.

పప్పా మళ్ళీ ఇలా చెప్పాడు, "నాన్నా, విస్సీ ఇది మనకు శక్యం గాదు. మన చేతుల్లో లేదు. నాకూ ఇది చూసి బాధగా ఉంది. పరమాత్మను ప్రార్థిద్దాం. మీరిద్దరూ లేకుండా నా బిడ్డ ఏమవుతుంది?" చేతులు జోడించి "దేవుడా... అంటుండగానే రతూ తన శరీరంలోంచి బైటకు వచ్చేశాడు మేం బాధతో విచారంగా మా అమ్మానాన్నలను గురించి ఆలోచిస్తూ అక్కడే నిలబడిపోయాం.

రతూ నన్ను చూశాడు. తర్వాత నుజ్జునుజ్జయిన కారును చూశాడు. కాని గడ్డిలో పడున్న తన భౌతిక కాయాన్ని చూడలేదు. గట్టిగా "నా కారునేం చేశావు నువ్వు?" అని అరిచాడు. తన గొంతు పెద్దగా బొంగురుగా ఉండేది. ఇప్పుడు బాగా గట్టిగా వినిపించింది.

తర్వాత అతను పప్పాను చూసి గుర్తుపట్టాడు. "పప్పా మీరిక్కడున్నారా? నేనెక్కడున్నాను? పప్పా మీరు చనిపోయారు కదా. ఇక్కడేం చేస్తున్నారు?" నాతో మళ్ళీ "నా కారునేం చేశావు?" అన్నాడు. భూలోకంలో మేం చనిపోయామని తనకి చెప్పాం. రతూ కూడా నాలాగే "అయ్యో! ఇంక అమ్మా, నాన్న ఏమవుతారు?" అని వాపోయాడు.

మా ప్రియమైన అమ్మానాన్నలకోసం, జినా (2 ½ ఏళ్ళ విస్సీ కూతురు) కోసం మా భౌతిక కాయాలలోకి చేరే మార్గం ఉందా అని ఆలోచిస్తూ చూస్తూ నిలబడ్డాం. కాని మమ్మల్ని పిలిచారు. మా స్నేహితులు, బంధువులు కూడా కొందరు వచ్చారు. మేము అందరం కలిసి వెళదామనుకున్నాం. మాతో పాటు అక్కడ ఉన్న ఉన్నత సదాత్మ[3] విస్సీ, రతూ కళ్లు మూసుకోండి అనడంతో కళ్ళు మూశాం. ఎంతో వేగంగా పైకి

3. ఉన్నత సదాత్మ (High Good Soul) అంటే 6వ ఆవరణ, 7వ దశ నుంచి వచ్చిన ఆత్మ

వెళుతున్నట్టు మాకు అనిపించింది. గమ్యం చేరగానే కళ్ళు తెరిచాం. ఎంతో మనోహరంగా ఉన్న ఆత్మలోక గృహాన్ని చూశాం.

మేము ఎంతో విచారంగాను, దిగ్భ్రాంతిలోను ఉన్నాం కనుక కొన్ని సదాత్మలు మమ్మల్ని పెద్దహాలులోకి తీసుకుని వెళ్ళాయి. ఆ హాలుని **విశ్రాంతి మందిరం** అంటారు. అక్కడ చాలా మెత్తగా, మృదువుగా ఉన్న మంచంపై పడుకోమని చెప్పారు. అక్కడ మేం గాఢనిద్రలోకి జారిపోయాం.

కొంతసేపటికి నేను మేల్కొన్నాను. నా పక్కనే మరో మంచం మీద రతూ పడుకుని ఉన్నాడు. కొన్ని కిరణాలను అతనిపై ప్రసరింపచేస్తున్నారు. ఉన్నత సదాత్మ ఒకరు వచ్చి నన్ను తనతో రమ్మన్నారు. "రతూ ఇంకా పూర్తిగా విశ్రాంతి తీసుకోలేదు. నేనిక్కడ ఉంటాను" అని చెప్పాను. ఆ ఉన్నత సదాత్మ "లేదు, నువ్వు నాతో రావాల్సిందే, ఇంక ఇక్కడ నువ్వుండ కూడదు. తగినంత విశ్రాంతి తీసుకున్న తర్వాత రతూ నీ దగ్గరకు వస్తాడు" అన్నారు. నన్ను బయటికి తీసుకెళ్ళారు. అక్కడ పప్పా, నా స్నేహితులు, బంధువులు అందరూ మేం విశ్రాంతి మందిరం నుంచి ఎప్పుడు బైటికి వస్తామా అని ఎదురుచూస్తున్నారు. కొంతసేపటి తరవాత రతూ కూడ బైటికి రావడం చూశాం. ఇంక మేం అమ్మానాన్నల దగ్గరకు వెళ్ళలేం కనుక ఈ భయంకరమైన దెబ్బ నుంచి వారు ధైర్యంగా కోలుకొనేలా వారికి సాయపడాలని అనుకున్నాం.

21-04-1981

7 ఆవరణలు

మీరు స్వల్పకాలిక, దీర్ఘకాలిక అనారోగ్యాల బారినపడి ఇక్కడికి వస్తే చనిపోయిన మీ స్నేహితులు, బంధువులు అందరూ వచ్చి మిమ్మల్ని ఆహ్వానిస్తారు. కాని మీరు హఠాత్తుగా చనిపోతే వారు కొంచెం ఆలస్యంగా వస్తారు ఆహ్వానించ డానికి. మీరు కింది ఆవరణలలో లేకపోతే, వారు తప్పనిసరిగా వస్తారు. మీరు కింది ఆవరణలలో ఉంటే అలాంటప్పుడు ఏదో ఒక సదాత్మ వచ్చి మిమ్మల్ని ఆహ్వానిస్తుందని అనుకోకండి. పాపాత్మలు మిమ్మల్ని కింది ఆవరణలకు తీసుకొని వెళ్ళడానికి సంసిద్ధంగా ఉంటాయి.

ఆత్మలోకంలో 7 ఆవరణలు ఉంటాయి. ప్రతి ఆవరణలోను 0–9 వరకు 10 దశలు (steps) ఉంటాయి. ఆవరణ 1–0 అంటే ఆవరణ ఒకటి దశ సున్న.

1వ ఆవరణ అన్నిటికన్న కిందిది. అంధకారం నిండి ఉంటుంది. భూమికి దగ్గరగా ఉంటుంది. ఇది చాలా భయంకరమైన చోటు. ఇక్కడ బండల మీద ప్రాణులు పాకుతూ ఉంటాయి – ఆకృతులు చెడిపోయిన మానవ ఆత్మలు, చెడు ఆలోచనలు నిండిన

మనసులు ఇక్కడుంటాయి. వారి శరీరాలు మా శరీరాలకన్న చాలా బరువుగా ఉంటాయి. వారు బంజరులోకంలో రాళ్ళ మీద పాకుతూ, చీకటిలో మగ్గుతూంటారు. ఏ సమయంలోనూ వారు చిన్న వెలుగు రేఖను కూడా చూడలేరు.

2వ ఆవరణ కూడా చాలా ఘోరంగా ఉంటుంది. అయితే 1వ ఆవరణ అంత చీకటిగా ఉండదు. శరీరాలు కూడా అంత బరువుగా ఉండవు. ఆకృతి తప్పి ఉండవు. వారు కూడా రాతి గుహలలో ఉంటూ, ఒకరినొకరు ద్వేషించుకుంటూ, అసహ్యమైన భాషను ఉపయోగిస్తూ, వెలుగును గాని, మంచినిగాని చూడలేరు.

3వ ఆవరణ కొంచెం మెరుగ్గా ఉంటుంది. అయినా వెలుగు ఉండదు. 1, 2 ఆవరణలలో కన్న శరీరాలు తేలికగా ఉంటాయి. వాతావరణం బాగా భారంగా, పొగమంచు కప్పినట్లుగా ఉంటుంది. శరీరాలు మానవ ఆకృతిలోనే ఉన్నా, వయసు పైబడినట్లుగా ఉంటాయి. 3వ ఆవరణలో ఉండే ఆత్మలకు ఒకరంటే ఒకరికి ద్వేష భావం ఉంటుంది. ప్రతిదానికీ వారు పరస్పర నిందారోపణ చేసుకుంటారు. మొదటిసారి 3వ ఆవరణలోకి వచ్చిన ఆత్మలను బంధించి తమకు బానిసలుగా చేసుకుని తాము చేసే పాపపు పనులలో సహాయపడమని వారిని బలవంతం చేస్తారు.

4వ ఆవరణ ఇది మధ్యస్థంగా ఉండే ఆవరణ. ఇక్కడ కూడా భూమి మీద లాగానే రాత్రీ పగలు ఉంటాయి. మానవాత్మ తన జీవిత ప్రయాణాన్ని ఆరంభించే ఆవరణ ఇది. 4వ ఆవరణ 5వ దశలో నుంచి పైకి వెళ్ళడానికి గాని, కిందికి వెళ్ళడానికి గాని మీకు అవకాశం ఉంటుంది. ఎటు వెళ్ళాలో నిర్ణయించుకోవాల్సింది మీరే.

5వ ఆవరణ స్వర్గానికి ఆరంభం, భూమి మీద ఉండే సుందర ప్రదేశం లాంటిదిది. ఆకాశంలో ఎప్పుడూ చిన్న వెలుగు వుంటుంది. ఈ ఆవరణలో ఉండే ఆత్మలు పరస్పరం సాయం చేసుకుంటాయి. వీరి శరీరాలు బాగా తేలికగా ఉంటాయి. శరీరంలో అవకరాలేవీ ఉండవు.

6వ ఆవరణ చాలా అందంగా ఉంటుంది. ఆకుపచ్చని గడ్డి, చెట్లు, భూమి మీద కనిపించని రంగురంగుల పూలు ఉంటాయి. ఇక్కడ ఎప్పుడూ పగటిలాగ వెలుగు నిండి ఉంటుంది. ఆత్మలు పరిపూర్ణతకు దగ్గరగా, చాలా తేలికగా ఉండే శరీరాలు కలిగి ఉంటారు. అందరూ పరస్పరం ప్రేమ, సామరస్యాలతో ఒకరికొకరు సహక రించుకుంటూ తమకిష్టమైన పని చేస్తుంటారు. మీరు 6వ ఆవరణలో ఉంటే మీ ఉపచేతనాత్మక మనస్సు (అంతరాత్మ అంటాం) అదే మీ నిజమైన, ఆధ్యాత్మిక మనస్సు. అది మిమ్మల్ని భూమి మీద మీరు చేసిన పాపాలు మళ్ళీ చేయకుండా కాపాడుతూ ఉంటుంది. అవే పాపాలు మళ్ళీ చేస్తే మీరు 4వ ఆవరణ కన్న కిందికి పడిపోతారు.

7వ ఆవరణ అత్యున్నతమైనది. భూలోకంలోని వారి ఊహకు అందనంత సుందరంగా ఉంటుందిది. 7వ ఆవరణ అందాన్ని చూస్తే గాని విశ్వసించలేం. దీనిని వివరించడానికి శక్యం కాదు – నిజంగా ఇది ఊహకందనిది. ఈ ఆవరణలోని ఆత్మలు తేజోవంతంగా, అత్యంత పరిపూర్ణంగా చిన్న వయస్సుతో కనిపించే ఆత్మ శరీరాలు. వారు మేఘాలకన్న తేలికగా ఉంటారు. వారు అత్యంత సామరస్య, సౌహార్ద్రాలతో ఉంటారు. అది స్వర్గాన్ని మించినది.

7వ ఆవరణ తర్వాత ఏముంది? భూలోకంలోని వారికి ఆత్మలోకం గురించి ఏమీ తెలియనట్లే, మాకూ దీని గురించి ఏమీ తెలియదు. 7వ ఆవరణ 9వ దశ దాటిన తరువాత ఇంక భూలోకంలో జన్మించం. కాని మన ఆధ్యాత్మిక ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది.

7వ ఆవరణలోని ఆత్మలు పరిపూర్ణంగా, పవిత్రీకరింపబడిన ఆత్మలు. ఒకవేళ వారు భూలోకంలో జన్మించి చిన్న పాపం చేసినా వారు 5వ ఆవరణకుగాని 6వ ఆవరణకు గానీ చేరతారు. అందువల్ల దైవ నిర్దేశిత మార్గంలో ప్రయాణించడంగాని, దుష్టమైన, చీకటిదారిలో వెళ్ళడం గాని ఆత్మ తనకు తానుగా నిర్ణయించుకొనాల్సిన విషయం.

22-04-1981

మన నిజ నివాసం

భూలోకాన్ని విడిచిపెట్టి ఆత్మలోకం చేరడం మంచిదని మనందరికీ తెలుసు. ఆత్మలోకమే మన అసలైన నివాసం. భూలోకానికి కొంతకాలంపాటు వెళ్ళి మళ్ళీ మన ఇంటికి తిరిగి వస్తాం. అనుభవం సంపాదించు కొనడానికి భూలోకానికి వెళతాం. భూలోకం మన పాఠశాల, అక్కడ మనం నేర్చుకుని, అనుభవం సంపాదించి, ఉన్నతస్థాయికి చేరడానికి మన ఆత్మలను పవిత్రీకరించుకొనే ప్రయత్నం చేస్తాం.

భూలోకంలోని వారికి తమ అసలైన నివాసం – ఆత్మలోకం గురించిన స్మృతి ఉండదు. ఒకవేళ మీకు ఆ జ్ఞాపకం ఉంటే భూమ్మీద ఒక్క నిముషం కూడా ఉండాలని అనుకోరు. అందువల్లే దేవుడు మీకు మీ అసలైన ఇంటిని, మీకు ప్రియమైన వారిని, అందమైన ఆత్మలోకం గురించిన జ్ఞాపకం లేకుండా చేశాడు. మీరు మీ శిక్షణను, అభ్యాసాన్ని పూర్తిచేయకుండా వెళ్ళిపోవాలని త్వరపడకూడదని దేవుడిలా నిర్దేశించాడు.

ఒకవేళ ఆత్మలోకం గురించిన జ్ఞాపకం మీ భౌతిక మనస్సులో ఉంటే భూలోకంలో

ఉండడానికి ఇష్టపడరు అని దేవుడికి తెలుసు. కనుక దేవుడు ఆ జ్ఞాపకాన్ని లేకుండా చేశాడు; కాని మీ ఆధ్యాత్మిక మనస్సు, దీనినే ఉపచేతనాత్మక మనస్సు అని కూడా అంటాం. దీనికి మాత్రం ఆత్మలోక స్మృతి ఉంటుంది. అయితే మీ భౌతిక, తార్కిక మనస్సుకు ఈ స్మృతిని ఇది తెలియనివ్వదు.

భూలోకంలోని ఒక వ్యక్తిలో ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణంగా ఉంటే ఆ వ్యక్తికి దైవం నిర్దేశించిన నియమాలు తెలియవు. భూలోకంలోని వ్యక్తులు మరీ చెడుగా మారిపోతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకుని మీరు మీ ఉపచేతనాత్మక మనస్సును మేల్కొలపాలని మా కోరిక. సత్యాన్ని తెలుసుకుని సన్మార్గంలో నడిచే ధైర్యాన్ని పెంపొందించుకోవాలి.

23-04-1981

భారమైన బ్రతుకులు

భూలోకంలో సదాత్మలు ఎక్కువగా కష్టపడుతూ, చెడు ఆత్మలు సుఖంగా ఉండడం చూస్తాం. తరచుగా జనం "దేవుడు చేసే న్యాయం ఇదేనా?" అని బాధపడుతూ ఉండడం మనం చూస్తుంటాం.

సదాత్మలకు అన్ని రకాల శిక్షణ, అభ్యాసం అవసరం. దీనికోసం వారు బాధపడాలి అప్పుడే ఉన్నత స్థాయికి ఎదగగలరు. భూలోకంలో పాపాత్మ గలిగిన వారికి ఎంతగా విజయం లభిస్తే, వారు అంత లోతైన నరకానికి పోతారు. దీనికి మరో మార్గం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజు చనిపోవాల్సిందే. ఆత్మలోకానికి రావలసిందే. అందువల్ల భూలోకంలో చెడ్డవారికి లభించే విజయం ఎంత గొప్పదైతే, వారు ఆత్మలోకానికి వచ్చిన తరువాత ఉండే అనుభవం అంత దయనీయంగా ఉంటుంది. పాపాత్మ గలవారు ఇతరులకు హాని చేస్తూ విజయం సాధిస్తుంటే వారిని చూసి జాలిపడండి. ఎందుకంటే వారు కచ్చితంగా అత్యంత కింది ఆవరణకు వెళ్ళి కష్టాలు పడతారు - అందువల్ల వారిని చూసి ఈర్ష్యపడకండి. "చెడ్డ వ్యక్తి బాగా సంతోషంగా, సుఖంగా ఉన్నాడు" అనకండి. దీనికి మారుగా ఆ వ్యక్తికి ఏది మంచిదో అది చేయమని దేవుడిని కోరండి. మీ లోకంలో మనిషి చనిపోయి తీరవలసిందే. అత్యంత నిమ్న ఆవరణకు చేరి ఎన్నో యుగాలు దుర్భరంగా బాధపడవలసిందే.

దైవన్యాయం అనేది ఏదీ ఉండదని మీరు అనవద్దు. దుష్టాత్మలు ఒక పరిమితిని దాటితే మరింత ఎక్కువ కష్టపడతాయి, అత్యంత నిమ్న ఆవరణ అంటే చిమ్మచీకటి, తేమ, చల్లదనం, బండరాళ్ళు, మీ మీద అంతటా పాకే జీవులు, ఏ చిన్న వెలుగు రేఖను,

కొంచెం మంచిని చూసే అవకాశం ఉండదు. ఈ పాప ప్రాణులకు అవయవాలు అవకరంగా ఉండి పాకుతూ ఉండాల్సిందే. వాళ్ళ ముఖాలు భయం కరంగా ఉంటాయి. బట్టలు పాతవై చిరిగి పీలికలై ఉంటాయి. వారు సగం మనుషులు, సగం జంతువులు. ఈ శిక్షను అనుభవించడానికి మరో మార్గం ఉంది[4]. మీరు నిజంగా పశ్చాత్తాపపడితే, దేవుడిని మీరు కోరేది తగినదైతే, మీరు పునర్జన్మ నిస్తారు. బరువులు మోసే జంతువులా కష్టపడతారు. అయితే నిమ్నాతి నిమ్న ఆవరణ కన్న కొంచెం మెరుగు. బరువులు మోసే **జంతువులా ఉన్నపుడు, భూలోకంలో గత జన్మలలో చేసిన పాపాలు పూర్తిగా మీకు గుర్తుంటాయి.** చేసిన ప్రతిపాపమూ గుర్తువచ్చి పశ్చాత్తాపంతో కుమిలిపోతూ ఉంటారు. ఇటువంటి ఆత్మలను పెంపుడు జంతువుల్లా దయతో చూడరు. బరువులు మోసే జంతువుల్లానే చూస్తారు. (అంటే మనుషులు ఏ ప్రాణినీ నిర్దయగా చూడకూడదని అర్థం)

సదాత్ములు పాపం చేయాలనుకోరు. పాపాత్ములుగా ఉండడం వారికిష్టం ఉండదు. దీనిని వివరించడానికి మాకు మాటలు రావడం లేదు. ఇది చాలా భయంకరం – మీకు సాధ్యమైతే పాపాత్మ కలిగినవారిని బాగుపరచి వారు మరింత కింది ఆవరణలకు పడిపోకుండా చూడండి. చెడు మార్గాలలో విజయం లభిస్తే, కొన్నేళ్ళలోనే వారి స్థితి మరింతగా దిగజారుతుందని తెలుసుకోండి. వారేమిటో వారికి చెప్పి వారిని బాగు చేయవలసిన బాధ్యత మీకు ఉంది. వారితో మంచిగా ఉండి వారిని ఎన్నడూ ప్రోత్సహించవద్దు. వారెంత తప్పు చేస్తున్నారో వారికి చెప్పండి.

24-04-1981

అందరికీ సాయపడడం దైవత్వమా?

సర్వశక్తిమంతుడైన దేవుడి నియమాలు తెలుసుకొనడం ఎంతో గొప్ప సుకృతం. "అందరికీ సాయపడడం దైవత్వం" అని జనం అనడం మీరు వినే ఉంటారు. నిజమే సాయం చేయడం దైవత్వమే. కాని ప్రతి ఒక్కరికీ కాదు. మీతోటివారికి సాయం చేయడం మంచిదే. కాని కొందరు మంచిగా కనిపిస్తూనే చెడ్డగా ఉంటారు. అందరికీ మీరు సాయపడలేరు. ఎవరికి సాయం చెయ్యాలో ఎవరికి చెయ్యకూడదో మీరే నిర్ణయించుకోవాలి. ఎందుకంటే మీరొక దుష్టాత్మకు సాయం చేస్తే దుష్టత్వాన్ని ప్రోత్సహిస్తున్నట్లే. మరి మీరు చేసింది సరైందేనా? దేవుడు మిమ్మల్ని చేయమన్నది ఇదేనా? ఆలోచించండి. మీకు మీరు హాని చేసుకోవడమే కాక, ఆ దుష్టాత్మకు కూడా

4. ఇది మీ కర్మకు సంబంధించినది – విత్తిన దానిని బట్టి పంట ఉంటుంది. శిక్షించేది దేవుడు కాదు. ఆత్మ చేసే మంచి చెడుల ఫలితమే కర్మ. పాప (వ్యతిరేక) కర్మ ఒక్కటే మీకు శిక్ష కాదు. నేర్చుకోవడం దీని ముఖ్యోద్దేశం. పుణ్యకర్మ కూడా ఉంటుంది – చేసిన నిస్వార్థమైన మంచి పనులకు మీకు లభించే ఆశీస్సులు.

హాని చేస్తున్నారు. "ఒక చెడ్డ వ్యక్తికి హత్య చేయడానికో, ఎవరికైనా హాని చేయడానికో నేను సాయం చెయ్యను" అని మీరంటారు. మీరు అటువంటి సాయం చెయ్యరని మాకు తెలుసు, కాని ఆ చెడ్డ వ్యక్తికి తిండి పెట్టి, డబ్బులిచ్చి, బట్టలివ్వడం కూడా తప్పా? అవును తప్పే. ఇలా చేయడం వల్ల అతడికి శక్తి వస్తుంది. మరింత చెడు చేస్తాడు కనుక అతడికి సాయం చేయడం తప్పే. అందువల్ల ఇటువంటి వారికి సాయం చెయ్యడం అంటే దైవ నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించినట్లే. ఎందుకంటే వాళ్ళు మీ సాయంతో మరికొంతమందికి హాని తలపెడతారు కనుక.

చెడ్డ వ్యక్తితో కఠినంగా ఉండండి. మీరు కఠినంగా లేకపోతే ప్రోత్సాహమిచ్చినట్లే. ఇలా చెయ్యడం ద్వారా మీరు కూడా అదే వర్గంలో చేరిపోతారు. అవే పాపాలు మీకు అంటుకుంటాయి. రోడ్డు మీద ఆకలితో అలమటిస్తున్న వ్యక్తిని చూసి అతనికి ధనమో, అన్నమో ఇవ్వడం మీ బాధ్యత అనిపించవచ్చు. నువ్వు మంచివాడివా, చెడ్డవాడివా అని అతడిని మీరు అడగలేరు. ఒకవేళ అతను చెడ్డవాడైతే మీకు నిజం చెప్పడు. అతను చెడ్డవాడో, మంచివాడో మీకు తెలియదు. కాని ఆకలిగా ఉన్నాడు కనుక అతనికేమైనా ఇవ్వమని మీ హృదయం మీకు చెబుతుంది. మీ హృదయం చెబితే మీరు చెయ్యాల్సిందే. మీకు అతడి శీలం గురించి తెలియదు కదా. కాని ఒకవేళ మీరు తెలిసి తెలిసీ ఒక చెడ్డ వ్యక్తికి దానం చేస్తే మాత్రం మీరు కూడా చెడ్డ వ్యక్తే. లేకపోతే చెడ్డ వ్యక్తులకు ఎలాంటి సాయమూ చెయ్యరు.

"అతను ఆకలితో చావడం నేను చూడాలా?" అని మీరనవచ్చు. అది మానవత్వం కాదు. అతనికి తిండి పెట్టండి కాని ఇంకే రకంగాను సాయం చెయ్యవద్దు. అతను తను చేసిన తప్పులకు నిజంగా పశ్చాత్తాపపడినపుడే మరోరకంగా సాయం చేయండి. అంటే అతడు నిజంగానే పశ్చాత్తాపం చెంది, బాగుపడాలనుకుంటున్నాడని అర్థం. అలాంటప్పుడు మీరు చేయగలిగిన సాయం చెయ్యాలి. అతను చెడు ప్రభావాలకు లోనుకాకుండా బయటకు రప్పించడం మీ బాధ్యత. అతను ఉన్నతస్థాయికి వెళ్ళడానికి మీరు సాయపడడం మీ బాధ్యత. అది చాలా మంచి పని. అతనికి మీరు పూర్తి సహకారం అందించాలి. అతను నిజంగా పశ్చాత్తాపపడి బాగుపడాలనుకుంటేనే మీరు సాయమందించాలి.

మంచి వ్యక్తికి మంచి చెయ్యడానికి సాయపడండి – మీ పరిధిని దాటి మంచివారికి సాయం చెయ్యండి. **మీరు చేసే సాయం నిస్వార్థంగా ఉండాలి. మీ చర్య పూర్తిగా స్వార్థం లేనిదై ఉండాలి. సాయం చెయ్యడానికి ఇదంతా మీకు తెలిసి ఉండాలి. మీరు** పొరపాటుగా ప్రవర్తించరని మా నమ్మకం.

25-04-1981

భూలోకంలోని నేరాలు, పాపాలు

"దేవుడు తమకు తాము సాయం చేసుకొనే వారికి సాయపడతాడు" అని చాలాసార్లు విన్నాం. మనం కూడా అన్నాం. ఇది అక్షర సత్యం. సర్వశక్తి మంతుడైన భగవంతుడి నిజమైన నియమం ఇది. ఒకవేళ మీరు నిమ్నమైన ఆవరణలో ఉన్నారనుకోండి, ఉన్నత స్థాయికి వెళ్ళాలనే కోరిక ఉండి, దానిని అందుకోవడానికి ప్రయత్నిస్తున్నారనుకోండి. దేవుడు చేయగలిగిన సాయమంతా చేస్తాడు. మీరు ఆధ్యాత్మికంగా ఎదగాలని సర్వశక్తిమంతుడైన భగవంతుడు కోరు కుంటాడు. మీరు నిజంగా సంతోషంగా ఉండాలని ఆయన భావిస్తాడు. అందువల్ల కొంచెం బాగుపడాలనే తపన మీరు కనబరిస్తే, మీకు బోలెడంత సాయం లభిస్తుంది.

కిందిస్థాయిలో ఉన్న చాలామంది "నేనెవరికీ హాని చెయ్యలేదు. దైవభీతి ఉన్న మనిషిని. ఎన్నడూ ఏ నేరమూ చేయలేదు" అంటారు. **మీరు ఎన్నడూ నేరాలు చేసి ఉండకపోవచ్చు కాని మీరు చాలా పాపాలు చేసి ఉండవచ్చు.** భూలోకంలో మనుషుల శాసనాలు దేవుడికి పట్టవు. మీలోకంలో నేరం అనిపించేది పాపం కాకపోవచ్చు. పాపం నేరం కాకపోనూవచ్చు. ఉదాహరణకు స్వార్థపూరితంగా ఉండడం నేరం కాదు; లోపలంతా కుళ్ళు పెట్టుకుని ప్రపంచానికి సదాత్మలా కనపడడం కూడా నేరం కాదు. ఇది నేరం కాదు కాని పెద్ద పాపం.

అందువల్ల మనుషులు చేసిన శాసనాలను అతిక్రమించడం వంటి పనులు పాపాలు కావని గుర్తించండి. పాపం చేయడం అంటే దైవ నిర్దేశిత నియమాలను ఉల్లంఘించ చడం. మీ లోకంలో చాలా పాపాలను పాపాలుగా అనుకోరు. సర్వశక్తిమంతుడైన భగవంతుడి నియమాలను గురించి భూలోకంలోని వారు పొరబడతారు. చాలా పాపాలను పట్టించుకోరు. కొన్నిటిని అసలు పాపాలే అనుకోరు. భూలోకంలోని వారు ఏ పాపాలు చేస్తే తమ నిజ నివాసమైన ఆత్మలోకంలోని నిమ్నస్థాయులకు చేరతామో తెలుసుకొనడం మంచిది కాదా?

26-04-1981

పాపాలకు పరిహారం చెల్లించాల్సిందే

ఇక్కడ చెప్పే విషయం ముఖ్యమైంది. శ్రద్ధగా వినండి. దీనిని అర్థం చేసు కొనడంలో ఎటువంటి పొరపాటూ చేయకూడదు. దుష్టులు తమ దుర్మార్గాన్ని వదలి సన్మార్గంలో నడిస్తే దైవం ఆశ్రయమిస్తాడని అంటారు.

నిజమే, దేవుడు ఆశ్రయమిచ్చి, వారు ఉన్నతంగా ఎదగడానికి సాయం చేస్తాడు. కాని దీనర్థం దుష్టులు సన్మార్గానికి వస్తామనగానే దేవుడు వారిని క్షమించేసి స్వర్గానికి ఆహ్వానం పలుకుతాడని కాదు. కచ్చితంగా కాదు. ఏమైనా సరే, మీరు చేసిన పాపాలకు పరిహారం చెల్లిం చాల్సిందే. తప్పదు. మీకు మారాలనే కోరిక నిజంగా ఉంటే, దేవుడు తప్పనిసరిగా సాయం చేస్తాడు. మీరు చేసిన పాపాలకు నిజంగా పశ్చాత్తాపం చెందితేనే ఇది జరుగుతుంది. మీరు మళ్ళీ పాతదారిలోకి వెళ్ళరని దేవుడు నమ్మాలి. అప్పుడే త్వరగా ఎదగడానికి ఆయన సాయం చేస్తాడు. త్వరగా ఎదగడమంటే, దేవుడు మిమ్మల్ని నేరుగా ఉన్నత ఆవరణలకు తీసుకొని వెళతాడని కాదు. ఆయన మీకు మార్గదర్శకుడిగా ఉంటూ మంచి మార్గంలో మీ కర్మకు ఎలా పరిహారం చేసుకోవాలో బోధిస్తాడు. ఈ మార్గాన్ని మీకు చూపి ఉన్నత ఆవరణలలోకి మీరు త్వరగా చేరుకొనేలా చేస్తాడు.

ఒక క్షణం చెడ్డగా ఉండి, మరుక్షణం దైవధ్యానం చేసి, పూజ చేస్తే మీరు స్వర్గానికి చేరిపోతారని అనుకోకండి. మత గురువు దగ్గర తప్పు ఒప్పుకొని దేవుడు క్షమించేశాడని భావించడం తెలివితక్కువతనం. నేనింతకు ముందు చెప్పినట్లుగానే ఆ మత గురువు మీకన్నా పాపి అయి ఉండవచ్చు. మిమ్మల్ని క్షమించడానికి అతనెవరు? సర్వశక్తి మంతుడైన భగవంతుడు మాత్రమే మీరు చేసిన పాపాలకు మిమ్మల్ని క్షమించగలడు. అది కూడా మీరు నిజంగా పశ్చాత్తాపపడితేనే.

మీ ఆంతరిక ఉద్దేశ్యం - మంచి మార్గంలో నడవాలనే కోరిక - మాత్రమే లెక్కలోకి వస్తుంది. సత్యమైన, నిజాయితీగలిగిన, దయార్ద్ర జీవితం గడుపుతూ సర్వశక్తి మంతుడైన దైవాన్ని చేరడమొక్కటే మీ ఆంతరిక కోరిక అయి ఉండాలి.

ఒక వ్యక్తి సామాన్యుడిగా ఉండవచ్చు. ఎవరూ అతడివైపు రెండోసారి చూడాలని అనుకోకపోవచ్చు, అతడెంతో వినయంగా అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అనుకోవచ్చు. మీ లోకంలో అతనంత లెక్కపెట్టగలిగిన మనిషి కాకపోవచ్చు కాని ఆత్మలోకంలో మాత్రం భూలోకంలోని గొప్పవారికన్న ఎంతో ఉన్నతుడు కావచ్చు. అందువల్ల భూలోకంలో ఏది సదాత్మో, ఏది దుష్టాత్మో గుర్తించడం కష్టమని మీరు గ్రహించి ఉంటారు. ఈ ఆత్మల మధ్య ఎంతో తేడా ఉంటుంది. అయినా గాని వాటి మధ్య భేదాన్ని మీరు గుర్తించలేరు. ఎందుకంటే **ఆత్మ స్పందన లను గాని, తేజోవలయంగాని మీరు చూడలేరు.** సదాత్మ ఏదో, దుష్టాత్మ ఏదో అర్థం చేసుకొనడం మీకు చాలా కష్టం.

చాలాసార్లు భూలోకంలో ఒక వ్యక్తిని ఎంతో పవిత్రుడు, మంచి వ్యక్తి అనుకోవచ్చు. కాని ఆ వ్యక్తి అత్యంత దుష్టాత్మ కలవాడై ఉండవచ్చు. ఆత్మలోకంతో మీరు సురక్షితంగా మాట్లాడగలిగితే, మార్గదర్శకత్వం తీసుకుంటే, నిరంతరం దుష్టాత్మల సాహచర్యం,

ప్రభావాలకు లోబడి మోసపోయి నిమ్నస్థాయికి వెళ్ళకుండా ఉండగలరని మీకు సలహా ఇస్తున్నాం.

27-04-1981

దెయ్యాలు లేవు

మిమ్మల్ని ఊరించటానికి దెయ్యాలుంటాయంటారు. **విశ్వంలో దెయ్యం లేదు. కాని ఎంతమంది దుష్టులుంటే అన్ని దెయ్యాలున్నట్లే** – ఇక్కడ ఆత్మ లోకంలోని నిమ్నస్థాయిలలోను, భూలోకంలోను కూడా అని మేము అంటున్నాం. ఈ దెయ్యాలు మీ లోకాన్ని బతకడానికి వీలులేని నరకాన్ని చేశాయి. భూలోకంలో మీరంతా కలిసి ఉంటారు – సదాత్మలు. చెడు ఆత్మలు, దుష్టాత్మలు – కాని ఇక్కడ సదాత్మలు చెడు ఆత్మలతో కాని దుష్టాత్మలతో కాని కలిసి ఉండవు.

సదాత్మలన్నీ ఒకచోట ఉంటాయి.

చెడు ఆత్మలన్నీ ఒక చోట ఉంటాయి.

దుష్టాత్మలన్నీ ఒకచోట ఉంటాయి.

ఆత్మలోకంలో దుష్టాత్మ హాని చేస్తుందని, చెడు ఆత్మ మోసం చేస్తుందని భయపడ నవసరం లేదు. ఇక్కడ సదాత్మలన్నీ ఒకచోట సామరస్యంగా, ప్రేమగా కలిసి ఉంటాయి. ఒకరికొకరు సాయం చేసుకుంటూ ఎవరికీ హాని తలపెట్టకుండా ఉంటారు.

చెడుఆత్మలు ఒకేచోట ఉంటూ పరస్పరం మోసగించుకుంటాయి. ఒకరి పట్ల ఒకరికి ఈర్ష్య ఉంటుంది. మోసం, చెడు భావనలు ఉంటాయి. మానసికంగా కూడా పరస్పరం చిత్రహింసలు పెట్టుకుంటాయి. అయితే బాగుపడాలనుకొనే చెడు ఆత్మలు సాయం కోరితే చాలు. ఈ సాయాన్ని నిజాయితీగా కోరితే చాలా ఉన్నత ఆవరణలనుంచి వెంటనే సాయం అందుతుంది. ఉన్నత ఆవరణలలోని దయగల ఆత్మలు వీరిని బాధల నుంచి తప్పించడానికి వెంటనే వస్తాయి. నిమ్న ఆవరణలలో ఉన్న దుష్టాత్మలు ఆధ్యాత్మికంగా ఎదగడం చాలా కష్టం. వారి చుట్టూ ఉండే దుష్టాత్మలు వారిని మరింత దుష్టంగా చేస్తాయి. దుష్టాత్మలు తమ ఆత్మల నుంచి ఎటువంటి మంచినీ రానీయవు కనుక బాగుపడడం వారికి కష్టమవుతుంది కాని అసాధ్యం మాత్రం కాదు. ఎంతో దుష్టాత్మ కూడా ఒకోసారి పరిమిత కాలంలోనే బాగుపడుతుంది, కొన్ని దుష్టాత్మలు మాత్రం శతాబ్దాల తరబడి నిమ్న ఆవరణలలోనే ఉండిపోతాయి. వారికి బాగుపడాలనే కోరిక ఉండదు. వీరు తాము ఒంటరివారమవుతామని బాగు పడాలనుకునే వారిని నివారిస్తుంటారు. అందువల్ల నిమ్న ఆవరణల నుంచి పైకి రావడం చాలా కష్టం. అయితే నిజాయితీగా పశ్చాత్తాపం చెందితే అసాధ్యమేమీకాదు.

ప్రియమైన పాఠకులారా, ఇతరులను కూడా తమలాంటి దుష్టాత్మలుగా చేసే వారే అసలైన దెయ్యాలు. ఇతరులు ఉన్నత ఆవరణలకు చేరాలని కోరుకుంటే ఇది తమ శక్తికొద్దీ వారిని నిరుత్సాహపరిచి, చివరకు మీరు పైకి ఎదగకుండా హాని కూడా చేస్తారు.

ఇప్పుడు సర్వశక్తిమంతుడైన భగవంతుడి గురించి మాట్లాడుకుందాం. దేవుడి గురించి చెప్పాల్సిన అవసరం లేదు. అందరికీ ఆయన గురించి తెలుసు - స్వర్గంలో ఉండే మన మంత్రి, **మన విశ్వానికీ, మరెన్నో ఇతర విశ్వాలకూ రాజు.**

ప్రేమ, దయ, న్యాయం, వివేకం మూర్తీభవించినవాడు దేవుడు. స్వర్గంలో ఉండే న్యాయదేవత. ఏ ఆత్మను గురించీ పొరపాటు పడడు. మిమ్మల్ని బాగుపరచడమే ఆయన ఉద్దేశ్యం. మీలోని దుష్టభావాలను పారదోలడం, మీ ఆత్మను పవిత్రీకరించడం, మిమ్మల్ని సంతోషంగా ఉంచడమే ఆయన ఏకైక ఉద్దేశ్యం. అతి నిమ్న ఆవరణలలో కూడా ఆత్మలకు సహాయం చేయడానికి ఆయనకు సహాయకులు ఉన్నారు. దేవుడి కరుణ, ప్రేమ ఎప్పటికీ ఉంటాయని మీరు నమ్మవచ్చు. అత్యంత దుష్టాత్మలను కూడా ఆయనే ఉన్నత ఆవరణలకు తీసుకొని రాగలడు.

28-04-1981

మీరు నాటిన విత్తనాన్ని బట్టి పంట ఉంటుంది

భూలోకంలో చాలామంది మరణించిన తర్వాత జీవితం ఉంటుందని విశ్వసించరు. నమ్మినవారు కూడా శాశ్వత శాంతిని నమ్ముతారు, ఎప్పటికీ నిద్రపోతూ ఉండడమే శాశ్వత శాంతి అని అనుకుంటారు - ఎంత తెలివి తక్కువ ముగింపు, ఎంత పొరపాటు ఆలోచన.

భూలోకంలో ఉన్న మీకన్న ఆత్మలోకంలో మేము చాలా ఉత్సాహంగా ఉంటాం. శారీరక బాధలు, నొప్పులు ఉండవు. దాదాపుగా మేము అన్ని వేళలా సంతోషంగా ఉంటాం. అంతేగాక మేము అందరం ఆత్మలం. భౌతిక శరీరం బరువు మాకుండదు. మాకు నచ్చిన పని మేము చెయ్యవచ్చు. మేము ఒకరితో ఒకరం పోట్లాడుకోం. ఒకరినొకరు బాధించుకోం. మేము ఎన్నడూ దొంగతనం చేయం. ఎవరికీ హాని చేయం. అందువల్ల మా ఇళ్ళను కాపాడుకోవాల్సిన అవసరం మాకు లేదు. మేము పూర్తిగా స్వేచ్ఛగా ఉంటాం. ఈ స్వేచ్ఛను మాకు సర్వశక్తిమంతుడైన భగవంతుడు ఇచ్చాడు. మేము చదవాలనుకుంటే చదువుతాం; పని చేయాలనిపిస్తే పనిచేస్తాం; విశ్రాంతి తీసుకోవాలంటే విశ్రాంతి తీసుకుంటాం; స్నేహితుల్ని చూడాలనిపిస్తే వెళ్ళి చూస్తాం; ప్రార్థన చేయాలనిపిస్తే

చేస్తాం; మేము ఏది చేయాలనిపిస్తే అది చేయగలం. మీకన్న మేము స్వేచ్ఛగా ఉన్నామని అనిపించడం లేదా? మేము మీకన్న ఉత్సాహంగా లేమా? మీ గురించి మీకు తెలిసిన దానికన్న మాకు ఎక్కువ తెలియదా? ఇక్కడ మేము మీకు చెప్పాలనుకునేది - మీకు తెలిసినదానికన్న మీరు చేసే దానికన్న, మీరు ఆలోచించేదానికన్న ఎక్కువ మేము చెప్పగలం అని.

అంతేగాదు. మేము పూర్తిగా పరిపూర్ణులమని భావించవద్దని కూడా కోరుతున్నాం. మేము కూడా నేర్చుకుంటున్నాం. దేవుడిని చేరగలిగినప్పుడే మాకు పూర్తి పవిత్రత, పరిపూర్ణత సిద్ధిస్తాయి. ఇప్పుడు మా గురించి మీకు పూర్తిగా తెలిసింది కనుక, మీకు మార్గదర్శకంగా ఉండేందుకు ఆత్మలోకం నుంచి కొన్ని సందేశాలు పంపాలనుకుంటు న్నాం. ఆత్మలోకంలో కన్న భూలోకం నుంచే త్వరితంగా ఉన్నతస్థాయికి చేరగలరు.

ఆత్మలన్నీ కచ్చితంగా పాటించే సర్వశక్తిమంతుడైన భగవంతుడి నియమాలు కొన్ని ఉన్నాయి. అన్నిటికన్న ముఖ్యమైనది **"మీరు నాటిన విత్తనాన్ని బట్టి పంట ఉంటుంది."**

సర్వశక్తిమంతుడైన భగవంతుడు ఎంతో ప్రేమ, దయ మూర్తీభవించినవాడు. ఆయన చూపే ప్రేమను, దయను మానవులు అనుచితంగా వాడుకోవడం ఆరంభించారు. కాని దేవుడు మీకు ఉపచేతనాత్మక మనస్సు లేదా అంతరాత్మను ఇచ్చాడు. ఈ ఉపచేతనాత్మక మనస్సు "నాటిన విత్తనాన్ని బట్టి పంట పండుతుంది" అనే సూత్రం ప్రకారం పనిచేస్తుంది. మీరు మంచిచేస్తే మంచి, చెడు చేస్తే చెడు లభిస్తాయి. అన్యాయం ఏమీ లేదు. మీరు మంచివారుగా ఉంటే ఆత్మలోకంలో సంతోషం లభిస్తుంది. **మీరెవరికైనా హాని చేస్తే దాని ఫలితం అనుభవించాల్సిందే. మీ అంతరాత్మే మిమ్మల్ని బాధిస్తుంది.** మీ అంతరాత్మే మీకు అసలైన న్యాయాన్ని చేయగలదు. ఇతరులెవరో కాదు. మీకు తెలియకుండానే మీ ఉపచేతనాత్మక మనస్సు మీకు న్యాయం చేస్తుంది. మీరెందుకు బాధపడుతున్నారో కూడా మీ భౌతిక మనస్సు గ్రహించలేదు. మీరు చేసిన దానిని బట్టి మీకు బహుమతో, శిక్షో లభిస్తుంది. దీనిని బట్టి చూస్తే సర్వశక్తి మంతుడైన భగవంతుడు అత్యంత దయామయుడు, ప్రేమను వర్షించేవాడని, ఎన్నడూ ఎవరినీ శిక్షించడని మీకర్థమవుతుంది. నాటిన విత్తనాన్ని బట్టి పంట పండుతుంది".

29-04-1981

పునర్జన్మ

భవిష్యత్తులో జరిగే సంఘటనలను గురించి తెలుసుకొనడం ఆత్మలోకంలో ఉన్న మాకు సాధ్యం కాదు. కొన్ని మాకు తెలుసు. భూలోకంలోని వారికి ఈ విషయాలు చెప్పమని ఉన్నత ఆత్మల నుంచి ఆదేశాలుగాని, అనుమతి



ఐమై నవరోజీ బాట్లీవాలా
మరణించిన తేది: 1800లో.

మళ్ళీ ఇలా జన్మించారు.



ఖోర్షీద్ రుమి భావనగరి
(ఖోర్షీద్ భావనగరి ముత్తవ్వ)
పుట్టిన తేది: 27 సెప్టెంబరు, 1925



రుమి, పి. మెహతా
(బుర్జిన్ తండ్రి సోదరుడు)
మరణించిన తేది: 5 జనవరి, 1969

మళ్ళీ ఇలా జన్మించారు



బుర్జిన్ విస్పి మెహతా
పుట్టిన తేది: 5 ఆగస్టు, 1980



జల్ దుమాసియా
(విస్తస్ప్ తల్లి తరపు తాత)
మరణించిన తేది: 15 జనవరి, 1994

మళ్ళీ ఇలా జన్మించారు



విస్తస్ప్ నోజర్ కాంగ
పుట్టిన తేది: 1995

గాని ఉంటే తప్ప వాటి గురించి మీకు మేము చెప్పకూడదు. భూలోకంలోని వారు ఆత్మలోకం లోని వారితో మాట్లాడడం ఆరంభించగానే తమ భవిష్యత్తును గురించి లెక్కలేనన్ని ప్రశ్నలు వేస్తారు. కొద్దిమంది మాత్రమే ఇటువంటి ప్రశ్నలడగరు. మేము మిమ్మల్ని ఆక్షేపించడం లేదు కాని, భవిష్యత్తు గురించి మమ్మల్ని ఎన్నడూ ప్రశ్నించవద్దని కోరుతున్నాం.

కచ్చితంగా భవిష్యత్తుని గురించి ఎవరికీ తెలియదు. ఇతరులెలా ప్రవర్తిస్తారో ఎవరికీ తెలియదు. ఉదాహరణకు మీరు 90 ఏళ్ళు బ్రతుకుతారని మేము చెప్పవచ్చు. ఆ మర్నాడే ఏ ప్రమాదమో, హత్యో జరిగి మీరు చనిపోవచ్చు. ఇది కేవలం మనిషి సంకల్ప స్వేచ్ఛకు, అతడు ఎంపిక చేసుకొనే వాటికి సంబంధించినది. భూమ్మీద ఏం జరుగుతుందో ముందుగా ఎవరూ ఊహించలేరు.

కొన్నిసార్లు ఏం జరుగుతుందో మాకు తెలుసు – నిశ్చయంగా జరగాల్సిన విషయం అయితే – కాని మీకు చెప్పడానికి మాకు అనుమతి లేకపోవచ్చు. ఇతరులకు, మీకు మంచి జరిగే కొన్ని విషయాలను గురించి మీకు చెప్పడానికి మాకు అనుమతి ఉంటుంది. చాలావరకు భూలోకంలో భవిష్యత్తును చాలా అరుదుగా మాత్రమే కచ్చితంగా ఊహించగలరు. ఒకవేళ మాకు తెలిసినా, మేము మీకు చెప్పలేం కనుక మమ్మల్ని అడగడం దండుగ. దయచేసి ఇటువంటి ప్రశ్నలు అడగవద్దు.

ఆత్మలోకంలో మేము బాగుపడి ఉన్నతస్థాయిలకు చేరాలనుకుంటాము కనుక మాకేమి జరుగుతుందో మాకు తెలుసు. మళ్ళీ మనల్ని భూలోకానికి పంపమని సర్వశక్తి మంతుడైన భగవంతుణ్ణి అడుగుతాం. మనం ఎక్కడ పునర్జన్మించాలో కూడా మనమే నిర్ణయించుకుంటాం. మన తల్లిని మనమే ఎంపిక చేసుకుంటాం. తండ్రి తనంతతానే వస్తాడు. ఎందుకంటే మన తల్లి ఎవరిని వివాహమాడుతుందో మనకు చాలాసార్లు తెలియదు. ఏది ఏమైనా కొన్నిసార్లు తండ్రిని కూడా మనము ఎంపిక చేసుకోవచ్చు.

చాలావరకు మన అంతట మనము అన్ని పనులు చేసుకోగలిగేంతవరకు, మనల్ని బాగా, ప్రేమగా సంరక్షించే తల్లిని మనము ఎంపిక చేసుకుంటాం. సాధారణంగా మనకు ప్రియమైన వారిని తల్లిలా ఎంపిక చేసుకుంటాం, కాని కొన్నిసార్లు అనుభవం రావడానికి, కర్మను అనుభవించడానికి, పై ఆవరణలకు చేరడానికి చెడ్డ ఆత్మనో, దుష్టాత్మనో మన తల్లిగా ఎంచుకుంటాం.[6]

మనము కోరుకున్న అమ్మ దగ్గరకు కాకుండా వేరే అమ్మ దగ్గరకు వెళ్ళాలని మనల్ని ఎవరూ బలవంతం చేయలేరు. మనం చేసిన పాపాలకు కష్టాలు, శిక్ష అనుభవించ వలసి ఉంటే మన తల్లిగా ఒక చెడ్డ ఆత్మను ఎంపిక చేసుకుంటాం. అందువల్ల మనం

6. "సూరదాసు కథ" చదవండి. దుష్టమాతలను గురించి, ఆధ్యాత్మిక పురోగతి గురించి తెలుస్తుంది.

బాధపడతాం, కష్టమైన బాల్యాన్ని అనుభవించి తరువాత మంచివారుగా అవుతాం. అటువంటి సమయాల్లో మనం పెద్ద ప్రమాదాన్ని కూడా ఎదుర్కొంటాం. ఆ తల్లి ప్రభావం చాలా ఎక్కువై మన జీవితం నాశనం కూడా అవచ్చు. మన మనసులను నియంత్రించుకునే శక్తి కూడా అప్పుడు మనకు ఉండదు. ఏదెలా ఉన్నా కానీ, మనం బాగుపడడానికి, మన ఆత్మను పవిత్రం చేసుకొనడానికి ఇటువంటి ఇబ్బందులను ఎదుర్కొనక తప్పదు.

"బాగుపడడానికి, ఉన్నతస్థాయికి ఎదగడానికి ఇంతకన్న మరో మార్గం లేదా?" అని మీరడగవచ్చు. అలాంటి మరో మార్గం ఉంది. కాని ఆ మార్గంలో లక్ష్యాన్ని చేరడానికి యుగాలు పడతాయి. **ఉన్నత ఆవరణలలో భూమ్మీద పునర్జన్మ లేకుండా మార్గాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఆత్మలోకంలోనే ప్రగతి సాధించడానికి ప్రయత్నించ వచ్చు. కాని ఈ ప్రక్రియ చాలా నిదానంగా ఉంటుంది.**

చాలా ఆత్మలు కష్టమైనా సరే చెడ్డ తల్లులకు పుట్టి త్వరగా బాగుపడాలని ప్రయత్నిస్తాయి. కొందరు మాత్రం తమ ప్రియతములకు సాయం చేయడానికి పునర్జన్మిస్తారు. ఇటువంటివారు తమ ప్రియతములలో ఎవరినైనా తమ తల్లిగా ఎంచుకొని ఆధ్యాత్మికంగా పతనం కావడానికి ఇష్టపడరు కనుక మంచిమార్గంలో నడవడానికి శతవిధాల ప్రయత్నిస్తూంటారు.

మేము ఎంత స్వేచ్ఛగా ఉంటామో దీనివల్ల మీకర్థమవుతుంది. ఆత్మలోకంలో మాకు నచ్చినది మేము చేయవచ్చు. ఒకవేళ అది తప్పయితే మా ఉపచేతనాత్మక మనస్సు దీనికి అనుమతించదు. **ఆత్మలోకంలో ఉన్నతస్థాయిలో ఉంటే కిందిస్థాయికి వెళ్ళే ప్రమాదం లేదు.**

ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకున్నపుడు మీ ఉపచేతనాత్మక మనస్సు భూమి మీద పూర్తికాలం పనిచేయదు. కనుక ఏది ఒప్పో, ఏది తప్పో మీకు తెలియదు. దీనివల్ల సర్వశక్తిమంతుడైన భగవంతుని నియమాలు పాటించలేక మీ జీవితం నాశనం కావచ్చు. ఉన్నతస్థాయిలో ఉన్నవారు పునర్జన్మ పొందితే, భూమ్మీద వీరికి మాత్రమే ఉపచేతనాత్మక మనస్సు దారి చూపుతుంది.

నేను (విప్పి), రతూ మాకు ఇష్టమైన అమ్మను ఎంచుకున్నాం.

30-04-1981

చెడును ఎదిరించండి

ఇక్కడ మేమందరం పనిచేస్తాం. మాలో ప్రతి ఒక్కరూ పనిచేస్తారు. మాకు బాగా నచ్చిన దాన్ని సంతోషంగా చేస్తాం. మాలో కొందరు భూలోకంలోని వారి కష్టాలు పోగొట్టడానికి, వారు ఇప్పుడున్న స్థాయి నుంచి పైకి ఎదగడానికి

సాయము, మార్గదర్శకత్వం ఇచ్చే సందేశాలను పంపుతారు. చాలా ఆత్మలు ఇలా చేస్తాయి - కొందరు సఫలమవుతారు. మరికొందరు కారు.

భూలోకంలోని వారికి దైనందినంగా కలిగే నొప్పులు, బాధలు శారీరక అలసట తగ్గించాలని మేము భావిస్తాం. కాని అలా చేయాలంటే మీరు భౌతిక శరీరాన్ని విడిచిపెట్టాలి. అది మా చేతుల్లో లేదు. సర్వశక్తిమంతుడైన భగవంతుని నియమాలు ఏమిటో మీకు మేము చెప్పగలం.

దైవనియమాలు కొన్ని మీకు ఎప్పుడూ తెలియవు. కొన్నిటిని మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. మిమ్మల్ని సక్రమ మార్గంలో పెట్టటానికి మేమిక్కడున్నాం. దుష్టాత్మలతో మంచిగా ఉంటే వారిని మీరు ప్రోత్సహిస్తున్నట్టు. వారితో మంచిగా ఉండవద్దు; వారికి ఏ రకంగాను సాయం చేయవద్దు. ఒకవేళ ఆ దుష్టాత్మ నిజాయితీగా మారాలని అనుకుంటున్నట్లు మీకు రూఢిగా తెలిస్తే అప్పుడు మాత్రమే హృదయపూర్వకంగా సాయం చెయ్యండి. అది మీ బాధ్యత. కాని ఆ మనిషి ఆలోచనలను తెలుసుకోండి. కచ్చితంగా మీకెలా తెలుస్తుంది? కచ్చితంగా తెలిస్తే, మీకెలా తెలుస్తుందనే ప్రశ్న ఉదయించదు. ఆ ప్రశ్న వచ్చిందంటే మీరు సందేహపడుతున్నట్టే. అంటే మీరు అనుకునేది తప్పు కావచ్చు. ఒప్పు కావచ్చు. ఇక్కడే ఆత్మలోకంలోని మేము మీకు దారి చూపడానికి వస్తాము. ఆ వ్యక్తిని నమ్మవచ్చో, లేదో మేము మీకు చెబుతాం. అయితే ఆత్మలోకంతో సంబంధం ఏర్పడని వారికి మేమిచ్చే సలహా ఏమిటంటే హృదయ పూర్వకంగా ఈ విషయంలో సాయం చెయ్యమని సర్వ శక్తిమంతుడైన భగవంతుని ప్రార్థించండి. ఆయన మీకు సరైన దారిని చూపిస్తాడు.

దుష్టులతో ఎప్పుడూ మంచిగా ఉండకండి. ప్రోత్సహించకండి. ఈ విషయం గుర్తుంచుకోండి. **చెడును ఎదిరించండి.** ఇది సర్వశక్తిమంతుడైన భగవంతుడి ముఖ్యమైన నియమం.

01-05-1981

నిజాయితీగా కోరుకుంటే మార్పు వస్తుంది

సర్వశక్తిమంతుడైన భగవంతుడు ప్రేమ, దయల స్వరూపం. ఆయనే అన్నిటికీ మించిన వాడు. పరిపూర్ణమైన న్యాయమూర్తి. ఆయన ప్రతి ఆత్మ ఉన్నత స్థాయికి చేరాలని కోరుకుంటాడు. అందువల్ల పాపాత్ములకు, చెడు ఆత్మలకు సాయం చెయ్యడానికి ఆయనకు ఎందరో సహాయకులున్నారు. ఆయన సహాయకులు కూడా ఆయనలాగే ప్రేమ, దయ కలిగినవారు.

ఒక దుష్టాత్మ ఉన్నతస్థితికి చేరాలని కోరుకుని, బాగవ్వాలనే కోరిక కనబరచకపోతే ఏం జరుగుతుంది? అతడు ఏ స్థాయిలో ఉంటే అదే స్థాయిలో కొట్టుమిట్టాడతాడు.

అతడెన్నడూ ఉన్నతస్థాయికి చేరలేదు. తన తప్పుడు మార్గాలను మార్చుకొనే కోరిక అతడికి లేకపోవడమే దీనికి కారణం.

మీకున్న నిజాయితీగల కోర్కె అద్భుతాలను సృష్టిస్తుంది. మీకు మీరు "నాకు గొప్ప కోరిక ఉంది. కాని నేను ఉన్నతస్థాయికి చేరుతానని అనుకోవడం లేదు" అనుకోవచ్చు. ఒక్కసారి ఆలోచించండి. "మిమ్మల్ని మీరు, నన్ను నేను బాగు చేసుకోవాలని నిజంగా అనుకుంటున్నానా, లేక బాగుపడాలనుకుంటున్నానని నటిస్తున్నానా?" అని ప్రశ్నించుకోండి.

ఈరెంటి మధ్య చాలా తేడా ఉంది - నిజంగా కోరుకోవడం, మిమ్మల్ని మీరు మోసం చేసుకొనే ఉత్తుత్తి కోరిక, ఈ రెంటినీ విశ్లేషించుకొని చూస్తే, ఈ రెంటిలో ఏది నిజంగా మీరనుకునేదో మీకు తెలుస్తుంది. మీకు నిజంగా బాగుపడాలని ఉంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకోవడం మాని నిజాయితీగా ప్రయత్నిస్తారు.

ఈ రోజుల్లో సదాత్మలు తక్కువ. చెడు ఆత్మలే ఎక్కువ. ప్రతి ఒక్క సదాత్మకు ఒక చెడు ఆత్మను బాగుచెయ్యడం బాధ్యత. ఎవరూ మరొకరిని బలవంతం చెయ్యలేరు. అది లోపల నుంచి రావాలి. ఒక చెడు ఆత్మ కొన్ని వందలసార్లు "నేను బాగుపడాలనుకుంటున్నాను" అంటే లాభం లేదు. మేమిచ్చే సలహా మార్గదర్శకత్వం కూడా ఏ రకంగానూ సాయపడవు. మీకు మీరే చెడుమార్గం నుంచి మంచి మార్గంలోకి రాగలరు.

ఆత్మలోకం నుంచి మేముగాని, ఎవరూ గాని, చివరకు సర్వశక్తిమంతుడైన భగవంతుడు గాని మిమ్మల్ని చెడు మార్గం నుంచి మళ్ళించలేం. దేవుడు మీకు ఉపచేతనాత్మక మనస్సు నిచ్చాడు. అది మీకు దారిచూపుతుంది. ఆయన దాని పనిలో జోక్యం చేసుకోడు. మీరు తప్పు చేస్తే మీ ఉపచేతనాత్మక మనస్సు మిమ్మల్ని తప్పక శిక్షిస్తుంది. మంచి మార్గంలోకి రావడానికి మీరు నిజాయితీగా శ్రమిస్తే తప్ప కింది స్థాయిలోనే ఉండిపోతారు. పై స్థాయికి చేరడానికి ఒకే ఒక మార్గం ఉంది. అది నిజాయితీగా మిమ్మల్ని మీరు బాగుపరచుకోవడం. మరే మార్గమూ మీకు సాయపడదు - ప్రార్థనలు, సర్వశక్తిమంతుడైన భగవంతుని వేడుకొనడం ఏవీ సాయపడవు, మీకు మీరు నిజాయితీగా కోరుకంటే తప్ప. బాగా ఆలస్యం అవకముందే వెంటనే ఆరంభించండి.

02-05-1981

ఆత్మలోకంలో మరో ఆవరణకు వెళ్ళడం

ఆత్మలోకంలో 7 ఆవరణలు ఉన్నాయి. అన్నిటికన్న కింది ఆవరణ 1 అన్నిటికన్న పైన ఉన్న ఆవరణ 7. మీరు చేసే మంచి పనులు, పాపాలను బట్టి మీ ఉపచేతనాత్మక మనస్సు మీకు ఏ ఆవరణకు అర్హత ఉంటే ఆ ఆవరణకు

మిమ్మల్ని చేరుస్తుంది. ఎంత ప్రయత్నించినా అర్హతకు మించిన ఉన్నత ఆవరణకు ఎవరూ వెళ్ళలేరు.

ఆత్మ ఉన్నత ఆవరణకు వెళ్ళడం అసాధ్యం. ఆ ఆవరణ అతడికి కనిపించదు – మీ ఆవరణను మీరు చూడగలరు. మీ కింది ఆవరణలను చూడగలరు. అయితే 5వ ఆవరణ నుంచి కొన్ని ఆవశ్యకతలను పూర్తి చేస్తే పై ఆవరణలకు వెళ్ళవచ్చు:

1. ఉన్నత ఆవరణలోని వారెవరైనా అతడిని ఆహ్వానించాలి.

2. ఆ ఉన్నతావరణలోని ఉన్నత సదాత్మ (High good soul)[6] దీనికి అనుమతి నివ్వాలి.

3. అతడు కొంత శిక్షణ పొందవలసి ఉంటుంది.

4. అధిక వెలుగు కళ్ళు కనిపించకుండా చేస్తుంది. అధిక వెలుతురున్న వాతావరణం ఇబ్బంది కలిగించకుండా అతడు రక్షణ కవచాన్ని ధరించాలి. ఉన్నత ఆవరణలోని ఆత్మలకన్న అతని ఆత్మ కొంచెం బరువుగా ఉంటుంది కనుక అతడిని తేలికగా ఉంచే కవచం అవసరం.

ఉన్నత ఆవరణలో ఎక్కువకాలం ఉండలేరు. తరచుగా అక్కడికి వెళ్ళలేరు. 5వ ఆవరణ నుంచి 6వ ఆవరణకు వెళ్ళగలరు. 6వ ఆవరణ నుంచి 7వ ఆవరణకు వెళ్ళగలరు. ఇలా వెళ్ళగలిగేది కూడా అరుదుగా మాత్రమే. కొద్దికాలం పాటు మాత్రమే అక్కడ ఉండే అవకాశం ఉంటుంది.

మేము అలా వెళ్ళివచ్చాము. మాలో కొందరికి 7వ ఆవరణకు కూడా వెళ్ళే అదృష్టం కలిగింది. ఏది ఏమైనా మేమందరం కింది ఆవరణలకు వెళ్ళగలం. చూడదానికిగాని, ఎవరినైనా బాగుచేయడానికి గాని ఎప్పుడు కావాలంంటే అప్పుడు వెళ్ళగలం.

ఒకవేళ మేము కింది ఆవరణలకు అంటే 1, 2, 3 ఆవరణలకు వెళ్ళాలనుకుంటే మాకు కూడా రక్షణ కవచం కావాలి. **ఈ కవచం మమ్మల్ని దుష్ట, చెడు ఆత్మలకు కనిపించకుండా చేస్తుంది. వారుగాని వారి చెడు స్పందనలు గాని మాకు హాని చేయకుండా ఉంటాయి.**

1,2,3 ఆవరణలలో ఉండేవారు వారి ఆవరణలు విడిచి వెళ్ళలేరు. వారు బాగా పశ్చాత్తాపపడి, నిజాయితీగా ఉంటే, ఉన్నత ఆవరణలలోని దయార్ద్ర ఆత్మలు వారికి మార్గం చూపిస్తే తప్ప ఇది సాధ్యం కాదు. ఈ నిమ్నావరణలోని ఆత్మలు మళ్ళీ ఎన్నడూ ఆ పాపాలు చేయవు అనే నమ్మకం సదాత్మలకు కలిగితే తప్ప ఇది సాధ్యం కాదు. ఆ

---

6. ప్రతి ఆవరణను పరిపాలించేవారిని ఉన్నత సదాత్మ అంటారు.

ఆత్మ పునర్జన్మించి తాను హాని చేసిన వారికి మంచి చేసి కర్మ నుంచి విముక్తి పొందాలి. దీనికి కొన్నిసార్లు వందలాది ఏళ్ళు పడుతుంది. కొన్నిసార్లు కొన్నేళ్ళలోనే విముక్తం కావచ్చు. ఇదంతా ఆ ఆత్మ చేతుల్లోనే ఉంటుంది.

చాలామంది కొన్ని వందలేళ్ళలోనే అత్యున్నత ఆవరణకు చేరుకున్నారు. కొన్ని సదాత్మలు తమ మొత్తం ఆధ్యాత్మిక జీవితంలో ఎన్నడూ 1,2,3 ఆవరణలను చూడలేదు.

ప్రతి ఆత్మ 4వ ఆవరణ 5వ దశ నుంచి తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ఆరంభిస్తుంది.

చాలా ఆత్మలు త్వరితంగా పైకి ఎదిగాయి. కొన్నిటికి వేల ఏళ్ళు పట్టింది. మరికొన్ని ఆత్మలు యుగాల తరబడి నిమ్న ఆవరణలలోనే ఉన్నాయి. ఆత్మలకు నిర్దిష్ట నియమమూ, కాలమూ లేదు; బాగుపడాలని ఆ వ్యక్తికున్న నిశ్చయమైన, నిజాయితీగల కోరికను బట్టి ఆధ్యాత్మికంగా ఎదగటానికి స్వల్పకాలం మాత్రమే పట్టవచ్చు.

03-05-1981

దేవుడి న్యాయం

సర్వశక్తిమంతుడైన భగవంతుడు చాలా దయగలవాడు. ప్రేమిస్తాడు. న్యాయమైనవాడు. ఎవరికీ అన్యాయం చెయ్యడు. చాలామంది దేవుడు తమకు అన్యాయం చేశాడని అనుకుంటారు. ఏది తప్పో, ఏది ఒప్పో వారికి నిజంగా తెలియక పోవడమే దీనికి కారణం. అందుకే చాలామంది దేవుడు అన్యాయం చేశాడని అనుకుంటారు.

ఉదాహరణకు మాకు ఒక ఆత్మ తెలుసు. అతని పేరు సురేష్. భూలోకంలో పేరు ప్రతిష్టలున్న వ్యక్తి. ఎన్నో వేల రూపాయలు రకరకాలుగా దానం చేశాడు. ఉద్యోగాలిచ్చాడు. ఎందరికో బట్టలు, ఇళ్ళు, ఆహారం సమకూర్చాడు. అందువల్ల తాను కచ్చితంగా అత్యున్నత ఆవరణకు వెళతానని భావించాడు. అతడు చనిపోగానే అతని అంత్యక్రియలు ఘనంగా జరిగాయి. అతడెంత మంచివాడో భూలోకంలో చాలామంది కీర్తించారు. అతడు సాయం చేసి నెలకొల్పిన దాతృత్వ సంస్థలో సురేష్ విగ్రహం కూడా ప్రతిష్ఠించారు.

ఆత్మలోకానికి రాగానే నిమ్న ఆవరణలో ఉన్నానని తెలుసుకొన్నాడు. అతనికి చాలా కోపం వచ్చి గట్టిగా ఇలా అన్నాడు "దేవుడి న్యాయం ఇదేనా? నేను ఎంతో దానం చేశాను. భూలోకంలో ప్రజలు నన్ను పూజించారు - దేవుడు మాత్రం నన్నీ నరకంలో పడేశాడు! ఎందుకు? ఆయన న్యాయం ఏది? ఆయనకు దయలేదు. అన్యాయం చేశాడు. ఆయన క్రూరుడు".

చాలా సదాత్మలు అతని దగ్గరికి వెళ్ళి శాంతంగా ఉండమని, ఈ పరిస్థితి ఎందుకు కలిగిందో వినమని చెప్పాయి. ఎందుకు అంత దాతృత్వంతో వ్యవహరించాడో, అతని ఉద్దేశ్యమేమిటో ప్రశ్నించుకోమన్నాయి.

అతను "నేను స్వర్గానికి వెళ్ళాలని అలా చేశాను కాని చూడండి ఎక్కడున్నానో" అన్నాడు.

సదాత్మలు అతనికిలా చెప్పాయి, "నువ్వు చేసిన పని నిస్వార్థంగా చేయలేదు. నీకు స్వర్గంలో చోటు కావాలని ఇదంతా చేశావు నిజం కాదా?"

అతను "అవును. నిజమే. మన యోగులు, పూజారులు, తాత్త్వికులు అందరూ పేదవారికి సాయం చేస్తే, వారికి ఆశ్రయం, ఆహారం, ఉద్యోగాలు ఇస్తే మీరు స్వర్గానికి వెళతారు అని చెప్పారు కదా? దేవుడు, ఈ పూజార్లు, తాత్త్వికులు అందరూ నన్ను మోసం చేశారు" అన్నాడు.

సర్వశక్తిమంతుడైన భగవంతుడు అతడిని మోసం చేయలేదని, అతడు తనను తానే మోసం చేసుకున్నాడని అతను చేసిందంతా దాతృత్వంతో కాదని వారు అతనికి చెప్పారు. అతడు చేసిన పనులు మంచివీ కావు. నిస్వార్థమైనవీ కావు. స్వార్థపూరితంగా స్వర్గానికి వెళ్ళాలనే ఉద్దేశ్యంతో చేశాడు. పాపాలు చేసి దేవుడికి లంచమిచ్చాడు తన పాపాలు కడుక్కోవడానికే దానాలు చేశాడు.

అతడికి కోపం వచ్చింది. "ఇది తప్పు. నాకు చాలా అన్యాయం జరిగింది. నేను స్వర్గంలో ఉండాల్సిన వాణ్ణి. నా పాపాలు పోగొట్టుకొనడానికి నేనెన్నో మంచి పనులు చేశాను కనుక నేను స్వర్గంలో ఉండాలి. స్వర్గలోక ఆనందాన్ని పొందాలి. దేవుడు నన్ను మోసం చేసి ఇక్కడుంచాడు" అన్నాడు.

అంత నిమ్న ఆవరణలో ఉండేసరికి అతడికి దిగ్భ్రాంతి కలిగింది. సజావుగా ఆలోచించ లేకపోయాడు. పూజారులను, యోగులను, దేవుడిని శాపనార్థాలు పెట్టాడు. స్వార్థంతో వేలాది రూపాయలు దానమిచ్చి తన పాపాలు పోగొట్టుకోలేకపోయాడని అతనికి అర్థం కాలేదు.

ఎన్నిదానధర్మాలు చేసినా, చేసిన పాపాలకు ప్రతిఫలం అనుభవించక తప్పదు. నిజమైన, హృదయపూర్వకమైన పశ్చాత్తాపము, హాని చేసిన వ్యక్తికి ఏదో రకంగా పరిహారమూ చెల్లిస్తే తప్ప పాపాలు పోవు. చూశారా, చాలామందికి తాము వేలాది రూపాయల విరాళాలిచ్చాము కనుక స్వర్గానికి పోతామనే పొరపాటు అభిప్రాయం ఉంటుంది. ఆ ఉద్దేశ్యంతో మంచి పనులు చేస్తే స్వర్గాన్ని చూడడానికి కూడా నోచుకోరు. స్వర్గద్వారాన్ని కూడా ఎన్నటికీ చేరుకోలేరని తెలుసుకోండి.

04-05-1981

ఆత్మలతో మాట్లాడడం

మేమిక్కడున్నాం. మీరక్కడున్నారు. అయినా మేము మిమ్మల్ని చూడగలం, మాట్లాడగలం, మా ఆలోచనలు చెప్పగలం. భూలోకంలో చాలామందికి ఈ విషయం తెలియదు. కొద్దిమంది మాత్రమే మాతో మాట్లాడగలరు. భూలోకంలోని ఆత్మ మాతో సంభాషిస్తే మేము ఎంతో ఆనందపడతాం.

ఆత్మలోకంలోని వారితో భూలోకంలోని వారు మాట్లాడుతున్నారంటే వారు నిజంగా దెయ్యాలనీ, చాలా తప్పు అనీ, అలా చేయడం వల్ల హాని జరుగుతుందని భూలోకంలో అనుకుంటారు. ఇది పూర్తిగా అసత్యం. **ఆత్మలోకంలోని వారితో మాట్లాడడం మంచిది కాదని అనుకోవడం తప్పు.**

ఆత్మలోకంలోని వారితో మాట్లాడడం తప్పని కొంతమందిని బలవంతంగా నమ్మిస్తారు. ఇలా చేయడం వల్ల ఆత్మలమైన మాకు ప్రగతి ఉండదని, మా ఆత్మలు మళ్ళీ భూలోకానికి చేరతాయని వారు అనుకుంటారు. ఇవన్నీ పొరపాటు భావాలు. దీనికి భిన్నంగా సర్వశక్తిమంతుడైన భగవంతుడు, ఉన్నత సదాత్మలు కూడా భూలోకం వారితో మేము మాట్లాడడానికి అనుమతి అడిగితే చాలా సంతోషిస్తారు.

ఆత్మలోకంలో ఉండే మాలో కొందరు మా ప్రియతములు తప్పు చేయకుండా వారిని 'ఇంప్రెస్'[7] (ప్రభావితం) చేయవలసి ఉంటుంది. ఎందుకంటే వారు కూడా మాతో పాటు ఒకే ఆవరణలో ఉండాలని మేము అనుకుంటాం కనుక. మా ఆలోచనలు వారికి తెలియజేప్పే సమయంలో మేము చాలా కష్టాలు ఎదుర్కొంటాం.

చాలాసార్లు, భూలోకంలోని వారికి ఒక అభిప్రాయం తెలియపరచడానికి ఎంత కష్టపడ్డా, చిన్న ఆలోచనని కూడా మీకు చెప్పలేం. ఎందుకంటే చాలామంది మా మంచి ఆలోచనలు, సలహా స్వీకరించరు. వారి మనసులు చిన్నవి.

భూలోకంలోని వారితో నేరుగా మాట్లాడడం ద్వారా వారికి ఏది మంచిదో మేం సులభంగా చెప్పగలం. ఆధ్యాత్మికంగా వారు నిమ్నస్థితికి పడిపోకుండా, నిమ్న ఆవరణలకు వెళ్ళకుండా నిరోధించగలం. ఏది ఏమైనా, ఆధ్యాత్మిక పరీక్ష ఏమిటో చెప్పడానికి మాకు అనుమతి లేదు. వారికి సూచనలు, మార్గదర్శకత్వం మాత్రం ఇచ్చి సాయపడగలం.

---

7. టెలిపతిక్ ఆలోచనల ద్వారా ఆత్మలోకంలోని వారు భూలోకంలోని ఆత్మలకు మార్గదర్శకత్వం వహించుతారు. ఈ ఆలోచనలు లేదా 'ఇంప్రెషన్ల'ను భూలోకంలోని ఆత్మలు తమ ఉపచేతనాత్మక మనస్సు ద్వారా అందుకొనవచ్చు.

భూలోకంలోని వారితో నేరుగా మాట్లాడడం మాకు సులువు. మా ఆలోచనలు మీకు తెలియజెప్పినా, మీ మనసులోకి అవి చొరబడవు. మాతో సులువుగా, సురక్షితంగా మాట్లాడగలిగేవారు వారికొచ్చే యాదృచ్ఛిక ఆలోచనలను కొంచెం ఆపగలిగితే, మా ఇద్దరికీ సహాయకారిగా ఉంటుంది.

మాట్లాడగలిగితే త్వరగా పురోగతి సాధించగలుగుతాం. మీ ఉపచేతనాత్మక మనస్సులో చాలాకొద్దిగా మాత్రమే పనిచేస్తుంది కనుక మంచి ఆలోచనలు, భావాలు, వివేకాన్ని మనుషుల సంకుచిత మనసులలోకి ఎక్కించాలని ప్రయత్నిస్తూ మా విలువైన సమయాన్ని వ్యర్థం చేసుకోనవసరం లేదు.

ఇప్పటి నుంచి మీరు చనిపోయిన మీ ప్రియతములతో మాట్లాడడానికి ప్రయత్నించాలి. **కాని మీ అంతట మీరే అప్రయత్న లేఖనం ద్వారా మాట్లాడాలని ప్రయత్నించడం అత్యంత ప్రమాదం.** అప్రయత్న లేఖనంలో అనుభవం ఉన్న అధీకృత వ్యక్తి ద్వారా సంబంధం ఏర్పరచుకోవాలి.

మా ప్రియతములతో నిరంతరం మాట్లాడడం మాకు సులువు. ఇంట్లో కూర్చుని టూవే (two-way) రేడియోలో మాట్లాడడం లాంటిదిది. మేము మాట్లాడే పద్ధతికి, మీ టూవే రేడియోకు అంతగా తేడా లేదు.

మీతో మాట్లాడడానికి చాలా అరుదుగా భూలోకానికి వస్తాం. మేము మా ఇంట్లో కూర్చుని విస్తృతమైన మా ఉపచేతనాత్మక మనస్సు ద్వారా మాట్లాడతాం. **మా ఆలోచనలు అసాధారణ శక్తిమంతాలు.** రేడియోలాగా మేం ప్రసారం చేస్తాం, ప్రసారాలను అందుకుంటాం.

భూలోకంలోని కొంతమందికి దైవదత్తమైన టూవే రేడియో శక్తి ఉంటుంది. వారు మా సందేశాలను అందుకోగలరు. అలాగే మేము కూడా మీరేం చెబుతున్నారో, ఆలోచిస్తున్నారో తెలుసుకోగలం. భూలోకంలో కొంతమందికి ఈ శక్తి ఉండడం అదృష్టం. కొందరికి ఈ అదృష్టం ఉండదు. మన మనస్సులోని టూవే రేడియో ద్వారా మాట్లాడుకొనడమే మీకు ఉత్తమం. ఈ శక్తి ఉన్న వారిని సహాయం కోరండి. మీ జీవితంలో ఎంత తేడా కనిపిస్తుందో చూడండి.

05-05-1981

ఆవరణలు ఎలా పనిచేస్తాయి

1, 2,3 ఆవరణలు నరకం. 5,6,7 ఆవరణలు స్వర్గం. 4వ ఆవరణ స్వర్గనరకాలకు మధ్యన ఉండే ఆవరణ. ఇది స్వర్గమూ కాదు. నరకమూ కాదు. మానవాత్మలు మొదలయ్యేది ఇక్కడినుంచే.

7వ ఆవరణను చేరడం అంతిమలక్ష్యం. దీనిని సాధించడానికి మీరు చాలా కష్టపడాలి. పైకి ఎదగాలనే అంతఃప్రేరణ వల్ల ఇది లభిస్తుంది. అప్పుడే మీరు ఎన్నడూ మిమ్మల్ని కిందికి దిగజార్చే పనులు చేయరు. దానితో లక్ష్యాన్ని త్వరగా చేరుకోగలుగుతారు. ఇలా చేసిన అదృష్టం కలిగిన ఆత్మలు కొన్ని ఉన్నాయి. ఇది పూర్తిగా మీ చేతులలోనే ఉంది.

7 ఆవరణలనూ ఒక ఉన్నత సదాత్మ పరిపాలిస్తుంది. పరిపాలించడం అంటే ఆ ఆవరణకు ఆ ఆత్మ అధిపతి. ఉన్నత ఆవరణలలో ఎవరూ పాపాలు చేయరు. ఎవరికీ హాని చేయరు.

మా ఉపచేతనాత్మక మనస్సే న్యాయం చేస్తుంది కనుక పోలీసు బలగం కాని, ఉన్నతస్థాయి అధికారులుగాని అవసరం లేదు. అయితే, కొన్ని పనులు చేయడానికి మాకు అనుమతి అవసరం. మాకు సలహో, మార్గదర్శకత్వం కావలసినపుడు మా ఆవరణలోని ఉన్నత సదాత్మ వద్దకు వెళతాం. కొన్నిసార్లు మా ఆవరణలో ఉన్న ఉన్నత సదాత్మ కూడా మాకోసం అన్ని ఆవరణలకు అధిపతి, చక్రవర్తి వంటివాడు అయిన 7వ ఆవరణకు అధిపతియైన దైవిక **అత్యున్నత** సదాత్మను మాకోసం అనుమతి, మార్గదర్శకత్వం, సలహో అడగవలసి ఉంటుంది.

1,2,3 ఆవరణలను ప్రతి దానిని ఒక ఉన్నత సదాత్మ పాలిస్తుంది. అదేవిధంగా 4,5,6,7 ఆవరణలను కూడా ఉన్నత సదాత్మలు పరిపాలిస్తాయి. అయితే 7వ ఆవరణకు అధిపతి దైవిక అత్యున్నత సదాత్మ అన్నిటికీ పరిపాలకుడు.

వాళ్ళందరూ ఎంతో దయాస్వభావులు. ఎప్పుడూ మీకంటె ఉన్నతులమన్నట్లుగా ప్రవర్తించరు. వాళ్ళు మీతో నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడతారు. వారూ మీరూ సమానస్థాయిలో ఉన్నట్లుగానే ప్రవర్తిస్తారు. వారి కాంతి తేజోవంతంగా ఉంటుంది. వారి మెరిసే కవచం అద్భుతంగా ఉంటుంది. చూడగానే వారు పవిత్రంగా, సత్యవంతులుగా ఉన్నత సదాత్మ అని వెంటనే తెలిసిపోతుంది.

మేము కింది ఆవరణలకు వెళ్ళలేం. ఒకవేళ వెళ్ళవలసి వస్తే మాకు రక్షణ కావాలి. అక్కడి వాతావరణం బాగుండదు. ఆ చీకటికి మా కళ్ళు అలవాటుపడాలి. చెడు స్పందనలు, పాపపు ప్రభావాలు మాపైన పడి మాకు వ్యాకులంగా, ఇబ్బందిగా ఉంటుంది. అందువల్ల ముఖ్యంగా 1,2,3 ఆవరణలకు వెళ్ళినపుడు మేము కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. మేము 1,2, ఆవరణలకు వెళ్ళినపుడు మమ్మల్ని అదృశ్యం చేసే కవచాన్ని ధరిస్తాం చాలావరకు, అప్పుడు ఆ ఆవరణలలోని చెడు ఆత్మలు మమ్మల్ని చూడలేవు.

ఉన్నత ఆవరణలకు వెళ్ళడానికి కూడా మాకు అనుమతి, రక్షణ అవసరం. వారి కాంతి మాకు ఎంతో ఎక్కువ అనిపిస్తుంది. స్పందనలు కూడా చాలా శక్తిమంతం. మీరున్న ఆవరణ నుంచి ఒక్క పై ఆవరణకే మీరు వెళ్ళగలరు. ఒక ఆవరణ కన్న పైకి సందర్శనకు వెళ్ళలేరు. (మేము 6వ ఆవరణలో ఉన్నాం; 1985లో మేము 7వ ఆవరణకు చేరాం). అయితే సలహా ఇవ్వడానికి, మార్గదర్శకత్వానికి ఒక ఆత్మ గనుక సాయం కోరితే వారిని బాగుచేయడానికి అన్నిటికన్న కింది ఆవరణకు చేరవచ్చు. అప్పుడు మాకు అదనపు రక్షణ అవసరమవుతుంది. మమ్మల్ని పిలిచినవారికి తప్ప మేమెవ్వరికీ కనిపించకూడదు. లేకపోతే ఆ భయంకర ఆత్మలు మాకు హాని చేస్తాయి లేదా మాపై దాడి చేస్తాయి. ఆ చెడ్డ ఆత్మలు మమ్మల్ని పట్టి బంధించి బందీలుగా చేసి మానసికంగా హింసిస్తాయి. మాకు భౌతిక శరీరం ఉండదు కనుక భౌతికంగా ఏమీ చేయలేవు. ఒకవేళ మేము వారికి బందీలుగా చిక్కితే ఉన్నత సదాత్మలు చాలామంది కిందికి వచ్చి మమ్మల్ని విముక్తుల్ని చెయ్యాలి. అందుకని వారికి కనిపించకుండా ఉండడం ఉత్తమం. అలా వీలుకాని పక్షంలో అటువంటి ప్రదేశాలకు వెళ్ళకుండా ఉండడం మంచిది.

ఎందరో సదాత్మలు తమ సమయాన్ని 1,2,3 ఆవరణలలో గడుపుతారు. అక్కడి వారికి సలహాలు, మార్గదర్శకత్వం ఇస్తూ వారిని బాగు చేస్తారు. 1వ ఆవరణలోని ఆత్మలు చాలా అరుదుగా సాయం కోరతారు. ఉన్నత సదాత్మలు 1వ ఆవరణలోని ఆత్మలకు సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నా, ఈ ఆత్మలు చెడు మార్గంలో ఎంతగా లీనమై ఉంటారంటే చికిత్స అసాధ్యం. ఒకవేళ వాళ్ళు నిజాయితీగా పశ్చాత్తాపం ప్రకటించ కుండా వారికి సాయం చేస్తే వాళ్ళు చేసిన పాపాలే మళ్ళీ చేస్తారు. వాళ్ళు వందలాది సంవత్సరాలు 1వ ఆవరణలోనే గడుపుతారు. 2వ ఆవరణ, 3వ ఆవరణలోని ఆత్మలకు సదాత్మలు సాయం చేయడానికి వెళ్ళి వారిని పైకి తీసుకువస్తారు.

ఒక ఆత్మ గనుక తన తప్పులు తెలుసుకుని నిజాయితీగా పశ్చాత్తాపపడి సాయం కోరితే, అతడి సాయానికి సదాత్ములు ఎందరో తరలి వెళతారు. ఈ రకంగా 2, 3 ఆవరణలలోని ఎన్నో ఆత్మలకు పైకి ఎదిగే అవకాశం వచ్చింది. కాని 1వ ఆవరణలోని ఆత్మలకు పైకి ఎదిగే అవకాశం తక్కువ. వారికి పైకి ఎదగడానికి వందలాది ఏళ్ళు పడతాయి.

5,6,7 ఆవరణలలోని ఆత్మలకు తామున్నచోటే ఉండడంగాని, పైకి ఎదగడం కాని వాళ్ళ ఇష్టం. పురోగతి నిదానంగా, స్థిరంగా ఉండే ఆత్మలోకంలోనే వాళ్ళు ఉండవచ్చు. పురోగతి చాలా నిదానం అయినా, వాళ్ళు కిందికి మాత్రం వెళ్ళరనే హామీ ఉంటుంది. వాళ్ళు తమకేది ఇష్టమైతే అది చెయ్యవచ్చు. ఎవరిపైనా బలవంతం ఉండదు. ప్రతి

వారూ తమకిష్టమైనది తాము చేయవచ్చు. అయితే ఇది ఆ ఆత్మ సామర్థ్యానికి లోబడి ఉండాలి. లేకపోతే వారి ఉపచేతనాత్మక మనస్సే వారిని నిలిపి వేస్తుంది.

06-05-1981

మీ ఆత్మస్వభావమే నిజమైన మీరు

మీ అసలైన గృహమైన ఆత్మలోకంలో మీరు చాలాకాలం ఉండాలి. భూలోకం మీకు తాత్కాలిక గృహం లేదా పాఠశాలలాంటిది. పాపాలు చేసే ముందు మీ భవిష్యత్తును గురించి ఆలోచించండి. భూలోకాన్ని ఏదో ఒక రోజు అందరూ వదిలి వెళ్ళవలసిందే. అప్పుడు మీ ఉపచేతనాత్మక మనస్సు మిమ్మల్ని సరైన ఆవరణకు తీసుకెళుతుంది. అప్పుడు మీరు అక్కడి నుంచి పైకి ఎదగాలి. అందువల్ల ఎన్నడూ మీ ఉపచేతనాత్మక మనస్సు లేదా అంతరాత్మకు వ్యతిరేకంగా నడవకండి.

మీ ఆత్మ భౌతిక శరీరాన్ని వదలగానే పైకి లేస్తుంది. ఇది మీ భౌతిక శరీరం కన్న చాలా తేలికగా ఉంటుంది. మీరు 5,6,7 ఆవరణలకు అర్హులైతే మీ నొప్పులు, బాధలు, అవకరాలు అన్నీ మీ భౌతిక శరీరంతోనే పోతాయి. మీ ఆత్మ ఎంతమంచిగా ఉంటే, మీ ఆత్మ శరీరం అంత తేలికగా, రంగులతో నిండి ఉంటుంది. మీరు ఊహించలేనంత తేలికగా ఉంటుంది. కొన్ని నిముషాల్లోనే వందలాది మైళ్ళు ప్రయాణం చేయవచ్చు.

చెడు ఆత్మల శరీరాలు భారంగా, పూర్తిగా అవకరాలతో ఉంటాయి. భూలోకంలో దుష్టాత్మ గలవారు చూడడానికి అందంగా ఉండవచ్చు కాని ఆత్మలోకంలోకి రాగానే అతడి ఆత్మ శరీరం పూర్తిగా అవకరాలతో నిండి ఉంటుంది.

దీనికి భిన్నంగా, **భూలోకంలో సదాత్మ గలవారి శరీరంలో ఎన్నో అవకరాలుండవచ్చు. కాని ఆత్మలోకంలోనికి ప్రవేశించగానే అతని ఆత్మ శరీరం మామూలుగా ఉంటుంది.**

ఆత్మలోకంలో ఒక ఆత్మను చూడగానే అతడు మంచివాడా, చెడ్డవాడా, దుష్టుడా అనేది మీకు తెలిసిపోతుంది. స్పందనలు మనకు అన్నీ చెబుతాయి. అయితే భూలోకంలో ఒక మనిషిని చూడగానే అతనెలాంటి వాడో చెప్పలేం. ఆత్మలోకంలో మాత్రం వ్యక్తి సుగుణాలను గుర్తించడం మాకేం కష్టం కాదు.

వెండిరజ్జువు

చాలాసార్లు కొన్ని విషయాలు మీరు నమ్మలేరని మాకు తెలుసు. ఆత్మలోకంలోని ఆత్మలమైన మేము, భూలోకంలోని ఆత్మలైన మీరు నిరంతరం దాదాపు ప్రతిరోజూ కలుసుకుంటూనే ఉంటాం. ఎలా అని మీరడుగుతారు. గాఢనిద్రలో భూలోకంలోని వారు తమ శరీరాన్ని వదిలి కొంత ఎత్తుకు ప్రయాణించి చనిపోయిన ప్రియతములను కలుసుకుంటారు. అయస్కాంత దారం ఒకటి మీ శరీరంతో మిమ్మల్ని కలుపుతుంది. దీనినే వెండిరజ్జువు అంటారు. మీరు హఠాత్తుగా నిద్రలేస్తే ఈ రజ్జువు మిమ్మల్ని మీ శరీరంలో చేరుస్తుంది. మీరు గాఢనిద్రలో ఉన్నపుడు, కలలు రాని సమయంలో మాత్రమే ఇలా జరుగుతుంది. ఇది మీకు గుర్తుండదు. కాని ప్రతిరోజు చనిపోయిన మీ ప్రియతములను ఇలా దాదాపు రోజూ కలుసుకుంటారని మేము కచ్చితంగా చెప్పగలం.

ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చెయ్యనివ్వండి. మిమ్మల్ని ప్రేమించే మీ ప్రియతము లనే మీరు కలుసుకోగలరు. మీ ప్రేమ ఒకవైపు నుంచే ఉంటే మీరు కలవలేరు. మీరు ప్రేమించేవారు మిమ్మల్ని ప్రేమించాలి. ఉదాహరణకు భూలోకంలో ఒక వ్యక్తి మిమ్మల్ని ప్రేమించినా, ఆత్మలోకంలోకి రాగానే తానిక మిమ్మల్ని ప్రేమించలేనని భావించవచ్చు. మీతో సంబంధం ఉండకూడదనుకున్నాడు కనుక అతడెన్నడూ మిమ్మల్ని కలవాలని రాడు. ఒకరినొకరు ఇష్టపడే సన్నిహితులు మాత్రమే కలుసుకోగలరు - తల్లీకొడుకులు, భార్యాభర్త, తండ్రీకూతురు, తండ్రీకొడుకు, స్నేహితులు. ఎవరికైనా ఒకరంటే ఒకరికి ప్రేమ ఉండాలి. తప్పనిసరిగా మీ ప్రియతములను కలుసుకుంటారని గుర్తుంచుకోండి. **చనిపోయిన ప్రియతములకోసం బాధపడకండి. మీ బాధవారికి కష్టం కలిగిస్తుంది.** వారు వ్యాకులత చెంది మీ స్థితిని సహించలేరు.

07-05-1981

నిద్రిస్తున్నపుడు మీకు ఉపశమనం, మార్గదర్శకత్వం లభిస్తుంది

ఆత్మలోకం మీకు, భూలోకానికీ చాలా దూరంగా ఉంది. భూమిచుట్టూనే ఉన్నా మీకంటె ఎన్నో మైళ్ళ పైన ఉంటుంది. అన్నిటికన్న కింది ఆవరణ భూమికి దగ్గరగా ఉంటుంది. దీనిపైన 2వ ఆవరణ ఆపైన మిగిలినవి.

మీ ప్రియతములను కొన్ని నిముషాల పాటో, కొన్ని గంటల పాటో కలవవచ్చు- అది మీ నిద్ర మీద ఆధారపడి ఉంటుంది. ఆ నిద్రలో కలలు రాకూడదు. గాఢనిద్ర అయి ఉండాలి. చాలావరకు ప్రతి ఒక్కరికీ కలవవలసిన ఒక ప్రియతమ వ్యక్తి ఉంటారు -

వాళ్ళు ఈ జన్మలో మీకు తెలిసినవారై ఉండాల్సిన పని లేదు. ఈ ప్రేమ మాత్రం ఇంతకుముందు చెప్పినట్లుగానే పరస్పరం ఉండాలి. ఒకవైపు నుంచే కాదు.

ఈ సంబంధమే మిమ్మల్ని ఎన్ని బాధలున్నా నడిపిస్తూనే ఉంటుంది. మీకు ఆ సందర్భ జ్ఞాపకం ఉండదు. కాని దాని ప్రభావం వల్ల మీకెదురైన సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనడం, కష్టం నుంచి బయటపడే ధైర్యం మీకు లభిస్తుంది.

గాఢంగా నిద్రపోయి లేచిన తర్వాత ప్రశాంతంగా, వేదన తగ్గినట్టుగా అనిపించడం గుర్తించారా మీరు? దీనికి కారణం మీ ప్రియతములను కలుసుకొనడమే. వారు మిమ్మల్ని ఓదార్చి, మీ ఉపచేతనాత్మక మనస్సు ద్వారా మీకు మార్గదర్శకత్వం చేస్తారు. అయితే దీని గురించి మీ భౌతిక మనస్సుకు ఏమీ తెలియదు. మీరు ప్రశాంతంగా ఉంటారు. కాని మీ భౌతిక మనస్సుకు మార్గదర్శకత్వం బలవంతంగా ఇవ్వాలా లేదా అనేది మాత్రం మీ ఉపచేతనాత్మక మనస్సు ఇష్టం.

భూలోకంలోని ప్రతి వ్యక్తికీ ప్రశాంతమైన, గాఢనిద్ర కొద్దిసేపైనా అవసరం. అప్పుడే మీరు మాకోసం రాగలరు. మేము మీకు సాయం చేసి సముదాయించడానికి, మార్గదర్శకత్వం చేయడానికి వీలుంటుంది. మీ ఉపచేతనాత్మక మనస్సు తన సలహాలను మీ భౌతిక మనస్సుకు చేరవేయలేనిపక్షంలో మీ భౌతిక మనస్సును ప్రభావితం చేయడానికి మేము బాగా ప్రయత్నించి మీరేం చేయాలో, ఏం చేయకూడదో అర్థమయ్యేలా చెబుతాం. చాలాసార్లు మీ భౌతిక మనస్సు మా సలహాను, మార్గదర్శకత్వాన్ని కేవలం ఒక ఆలోచనగా భ్రమించి దానిని తప్పు అని భావించి తిరస్కరిస్తుంది. చాలాసార్లు మీరు మా మార్గదర్శకత్వాన్ని, సలహాను అర్థం చేసుకోలేరు. మీరు తరచుగా ఏం చేయకూడదో అదే చేస్తారు. భూలోకంలో మీ జీవితంలో అత్యంత చెడ్డ భాగం ఇదే, దీనివల్ల తరచుగా మీరు అత్యంత కింది ఆవరణకు చేరతారు. మా సలహాను, మార్గదర్శకత్వాన్ని అలక్ష్యం చేయడమే దీనికి కారణం. "దీని గురించి ఎవరికి తెలుస్తుంది? భూలోకంలో నేను బాగా ధనవంతుడిగా, బాగా బ్రతికితే చాలు. అదే నాకు సంతోషం" అనుకుంటారు మీరు. అయితే కొన్నాళ్ళ సంతోషం తర్వాత ఏం జరుగుతుందో మీకు తెలుసా? మీరు భూమ్మీద కొన్నేళ్ళే ఉంటారు. మిగిలిన కాలమంతా ఆత్మలోకంలోనే ఉంటారు. **"భూమ్మీద కొన్నేళ్ళ తాత్కాలిక సంతోషం కోసం, ఆత్మలోకంలో వందలాది ఏళ్ళు నిమ్నాతి నిమ్న ఆవరణలలో ఉండాలనుకుంటున్నారా?** భూలోకంలో సత్ప్రవర్తనలో జీవితం ఎందుకు గడపాలో ఇది మీకు అవగతం చేస్తుంది.

08-05-1981
భిన్న ఆవరణలలో జీవితం

ఆత్మలోకంలో మేం సంతోషంగా ఉన్నాం. 5,6,7 ఆవరణలలో ఒకరికొకరు హాని చేసుకోరు. మేము నవ్వుతూ, తుళ్ళుతూ ఒకరినొకరు ఆటపట్టిస్తూ ఎప్పుడూ ఉల్లాసంగా ఉంటాం. భూలోకంలోని మా ప్రియతములు బాధగా ఉంటే తప్ప మేము ఎన్నడూ వేదనతోను, విచారంగాను ఉండం.

4వ ఆవరణలోని ఆత్మలు కొన్నిసార్లు సంతోషంగా, కొన్నిసార్లు విచారంగా, మరికొన్ని సార్లు ఇతరులను చూసి అసూయపడుతూ ఉంటాయి. కాని అంతగా ఒకరికొకరు హానిచేయలేరు.

మాకు ఆత్మశరీరం ఉంటుంది కనుక మమ్మల్ని ఎవరూ చంపలేరు, భౌతికంగా బాధపెట్టలేరు. మానసికంగా బాధించడం సాధ్యమవుతుంది. 1,2,3 ఆవరణలలోని ఆత్మలు దీనిలో నిపుణులు.

4వ ఆవరణలోని ఆత్మలు ఒకరినొకరు మోసం చేసుకుంటారు. తమకిష్టం లేని వారిని సంతోషంగా ఉండనీయరు. వీరిలో మంచి, చెడు రెండూ కొంచెం కొంచెం ఉంటాయి.

మాకు రక్షణ కోసం పోలీసు, మిలటరీ బలగాలు అవసరం లేదు. కాని 1, 2,3 ఆవరణలలో మిమ్మల్ని మీరు కాపాడుకోవాలి. లేకపోతే శతాబ్దాల తరబడి హింసిస్తూనే ఉంటారు - మీరు నిజాయితీగా పశ్చాత్తాపపడి, సాయంకోరితే తప్ప విముక్తి దొరకదు.

చివరకు 4వ ఆవరణలో కూడా మిమ్మల్ని మీరే కాపాడుకోవాలి ఎవరైనా మిమ్మల్ని మానసికంగా వేధించవచ్చు. 5,6,7 అవరణలలో రక్షణ అవసరం లేదు. ఎవరూ ఎవరినీ వేధించాలని అనుకోరు.

5,6,7 ఆవరణలలో ముఖ్యమైన నియమాలు: ఒకరికొకరు సాయం చేసుకోండి. ఒకరినొకరు సంతోషంగా ఉంచండి. ఇష్టమైన పనిని చేయండి. భూలోకంలోని మీ ప్రియతములకు సాయం చేయండి.

ఇక్కడ మేము ఎంతో సామరస్యంతో ఉంటాం. భూలోకం నుంచి వచ్చిన ఆత్మలకు ఇక్కడ చాలా స్వేచ్ఛ ఉంటుంది. భయం, విచారం, శారీరక బాధలు, నొప్పులు ఏమీ ఉండవు. అంతటా ప్రేమ నిండి ఉంటుంది. అన్నిటికీ మించి మేము ఎంతో

సుందరమైన ప్రదేశంలో ఉంటాం. సర్వశక్తిమంతుడైన భగవంతుని నియమాలు పాటించి ఉన్నత ఆవరణలకు రావడం శ్రేష్ఠం కాదా? అందువల్ల భూలోకంలోని ప్రజలారా, దైవనియమాలు పాటించడానికి బాగా ప్రయత్నించండి. తప్పు చేయకూడదని దృఢనిశ్చయం చేసుకోండి. దేవుడు మీ అందరినీ కరుణిస్తాడని మా నమ్మకం.

09-05-1981

కింది ఆవరణలు నిండిపోయాయి

ఇంతకుముందు చెప్పినట్లుగానే మీ తల్లిని మీరు ఎంపిక చేసుకుంటారు. కాని మీరు మళ్ళీ మళ్ళీ ఎందుకు పుట్టవలసి వస్తోంది? ఇన్ని జన్మలు ఎందుకు? **భూలోకంలోని మీకు మళ్ళీ మళ్ళీ జన్మించడానికి కారణం అనుభవం కోసం అని తెలుసు. కాని ప్రధాన కారణం ఆధ్యాత్మికంగా ఎదుగుతూ ఉన్నత ఆవరణలకు చేరడం కోసం.** ఉన్నతస్థాయికి చేరడానికి మీరు పునర్జన్మిస్తున్నారు. కాని మీరేం చేస్తున్నారు? దేవుడు భావించినట్లుగా పైకి ఎదగకుండా మీలో చాలామంది కిందికి పోతారు. మీ లోకాన్ని దుష్టులు పాలిస్తున్నారు. అందువల్లే భూలోకం నానాటికీ దుర్భరమైపోతోంది.

దుష్టాత్మలు ఎన్నడూ మంచిని కోరవు. మంచిని అణచివేయడానికి శతవిధాల ప్రయత్నిస్తాయి. ప్రతి వారిలోను చెడును బయటికి తేవాలని చూస్తాయి. ఇప్పుడు మీరున్న ప్రపంచం ఇది. మీ లోకాన్ని వీడి ఆత్మలోకానికి రాగానే, చెడ్డవారు, దుష్టులను వారి ఉపచేతనాత్మక మనస్సే కింది ఆవరణలకు తీసుకొనిపోతుంది.

కింది ఆవరణలు పూర్తిగా నిండిపోయాయి. ఉన్నత ఆవరణలో జనం లేరు. శతాబ్దం కిందట దీనికి పూర్తిగా భిన్నమైన స్థితి ఉండేది. ఎందరో సదాత్ములు మీ లోకంలోని వ్యతిరేక స్పందనలకు, ప్రభావాలకు లోనై కింది ఆవరణలలో పడిపోయారు.

ఏదోవిధంగా నయానో, భయానో తాము ధనవంతులై, కీర్తిప్రతిష్టలార్జించామని మీ లోకంలో జనం సంతోషంగా ఉంటారు. డబ్బు, సెక్స్, హోదాల కోసం ఏ పనైనా చేయడానికి వెనుకాడరు. ఆత్మలోకంలోకి వచ్చిన తరువాతే, తామే వర్గానికి చెందుతామో వారికి అర్థమవుతుంది. భూలోకంలో తామెంత తప్పు చేశామో వారు తెలుసుకుంటారు. వారికి ఎవరూ సలహా ఇవ్వలేదు, ఎవ్వరూ మార్గం చూపలేదు చివరికి సమయం మించిపోయింది.

బాగా దుష్టాత్ములైన కొందరు కింది ఆవరణలకు వెళ్ళడానికి జంకరు. వారి

హృదయాలు కూడా అంధకార ఆవరణలా ఉంటాయి. కాని దుష్టాత్ముల ప్రభావంతో చెడుగా మారినవారు బాగా వేదన చెందుతారు. వాళ్ళని చూసి మేము జాలిపడుతున్నాం. ఇంకా ఆలస్యం కాకముందే ఈ పుస్తకం చదవమని వారిని మేము కోరుతున్నాం.

10-05-1981

కొందరు చిన్నప్పుడే ఎందుకు చనిపోతారు!

మనము పై ఆవరణలకు వెళ్ళడానికి పునర్జన్మిస్తాము. మీ లోకంలో ఉన్న పాప ప్రభావం వల్ల భూలోకంలోని చాలామంది కింది ఆవరణలకు వెళతారు. ఇక్కడున్న సదాత్మలు భూలోకంలో జన్మించడానికి ముందు వందలాది సార్లు ఆలోచిస్తాయి. ఎందుకంటే నిజంగా దుష్టాత్మలు - దెయ్యాలు తప్ప ఎవరూ కింది ఆవరణలకు వెళ్ళాలని అనుకోరు.

చాలా సదాత్మలు మంచి చేయాలని మీ లోకంలో పునర్జన్మనిస్తాయి. మీ లోకంలోని చెడును ఎదుర్కొని సామరస్యాన్ని మంచితనాన్ని వ్యాపింపచెయ్యాలని వారు భావిస్తారు. కాని దురదృష్టవశాత్తు పాప ప్రభావం ఎంతగా ఉంటుందంటే, వారి ఉపచేతనాత్మక మనస్సు తనను మళ్ళీ వెంటనే ఇంటికి రప్పించమని సర్వశక్తిమంతుడైన భగవంతుని కోరుతుంది. వారు కింది ఆవరణలకు వెళ్ళడానికి ఇష్టపడరు. వారి ఉపచేతనాత్మక మనస్సులు తప్పు చేయడానికి అనుమతినివ్వవు - పాపంతో నిండిన లోకంలో ఎటు వెళ్ళాలో వారికి తెలిదు. అందువల్లే సదాత్ములు అసంతృప్తితో వేదన చెందుతూ ఉంటారు. **అందువల్ల వారికి తెలియకుండానే, వారి ఉపచేతనాత్మక మనస్సులు సర్వశక్తిమంతుడైన భగవంతుని తమ ఆధ్యాత్మిక గృహం, నిజనివాసానికి చేర్చమని ప్రార్థిస్తాయి.**

భూలోకంలోని వారు "చిన్న వయస్సులో చనిపోయేవారు దేవుడికి ఇష్టులు" అనో, "దేవుడు తాను ప్రేమించే చిన్నవారిని తొందరగా పిలుస్తాడు" అనో అనడానికి కారణమిదే.

తమ ఉపచేతనాత్మక మనస్సుల కారణంగా తప్పు చేయలేని, మీ పాపలోకంలో మంచిని బలవంతంగా నెరవేర్చలేని సదాత్ములకు ఏంచేయాలో పాలుపోదు. వాళ్ళు దేవుడిని "ఇదేనా నీ న్యాయం?" అని నిరంతరం అడుగుతూనే ఉంటారు. కాని ఉపచేతనాత్మక మనస్సుకు తప్పేమిటో తెలుసు - ఈ పాప లోకంలో సదాత్ములు ఉండలేరని దానికి తెలుసు. అందుకే చాలామంది సదాత్ములు రావలసిన సమయం కన్న ముందే ఇంటికి వచ్చేస్తారు. కేవలం కొందరు సదాత్ములే 90 ఏళ్ళో ఆ పైన జీవిస్తారు. దురదృష్టవశాత్తు వారెంతో బాధపడతారు.

దుష్టాత్ములకు మీ లోకం వదలి రావాలని ఉండదు. అందువల్ల వారు తమ భౌతిక శరీరాలను, భూలోకాన్ని జలగల్లా పట్టుకుని ఉంటారు. ఉపచేతనాత్మక మనస్సుకు అన్నీ తెలుసు కనుక, మీ లోకంలో మరణించాక వారెక్కడికి చేరతారో వారి ఉపచేతనాత్మక మనస్సుకు బాగా తెలుసు.

వారు తప్పు చేస్తున్నపుడు ఉపచేతనాత్మక మనస్సు వారిని నియంత్రించి, తప్పు చేయకుండా చూడాలని బాగా ప్రయత్నించడం విచిత్రం. కాని వారు మాత్రం ఉపచేతనాత్మక మనస్సు మాట వినరు. వారు పూర్తిగా దుష్టశక్తుల చేతిలో పడి అంధులైపోయారు. అటువంటివారు ఎన్నడూ భూలోకం వీడి రావాలనుకోరు. కింది ఆవరణలకు వెళ్ళాల్సి వస్తుందని భయపడతారు. వారి ఉపచేతనాత్మక మనస్సుకు అక్కడి పరిస్థితులు బాగా తెలుసు.

కొందరు సదాత్ములు భూలోకంలోనే ఉండాలనుకుంటారు. తమ ప్రియతములనెవరినో రక్షించడానికో, మంచితనాన్ని వ్యాపింపచేయమని కర్తవ్యం అప్పగించినపుడో ఇలా ఉంటారు. ఎన్ని కష్టాలు వచ్చినా వారు తమ భౌతిక శరీరాలనంటిపెట్టుకుని భూలోకంలోనే ఉంటారు. ఎన్నో కష్టాలు పడినా, దైవ నిర్దేశిత మార్గంలో నడిచేవారు చాలాకొద్దిమందే ఉంటారు. వారు చెడుతో పోరాడతారు కాని పాపం భూలోకంలో బాగా పెరిగింది కనుక వారేమీ సాధించలేరు.

సదాత్మలకు దేవుడిని "ఇదేనా నీ న్యాయం?" అని అడిగే ముందు ఈ పుస్తకంలో కొంత వివరణ లభిస్తుంది. మా పుస్తకం దుష్ట ప్రభావాల నుంచి రక్షించగల సదాత్ములకు చేరుతుంది. వారు మరింత కిందకు దిగజారకుండా ఇది ఆపుతుందని మా ఆశ. కొందరు చెడ్డ ఆత్మలు, కొందరు దుష్టాత్ములు ఈ పుస్తకం చదివి దీనిలో రాసినదంతా అర్థం లేనిదని కొట్టిపారేస్తారు అని మా నమ్మకం.

కొందరికి పునర్జన్మ ఉందని నమ్మరు. ప్రతి ఆత్మ తనను తాను పవిత్రం చేసుకొనడానికి వందలాదిసార్లు జన్మిస్తుంది. ఒకోసారి వేయిసార్లకన్నా ఎక్కువసార్లు జన్మిస్తుంది. కాని దురదృష్టవశాత్తు చాలా ఆత్మలు కిందికి వెళతాయి. 10 జన్మలు, 100 జన్మలు ఎత్తిన ఆత్మ ఒక్కటీ లేదు. చాలా వందల జన్మలలో మీరందరూ భూలోకానికి వస్తారు.

మీ జీవితాన్ని వివేకంతో జీవిస్తే అది మిమ్మల్ని కిందికి కాకుండా పైకి తీసుకెళుతుంది. అందువల్ల ప్రియమైన పాఠకులారా, సర్వశక్తిమంతుడైన భగవంతుని సంతోషపెట్టే విధంగా జీవితం గడపండి. గంటలకొద్దీ ప్రార్థన చేస్తే దేవుడు సంతోషిస్తాడని అనుకోవద్దు. చర్చిలకు, దేవాలయాలకు రోజూ వెళుతూ, వేలాది రూపాయలు దానధర్మాలు చేస్తే దేవుడు సంతోషించి మిమ్మల్ని స్వర్గానికి చేరుస్తాడని మీరు

భావిస్తారు. సర్వశక్తిమంతుడైన భగవంతునికి లంచమివ్వాలనే మీ ఉద్దేశ్యం నెరవేరదు. ఆయనకి ఎన్నడూ లంచమివ్వలేం. మీరు నిజాయితీగా ఉంటూ, మీ సమయాన్ని గాని, ధనాన్నిగాని బీదసాదలకు దయతో పంచితే, దేవుడి మీద భక్తి శ్రద్ధలతో మనస్సులో ఏ రకమైన కోరికలు లేకుండా సర్వశక్తిమంతుడైన భగవంతుని ప్రార్థిస్తే ఆయన అత్యంత సంతోషించి, స్వర్గంలో మీకు చోటుంచుతాడు. ప్రియమైన **పాఠకులారా, నిరాడంబరంగా, నిజాయితీగా, దయాహృదయంతో, నిస్వార్థజీవితాన్ని గడపండి.** శ్రద్ధ లేకుండా గంటల కొద్దీ ప్రార్థన చెయ్యడం, జనాన్ని మోసం చేయడానికి దానధర్మాలు చెయ్యడం, స్వర్గంలో స్థానం కావాలనుకోవడం, మీరెంత ధార్మిక హృదయం కలవారో ఇతరులు గ్రహించాలని పనులు చెయ్యడం ఏవీ పైన చెప్పిన దానికన్న ముఖ్యం కాదు.

11-05-1981

చెడు ఆత్మలు సదాత్మలను దారితప్పిస్తాయి

చాలా సదాత్మలు చెడు ఆత్మల ప్రభావానికి, మీ భూలోకంలోని చెడు మార్గాల ప్రభావానికి లోనై తప్పుదారిలో వెళ్ళాయి. ఇంక భూలోకంలోని వారు ఏది తప్పో, ఏది ఒప్పో తెలుసుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఆత్మలోకంలో ఉన్న మేము మీ లోకంలో మీ స్థితిని అర్థం చేసుకోగలం. చెడు మీ లోకాన్ని ఎంతగా ప్రభావితం చేసిందంటే సరైన దారిలో వెళ్ళడం మీకు చాలా కష్టమనిపిస్తుంది. దైవికమైన సన్మార్గంలో నడిస్తే కష్టపడవలసి వస్తుందని తెలిసిన ఎంతోమంది ఉన్నారు. అయినా వారు సన్మార్గాన్నే అనుసరిస్తారు. ఇది వారి గొప్పతనం.

దైవికమైన సన్మార్గంలో నడవాలనుకునే సదాత్మలు కూడా కొన్ని ఉన్నాయి. దుష్టాత్మలు, చెడు ఆత్మలు తమపై ప్రతీకారం తీర్చుకుంటారని, వేధిస్తాయని, హాని చేస్తాయని భయపడి వీరు సన్మార్గానికి దూరంగా ఉంటారు. ఈ ఆత్మలు తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే – భూలోకంలోని దుష్టవ్యక్తి చేతిలో అనుభవించే ప్రతీకారం, హానిలను నిమ్నావరణల్లో ఉండే స్థితితో పోల్చితే పెద్ద బాధ అనిపించదు. పునర్జన్మించడానికి ముందు ఆత్మలోకంలో తాము ఉన్నత స్థితికి చేరాలంటే భూలోకంలో వందలాది ఏళ్ళుండాలని, ఎన్నో జన్మలెత్తాలని వారు తెలుసుకోవాలి.

వారికేం లభిస్తుందో వారు గ్రహిస్తే, దుష్టశక్తి ప్రతీకారానికి, వేధింపుకు వారు భయపడరు. వారు ఈ విషయం తెలుసుకొనడం అత్యవసరం. ప్రియమైన సదాత్మలారా, కిందికి వెళ్ళకండి, చెడ్డ వ్యక్తుల చేతిలో మీరు కొన్నేళ్ళపాటు పడే హింస, కింది ఆవరణలలో వందలాది ఏళ్ళు పడే వేదనకన్న ఎంతో మెరుగు.

చెడు / దుష్టాత్మలను కింది ఆవరణలను గురించి మేమేమి రాశామో బాగా చదవమని కోరుతున్నాం. కొద్దిరోజులైనా అక్కడుండడం ఆషామాషీ కాదు - అటువంటిది వందలాది ఏళ్ళు ఎలా ఉంటారు? అయినాగాని ఇంకా మీరు చెడుమార్గంలోనే నడవాలనుకుంటే మీ ఇష్టం. ఇది మీ తప్పే- కాని మీతో పాటు ఇతరులను కిందికి తీసుకొని వెళ్ళవద్దు. ఇలా చేస్తే మీరు ఇంకా కష్టపడాలి. ఈ ఫలితం మిమ్మల్ని నిమ్నాతి నిమ్న ఆవరణలకు చేరుస్తుంది. మీ స్వార్థపూరిత ఉద్దేశ్యాల కోసం ఇతరులను బాధపెట్టకూడదు. దుష్టాత్మలు, చెడు ఆత్మలు బాగుపడడానికి ప్రయత్నించాలి. నిజాయితీగా పశ్చాత్తాపపడాలి. లేనిపక్షంలో అన్నిటికన్న కింది ఆవరణ ద్వారాలు వారికోసం బార్లా తెరిచి ఉంటాయి.

మీ లోకంలోని ప్రసిద్ధ వ్యక్తి ఆత్మలోకంలో ఉన్నతుడు కాకపోవచ్చు. ఇక్కడ ఒక బిచ్చగాడు మీ లోకంలోని రాజుకన్న గాని, ప్రసిద్ధ వ్యక్తికన్న గాని గొప్పవాడు కావచ్చు. **భూలోకంలోని కీర్తికి ఆత్మలోకంలో విలువలేదు.**

భూలోకంలో కొన్నాళ్ళపాటు వచ్చే కీర్తిని ఆస్వాదించడం కోసం భయంకరమైన నిమ్న ఆవరణలలో అంధకారంలో వందలాదిఏళ్ళుగా మగ్గిపోవడానికి ఎవరూ సిద్ధంగా ఉండరని మా విశ్వాసం. ఇతర ఆత్మలను కింది ఆవరణలకు లాక్కురాకుండా మీరు ఇతర ఆత్మలను కూడా పైకి తీసుకువెళ్ళడానికి ప్రయత్నించాలి.

వారిని కిందికి తెస్తే వారికన్న మీరెక్కువ బాధలనుభవిస్తారు. మీరు కిందికి తెచ్చిన ఆత్మ కూడా బాధపడుతుంది, కాని మీకన్న తక్కువ బాధపడుతుంది. మా సలహాని, మార్గదర్శకత్వాన్ని పాటించడం గాని, నిర్లక్ష్యం చేయడంగాని మీ ఇష్టం.

12-05-1981

మనస్సును నియంత్రించుకోండి

మీ భౌతిక శరీరం వల్ల భూలోకంలో మీ ఇంద్రియాల శక్తి తగ్గింది. ఆధ్యాత్మికతకు భౌతిక శరీరం అవరోధం. మీ ఆత్మకు, ఆత్మలోకానికి మధ్య ఉండే గోడ ఇది. ఇదే అతి పెద్ద అవరోధం. మీ ఆత్మకు ఎన్నో సమస్యలు తెచ్చిపెడుతుంది. అసూయ, ద్వేషం, కపటం, హిపోక్రసీ, భంగపాటు, ప్రతీకారం, అనారోగ్యం, నొప్పులు, శరీర బాధలు నుంచి మీకు విముక్తి ఉండదు. భౌతిక శరీరం జైలు. మీ ఆత్మ ఖైదీ. భూలోకంలోని వ్యక్తి ఈ ప్రతికూల భావాల నుంచి విముక్తి పొందడం కష్టం. మీరు చాలా పెద్దస్థాయిలో ఉంటే, మీ ఉపచేతనాత్మక మనస్సు సామాన్యుల మనస్సుకన్న చాలా తెరచుకొని ఉంటే తప్ప ఇది మీకు సాధ్యం

కాదు. మీకు నిజంగా ఉన్నతస్థాయిలో ఉండాలని కోరిక ఉంటే మీ భౌతిక మనస్సును నియంత్రించుకోగలరు. అది అదుపు తప్పకుండా నివారించగలరు. **మీకు మంచి సంకల్పశక్తి ఉంటే చెడు భావాలను నియంత్రించుకోగలరు. పాపాలు చేయరు.**

ఆరంభంలో ఇది అంత సులభం కాదు గాని ఒకసారి మీరు దైవిక సన్మార్గంలో నడపడం ఆరంభిస్తే దానంతటదే వస్తుంది. మీరు ఎన్నడూ తప్పు చెయ్యరు. ప్రియమైన పాఠకులారా, ముందుగా మీ చెడు ఆలోచనలను వీలయినంతగా నియంత్రించు కోవాలి. ఇలా చెయ్యగలిగారంటే, మీకు ఇలా ఉండడం సులువవుతుంది. తప్పు చెయ్యడానికి ఇష్టపడరు. కొన్నిసార్లు చెడు ఆలోచనలు వస్తాయి కాని తక్షణమే వాటిని అర్థం చేసుకుని, మిమ్మల్ని మీరు సవరించుకుంటారు. చెడు ఆలోచనలను ప్రయత్నపూర్వకంగా నియంత్రణలో ఉంచడానికి ఆరంభంలో బాగా ప్రయత్నించాలి.

ఆత్మలోకంలో భౌతిక శరీరం ఉండదు కనుక, మా మనస్సులను అత్యుత్తమ మార్గంలో నియంత్రించుకోగలం. ఉన్నత ఆవరణలలో ప్రతి ఆత్మ ఇటువంటి చెడు భావాల నుంచి విముక్తమై ఉంటుంది. మాకు అనారోగ్యాలు, నొప్పులు, బాధలు ఉండవు. కాని కింది ఆవరణలకు వెళితే, ద్వేషం, అసూయ, హింస, ప్రతీకార భావనలు చెడు ఆలోచనలతో నిండి ఉంటుంది. ఈ ఆవరణలలోని ఆత్మలు ఒక్కోసారి మనం ఊహించలేనంతగా పరస్పరం హాని చేసుకుంటాయి. వారి పాపాలకి చెడు సంకల్పానికి అంతులేదు. ఇతరులకు హాని చేయడంలో వారికానందం. బలహీనంగా ఉన్నవారికి హాని చేస్తే ఇంకా ఎక్కువ ఆనందం. బలహీన ఆత్మలు కింది ఆవరణలలో నరకం అనుభవించాలి. అక్కడ వందలాది ఏళ్ళు ఉండవలసి రావడం గురించి ఊహించు కోండి. ఏదైనా పనిచేసే ముందు బాగా ఆలోచించండి.

13-05-1981

ఆత్మలోకంలో మా భావాలు

భూలోకంలో మీకుండే భావాలన్నీ మాకూ ఉంటాయి. - ప్రేమ, అభిమానం, దయ - వారు ఆత్మలోకంలో ఉన్నా, భూలోకంలో ఉన్నా కాని మాకు ఇష్టమైన వారినే బాగా ప్రేమిస్తాం.

అపరాధ భావన, ద్వేషం, అసూయ వంటి ఉద్వేగాలతో మేము సతమతం కానవసరం లేదు. మా ప్రేమ స్వచ్ఛమైనది. నిజమైంది. మా ప్రియతములను మేము నిస్వార్థంగా ప్రేమిస్తాం. ప్రతిఫలంగా వారి నుంచి ఇంకేమీ కోరం. ప్రేమించడం కోసమే ప్రేమిస్తాము.

మాకు లైంగికచర్యతో నిమిత్తం లేదు. మా ప్రేమ శారీరకమైనది కాదు. పూర్తిగా ఆధ్యాత్మికం. లైంగికచర్య కోసం గాని, మరో బహుమతి కోసం కాని మేము ఆశించం. అందువల్ల మేమెవరిని ప్రేమించినా నిజంగా, గాఢంగా, నిజాయితీగా, బాగా తీవ్రంగా ప్రేమిస్తాం. మాకు స్వార్థపూరిత ఆలోచనలు ఉండవు కనుక భూలోకంలోకన్న సులువుగా క్షమించగలం. మేము ఎవరినీ ద్వేషించలేం. ఉన్నత ఆవరణలలో ఇలా జరగదు.

ఇక్కడ మాకన్న ఎంతో అధికులను కలిసినా మాకు అసూయ కలగదు. అసూయకు బదులుగా వారంటే ఆరాధన కలుగుతుంది. వారిలా కావాలని ప్రయత్నిస్తాం. భౌతిక శరీరాలను వీడినపుడు మా చెడు భావాలను వదిలివేస్తాం. కాని మంచి భావాలన్నీ మాతోపాటు ఆత్మలోకానికి వచ్చేస్తాయి.

కింది ఆవరణలలో ఉండే ఆత్మలు భౌతిక శరీరాన్ని వీడినా భూలోకంలో ఉన్న చెడు భావాలను అంటిపెట్టుకునే ఉంటాయి. కొన్నిసార్లు అవి మరింత ద్వేషపూరితంగా, ప్రతీకారేచ్ఛ, అసూయ కలిగి ఉంటాయి. తాము ఇంత కింది, అంధకార ఆవరణలో పడినందుకు దేవుడిని నిందిస్తూ ఉంటాయి.

జిమ్మీ కథ:

భూలోకంలో జనంపైకి కనిపించినట్లుగా లోపల ఉండరు

మా స్నేహితుడు జిమ్మీ అంకుల్ (ఆయన మీది గౌరవంతో మేము పేరు మార్చాం) కథ చెప్పాలనుకుంటున్నాం. భూలోకంలో ఉన్నపుడు ఆయన మంచి వక్త, అందగాడు. ఎవరికీ హాని చేయని వాడుగా, సదాత్మగా లోకానికి కనిపించేలా ఉండేవాడు. ఎంతోమందికి ఉద్యోగాలు, వస్త్రాలు, ఆహారం, ధనం ఇచ్చేవాడిలా మాకు కనిపించేవాడు. రోజూ గంటల కొద్దీ ప్రార్థన చేసేవాడు. ఆయన భార్య, పిల్లలు కూడా ఆయనలానే ఉండేవారు. ఆయన నిరంతరం తన భార్యను పొగుడుతూ ఉండేవాడు. ఆమె అందమైంది. తెలివి లేనిది. ఆయన పిల్లలు బట్టీ కొట్టి పరీక్షలు పాసయ్యేవారు. ఆయనకు వాళ్ళ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు. వాళ్ళ తెలివితేటలను మెచ్చుకొనేవాడు తరచుగా.

తండ్రిలానే కొడుకులూ. ఆయన పిల్లలు కూడా తండ్రి అడుగు జాడలలోనే నడిచారు. జనం అంతా వారిని పొగిడారు. వాళ్ళు చాలా ధనవంతులు, పేరు ప్రతిష్టలున్నవారు. అందుకని వారు నేరుగా స్వర్గానికి వెళతారని అందరూ అనుకునేవారు. వాళ్ళు మాకు బాగా తెలుసు. జిమ్మీ అంకుల్ చనిపోయినపుడు మేమింకా బ్రతికే ఉన్నాం. ఆయన

ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించాం. ఆయన భార్యని, పిల్లలను ఆయన స్వర్గానికి చేరి ఉంటాడని ఓదార్చాం.

మేమెంత బుద్ధిహీనులం! భూలోకంలో ఒక ఆత్మను ఎవరూ సరిగా అర్థం చేసుకోలేరు. మేము ఆత్మలోకంలోకి వచ్చిన కొన్నాళ్ళకు జిమ్మీ అంకుల్‌ను జ్ఞాపకం చేసుకున్నాం. మా ఆవరణలో వెదికాం (1981లో మేము 6వ ఆవరణలో ఉన్నాం). ఆయన కనబడ లేదు. ఆయన వంటి సదాత్మ అత్యున్నతమైన 7వ ఆవరణలో ఉంటుందని అనుకున్నాం. ఆయనను ఆశ్చర్యపరచాలనుకున్నాం కాబట్టి మా ఆలోచనలతో ఆయనని ముందు పిలవలేదు. 6వ ఆవరణలో ఆయన కనిపించలేదు కనుక మా ఆలోచనలను 7వ ఆవరణపై కేంద్రీకరించి "జిమ్మీ అంకుల్ మేము ఆత్మలోకంలో ఉన్నాం. 6వ ఆవరణకు వచ్చి మమ్మల్ని కలవండి" అని పిలిచాం. కాని మాకు బదులు రాలేదు.

"విస్పీ, ఆయన నిజంగా సదాత్మకదా 7వ ఆవరణను దాటి ఉంటాడు" అన్నాడు రతూ. "అయి ఉండవచ్చు మన ఉన్నత సదాత్మను అడుగుదాం" అన్నాను నేను.

మేము ఆత్మలోకానికి కొత్తగా వచ్చాము కనుక, ఆయన కోసం కింది ఆవరణలలో వెదకాలని మాకు తెలియదు. మేము ఉన్నత సదాత్మ వద్దకు వెళ్ళి జిమ్మీ అంకుల్ గురించి అడిగాం. దైవిక ఉన్నత సదాత్మ నవ్వుతూ "ఆయన 6వ ఆవరణలోనూ 7వ ఆవరణలోనూ లేదు. కింది ఆవరణలకు వెళ్ళినపుడు అక్కడ ఆయన కోసం వెతకండి" అన్నారు.

మేము ఆశ్చర్యపోయాం. "అసాధ్యం, అయ్యా, ఆయన సదాత్మ. మాకన్న ఎంతో మంచివాడు" అన్నాం. ఆయన చిరునవ్వుతో "అవునవును. నేనూ విన్నాను. అయినాగాని, నేను మిమ్మల్ని పని మీద కింది ఆవరణలకు పంపినపుడు అక్కడ ఆయన కోసం వెతకండి" అన్నారు.

మాకు బాధనిపించింది. దైవిక ఉన్నత సదాత్మకు జిమ్మీ అంకుల్ గురించి, ఆయన భూలోకంలో చేసిన మంచి పనుల గురించి అంతా చెప్పాలనుకున్నాం. కాని దైవిక ఉన్నత సదాత్మకు మాకన్న ఎక్కువ తెలుసునని మౌనంగా ఉండిపోయాం.

కొంతకాలం తర్వాత దైవిక ఉన్నత సదాత్మ మమ్మల్ని పిలిచి "మీ స్నేహితుడు జిమ్మీ అంకుల్ గురించి తెలుసుకోవడానికి మీకవకాశం ఇస్తున్నాను. నేను మీకో పని చెబుతున్నాను. కింది ఆవరణలకు వెళ్ళి మీ పని పూర్తి చేసుకుని, ఆయనను వెతికి పట్టుకోండి" అన్నారు. కింది ఆవరణలకు వెళ్ళి పని చేసుకురావడం మాకు సంతోషంగా అనిపించింది. 3వ ఆవరణలో మా పని పూర్తయ్యాక జిమ్మీ అంకుల్‌ని పిలిచాం. బదులు రాలేదు. మాకు సంతోషం కలిగింది. మా ఆవరణకు తిరిగి వచ్చి దైవిక ఉన్నత సదాత్మకు ఈ విషయం చెప్పాం.

దైవిక ఉన్నత సదాత్మ నవ్వి "విస్సీ, రతూ, మీరాయనను వెతికి పట్టుకోవాలని అనుకున్నాను. అలా జరిగితే మీకు బాగా మంచి జరిగే విషయం నేర్చుకుంటారు. నేను మీకు అనుమతిని, రక్షణను ఇస్తాను. 2వ ఆవరణకు వెళ్ళండి. ఆయనెక్కడున్నాడో కనుక్కుని, అక్కడెందుకున్నాడో అడగండి" అన్నారు. మమ్మల్ని ఎప్పుడూ 3వ ఆవరణ కన్న కిందికి ఎప్పుడూ పంపలేదు. మాకు బాగా ఆశ్చర్యమూ, భయమూ కలిగాయి. దైవిక ఉన్నత సదాత్మ మాకు రక్షణ ఉంటుందని హామీ ఇచ్చి కిందికి పంపారు.

రక్షణ దివ్యంగా ఉంది. ఎవరూ మమ్మల్ని చూడలేదు, హాని చేయలేదు. మేము జిమ్మీ అంకుల్‌ని ఆ చీకటిగా, భయంకరంగా ఉన్న ఆవరణలో వెదికేం. అక్కడాయనను ఆ స్థితిలో చూడడంతో దిగ్భ్రాంతి కలిగింది. ఆయన దిక్కుతోచక ఎంతో వేదన అనుభవిస్తు న్నాడు. మేము ఆయనకు మాత్రమే కనిపించాం. మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు. తాను ఎంత చెడ్డ ఆత్మో మాకు తెలిసిపోయిందని ఆయన చాలా సిగ్గుపడ్డాడు. "ఇక్కడికి వచ్చే పని ఏం చేశారు మీరు జిమ్మీ అంకుల్?" అని మేము అడక్కుండా ఉండలేక పోయాం. ఆయన తన కథ చెప్పాడు. అది చాలా భయంకరమైన కథ. జిమ్మీ అంకుల్ లాంటి మనిషి - పైకి ఎంతో పేరు, మర్యాద, మంచితనం - ఉన్నట్టు కనిపించే వ్యక్తి లోపల ఇంత భయంకరమైన వాడూ, అల్పుడా? అనిపించి ఆశ్చర్యపోయాం.

14-05-1981

జిమ్మీ కథ:

సర్వశక్తిమంతుడైన భగవంతుని మోసం చేయలేం

జిమ్మీ అంకుల్ చెప్పిన కథ ఎంత భయంకరమంటే దానిని నమ్మలేకపోయాం. జిమ్మీ అంకుల్ని మేము ఎప్పుడూ ఆదర్శప్రాయుడిగా భావించాం కనుక దీనిని నమ్మలేక పోయాం. ఎప్పుడూ దానధర్మాలు చేస్తూ, పేదలకు సాయం చేస్తూ అందరినీ ప్రేమిస్తూ, స్నేహంగా ఉండే మనిషి. జిమ్మీ స్వయంగా చెప్పిన తన కథ:

నా ప్రియమైన స్నేహితులైన విస్సీ, రతూ మీరు నన్ను ఎప్పుడూ సుందరమైన ఆత్మ అనుకున్నారు: లోకానికి నేను చూపినదంతా మీరు నమ్మారు. నేను కూడా నమ్మాను. నేను చేసిన ఘోర పాపాలను దేవుడు మన్నించాడని, అనుకున్నాను. భూలోకం వీడగానే స్వర్గానికి వెళ్ళాలని ఎన్నో మంచి పనులు చేశాను. దానధర్మాలు చేశాను. ఎన్నో మంచి పనులు చేశాను. నా పాపాలకు శిక్షపడకూడదని ఇవన్నీ చేశాను. కాని నాకేం

దక్కాలో అదే దక్కింది. నన్ను నేను మోసం చేసుకున్నాను. భూలోకాన్ని కూడా మోసం చేశాను. కాని దేవుడిని ఎవరూ మోసం చెయ్యలేరు. దేవుడిని ఎన్నడూ మోసం చెయ్యలేం.

"నేను మర్యాదస్తురాలైన, మంచి మహిళకు కుమారుడిని. ఆమె మనసులో చెడు ఆలోచనలే ఉండవు. నా తండ్రి దుష్టుడు; ఆయన మా అమ్మను వేధించి చెడుగా ప్రవర్తించమని బలవంతపెట్టేవాడు. ఆయన స్వార్థపరుడు మాతో క్రూరంగా ప్రవర్తించేవాడు. ఆయన మా అమ్మను, సోదరులను, చెల్లెళ్ళను, నన్ను తప్పు పనులు చెయ్యమని బలవంతపెట్టేవాడు. చాలాసార్లు మా అమ్మ బాధతో "ఇది తప్పు. మనం పాపం చేస్తున్నాం, ఇదంతా చాలా తప్పు" అంటూ ఏడుస్తుండడం నేను చూశాను.

"మా నాన్న ఇదంతా పిచ్చి అని కొట్టిపారేసేవాడు. కొన్నాళ్ళకు నేను, మా సోదరులు, చెల్లెళ్ళు అందరం క్రూరుడైన మా నాన్నను అభిమానించుతూ, మా అమ్మను పిచ్చిదని, బుద్ధి లేనిదని భావించడం ఆరంభించాం. మా మంచి, దయగల తల్లిని మేము గౌరవించకుండా ఆయన చూశాడు. మాకు ఆమె మీద ప్రేమ పోయింది.

"తన పిల్లలు తండ్రి అడుగుజాడలలో నడవడం చూసి మా అమ్మ ఎంతో వేదన చెందేది. ఒకరోజు నాతో మా అమ్మ ఇలా అంది. "జిమ్మీ, మీ నాన్న చెప్పే పనులు చేయకు. అలా చేయడం తప్పు. నువ్వు నా పెద్ద కొడుకువు గనుక మీ తమ్ముళ్ళను, చెల్లెళ్ళను కాపాడడానికి నాకు సాయం చెయ్యి".

నేను ఆమె చెప్పిన దానికి బాగా నవ్వాను. "మా అందరినీ భరించలేనంటున్నావు కదా. నువ్వే కొండమీద నుంచి దూకి చావరాదా?" అన్నాను. మేము ఒక లోయ సమీపంలో నివసించేవాళ్ళం. మా ఇంటి కిటికీలోంచి ఆమెకు లోయ లోపలి వైపుకు చూపిస్తూ "ఇలా చావడం నీకు సరైంది. మా నాన్న తెలివైనవాడు; ఆయనకి భార్యగా నువ్వు తగవు. నదిలో పడి చావు!" అన్నాను.

"ఆమె సరిగ్గా అలాగే చేసింది."

"మర్నాడు పోలీసులు మమ్మల్ని పిలిచారు. మా ఇంటికి దగ్గరగా నది ప్రక్కన ఆమె శవం దొరికింది. నాకు దిగ్భ్రాంతి కలిగింది. అయినా అప్పుడు కూడా ఆమెను తెలివి లేనిది, పిచ్చిది అనుకున్నాను. ఆత్మహత్య వంటి పాపాన్ని చేయకుండా నిగ్రహించుకోలేని బలహీనురాలు అని భావించాను. మా అమ్మ ఇంక తన విషయంలో కల్పించుకోలేదని మా నాన్న సంతోషించాడు."

"మాకు అచ్చమైన కుటిలులుగా ఉండే శిక్షణనివ్వడం ఆరంభించాడు. మా అమ్మ చనిపోయేంతవరకు ఆయనెంతటి దొంగో మాకు అర్థం కాలేదు. ఆయన మాకు అంతగా నచ్చాడు. ఆయన మాకిచ్చిన మంచి మంచి వస్తువులన్నీ ఆయన సాయం పొందినవారు ఇచ్చారని మేము అనుకునేవాళ్ళం. ఆయన మా మనసుల్ని ఎంతగా

మార్చాడంటే ఆయన్ని మేం పూర్తిగా నమ్మాం. ఎప్పుడూ ఆయన్ని ప్రశ్నించేవాళ్ళం కాము".

"జనాల్ని ఎలా మోసం చేసి వస్తువులు సంగ్రహించాలో ఆయన శిక్షణ నిచ్చాడు. మంచిమాటలతో, అమాయకమైన చూపులతో సదాచార పద్ధతిలో ఎలా మోసం చెయ్యాలో నేర్పాడు. ప్రపంచానికి, మేమందరం ఎంతో బాధ్యత గలవాళ్ళం. మంచివాళ్ళం, దయార్ద్ర హృదయులం. నిజాయితీపరులం. కాని అంతరంగంలో మేము కూడా మా నాన్నలాంటి దయ్యాలమే.

"మాకీ ఘోరమైన విషయాలన్నీ నేర్పాక, చివరికి ఆచూకీ వదలకుండా హత్య చేయడం కూడా నేర్పాక ఆయన విశ్రాంతి తీసుకున్నాడు. తాను కుటుంబ పెద్ద కనుక కొల్లగొట్టిన ధనం అంతా తనదేనని చెప్పాడు."

"వృద్ధులు, విధవరాళ్ళు లేదా ఒంటరి ఆడవాళ్ళను ఎలా మభ్యపెట్టి వారి ప్రేమను సంపాదించాలో మాకు నేర్పాడు. వాళ్ళతో కలిసి ఉంటూ వారికున్నదంతా దోచుకొని, వారిని పేదరికంలోకి, నిరాశా నిస్పృహల్లోకి ఎలా నెట్టాలో చెప్పాడు. ఇలా ఎంతోమంది ఆడవారిని మోసం చేశానని అయినా ఎన్నడూ పోలీసులు పట్టుకోలేకపోయారని గర్వంగా చెప్పాడు. వాస్తవానికి ఎవ్వరూ అతన్ని వేలెత్తి చూపలేదు. ఆయనెంత గొప్పవాడు, తెలివైనవాడు అయి ఇంత ధైర్యంగా పనిచేయగలిగాడు గనుక మేము కూడా ఆయనను ఉదాహరణగా తీసుకోవాలనుకున్నాం.

15-05-1981

జిమ్మీ కథ:

దైవన్యాయం జరిగి తీరుతుంది

"కొన్నేళ్ళపాటు మా నాన్న చెప్పినదే మేమందరం చేశాం. పెద్దవాడైన మా తండ్రిని పూజించాం. ఆయన మమ్మల్ని అంధకార కూపం లోపలికి తీసి కెళ్ళాడు. మేము చాలా సంతోషంగా, ఆయనను ఆరాధిస్తూ ఉండే వాళ్ళం. ఆయన మా మనసులను మార్చడంతో మేము సక్రమంగా ఆలోచించలేక పోయాం. మేమెంత దుర్మార్గులమో మాకు అప్పుడు తెలియలేదు."

"కొన్నేళ్ళు సంతోషంగా గడిచాక మా నాన్నకు జ్వరం వచ్చింది. ఆయన జబ్బుని డాక్టర్లు గుర్తించలేకపోయారు. రక్త పరీక్ష చేయించమన్నారు. ఆయనకు మధుమేహవ్యాధి ఉందని తేలింది. ఆహార నియమాలు కఠినంగా పాటించమన్నారు. ఆయనకు ఆరోగ్యంపై

శ్రద్ధ కనుక డాక్టర్లు చెప్పినట్టుగా చేశాడు. కొన్ని నెలలకు ఆరోగ్యం కుదుటపడింది. ఒకరోజు ఒంటరిగా బయటకు వెళ్ళాడు. ప్రమాదం జరిగింది. రెండుకాళ్ళు, ఒక చేయి తీసి వేయాల్సి వచ్చింది. మరో మార్గం లేదు."

"దైవన్యాయం ఆరంభమైంది, కాని తెలివిహీనులమైన మేము మాత్రం మా ప్రియమైన నాన్నను వేధిస్తున్నాడని దేవుడిని నిందించాం. కొన్నాళ్ళ తర్వాత డాక్టర్లు ఆయన ఊపిరితిత్తుల్లో కేన్సర్‌ను కనుక్కొన్నారు. అప్పుడు కూడా ముందులాగే దేవుడిని నిందించాం. మేం చేసే ఘోరాలు మాత్రం మానలేదు. మా నాన్నకు మా చెల్లెళ్ళు సేవ చేసేవారు. నొప్పి భరించరానిదైంది. ఆయన బలహీనుడైపోయాడు. నొప్పి భరించలేక మా చెల్లెళ్ళను కొరడాతో కొట్టేవాడు. తన బాధకు మేమందరం కారణమని మా అందరినీ తిట్టిపోసేవాడు."

"మేమాయనను నిర్లక్ష్యం చేశామని, మేము చాలా స్వార్థపరులమని అన్నాడు. మా నాన్న అనారోగ్యం బాధ గురించి తెలిసి మా పూజారి మా ఇంటికి వచ్చాడు. మా నాన్న ఆయనకు మామూలుగా స్వాగతం పలికాడు."

"నేనెవరికీ హాని చేయలేదు, మంచి పనులే చేశాను. అయినా నాకెందుకీ బాధ?" అని ఆయనను అడిగాడు. పూజారికి మా నాన్న ఎంత దుష్టుడో తెలియదు కనుక మా నాన్నను ఆరోగ్యవంతుణ్ణి చేయమని సర్వశక్తిమంతుడైన భగవంతుణ్ణి ప్రార్థించాడు. ఆ రోజు తర్వాత ఆయన ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకి వచ్చేవాడు. మేమందరం ఆయన రాకకు సిద్ధంగా ఉండి 5 గంటలకు కొంచెం ముందుగా మాత్రం సద్గుణ వంతులం, సదాత్ములంగా ఉండేవారం."

"ఒకనాడు పూజారి కొంచెం ముందుగా మా ఇంటికి వచ్చాడు. ఆ సమయానికి మా నాన్న మా చెల్లెళ్ళను తన కష్టానికి వాళ్ళే కారణమని అసహ్యమైన భాషలో తిడుతున్నాడు. అంతేకాకుండా చనిపోతున్న వృద్ధురాలొకామె ఎంత ఘోర బాధననుభవిస్తానని తనకు ఎన్ని శాపనార్థాలు పెట్టిందో చెబుతూ మళ్ళీ ఆమెను, తనను శపించిన ఎందరినో ఆయన శపించాడు."

"పూజారికి విభ్రాంతి కలిగింది – వెనక్కి తిరిగి మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. అతను తెలివైనవాడు, సదాచారపరాయణుడు – మా నాన్న దుర్మార్గుడని, మమ్మల్ని కూడా పాడుచేసి ఉంటాడని అతను ఊహించాడు."

16-05-1981

జిమ్మీ కథ:
దేవుడు చూస్తూనే ఉంటాడు

పూజారి నిజంగానే తెలివైనవాడు. నిజాయితీపరుడు. ఆయన ఒక పోలీసు అధికారితో మాట్లాడి మా కుటుంబం గురించి అంతా కనుక్కోమన్నాడు. పోలీసులు అంతా కనుక్కున్నారు. సమాచారం సేకరించారు కాని, దురదృష్టవశాత్తు వారికి సాక్ష్యం దొరకలేదు.

"వాళ్ళకి ఏం చేయాలో తెలియలేదు. ఈ లోపు మా నాన్న పరిస్థితి క్షీణించింది. శరీరమంతా భరించలేని నొప్పి. మధుమేహ వ్యాధి కూడా ముదిరిపోయింది. శరీరమంతా చర్మ వ్యాధి కూడా వచ్చింది. ఆయన కోపం బాగా పెరిగింది. ఆయన్ని చూడాలంటేనే భరించలేకపోయేవారం. ఆయన మమ్మల్ని తిడుతూ శపిస్తూ ఏది పడితే అది మా మీదకి విసిరేసేవాడు. మాకు తెలియకుండా పూజారి ఇదంతా బాగా గమనిస్తుండడంతో ఆయనకి తెలుసు. మా నాన్న పరిస్థితి బాగా దిగజారినపుడు, ఆయన మేమందరం ఇంటి దగ్గరున్నపుడు ఒకనాడు వచ్చాడు. మేమందరం ఆయన గదిలో ఉండడంతో నేరుగా ఆ గదిలోకే వచ్చాడు. "చూడండి, మీరో అద్భుతం చూస్తారు" అంటూ మా నాన్నని చూసి "శాంతంగా ఉండు. ఈ అద్భుతాన్ని చూడు" అన్నాడు.

మా నాన్న గిరాటు వేస్తాడనుకున్న వస్తువులనన్నిటిని పోగు చేసి మాకిచ్చి పక్క గదిలో పెట్టమన్నాడు, పూజారి మా నాన్నని ఏదో మహిమ చేసి బాగు చేస్తాడను కుంటూ మేమందరం వస్తువులన్నీ పక్కగదిలో పెట్టాం.

"గదిలో ఏదీ మా మీద గిరాటు కొట్టడానికి లేదని నిర్ధారించుకున్నతర్వాత మా అందరినీ మా నాన్న చుట్టూ కూర్చోమన్నాడు. ఆయన ఏదో మహిమ చూపి మా నాన్నను బాగు చేస్తాడనే ఉద్దేశ్యంలో మేమందరం ఉన్నాం. ఎంతోమందిని ఎన్నో ఏళ్ళపాటు మోసం చేసిన మమ్మల్నందరినీ మోసం చేసి అసాధారణ మహిమ చేస్తాడని మేము అనుకోలేదు.

"మేమందరం మా నాన్న మంచం మీద ఆయన చుట్టూ కూర్చున్నాం. పూజారి గది తలుపు దగ్గర నిలబడ్డాడు. పైకి వినబడేలా ప్రార్థన చేస్తున్నాడు. మా అందరికీ సాయం చేయడానికి తనకు సాయం చేయమని దేవుడిని కోరాడు. తరువాత కొంచెమాగి, మా నాన్న పాపాల క్రూర కథను చెప్పాడు. మా నాన్న అరుస్తూ, శపిస్తూ భయంకరమైన

భాషలో అతణ్ణి తిట్టాడు. మేమాయనను ఆపాలని చూశాం కాని ఆపలేకపోయాం. అప్పుడే పూజారి వెనుక తుపాకులు పట్టుకొని కొంతమంది పోలీసులు ఉండడం చూశాం."

"సర్వశక్తిమంతుడైన భగవంతుణ్ణి నిందించకు. పాపాత్ముడా! నీకిదే తగిన శిక్ష. నీ పాపాలకు తగిన ఫలితం అనుభవించు" అన్నాడు పూజారి. ఇంకా "నువ్వు చేసిన పాపాలకు నరకంలో ఎంత ఘోరమైన బాధలనుభవిస్తావో దేవుడికే తెలుసు. సర్వశక్తిమంతుడైన భగవంతుని నీవు మోసం చేయలేవు. మమ్మల్నందరినీ బాగా మోసం చేశావు. నీ పిల్లలను కూడా మోసం చేశావు. వాళ్ళను కూడా నీలాగ పాపాత్ములను చేశావు. నీ భార్య జీవితం నాశనం కావడానికి, ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి నువ్వే కారణం. ఆమెను నీ దారిలోంచి తప్పిస్తే, నీ పిల్లలపై ఆమె చెప్పే మంచిమాటల ప్రభావం పడదని, నిన్నెదిరించరని భావించావు. ఎవరికీ సాక్ష్యాలు దొరకకుండా జాగ్రత్తపడ్డావు కాని, సర్వశక్తిమంతుడైన భగవంతునికి సాక్ష్యాలు అవసరం లేదని మరిచావు. ఇదే దైవన్యాయం. పిల్లలూ! మీ చెడు మార్గాలు వదిలిపెట్టండి. మరీ ఆలస్యం కాకముందే పశ్చాత్తాపం చెందండి. సర్వశక్తిమంతుడైన భగవంతుడికి రుజువులు అవసరం లేదని గుర్తుపెట్టుకోండి, ఎప్పుడూ ఆయనను ఎవరూ మోసగించలేరు. ఎవరూ ఆయన న్యాయాన్నుంచి తప్పించుకోలేరు. అందుకే ఇంకా సమయం ఉండగానే మారండి, మీ నాన్న చూపిన చెడు మార్గం నుంచి మరలి దేవుడి మంచిమార్గంలో నడవండి. బాగా ఆలస్యం కాకముందే నిజాయితీగా పశ్చాత్తాపం చెందండి".

"తర్వాత ఆయన తలుపువేసి వెళ్ళిపోయాడు. నాన్నతో సహా అందరం నిశ్చేష్టుల మయ్యాం. ఒక గంటసేపటికి మా నాన్న తేరుకుని చిన్నపిల్లవాడిలా ఏడవడం మొదలుపెట్టాడు. "దేవుడా! నన్ను తగిన విధంగానే శిక్షించావు. నాకీ శిక్ష సరైంది. నన్ను క్షమించు దేవుడా! నేను తప్పు చేశాను. నా పాపపు జన్మ త్వరగానే ముగుస్తు న్నందుకు నాకు సంతోషంగా ఉంది. ఇంక నేనెవ్వరికీ హాని చెయ్యలేను. దేవుడా! నన్ను త్వరగా చంపెయ్" అన్నాడు.

"తర్వాత అపస్మారకంలోకి వెళ్ళిపోయాడు. జరిగిన సంఘటనలన్నీ చూసి మేము దిగ్భ్రాంతి చెందాం. ఇంక మా నాన్నకి స్పృహ రాలేదు. రెండు రోజుల తర్వాత చని పోయాడు."

"మేమందరం విచిత్రంగా స్పందించాం. దేవుడి తీర్పును అంగీకరించకుండా ఆయనను నిందించాం. మేం ఒకళ్ళనొకళ్ళు ద్వేషించుకుంటూ, అనుమానించడం మొదలు పెట్టాం. నా చిన్న సోదరుడు చిల్లిగవ్వ తీసుకోకుండా ఇల్లు వదిలి

వెళ్ళిపోయాడు. మా నాన్నకు పెద్ద కొడుకుగా నేనంటే చాలా ఇష్టం. డబ్బు నగలు అన్నీ నా చేతికిచ్చి రహస్యంగా దాయమనేవాడు. మా తమ్ముడు వెళ్ళిపోగానే ఆ ధనమంతా తీసుకుని నేను ఇల్లు వదిలి వెళ్ళిపోయాను. నా మిగిలిన తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఏమయ్యారో నాకు తెలియదు".

"నేను పేరు మార్చుకుని పెద్ద మొత్తంలో డబ్బు, నగలు పట్టుకుని బొంబాయి వచ్చాను. నా చెల్లెళ్ళకు, తమ్ముళ్ళకు ఒక్కపైసా[8] కూడ వదలలేదు. అంతా నేనే తీసుకున్నాను. నేను ధనవంతుడిగా బొంబాయి వచ్చాను. మీ అందరూ నన్ను గౌరవించారు. నా పని నిరాటంకంగా చేసుకొనడానికి అవకాశం ఉంటుందని అందమైన, తెలివిలేని ఆమెను కావాలనే ఉద్దేశ్యపూర్వకంగా పెళ్ళి చేసుకున్నాను. పూజారి కోరినట్టుగా నేను బాగుపడలేదు."

"నేను తరచుగా కాకుండా అప్పుడప్పుడు ఎవరికీ తెలియకుండా పనిచేసేవాణ్ణి. నేనేం చేస్తున్నానో నా కుటుంబానికి తెలియదు. బొంబాయిలో నేను ధనవంతుడైన గౌరవ నీయుడిని. ముక్కుసూటివాణ్ణి. కాని బొంబాయి విడిచిపెట్టి, నా భయంకర వ్యాపారాన్ని కొనసాగించడానికి రకరకాలుగా ప్రవర్తించేవాడిని. ధనవంతుడు, గౌరవనీయుడు, నిజాయితీపరుడైన జిమ్మీ అంకుల్, ఇతను ఒకరే అంటే ఎవరూ నమ్మలేరు".

"ఇది నా కథ. ఇప్పుడు మీకర్థమైందనుకుంటాను నేనెందుకు చీకటిగా భయంకరంగా ఉన్నచోట ఉన్నానని. నేను నా పాపాలు పోతాయని ఎన్నో దానధర్మాలు చేశాను. ఎన్నో మంచి పనులు చేశాను. తప్పకుండా స్వర్గానికి వెళతానని అనుకున్నాను. కాని దేవుడిని ఎవరూ మోసం చేయలేరు. అందుకని నేనిక్కడ ఉన్నాను."

17-05-1981

భూలోకం ఒక పాఠశాల

భూలోకంలోని వారు ఆత్మలోకంలో ఉన్న మాలాగ సామరస్యంగా ఉండరని మాకు తెలుసు. మీరు సదాత్ములతోను, పాపాత్ములతోను ఉండాలి. కనుక సామరస్యం కుదరదు; మాకు ఆ సంగతి తెలుసు. మనం సదాత్ములతోనే ఉందాం, పాపాత్ములతో వద్దు అని మీరనవచ్చు.

కాని సర్వశక్తిమంతుడైన భగవంతుడు కోరేది అది కాదు. కష్టపడేవారికి మీరు సాయం చెయ్యాలని ఆయన కోరిక. మీరు చెడును పారద్రోలి భూలోకాన్ని మెరుగు పరచాలని

8. పైస భారతీయ నాణెం. రూపాయిలో $1/_{100}$ భాగం

ఆయన కోరిక. ఒకప్పుడు మంచిగా ఉండి భూలోకంలోని ప్రతికూల ప్రభావాలకు లోనై చెడు మార్గంలో పయనిస్తున్న ఆత్మలకు మీరు సాయం చెయ్యాలని దేవుడి ఉద్దేశ్యం. వారు సన్మార్గాన్ని విడువరాదని, సన్మార్గాన్నే అంటిపెట్టుకుని ఉండాలని వారికి అర్థమయ్యేలా చెప్పండి.

సర్వశక్తిమంతుడైన భగవంతుడు తన తరఫున మీరు పని చేసి భూలోకాన్ని మంచి ప్రేమాస్పద ప్రదేశంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాడు. మీ విలువైన కాలాన్ని సదాత్ములతో గడుపుతూ వృథాగా వెచ్చించరాదని చెడ్డవారిని, పాపాత్ములను నిర్లక్ష్యం చేయరాదని ఆయన కోరిక. విలువైన సమయమని ఎందుకంటున్నామంటే, భూలోకంలో మీరు స్వల్పకాలమే ఉంటారు. ఆత్మలు ఆత్మలోకంలో ఎక్కువ కాలం ఉంటాయి.

ఎన్నడూ మీ సమయాన్ని వృథా చేసుకోకండి. ఒక నిర్దిష్టమైన పనిచేయడానికి, శిక్షణ పొందడానికి, అనుభవం గడించడానికి, కర్మను చెల్లించుకోవడానికి మిమ్మల్ని భూలోకానికి పంపారు. అందుకని సమయం ముగియక ముందే మీరేం చేయడానికి వెళ్ళారో దానిని పూర్తి చేయండి. అలా చేయని పక్షంలో మళ్ళీ అదే ఉద్దేశ్యం నెరవేర్చేందుకు పునర్జన్మించాలి. జీవితకాలం వ్యర్థమవుతుంది – లేదా అనారోగ్యం పాలైన భౌతిక శరీరంతో, నొప్పులు బాధలతో కర్మననుభవించడానికి కావలసిన దానికన్న ఎక్కువ కాలం బ్రతుకుతారు. అందువల్ల విలువైన కాలాన్ని వ్యర్థం చేయకండి. మీ పని తొందరగా పూర్తి చెయ్యండి. మీ సమయం పూర్తికాకముందే మీరు తిరిగి రావచ్చు. (మీ సమయం ఎప్పుడు పూర్తవుతుందో మీకు తెలియదు. మీ ఉపచేతనాత్మక మనస్సుకు మాత్రమే తెలుస్తుంది).

చెడ్డవారిని, ఇటీవలే చెడు మార్గం పట్టినవారిని బాగుపరచమని సర్వశక్తిమంతుడైన భగవంతుడు కోరుతున్నాడు. అందువల్ల నిస్వార్థంగా అవసరమైనవారికి, కష్టాలు పడుతున్నవారికి సాయం చెయ్యండి. మీరు భూలోకంలో ఉండడానికి ఇవే ప్రధాన కారణాలు. మీ బాధ్యతలు నిర్వర్తించండి ఇంక ఎన్నడూ మీరు బాధపడరు.

పునర్జన్మ ఉద్దేశ్యం

ఉన్నతస్థాయిలలో ఉన్న ఎన్నో ఆత్మలు మూడు కారణాల వల్ల భూలోకంలో జన్మిస్తాయి.

1. తమ ప్రియతములను కాపాడి సాయం చేయడానికి.
2. గత జన్మలలో మిగిలిన కర్మను అనుభవించడానికి.
3. ఆధ్యాత్మిక ధ్యేయాన్ని నెరవేర్చుకొనడానికి.

చెడు ఆత్మలను కర్మను చెల్లించుకోవడానికి భూలోకానికి పంపడం జరుగుతుంది. ఈ శిక్షను ధైర్యంగా, చిరునవ్వుతో అనుభవిస్తేనే తప్ప మీరు బాగుపడి ఉన్నత ఆవరణలకు చేరుకోలేరు. ఆశించినంతగా కాకపోయినా, ఆత్మలు తమ చెడు మార్గాలనుండి మరలడానికి, పశ్చాత్తాపపడడానికి, పైకి ఎదగడానికి వాటిని తిప్పి పంపడం జరుగుతుంది.

ఈ కారణాల వల్లనే మీరు భూలోకంలో ఉన్నారు. **ముఖ్యమైన కారణమేమిటంటే, మీ ఆత్మను పవిత్రీకరించుకొని ఉన్నతస్థాయికి ఎదగడానికి.**

భూలోకం ఒక శిక్షణ సంస్థ. చెడ్డ ఆత్మలు మంచివి కావాలి. మంచి ఆత్మలు మరింత మంచివి కావాలి, దుష్టాత్మలు తమ దుష్టమార్గాలను వదిలి మంచి మార్గంలో, దైవ నిర్దేశిత మార్గంలో నడవాలి. కాని ఈనాడు భూలోకంలోని చెడు ఆత్మలు మరింత చెడ్డవి అవుతున్నాయి. దుష్టత్వం బాగా పెరిగిపోతున్నది. ఆత్మసత్తలమైన మేము దీని గురించి బాగా చింతిస్తున్నాం.

18-05-1981

ఒక దుర్మార్గుని చేతిలో మోసపోయిన సదాత్మ

ఆత్మలోకంలో కొత్తవారికి మేం సంరక్షకులుగా కూడా ఉంటాం. ఒకోసారి నిమ్న ఆవరణల నుంచి ఏ ఆత్మ అయినా నిజాయితీగా పశ్చాత్తాపం చెంది ఉన్నతస్థాయికి రావాలని అత్యవసరంగా పిలుపునిస్తే, దైవిక అత్యున్నత సదాత్మ మమ్మల్ని నిమ్న ఆవరణలకు పంపవచ్చు. వీలైనంత ఉత్తమ మార్గంలో అతడు / ఆమె శిక్షను అనుభవించేలా మేము మార్గం చూపిస్తాం. బాగుపడి ఉన్నతస్థితికి చేరేలా సాయపడతాం. మాలాగే ఎందరో సహాయకులు ఉన్నారు. ప్రతిరోజూ ప్రతి సహాయకుడు ఇటువంటి కథలను వింటూనే ఉంటాడు.

నిమ్నావరణలలో మేము పనిచేస్తున్నప్పుడు ఎన్నో విషాదాత్మలను కూడా కలుస్తాం. వారు తాము అంధకారమయమైన నిమ్నావరణలో ఎందుకు పడ్డామా అని ఆశ్చర్య పోతుంటారు. వారికి అర్థమయ్యేలా చెప్పడానికి మేము శతవిధాలా ప్రయత్నించవలసి ఉంటుంది.

అలాంటి కథనొకదానిని మీకు చెబుతాం. అత్యవసరంగా పిలుపు రావడంతో దైవిక అత్యున్నత సదాత్మ మమ్మల్ని కింది ఆవరణకు పంపారు. ఒక స్త్రీ అత్యంత దయనీయ స్థితిలో ఉంది నిజంగానే. "నీ పిలుపునందుకొని వచ్చాం" అని ఆమెతో చెప్పాం. ఆమె మా వైపు చూసి "నాకు సాయం చెయ్యడం ఎవరికైనా సాధ్యమవుతుందా?" అని

అడిగింది.

"అవుతుందమ్మా! మీకు సాయం చేయడానికే మేం వచ్చాం"

"లేదు. నాకెవరూ సాయం చెయ్యలేరు. ఉపయోగం లేదు. వెళ్ళిపొండి".

"అమ్మా, మాతో సహకరించండి. మీ పరిస్థితి మెరుగవుతుంది. మా శక్తిమేరకు మీకు సాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాం" అని హామీ ఇచ్చాం.

చీకటితో, భయంకరంగా ఉన్న ఆ చోట ఆమె ఉండలేక "దేవుడా, నాకు సాయం చెయ్యి" అని బిగ్గరగా వేడుకొంది. బదులుగా మమ్మల్ని పంపడంతో ఆమె నిరుత్సాహ పడింది.

"నేను మీతో సహకరిస్తాను మీరేం చెబితే అది చేస్తాను. నన్ను ఈ భయంకరమైన చోటు నుంచి ఈ ఘోర ఆత్మల వేధింపునుంచి బయటకు తీసుకెళ్ళండి" అంది.

"మీరు సదాత్మలా ఉన్నారు. మరి మీరు పాపం చేయడానికి కారణమేమిటి? ఈ చీకటి ఆవరణలోకి వచ్చేంత పాపం ఏంచేశారు?"

"మీరు అనేది నిజమే. నేను సదాత్మనే కాని దురదృష్టవశాత్తు ఒక దుష్టాత్మతో ప్రేమలో పడ్డాను. అది నన్నిక్కడికి చేర్చింది".

"ఆమె తన వృత్తాంతం చెప్పసాగింది. అయితే తన కథ విన్నాక తనను ద్వేషించవద్దని కోరింది. మేము మిమ్మల్ని ఎప్పుడూ ద్వేషించం. మీకు సాయం చేయడానికి ప్రయత్నిస్తాం. అందుకోసమే మేమిక్కడకు వచ్చాం".

"నాకు 19 ఏళ్ళు. మా అమ్మానాన్నలు, తమ్ముడితో గ్రామంలో ఉండేదాన్ని. పాఠశాల విద్య పూర్తికాగానే, డాక్టరు కావాలనుకున్నాను. దానికోసం నగరంలోని విశ్వవిద్యాలయంలో చేర్పమని అమ్మానాన్నలను బ్రతిమాలాను.

నా దురదృష్టవశాత్తు వాళ్ళు ఒప్పుకున్నారు. ఎన్నో ఆశలు, ఆనందం, ఉత్సుకతతో నేను నగరానికి వెళ్ళి కళాశాలలో చేరాను. నేను అందమైనదాన్ని, బిడియం ఎక్కువ. చాలామంది అబ్బాయిలు నావెంట పడేవారు కాని నేనెవరినీ ప్రోత్సహించలేదు. చివరికి నేనొక అందమైన దుష్టుడి ప్రేమలో పడ్డాను. మొదట అతను నన్ను తప్పించుకోవాలని చూశాడు. అయినా తెలివి లేనిదానిలా నేనతనిపట్ల ఇంకా ఆకర్షితురాలినయ్యాను. మరింతగా వెంటపడేదాన్ని; అతన్ని పిచ్చిగా ప్రేమిస్తూ, ఎప్పుడూ అతని పక్కనే ఉండాలనుకొనేదాన్ని."

అతను దుష్టుడని తెలుసు. కొందరమ్మాయిలతో నోట్సులు రాయించుకొనడం, ఇతర పనులు చేయించుకొంటాడని తెలుసు. నాకు వాళ్ళంటే ఈర్ష్యగా ఉండేది. అతనికి

బానిసయ్యాను. బుద్ధిహీనురాలిలా నేను ఇష్టపూర్వకంగా నరకంలోకి దూకాను. అతను చెబితే చాలు వెంటనే ఆ పని చేసేసే దాన్ని. విచక్షణను కోల్పోయాను. ఇప్పటికీ అలా ఎలా చేశానా అని ఆశ్చర్యపోతాను. అతనేం చెబితే అది చేసేదాన్ని. అతని కోసం మత్తుమందులు తెచ్చేదాన్ని. అతను అనుభవించడానికి అమ్మాయిలను కూడా తెచ్చేదాన్ని. నేను రోబోలా అతనేం చెబితే అది చేసేదాన్ని. అతనికి ఏది సంతోషాన్నిస్తుందో, అది ఏదైనా సరే చేసేదాన్ని."

"అతను దుష్టుడని తెలిసినా, నేను చెడు మార్గంలో వెళుతున్నానని తెలిసినా, అతనికి బానిసలానే ఉండేదాన్ని. నేను చదువుమానేసి బ్యాంకులో క్లర్కుగా చేరాను. మా అమ్మానాన్నలకు చాలాకోపం వచ్చింది; ఆ అబ్బాయిని వదిలేసి, చదువుకోమని, లేకపోతే ఇంటికి వచ్చెయ్యమని అన్నారు. నేను ఏదీ వినలేదు అతనికి బానిసగానే ఉండిపోయాను.

అతను చెప్పిన పని చేసినందుకు ఎప్పుడైనా అతను నన్నొక్కసారి దగ్గరికి తీసుకుని, నాతో సంభోగిస్తే నాకు చాలనిపించేది. నేనెందుకంత పిచ్చిగా ప్రవర్తించానా అని ఇప్పుడు కూడా నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. అతను దుష్టుడని తెలిసినా అతనంటే నాకు పిచ్చి. మత్తుమందులు వాడేవాడు. అమ్మాయిలను మానభంగం చేసేవాడు - అయినా కాని అతని ఆజ్ఞలను నేను పాటించేదాన్ని. అతను నా జీవితాన్ని నాశనం చేస్తున్నాడని తెలుసుకోలేకపోయాను."

ఒకనాడు అనాకారి ధనవంతురాలైన అమ్మాయితో నన్ను స్నేహం చేయమన్నాడు. ఇలా అంతకుముందు చాలాసార్లు చేశాడు. నేనొకమ్మాయితో స్నేహం చేస్తాను. తర్వాత అతను ఆమెను ప్రేమించి, డబ్బు లాక్కుని వదిలివేస్తాడు. నేనీ అమ్మాయితో చిటికెలో స్నేహం చేశాను. త్వరలోనే ఆమెకు ఇతడిని మా కుటుంబ స్నేహితుడిగా, మా గ్రామంలో చాలా గౌరవనీయుడని, ధనవంతుడని చెప్పాను. ఇదంతా మామూలుగా ఎప్పుడూ జరిగేలానే జరిగింది. కాని కొద్దికాలం స్నేహం చేసిన తర్వాత వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకున్నారు. నేను షాక్ అయ్యాను. అయినా అతని ప్రభావం నా మీద బాగా ఉండడంతో, అతనికి బానిసలా ఉంటూ అతడు చేయమన్న పనులన్నీ చేశాను."

"అతనంటే నాకెందుకంత తన్మయత్వమో నాకు తెలియలేదు. నన్ను సమ్మోహితురాలిని చేశాడా? అతను చెడ్డవాడని తెలిసినా, నేను చేస్తున్నది తప్పని తెలిసినా ఎందుకు అతను చెప్పిన పనులు చేశాను? ఆ అమ్మాయిని అతను పెళ్ళి చేసుకోనడం నేను భరించలేకపోయాను. ఆమె బాగా ధనవంతురాలు. ఆమె తండ్రికి భార్యలేదు. ఆయన కూడా చాలా ధనవంతుడు. ఆయనతో స్నేహం చేసి ఆకర్షించమని అతను నాకు చెప్పాడు. నేనలాగే చేశాను. తర్వాత అతడిని పెళ్లి చేసుకోమని ఆజ్ఞాపించాడు.

నేనందంగా ఉండడంతో భార్యలేని ఆ మనిషి నా వలలో పడ్డాడు. నాకిష్టం లేకపోయినా నేనాయనను పెళ్ళి చేసుకున్నాను. ఆ దుష్టుడు తన పన్నాగం బయటికి కనిపించకుండా మంచి ప్రణాళిక రచించాడు".

"తర్వాత నా ముసలిభర్తని చంపమని ఆజ్ఞాపించాడు. నేను తిరస్కరించాను. దానితో నేను మత్తుమందులు చేరవేస్తానని పోలీసులకు రుజువులతో చూపిస్తానని నన్ను బెదిరించాడు. నేను చంపలేనని ఏడ్చి మొత్తుకున్నాను. బ్రతిమాలాను. కాని వాడి రాతి హృదయం కరగలేదు. నన్ను జైలులో పెట్టించగల ఫోటోలు, రుజువులు చూపించాడు. నేనెంత వెర్రిదాన్ని. ఇటువంటి దుష్టుడు నన్ను ప్రేమించి, పెళ్ళి చేసుకుంటాడని ఎలా నమ్మాను."

"చివరికి నా చేత నా భర్తను చంపించాడు. నేను ధనవంతురాలైన విధవనయ్యాను. అతని ఎస్టేటు సగం నా పేరు మీద, సగం అతని కూతురు పేరు మీద ఉంది. నా ప్రియుడు నరకం చూపిస్తుండడంతో నాకేం చేయాలో పాలుపోలేదు. నా భర్త చనిపోయాక ఆ హత్య చేసినందుకు నిద్రాహారాలు లేవు నాకు. ఎక్కడికైనా ఇతనికి కనిపించకుండా నా భర్త ఎస్టేటు నుంచి కొంత డబ్బు తీసుకుని, ఎక్కువశాతం అతని కూతురికి వదిలి పారిపోవాలనుకున్నాను. నా ప్రణాళికలు పూర్తికాకముందే తన భార్యను చంపమని ఆజ్ఞాపించాడు. నేను నిశ్చేష్టురాలినయ్యాను."

"నేను ఏడ్చి ఇదంతా చాలాదూరం పోతుందని వద్దని అతడిని బ్రతిమాలాను. నన్ను విడిచిపొమ్మని ఇవన్నీ ఇక నేను చేయలేనని ప్రాధేయపడ్డాను. అతని హృదయం కరగలేదు. అతను ఇంతకాలం ఏ రకంగా చూసినా సాక్ష్యాలు నాపై నేరం మోపేలా జాగ్రత్తపడ్డాడు. అతనికేమీ భయంలేదు".

"పోలీసులకు ఫోను చేసి నా భర్తను నేనే చంపానని చెబుతానని అన్నాడు. ఇంక బైటపడే మార్గం లేదు. కళ్ళు మూసుకుపోయి వాడిని ప్రేమించానని గుర్తించాను. వాడు చెప్పిందల్లా చేశాను. నన్నెంతగా ఇరికించాడో, నేనెంత దద్దమ్మనో అర్థమైంది. ఇంక తప్పించుకునే మార్గం లేదు. నా భర్తని చంపానని పోలీసుల ముందు ఒప్పుకోవలసిందే. నా సవతి కూతురిని చంపడం కన్న ఇదే నయం. పోలీసులను పిలవవద్దని ఆమెను చంపుతానని చెప్పాను. మర్నాడు ఉదయమే వెళ్ళి పోలీసులకు అంతా చెప్పెయ్యాలని మనసులో అనుకున్నాను. 'ఓకె. రేపు నా ప్లాను ప్రకారం ఆమెని చంపు' అన్నాడు. పోలీసులకు ఏం చెప్పాలా అని నేను ఆలోచిస్తూ అతనికి సమాధానం చెప్పలేదు. 'ఏమాలోచిస్తున్నావ్. ఉన్నాగాని నీ తెలివిని ఉపయోగించకు. నేను చెప్పినట్టుగా చెయ్యి' అని అతను వెళ్ళిపోయాడు.

"ఆ రాత్రి అతను తన భార్యను చంపేశాడు. కాని పోలీసులకు మాత్రం నేనే నా భర్తను, అతని కూతురిని చంపానని చెప్పాడు. ఇంక మీదట నేను అతనికి బానిసగా ఉండనని అనుకున్నాడేమో. నేను అతను చెప్పినదానికి అంగీకరించకపోవడంతో తన ప్లానుకు వ్యతిరేకంగా ఏమైనా చేస్తానేమోనని నన్ను దోషిగా చూపేలా సాక్ష్యాలుండేలా చూశాడు."

"మర్నాడు ప్రొద్దున్నే నేను పోలీసుల దగ్గరకు వెళ్ళకుండానే, వాళ్ళే వచ్చి నన్ను అరెస్టు చేశారు. విచారణ సమయంలో నన్ను జైలు నుంచి కోర్టుకు తీసుకువెళ్ళారు. నేనెలాగో తప్పించుకుని ఆరో అంతస్తుకి వెళ్ళి ఆత్మహత్య చేసుకున్నాను."

"ఇప్పుడు మీకర్థమైందనుకుంటాను నేనెందుకు ఇక్కడున్నానో. నా కథంతా విన్నారు గదా. నాకు సాయం చెయ్యడం వీలవుతుందా? దయచేసి, నన్ను ద్వేషించకండి".

"మేము మిమ్మల్ని ద్వేషించడం లేదు. నిజంగా పశ్చాత్తాపపడుతున్నారా? చెప్పండి" అన్నాం.

ఆ ప్రశ్న వెయ్యనవసరం లేదు. ఆమె నిజంగానే పశ్చాత్తాపపడుతోందని మాకు అర్థమైంది. కాని ఆమెను మేము వెంటనే ఉన్నత ఆవరణకు తీసుకొని పోలేము. ఆమె నిజంగా పశ్చాత్తాపం చెందుతుందో లేదో చూడడానికి మమ్మల్ని పంపారు, ఆమె నిజంగానే పశ్చాత్తాపపడుతుండడం మేము చూశాం.

"అవును. ఇప్పటికే ఆలస్యమైందా? నాకు సాయం చెయ్యగలరా?" అని అడిగింది.

ఆమె 4వ ఆవరణకు ఎలా చేరాలో మార్గం చూపాం. అయితే ఈ ప్రక్రియ చాలా నెమ్మదిగా ఉంటుంది. ఇప్పుడు ఆమె మా మార్గదర్శకత్వంలో ఉన్నతస్థితికి వెళ్ళడానికి ప్రయత్నిస్తోంది.

19-05-1981

మీ ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణంగా ఉండవచ్చు

ఆత్మసత్తలమైన మేము ఎన్నో వింత కథలను వింటుంటాం. అలాంటి చాలా కథలను మీకు చెప్పాలని ఉంది కాని, అలా చెబితే ఎన్నో సంపుటాలు అవుతాయి. అందుకని కొన్ని రకాల వ్యక్తులు మీలోకంలో ఉంటారని చెప్పడానికి వీలయ్యే కథలను ఎంపిక చేశాం. అటువంటి వారి చేతిలో మోసపోకుండా, వారి

దుష్టప్రణాళికల్లో పాలు పంచుకోకుండా మీరు జాగ్రత్తగా ఉండాలి. భూలోకంలో ఎవరిపైనా గుడ్డినమ్మకం పెట్టుకోవద్దు. అందుకనే ఈ వాస్తవ కథలను కొన్నిటిని మీకు చెప్పాలనుకుంటున్నాము.

పైకి మంచిగా ఉంటూ, లోపల క్రూరంగా ఉండి సర్వశక్తిమంతుడైన భగవంతుడిని మోసం చేయలేరని కూడా మీరు గ్రహించాలి. దేవుడు అందరితోనూ న్యాయంగానే ఉంటాడని గుర్తుంచుకోండి. అయినాగాని ప్రజలు చెడుమార్గాల్లోనే నడవడం వింతగా అన్పించదా?

ఒక మనిషి అంతరాత్మ అతడిని ఎందుకు ఆపదు? అని మేము తరచుగా ఆశ్చర్య పోతుంటాం. చాలామంది చెడ్డ మనుషులు భయంకరమైన పాపపు పనులు చేస్తుంటారు. లోకాన్ని మాత్రం తామెంతో అమాయకులమని నమ్మిస్తుంటారు. వారి అంతరాత్మను ఏదీ ప్రభావితం చెయ్యలేదు. మీకూ ఇదంతా ఎలా జరుగుతుందని అనిపించవచ్చు. మేము ఇదెలా జరుగుతుందో వివరిస్తాం.

మీరు అమాయకులైన పిల్లలుగా ఉన్నప్పుడు మీ అంతరాత్మగానీ, ఉపచేతనాత్మక మనస్సు గానీ మీకు స్వేచ్ఛగా దారిచూపుతాయి. **ప్రతికూల ప్రభావాలు పడి మీరు చెడుగా ప్రవర్తిస్తుండడం ఆరంభం అవగానే గాని, ఎవరైనా చెడ్డ వ్యక్తి శిక్షణలో ఉన్నప్పుడు గాని మీ ఉపచేతనాత్మక మనస్సు గట్టిపడిపోతుంది – అది నిశ్శబ్దంగా, నిద్రపోతూ నిద్రాణమైపోతుంది.**

మీ ఉపచేతనాత్మక మనస్సు మీరు చెడ్డ పనులు చేయడానికి అంగీకరించదు. కాని మీరు (మీ జాగరూక లేదా భౌతిక మనస్సు) ఉపచేతనాత్మక మనస్సు మాట వినరు. చెడు మార్గాలనే కొనసాగిస్తారు. మీ ఉపచేతనాత్మక మనస్సు దీనిని భరించలేదు. అందువల్ల అది మీ చెడు పనులు, చెడు అలవాట్లలో జోక్యం చేసుకోకుండా నిద్రపోతూ ఉంటుంది.

మీరు ఉన్నత ఆవరణ 6లోగాని 7లోగాని ఉన్నారనుకోండి. మీ ఉపచేతనాత్మక మనస్సు మిమ్మల్ని ఎన్నడూ బాగా తప్పుదారిలో నడవనివ్వదు. మీరు ఒక పరిమితి దాటితే, అది మీకు తెలియజేస్తుంది. దాని మాట వినకపోతే (మీరు బాగవకపోతే) ఉపచేతనాత్మక మనస్సు సర్వశక్తిమంతుడైన భగవంతుని అనుమతితో మిమ్మల్ని తిరిగి ఆత్మలోకంలోకి పంపుతుంది. 6, 7 ఆవరణలలోని ఆత్మలు ఎన్నడూ 1,2,3 ఆవరణలకు పడిపోవు. అంటే వారు ఒక పరిమితి వరకు తప్పు చేయవచ్చు. కాని ఆ పరిమితిని దాటి ఎన్నడూ తప్పు చెయ్యలేరు. 6, 7 ఆవరణలలో పుట్టిన ఆత్మలకు అప్రమత్తమైన ఉపచేతనాత్మక మనస్సు ఉంటుంది. అది వారిని వరుసగా 4, 5 ఆవరణలను దాటి కిందికి పోకుండా చూస్తుంది. (6వ ఆవరణలో పుట్టిన ఆత్మ

4వ ఆవరణకే వెళ్ళగలదు. 7వ ఆవరణలో పుట్టిన ఆత్మ 5వ ఆవరణకే వెళ్ళగలదు) కాని 5వ ఆవరణలో గాని దాని కింది ఆవరణలలోగాని పుట్టినవారికి చాలా ప్రమాదం. భూలోకంలో ఒక జీవితకాలంలోనే వారు 1వ ఆవరణ వరకూ కిందికిపడిపోయే ప్రమాదం ఉంది.

అందువల్ల వారు ఉపచేతనాత్మక మనస్సు మాట వినకపోతే, దానిని నిద్రపోనిస్తే చాలా ప్రమాదం. మొదట్లో మీ ఉపచేతనాత్మక మనస్సు చాలాచాలా గట్టిగా మిమ్మల్ని తప్పు చెయ్యకుండా ఆపాలని ప్రయత్నిస్తుంది. అయితే ఒక దశ వరకు చూసి అది విసుగు చెంది, మీ పాపపు జీవితం పూర్తయ్యేవరకు నిద్రిస్తుంది.

తర్వాత ఎవరైనా తప్పు చేస్తే, "వాళ్ళకి అంతరాత్మ లేదా?" అని ఆశ్చర్యపోనవసరం లేదు. మీకే సమాధానం తెలుసు; వారి ఉపచేతనాత్మక మనసు నిద్రపోతూనో, నిద్రాణంగానో ఉంటుంది. మళ్ళీ చెబుతున్నాం. 5వ ఆవరణలో గాని, అంతకంటె కింద గాని ఉన్నవారికి ఈ సమస్య ఉంటుంది. – ఈ సమస్య ఎలాంటిదంటే ఇది మీ జీవితాన్ని వందల ఏళ్ళ పాటు నాశనం చేస్తుంది. మీరు అత్యంత బాధపడవలసి వస్తుంది.

అంతరాత్మకు వ్యతిరేకంగా ప్రవర్తించకుండా ఉండడం మంచిది కదా? "రెండు మూడుసార్లు ఫరవాలేదు కదా" అని మీరనవచ్చు. ఆ రెండు మూడుసార్లే మిమ్మల్ని ఆరు, ఎనిమిది సార్లకు పురికొల్పుతాయి. అప్పటికి చాలా ఆలస్యం అయిపోతుంది. ఈ విషయాలన్నీ మీరు అర్థం చేసుకోవాలి, ఒకవేళ మీరు కింది ఆవరణలకు పడిపోయినా అప్పుడు మిమ్మల్ని పైకి రప్పించే ఆస్కారం ఉంటుంది.

మీ ఉపచేతనాత్మక మనస్సు ఇప్పుడు నిద్రాణంగా ఉండి మీరు తప్పు పనులు చేస్తుంటే, మీకు తప్పేదో, ఒప్పేదో తెలుసుకునే తెలివితేటలు ఉన్నాయని మా నమ్మకం. తప్పు మార్గంలో నడవడం మానండి. ఏకాగ్రత, ధ్యానాలతో నిద్రాణమైన మీ ఉపచేతనాత్మక మనస్సును మేల్కొలపమని సర్వశక్తిమంతుడైన భగవంతుడిని వేడుకోండి.[9]

దీనిని ప్రతిరోజూ చేయండి. **సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మాత్రమే. సూర్యాస్తమయం తర్వాత చేయవద్దు.** దేవుడిని రెండు నిముషాలపాటు ప్రార్థించండి. తర్వాత నిద్రాణమైన మీ ఉపచేతనాత్మక మనస్సును జాగృతం చేయడానికి సాయపడమని సర్వశక్తిమంతుడైన భగవంతుని వేడుకోండి.

"సర్వశక్తిమంతుడైన భగవంతుడా, నీ మంచి మార్గానికి నాకు దారిచూపు. మంచి పనులు చేసేలా చెయ్యి. నాకున్న తప్పుడు కోర్కెలు, భావాలు పోగొట్టుకొనేలా సహకరించు. నీ వివేకాన్ని నాకు ప్రసాదించు; నీ వెలుగు మార్గాన్ని చూపించు

9. చూడండి: "మీ ఉపచేతనాత్మక మనస్సును మేల్కొలపండి" పుట. 62

నాకు. ఎన్నడూ తప్పు చేయకుండా నా ఉపచేతనాత్మక మనస్సును మేల్కొలపటానికి నాకు సాయం చెయ్యి. ఓ సర్వశక్తిమంతుడైన భగవంతుడా, దయచేసి నాకు సాయం చెయ్యి."

ఇలా చేసిన తర్వాత మీ మనస్సును పూర్తిగా ఖాళీగా ఉంచుకోండి, మీ మనస్సులోకి ఎలాంటి ఆలోచనలు రాకూడదు. ఒక్క నిముషం పాటు మాత్రమే ఖాళీగా ఉంచాలి. (ఒక నిముషం కన్నా ఎక్కువసేపు మనస్సును ఖాళీగా ఉంచితే, ప్రతికూల ప్రేతాత్మ ఏదైనా మీకు హాని చేయవచ్చు) ఇలా చేస్తే మీకు అంతా బాగుంటుంది. మీ ఏకాగ్రత పూర్తయిన తర్వాత దేవుడికి కృతజ్ఞతలు సమర్పించి ఆ రోజు పనులను ప్రారంభించండి.

ఇది మీకు బాగా సాయం చేస్తుంది. దీనివల్ల మీకు ధనం, ప్రాపంచిక విజయం లభించదు. కాని ప్రశాంతంగా, మౌనంగా, ఆందోళన లేకుండా, సంతోషంగా ఉండడానికి ఇది సాయం చేస్తుంది. మరీ ముఖ్యంగా, ఇది మీ ఉపచేతనాత్మక మనస్సును బాగు చేసి మీరు ఉన్నత ఆధ్యాత్మిక స్థాయికి చేరడానికి తోడ్పడుతుంది.

20-05-1981

మీ ఉపచేతనాత్మక మనస్సును మేల్కొలపండి

ఆత్మ చెడుమార్గంలో నడవడం చూసి ఉపచేతనాత్మక మనస్సు భయపడుతుంది. ఇది చూసి భరించలేక నిద్రపోతుంది. దానితో ఆత్మను ఆపేశక్తి దానికి పూర్తిగా పోతుంది. మీ లోకంలో ఇప్పుడు చాలాకొద్దిమందిలో మాత్రమే ఉపచేతనాత్మక మనస్సు మేల్కొని ఉంటుంది. చాలామందిలో ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణంగా ఉండి మేల్కొనడానికి నిరాకరిస్తుంది.

ఉపచేతనాత్మక మనస్సును ఎలా మేల్కొలపాలో మేము మీకు చెప్పాం. మీరు వినకుండా అది నిద్రలోకి జారిపోయేలా చేశారా – ఇప్పుడు దానిని మేల్కొలపవలసిన సమయం ఆసన్నమైంది. దీనికి కొంతకాలం పడుతుంది కాని, మా సూచనలు నిజాయితీగా పాటించండి. మీ ఉపచేతనాత్మక మనస్సు మేల్కొని మీకు మార్గదర్శకం చేయాలి. దానితో మాట్లాడండి, బ్రతిమాలండి, మళ్ళీ పనిచేయడం మొదలుపెట్టమని వేడుకోండి.

ఉపచేతనాత్మక మనస్సును మళ్ళీ పనిచేసేలా చేయడం బృహత్తరకార్యం. అయినాగాని మీరా పని తప్పనిసరిగా చెయ్యాలి. దానిని తప్పించుకుని, నిర్లక్ష్యం చేసి, బయటికి రానివ్వకుండా మీరు తప్పు చేశారు. వెంటనే దానిని మేల్కొలిపే ప్రయత్నం చేయండి. అది మిమ్మల్ని మరింత కిందికి పడకుండా ఆపి, ఉన్నతస్థాయికి చేరుస్తుంది.

కొందరు ధ్యానం అంటారు, కొందరు ఏకాగ్రత అంటారు, కాని మీరు మీ మనస్సును ఒక నిముషంపాటు పూర్తిగా ఖాళీగా ఉంచండి. ఆరంభంలో ఇది చాలా కష్టమని పిస్తుంది కొందరికి. కాని రోజూ చేస్తూ ఉంటే అలవాటైపోతుంది. తేలికవుతుంది, ఆలోచించడం మానివేయండి అంతే. ఒకవేళ మనసులోకి ఆలోచనలు జొరబడుతున్నా, అవి సహజంగా ఆగిపోయేవరకు వాటిని పట్టించుకోవద్దు.

మీకు చాలా శబ్దాలు వినిపిస్తాయి. దూరంగా ఉన్నవి కూడా. శబ్దాలు మరింతగా వినిపిస్తాయి. కాని మనసులోకి ఏ ఆలోచనలూ రానివ్వవద్దు. మీ మనస్సు పూర్తిగా ఖాళీగా ఉండాలి; అన్ని ఆలోచనలను తోసెయ్యండి. ఇది మీ పురోగతికి చాలా సాయం చేస్తుంది.

ఒకసారి మీ లోకాన్ని, భౌతిక శరీరాన్ని వీడిన పిమ్మట ఆత్మలోకంలో ఉన్నతస్థాయికి చేరడం చాలా కష్టం. నిదానంగా జరుగుతుంది. భూలోకంలో త్వరితంగా పురోగతి సాధించగలరు. చెడు మార్గాల నుంచి వెనక్కు రావచ్చు. నిముషాలలో మంచిగా మారవచ్చు. మీ కర్మను మాత్రం అనుభవించాల్సిందే. దేవుడు సాయం చేస్తాడు కనుక ఇది అంత కఠినంగా ఉండదు. దీనిని అనుభవించడానికి తగిన శక్తి, ధైర్యము మీకు లభిస్తాయి.

ఆత్మలోకంలో మీ పురోగతి చాలా చాలా నిదానంగా ఉంటుంది. కాని తప్పనిసరిగా ఉంటుంది. మీరు చేసిన ప్రతి పాపానికి శిక్ష ఉంటుంది. దానిని తప్పించుకోలేరు.

అందువల్ల బాగా ఆలస్యం కాకముందే బాగా ఆలోచించండి. మీ లోకాన్ని, భౌతిక శరీరాన్ని వీడి రాకముందే చెడునుంచి మంచికి మారడానికి ఎన్నో అవకాశాలుంటాయి. ఈ అవకాశాలను బాగా ఉపయోగించుకొంటే ఆత్మలోకంలో మీకు పడే శిక్ష తేలికగా ఉంటుంది. 1,2,3 ఆవరణలలో పడకుండా కనీసం మీరు 4వ ఆవరణకు వస్తారు. బాగా ఆలోచించండి. తక్షణమే బాగుపడితే ఎంతోమంచిదని మీరు గుర్తిస్తారు.

21-05-1981

సతీష్ వృత్తాంతం

బాగుపడడానికి ధైర్యం కావాలి

ఆత్మలు చాలా బలహీనంగా ఉండి తమ పద్ధతిని మార్చుకొనడానికి భయపడే కేసులు చాలా ఉన్నాయి. తమ సహచరులు వెక్కిరిస్తారనో, బెదిరిస్తారనో భయపడి వారు మంచిగా మారరు. ఇంకా మంచివారు తమను స్వాగ

తించరనో, నిర్లక్ష్యం చేస్తారనో, అవమానిస్తారనో అనుకుంటారు, తమ జీవితం నిరాశాపూరితమని అనుకుంటారు.

ఇక్కడ నిజంగా జరిగిన కథ చెబుతున్నాం. అతని పేరు సతీష్. మీరెంత తప్పుగా భావించగలరో ఈ కథ చెబుతుంది. సతీష్ సదాత్ముడు. కాని బాల్యంలో ఎన్నో చెడు ప్రభావాలు అతనిపై పడ్డాయి. అతని తల్లి ముప్ఫయ్యేళ్ళలోనే మరణించింది. అప్పటికి సతీష్ వయస్సు అయిదేళ్ళు. తండ్రి అతనిని ఒంటరిగానే పెంచాలని భావించినా, అలా చెయ్యలేక, కొడుకు కోసమేనని రెండో పెళ్ళి చేసుకున్నాడు. కాని అది పూర్తిగా అబద్ధం.

సవతి తల్లికి సతీషంటే అయిష్టం. అతడిని చూసిన మొదటి రోజు నుంచే అతడంటే ద్వేషం ఆమెకి. కాని సతీషంటే ద్వేషమని భర్తకి తెలియనివ్వలేదు. తనకు సొంతపిల్లలు పుట్టగానే, సతీష్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అతడు మాట వినడం లేదని, తన పిల్లలపై చెడు ప్రభావం పడుతుందని చెప్పి, చౌకబారు బోర్డింగు స్కూల్లో చేర్పించింది.

బోర్డింగు స్కూలు భయంకరంగా ఉండడంతో, సతీష్‌కు చెడు స్నేహాలయ్యాయి. వారి చెడు అలవాట్లు పద్ధతులు అబ్బాయి. సతీష్‌కు స్కూలు చదువు పూర్తయ్యేసరికి తండ్రి చనిపోయాడు. చిరునామా కూడా ఇవ్వకుండా సవతి తల్లి ఊరు వదిలి వెళ్ళిపోయింది. అతను ఒంటరైపోయాడు. డబ్బులేదు. చూసేవాళ్ళూ లేరు. దానితో అతను స్కూల్లోని దుష్ట స్నేహితులపైనే ఆధారపడ్డాడు.

తన ఇద్దరు స్నేహితులతో కలిసి, డబ్బున్న మగపిల్లలు, ఆడపిల్లలతో తను కూడా డబ్బున్న కుటుంబానికి చెందినవాడిలా నటిస్తూ స్నేహం చేసేవాడు. వాళ్ళ జీవితాలలో భాగమైపోయి వంచిస్తూ వారిని బెదిరించి, వేధించేవాడు. డబ్బున్న ఆడ, మగపిల్లలను మోసగిస్తూ సతీష్, అతని స్నేహితులు ఒక పట్టణం నుంచి మరో పట్టణానికి, ఒక నగరం నుంచి మరో నగరానికి వెళ్లేవారు.

ఒకనాడు తన స్నేహితులతో కలిసి రైలులో ప్రయాణిస్తుండగా, ఒకమ్మాయి ఒంటరిగా కనిపించింది. ఆమె దుస్తులను బట్టి ధనవంతురాలిగా కనిపించడంతో వాళ్ళు ఆమెతో స్నేహం చెయ్యాలనుకున్నారు. ఆమెకు సిగ్గు, మొహమాటం ఎక్కువ కనుక వారిని తప్పించుకోవాలని చూసింది. దానితో వీళ్ళు మరింతగా ఆమె వెంటపడ్డారు. ఆమె ఒక స్టేషనులో దిగగానే, వీళ్ళు కూడా దిగి ఇంటివరకూ వెళ్ళారు. ఆమె ధనవంతురాలు కాదు. అయినాగాని ఆమెని ఒప్పించాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఎలాగో సతీష్ ఆమె స్నేహం చేశాడు. వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు.

ఆమె ఎంతో నిజాయితీగలది. దయార్ద్ర హృదయంగల పిల్ల. పూర్తిగా సతీష్‌కి వ్యతిరేకం. అతనామెతో గుడ్డిగా ప్రేమలో పడ్డాడు. అతనికి మంచి మార్గంలో నడిచేశిక్షణ లేదు

కనుక ఆమెను పెళ్ళి చేసుకునే మార్గం కనిపించలేదు. ఆమె తనను ధనవంతుడినని, ధనవంతుల సమాజానికి చెందినవాడినని అనుకుంటుందని భావించడంతో తాను దుష్టుడినని, మోసగాడినని ఆమెకు చెప్పడానికి అతనికి ధైర్యం లేదు. తను సూటి మార్గంలో నడిస్తే తన ఇద్దరు సహచరులు వెక్కిరిస్తారని భయపడ్డాడు. వాళ్ళామెకు తన గురించి చెప్పేస్తారని, తనను బెదిరిస్తారని భయపడ్డాడు.

ఆమె ప్రభావంతో అతడు తన ఇద్దరి స్నేహితుల నుంచి విడిపోవాలనుకున్నాడు. తన పద్ధతులు మార్చుకోవాలని బాగా కోరుకున్నాడు. అప్పటినుంచి సన్మార్గంలో నడవాలను కున్నాడు, కాని తన సమస్య నుంచి బయటపడే మార్గం కనిపించక ఆందోళన చెందాడు. ఆమెను గాఢంగా ప్రేమించడంతో మోసం చేయలేకపోయాడు. ఒకవేళ ఆమెకు నిజం చెప్పినా, నిజాయితీగల అమ్మాయి కనుక అతడిని తన భర్తగా అంగీకరించదు.

పాపపు దారినుంచి ఎలా బైటపడాలని, తన స్నేహితులను విడిచిపెట్టి, నిజాయితీగా బతకాలని, మంచివాడిగా మారాలని ఇదంతా ఎలా చేయాలి అనే ఆలోచనలో పడ్డాడు సతీష్. పిరికివాడైన సతీష్ ఆమెను ఎంతో గాఢంగా ప్రేమించాడు. అంత గాఢ ప్రేమ కూడా తన పద్ధతులను మార్చుకొనే ధైర్యం అతని కివ్వలేదు. ఆమెకి నిజం తెలిస్తే కచ్చితంగా తనను ద్వేషిస్తుందని అనుకున్నాడు. చెడు మార్గంలో జీవితాన్ని గడిపినందుకు ఇప్పుడు పశ్చాత్తాపం చెందాడు కాని ఆ మార్గం నుంచి మారే ధైర్యం అతనికి లేదు. ఆమెను తాను ఎన్నడూ సంతోషపెట్టలేననో, తను సన్మార్గంలో నడవలేననో ఆమెకి ఏమీ చెప్పకుండా సతీష్ వెళ్ళిపోయాడు. మంచి అవకాశాన్ని కోల్పోయాడు; అతడి జీవితమే పూర్తిగా మారిపోయేది, మంచి వాడయ్యేవాడు, ఉన్నత స్థాయికి చేరేవాడు.

సతీష్ పిరికితనం అతని జీవితాన్ని నాశనం చేసింది. అతను గనుక ధైర్యంగా దాపరికం లేకుండా నిజాయితీగా ఆ అమ్మాయితో మాట్లాడి ఉంటే, తనను, ఆమెను విడదీయాలను కున్న తన సహచరుల ద్వారా ఆమెకు అప్పటికే ఇదంతా తెలుసునని గ్రహించేవాడు. వాళ్ళు ఆమెకు ఎప్పుడో అన్ని విషయాలు చెప్పేశారు, అయినా గాని సతీష్‌ని పెళ్ళి చేసుకుని, అతనిని బాగుచెయ్యాలని ఆమె నిర్ణయించుకుంది. సతీష్ తనని నిజంగా ప్రేమిస్తున్నాడని నిర్ధారించుకోవాలని మాత్రమే ఆమె కోరుకుంది, కాని సతీష్ ఆమెతో ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఎంత పెద్ద తప్పు చేశాడు!

సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, మారే ధైర్యం ఉండాలి, చెడు నుంచి మంచిగా మారే ఏ అవకాశాన్ని వదులుకోకూడదు. ఒకసారి అటువంటి అవకాశాన్ని పోగొట్టుకొంటే ఈ పాపపు ప్రపంచంలో అటువంటి అవకాశం మళ్లీ రావడం అసాధ్యం. ఈ కేసులో

సతీష్ గనుక ఆమెకు తానెంత గాఢంగా, నిజంగా ఆమెను ప్రేమిస్తున్నాడో చెప్పి ఉంటే ఆమె అతనికి సాయం చేసేది.

22-5-1981

సూరదాస్ కథ

ఆత్మీయుడితో కలిసి ఉండాలని ఎన్నో కష్టాలు పడిన ఆత్మ

ఒక ఆత్మ ఉన్నతస్థాయికి చేరడానికి ఏమేం చేయగలదో నిరూపించే మరో వాస్తవమైన కథ (పేరు మార్చాం) చూడండి. అయితే ఈ కేసులో ఆత్మ పడిపోవడానికి కారణమైంది. ఆత్మలోకంలోని అతని ఆత్మీయురాలు దేవుడిని అతనికి సాయం చేయమని కోరారు.

సూరదాస్ గత జన్మ చెడ్డది కావడంతో 3వ ఆవరణలో ఉన్నాడు. నీలూ 5వ ఆవరణలో ఉంది. 3వ ఆవరణలోని దైవిక ఉన్నత సదాత్మను తనను మళ్ళీ భూలోకానికి పంపమని, చెడ్డతల్లికి బిడ్డగా పుట్టించమని, అప్పుడు తనను తాను బాగుపరచుకుని, తల్లిని బాగుపరచి 5వ ఆవరణకు చేరుతానని, దేవుడికి చెప్పమని కోరాడు. 5వ ఆవరణలో ఉన్న తన ఆత్మీయురాలు నీలూను కలుసుకోవడానికి కష్టపడే, శిక్షననుభవించే జీవితాన్ని గడపడానికి అతను సిద్ధంగా ఉన్నాడు.

క్రూరురాలైన స్త్రీకి సూరదాస్ జన్మించాడు. ఆమె ఎంత క్రూరురాలంటే భూలోకంలో ఆమెను అందరూ మంత్రగత్తె అని పిలిచేవారు. పుట్టగానే ఆమె సూరదాస్‌ను శపించింది. అక్రమ సంతానమైన అతడు ఆమెకి అడ్డంకిగా మారాడు.

పసిపాపలు బాగా మాట్లాడడం వచ్చేవరకు ఆత్మ ప్రపంచంతో సంబంధం కలిగి ఉంటారు. ఆత్మ ప్రపంచంలోని తమ ఆత్మీయులతో నిరంతరం సంభాషిస్తుంటారు. ఒక ఏడాదిలోపు పిల్లలు మళ్ళీ ఆత్మ ప్రపంచంలోకి వచ్చెయ్యవచ్చు. ఒక ఏడాది పాటు ఆత్మ తన తల్లిదండ్రులను, పరిస్థితిని గమనించి, కావాలనుకుంటే మళ్ళీ ఆత్మ ప్రపంచానికి వచ్చెయ్యవచ్చు.

అందువల్ల ఆత్మ ప్రపంచంలోని సూరదాస్ ఆత్మీయులు అతడి తల్లి క్రూరురాలు కనుక అతడిని ఏడాదిలోపే మళ్ళీ ఇంటికి అంటే ఆత్మ ప్రపంచానికి రమ్మన్నారు. అయితే సూరదాసు తన పట్టు వదలలేదు. నీలూని అమితంగా ప్రేమించాడు (ఆత్మ ప్రపంచంలో అతడి ఆత్మీయురాలు) కనుక ఆమెని శాశ్వతంగా కలవాలని పట్టుదలతో ఉన్నాడు.

సూరదాస్ తల్లి అత్యంత క్రూరురాలు. కొడుక్కి బూతులు నేర్పి అందరినీ తిట్టమని

చెప్పేది. ఆమె గాని, సూరదాసుగాని మంచి మాటలు మాట్లాడేవారు కారు. జీవాత్మ ప్రపంచంలో ప్రగతి నిదానంగా ఉంటుందని, 5వ ఆవరణకు త్వరితంగా చేరవచ్చునని సూరదాస్ భూలోకానికి వచ్చాడు. అందుకని పూర్తిగా పాపాత్మురాలైన తల్లిని ఎంపిక చేసుకుని జీవితకాలంలో ఆమెని బాగుచేసి, తన ఆత్మ కూడా 5వ ఆవరణకు చేరేలా కృషి చేయాలని ఆశపడ్డాడు. అతడు తన ఉపచేతనాత్మక మనస్సుకు స్థిరంగా ఉండేలా ఎన్నడూ తనను దిగజార్చకుండా శిక్షణ ఇచ్చాడు. ప్రతి ఆత్మ ఇలా చేయవచ్చు. అయితే దీనిలో చాలా ప్రమాదం ఉంది. అతి పాపాన్ని ఉపచేతనాత్మక మనస్సు భరించలేక పోవచ్చు. దానికి పాపపు మార్గాలతో విసుగు వచ్చి నిద్రించవచ్చు. ఇలా జరిగితే ఘోర ప్రమాదం. ఎంతటి కష్టం – అతడి ఆత్మ 5వ ఆవరణకు చేరాలని తపిస్తుంటే, ఉపచేతనాత్మక మనస్సు నిద్రిస్తే అతడు నేరుగా 2వ ఆవరణలోగాని, ఒకటవ ఆవరణలోగాని పడిపోవచ్చు కూడా.

మీరు జన్మించిన ఏడాది తరవాత, భూలోకంలో మీరెందుకు పుట్టారో, పాపాత్మురాలైన తల్లిని ఎందుకు ఎంపిక చేసుకున్నారో మీ ఉపచేతనాత్మక మనస్సు మర్చిపోతుంది. అందువల్ల పై ఆవరణలకు రాకుండా సూరదాస్ ఇంకా కిందికి జారిపోయే ప్రమాదమూ ఉంది అయినాగాని అతడు తప్పు చేసినపుడు ఆపేలా ఉపచేతనాత్మక మనస్సుకు శిక్షణ ఇచ్చాననుకుని ఈ కష్టసాధ్యమైన పనికి పూనుకున్నాడు.

అతడి తల్లి ఎంత క్రూరురాలంటే ఆమెలో ఒక్క మంచి లక్షణం కనుగొనడం కూడా కష్టం. సూరదాస్‌కు మాటలు వచ్చేసరికి తన ధ్యేయం ఏమిటో మర్చిపోయి, తల్లిలాగానే తయారయ్యాడు. ఎప్పుడూ ప్రేమపూరితమైన మాటలు మాట్లాడేవాడు కాదు. ఇతరులను వేధించి, హింసించడంలో ఆనందం పొందేవాడు. ధనమే దైవంగా భావించేవాడు. తనకంటె బలహీనులను హింసించడాన్ని ఇష్టపడేవాడు.

అతడి ఉపచేతనాత్మక మనస్సు ద్వారా నీలూ అతడిని ఆపాలని చాలా ప్రయత్నించింది. కాని అది నిద్రపోయింది. ఇలా జరుగుతుందని భావించే పాపాత్మురాలైన తల్లికి కొడుకులా పుట్టవద్దని సూరదాస్‌ను నీలూ అర్థించింది.

సూరదాస్ విషయంలో జోక్యం చేసుకుని మెరుగుపరుస్తారని నీలూ భూలోకంలో ఉన్న, తన ప్రియమైన ఆత్మలను ప్రభావితం చేయాలని, అదేవిధంగా సూరదాస్‌కు గత జన్మలో ప్రియమైన ఆత్మలకు కూడా నచ్చజెప్పాలని చూసింది. ఇది చాలా కష్టమైన పని. కొంతసమయం తరవాత ఒకరికి నచ్చజెప్పి సూరదాస్ వద్దకు పంపించ గలిగింది. ఈ ఆత్మపేరు మోహన్‌దాస్. అతడు బొంబాయిలో ఉంటాడు. సూరదాస్ బెంగుళూరులో ఉంటాడు. వీళ్ళిద్దరు కలవడం అసాధ్యం. కాని నీలూ అతని ఉపచేతనాత్మక మనస్సును ప్రేరేపించి అతడినెలాగో బెంగుళూరుకు రప్పించగలిగింది. మోహన్‌దాస్, సూరదాస్‌లకు ఇది తెలియదు. ఇది చేయడానికి ఎన్నో ఏళ్ళు పట్టింది.

వాళ్ళిద్దరూ స్నేహితులయ్యారు. మోహన్‌దాస్ సదాత్మ కనుక సూరదాస్‌ను అతను మెరుగుపరుస్తాడని నీలూ భావించింది. కాని ఆమె ఎంత తప్పుగా అంచనా వేసింది! సూరదాస్ బాగుపడలేదు. మోహన్‌దాస్ చెడ్డవాడవు తున్నాడు.

23-5-1981

సూరదాస్ కథ

సూరదాస్‌పై నీలూ ప్రేమకు పరీక్ష

నీలూకి ఆశ అడుగంటింది. మోహన్‌దాస్‌ను, సూరదాస్‌ను కలిపినందుకు ఆమె చాలా బాధపడింది. ఇప్పటివరకు సదాత్మగా ఉన్న మోహన్‌దాస్ సూరదాస్‌ను కలిసిన పిమ్మట చెడ్డవాడుగా మారాడు. ఆమె అతడిని కింది స్థాయికి పడిపోయేలా చేసింది. వాళ్ళిద్దరినీ రక్షించడానికి మార్గమేదీ కనిపించక ఆమె వేదన చెందింది. సర్వశక్తి మంతుడైన భగవంతుని వేడుకొనడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఇద్దరినీ రక్షించమని ఆమె దేవుని ప్రార్థించింది.

దుఃఖితురాలైన నీలూకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఆమె 5వ ఆవరణలో ఉంది, అది అంత ఉన్నత ఆవరణ కాకపోయినా, సదాత్మ కావడంతో 6వ ఆవరణకు చేరే మార్గంలో ఉంది. కింది స్థాయులకు పడిపోవడం ఆమెకు ఇష్టం లేదు. వేదనాభరిత హృదయంతో తన ఆవరణకు అధిపతిని కలిసి, ఈ గడ్డు సమస్య నుంచి తనకు పరిష్కారం చూపమని కోరింది.

"నేను సూరదాస్‌ను ఎంతగానో ప్రేమించాను. అందుకే మోహన్‌దాసును ఈ పాపపు మార్గంలో కిందికి పంపాను. ఉన్నత సదాత్మ అయిన మీరు వాళ్ళిద్దరినీ రక్షించండి" అని ప్రార్థించింది.

దైవిక ఉన్నత సదాత్మ ఆమెతో ఇలా అన్నారు, "నీలూ నువ్వు సూరదాస్ దగ్గరకు మోహన్‌దాస్‌ను పంపి అతడిని కూడా చెడ్డవాడిగా మారేలా చేసి పెద్ద తప్పు చేశావు. దీనికి నిన్ను శిక్షించాలి".

"అవును, దైవిక ఉన్నత సదాత్మా! నన్ను శిక్షించండి. నాకు నిమ్నావరణలకు వెళ్ళడం ఇష్టం లేదు. కాని సూరదాస్, మోహన్‌దాస్ ఉండే ఆవరణకు వెళతాను. దయచేసి వాళ్ళని రక్షించి ఉన్నతస్థాయికి రప్పించండి. వాళ్ళ శిక్షలన్నీ నేను అనుభవిస్తాను" అని నీలూ సమాధానం చెప్పింది.

4వ ఆవరణకు వెళ్ళడం కూడా ఆమెకు ఇష్టం లేదు. కాని సూరదాస్ పట్ల ఆమెకున్న నిస్వార్థ ప్రేమవల్ల 2వ ఆవరణ వరకు దిగడానికి ఆమె అంగీకరించింది. అంతే

కాకుండా సూరదాస్, మోహన్‌దాస్ కనుక ఇప్పుడు పాపాలు ఆపకపోతే వాళ్ళు 1వ ఆవరణకు కూడా పడిపోయే అవకాశం ఉంది.

దైవిక ఉన్నత సదాత్మ ఆమెతో ఇలా అన్నారు "నువ్వు చెప్పిన దానికి అంగీకరిస్తున్నాను; నువ్వు 2వ ఆవరణకు తక్షణమే వెళ్ళగలవా?"

"అయ్యా, నేను తక్షణమే వెళతాను. నాకు వేసిన శిక్షను, వాళ్ళ శిక్షను కూడా నేను అనుభవిస్తాను కాని వాళ్ళను రక్షించి వాళ్ళను ఇంటికి తీసుకొని రండి, 5వ ఆవరణకు కాకపోయినా కనీసం 4వ ఆవరణకైనా తీసుకురండి.

ఆమె నిస్వార్థమైన, నిజమైన, నిశ్చలమైన ప్రేమకు దైవిక ఉన్నత సదాత్మ ముగ్ధుల య్యారు. ఆమె నిజంగానే వారి శిక్షలను కూడా అనుభవించడానికి సిద్ధంగా ఉందని తెలుసుకున్నారు. అయినాగాని, ఆమెని పరీక్షించాలనుకున్నారు. 2వ ఆవరణలోకి ప్రవేశించాక ఆమె ఏమి చేస్తుంది? ఆమె తన మనస్సు మార్చుకుంటుందా? ఆమెను 2వ ఆవరణకు వెళ్ళమని ఆయన ఆజ్ఞాపించారు. ఆమె ఏమాత్రం సందేహించకుండా వెళ్ళింది. కొన్ని రోజుల తరవాత దైవిక ఉన్నత సదాత్మ ఆమెనిలా అడిగారు. "నీలూ, ఇంకా నువ్వు 2వ ఆవరణలో చాలా ఏళ్ళు ఉండి సూరదాస్‌ను, మోహన్‌దాస్‌ను కాపాడాలనుకుంటున్నావా?"

నీలూ సంశయించకుండా "అవును" అని దైవిక ఉన్నత సదాత్మకు సమాధానం చెప్పింది. నీలూ అంత నిస్వార్థంగా, నిజంగా తాను ప్రేమించిన సూరదాస్‌ను, మోహన్‌దాస్‌ను రక్షించడానికి తన సంతోషాన్ని త్యాగం చేయడానికి దృఢనిశ్చయంతో ఉన్నందుకు దైవిక ఉన్నత సదాత్మ చాలా సంతోషించారు.

"నీలూ 5వ ఆవరణకు వచ్చెయ్. నేను సూరదాస్‌ను, మోహన్‌దాస్‌ను రక్షిస్తాను తల్లీ. దీనికి చాలా నెలలు పడుతుంది. అయితే ఈ లోపు సూరదాస్, మోహన్‌దాస్‌లకు ఏమైనా సరే నువ్వేమీ జోక్యం చేసుకోనని మాట ఇవ్వాలి నాకు. భయంకరమైన నిమ్నావరణల నుంచి నేను వాళ్ళని కాపాడుతానని మాట ఇస్తున్నాను".

తన కృతజ్ఞతను వ్యక్తం చేయడానికి నీలూకి మాటలు రాలేదు. అమితానందంతో "మీరు చెప్పినట్టుగానే చేస్తాను దైవిక ఉన్నత సదాత్మా" అని సమాధానమిచ్చింది.

"వారికోసం ప్రార్థించు నీలూ. వారిని నేను కాపాడడానికి నాకు సాయం చెయ్యమని సర్వశక్తిమంతుడైన భగవంతుని వేడుకో".

దైవిక ఉన్నత సదాత్మపై అత్యంత విశ్వాసం ఉండడంతో నీలూ వెంటనే అంగీకరించింది.

ఇది నిజంగా జరిగిన కథ. కేవలం పేర్లు, నగరాలు మార్చాం అంతే. ఆవరణలకు పాలకులు, దైవిక ఉన్నత సదాత్మ ఏ ఆత్మనైనా కాపాడవలసిన అవసరం ఉంటే ఎలా పనిచేస్తారో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఇది వాళ్ళకి చాలా కష్టమైన పనే.

అయినా గాని వాళ్ళకి గొప్ప శక్తులు ఉండడంతో ఇటువంటి అద్భుతాలు చెయ్యగలరు. ఇంకా సూరదాసు కూడా సదాత్మ కనుక ఉన్నతస్థాయికి చేరాలని పెద్ద విపత్తును ఎంచుకున్నాడు. తన గతజన్మలో కొందరు చెడు స్నేహితులవల్ల కింది అవరణకు పడిపోయాడు. అందువల్ల ఇలాతెగించాడు. కాని దురదృష్టవశాత్తు ఇది అతనిని ఇంకా కిందికి పడేసింది.

24-5-1981

సూరదాస్ కథ

భూలోకానికి వచ్చిన దైవిక ఉన్నత సదాత్మ

ప్రశాంతంగా ఉండమని, సూరదాస్‌ను, మోహన్‌దాస్‌ను కాపడడానికి తనకు సాయం చేయమని సర్వశక్తిమంతుడైన భగవంతుని ప్రార్థించమని దైవిక ఉన్నత సదాత్మ నీలూకు చెప్పారు. కొన్నాళ్ళ తరవాత ఫకీరు[10]లా మారు వేషంలో దైవిక ఉన్నత సదాత్మ భూలోకానికి వెళ్ళారు.

భూలోకంలో సూరదాస్, మోహన్‌దాస్ ఎందరినో దోచుకుంటూ, ఎంతోమందిని వేధిస్తూ ఉన్నారు. దైవిక ఉన్నత సదాత్మ భూలోకానికి వచ్చిన రోజున, వారు ఒక దొంగతనాన్ని చేశారు. దానివల్ల వారికి వేలాది రూపాయలు లభించాయి.

బాగా మద్యం తాగి, పట్టుబడకుండా దొంగతనం చేశామన్న అహంకారంతో కారులో ఇంటికి తిరిగి వస్తున్నారు. వాళ్ళు వేగంగా వెళుతుండగా, వారి కారు ముందు నుంచి దైవిక ఉన్నత సదాత్మ వెళ్ళారు. సూరదాస్ కారును పక్కకు తిప్పాడు. దానితో అది స్తంభానికి గుద్దుకొంది. సూరదాస్, మోహన్‌దాస్, బయటకు రాలేని స్థితిలో స్పృహ తప్పిపోయారు. దగ్గర్లో ఉన్న ఆసుపత్రిలో చేర్చారు వాళ్ళని.

వాళ్ళకి స్పృహ రాగానే అమితమైన నొప్పితో ఆసుపత్రిలో ఉన్నట్లుగా గుర్తించారు. తన కాళ్ళు రెండూ లేకపోవడం చూసుకుని సూరదాస్ ఎంతో ఆందోళన చెందాడు. మోహన్‌దాస్‌కు ఒక చెయ్యి, ఒక కాలు పోయాయి, ప్రమాదం ఎలా జరిగిందని అడిగితే, మీరు తాగి ఉన్నారని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో వేగంగా గుద్దుకొనడంతో కారు తలుపులు తెరుచుకుని డబ్బు సంచి కింద పడిపోయి అవసరమున్న వారికి దొరకడానికి దొర్లుకుంటూ ఒక పొదలోకి పోయింది.

అవయవాలు పోయినందుకు సూరదాస్, మోహన్‌దాస్ ఒకరినొకరు తిట్టుకున్నారు. వాళ్ళు పక్క పక్క మంచాల మీద పడుకుని రోజూ మాటల యుద్ధం చేయడం చూసి, వాళ్ళని విడదీయాలని మోహన్‌దాస్‌ను డాక్టరు వేరే వార్డుకు తరలించాడు. ఒంటరిగా ఉన్న మోహన్‌దాస్ గతాన్ని తలచుకోసాగాడు. తప్పు మార్గంలో నడిచినందుకే ఈ

10. ఫకీరు అంటే యోగి / సన్యాసి

ప్రమాదం జరిగి కాలూ, చెయ్యి పోయిందని అతడికి అర్థమైంది. "ఇప్పుడు జీవితమంతా బాధపడాలి" అనుకున్నాడు.

ఈ భయోత్పాతానికి అతడి ఉపచేతనాత్మక మనస్సు తెరచుకుంది. అది మేల్కొని ఇది దేవుడి న్యాయమని అతడికి చెప్పింది. ఈ పాపపు మార్గంలో నడచేలా తనను ప్రభావితం చేసినందుకు అతను సూరదాస్‌ను తిట్టుకున్నాడు. ఇంక అప్పటినుంచే మంచి మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాడు.

దయాళువైన పూనమ్ అనే నర్సు వచ్చి అతనికి ఇంజెక్షను చేసింది. మళ్ళీ ఎన్నడూ తప్పుచెయ్యకుండా భగవద్గీత[11]పై ప్రమాణంచేసి ఒట్టు పెట్టుకోవాలనుకున్నాడు. తనకు భగవద్గీతను తెచ్చివ్వమని మోహన్‌దాస్ ఆమెను అడిగాడు.

ఆమె గీతను తెచ్చింది. తేగానే అతను ఒట్టు పెట్టుకున్నాడు. పూనమ్, మోహన్‌దాస్ ఇద్దరూ స్నేహితులయ్యారు. కొన్ని నెలలపాటు తానెంతటి భయంకరమైన జీవితాన్ని గడిపాడో అతడామెకి చెప్పాడు. ఇదంతా దేవుడిచ్చిన తీర్పు అని, "పూనమ్ నేనింక దారి తప్పకూడదని ఒట్టుపెట్టుకున్నాను. దైవ మార్గంలో నడుస్తాను ఎప్పుడూ" అని చెప్పాడు.

దేవుడు అతనికి సాయంచేశాడు. పూనమ్ మోహన్‌దాస్‌ను ప్రేమించింది. తాను వికలాంగుడు కనుక మోహన్‌దాస్ తనకు ఆమెపై గల ప్రేమను దాచాడు. పైగా పూనమ్‌కు తన సంగతంతా తెలుసు కనుక ఆమె తననెన్నడూ పెళ్ళి చేసుకోదని అనుకున్నాడు.

ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్ళే ముందు రోజు "మోహన్, ఇప్పుడెక్కడికి వెళతారు?" అని పూనమ్ అడిగింది.

"వెళ్ళడానికి ఏ చోటూ లేదు పూనమ్"

"నేను ఒక్కదాన్నే ఉంటాను మా ఇంట్లో. మోహన్, నేను మిమ్మల్ని చూసుకోగలను"

"పూనమ్ నేను వికలాంగుణ్ణి, నీకు భారమవడానికి ఎలా ఒప్పుకుంటాను?"

"మోహన్, మీరంటే నాకు చాలా ప్రేమ. మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. నా భర్తగా మిమ్మల్ని సంతోషంగా అంగీకరిస్తున్నాను."

మోహన్‌దాస్ తనకూ ఆమెమీద ప్రేమ ఉందని, ఆమెకు భారం అవడం ఇష్టంలేదని చెప్పాడు. కాని ఆమె మాత్రం అతను తనని పెళ్ళి చేసుకుంటే జీవితం పరిపూర్ణమవుతుందని, తను నర్సు గనుక ఇద్దరూ కలిసి జీవించగలరని పట్టుబట్టింది. కొంతసేపటికి మోహన్‌దాస్ ఒప్పుకున్నాడు. వాళ్ళు పెళ్ళి చేసుకుంటున్నామని చెప్పారు.

11. హిందువుల పవిత్ర గ్రంథం

ఆ మర్నాడు మోహన్‌దాస్ ఆసుపత్రి నుంచి బయటకు రాగానే, వాళ్ళు నేరుగా గుడికి వెళ్ళి పెళ్ళి చేసుకున్నారు. మోహన్‌దాస్ కథ ఇంతటితో ముగిసింది. అతను, పూనమ్, కలిసి చక్కగా ఉన్నారు. వాళ్ళకి ముగ్గురు పిల్లలు. కృత్రిమ అవయవాలు అమర్చుకుని పనిచేస్తూ, దైవ నియమాలను అనుసరిస్తూ మోహన్‌దాస్ సంతోషంగా ఉన్నాడు.

25-5-1981

సూరదాస్ కథ:

సూరదాస్ మరింత కిందికి పడిపోయాడు

సూరదాస్ సంగతేమైందో చూద్దాం. చాలాకాలంపాటు ఆసుపత్రిలోనే ఉన్నాడు. అక్కడి నుంచి ఎవరికీ హానిచేయలేదు. ఎవరినీ వేధించలేదు. అక్కడ అతణ్ణి సరిగా చూసేవారూ లేరు. అక్కడున్నంత కాలం బయటికి వెళ్లిన తర్వాత ఇతరులకు ఎలా హాని చెయ్యాలి, ఎలా మోసం చెయ్యాలి, ఎలా వేధించాలి అనే ప్రణాళికలు వేస్తూ వచ్చాడు. క్లుప్తంగా చెప్పాలంటే అంతకుముందుకన్న ఘోరంగా తయారయ్యాడు. అందరినీ తిట్టిపోసేవాడు, చివరికి దేవుడినీ, మోహన్‌దాస్‌ని కూడా. అందరిపైనా ద్వేషం - చివరికి తల్లిని కూడా ద్వేషించాడు.

ఈ స్థితిలో ఉండగా ఆసుపత్రి నుంచి పంపేశారు. తల్లిని పిలిచి ఆమెతో ఇంటికి వెళ్ళాడు. తనకు కాళ్ళు లేవు గనుక నడువలేడు. తన చెడు పనులకు సాయం చెయ్యమని ఎంతో తియ్యగా తల్లిని వేడుకున్నాడు. అతని తల్లి కూడా ముందే పాపాత్మురాలు కనుక ఎంతో ఇష్టంగా ఒప్పుకుంది.

సూరదాస్ ఒకే దెబ్బతో రెండు పిట్టలు కొట్టాలనుకున్నాడు. ధనవంతుడైన విధురుడిని దోచుకొని బికారిని చెయ్యాలనుకున్నాడు. అతనికి తన తల్లి మీద కూడా చాలా ద్వేషం కనుక ఆమె పైన కూడా ప్రతీకారం తీర్చుకునేలా ప్రణాళిక వేశాడు. దోపిడీ జరిగింది. అతడి తల్లి ఆ మనిషిని వేధించి దోపిడీ సొమ్మును ఇంటికి తెచ్చింది.

తల్లి ఆదమరిచి నిద్రిస్తుండగా, సూరదాస్ డబ్బున్న సంచిని తీసుకొని చక్రాల కుర్చీలో ఇల్లు వదిలిపెట్టాడు. తల్లిని ఇరికించేలా కొన్ని ఆనవాళ్ళు వదిలాడు. ఇల్లు వదిలి రాత్రి పూట చక్రాల కుర్చీలో రోడ్డు మీద నిరీక్షించసాగాడు.

అర్ధరాత్రిపూట ఒక కారు రావడం చూసి దానిని ఆపాడు. ఫిలిప్స్ అనే 20 ఏళ్ళ యువకుడు దానిని నడుపుతున్నాడు.

"నేను వికలాంగుణ్ణి. నాకు లిఫ్టు ఇవ్వు. మా అమ్మకు ప్రమాదం జరిగిందని ఆసుపత్రిలో ఉందని ఫోను వచ్చింది. నేనామెకు బట్టలు, మందులు తీసుకెళ్ళాలి. కాళ్ళు లేని నాలాంటివాడికి సాయం చెయ్యవా?"

పాపం ఫిలిప్స్. సూరదాస్‌ను చూసి జాలిపడి ఇంటికి వెళ్ళకుండా, ఆసుపత్రి వేపుకి కారు తిప్పాడు. సూరదాస్ తుపాకి తీసి అతనికి గురిపెట్టి, రహదారి వేపు పొమ్మన్నాడు.

ఫిలిప్స్ అంత తెలివైనవాడు కాదు. నగరానికి కొత్త. బెంగుళూరులో కొన్నాళ్ళ కిందటే కొత్త ఉద్యోగంలో చేరాడు. సూరదాస్ తెలివిగా ఈ విషయం కనిపెట్టాడు. ఇంక ఈ పిల్లవాడు తనకు మంచి బానిసగా పనికి వస్తాడని అనుకున్నాడు.

బెంగళూరు వదిలేముందుగా, పోలీసులకు ఫోను చేసి ఒక ఆడమనిషి ఒక ధనవంతుణ్ణి దోపిడీ చేస్తుండగా చూశానని చెప్పాడు. ఆమెను వెంబడించానని, నగరం వదలిపోకుండా ఆమెని త్వరగా వెళ్ళి పట్టుకొమ్మని, అడ్రసు కూడా చెప్పాడు. పోలీసులు అతనిని పేరు అడిగితే చెప్పకుండా ఫోను ఆపేశాడు. వాళ్ళు సహజంగానే సూరదాస్ తల్లి ఇంటికి వెళ్ళారు. సోదా ఉత్తర్వు చూపిస్తూ ఇంటిలోకి వెళ్ళారు. కొన్ని ఆనవాళ్ళను బట్టి సూరదాస్ తల్లిని అరెస్టు చేశారు. దోచిన ధనం ఎక్కడ దాచిందో చెప్పమని పోలీసులు ఆమెను చిత్రహింసలు పెట్టారు.

సూరదాస్ డబ్బంతా పట్టుకుపోయాడు. అతని తల్లి ఈ విషయం పోలీసులకు చెప్పినాగాని, ఆమెకు చెడ్డ పేరు ఉండడంతో పోలీసులు ఆమె చెప్పిన విషయం నమ్మలేదు. ఆమెను జైలులో వేసి కొన్నేళ్ళపాటు బండ చాకిరి చేయించారు.

సూరదాస్ ఫిలిప్స్‌ని భయపెట్టి అతని మనసు మార్చాడు. తనకు చేతబడి తెలుసునని, తనమాట వినకపోతే జంతువులా మార్చేస్తానని చెప్పాడు. ఏవో సాధారణ ఇంద్రజాల ట్రిక్కులు చూపించి, నిజంగానే తనకాశక్తి ఉందని ఫిలిప్స్‌ని నమ్మించాడు. అతను అంతగా చదువుకోలేదు, గ్రామంలోని బడిలో చదివాడు. ఉన్న ఊళ్ళోనే కొంతకాలం డ్రైవరుగా పనిచేశాడు, తర్వాత కొంతకాలానికి బెంగుళూరులో ఈ ఉద్యోగం వచ్చింది.

ఫిలిప్స్ పూర్తిగా సూరదాస్ నియంత్రణలోకి వచ్చేశాడు. అంతకుముందు దొంగతనం చేసిన కారును వదిలేసి, మరో కారు దొంగిలిస్తూ, వదిలివేస్తూ వాళ్ళు లాహోరు చేరారు. సూరదాస్ నైపుణ్యంతో ఎలాగో వాళ్ళు సరిహద్దు దాటి భారతదేశాన్ని విడిచిపెట్టారు. సూరదాస్‌కు ఇప్పుడు సురక్షితంగా అనిపించింది. అతను ధనవంతుడు. పైగా ఒక బానిస కూడా ఉన్నాడు.

26-5-1981

సూరదాస్ కథ

పిరికి ఆత్మకు ధైర్యం వచ్చింది

ఆత్మలోకంలో నీలూ, ఆమె స్నేహితులు సూరదాస్ చెడుమార్గంలో లోతుగా కూరుకుపోవడం చూసి ఆందోళన చెందారు. వారికి దైవిక ఉన్నత సదాత్మపై పూర్తి విశ్వాసం ఉంది కాబట్టి సూరదాస్ ఎలాగైనా ఈ పాపపు మార్గం నుంచి రక్షింపబడతాడని వారికి బాగా తెలుసు. నీలూ, ఆమె స్నేహితులు ఆందోళన పడడం చూసి వారిని శాంతపరచడానికి దైవిక ఉన్నత సదాత్మ వారిని పిలిచి ఇలా చెప్పారు. “నీలూ నీకు నాపై పూర్తి నమ్మకం ఉందని తెలుసు. నా మాట నిలబెట్టుకోనని నువ్వు అనుకోలేవని తెలుసు. కాని సూరదాస్ మరింత చెడు మార్గంలో నడవడం చూసి నువ్వు ఆందోళన చెందుతున్నావు. నిన్ను నేను అర్థం చేసుకోగలను. అందుకే నీకు చెప్పాలనుకుంటున్నాను. దోపిడీకి గురైన ధనవంతుడు పాపాత్ముడు. గుణపాఠం నేర్చుకోవలసి ఉంది. తానిప్పుడు బికారినయ్యానని అతనికి తెలిసింది. సూరదాస్ తల్లి కూడా బాగా పాపాత్మురాలు. ఆమెని ఆపాలి. ఆమె ఇప్పుడు జైలులో ఉంది. ఆ అబ్బాయి ఫిలిప్స్ కూడా పిరికివాడు. వెన్నెముక లేదు. బానిసగా ఉండకుండా, తన సమస్యలు ధైర్యంగా పరిష్కరించుకొనడం నేర్చుకోవాలి. అతనిది సదాత్మ. కాని అతను వాస్తవం తెలుసుకోవాలి. ఇప్పుడర్థమైందనుకుంటాను ఎవరికీ అన్యాయాలు జరగవు. అందరికీ న్యాయం చెయ్యడానికి దేవుడికి రహస్య మార్గాలుంటాయి.”

“అవును, దైవిక ఉన్నత సదాత్మా, ఇప్పుడు నాకు అర్థమైంది. ఇదంతా నాకు వివరించి నందుకు కృతజ్ఞతలు. నాకు మీ మీద, సర్వశక్తిమంతుడైన భగవంతుని మీద పూర్తి నమ్మకం ఉంది. ఆయన న్యాయం చేసే రహస్య మార్గాలు నాకిప్పుడు అర్థమయ్యాయి” అంది నీలూ.

ఫిలిప్స్ సూరదాస్‌కి బానిస అయ్యాడు. సూరదాస్ కోటీశ్వరుడై తన సఫలతకు తానే గర్విస్తూ ఉన్నాడు.

ఒకనాడు, ఫిలిప్స్ సూరదాస్ కొత్త ఇంటికి దూరంగా ఒక రాతి మీద కూర్చుని, దేవుడు తనకెందుకు సాయం చెయ్యడం లేదు, ఎందుకు తన అంతరాత్మకు విరుద్ధమైన పనులు తనతో చేయిస్తున్నాడని చింతిస్తున్నాడు. బాగా దుఃఖంతో ‘దేవుడా, నాకు సాయం చెయ్యి. సూరదాస్‌ను భరించడం ఇంక నా వల్ల కాదు” అని బిగ్గరగా అరిచాడు. కొన్ని నిముషాల తర్వాత, ఒక ఫకీరు వేషంలో దైవిక ఉన్నత సదాత్మ అతని దగ్గరకు వచ్చారు. “నాయనా ఈ బీదవాడికి తినడానికి ఏమైనా పెట్టు. చాలా ఆకలిగా ఉంది” అని అడిగారు.

చింకి పాతలు కట్టుకొన్న ఫకీరును చూసి ఫిలిప్స్‌కి దయ కలిగింది. జేబులో చెయ్యి పెట్టాడు. కాని అప్పుడే అతనికి గుర్తువచ్చింది సూరదాస్ తనకెన్నడూ చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని – జేబులో ఏమీ లేవు. సూరదాస్ అతనికి తిండి, బట్ట మాత్రమే ఇచ్చేవాడు. కళ్ళు చెమరుస్తుండగా "అయ్యా, నన్ను క్షమించండి. నేనే ఒక దుష్టుడికి బానిసను. నేను మీకేమీ ఇవ్వలేను" అన్నాడు.

"బానిసవా, బాబూ?"

"అవునయ్యా. బానిసనే – మీరు నమ్మలేకపోవచ్చు, కాని ఇది నిజం".

"నీ విషయమంతా పూర్తిగా చెబుతావా? నేను నీకు సాయం చెయ్యగలనేమో" అన్నారు దైవిక ఉన్నత సదాత్మ.

"అయ్యా, మీరు నాకు సాయం చెయ్యగలరని నేననుకోవడం లేదు. కాని నా గుండెలో బరువు దింపుకోవడానికి నేను మీకు నా కథ చెబుతాను. నమ్మశక్యంగాని, విషాదమైన నా కథను వింటారా?"

"తప్పకుండా వింటాను. నీ కథ చెప్పి బరువు దించుకో". దానితో ఫిలిప్స్ అతనికి తన కథంతా చెప్పి "అతన్ని ఎదిరించే ధైర్యం లేదు నాకు" అన్నాడు.

"నువ్వింత పిరికిగా, వెన్నెముక లేకుండా ఉండకూడదు. చెడును ఎదిరించాలి. దేవుడు బాగా సంతోషిస్తాడు"

అయ్యో, స్వామీ మీకు సూరదాస్ సంగతి తెలీదు. అతనికి చేతబడి తెలుసు. మీకర్థం కాదు. నా కళ్ళతో స్వయంగా అతని దుష్టశక్తులను చూశాను. నన్నతను చిటికెలో కుక్కనో, పిల్లినో చేస్తాడు. స్వామీ నేనతనిని ఎదిరించలేను."

దైవిక ఉన్నత సదాత్మ అతనికి ఇలా చెప్పారు, "ఫిలిప్స్ నాకూ శక్తులున్నాయి. మంచి శక్తులు. నా మీద నమ్మకముంచుతావా? సూరదాస్ నిన్ను కుక్కగానో, పిల్లిగానో చెయ్యకుండా నేను చూస్తాను. సూరదాస్ నిన్ను జంతువులా మార్చలేదని హామీ ఇవ్వగలను. నేను కూడా అతనిలాంటి మాయలు చేయగలను. అవెలా చేస్తామో నీకు చూపిస్తాను. అప్పుడైనా నమ్ముతావా?"

"నమ్ముతాను. అవెలా చేస్తారో చూపించండి".

సూరదాస్ అతనిని ఎలా మోసగించాడో దైవిక ఉన్నత సదాత్మ చూపించారు. ఫిలిప్స్‌కు అప్పటికప్పుడే అక్కడినుంచి పారిపోవాలనిపించింది. కాని దైవిక ఉన్నత సదాత్మ అతడిని ఆపారు. "ఫిలిప్స్ సూరదాస్‌ను మార్చడానికి నువ్వు నాకు సాయం చెయ్యాలి. నీ బాధను నేను పోగొట్టాను కనుక నాకు సాయం చెయ్యడం నీ బాధ్యత" అన్నారు.

"అయ్యో, స్వామీ మీరు విచిత్రంగా ఉన్నారు. సూరదాస్ గురించి మీకెందుకు? వాడిని నరకానికి పోనీయండి. అతనితో ఇంక మనకేం పని? నన్ను పారిపోనివ్వండి. మీరు కూడా పాపకూపం నుంచి వెళ్ళిపొండి" అన్నాడు.

"లేదు ఫిలిప్స్, ఇక్కడ నేను నా బాధ్యత నిర్వర్తించడానికి వచ్చాను. నువ్వు కూడా నీ బాధ్యత నిర్వర్తించాలి. లేకపోతే దేవుడు సంతోషించడు. సర్వశక్తిమంతుడైన భగవంతుడిని అసంతృప్తి పరుస్తావా ఫిలిప్స్?" అని అడిగారు దైవిక ఉన్నత సదాత్మ.

"లేదు. కచ్చితంగా అలా చెయ్యను. నేను దేవుడిని పిలిచాను. ఆయన మిమ్మల్ని పంపాడు. మీరేం చెబితే అది నేను చెయ్యాలి. కాని దయచేసి నన్ను సూరదాస్ దగ్గర నుంచి తొందరగా వెళ్ళిపోనివ్వండి."

"ఫిలిప్స్, ఇంక ఒక్కరోజే. తరవాత నువ్వు స్వేచ్ఛగా వెళ్ళిపోవచ్చు. నేను చెప్పిన పని చేసి నువ్వెళ్ళిపో. మూడువందల రూపాయలు మాత్రమే తీసుకొని, కారు తీసుకుని నగరానికి వెళ్ళు. నగరంలో ప్రవేశించడానికి ముందుగానే కారు వదిలెయ్. ఏదైనా ఉద్యోగం వెతుక్కో. నీకు ఉద్యోగం వచ్చి జీతం వచ్చేవరకూ నీకూడు, గూడు కోసం అవి సరిపోతాయి. ఫిలిప్స్, సూరదాస్‌ది పాపపు సొమ్ము. శపించబడినది. పైగా అది నీది కాదు. సూరదాస్ దగ్గర నువ్వు పనిచేసినందుకు నీకు రావలసిన జీతం మూడు వందలే. సూరదాస్ అలమర నుంచి అంతకన్న ఎక్కువ తీసుకోనని నాకు మాట ఇవ్వు".

"స్వామీ, నేను మాట ఇస్తున్నాను; మీరు అద్భుతమైన వ్యక్తి. నన్ను, మిమ్మల్ని కలిపినందుకు దేవుడికి కృతజ్ఞతలు – నన్ను కష్టం నుంచి మీరు తప్పించారు. దేవుడి రహస్య మార్గాలు ఇప్పుడు నాకు అర్థమయ్యాయి. ఇకముందు నేను తప్పుదారి పట్టనని. ఇంతకు ముందులా పిరికివాడిలా ఉండనని కూడా మీకు మాట ఇస్తున్నాను".

ఫిలిప్స్‌లో మంచి మార్పు వచ్చినందుకు దైవిక ఉన్నత సదాత్మ చాలా సంతోషించారు. మర్నాడు ఫిలిప్స్ ఏం చెయ్యాలో చెప్పి అతనిని వదిలి ఆయన కొంతసేపు భూలోకం నుంచి వెళ్ళిపోయారు.

27-5-1981

సూరదాస్ కథ

గర్వభంగం

మొదటిసారిగా, తాను జడ పదార్థాన్ని కాదని, మనిషినని ఫిలిప్స్‌కి అనిపించింది. ఇంక నుంచి ఏ పెద్ద మనిషికీ తాను బానిస కాకూడదని, తప్పుదారిలో ఉండకూడదని అతను అనుకున్నాడు.

ఆ మర్నాడు దైవిక ఉన్నత సదాత్మ చెప్పిన ప్రకారం, అడవిలోని గుహలో నిధి ఉందని తనకు సమాచారం లభించిందని చెప్పి సూరదాస్‌ను ఇంటికి దూరంగా ఎవరూ లేని ఒంటరి ప్రదేశానికి తీసుకెళ్ళాడు. అది వినగానే సూరదాస్ ఉప్పొంగి పోయి తనను అక్కడికి వెంటనే తీసుకెళ్ళమన్నాడు.

ఎన్నో మైళ్ళు మట్టిరోడ్డు తర్వాత ఇరుకుగా ఉన్న కాలిబాట కనిపించింది. ఫిలిప్స్ అక్కడ కారు ఆపి సూరదాస్‌ను మోస్తూ ఒకటిన్నర మైళ్ళు నడిచాడు. అక్కడో గుహ కనిపించింది. నిధిని చూడాలని సూరదాస్‌కు చాలా తహతహగా ఉంది. “ఈ గుహ చాలా ఇరుగ్గా ఉంది. మీరు లోపలికి వెళ్ళలేరు, అయ్యా, మీరు ఈ రాతి మీద కూర్చోండి. నేను లోపలికి వెళ్ళి నిజంగా నిధి ఉందో లేదో చూసివస్తాను” అన్నాడు ఫిలిప్స్. సూరదాస్‌ను కిందికి దించి ఫిలిప్స్ లోపలికి వెళ్ళాడు.

ఫిలిప్స్‌కి ముందు చెప్పినట్లుగానే గుహ వెనక భాగంలో దారి ఉంది. అతను మళ్ళీ కారు దగ్గరికి వెళ్ళాడు అడ్డదారిలో. కారులో సూరదాస్ ఇంటికి వెళ్ళి, బలవంతంగా అలమర తెరిచి మూడు వందల రూపాయలు తీసుకొని, దొంగిలించిన కారులో నగరానికి వెళ్ళాడు. కొన్నాళ్ళ తర్వాత అతనికి ఉద్యోగం దొరికింది. నిజాయితీగా మంచి జీవితం గడిపాడు.

ఫిలిప్స్ గుహలోకి వెళ్ళి చాలా సేపయింది కాని కోటీశ్వరుడు కావాలనే ఆత్రుతలో ఉన్న సూరదాస్ దానిని గుర్తించలేదు. తరవాత కొంతసేపటికి ఫిలిప్స్ వెళ్ళి గంటకు పైగా అయిందని గుర్తించి, ఫిలిప్స్‌ను తిడుతూ, శపిస్తూ, పిలవసాగాడు.

ఎవరూ రాలేదు – ఫిలిప్స్ అదృశ్యమయ్యాడు. ఫిలిప్స్‌ని వెతకడానికి సూరదాస్ ఆ బండల మధ్య పాకవలసి వచ్చింది. తిట్టుకుంటూ, మనసు నిండా కోపంతో, హృదయం నిండా ద్వేషంతో కొంచెం లోపలికి వెళ్ళాడు. హఠాత్తుగా తాను గుహ నుంచి బయటికి వచ్చినట్లుగా గ్రహించాడు. ఎవరో గట్టిగా కొట్టినట్లుగా అయింది అతనికి. ఫిలిప్స్ తనని మోసం చేశాడని అతని మనసు గ్రహించింది. కాని దాదా[12]లాంటి సూరదాస్‌ను మోసం చేసేంతటి తెలివితేటలు గాని, ధైర్యంగాని ఫిలిప్స్‌కున్నాయని అతనికి నమ్మశక్యం కాలేదు. ఫిలిప్స్ తనకు జీవితకాలం బానిసగా పడి ఉంటాడని సూరదాస్ నమ్మాడు.

ఇప్పటివరకు ఎవరూ తనను మోసం చేయలేకపోయారని గర్విస్తూండేవాడు. ఇతరులను

12. దాదా అంటే హిందీ వాడుక భాషలో స్థానిక గూండా

మోసం చేయడంలో అతను నిపుణుడు. మరి ఇదెలా జరిగింది? ఫిలిప్స్‌కి తనను వ్యతిరేకించే ధైర్యం లేదని సూరదాస్‌కు బాగా నమ్మకం. ఇది పెద్ద దెబ్బ. ఆ దిగ్భ్రాంతిలో తిట్టడం, శపించడం కూడా మర్చిపోయాడు. ఆ భయంకరమైన చీకటి గుహలో సూరదాసును వదిలిపెట్టి ఫిలిప్స్ అదృశ్యం కావడం సాధ్యమా? రాత్రి కావస్తోంది. అడవిలోకి వెళ్ళడం కన్న గుహలోనే ఉండడం మంచిదని సూరదాస్ భావించాడు. అడవిలో క్రూర జంతువులుంటాయని భయపడ్డాడు. ఇంటికి వెళ్లే మార్గం లేదు - ఇంటికి ఎన్నో మైళ్ళ దూరంలో ఉన్నాడు. తిండి, నీరు లేకుండా ఎలా ఉంటాడు? ఒకవేళ క్రూర జంతువులు గుహలోకి వస్తే ఎలా? తనని తానెలా రక్షించుకుంటాడు. అసలు రేపటి సూర్యుణ్ణి చూడగలడా? ఇంకొన్ని గంటల్లో తనకేమి కానుంది? తను చచ్చిపోతాడు! అప్పుడతనికి తాను కూడా ఫిలిప్స్‌లా పిరికిగా, వెన్నెముక లేకుండా ఉన్నాననిపించింది. ఫిలిప్స్ ఎలా బాధపడి ఉంటాడో ఇప్పుడతనికి తెలిసివచ్చింది.

"నేను చనిపోతే నేరుగా నరకానికి పోతాను"

గుహలో గోడకు దగ్గరగా కూర్చున్నాడు. యదాలాపంగా బండల మధ్య పాకుతున్న ఒక పాము మీద చేయి వేశాడు. "ఓరి దేవుడా, ఈ చిత్రహింసనెలా భరించాలి?" అదృష్టవశాత్తు పాము పక్కకు పోయింది. అప్పుడు తాను బాధిస్తున్నప్పుడు తన బాధితులేమని భావించారో అతనికి అర్థమైంది.

మళ్ళీ ఎంతో ప్రయత్నించి గుహ మధ్యకు పాకి ఏం చెయ్యాలో పాలుపోక అక్కడే కూర్చున్నాడు. అతని చుట్టూ పాములున్నాయి. గుహ లోపలే ఉంటే పాములు కరవొచ్చు. బయటకు వెళితే క్రూరజంతువులు చంపవచ్చు.

28-5-1981

సూరదాస్ కథ

మళ్ళీ మేల్కొన్న ఉపచేతనాత్మక మనస్సు

"ఓ దేవుడా, ఫిలిప్స్ ఉపచేతనాత్మక మనస్సు అతనిని ఇక్కడికి రప్పించేలా చెయ్యి" అని సూరదాస్ ఏడ్చాడు. వెంటనే తన అంతరాత్మ తనను సన్మార్గంలో పెట్టడంలో కృతకృత్యురాలైందా? అనే ఆలోచన అతనికి కలిగింది.

"నాలోని చెడుపై నా ఉపచేతనాత్మక మనస్సు విజయం సాధించేలా నేనెందుకు చెయ్యలేదు? నా ఉపచేతనాత్మక మనస్సును మూసివేసి, పాపాలు చేస్తూ పోయా నెందుకు?

నేనెందుకు అంత దుష్టుణ్ణి అయ్యాను? ఎందుకయ్యాను అనుకుంటు న్నానంటే ఇప్పుడు నేను మారానా?"

తానెందరినో వేధిస్తున్నట్లు, దొంగతనం చేస్తున్నట్లు, హింసిస్తున్నట్లు, ఆడపిల్లలపై అత్యాచారం చేస్తున్నట్లు, చివరికి తల్లిని కూడా కష్టాల పాలు చేసినట్లు ఒక్కొక్క దృశ్యం అతనికి కనిపించింది.

"అయ్యో, దేవుడా, వాళ్ళందరూ ఎంత బాధపడ్డారో ఇప్పుడర్థమైంది. నా ప్రతీకార స్వభావం, నా దుష్ట స్వార్థ ప్రయోజనాలు, దురాశ, నా సంతోషం కోసం వాళ్ళు నరకాన్ని అనుభవించారు. ఇప్పటివరకూ నాకావిషయం అర్థం కాలేదు – నా మనసులో ఇటువంటి భావమే రాలేదు! నన్నెవరూ ఎప్పుడూ వేధించలేరని, నాకెవ్వరూ ఎప్పుడూ హాని చేయలేరని భావించాను. నేనే పాపాలకు రాజుని. నన్నెవ్వరూ మోసం చెయ్యలేరని అనుకున్నాను. కాని ఇప్పుడేం జరిగింది, వెన్నెముకలేని ఈ చవట, పిరికి సన్యాసి నన్ను మోసం చేసి నాకు కనువిప్పు కలిగించాడు! ఇది దేవుడి న్యాయం. సందేహం లేదు. నాకీ శాస్తి కావలసిందే".

జీవితంలో మొదటిసారిగా దేవుడిని తలిచాడు. మొదటిసారి దేవుడిని ప్రార్థించాడు. "భగవంతుడా, నన్ను రక్షించు. ఇంక నుంచి నేను సన్మార్గంలో దైవభీతి కలిగి జీవిస్తానని మాట ఇస్తున్నాను. నేను బాధించిన వారిలో వీలైనంతమందిని వెతికి పట్టుకొని వారికి సాయం చేస్తాను వాళ్ళ వస్తువులు నా దగ్గరుంటే తిరిగి ఇచ్చేస్తాను. వారిని సంతోషంగా ఉంచడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఎంతో భయంకరమైన జీవితం గడిపి అత్యాశతో ఎక్కువ అడుగు తున్నానని తెలుసు. దేవుడా, ఈ ఒక్క అవకాశాన్ని నాకు ఇవ్వు. నేను నరకానికి పోకుండా, ఈ పాములు, క్రూర జంతువుల మధ్య భూలోకంలోనే నరకం అనుభవించకుండా ఒకే ఒక్క అవకాశం ఇవ్వు. దైవమా! నిన్ను నేను మొదటిసారి వేడుకుంటున్నాను. మొదటిసారి నాకు జ్ఞానం కలిగింది. చెడు నుంచి మంచికి మారే చిట్టచివరి పరివర్తన ఇది. దయుంచి నాకు సాయం చెయ్యి, రక్షించు, నీ సన్మార్గంలో పెట్టు నన్ను. నీ విచక్షణతో నన్ను ఆశీర్వదించి సన్మార్గంలో జీవించేలా చేయి. దేవుడా ఈ ఒక్కసారి నన్ను కాపాడు, నేనింక ఎన్నడూ తప్పు చెయ్యను".

తర్వాత పసిపాపలా ఏడ్వసాగాడు. ఏడుపు ఆపిన తర్వాత, తన ఆలోచనలు, భావాలు ఎంత నిజాయితీగా ఉన్నాయో గుర్తించాడు. తనలాంటి దుష్టాత్ముడికి దేవుడు సాయం చేస్తాడా? ఈ కీకారణ్యంలోకి సాయం చేయడానికి ఎవరొస్తారు? క్రూర జంతువులు, పాములు ఉన్న ఈ అడవిలో సూర్యోదయం వరకూ తాను బ్రతికి బట్టకడతాడా? ఇదంతా సాధ్యమవుతుందని సూరదాస్‌కు అనిపించలేదు.

"అయినా దేవుడు మహిమలు చేస్తాడంటారు కదా! దేవుడా, నీ మహిమ చూపు - దయుంచి నన్ను రక్షించు. నేను ఇంక ఎన్నడూ తప్పు చేయనని మాట ఇస్తున్నాను."

అదే సమయంలో జంతువుల అరపులు వినిపించాయి. అవి గుహకు దగ్గరగా వస్తున్నట్లు అనిపించాయి. ఇంక చావు దగ్గిర పడిందని అనిపించింది. శరీరమంతా గాయాలు, పుళ్ళు ఉన్నా ఎలాగో కష్టపడి గుహలోపలికి మూలకు జరిగాడు. అక్కడ చాలా పాములుంటాయని తెలుసు అతనికి. కాని క్రూర జంతువులు బారినపడడం కన్న పాముకాటుతో చావడం మేలని అతనికి అనిపించింది. భద్రత కోసం ఆ మూలకు వెళ్ళగానే అతని ఛాతీ మీదకు ఒక పాము పాకింది.

"దేవుడా, నన్ను కాపాడు. ఇంకెన్నడూ తప్పు చేయను" ఈ వేడుకోలు మాత్రం అతని హృదయాంతరాళం నుంచి వచ్చింది.

తాను బాధిస్తున్నప్పుడు ఎంతమంది ఇలా తనను బతిమాలారో అతనికి గుర్తువచ్చింది. కాని క్రూరుడైనందువలన నవ్వుతూ వారినింకా వేధించాడు. బాధితులపై కించిత్తు దయ చూపాడా ఎన్నడైనా? ఎన్నడూ చూపలేదు. మరి దేవుడెలా తనపై దయచూపుతాడు?

మళ్ళీ ఏడవడం మొదలుపెట్టాడు. బతకడానికి ఇంక మార్గం లేదని అర్థమైంది. "నేను మరో ఉదయాన్ని చూడలేను. దేవుడా, నన్నిప్పుడే చంపెయ్. గుండె ఆగిపోయేలా చెయ్యి ఇప్పుడే. నేను నరకానికి పోతానని నాకు తెలుసు. క్రూర జంతువుల బారిన పడడం, పాముకాటుతో చావడం, నాకు ఇష్టం లేదు, భగవంతుడా, నన్నిప్పుడే చంపెయ్" అతని శరీరం మీద మరో పాము పాకింది. "దేవుడా, నా మీద జాలి చూపించు. ఇంక నన్ను చిత్రహింస పెట్టకు". కొత్తగా మేల్కొన్న అతని ఉపచేతనాత్మక మనస్సు "నువ్వెప్పుడైనా నీ బాధితులపై జాలిపడ్డావా" అని ప్రశ్నించింది అతడిని.

"నువ్వనేది నిజమే. నేనెన్నడూ జాలి చూపలేదు. నాకిప్పుడదర్థమైంది. కాని చాలా ఆలస్యం జరిగిపోయింది. నేనిపుడు బాధపడవలసిందే. నా మీద దేవుడెందుకు జాలిపడాలి" ఇప్పుడతను నిజంగానే పశ్చాత్తాపం చెందుతున్నాడు. బాగుపడాలను కుంటున్నాడు. కాని మార్గం కనిపించడం లేదు. బతకాలనుకోవడం వ్యర్థం.

అతని ఉపచేతనాత్మక మనస్సు మరోసారి ఇలా అడిగింది, "నువ్వు ఇతరులను బాధించడం మానివేశావా? మరి దేవుడు నీకోసం మహిమ ఎందుకు చూపాలి? నిన్నెందుకు రక్షించాలి? నువ్వు సంతోషంగా ఉన్నప్పుడు, నీకు సఫలత లభించినపుడు దేవుడి గురించి ఆలోచించావా ఎన్నడైనా? ఇప్పుడెందుకు దేవుడి గురించి ఆలోచిస్తున్నావు? ఇప్పుడు నీకు సాయం చెయ్యమని ఎందుకు వేడుకుంటున్నావు?"

29-5-1981

సూరదాస్ కథ

దైవిక ఉన్నత సదాత్మ సాక్షాత్కారం

సూరదాస్‌కి ఇప్పుడంతా స్పష్టమైంది. కాని ఇప్పటికే బాగా ఆలస్యమైందని కూడా అర్థమైంది. కొన్ని గంటలలోపే తను నరకంలో ఉంటానని అతనికి తెలుసు.

"దేవుడి న్యాయం ఎప్పుడూ ఉంది. నేనాలస్యంగా గుర్తించాను. దేవుడు ఎల్లప్పుడూ న్యాయంగానే ఉంటాడు. రావాల్సిన సమయం కన్న ఆలస్యంగా న్యాయం జరుగుతుందేమో కాని న్యాయం తప్పనిసరిగా ఉంది. ఇప్పుడింక నా శిక్షలన్నీ నేననుభించాల్సిందే - తప్పించుకోలేను"

మళ్ళీ అతని ఉపచేతనాత్మక మనస్సు ఇలా అంది "దేవుడిని మహిమ చూపమని అడుగుతున్నావు కదా; చూడు ఈ మహిమని. ఇక నుంచి నువ్వు బాగుపడతావు" అతనికి దీని అర్థం తెలియలేదు. "**నేను పాపం చేశాను. శిక్షననుభవించాల్సిందే** అని ఆలోచించసాగాడు. శిక్షననుభించే సరైన మార్గం చూపించు దేవుడా. నా ఆత్మను పవిత్రీకరించుకొనే మార్గం చూపు. మళ్ళీ నన్ను చెడు మార్గంలో నడవనివ్వకు. చీకటిలో వెలుతురు చూపించు. ఇంక నేనెన్నడూ దేవుడు చూపిన మార్గాన్ని విడనాడను. దేవుడా, పాపం నుంచి నా ఆత్మను కాపాడు. నా శరీరానికి కష్టం కలిగినా, ఫరవాలేదు. నా ఆత్మను కాపాడు."

రాత్రంతా ఇలా గడిచింది. ఉదయాన్నే సూరదాస్ గుహలోకి వెలుగురేఖలు రావడం చూశాడు. చాలా ఆశ్చర్యపోయాడు.

"దేవుడా, అద్భుతం. ఇది నిజంగా నీ మహిమ. నన్ను రక్షించావు". అతను బాగా సంతోషించాడు. తానెలా రక్షింపబడ్డాడో అర్థం చేసుకొనడం అతనికి చేతకాలేదు.

అతనికి ఉపచేతనాత్మక మనస్సు మళ్లీ ఇలా అంది. "సూరదాస్, చివరికి పాములకు, క్రూరజంతువులకు కూడా కాళ్ళు లేని నిస్సహాయుడైన మనిషిపై జాలి ఉంది. కాని నీలాంటి పాపాత్ముడు మాత్రం ఎన్నడూ అమాయకులైన, నిస్సహాయులైన, మంచి వారిపై దయచూపలేదు". అతనికి ఎంతో సిగ్గువేసింది. ఇంకెన్నడూ చెడు మార్గంలో నడవకూడదని ఒట్టు వేసుకున్నాడు.

"అయినా గాని, ఈ దట్టమైన అడవిలో నేను బతికే అవకాశం తక్కువ. ఎవరూ

ఇటుగా వెళ్ళరు. ఈ ఒంటరి ప్రదేశం నుంచి నేనెలా బైటపడగలను? దేవుడా; నువ్వు నన్ను క్రూర జంతువుల నుంచి రక్షించావు. దయచేసి ఈ చోటు నుంచి కూడా నన్ను రక్షించు. నేను సన్మార్గంలో జీవిస్తూ నా చెడు పనులకు పశ్చాత్తాపం చెందుతాను. దేవుడా, నాకు మళ్ళీ సాయం చెయ్యి. నేను చాలా అడుగుతున్నానని తెలుసు. నా ఆత్మపై జాలి చూపించు".

ఎంతో ప్రయత్నంతో గుహ బైటకు పాకి, ఒక బండ మీద కూర్చుని, హృదయ పూర్వకంగా దైవాన్ని ప్రార్థించాడు. కొన్ని గంటల తరువాత ఒక ఫకీరు అలసటగా, కుంటుకుంటూ అటుగా వెళ్ళడం చూశాడు. అమితానందంగా "నాకు సాయం చెయ్యండి దయచేసి!" అని కేకవేశాడు.

ఆ ఫకీరు (మన ఉన్నత సదాత్మ) అతనికి దగ్గరగా వచ్చి "నువ్వు చెడ్డవాడివా, మంచి వాడివా? నేను చెడ్డవాళ్ళకు ఎన్నడూ సాయం చెయ్యను. నువ్వు చెడ్డవాడివా? మంచి వాడివా? చెప్పు" అన్నారు.

సూరదాస్ తాను మంచివాడినని చెప్పాలనుకున్నాడు కాని అతని ఉపచేతనాత్మక మనస్సు ఇప్పుడు పనిచేయడం మొదలుపెట్టింది కనుక అలా చెప్పలేకపోయాడు. ఆ ఫకీరుని చూసి "స్వామీ, కూర్చొని నా కథ వినండి. అప్పుడు నాకు సాయం చెయ్యాలని మీ అంతరాత్మకు అనిపిస్తే, నాకు సాయం చెయ్యండి. లేకపోతే మీ దారిన మీరు వెళ్ళండి. దేవుడు మీకు శుభం చేస్తాడు" అన్నాడు.

దైవిక ఉన్నత సదాత్మ ఒక బండ మీద కూర్చుని "సరే చెప్పు వింటాను" అన్నారు.

సూరదాస్ తన కథంతా చెప్పాడు. అంతా సత్యమే చెప్పాడు. దైవిక ఉన్నత సదాత్మ చాలా సంతోషించారు. కాని మళ్ళీ పరీక్ష పెట్టారతనికి. "మళ్ళీ చెడు మార్గంలో కొనసాగడానికి రక్షించమంటున్నావా?"

"కాదు స్వామీ. నేనింక ఎన్నడూ తప్పుమార్గంలో వెళ్ళను. నేను చాలా కఠినమైన పద్ధతిలో గుణపాఠం నేర్చుకున్నాను. సన్మార్గంలో జీవించడానికే నిన్న రాత్రి నన్ను దేవుడు కాపాడాడని అనుకుంటాను. దేవుడు నాకు ఈ అవకాశం ఇచ్చాడు కనుక ఆయన నన్ను చూసి గర్వించేలా నేను సన్మార్గంలో నడుస్తాను". ఈ మాటలు దైవిక ఉన్నత సదాత్మకు నచ్చాయి. సూరదాస్ తేజోవలయం, స్పందనలు కూడా మారినట్లుగా ఆయన గమనించారు. "సరే. సూరదాస్ నేను నీకు సాయం చేస్తాను" అన్నారు. ముందు అతనికి తిండి, నీరు ఇచ్చి సాయం చేశారు. తర్వాత సూరదాస్‌ని ఇంటికి తీసుకెళ్ళి వదిలిపెట్టి తన పని అయిపోయింది కనుక ఆత్మలోకానికి వచ్చేశారు.

సూరదాస్ ఇంకా భూలోకంలోనే ఉన్నాడు. కృత్రిమకాళ్ళతో దయతో నిస్వార్థంగా, మంచి జీవితాన్ని గడుపుతున్నాడు. అతని తల్లి విడుదలైంది. ఆధారాలు ఎవరు పెట్టారో పోలీసులు రుజువు చెయ్యలేకపోయారు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద (నేరం కచ్చితంగా ఆమే చేసిందని రుజువు పరచలేకపోవడంతో) ఆమెను వదలిపెట్టారు. ఇది విన్న సూరదాస్ ఆమెను వచ్చి తనతో ఉండమన్నాడు. కాలం గడిచే కొద్దీ సూరదాసు తన తల్లిని కూడా బాగుచేశాడు.

ఇప్పుడు తల్లీ కొడుకులిద్దరూ నిజాయితీగా, దయతో కూడిన నిస్వార్థ జీవితాన్ని గడుపుతున్నారు. కాని **నీలూ, దైవిక ఉన్నత సదాత్మ కలిసి తనకు ఎలా సాయం చేశారో సూరదాస్‌కు తెలియదు.** ఆత్మలోకానికి వచ్చినపుడు అతనికి అంతా తెలుస్తుంది.

నీలూ ఇప్పుడు చాలా సంతోషించింది. హృదయాంతరాళాల్లోంచి దైవిక ఉన్నత సదాత్మకు కృతజ్ఞతలు చెప్పింది. ఇదే పద్ధతిలో ఆత్మలోకంలోని చాలా ఆత్మలు భూలోకంలోని వారికి సాయం చేశాయి. మీరు దానిని మహిమ అంటారు. నిజంగా అది మహిమే.

30-5-1981

ఉపచేతనాత్మక మనస్సే నిజమైన మీరు

భూలోకంలో ఉన్నపుడు తరచుగా ఈ ప్రశ్నను వింటుండేవాళ్ళం, "భూలోకంలో గత జన్మల గురించి మనకేమీ ఎందుకు తెలియదు? ఆత్మలోకం గురించి ఎందుకు తెలీదు? దేవుడు మనం మర్చిపోయేలా ఎందుకు చేశాడు."

మీ ఉపచేతనాత్మక మనస్సుకు ప్రతి విషయమూ తెలుసు. మీకు (మీ ఆత్మకు) ఏం జరిగినా మొదటి నుంచీ అది మీ ఉపచేతనాత్మక మనస్సులో నిక్షిప్తమై ఉంటుంది. దురదృష్టవశాత్తు మీ భౌతిక మనస్సుకు ఇవన్నీ గుర్తుండవు. అంతేకాకుండా అది ఉపచేతనాత్మక మనస్సుతో నిరంతరం యుద్ధం చేస్తూ ఉంటుంది. చాలా కొన్ని ఆత్మలు మాత్రమే తమ ఉపచేతనాత్మక మనస్సుతో భౌతిక మనస్సును నియంత్రించ గలరు. ఈ ఆత్మలకు ఇంద్రియాతీత గ్రహణశక్తి (ఇఎస్‌పి) ఉంటుంది. కొందరికి భూలోకంలోని గత జన్మలు కూడా గుర్తుంటాయి. వాళ్ళకు తమ నిజనివాసమైన ఆత్మలోకం కూడా గుర్తుంటుంది. కాని ఇది చాలా అరుదు.

ఉపచేతనాత్మక మనస్సు ఇవన్నీ మీరు గుర్తుంచుకోకుండా ఎందుకు చేస్తుందో తెలుసుకోవాలనుకుంటారు బహుశా. ఇంతకుముందు చెప్పినట్లుగానే భౌతిక మనస్సుకు వీటిని భరించే శక్తి ఉండదు. అంతేకాకుండా భూలోకానికి మీరు అనుభవం కోసం,

పరీక్షల కోసం, శిక్షణ కోసం, కర్మను అనుభవించడానికి వచ్చారు కనుక ఉపచేతనాత్మక మనస్సుకు ఇవన్నీ మీకు తెలియడం ఇష్టం ఉండదు. **ఒకవేళ మీకు అన్నీ తెలిస్తే, మీరు భరించడం కష్టం. ఇంక జీవితంలో వినోదం ఉండదు. యంత్రంలా జీవిస్తుంటారు. మీ కర్మ గనుక మీకు తెలిస్తే భూలోకంలో మీ జీవితం ఏ మార్పుకు నోచుకోక నిస్తేజంగా ఉంటుంది.**

మీ ఉపచేతనాత్మక మనస్సుకు అంతా తెలుసు. అది ఎన్నడూ ఏ తప్పులూ చెయ్యదు. అన్నీ నిక్షిప్తం చేస్తుంది. ఉన్నతస్థాయిలోని ఆత్మలకు భూలోకంలో ఉన్నపుడు, సాధారణ ఆత్మలలోకన్న వీరి ఉపచేతనాత్మక మనస్సు కొంత శక్తిమంతంగా ఉంటుంది. కొంత అని ఎందుకంటున్నామంటే, ఆత్మలోకంలో కూడా, భూలోకంలోని వారికన్న మా ఉపచేతనాత్మక మనస్సు కొంత ఎక్కువగానే తెరచుకొని ఉన్నా గాని మాలో కూడా పూర్తిగా పనిచేయదు.

ఆత్మలోకంలో 7వ ఆవరణలోనే ఉపచేతనాత్మక మనస్సు అధికతర సామర్థ్యంతో పనిచేస్తుంది.

భూలోకంలో కొందరు యోగులకు[13], స్వాములకు ఎక్కువసేపు ధ్యానం చేసే శక్తి ఉంటుంది. వారి ఉపచేతనాత్మక మనస్సు బాగా తెరచుకొని ఉంటుంది. దీనితో వారు భౌతిక మనస్సును బాగా నియంత్రించుకోగలరు. మీలాగ వారు చేతనాత్మక మనస్సుకు బానిసలు కారు. **మీ చేతనాత్మక మనస్సుకు బానిసలు కావద్దు.** దానిని మీరు నియంత్రించకపోతే అది మిమ్మల్ని బాగా దుర్దశకు చేరుస్తుంది. **మీరు భూలోకాన్ని విడిచిపెట్టగానే మీ భౌతిక శరీరంతోపాటు మీ చేతనాత్మక మనస్సు కూడా చనిపోతుంది.** చేతనాత్మక మనస్సు మిమ్మల్ని బానిసలుగా చేయడానికి చాలా ఆత్రుతపడుతూ, దానిష్టం వచ్చినట్టుగా మీరు నడిచేలా చేస్తుంది. అయితే మీరు మీ ఇచ్ఛాశక్తిని ఉపయోగించి దానిని ఎన్నడూ గెలవకుండా చూడాలి.

మీ ఆత్మ, మీ ఉపచేతనాత్మక మనస్సు రెండూ అనంతమైన బంధం కలిగి ఉన్నాయి. అలాంటప్పుడు శిక్షణ లేని చేతనాత్మక మనస్సు మీకు యజమాని ఎలా అవుతుంది? మీరు దానిని నియంత్రించలేనంతటి బలహీనమైన, వెన్నముకలేని అల్పులా?

ఇప్పటి నుంచి ఇది గుర్తుంచుకోండి: **మీ ఉపచేతనాత్మక మనస్సే నిజమైన మీరు.** ఎన్నడూ చేతనాత్మక మనస్సును మీపై ఆధిపత్యం చెలాయించనివ్వవద్దు. మీకు మీరే యజమాని.

---

13. యోగంలోని పలు రకాలలో నిష్ణాతుడు యోగి

31-5-1981

గత జన్మస్మృతి ఎందుకు కలగదు

భూలోకంలోని ప్రజలకు ఆత్మలోకానికి సంబంధించిన ఆనందకరమైన జ్ఞాపకాలు, గత జన్మల స్మృతులు గుర్తుండవు. ఉన్నతోన్నతంగా ఎదగ డానికి మనం భూలోకంలో అనుభవం కోసం, శిక్షణ కోసం, ఆత్మను పవిత్రీకరించుకొనడానికి ఎన్నోసార్లు జన్మించి ఉంటాం. ఆ పరిస్థితిలో భూలోకంలోని గత జన్మలను అన్నిటినీ మనం గుర్తుపెట్టుకుంటే, ఇంకా జ్ఞానం కలగడానికి అదేమైనా సాయపడుతుందా? చాలామంది సాయపడుతుంది అంటారు. కాని మేము సాయపడదు అంటాం, ఎందుకంటే గత జన్మలను గుర్తుపెట్టు కుంటే, మళ్ళీ అవే తప్పులు ఎందుకు చేస్తారు? చెయ్యరు.

తప్పులను సరిదిద్దుకుంటూ, సమస్యలు పరిష్కరించుకుంటూ ఇబ్బందులు పడుతూ ఆత్మను పవిత్రీకరించుకొంటారు. తప్పులు చెయ్యకుండా, సమస్యలు రాకుండా, బాధ కలగకుండా మీకు మంచికీ చెడుకూ భేదం తెలియదు. మీకు ఇది అర్థం కాకపోతే, జీవితం వలన ప్రయోజనం ఏమిటి? ఆత్మలోక స్మృతులు, గత జన్మల స్మృతులు అలాగే ఉంటే మీరు యంత్రంలా జీవిస్తుంటారు. పరీక్షకుగాని, శిక్షణకు గాని, కర్మకు గాని మీ ప్రతిస్పందన సహజంగా ఉండదు. మీ నిర్ణయాలు ముందే నిర్దేశితమైపోయి ఉంటాయి - అవి మీ మానసిక పరిస్థితి ఫలితంగా వచ్చినవి అయి ఉండవు.

భూలోకంలో ప్రతి ఒక్కరు సంతోషం కోసం తపిస్తారు. కాని నిజమైన సంతోషం ఏమిటో వారికి తెలుసా? లేదు. భూలోకంలోని వారు బోలెడంత డబ్బు, సౌకర్యాలు, విలాసాలు, వినోదం, కీర్తి ఉంటే అదే సంతోషమనుకుంటారు. కాని ఇవన్నీ కూడా నిజమైన సంతోషాన్నివ్వలేవని చెప్పడానికి మేము చింతిస్తున్నాం. నిజమైన ప్రేమ, ప్రకృతి సౌందర్యం, హృదయపూర్వకంగా వచ్చిన నవ్వు, చిరునవ్వు (చాలామంది తెచ్చుకున్నట్లుగా బలవంతంగా కాదు) నిస్వార్థంగా ఇతరులకు సాయం చెయ్యడం, ఆత్మను పవిత్రీకరించుకొని మరింత ఉన్నత స్థాయికి ఎదగడంలో నిజమైన సంతోషం ఉంటుంది. తప్పులు చేస్తూ, చేసిన తప్పులు తెలుసుకుంటూ ఆత్మను పవిత్రీకరించు కుంటూ మరింత ఉన్నతస్థాయికి ఎదుగుతారు. తప్పులను మీరెలా సరిదిద్దుకుంటున్నారు, సమస్యలనెలా పరిష్కరించుకుంటున్నారు, కష్టాలనెలా ఎదుర్కొంటున్నారు అనే వాటిపై ఇదంతా ఆధారపడి ఉంటుంది. ఈ విషయాలన్నీ మీపైనే ఆధారపడి ఉంటాయి - తప్పులనెలా సవరించుకొంటున్నారు, సమస్యలనెలా పరిష్కరించుకొంటున్నారు, ఇబ్బందులనెలా ఎదుర్కొంటున్నారు, సన్మార్గంలో నిజాయితీగా దైవికమార్గంలోనా,

దుర్మార్గంలో పాపపు మార్గంలోనా అనేదాన్ని బట్టి.

ఉదాహరణకు మీరొక తప్పు చేసి, తప్పు చేశానని గుర్తిస్తే, ఆ తప్పును సవరించుకోవాలి. అనుభవం సంపాదించడానికి, శిక్షణ పొందడానికి, ఆత్మను పవిత్రీకరించుకొనడానికి మిమ్మల్ని భూలోకానికి పంపడం జరిగింది. ఇది మిమ్మల్ని మరింత ఉన్నతస్థాయికి చేరుస్తుంది. అందుకని మీరు జీవితంలో సమస్యలు, ఇబ్బందులు, అన్యాయాలు సహించాలి.

ఆత్మలోకంలో మాకంతా గుర్తుంటుంది. మా స్మృతులు మీ స్మృతులలా చెరిగిపోవు, అందుకని మా ప్రగతి చాలా నిదానం. వేగంగా ప్రగతిని పొందడానికి మీరు భూలోకంలో జన్మించారు. కాని చాలామంది మరింత కిందికి పడిపోతున్నారు. ఆత్మలోకంలోని మీ నిజ నివాసం మీకెందుకు గుర్తులేదని మీరు ఆశ్చర్యపడు తుండవచ్చు. ఒకవేళ **మంచివారైన మీకు ఆత్మలోకం గుర్తుంటే భూలోకంలో నివసించలేరు. చెడ్డ ఆత్మలు, దుష్టాత్మలు మాత్రం దురదృష్టవశాత్తు, 1,2,3 ఆవరణలెలా ఉంటాయో మర్చిపోయాయి.** చాలాసార్లు అమాయకంగా ఉండి కూడా, తప్పు చేశారని అన్నపుడు, దేవుడి మీద నమ్మకం పోతుంది మీకు. అటువంటి సమయంలో మీరిలా అనుకొని ఉండవచ్చు. "నిజంగా దేవుడున్నాడా? ఉంటే ఎందుకు కనిపించడు? ఇన్నిసార్లు నన్నెందుకిలా మోసం చేస్తున్నాడు? నాకు అత్యవసరమైనపుడు ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడా న్యాయం లేదు ఎందుకని? దేవుడు అంత మంచివాడు, కరుణామయుడు, న్యాయం చేసేవాడు అయితే చెడ్డవారు బాగుండేలా ఎందుకు చేస్తాడు? చెడ్డవారు విజయాలు సాధిస్తూండగా, మంచివారు బాధలనెందు కనుభవిస్తారు? ఎందుకని?"

ఈ ప్రశ్నలు మీరెప్పుడైనా అడిగారా? కొన్ని జవాబులు ఇక్కడున్నాయి.

1. నిజంగా దేవుడున్నాడా?

   ఉన్నాడు. దేవుడున్నాడు, ఆయన లేకపోతే మిమ్మల్ని సృష్టించింది ఎవరు. భూమిని సృష్టించింది ఎవరు? చెట్లు, పూలు, ఫలాలు, సముద్రాలు, నదులు, పర్వతాలు సృష్టించింది ఎవరు? పాపాత్ములను మార్మిక పద్ధతిలో శిక్షించేది ఎవరు? ప్రేమించే భావాలు మీకెవరు కలిగించారు. మీ ఆత్మీయులకు సన్నిహితంగా మిమ్మల్ని ఎవరు ఉంచారు? దేవుడనేవాడు లేకపోతే ఈ పనులన్నీ ఎవరు చేయగలిగేవారు?

2. మీరు అమాయకులు అయినా మీరు తప్పు చేశారని రుజువైంది. మరి అప్పుడు దేవుడు ఎక్కడున్నాడు?

   దీనికి చాలా జవాబులున్నాయి. వీటిలో ఒకటి మీకు సరిపోయేది కావచ్చు.

(ఎ) మీరు నిశ్చయంగా ఎవరికీ ఎన్నడూ హాని చేయలేదని ఎవరినీ బాధపెట్ట లేదని కచ్చితంగా నమ్ముతున్నారా? ఒకవేళ అలా చేసి ఉంటే దానికి మీరు శిక్షననుభవిస్తున్నారేమొ.

(బి) మీరు ఎవరినైనా బాగా కష్టపెట్టి ఉంటారు. లేకపోతే మీ గత జన్మలో పాపం చేసి ఉంటారు. ఇది దానికి ఫలితం అయి ఉండవచ్చు.

(సి) మీరు సహజంగానే మరింత ఉన్నతంగా ఎదగాలనుకుంటారు, బాగా ఆలోచించండి, సమస్యలు ఏమీ ఎదుర్కొనకుండా మీరు అలా ఎదగగలరా?

(డి) మీరు చాలా సదాచారులు, సదాత్ములు అని మీరు అనుకుంటే, మిమ్మల్ని మీరు ఎన్నడైనా తరచి చూసుకున్నారా? మీరు చేసిన ప్రతిదీ నిస్వార్థమైనది, సరైనది, కపటము, హిపోక్రసీ, స్వార్థ ప్రయోజనము లేనిదా ఆలోచించి తెలుసుకోండి. ఎన్నడైనా ఒక స్వార్థ ప్రయోజనాన్ని ఆశించి, చివరికి స్వర్గానికి చేరతాననే ఆలోచనతో గాని, కీర్తి కలుగు తుందనిగాని, ఈ మంచి పని చేస్తే, పాపాలన్నీ క్షమింపబడతాయని గాని భావిస్తూ మంచిపని చేశారా? అలా చేసిన మంచిపనులు మంచి పనులు కావు. మీరు మిమ్మల్ని, ప్రపంచాన్ని మోసం చేస్తున్నారు. భూలోకంలోని వారు తమను తాము ఎప్పుడూ మోసం చేసుకుంటారు, చివరికి దేవుడిని కూడా మోసం చెయ్యాలని చూస్తారు (ఇలా ఎన్నటికీ చెయ్యలేరు). మీరు పాపం చేస్తున్నారని అనుకుంటున్నారా? నిజమే. మీరు పాపం చేస్తున్నారు.

(ఇ) భూలోకంలో చాలామందికి డబ్బు చాలా విలువైనది. అతిగా ఏమున్నా మంచిది కాదు. ధనమే పాపాలన్నిటికీ మూలకారణమని మీకు తెలుసు. డబ్బు వల్ల చూపుపోతుంది. చెవులు బీదవారి కేకలు వినలేవు. హృదయం బండగా మారుతుంది. దయ, విధేయత, ప్రేమ (నిజమైన ప్రేమ), కుటుంబం పట్ల, ఇతరుల పట్ల మీకున్న బాధ్యతలు మర్చి పోతారు.

(ఎఫ్) ఎవరినైనా తప్పుగా అనుకున్నారా? ఎవరినైనా తప్పుదారి పట్టిం చారా? అందువల్లే ఇలా జరిగిందా?

(జి) బాగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలనుకున్నారా ఎప్పుడైనా? ఆ

కోరికతో, ఆశతో ఎవరికైనా హాని చేశారా? ఎవరినైనా తప్పుదారి పట్టించారా?

(హెచ్) మీ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఎవరినైనా బాధించారా?

(ఐ) చెడ్డ వ్యక్తిని ప్రోత్సహించారా? చెడ్డ వ్యక్తితో మంచిగా ఉన్నారా? చెడ్డ వారితో మంచిగా ఉంటే, చెడు చేయడానికి వారిని మీరు ప్రోత్స హిస్తున్నట్టే. అలా చేయడం వల్ల మీరూ అటువంటి వారే అవుతారు!

సర్వశక్తిమంతుడైన భగవంతుడు ఎన్నడూ అన్యాయంగా ఉండడని గుర్తించారా? దేవుడు ఎవరికీ అన్యాయం చెయ్యడు. మీరు నిజంగా అమాయకులైతే మీకు **రుజువు ఉన్నా లేకపోయినా ఆయన మీరు అమాయకులని రుజువు చేస్తాడు. అయితే మీరు దైవ నిర్దేశిత సన్మార్గంలో ఉండాలి?** ఇది వెంటనే జరగకపోవచ్చు - నెలలు పట్టవచ్చు, సంవత్సరాలు పట్టవచ్చు, దశాబ్దాలు పట్టవచ్చు - అయినా ఆయన రుజువు చేస్తాడు.

మిమ్మల్ని మీరు తరచి చూసుకోండి. ప్రశ్నించుకోండి. వీటిలో ఒకటి మీకు కచ్చితంగా సరిపోతుందని మా నమ్మకం. మీరు కష్టపడుతున్నపుడు కాని, సమస్య వచ్చినపుడు గాని ఇవే ప్రశ్నలు వేసుకోండి.

ఇప్పుడు చెప్పే విషయం మీరు అర్థం చేసుకోవాలని కోరుతున్నాము : మీరు భూలోకంలో ఉన్నారు. మీ ఆత్మకు అనుభవం సంపాదించిపెట్టే శిక్షణ సంస్థ భూలోకం. ఉన్నత ఆవరణలకు, శాశ్వత ఆనందానికి మీరు వేసే మొదటి అడుగు ఇది. మీ కర్మను సులువుగా చెల్లించుకోవడానికి, మంచి పనులు చేయడానికి, నిస్వార్థంగా ఇతరులకు సాయం చెయ్యడానికి, మీ ప్రియమైన వారికి సాయం చేయడానికి మీకున్న అవకాశం. అయితే మరి మీరేం కావాలనుకుంటున్నారు? ఒడుదుడుకులు లేకుండా ఉండడమా? ముళ్ళు లేని గులాబీ పరుపా? దుష్ట ప్రపంచం నుంచి మీరేం ఆశిస్తున్నారు - మంచితనం పొంగిపొరలాలనా? మీ సమస్యలను మీరు ధైర్యంగా చిరునవ్వుతో ఎదుర్కొనాలి. చెడును ఎదిరించాలి.

ఆత్మను పవిత్రీకరించుకోవాలి.

ఇందుకోసమే ఇప్పుడు మీరు భూలోకంలో ఉన్నారు. ఎల్లవేళలా దీనిని గుర్తుంచుకొని ధైర్య సాహసాలతో వివేకంతో ఉండండి. ఈ రోజు మీరు దేవుడు అన్యాయం

చేశాడని అనుకోవచ్చు, కాని సర్వశక్తిమంతుడైన భగవంతుడు పూర్తిగా సరైన పనే చేశాడని ఒకనాడు గుర్తిస్తారు. ఇదే మీకు, మీ ప్రియతములకు అత్యుత్తమం. దీనిలో పొరపాటేమీ లేదు.

03-6-1981

ఆత్మ మార్గదర్శులు

మనమందరం మనుషులమే – మీరు భూలోకంలో ఉన్నారు. మేము ఆత్మ లోకంలో ఉన్నాము. మనిద్దరి స్వభావాలు భిన్నంగా ఉంటాయి. భూలోకంలో మీ ఆత్మను పవిత్రీకరించుకొనడానికి ఉన్నారని గుర్తుంచుకోండి.

ద్వేషాన్ని పారద్రోలి ప్రేమను కలిగి ఉండండి.

ఈర్ష్యను పారద్రోలి అవగాహనను కలిగి ఉండండి.

కఠినత్వాన్ని పారద్రోలి దయను కలిగి ఉండండి.

క్రూరత్వాన్ని పారద్రోలి వివేకాన్ని కలిగి ఉండండి.

స్వార్థాన్ని పారద్రోలి నిస్వార్థాన్ని కలిగి ఉండండి.

ఈ రకంగా ప్రవర్తిస్తూ మీ ఆత్మను పవిత్రీకరించుకుంటూ ఉన్నతస్థాయికి చేరడానికి మీకు మీరు సాయం చేసుకోండి.

భూలోకంలో పునర్జన్మ జూదం వంటిది. సూరదాస్ కథ ద్వారా మీకా విషయం అర్థమై ఉంటుంది. ఏది ఏమైనా, ఆత్మను పవిత్రీకరించుకొని, ఉన్నతస్థాయికి చేరడం ముఖ్యం. దీనికోసం సర్వశక్తిమంతుడైన భగవంతుడు దుష్ప్రభావాల నుంచి మీకు రెట్టింపు రక్షణను కల్పించాడు. దీనివల్ల మీరు ఆధ్యాత్మికంగా కిందకు పడలేరు. మొదటిది శక్తిమంతమైన, అద్భుతమైన మీ ఉపచేతనాత్మక మనస్సు. మిమ్మల్ని ఎల్లప్పుడు అది ఆపాలని ప్రయత్నిస్తుంది. ఒకవేళ మీరు దీని మాట వినకూడదని అనుకుంటే ఇది నిద్రాణంగా ఉండిపోతుంది. రెండవది మీ ఆధ్యాత్మిక మార్గదర్శి. దీనినే చాలామంది మార్గదర్శక దేవదూత అంటారు. భూలోకంలోని ఆత్మలన్నిటికీ ఆధ్యాత్మిక మార్గదర్శకులుంటారు. వారు ఆత్మలోకం నుంచి వీరిని కాపాడుతూ ఉంటారు. ఈ మార్గదర్శులు మీరెక్కడ తప్పు చేశారో చెబుతారు.

మీ ఆధ్యాత్మిక మార్గదర్శికి మీ గురించి అంతా తెలిసి ఉంటుంది. మీరు సన్మార్గంలో నడిచేలా ప్రభావితం చేయాలని బాగా ప్రయత్నిస్తారు. మీ ఉపచేతనాత్మక మనస్సు

నిద్రాణమైపోయే ముందుగా ఆధ్యాత్మిక మార్గదర్శితో "నా వల్ల ప్రయోజనం లేదు, ఇంక మీరు మీ అదనపు బాధ్యతలు నిర్వర్తించమని చెబుతుంది".

మీ భౌతిక మనస్సు ద్వారా మిమ్మల్ని సన్మార్గంలో పెట్టడానికి మీ మార్గదర్శికి చాలా కష్టమవుతుంది. మార్గదర్శి తన పరిమితులను దాటి అతడు / ఆమె అనుకునేటట్లు చేయడానికి మీ భౌతిక మనస్సును బలవంతం చేయవలసి ఉంటుంది. అలాంటి సమయాలలో భౌతిక మనస్సు ద్వారా భూలోకంలోని కొందరు వినలేరు. మీకిచ్చిన మార్గదర్శకత్వాన్ని తిరస్కరించి, ఇతరులకు హాని చేస్తూనే ఉంటారు.

ఇతరులకు హాని చేస్తున్నామని మీరనుకోవచ్చు. మీలో కొందరు దీనివల్ల సంతోషం కూడా పొందవచ్చు. **కాని వాస్తవంలో ఇతరులకు హాని చేసినదాని కన్న, వందల రెట్లు మీకు మీరు హాని చేసుకుంటున్నారు.**

ఇతరులకు హాని చేయడం, ఇతరులకు హాని చేయడం వల్ల కలిగే ఆనందం మీకు శాశ్వత ఆనందాన్ని కలిగిస్తాయా? ఇది మిమ్మల్ని ఉన్నతస్థాయికి చేరుస్తుందా? భూలోకంలో ఉండే కొన్నాళ్ళపాటు తాత్కాలిక సంతోషం కోసం, మీరు నిజమైన, శాశ్వతమైన ఆనందాన్ని త్యాగం చేసి, వేల ఏళ్ళపాటు నరకంలో ఉంటారా? తెలివి తక్కువ తనం కాదా? అహంకారాన్ని వదిలిపెట్టి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

04-6-1981

కవల ఆత్మలు

ఆత్మసత్తలు తమ ప్రియతములను ఉన్నతస్థాయికి చేర్చడానికి చాలా ఆత్రుత పడతారు. తమ ప్రియతములు ఎన్నడూ తప్పు చేయకుండా ఉండాలని, బాధపడకుండా ఉండాలని వీరు వారిని ప్రోత్సహించడానికి విశ్వప్రయత్నం చేస్తారు.

ప్రతి ఆత్మకూ ఒక కవల ఆత్మ ఉంటుంది. ఈ కవలల్లో ఒక ఆత్మ ఉన్నత స్థాయిలో ఉండి మరొక ఆత్మ కింది స్థాయిలో ఉంటే చాలా కష్టం. ఉన్నతస్థాయిలో ఉన్న ఆత్మ తన కవల ఆత్మ ఉన్నతస్థాయికి ఎదిగే వరకు నిరీక్షించవలసి ఉంటుంది. ఈ కారణంగా ఆత్మలోకంలో ఉన్నతస్థాయిలో ఉన్న ఆత్మ, భూలోకంలో కిందిస్థాయిలో ఉన్న ఆత్మను ప్రోత్సహించవలసి ఉంటుంది. భూలోకంలోని కవల ఆత్మను ఉన్నత స్థాయికి తేవడం చాలా కష్టమైన పని. తమ మరో అర్ధభాగం సదాత్మ అయినా, దుష్టాత్మ అయినా కవలలందరూ కలిసి ఉండాలనుకుంటారు.

భూలోకంలోని వ్యక్తి తన ఉపచేతనాత్మక మనస్సును నిద్రాణస్థితిలోకి జారనిస్తే, మార్గదర్శి చూపే ప్రభావ మార్గాన్ని అంగీకరించకుండా తిరస్కరిస్తే ఆత్మసత్తలమైన మాకు నిజంగానే సమస్య. ఒక కవల ఆత్మకు రెండో ఆత్మను సన్మార్గంలో నడిచేలా చేయడం చాలా కష్టమైన పని. చాలా కొద్దిమంది కవలలు మాత్రమే ఒకేస్థాయిలో ఉంటారు. అందువల్ల ఉన్నతస్థాయిలోని ఆత్మ నిరీక్షించవలసి ఉంటుంది - 2,3 కాదు, 20,30 కాదు, 200, 300 కాదు, కొన్నిసార్లు 500 నుంచి 600 ఏళ్ళు నిరీక్షించవలసి ఉంటుంది. ఒకసారి ఆత్మ 1,2,3 ఆవరణలకు చేరితే ఉన్నతస్థాయికి చేరడానికి (భూలోకంలోని ఏళ్ళు) ఎన్నో వందల ఏళ్ళు పడతాయి. కొందరికి వేల యేళ్ళు కూడా పట్టవచ్చు.

తన కవల ఆత్మపైకి రావాలని కోరుకునే ఆత్మ కోరిక ఎంతబలంగా ఉంటుందంటే, ఎంత నిజాయితీగా ఉంటుందంటే అతడు / ఆమె తన కవల ఆత్మకు సాయపడడానికి భూలోకంలో కూడా జన్మిస్తారు. కొన్నిసార్లు వారు సఫలమవుతారు. కాని చాలాసార్లు మరింత కింది స్థాయికి చేరతారు. ఈ రకంగా ఆత్మలోకం, భూలోకం నడుస్తాయి.

ఈ విషయాన్ని మీకు మళ్ళీ చెప్పకుండా ఉండలేకపోతున్నాం. భూలోకంలోని వారు తమకేది మంచిదో, తమకేది చెడ్డదో తెలుసుకొనే తెలివిగలవారైనాగాని, ఆత్మలోకం నుంచి సందేశాలు పొందడానికి ప్రయత్నించినాగాని, వారికి విషయాలు అర్థం చేసుకొనడం తేలికవుతుంది. అయితే భూలోకంలోని చాలామందికి చనిపోయిన తర్వాత మళ్ళీ పుడతామని గాని, ఆత్మలోకంపై గాని నమ్మకం ఉండదు. కొందరికి నమ్మకం ఉన్నాగాని, మేము సందేశాలెలా పంపుతామో వారి అవగాహనకు అందదు, భూలోకంలోని వారెలా వాటిని అందుకుంటారో తెలియదు. మీలోకంలో కొందరు బుద్ధిహీనులు "చనిపోయిన ఆత్మలతో మాట్లాడకండి. వారి ప్రగతిని ఆపుతూ మీరు వారిని వేధిస్తున్నారు" అంటారు.

మమ్మల్ని అపార్థం చేసుకోవద్దు దయచేసి, ఆ బుద్ధిహీనులకు ఇలా చెప్పకుండా ఉండలేకపోతున్నాం. మీరు నిజంగా తెలివైనవారు, అర్థం చేసుకోగలవారు అయితే మీరిలా అనుకోరు. ఇంకా ఆత్మలతో మాట్లాడడం ఆపాలని అనుకొనేవారు పాపాలు చేసేవారు, అవినీతిపరులు. ప్రపంచానికి తమ గురించిన నిజం తెలిసిపోతుందని భయపడతారు. తామింక ప్రపంచాన్ని మోసం చెయ్యడం కుదరదని, తమ దుష్ట మార్గాన్ని కొనసాగించలేమని అనుకుంటారు. కొందరు ఒక్కటే తమకు తెలుసునని నమ్ముతారు అంతేకాకుండా ఆత్మలోకంతో మాట్లాడేవారు అబద్ధమాడుతున్నారనిగాని, పిచ్చివారనిగాని ఇతరులను నమ్మించడానికి ప్రయత్నిస్తారు.

భూలోకంలోని వారు మాతో సహకరిస్తే, మేము సులభంగా సందేశాలు పంపగలం, వారికి సాయం చేయగలం. దీనికి మారుగా వారు ఇదంతా అర్థం లేనిదని, హంబగ్ అనీ, ఇది సాయం చెయ్యడం కన్న హాని చేస్తుందని ఇంకా ఏవేవో మాట్లాడతారు. అందువల్ల మా ఆలోచనలు తెలియజేయడానికి మేమెంతో కష్టపడాలి. వీరిని సన్మార్గంలోకి తేవడానికి వీళ్ళ వెనుక ఎన్నో ఏళ్ళు పరిగెత్తాలి. ఇంత కష్టపడినా కొన్ని ఆత్మలు మొండిగా ఉంటాయి. అవి మా మాటలు వినవు. చెడు మార్గంలోనే నడుస్తాయి.

భూలోకంలో ఒక దుష్టాత్మ అతడు / ఆమె తన ఉపచేతనాత్మక మనస్సును నిద్రాణంగా చేసినపుడు, వారి మార్గదర్శి వారిని సన్మార్గంలో పెట్టలేకపోయినపుడు, వారి కవల ఆత్మ తప్ప వారిని ఎవరు బాగుచేయగలరు? భూలోకంలో కిందికి పడిపోయిన కవల ఆత్మను ఉన్నతస్థాయికి తేవడం, వారిని బాగుపరచడం ఆత్మలోకంలోని కవల ఆత్మకు కష్టమైన పని. అందువల్ల చేయవలసింది చేసి మిమ్మల్ని మీరు బాగు పరచుకొని, త్వరితంగా ఉన్నతస్థాయికి ఎదగండి. భూలోకంలో కొద్దికాలం మాత్రమే లభించే వినోదం, సంతోషం కోసం ఆలోచించకండి, శాశ్వతమైన ఆనందం గురించి ఆలోచించండి.

05-6-1981

మంచినో, చెడునో ఎంపిక చేసుకొనేది మీరే

మీరు పుస్తకాలు చదివి ఉంటారు. ఉపదేశాలు విని ఉంటారు, బళ్ళోను, పెద్దలు, స్నేహితులు ఏది తప్పో, ఏది ఒప్పో మిమ్మల్ని మీరెలా బాగుపరచు కోవాలో చెప్పి ఉంటారు. కాని మీలో కొందరు వినడం కాని, చదవడం గాని చేయరు. కొన్ని ఆత్మలు "నేనెందుకిలా చేయకూడదు? ఇతరులను బాధిస్తే నాకు సంతోషం కలుగుతుంది. ఎవరినైనా మోసగిస్తే నాకు సంతోషం కలుగుతుంది. ఎవరికైనా హాని చేయడం, ఎవరినైనా దోచుకొనడంలో ఎంతో ఆనందం ఉంది," అంటాయి.

ఆ ఆత్మలను మేమిలా ప్రశ్నిస్తున్నాం, "ఎవరికైనా సాయం చేస్తే మీకు సంతోషం కలగదా? మీకు హాని చేసిన వారిని క్షమించినపుడు ప్రశాంతంగా ఉండదా? ఎవరికైనా సంతోషం కలిగించినపుడు మీకు ఆనందం కలగదా?" ఈ పనులు మీకు సంతోషం కలిగించకుండా ఉంటే, ఆ చెడ్డపనులే ఆనందం కలిగిస్తుంటే, మిమ్మల్ని చూసి బాధ పడతాం, జాలిపడతాం.

ప్రతి మనిషిలోను మంచి, చెడు ఉంటాయి. మంచిగా ఉండడమో, చెడుగా ఉండడమో వారి ఇష్టం. ఇదే ముఖ్యమైన అంశం. మీలోని చెడును నియంత్రించి, మంచిని బయటికి రప్పించడం నిశ్చయంగా గొప్ప విషయం.

ఇతరులకు హానిచేస్తే సంతోషం కలుగుతున్నపుడు, మోసం చేస్తూ సంతోషంగా ఉంటున్నపుడు, ఇతరులను వేధిస్తే బాగుంటున్నపుడు సర్వశక్తిమంతుడైన భగవంతుని సాయం చేయమని, బాగుపడేందుకు మార్గం చూపమని, ఆశీర్వదించమని కోరే సమయం కాదా?

06-6-1981

ఆత్మలతో మాట్లాడడం వల్ల భూలోకంలోని ప్రియతములకు ఓదార్పు లభిస్తుంది

భూలోకంలోని ప్రియతములతో మాట్లాడాలని మేము బాగా కోరుకుంటాం. ఈ అవకాశం ఇవ్వమని సర్వశక్తిమంతుడైన భగవంతుని నిరంతరం వేడుకుంటాం. భూలోకంలోనివారు తమ పనిలో, వినోదంలో, ధన సంపాదనలో పడిపోయి, చనిపోయిన తమ ప్రియతముల గురించి ఆలోచించరు.

ఏది ఏమైనా, మా అమ్మానాన్నలాంటి కొందరు చనిపోయిన తమ ప్రియతములతో మాట్లాడాలని తపిస్తుంటారు. మా అమ్మానాన్న మేము వారితో మాట్లాడాలని కోరుకుంటు న్నారని తెలిసినపుడు చాలా సంతోషించాం. మాతో మాట్లాడగలుగు తున్నందుకు వారు కూడా సంతోషించారు. మా అమ్మానాన్నలాంటి వారు ఎక్కువమంది ఉండాలని ఆత్మసత్తలు కోరుకుంటాయి! మేము వారిని ఓదార్చగలిగాం. వారినెవరు మోసం చేస్తున్నారో, ఎవరు వారికి మంచి స్నేహితులో, ఎవరిని నమ్మవచ్చో, ఎవరిని సాయం కోరవచ్చో వారికి చెప్పగలిగాం. మీ లోకంలో మా అమ్మానాన్నకు ఎవరూ లేరు. కొంతమంది బంధువులు, సాయం చేసే కొందరు మంచి స్నేహితులు తప్ప. వారికి కృతజ్ఞతలు. మా ఆశీస్సులు వారికి ఉంటాయి.

కొన్ని ఆత్మలు తమ ప్రియతములతో మాట్లాడాలని తపిస్తూ ఉంటాయి. మాలాగే చాలామంది భూలోకంలోని తమ ఆత్మీయులకు సాయం చేసి వారు ప్రశాంతంగా ఉండేలా చూడాలనుకుంటారు. భూలోకంలో వారుపడే విచారం, బాధ మాపై ప్రభావం చూపి మమ్మల్ని కూడా నిస్పృహ, విషాదాలలో ముంచుతాయి.

భూలోకం నుంచి మీ ఆత్మీయులు వెళ్ళిపోతే మీకెలా ఉంటుందో మాకు తెలుసు. మీరు మమ్మల్ని చూడలేరు, మా మాటలు వినలేరు, మమ్మల్ని స్పృశించలేరు కనుక బాధపడుతుంటారు. కాని మేము మిమ్మల్ని మా కోసం విషాదంలో మునిగిపోవద్దని కోరుతున్నాం. మేము అక్కడికన్న ఇక్కడ సంతోషంగా ఉన్నాం. **భూలోకంలో ఉన్నదాని కన్న ఎంతో సజీవంగా ఉన్నాం. మేము మిమ్మల్ని చూడగలం, మీ మాటలు వినగలం, మిమ్మల్ని స్పృశించగలం, కౌగిలించుకోగలం, ముద్దు పెట్టుకోగలం.**

మీరు, చనిపోయిన మీ ఆత్మీయులు చాలా సన్నిహితులైతే మీ వేదనను మేము బాగా అర్థం చేసుకోగలం. తల్లిపై గాని, తండ్రిపై గాని, వారి పిల్లలపై గాని, సోదరి, సోదరులపై గాని, చివరికి మంచి స్నేహితులపై గాని ఉండే పరస్పర ప్రేమ మమ్మల్ని చాలా బాధిస్తుంది. భూలోకంలో ఏ బాంధవ్యమైనా పరస్పర ప్రేమ లేనిదైతే, నిజాయితీ లేనిదైతే, ఒకసారి ఆత్మలోకంలోకి వచ్చాక మాకు ఆ ఆత్మతో అనుబంధం ఏమీ ఉండదు.

మా అమ్మానాన్న ఏదో కోల్పోయినట్లు ఎన్నోమార్లు మేము లేకుండా వేదన పడడం చూశాం. ఆత్మలతో సంభాషించలేకపోయినట్లయితే వారిని ఓదార్చి, సంతోషంగా ఉండేలా చేయడం మాకు చాలా కష్టమయ్యేది. వారు తమ భావాలను నియంత్రించుకోవాలని, లేకపోతే మేము కూడా విచారగ్రస్తులమవుతామని, మేము భూలోకంలో కన్న వారికి దగ్గరగా ఉన్నామని చెప్పాం. ఆత్మలతో మాట్లాడడం వల్ల మేమందరం (అమ్మ, నాన్న, విప్పి, రతూ) మా కష్టసుఖాలు పంచుకోగలుగుతున్నాం. ముఖ్యంగా మేము వారికి దగ్గరగా ఉన్నామని, వారిని అమితంగా ప్రేమిస్తున్నామని వారికి తెలుసు. ఆత్మలతో సంభాషించడం వలన ఈ పని మాకు చాలా సులువైంది.

అందువల్ల మీ మంచి కోసం, ఆత్మలతో సురక్షితంగా సంభాషించమని దీనివల్ల మా బాధ్యతలు నిర్వర్తించడం కూడా సులువవుతుందని భూలోకంలోని వారికి చెబుతున్నాం. ఆత్మలతో సంభాషించడం వలన మీకు మార్గదర్శకంగా ఉండడం, మీరు మరింత అంధకారంలోకి కూరుకుపోకుండా ఆపడం మాకు తేలిక అవుతుంది. మీకు మార్గం చూపడం మా బాధ్యత. అందువల్ల మాతో మాట్లాడమని సలహా ఇస్తున్నాం. మీకు అటువంటి ప్రతిభ ఉంటే, దానిని పెంపొందించుకోండి. ప్రతి ఆత్మకూ సర్వశక్తిమంతుడైన భగవంతుడు ఏదో ఒక ప్రతిభను ఇస్తాడు. కొందరి విషయంలో దీనిని పెంపొందించుకొనడానికి ఎంతో కష్టపడాల్సి వస్తుంది. ఎంతోకాలం పడుతుంది. కొందరికి ఇది అప్రయత్నంగా సిద్ధిస్తుంది.

మీ అంతఃప్రేరణలు ఎన్నడూ అణిచి ఉంచవద్దు. మీకు ఈ ప్రతిభ ఉందని తెలిస్తే జనం మిమ్మల్ని పిచ్చివారని, వింత మనిషి అని అంటారని అనుకోవద్దు. ఇది దైవ దత్తమైన ప్రతిభ. దీనికి మీరు కృతజ్ఞులుగా ఉండాలి.

నీనా అనే బాలిక ఉంది. ఆమెకు ఇటువంటి ప్రతిభ ఉంది కాని ఆమె తల్లి "చనిపోయిన వారి ఆత్మతో మాట్లాడడం మంచిది కాదు. ఇంకెన్నడూ ఇలా చేయకు. ఆ ప్రేతాత్మ నీ శరీరాన్ని ఆక్రమించి నిన్ను నాశనం చేస్తుంది. నువ్వు దయ్యమై నరకంలోని అగ్నిలో పడిపోతావు" అని చెప్పి నూరిపోసింది.

తల్లి హెచ్చరిక విని నీనా ఎంత భయపడిందంటే "ఆత్మతో సంభాషించడం" అనే మాటను అనడానికి కూడా భయపడింది. ఆమె గొప్ప అవకాశాన్ని, అద్భుతమైన ప్రతిభని, తనపై తనకున్న నమ్మకాన్ని కోల్పోయింది.

చాలా ఏళ్ళ తరువాత ఆమెకు వాస్తవాలు తెలిశాయి. ఆమె భర్త కొన్ని పుస్తకాలు ఇచ్చి ఆమె ప్రతిభను వివరించేసరికి చాలా ఆలస్యమైపోయింది. మళ్ళీ దానిని ఎంతగా పొందాలనుకున్నా, తల్లి చెప్పిన మాటలు మర్చిపోవాలనుకున్నా, భయం గాఢంగా పాతుకుపోవడంతో ఆ ప్రతిభని మళ్ళీ పొందలేకపోయింది. తన తల్లి మాటలు విన్నందుకు చింతించింది, మళ్ళీ ఆత్మవిశ్వాసం పొందడం అసాధ్యమనిపించింది.

నీనా లాగానే, భయపడినవారు భూలోకంలో ఎందరో ఉన్నారు. మేము భూలోక ప్రజలను కోరేదొక్కటే. సరైన జ్ఞానం, వాస్తవాలు తెలియకుండా ఎవరికీ సలహాలు ఇవ్వకండి. **పరిమిత జ్ఞానం ప్రమాదకారి.** వినేవారు కూడా – చెప్పేవారికి నిజమైన ఆధ్యాత్మిక జ్ఞానం ఉందని రూఢిపరచుకోండి.

07-6-1981

చాలా ఆత్మలు కింది ఆవరణలకు వెళ్ళాయి

మనమందరం ఆత్మను పవిత్రీకరించుకొనడానికి, ఉన్నతస్థాయికి చేరడానికి భూమి మీద మళ్ళీ పుడతాం. కాని మన కోరిక అన్నిమార్లూ నెరవేరదు. తరచుగా పైకి ఎదగకుండా మనం కిందికి పోతుంటాం. **మనలో చాలామంది 2వ ఆవరణ నుంచి 6వ ఆవరణ వరకూ వెళ్ళి ఉంటారు.** చాలాకొద్దిమంది మాత్రం 1వ ఆవరణకు వెళ్ళి ఉంటారు. 1వ ఆవరణ నుంచి బయటకు రావడం చాలా కష్టం.

ప్రతి ఆత్మ 100 నుంచి 200 సార్లు భూలోకంలో పునర్జన్మించి, అన్ని రకాల అనుభవాలను పొంది ఉంటుంది. ప్రతి ఆత్మ భిన్నమైన సమస్యలు, పరిస్థితులు ఎదుర్కొనవలసి ఉంటుంది.

ఆత్మ సత్తలు భూలోకంలోనివారికి మా రహస్యాలు అన్నీ చెప్పకూడదని కూడా మీకు చెప్పాలి; మేము మీకు కొన్ని విషయాలు మాత్రమే చెప్పగలం. మేము ముందుగానే అన్ని విషయాలూ మీకు చెబితే, మీరు ముందుగా సిద్ధంగా ఉంటారు. మీ పునర్జన్మ వల్ల ఉపయోగం ఉండదు.

08-6-1981

ఆత్మలతో సంభాషించడం గురించిన అపోహలు

చనిపోయిన మీ ఆత్మీయులకు ప్రగతిలో అవరోధాలుంటాయని మీరనుకుంటే అవి పూర్తిగా పొరపాటు. ఆత్మలతో సంభాషించకుండా తమ ఆలోచనలను మీలో చొప్పించి, మిమ్మల్ని సరైన మార్గంలో పెట్టటానికి ఆత్మలోకంలోని వారికి రోజులు, నెలలు, సంవత్సరాలు, చివరికి దశాబ్దాలు పట్టవచ్చు. కాని ఆత్మలతో సంభాషించడం ద్వారా కొన్ని గంటలలోనే మీకు అర్థమయ్యేలా మేము చెప్పగలం. ఇలా కాకపోతే దీనికి కొన్నేళ్ళు పడతాయి. చనిపోయిన వారి ఆత్మల ప్రగతికి అవరోధం ఉండదు. అది మరింత వేగవంతమవుతుంది.

మేమింతకుముందు చెప్పినట్లుగానే, ఉన్నతస్థాయిలో ఉన్న ఒక కవల ఆత్మ మరో ఆత్మ ఎదగడం కోసం నిరీక్షిస్తూ, ఆ కవల ఆత్మ మరింత కిందకిపడిపోకుండా ఆపడానికి బాగా శ్రమిస్తుంది. **ఉన్నతస్థితిలో ఉన్న కవల ఆత్మ భూలోకంలోని ఆత్మకు ఆలోచనలు చొప్పించాలన్నా, భూలోకంలోని ఆత్మ కొన్నేళ్ళపాటు వాటిని వినడానికి కూడా నిర్లక్ష్యం చేయవచ్చు.** కాని దీనిని ఆత్మలతో సంభాషించడం ద్వారా సులభంగా, వేగంగా చేయవచ్చు. అందువల్ల ఆత్మలతో సంభాషించకుండా ఉండడం కన్న ఆత్మలతో సంభాషించడం ద్వారా మా ప్రగతి మరింత వేగవంతమవుతుంది.

చాలామంది ఆత్మలతో సంభాషించడం ద్వారా చనిపోయిన వారి ఆత్మ ప్రగతికి ఆటంకం కలుగుతుందని భావించి, చాలామంది చనిపోయిన తమ ఆత్మీయుల ఆత్మలతో మాట్లాడడానికి ఇష్టపడరు. ఇది నిజమేనా? **లేక నేర భావనతో అంతరాత్మ వారిని మాట్లాడకుండా ఆపుతుందా?**

నిజమైన పవిత్రాత్మలు, ఋషులకు చనిపోయిన వారి ఆత్మలతోను, ఆత్మలోకం వారితోను సంభాషించే శక్తి ఉంటుంది. ఒకవేళ సంభాషించడం వలన ఆత్మసత్త ప్రగతికి ఆటంకమైతే ఉన్నతాత్మలకు ఈ శక్తి ఉంటుందా?

కొందరిలా అనవచ్చు, "జాగ్రత్త. చెడు ఆత్మలు మీ శరీరాన్ని ఆక్రమించుకొంటాయి. మీరు నాశనమైపోయి నరకానికి పోతారు" వారికి ఇక్కడ కొన్ని సమాధానాలు ఉన్నాయి:

మీరు చెడ్డవారా? చెడు చెడుని ఆకర్షిస్తుంది. మీరు చెడ్డవారైతే చెడు తప్పనిసరిగా చెడుని ఆకర్షిస్తుంది కనుక ఆత్మలతో మాట్లాడడానికి భయపడాలి. ఒకవేళ మీరు చెడు ఆత్మలను ఆకర్షిస్తే, అవి మీ భౌతిక మనస్సును ఆక్రమించవచ్చు. కాని మీరు సదాత్ములైతే, చనిపోయిన సదాత్మతో సంభాషించినట్లయితే మీకు దానివలన హాని జరగదు.

అప్రయత్న లేఖనాన్ని మీ అంతట మీరు ప్రయత్నించవద్దు. రక్షణలింకు[14], తగిన సూచనలు లేకుండా మీ అంతట మీరే అప్రయత్న లేఖనాన్ని అభ్యాసం చేయడం చాలా ప్రమాదకరం. కేవలం అనుభవం ఉన్న, అంతకు ముందే లింకు ఉన్న వ్యక్తి మీ లింకులో చేరవచ్చు. దీనివల్ల వ్యతిరేక జోక్యాలేవీ మీకు హాని చేసే వీలుండదు.

చెడు, చెడును ఆకర్షిస్తుంది. మంచి మంచిని ఆకర్షిస్తుంది. సదాత్మలు తప్పనిసరిగా మిమ్మల్ని రక్షిస్తాయి, సదాత్మతో నిరంతరం సంభాషిస్తుంటే (మీ లింకు తెగకుండా ఉన్నపుడు) మీరు పూర్తిగా సురక్షితంగా ఉంటారు.

చెడ్డవారిని లోనికి రానీయకుండా మీ వాకిలి తలుపుని మూసినట్టే, చెడ్డ ఆత్మలు మీ మనస్సులోకి ప్రవేశించకుండా మానసిక ద్వారాలు మూసి ఉంచాలి.

09-6-1981

ఆత్మలతో సంభాషించడం అంటే భయమెందుకు?

మూఢ నమ్మకాలు మన జీవితాలపై ఆధిపత్యం చెలాయించిన రోజులు పోయాయి. పిచ్చివాళ్ళు మాత్రమే ఆత్మలతో మాట్లాడతారని చెప్పే రోజులు గతించాయి. ఆత్మలతో సంభాషించగలనని చెప్పేవారు నిజమే చెబుతున్నారని రుజువు చేయలేని రోజులుపోయాయి. ఇప్పుడు భూలోకంలో చాలామంది శాస్త్రవేత్తలు, మానసిక నిపుణులు, పారా సైకాలజిస్టులు ఆత్మలతో సంభాషించడం గురించి విస్తృతమైన పరిశోధనలు చేస్తూ తాము చేసే పని యథార్థమని రుజువు చేయగలుగుతున్నారు.

ఎన్నో వింతైన దృగ్విషయాలుంటాయి. వాటికి శాస్త్రీయ వివరణలుండవు. ఇంద్రియాతీత గ్రహణశక్తిని (ఇఎస్‌పి) పారాసైకాలజీని, మానసిక దృగ్విషయాన్ని నమ్మాల్సి ఉంటుంది.

---

14. ఉన్నత ఆత్మసత్తల ప్రార్థనల ద్వారా సానుకూల శక్తి లభిస్తుంది. ఇదే రక్షణ లింకు. దీని ద్వారా భూలోక ఆత్మలు ఆత్మసత్తలతో సురక్షితంగా మాట్లాడగలరు.

కొందరు బుద్ధిహీనులు ఆత్మలోకం ఉందా అని మేము ఆత్మలమా అని కూడా సందేహిస్తుంటారు. మరికొందరు అసాధారణ బుద్ధిహీనులు "దేవుదున్నాడని కచ్చితంగా మీకు తెలుసా?" వంటి అర్థంలేని ప్రశ్నలు వేస్తారు.

కొందరు వ్యక్తులు ఆత్మలతో సంభాషించే విషయాన్ని గురించి మరింతగా తెలుసు కోవాలనుకుంటారు. ఈ విషయాలను మరింత లోతుగా తెలుసుకోవాలనుకుంటారు. కొంతమందికి తెలుసుకొనడం తప్పనిసరి అవుతుంది. వాళ్ళు ఆత్మలోకం గురించి, చావును గురించి, పుట్టుకను గురించి, గత జన్మల గురించి తెలుసుకోవాలని బాగా ప్రయత్నిస్తారు. భూలోకంలోని వారికి అన్నిటికీ కచ్చితమైన రుజువులు కావాలి. వారి పరిమిత మనస్సులు రుజువులు లేకుండా విషయాలను గ్రహించవు. కొంత మందికి మాత్రమే దైవదత్తమైన ఈ శక్తి ఉంటుంది. ఇతరులు వీరిని సంతోషంగా అనుకరించి, అమాయకులైన వారిని మోసం చేస్తూ డబ్బు సంపాదిస్తారు. దీనివల్ల చాలామందికి నిజమైన వారెవరో, నకిలీలెవరో గుర్తించడం కష్టమవుతుంది.

కొందరు లోకాతీత విషయాలను గురించి తెలుసుకొనడం పాపమని, చెడు అని అనుకుంటారు. కాని ఇలా అనుకోవడం పూర్తిగా అజ్ఞానం. ఆత్మసత్తలు తమ అపరాధాలను, పాపాలను కనుగొంటాయని కొందరు భయపడుతుంటారు. దానితో వారు ఇతరులను నిరుత్సాహపరుస్తారు. చెడ్డవారు ఈ ఆలోచనలను ఇష్టపడరు, వాటిపై కుతూహలమూ చూపరు. కొందరికి తల్లిదండ్రులో, పూజారులో, ఉపాధ్యాయులో దీనికి వ్యతిరేకంగా బాగా నూరిపోస్తారు. దానితో వారు అంతఃప్రేరణను అణగదొక్కి ఎటువంటి చిక్కులూ భరించడానికి ఒప్పుకోరు.

భూలోకంలో మీరెందుకు పుట్టాలనుకున్నారు

ఇది మీకు వింతగా అనిపించవచ్చు కాని వాస్తవం. మీలో చాలామందికి మీలోకంలో పుట్టడం ఇష్టం లేదు. ఆత్మలోకంలో మీరు చాలా సంతోషంగా ఉన్నారు (మేము ఉన్నత స్థాయులలోని ఆత్మల గురించి మాట్లాడుతున్నాం). తొందరగా ఉన్నతస్థాయికి చేరాలనే మీ అసహనంగాని, ఇబ్బంది అయినా పడతామని సిద్ధపడడం గాని, భూలోకంలో మీ ఆత్మీయులు ఆధ్యాత్మికంగా కింది స్థాయికి పడిపోవడం గాని మీరు భూలోకంలో పునర్జన్మించడానికి కారణం. కాని మీలో చాలామంది (మీ ఆత్మ, మీ ఉపచేతనాత్మక మనస్సు) భూమ్మీద పుట్టకుండా ఉంటే బాగుండేది అనుకుంటారు. కొన్నిసార్లు చేతనాత్మకంగా ఇలా అనుకుంటారు. ఇలా ఎందుకను కుంటున్నానని ఆశ్చర్యపోతుంటారు. కాని మీకు ఆత్మలోక గృహం గుర్తుకు రాదు. కొంతసేపు ఆశ్చర్యపోయి దీని గురించి మర్చిపోతారు. కొంతమందికి మీ ఆత్మ నుంచి,

ఉపచేతనాత్మక మనస్సు నుంచే ఈ భావం పుడుతుంది. దానితో మీ భౌతిక మనస్సు దీనిని తప్పనిసరిగా వినాల్సి వస్తుంది.

ఆత్మలోకంలో మీరు శిక్షణను, అనుభవాన్ని పొందవచ్చు. కాని ఉన్నతస్థాయిలకు చేరడానికి ఇక్కడ వేలాది ఏళ్ళు పడతాయి. అందుకని దీనికి మారుగా కొన్ని వందల ఏళ్ళలో ఉన్నతస్థాయికి చేరాలని మీరు ప్రయత్నిస్తారు. భూలోకంలో పుట్టడానికి అదే కారణం - తొందరగా ఫలితాలు కావాలని. అయితే దీనిలో మరింత కిందికి పోయే ప్రమాదమూ ఉంది. మీ లక్ష్యసాధనకు బాగా సమయం పట్టవచ్చు.

కింది ఆవరణలలోని ఆత్మలు భూలోకంలో జన్మించడానికి ఇష్టపడతాయి. దీనివల్ల వారికి త్వరితంగా ప్రగతి సాధించే అవకాశం కలుగుతుంది. వారు సన్మార్గం తప్పకుండా ఉండగలిగితే భూలోకంలో పునర్జన్మించడం వలన మంచి ప్రయోజనం ఉంటుంది. 1,2,3 ఆవరణలలో పడే బాధలు ఎంత తీవ్రంగా ఉంటాయంటే, ఇబ్బంది పడ్డా భూలోకంలో మళ్ళీ జన్మించడమే వారికి మంచిది. పాపము, చెడు ప్రభావాల మూలంగా కింది స్థాయిలకు పడిపోయిన సదాత్మలకు భూలోకం స్వర్గమే.

కింది స్థాయిలలో పడిపోయిన సదాత్మలు తమను స్వల్పకాలంలో బాగా తీవ్రంగా శిక్షించమని దేవుడిని వేడుకుంటాయి. ఒకవేళ వారు 1వ ఆవరణ నుంచి అయితే భూలోకంలో బరువులు మోసే జంతువుల్లా పుట్టి, బాగా కష్టపడుతూ, ఒకోసారి మనుషుల చేత హింసింపబడుతూ ఉంటారు. వారు తమ కర్మను త్వరితంగా చెల్లించి వేస్తారు. అయితే దీనికోసం వారు బాగా బాధననుభవించే ధైర్యాన్ని కలిగి ఉండాలి. చాలామందిని హింసించడం, కొట్టడం, ఆకలితో అలమటింపచేయడం జరుగుతుంది. రోజంతా పొలాల్లో పనిచేయాలి లేదా చాలా బరువులు మోయాలి.

చాలా ఆత్మలు 1వ ఆవరణలో వేలాది ఏళ్ళు ఉండడం కన్న ఈ శిక్షలే నయమని భావిస్తాయి. 1,2 ఆవరణలు ఎంత భయంకరంగా ఉంటాయో దీనిని బట్టి మీరు ఊహించుకోవచ్చు. ఆ ఆవరణలలో ఉండకుండా తప్పించుకొనడానికి వారు సంతోషంగా, ఇష్టపూర్వకంగా ఈ శిక్షను అనుభవిస్తారు.

3వ ఆవరణ కూడా ఇలాగే భయంకరం. 3వ ఆవరణలోని ఆత్మలు సూరదాస్‌లా ఛాన్సు తీసుకోవచ్చు. కాని అందరూ సూరదాస్‌లా రక్షింపబడరు, అటువంటి ఆత్మలు పైకి వెళ్ళడానికి బదులుగా 1వ లేదా 2వ ఆవరణలో పడవచ్చు.

4వ ఆవరణను భరించవచ్చు - ఇది చాలావరకు భూలోకంలానే ఉంటుంది. అయినాగాని పైస్థాయిల నుంచి పడిపోయిన ఆత్మలకు ఇది కూడా భయంకరం అనిపిస్తుంది. ప్రతి ఆత్మ, ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా అత్యున్నత ఆవరణకు

చేరుకోవాలనుకుంటుంది. కనుక పునర్జన్మించి అనుభవం పొందడానికి, స్వల్పకాలంలో శిక్షను అనుభవించటానికి, ఆత్మను పవిత్రీకరించు కొనడానికి ప్రయత్నిస్తుంది. ఈ కారణాల వల్లనే మీరు భూలోకంలో పునర్జన్మించారు.

చావంటే ఎందుకు భయపడతారు

భూలోకంలో పుట్టాక జీవితాన్ని ఎంతగా అనుభవిస్తారంటే చావంటే భయపడేంతగా. కొంతమందికి శరీరం ముసలిదై, కష్టపడుతున్నా భూలోకం వీడి రావడం ఇష్టం ఉండదు ఎందుకిలా?

ఎందుకంటే మీలోకంలో చనిపోతే ఎక్కడికి చేరతారో వాళ్ళ హృదయాంతరాలలో వారికి తెలుసు గనుక. వాళ్ళకి చావంటే భయమెందుకంటే, తాము తప్పకుండా అంధకారంలో కింది ఆవరణలలో పడిపోతామని తెలుసు గనుక ప్రాణాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తారు. కాని మీ భౌతిక శరీరం పనిచేయడానికి నిరాకరిస్తే, ఆత్మ కృశించిపోతున్న, తాత్కాలిక, భౌతిక నివాసాన్ని తప్పనిసరిగా వదిలిపెట్టాల్సిందే. మీకు ఇష్టమున్నా, లేకపోయినా భూలోకంలో మీరు చనిపోవాల్సిందే.

భూలోకంలో చాలామందికి మృత్యువు అంటే భయంకరమైనది అనే అభిప్రాయం బలంగా నాటుకుపోయింది. వాళ్ళకి 'మృత్యువు' అనే పదం అంటేనే భయం. వాళ్ళలో ఈ భయం పోగొట్టడం అసాధ్యం. వాళ్ళు భూలోకంలోనే ఎక్కువకాలం బ్రతకాలనుకుంటారు. అటువంటి సదాత్మలు భూలోకాన్ని వీడి ఆత్మలోకంలోని ఉన్నత ప్రదేశాలకు వచ్చినపుడు 5,6,7 ఆవరణలలోని అందం, సామరస్యం, ప్రేమలను చూసి ఆశ్చర్యపోతారు. తామంతగా భయపడినందుకు చింతిస్తారు.

ఆత్మహత్య పాపం

మృత్యువుకి భయపడకూడదు. అదే సమయంలో మృత్యువు ఆసన్నమయ్యే లోపుగా దాని గురించి ఆలోచించకూడదు. దేవుడు మాత్రమే మీరు ఆత్మలోకానికి ఎప్పుడు రావాలో నిర్ణయించగలడు. **ఆత్మహత్య చేసుకొనడం ఆధ్యాత్మికంగా తప్పు.** భూలోకంలో పునర్జన్మించే అవకాశాన్ని దేవుడు మనకు ఇచ్చాడు. ఆత్మహత్య చేసుకొనడం ద్వారా ఆయనకు వ్యతిరేకంగా చేస్తున్నట్టు కదా. **ఆత్మహత్య పాపం.** ఆత్మహత్య చేసుకుంటే కింది ఆవరణలలో పడిపోతారు. ఇది మీరు ఎన్నడూ ఇష్టపడరని మా నమ్మకం. ఎన్నడూ ఆత్మహత్య చేసుకొనడానికి ప్రయత్నించవద్దు. అలా చేయడం వలన మీకు మీ భౌతిక శరీరం నుంచి తాత్కాలికంగా విముక్తి లభిస్తుంది కాని, శాశ్వతంగా మీ ఆత్మకు హాని జరుగుతుంది.

11-6-1981

ఉన్నత సదాత్మలు

ఒక్కడే దేవుడున్నాడు - సర్వశక్తిమంతుడైన భగవంతుడు. కాని మన ప్రియమైన భగవంతునికి సాయం చేయడానికి ఎన్నో ఆత్మలున్నాయి. ప్రతి ఆత్మను స్వచ్ఛంగా, నిజాయితీగా, ప్రేమించేదిగా, అర్థంచేసుకొనేదిగా, మంచిగా, వివేకం కలిగినదిగా చేయడానికి ఈ ఆత్మలు ఆయనకు సాయపడతాయి. ఈ సహాయకులు మనందరిలానే మనుషులు, భూలోకంలోని వారేం అనుభవిస్తారో, ఆత్మలోకంలోని వారేం అనుభవిస్తారో వీరూ అదే అనుభవిస్తారు. వాళ్ళు వందలాది సార్లు పునర్జన్మిస్తారు. ఎన్నోసార్లు పైకీకిందికీ వెళుతూ వస్తూ చివరికి ఈ స్థాయికి చేరతారు. ఈ సహాయకులను దైవిక ఉన్నత సదాత్మలు అంటారు. అందరికన్న పైన ఉన్నవారిని దైవిక అత్యున్నత సదాత్మలు అంటారు.

ఉన్నత ఆవరణలలో వారిని తరుచుగా చూస్తాం. కాని 4వ ఆవరణ అంతకు కింది ఆవరణలలో అరుదుగా చూస్తాం. వారు తమ పని సులభంగా చేసుకొనడానికి వీలుగా అదృశ్యంగా ఉండేందుకు ఇష్టపడతారు. చెడ్డ వారిని పాపాత్ములను బాగు చేయడంలో వారు చాలా సఫలమవుతారు, మంచేదో చెడేదో వారికి చెబుతారు, తక్కువ కష్టంతో త్వరితంగా తమ కర్మనెలా చెల్లించుకోవాలో సూచనలిస్తారు, ఉన్నత ఆవరణలకు త్వరగా ఎలా వెళ్ళవచ్చో చెబుతారు.

వాళ్లు మా సమీపానికి వచ్చినప్పుడు మాకు సంతోషంగా, ఉల్లాసంగా ఉంటుంది. మాకేదైనా సాయం కావాలంటే వారు వెంటనే చేస్తారు. ఏ ఆత్మైనా సరే చివరికి 1వ ఆవరణ నుంచి అయినా సాయం కావాలని కోరితే ఈ ఉన్నత సదాత్మలు నిముషాలలో అక్కడుంటారు. భూలోకంలో కూడా ఏ ఆత్మ అయినా మనఃపూర్వకంగా నిజాయితీగా సాయం కోరితే, వెంటనే సాయం లభిస్తుంది. ఆ ఆత్మ 1వ ఆవరణలో ఉందా, భూలోకంలో ఉందా, ఉన్నత స్థాయిలో ఉందా అని చూడరు. **మనస్ఫూర్తిగా సాయం కోరితే సాయం లభిస్తుంది.**

భూలోకంలో దేవుడిని సాయం కోరినవారి విషయంలో మహిమ జరిగిన కథలు మీరు తరచుగా వినే ఉంటారు. చాలా ఆందోళనకర పరిస్థితులలో మీరు కూడా దేవుడి సాయాన్ని అర్థించి ఉంటారు. వింత పద్ధతిలో మీకు సాయం లభించి ఉంటుంది. దానిని మహిమ అని మీరంటారు.

ఆత్మలోకంలోని మీ ఆత్మీయులు కూడా చాలాసార్లు మిమ్మల్ని రక్షించి ఉంటారు. ఆత్మలోకంలోని మీ ఆత్మీయులు మిమ్మల్ని ఎంతో జాగ్రత్తగా సంరక్షిస్తూ ఉంటారని

మీరు నమ్మవచ్చు. వాస్తవంగా నిజమైన ప్రేమ ఎన్నడూ చనిపోదు. భూలోకంలో చనిపోయిన తరవాత కూడా. చావుకన్న ప్రేమ ఎంతో గొప్పది. **ప్రేమ శాశ్వతం, చావు మార్పు.** ఒక ప్రపంచం నుంచి మరో ప్రపంచానికి, ఒక శరీరం నుంచి మరో శరీరానికి, భూలోకం నుంచి స్వర్గానికో, నరకానికో.

చావు గొప్పదేమీ కాదు. ప్రేమ విశిష్టమైంది. గొప్పది.

ఇప్పుడు సర్వశక్తిమంతుడైన భగవంతుని సహాయకుల గురించి మరికొంచెం తెలుసుకుందాం. మేము వారిని ఉన్నత సదాత్మలు అంటాం, మీరు దేవదూతలు అంటారు. **దేవదూతలకు రెక్కలుండవు** అని చెప్పాలి. వాళ్ళు వేగంగా కదులుతారు కనుక వారి బట్టలు రెక్కల్లా ఉంటాయి. మానవ రూపాన్ని ధరించే శక్తి వారికున్నట్లు గానే, నమ్మని వారిని నమ్మించడానికి రెక్కలు కూడా సృష్టించుకోగలరు. అందువలన భూలోకంలోని ఆత్మలు రెక్కలు చూసి దేవదూత సందేశాన్నిచ్చాడని దేవుడు తమకు సాయం చేశాడని అనుకుంటారు.

ఉన్నత సదాత్మలు చాలా వినయంగా, దయగా, అర్థం చేసుకోగలిగి ఉంటారు. సర్వశక్తి మంతుడైన భగవంతుని నియమాలను కూడా కొందరి విషయాలలో మార్చగలరు. దీనికి ముందుగా దైవిక అత్యున్నత సదాత్మను అనుమతి కోరతారు. తిరిగి వారు సర్వశక్తిమంతుడైన భగవంతుని అనుమతి అడుగుతారు. అత్యవసర మైనపుడు ఈ అనుమతి సెకన్లు, నిముషాలలోపే వస్తుంది. తక్షణమే అవసరం కానపుడు ఇది రావడానికి కొన్ని గంటలో, కొన్ని రోజులో పడుతుంది.

అనుమతించడానికి వీలు లేనిది మేము కావాలనుకున్నప్పుడు మా ఆవరణకు అధిపతిని అడుగుతాము. ఆయన మేము చెప్పేది విని కొన్ని ప్రశ్నలు వేస్తారు. మా అభ్యర్థన ఆయనకు యథార్థమనిపిస్తే, ఎవరికీ హాని చేయదని అనిపిస్తే, మా అభ్యర్థనను అత్యున్నత సదాత్మకు వినిపించి, సర్వశక్తిమంతుడైన భగవంతుని అనుమతి తీసుకోమని కోరతారు.

భూలోకానికి, ఆత్మలోకానికి ఉన్న తేడా ఇది. మా ఆవరణల పాలకులు వినయంగా, మమ్మల్ని అర్థం చేసుకుని, దయ కలిగి ఉంటారు. మేము ఎప్పుడైనా వారితో స్వేచ్ఛగా మాట్లాడగలం. వారెంతో నిజాయితీగా, దయగా, ప్రేమగా ఉంటారు. వాళ్ళు పూర్తిగా నిస్వార్థంగా ఉంటారు. మేము వారిని పూర్తిగా నమ్ముతాం. వాళ్ళెంతో ప్రేమగా, దయగా కొన్ని విషయాలు తప్పు అని, అవి ఎందుకు తప్పో మాకు అర్థమయేలా చెబుతారు.

మా కోరికలను వారెన్నడూ మొరటుగా తిరస్కరించరు అవి తప్పనిపిస్తే మాకు వివరించి, అవెందుకు సాధ్యం కావో అర్థం చేసుకోవడానికి మాకు సాయం చేస్తారు. వారెంతో

హేతుబద్ధంగా ఉండే దయార్ద్ర హృదయులు. మేము వారిని పూర్తిగా నమ్మి గౌరవిస్తాం. సంతోషంగా వారికి విధేయులుగా ఉంటాం. ఎందుకంటే వారెన్నడూ మాచేత తప్పు చేయించరు.

వీరు సర్వశక్తిమంతుడైన భగవంతుని సహాయకులు - మా ఉన్నత సదాత్మలు, మీ దేవదూతలు.

12-6-1981

మంచి పని ఏది?

మంచి పనులంటే పూర్తిగా నిస్వార్థంగా చేసే పనులు. మనం చేసే పనిలో కొంచెమైనా స్వార్థముంటే దానిని మంచి పని అనలేం; అది స్వార్థపూరితమైన పనే.

నిస్వార్థంగా చేసే మంచి పనులు మీ ప్రగతికి వరాలు. మిగిలిన అన్నిటికన్న అవి మిమ్మల్ని వేగంగా పైకి తీసికొని వెళ్ళగలవు. దురదృష్టవశాత్తు, భూలోకంలోని వారు మంచి పనులన్నిటినీ తమ పాపాలు పోతాయని, అవి తమను ఉన్నతస్థాయికి తీసుకెళతాయని ఆలోచిస్తూ చేస్తుంటారు.

ఈ ఆలోచన మిమ్మల్ని మరింత కిందికి తీసుకొని వెళుతుంది. పై స్థాయికి చేర్చదు అని మేము హెచ్చరిస్తున్నాం. సహజంగా, దయతో, పైకి వెళతామనే ఆలోచన లేకుండా చేసే మంచి పనులే నిస్వార్థంగా చేసే మంచి పనులు. మంచి పని చేసిన వెంటనే దాని గురించి మర్చిపొండి. దాని గురించి ఆలోచించకండి. మీరలా చేయగలిగితే స్వార్థపూరితమైన ఆలోచనేదీ మీ మనస్సులోకి రాదు. తరువాత వచ్చే స్వార్థపూరిత ఆలోచన మిమ్మల్ని తప్పుదారి పట్టిస్తుంది. **అప్రయత్నంగా మీరొక మంచి పని చేస్తే, దయతో చేస్తే, దాని గురించి వెంటనే మర్చిపొండి.**

యథార్థంగా పశ్చాత్తాపం చెందకుండా క్షమాపణ కోసం, మీ కర్మను చెల్లించు కోవడానికి, మంచి పనులు చేస్తే అవి నిస్వార్థంతో చేసే మంచి పనులు కావు. అవి మిమ్మల్ని ఎన్నడూ పైస్థాయికి చేర్చవు; ఈ విషయాన్ని మీరు గ్రహించాలి.

మంచి పని చేసే ముందుగా మీ ఉద్దేశ్యం నిస్వార్థంగా ఉంచుకోండి. దానిలో మీరు సఫలమైతే, దాని గురించి పూర్తిగా మర్చిపోవడంలో కూడా సఫలమవుతారు. ఈ విషయంలో సఫలత చెందడం మీ చేతుల్లోనే ఉంది.

ఉదాహరణకు ఆత్మీయుల కోసం ఏమైనా చేస్తే, దాని గురించి అందరికీ చెప్పాలని అనుకోరు. రెండోసారి ఆలోచించరు. ఆ ప్రియమైన ఆత్మ మీది ప్రేమతో మీరాపని

చేస్తారు. ప్రేమగా వారిని సంరక్షించడం, వారికి సౌకర్యాలు అమర్చడం, వారి కోసం త్యాగాలు చేయడం మీకు ఇష్టం. అందువల్ల మీ ప్రియతముల కోసం ఏం చేసినా, సంతోషాన్ని పొందండి, మర్చిపొండి. నిజమైన అభిమానానికి గుర్తుగా చేసే సహజమైన పనిగా భావించండి - ఒకవేళ మీ ప్రేమ నిజమైంది కాకపోతే తప్ప.

ఒక్క సెకనులో మీరు చేసిన మంచి పని స్వార్థపూరితం అయిపోతుంది - ఆలోచించ డానికి ఎక్కువ సమయం దొరక్కుండానే దానిని మర్చిపొండి. ఒక్క స్వార్థపూరిత ఆలోచనా రేఖ అయినా సరే మీరు చేసిన మంచి పనిని తుడిచిపెట్టేస్తుందని గుర్తుంచుకోండి.

13-6-1981

ప్రతీకారం

ప్రతీకారం చెడ్డది. భూలోకంలోని వారికి ప్రతీకారమంటే ఏమిటో తెలియదు. మరొకరి గురించి ఈర్ష్యగా ఉంటేనే ఎవరికైనా ప్రతీకారం తీర్చుకోవాలని అనిపిస్తుంది. ఉదాహరణకు పీటర్‌కు కాతీ అంటే ఈర్ష్య. ఆమెకు పేరుంది, మంచి, మర్యాద ఉన్న వ్యక్తి. దానితో పీటర్ ఆమెని తక్కువ చేసి చూపాలనుకుంటాడు. కాతీ గురించి వదంతులు ప్రచారం చేస్తాడు, లేదా ఆమెకు ప్రియతములను ఆమెకు వ్యతిరేకులను చేస్తాడు లేదా మరో రకంగా ఆమెను వేధించి, హాని చెయ్యాలను కుంటాడు. ఇది పూర్తిగా తప్పు. ఇలా చేయడం వల్ల పీటర్ చాలా కిందిస్థాయికి పడిపోతాడు. ఒకవేళ కాతీ గనుక పీటర్ ఎంత తప్పుగా ప్రవర్తించాడో, ఎలా హాని చేశాడో తెలుసుకుందనుకుందాం. పీటర్ ఎంత తప్పుగా ప్రవర్తించాడో తెలుసుకొని, తనను తాను కాపాడుకోవడానికి పీటర్ గురించి కాతీ ప్రపంచానికి నిజం చెప్పాలనుకుంటే అది తప్పు కాదు. పీటర్ ఎంత చెడ్డవాడో కాతీ ప్రపంచానికి చెప్పాలి. అప్పుడు ఇతరులు అతని చేతిలో మోసపోరు, జాగ్రత్తగా ఉంటారు. పీటర్ ప్రతీకారానికి బాధితులు కారు. పీటర్ లేకితనాన్ని గురించి ప్రపంచానికి వాస్తవాలు చెబితే కాతీ పై స్థాయికి చేరుతుంది. కాని ఆమె హృదయం మంచిగా, ఆమె ఉద్దేశ్యాలు పవిత్రంగా ఉండాలి. చాలామంది అనుకున్నట్లుగా ఇది ప్రతీకారం అనిపించుకోదు. మీ ఉద్దేశ్యం ఇతరులు మీలా బాధపడకూడదని, వారిని రక్షించడం. ఇంకెవరూ పీటర్ బారిన పడరు. అది మంచి పని. దయచేసి మీ ప్రియతములకో, మీకో హాని జరిగేలా ఉంటే చెడును బయటకు చెప్పకండి. భూలోకంలోని వారికి మంచికి, చెడుకు మధ్య గల తేడా తరచుగా అర్థం కాదని ఇప్పుడు మీకు అర్థమైందను కుంటాను.

సురేష్ కథ

ఒకరోజు విధవరాలైన యువతి జె తో సురేష్‌కి పరిచయం కలిగింది. ఆమె ప్రవర్తన అంత మంచిది కాదు. సురేష్‌తో తిరగడం మొదలుపెట్టింది. ఇతనికి పెళ్ళయింది. ముగ్గురు పిల్లలు. తన పట్ల సురేష్‌కి వెర్రి కలిగేలా చేసింది. అతనామెతో సంబంధం పెట్టుకొన్నాడు. ఒక అపార్టుమెంటు కూడా ఇస్తానని అన్నాడు. జె కు ఇతరులతో కూడా సంబంధాలున్నాయి కాని సురేష్‌కి అవేమీ తెలియవు. ఆమెతో పిచ్చి ప్రేమలో పడి, ఆమెకి బానిసగా మారాడు. జె కి సురేష్ డబ్బు, నగలు ఇస్తుండేవాడు. ఒక స్త్రీ కోసం సురేష్ డబ్బు వృథా చేస్తున్నాడని అతని తండ్రికి తెలిసింది. సురేష్ సదాత్మ అని, తనకి అమ్మాయిల బలహీనత ఉందని ఆయనకు తెలుసు గనుక సురేష్‌ని మందలించి, వంటిమీదికి తెలివొచ్చేలా చేశాడు. సురేష్‌కి తనెంత తప్పు చేశాడో అర్థమై, జెతో అన్ని సంబంధాలు తెగతెంపులు చేసుకున్నాడు. జె చాలా నీచురాలు. ప్రతీకారేచ్ఛ కలిగినది. సురేష్‌పైన అతని కుటుంబం పైన ప్రతీకారం తీర్చుకోవాలను కుంది. నేనింతకుముందు చెప్పినట్లుగానే ఆమెకు చాలామంది ప్రేమికులున్నారు. ఒకరి వలన గర్భవతి కూడా అయింది. బాగా పేరున్న ఆసుపత్రిలో గర్భధారణ పరీక్ష చేయించుకొని, ఆమెకు గర్భం వచ్చినట్లుగా ధ్రువపత్రం తీసుకుంది. ఆ పత్రాన్ని తీసుకొని సురేష్ ఇంటికి వెళ్ళి తనను పెళ్ళి చేసుకుంటానని చెప్పి, తనతో సంబంధం పెట్టుకుని తనను సురేష్ మోసం చేశాడని అతని తల్లిదండ్రులకు, భార్యకు చెప్పింది. ఇప్పుడు తాను గర్భవతినని కూడా చెప్పింది. వాళ్ళకి ఆసుపత్రి వాళ్ళిచ్చిన ధ్రువపత్రం, సురేష్ తన పేరు మీద అపార్టుమెంటు తీసుకొనడానికి ప్రయత్నించిన కాగితాలు వారికి చూపించింది. సురేష్ తల్లికి ఇదేమీ తెలియదు. ఆమెది బలహీనమైన గుండె కనుక ఆమెకు సురేష్ తండ్రి ఏమీ చెప్పలేదు. సురేష్ భార్యకు కూడా ఇదేమీ తెలియదు.

దీనితో సురేష్ తల్లికి జీవితంలో ఎన్నడూ లేనంతగా విభ్రాంతి కలిగింది. ఆ రాత్రి ఆమె చనిపోయింది. సురేష్ భార్య కూడా దీనిని తట్టుకొనలేక, అత్తగారి అంత్యక్రియలు కాగానే పిల్లల్ని తీసుకొని సురేష్‌ని వదిలివెళ్ళిపోయింది.

సురేష్, అతని తండ్రి దీనితో కుంగిపోయారు, తమని తాము నియంత్రించుకొనడం వారికి కష్టమైంది. వాళ్ళు జె ని చంపాలనుకున్నారు. తమ జీవితాలను నాశనం చేయడమే కాక, ఇంకా అపార్టుమెంటు, డబ్బు కూడా అడుగుతోంది. ఆమెని చంపాలని ప్రణాళిక వేశారు. వాళ్ళు సదాత్మ కలవారే కాని ఈ అగౌరవం, ప్రియతములను కోల్పోవడం వారిని ప్రతీకారానికి పురికొల్పాయి. అదృష్టవశాత్తు సద్గుణ సంపన్నుడైన వారి మిత్రుడొకరు సంతాపం ప్రకటించడానికి వారి ఇంటికి

వచ్చాడు. ఆయనతో సురేష్, అతని తండ్రి తమ కథంతా చెప్పి, ఆమెను చంపాలనుకుంటున్నామని చెప్పారు.

వారి స్నేహితుడు ఇలా చెప్పాడు, "చూడండి మిత్రులారా, మీరెంత బాధపడ్డారో, ఇప్పుడెంత బాధననుభవిస్తున్నారో నాకు అర్థమైంది. కాని ఈ వృద్ధుడి మాట విని మీ ఆత్మలను రక్షించుకోండి. ఆమెని చంపడం మీ చేతులలో లేదు. అది పూర్తిగా దేవుడి చేతిలో ఉంది. అందువల్ల సర్వశక్తిమంతుడైన భగవంతునికి వ్యతిరేకంగా ఏమీ చేయకండి. మీ మంచి మనసులలో నుంచి ఈ చెడు ఆలోచనలు పారద్రోలండి, వాటివల్ల ఆమెకన్న మీకే హాని. ఇలా చేస్తే మీరిద్దరూ ఎంతో కిందికి పడిపోతారు. స్వర్గంలో ఉన్న మీ అమ్మను చూడలేరు. ఇలా ఆలోచించడం మానివేయండి దయచేసి. దీనికి బదులుగా సర్వశక్తిమంతుడైన భగవంతుని సంతోషపెట్టడానికి మీరొక పని చేయవచ్చు. ఆమెకి డబ్బు ఇవ్వం అని చెప్పండి. ఆమె చెడ్డ మనిషి. కనుక ఆమె గురించి అందరికీ చెప్పండి. ఆమెలోని క్రూరత్వాన్ని అందరికీ తెలిసేలా చెయ్యండి. ఇంక ఇతరులెవరూ ఆమె చేతిలో మోసపోరు కనుక దేవుడు దీనికి సంతోషిస్తాడు. పైగా ఆమె బాగుపడే అవకాశం కూడా ఉంటుంది".

ఈ మంచి సలహా, మార్గదర్శకత్వం సురేష్‌ని, అతని తండ్రిని పాపాత్ములు కాకుండా కాపాడాయి.

14-6-1981

అందరితో ఒకే విధంగా వ్యవహరించలేం

ఎవరైనా తప్పు చేస్తున్నప్పుడు ఒక సదాత్మగల వ్యక్తి చూస్తే, ఆ వ్యక్తికి వెంటనే చెబుతారు, లేదా నేర్పుగా వారంతటవారే తప్పు తెలుసుకొనేలా చేసి ఆ వ్యక్తిని బాగు చేశామని సంతోషిస్తారు. ఇక్కడ పూర్తిగా ఆ వ్యక్తిని బాగుచేయడమే వారి ఉద్దేశ్యం. దుష్టాత్మ గల వ్యక్తులు కూడా ఇతరులెక్కడ తప్పు చేస్తున్నారో చూపుతారు. కాని వారెక్కడ తప్పు చేశారో చెప్పామని గర్విస్తారు, తర్వాత వారిని హేళన చేస్తారు. ఇది ఒకలాంటి ప్రతీకారమే. సదాత్మ మాత్రం తాను ఒకరిని బాగు చేశానని సంతోషిస్తారు.

మీరు ఉన్నతస్థాయిలో ఉంటే గనుక మీ ఉపచేతనాత్మక మనస్సు మార్గదర్శకత్వం చేస్తుంది, కాని మీరు కిందిస్థాయిలో ఉంటే మంచి నిర్ణయాలు తీసుకొనడం కష్టం. మంచి పనుల మాటకొస్తే సదాత్మకు చేసిన మంచిపని ఆత్మ మెరుగుపడడానికి తోడ్పడుతుంది; అయితే, దుష్టాత్మకు చేసిన మంచి పని వ్యతిరేక ఫలితం ఇస్తుంది -

దుష్టాత్మ ఆ మంచి పనిని బలహీనతకు సంకేతంగా భావించి, పరిస్థితి నుంచి ప్రయోజనం పొందాలనుకుంటాడు.

ఉదాహరణకు బోమి మీ ఇంటికి వస్తాడు. అతడికి కూల్‌డ్రింకు ఇద్దామనో, తినడానికి ఏమైనా పెడదామనో మీరు గదిలో నుంచి బయటికి రాగానే అతను మీ ఇంటిలో డబ్బు దొంగిలిస్తాడు. మళ్ళీ గదిలోకి వచ్చినప్పుడు ఏం జరిగిందో మీరు గ్రహిస్తారు. మీరతనికి మరి కొంచెం డబ్బిచ్చి, "దొంగతనం చేసే బదులుగా, నన్నడిగి ఉంటే నేనే నీకు ఇచ్చేవాడిని" అని అంటారు. అతను సిగ్గుపడి "క్షమించండి. ఇంక నేనెప్పుడూ దొంగిలించన"ంటాడు. అతను ఆశపడ్డాడో, చాలా అవసరమో వచ్చిందో సదాత్మ కనుక మాటకు కట్టుబడి ఉంటాడు. కాని ఇదే విధంగా కొన్ని దుష్టాత్మలతో ప్రవర్తిస్తే వాళ్ళని ప్రోత్సహించినట్టవుతుంది వాళ్ళు నవ్వేస్తారు. అయినాగాని ఇతరులను, మిమ్మల్ని చాలాసార్లు మోసం చేయాలని ప్రయత్నిస్తారు, అది మిమ్మల్ని కిందిస్థాయికి చేరుస్తుంది. అందువల్ల మంచి పని ఒక వ్యక్తికి చేస్తే అది అతనికీ, మీకూ మంచిది కావచ్చు, కాని మరొక వ్యక్తికి చేసిన మంచి పని మీ ఇద్దరికీ చెడు చేయవచ్చు.

క్షమాపణ విషయంలో కూడా ఇంతే. సదాత్మ కల వ్యక్తిని మీరు క్షమిస్తే అతడు శాయశక్తులా మెరుగవడానికి ప్రయత్నిస్తాడు. అతడి ఉపచేతనాత్మక మనస్సు తానెక్కడ తప్పు చేశాడో అతడు తెలుసుకొనేలా చేస్తుంది. కాని దుష్టాత్మకల వ్యక్తి తనెక్కడ తప్పు చేశాడో చెప్పకుండా క్షమిస్తే, అతడు మిమ్మల్ని ఎద్దేవా చేస్తాడు. బుద్ధిహీనులని అంటాడు. చెడు మార్గాలనే కొనసాగిస్తాడు. మీరు అతన్ని ప్రోత్సహించారు కనుక మీరు కూడా కిందికి పడిపోతారు. అందువల్ల భూలోకంలో ఉండే వ్యక్తులందరూ ఒకేలా ఉండరు.

అందరితో ఒకేవిధంగా ప్రవర్తించలేం.

15-6-1981

సమస్యలను ధైర్యంగా, చిరునవ్వుతో ఎదుర్కోండి

భూలోకంలో సంతోషాన్ని, సౌకర్యాన్ని అంతటినీ పొందడం పూర్తిగా అసాధ్యం. కష్టాలు పడాలి. సమస్యలు, బాధలు, అనారోగ్యాలు భరించాలి. ఎందుకంటే ఇటువంటి సమస్యలు లేకుండా భూలోకంలో బ్రతకలేరు. ముఖ్యమైన దేమిటంటే, మీరు సమస్యలనెలా ఎదుర్కొంటున్నారనే విషయం. వాటిని మీరు ధైర్యంగా, చిరునవ్వుతో ఎదుర్కొనాలి. వాటి నుంచి పారిపోవాలి అనుకోకూడదు. ఎప్పుడూ చాలా సమస్యలు వస్తూనే ఉంటాయి. అందుకని మీ సమస్యలను ధైర్యంగా,

సంతోషంగా ఎదుర్కొనండి. మీరు సదాత్మ అయితే, నిజంగా, నిజాయితీగా మంచిగా ఉండాలను కుంటే, దేవుడు మీతోనే ఉంటాడని నమ్మండి. ఆయన్ని నమ్మండి. ప్రార్థించండి. మార్గదర్శిగా ఉండమని కోరండి. హృదయపూర్వకమైన మీ ప్రార్థనలకు తప్పక ఫలితం ఉంటుంది.

ఇతరులలో వ్యతిరేకతను ఎన్నడూ ప్రోత్సహించవద్దు

చెడును ఎదిరించే శక్తి లేకపోతే చెడును, చెడ్డవారిని తప్పించుకొనడం మంచిది. వారికి దూరంగా ఉండండి. చెడ్డవాళ్ళు, వారి ప్రభావము ఎప్పుడూ మీకు హాని చేస్తాయి. మీ స్పందనలు పాడవుతాయి. మీరు తప్పనిసరిగా కిందిస్థాయికి పడిపోతారు. భూలోకంలోనివారు "చెడును ఎలా తప్పించుకొనగలం? మా చుట్టూ చెడ్డవారే ఉన్నారు" అనవచ్చు. భూలోకంలో ఎన్నో దుష్టాత్మలు ఉన్నాయని మాకు తెలుసు. మీరు వారితో మాట్లాడవచ్చు. వారి పొరుగింట్లో ఉండవచ్చు. కాని వారితో ఎన్నడూ స్నేహం చెయ్యవద్దు. చిన్న సంభాషణ, చిరునవ్వు, తలవూపడంతో వారి నుంచి దూరంగా ఉండండి. హిపోక్రేట్‌లా ఉండవద్దు. అవసరమైతే వారికి సాయం చెయ్యండి కాని చెడ్డ పనులకు వారిని ప్రోత్సహించవద్దు. చాలామంది మీరు వారితో స్నేహంగా ఉండకపోతే, వారు కూడా దూరంగా ఉంటారు. వారిని దూరంగానే ఉంచండి. సాధారణమైన సదాత్మకు అటువంటి చెడ్డ వ్యక్తులను బాగుచేయడం సాధ్యం కాదు. చాలాకొద్దిమంది సదాత్మలకే చెడు ఆత్మలను బాగుచేసే శక్తి తాము తప్పు చేయకుండా ఉండే శక్తి, ఉంటుంది. సదాత్మలు కూడా చెడు, పాప ప్రభావాలకు లోనవుతారు. కనుక దుష్టాత్మలను బాగుచెయ్యడం కష్టం.

16-6-1981

ఆధ్యాత్మిక దృష్టితో విషయాలను గ్రహించండి

క్రూరులు, చెడ్డవ్యక్తులు సూటిగా ఆలోచించరు. పని చెయ్యరు. సదాత్మగల వ్యక్తులు ఎన్నడూ తప్పుడు సలహాలు ఇవ్వరు. తోటి వారిని తెలిసి తెలిసీ చెడు మార్గంలో వెళ్ళనీయరు. చెడ్డ వ్యక్తికి పడిన శిక్షను చూసి సంతోషించడం పాపమా? చూద్దాం:

1. చెడ్డ వ్యక్తి గుణపాఠం నేర్చుకున్నాడని మీరు సంతోషిస్తే, ఇతరులకు హాని చేయడం మానేశాడని, బాగుపడడానికి అవకాశం వచ్చిందని - బాగుపడడం సాధ్యమని అనుకున్నప్పుడు సంతోషించని వారెవరు? ఇది సహజం.

2. మీ సంతోషం మంచి శాస్తి జరిగిందని కలిగితే అది పాపం.

అందువల్ల ఎప్పుడూ రెండు పార్శ్వాలు ఉంటాయి. ఇదంతా మీరు విషయాలనెలా చూస్తున్నారు, మీ ప్రతి చర్యలేమిటి? మీ ఉద్దేశ్యమేమిటి అనే దానిపై మొత్తం ఆధారపడి ఉంటుంది.

17-6-1981

జాతక ఫలాల ప్రభావానికి లోనుకావద్దు

జాతక ఫలాల గురించి ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాం. వార పత్రికలోనో, దినపత్రికలోనో మీ జాతక ఫలాలను చదివినపుడు అది మీ మనసుపై ప్రభావం చూపుతుంది. మీ ఆలోచనలు చాలా శక్తిమంతమైనవి. చదివిన దానిని బట్టి ప్రభావితమవుతాయి. దానితో జాతక ఫలాన్ని బట్టి సంఘటనలు జరిగే వీలుంటుంది. దానితో మీరు జాతక ఫలం సరిగ్గా జరిగింది అనుకుంటారు.

ఇది బలహీన మనస్కుల మనసు మార్చడం తప్ప మరేం కాదు. ఏదైనా చెయ్యాలనుకున్నప్పుడు మీ సానుకూల ఆలోచనలు చాలా కేసుల్లో తప్పనిసరిగా సాయం చేస్తాయి. మీ ఉపచేతనాత్మక మనస్సుకు తెలుసు. జాతక ఫలం తప్పని. కాని మీ భౌతిక మనస్సు దానిని రైటనుకుంటుంది. మీ ఉపచేతనాత్మక మనస్సుకు నిజం తెలుసు. జాతక ఫలం తప్పయితే మీ ఉపచేతనాత్మక మనస్సు మీతో సహకరించదు. అందువల్ల నిరుత్సాహపడవద్దు. ప్రతిదీ దైవేచ్ఛ ప్రకారం జరుగుతుందని, మీకు తగిన మార్గం చూపినందుకు సర్వశక్తిమంతుడైన భగవంతునికి కృతజ్ఞతలు చెప్పండి. మీ సంకల్పస్వేచ్ఛని ఉపయోగించండి. జ్యోతిష్యులు, జాతక ఫలాలను నమ్మి మోసపోవద్దు. ఇదంతా మీపైన, మీరు ఎంపిక చేసుకొనే వాటిపైన ఆధారపడి ఉంటుంది.

శక్తిని మంచికీ, చెడుకీ ఉపయోగించవచ్చు

శక్తిని విక్షేపించడం, శక్తిని స్వీకరించడం

మీ లోకానికీ, ఆత్మలోకానికీ, విశ్వమంతటికీ కొన్ని నిర్దిష్ట శక్తులున్నాయి. ఈ శక్తి కొన్ని ప్రదేశాలలో ఎక్కువ బలంగాను కొన్ని ప్రదేశాలలో తక్కువగాను ఉంటుంది. కాని అన్నిచోట్లా ఉంటుంది. ఆత్మలోకంలో మేము దీనిని ప్రత్యేకించి తయారచేసుకో నవసరం లేదు. మా మనస్సే పవర్‌హౌస్. మా అంతట మేము శక్తిని గ్రహించగలం. కాని భూలోకంలో మీ అంతట మీరు దీనిని ఎలా పొందాలో మీకు తెలియదు. అందువల్ల మీరు ఈ శక్తి కన్న కిందిస్థాయి విద్యుత్తుపై ఆధారపడతారు.

కొందరు మనుషులకు స్వీకరించే శక్తులుండడంతో మా సందేశాలు స్వీకరిస్తారు. కొందరికి విక్షేపించే (ప్రొజెక్టింగ్) శక్తులుంటాయి. కొందరికి చాలా శక్తి ఉంటే, మరి కొందరికి తక్కువశక్తి ఉంటుంది. మరికొందరు స్వీకరించే, విక్షేపించే శక్తుల సమతౌల్యం కలిగిన అదృష్టవంతులూ ఉంటారు. ఈ రెండు శక్తులను, సక్రమంగా వాడితే, మీకు, మీ చుట్టూ ఉన్నవారికి చాలా మంచి జరుగుతుంది. సదాత్మలు సర్వశక్తిమంతుడైన భగవంతునికి సమీపంలో ఉంటారు. వారి ఉపచేతనాత్మక మనస్సు వారికి మార్గదర్శిగా ఉంటుంది కనుక వారు ఈ శక్తిని మంచి కోసం ఉపయోగిస్తారు.

శక్తి ఒకటే కాని దానిని మంచికో, చెడుకో వాడడం వ్యక్తి చేతుల్లో ఉంది. గొప్పలు చెబుతూ ఆడంబరంగా, మోసపూరితంగా ఉంటారు కనుక బలహీనమనస్కుల విషయంలో ఇది చాలా ప్రమాదం. ఇది వారిని కింది ఆవరణలకు తోస్తుంది. అక్కడ ఉండే వ్యతిరేక ఆత్మలు ఆ వ్యక్తి మరింత తప్పు చేసేలా చేస్తాయి. ఈ శక్తులున్న సదాత్మలకు ప్రార్థన చేయమని, ఏకాగ్రతతో ఉండమని, ఇష్టపూర్వకంగా మీ మనస్సును మంచి ఆత్మకు (ప్రియమైన వారికి) ఇవ్వమని సలహా ఇస్తున్నాం. వారు భూలోకంలో మీరు చాలామంచి జీవితాన్ని గడిపే మార్గదర్శనం చేసి మీకు సాయం చేస్తారు. ఏ గుణాలుంటే ఆ గుణాలకు ఆకర్షితులవుతారు – చెడు చెడును ఆకర్షిస్తుంది. మంచి మంచిని ఆకర్షిస్తుంది. చివరికి ఈ శక్తి ఉన్న దుష్టాత్మలకు కూడా బాగుపడడానికి ఇది మంచి అవకాశం. బాగా చెడ్డ వ్యక్తి ఈ శక్తిని ఉపయోగించడం చాలా ప్రమాదం. వ్యతిరేక ఆత్మలు జనాన్ని అత్యంత కింది ఆవరణలకు పంపడానికి నిరీక్షిస్తున్నాయి. అందువల్ల దయచేసి, బలహీన మనస్కులైన సదాత్మలు ఈ శక్తిని పెంపొందించు కొనడానికి ప్రయత్నించవద్దు. ఒక్కసారి చెడు ఆత్మకు మీ మనస్సును నియంత్రించే శక్తి వచ్చిందంటే, దానిని వెళ్ళగొట్టడం చాలా కష్టమని గుర్తుంచుకోండి.

18-6-1981

ఆత్మలోక ఆత్మల సాయం కావాలంటే, ఎల్లప్పుడు ప్రశాంతంగా, మౌనంగా ఉండండి

ఎప్పుడూ ప్రశాంతంగా, ఆందోళన లేకుండా మౌనంగా ఉండండి. ఆందోళన లేకుండా ఉంటే ఆత్మలోక ఆత్మలు మీకు మార్గదర్శకం చేస్తాయి. సర్వశక్తి మంతుడైన భగవంతునిపై నమ్మకముంచడం నేర్చుకోవాలి మీరు – దేవుడు గొప్పవాడు.

జ్యోతిష్యులను, అలాంటి మరికొందరు వ్యక్తులను నమ్మవద్దు. సర్వశక్తిమంతుడైన భగవంతునిపైనే పూర్తిగా నమ్మకముంచండి. మీరు యథార్థంగా, హృదయపూర్వకంగా విశ్వసిస్తే సర్వశక్తిమంతుడైన భగవంతుడు అద్భుతాలు చేస్తాడు. ఆయన సర్వశక్తి మంతుడు. ఎవరూ ఆయనకు వ్యతిరేకంగా ఏమీ చేయలేరు.

మీకు బాధ కలిగితే, సమస్యలు వస్తే దానిని మీ కర్మగా భావించి, పరీక్ష, శిక్షణగా భావించి ధైర్యంగా సంతోషంగా దానిని ఎదుర్కొనండి. నిజాయితీగా మీరు చేసే ప్రార్థనలు బాగా సాయం చేస్తాయి. మనసులో ధ్యానిస్తూ, ఎవరికీ హాని చేయకుండా ఉండండి. సర్వశక్తిమంతుడైన భగవంతుని నుంచే నేరుగా ఆత్మలోక ఆత్మల ద్వారా మీకు సాయము, మార్గదర్శకత్వము లభిస్తుంది.

హృదయపూర్వకంగా మీరు చేసే ప్రార్థన, దేవుడిపై మీ నిజమైన నమ్మకం ఎటువంటి సమస్యల నుంచైనా మిమ్మల్ని గట్టెక్కిస్తాయి. మీరు భూలోకంలో ఉన్నారు కనుక అక్కడ సమస్యలుంటాయి. వాటిని మీరు ఎదుర్కొనాలి. అందువల్ల ధైర్యంగా చిరునవ్వుతో ఎదుర్కోండి. దేవుడిపై మీరుంచే నమ్మకం, మీ ప్రార్థనలు కచ్చితంగా మాకూ ఉపకరిస్తాయి మాకు మిమ్మల్ని చేరడం, మార్గదర్శకత్వం చేయడం, సాయం చేయడం సులువవుతుంది.

19-6-1981

పెళ్ళి

ఆత్మలోకంలో పెళ్ళిళ్ళు లేవు. అయినాగాని భూలోకంలోని విడిపోయిన వారిని వారి బిడ్డల కోసం, దంపతులకు కూడా వృద్ధాప్యంలో ఒకరితోడు ఒకరికి అవసరం కనుక వారిని కలపాలని మేము ప్రయత్నిస్తాం. **భూలోకంలో పిల్లలను సంరక్షించడానికి వివేకవంతులు పెళ్ళిని సృష్టించారు.** ఎందుకంటే జనం బాధ్యతగా ఉండకపోవడం, పిల్లల్ని సంరక్షించకపోవడం వారు చూశారు. అందువల్ల బిడ్డల్ని కనాలంటే పెళ్ళిని తప్పనిసరి చేశారు. ఒంటరిగాకన్న, తల్లిదండ్రులిద్దరూ కలిసి పిల్లల్ని బాగా పెంచగలరు.

ఇద్దరూ కలిసి ఉండి, సాయం చేసుకుంటూ, బిడ్డలకు మార్గదర్శకులుగా ఉంటూ మెరుగైన పౌరులుగా తీర్చిదిద్దడం వివేకంతో కూడుకొన్నది. వృద్ధాప్యంలో కూడా వారు ఒకరికొకరు తోడుగా ఉంటూ, ఒకరినొకరు సంరక్షించుకుంటూ, లౌకిక సమస్యలను కలిసి ఎదుర్కొంటారు. అందువల్ల పెళ్ళిళ్ళు విధి లిఖితాలు కావు. మాకు ఇది చెప్పడానికి భయం వేస్తోంది కాని, భూలోకంలోని చాలామంది ఇలా అంటారిప్పుడు, "పెళ్ళిళ్ళు

దేవుడు చేయకపోతే పెళ్ళి చేసుకుని సమస్యల పాలవడం ఎందుకు? స్వేచ్ఛగా ఉందాం". దీనిని పుస్తకంలో ప్రచురించే ముందు బాగా ఆలోచించమని నేను సలహా ఇస్తున్నాను. పెళ్ళి చేసుకుని విడిపోయిన వారిని కలపడానికి, వారు సంతోషంగా ఉండడానికి, ఇదే వారికి మంచిది కనుక సాయం చెయ్యాలని మేము అనుకుంటాం. కాని కొన్నిసార్లు ఒక భాగస్వామి బాగా చెడ్డవారై మరొక భాగస్వామిని / పిల్లలను శారీరకంగా మానసికంగా వేధిస్తూ ఉంటారు. రెండోవారికి వారితో కలిసి ఉండడం అసాధ్యమైపోతుంది. అలాంటప్పుడు సంబంధితులందరికీ ఏది మంచిదో అదే చేయమని మేము దేవుని ప్రార్థిస్తాం.

భార్యాభర్తలు ఒకరినొకరు ప్రేమిస్తూ, సామరస్యం, సంతోషాలతో పిల్లలతో కలిసి జీవించడం మంచిది. ఇలా ఉంటేవారు సమస్యలను మరింత మెరుగైన పద్ధతిలో ఎదుర్కొనగలరు. **భూలోకంలోని ప్రతి మనిషికీ ఇంటిలో సామరస్యం, సంతోషం ఉండడం అత్యంతావశ్యకం.** అన్ని వివాహాలలో ఇద్దరూ ఇచ్చిపుచ్చుకునే సామరస్య, సహనాలను కలిగి ఉండాలి.

15-1-1984

మీ శక్తిని సరైన పద్ధతిలో అభివృద్ధి చేసుకోండి

ఆత్మలోకంలో కూడా భూలోకంలో వలె మీరు చూడలేని విద్యుచ్ఛక్తి ఉంటుంది. ఈ శక్తి భూలోకంలో మీకు బాగా సాయం చేస్తుంది. ఫోను, రేడియో, టీవీల ద్వారా సందేశాలను అందుకొనడానికి ఇది మీకు సాయపడుతుంది. మనిషి మెదడు కూడా ఫోను, రేడియో, టీవీ లాంటిదే. భూలోకంలోని కొంతమంది స్వీకరించే శక్తిని పెంపొందించుకున్నారు. కొందరు విక్షేపశక్తిని మాత్రమే పెంపొందించుకున్నారు. కొందరు ఈ రెంటి మధ్య సమతౌల్యాన్ని సాధించారు. ఎక్కువ విక్షేపశక్తి ఉన్నవారు మా ఆత్మ సందేశాలను వినలేరు. వారికి స్వీకరించే శక్తి తక్కువ ఉంటుంది. భూలోకంలో చాలామందికి మానసిక శక్తులు ఉంటాయి. కాని వాటిని పెంపొందించుకొనడం మీ చేతులలో ఉంటుంది. వాటిని మీరు ఎలా పెంపొందించుకుంటారనేది చాలా ముఖ్యం. అదే శక్తిని రెండు రకాలుగా అంటే మంచికి, చెడుకి కూడా ఉపయోగించవచ్చు. అందుకని మిమ్మల్ని మీరు నాశనం చేసుకొనడం గాని, పైకి ఎదిగి సంతోషంగా ఉండడం గాని మీ చేతులలోనే ఉంది.

కొన్నిసార్లు మీకు కొన్ని విషయాలు చెప్పడానికి, మీరడిగే ఒక ప్రశ్నకు సమాధాన మివ్వడానికి మాకు అనుమతి ఉండదు. పదే పదే అదే ప్రశ్న అడిగి మమ్మల్ని బలవంత పెట్టవద్దు. భూలోకంలో ప్రతి ఒక్కరూ పాపం చేస్తారు. పాపం చేయని వ్యక్తి ఉండరు.

వాళ్ళ స్థాయిలు మారతాయి. కొందరు చాలా తక్కువ, కొందరు ఇంకొంచెం, మరికొందరు బాగా పాపం చేస్తారు. కొద్ది పాపానికైనా మీరు మీ కర్మను అనుభవించాల్సిందే. దానిని మేము ఆపలేం. దీనిని మీరు బాగా అర్థం చేసుకోవాలి. మీ శిక్షను మేము ఆపలేం. కొన్నిమార్లు కొందరికి సాయం చెయ్యం అని తిరస్కరించడానికి ఇదే ప్రధాన కారణం. మంచివారికి, అమాయకులకి, భూలోకంలోని చెడ్డవారి చేతిలో బాధపడేవారికి మేము సాయం చెయ్యడానికి సిద్ధంగా ఉంటాం. అందువల్ల మీకు సాయం చెయ్యడానికి, మార్గదర్శకులుగా ఉండడానికి మేము తిరస్కరిస్తే, మీరేం పాపాలు చేశారో తెలుసుకొని, నిజాయితీతో పశ్చాత్తాపం చెందండి. అప్పుడు భవిష్యత్తులో మేము మీకు మార్గదర్శకులుగా ఉండగలం.

కేవలం వ్యతిరేక ఆత్మలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించాలని, తప్పు మార్గాన్ని చూపిస్తాయి. మీకు బాధ కలిగించాలని తీవ్రంగా ప్రయత్నిస్తాయి. కాని మంచి మంచిని, చెడు చెడుని ఆకర్షిస్తుంది కనుక బాగా ప్రయత్నించి మంచిగా ఉండండి. దేవుడు మీకు సాయం చేస్తాడు.

25-1-1984

ప్రార్థనలు క్లుప్తంగా, నిజాయితీగా ఉండాలి

మీకు ఏకాగ్రత పూర్తిగా ఉండాలి. మీ లోకంలో ఎక్కువసేపు చేసే ప్రార్థనలలో ఏకాగ్రత కుదరదు. మీరు నిజాయితీగా ప్రార్థించలేరు కూడా. పూర్తి అంకిత భావంతో, ఏకాగ్రతతో, నిజాయితీతో పుస్తకంలో ప్రార్థన చదవకపోతే, అది నవల చదివినట్టే. ప్రార్థన కాదు.

ప్రతిరోజూ ఒకే చోట ప్రార్థన చెయ్యండి. ఆ చోటులో బలమైన పవిత్రమైన స్పందనలు కలుగుతాయి. ప్రార్థన ఎక్కడైనా చెయ్యవచ్చు. కాని ఒకే ప్రదేశాన్ని ఎంచుకుంటే స్పందనలు మళ్ళీ మిమ్మల్ని చేరతాయి. ఇవి మీకు బాగా ఉపకరిస్తాయి. దేవుడు అన్నిచోట్ల ఉంటాడు. ప్రయాణం చేస్తున్నపుడు కూడా మీరు చిన్న ప్రార్థన చేయవచ్చు. నమ్మకం ఉండాలి. రోడ్డు మీది రాయిని కడిగి బల్ల మీద పెట్టి హృదయపూర్వకంగా ప్రేమించవచ్చు. మీ ప్రార్థనల వల్ల మంచి స్పందనలు పుడతాయి. ఆ స్పందనలను ఆ రాయి గ్రహిస్తుంది. నిజాయితీగా రోజూ మీరు చేసే ప్రార్థనల వల్ల ఆ రాతి చుట్టూ, ఆ ప్రదేశంలో స్పందనలు పుడతాయి. అవి తిరిగి మీకు చేరతాయి. వాటి ద్వారా మీకు ప్రశాంతమైన మనస్సు, వివేకం కలగడమేకాక మీ ఆత్మ పరిశుద్ధ మవుతుంది. దేవుడిని పూర్తిగా నమ్మండి. పూర్తిగా నిజాయితీగా ఉండండి. మీ ప్రార్థనల వల్ల అద్భుతాలు జరుగుతాయి.

26-1-1984

గర్వం మిమ్మల్ని ఆధ్యాత్మికంగా కిందికి తోస్తుంది

ఎప్పుడూ వినయంగా ఉండండి. మీ సాయం లేకపోతే ఎవరో చిక్కుల్లో పడిపోతారని భావించకండి. అవసరమైన వారికి సాయం చేయడానికి దేవుడున్నాడు. మీరు మానవ మాత్రులు. మీకు పేరొస్తే గర్వం వస్తుంది. ఆ గర్వం మిమ్మల్ని కిందికి పడిపోయేలా చేస్తుంది. అందుకని గర్వంగా ఉండకండి. ఒకవేళ మీ మనసులో గర్వం నిండిపోతే సూటిగా ఆలోచించలేరు. చాలా తప్పులు చేస్తారు. ఆధ్యాత్మికంగా కిందపడిపోతారు. మీ తల గాలిలో ఉంటే దానిలో గాలి తప్ప మరేమీ ఉండదు. మీకు వివేకం ఉండదు. మీరు లేకుండా ఎవ్వరూ నిస్సహాయులు కారని మీరు నిర్భయంగా ఉండవచ్చు. సర్వశక్తిమంతుడైన భగవంతుడు లేకపోతే మీరే నిస్సహాయులు.

తాను లేకపోతే ఎవరో నిస్సహాయులవుతారని అనకొనేవాడు బుద్ధిహీనుడు. గర్వించ దగినదేదైనా దేవుడు మీకిస్తే వినయంగా ఉండండి; లేకపోతే కచ్చితంగా పడిపోతారు. సమయం రాకుండా ఏదీ జరగదు – నిరీక్షిస్తూ విశ్రాంతిగా ఉండండి. మీరు ఆందోళన పడ్డారని ముందుగా ఏదీ జరగదు. దాని వల్ల మీకు హాని జరుగుతుంది. అందువల్ల ప్రశాంతంగా ఉండి ప్రార్థించండి. దేవుడు గొప్పవాడు.

భూలోకంలో చెడు, పాపాత్మలతో కలిసి ఉంటూ, మీ ఆత్మను పవిత్రంగా ఉంచుకోవాలి. బలంగా, మంచిగా ఉంచుకోవాలి. ఇది చాలా కష్టమైన పని. కాని సదాత్మలతో దేవుడు ఉంటాడు. వారు రక్షించమని కోరితే వారిని సంరక్షిస్తూ ఉంటాడు. భూలోకంలో ఇతరుల పట్ల శ్రద్ధను, అభిమానాన్ని చూపండి. ఎన్ని కష్టాలు పడుతున్నా మంచిగానే ఉండాలని నిరంతరం నిజాయితీగా కోరుకోండి.

28.01.1984

పాపాలకు ఫలితాన్ని అనుభవించకుండా తప్పించుకోలేరు

మీరు నాటిన విత్తనాన్ని బట్టి పంట ఉంటుంది. దేవుడి న్యాయం సంపూర్ణంగా నిర్దుష్టం. ఇది తక్షణమే జరగకపోవచ్చు. కాని క్రమేణా మీ పాపాలకు పరిహారం చెల్లించవలసిందే. తప్పు చేస్తున్న, పాపం చేస్తున్న సదాత్మలకు దేవుడు నిరంతరం సూచనలు ఇస్తూ ఉంటాడు. మీరెక్కడ తప్పు చేస్తున్నారో ఆయన మీకు చూపిస్తాడు. కాని భూలోకంలోని వారు దీనిని గుర్తించలేరు. అందుకని


ఆగకుండా, బాగుపడడానికి ప్రయత్నించకుండా మరింతగా చెడు చేస్తూ లోతుగా కూరుకు పోతుంటారు. చెడు మార్గాల్లో విఫలం చెందినా, దేవుడికి తాము పాపం చేయడం ఇష్టం లేదని గుర్తించరు. పైగా పాపంలో మరింత లోతుకి వెళ్ళి, "నేనెంత తెలివైన వాణ్ణో చూపిస్తాను" అని ఆలోచిస్తారు. అటువంటి ఆత్మలను చూసి జాలి పడుతున్నాం. వారు చెడులో ఎంత లోతుగా కూరుకుపోతారంటే 'వెనుతిరిగి రాలేని దారి'లో వెళుతున్నారు. వారు నరకానికి చేరతారు.

భాగం – II



ప్రశ్నలు – సమాధానాలు

అప్రయత్న లేఖనం



"అరకొర జ్ఞానం ప్రమాదం"

"భూలోకంలో మీరున్న దానికన్న ఆత్మలోకంలో మేమెంతో సజీవంగా ఉంటాం. మిమ్మల్ని చూడగలం, మీ మాటలు వినగలం, మిమ్మల్ని స్పృశించగలం, మీ మనసును అర్థం చేసుకొనగలం".

"నిజమైన ప్రేమ ఎన్నడూ చనిపోదు, భూలోకంలో మీరు చనిపోయినా సరే ప్రేమ చనిపోదు. ప్రేమ శాశ్వతం."

అప్రయత్న లేఖనాన్ని మీ అంతట మీరు ప్రయత్నించవద్దు. రక్షణ లింకు, తగిన సూచనలు లేకుండా మీ అంతటమీరే అప్రయత్న లేఖనాన్ని అభ్యాసం చేయడం చాలా ప్రమాదకరం. కేవలం అనుభవం ఉన్న, అంతకు ముందే లింకు ఉన్న వ్యక్తి మీ లింకును కలపగలరు. దీనివల్ల వ్యతిరేక జోక్యాలు అంటే ఒక ప్రేతాత్మకాని, అజ్ఞాత వ్యతిరేక శక్తి కాని మీకు హాని చేయకుండా వీరు చూడగలరు.

ꙮ చనిపోయిన వారితో మాట్లాడడం వల్ల వారి ఆత్మలకు ఆటంకం కలిగిస్తున్నట్లు కాదా?

మేము చనిపోయామనడం తప్పు. భూలోకంలో మీరున్న దానికన్న మేమెంతో సజీవంగా ఉంటాం. అనంత ప్రయాణంలో మీ భూలోక జీవితం మరొక మజిలీ. నిజమైన ప్రేమ ఉన్న చోట మాట్లాడడం ఎలా ఆగిపోతుంది? ఇది ఆత్మల మధ్య జరిగే సంభాషణ. ఆత్మలు ఎన్నడూ చనిపోవు. అందువల్ల మృత్యువు అంటే ఏమిటో మీరు తెలుసుకోవాలి. చనిపోయేది మీ అహం, మీ భౌతిక శరీరం - మిగిలేది మీ ఆత్మ. భూలోకంలోని ఏ వ్యక్తితో సంభాషించుతుందో, ఆ వ్యక్తి ఆత్మ కన్న, ఈ ఆత్మ ఎంతో సజీవం, ఎంతో చైతన్యం, ఎంతో ప్రేమ కలిగినది. ఆత్మలోకంలో ఉన్న మాకు శారీరక బాధలు, నొప్పులు ఉండవు. మానవ శరీరాన్ని, ప్రేత శరీరాన్ని వదిలివేయడంతో మేము పూర్తిగా స్వేచ్ఛగా ఉంటాం. భూలోకంలో వలెనే,

ఆత్మలోకంలో కూడా మా జీవితాలను మేము రూపుదిద్దుకొనే స్వేచ్ఛను దేవుడు ఇచ్చాడు. మేము ఏ పని చేయాలో మేమే ఎంపిక చేసుకోవచ్చు. ప్రార్థన చేయవచ్చు. ఆనందించవచ్చు, ఇష్టమైనప్పుడు సమాచారాన్ని పొందవచ్చు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందవచ్చు. మీ లోకంలోని భౌతికత్వం వల్ల వచ్చే పరిమితులు మాకుండవు, మా నిజమైన ఆధ్యాత్మిక మనస్సు అయిన ఉపచేతనాత్మక మనస్సు మమ్మల్ని నడిపిస్తుంది. అందువల్ల మీరు మాతో మాట్లాడితే "చనిపోయినవారికి ఆటంకం" కలిగించడం లేదు ఎందుకంటే మీకంటే మేము ఎంతో సజీవంగా ఉంటాం.


ఈ రోజుల్లో యువత ఎంతో నిష్కపటంగా ఉంటున్నారు. నిరంతరం పరిమితులకు లోబడి ఉండడంతో నిర్దిష్టమైన అభిప్రాయాలు, ఇదంతా తప్పని భావించే తల్లిదండ్రులవలె కాక వారు ఆత్మలతో మాట్లాడడానికి ముందుకొస్తున్నారు.

అప్రయత్న లేఖనమంటే ఏమిటి?


భూలోకంలోని మనుషులతో ఆత్మలోకంలోని ఆత్మలు మాట్లాడే ప్రక్రియ అప్రయత్న లేఖనం. దీనికి కావలసినది ఒక కలం. కాగితం. సహజమైన వెలుతురు. సరళంగా చెప్పాలంటే, మీరు ఆత్మలోకంలోని ఏ ఆత్మతో మాట్లాడుతున్నారో ఆ ఆత్మ మీరు పట్టుకున్న కలాన్ని కాగితంపై కదిలిస్తుంది. నిదానంగా పదాలు, వాక్యాలు రూపొందుతాయి. అప్రయత్న లేఖనం గురించిన వివరాలు మేము చెప్పము. ఇది తేలికగా తీసుకొనే అనుభవం కాదు. **వ్యతిరేక జోక్యం, అంటే ప్రేతాత్మగాని, అజ్ఞాత వ్యతిరేక శక్తిగాని అప్రయత్న లేఖనం చేస్తున్న సమయంలో మీకు హాని చేయవచ్చు.**

అప్రయత్న లేఖనాన్ని మీకు, ఆత్మలోకంలో మీరు మాట్లాడాలనుకున్న ఆత్మకు మధ్య రక్షణ లింకు ఉంటేనే చేయగలరు. అంతకుముందే ఈ లింకు ఉన్న, అనుభవం ఉన్న వ్యక్తి మాత్రమే మీ లింకును కలపగలరు. అందువల్ల అప్రయత్న లేఖనానికి అభ్యర్థన వచ్చినపుడు ఆత్మలోకం నుంచి అనుమతి తీసుకోవడం మొదటి అడుగు; అనుమతి లభిస్తేనే వివరంగా సూచనలు వస్తాయి. వాటిని పూర్తిగా పాటించాలి. దీనిని తగిన మార్గదర్శకత్వంలో సరిగ్గా చేస్తే ఆత్మలోకంలోని ఆత్మతో సురక్షితంగా జరిగే సంభాషణ ఇది. ఎందుకంటే మీకు, మీరు మాట్లాడే ఆత్మలోకంలోని ఆత్మకు మధ్య రక్షణ లింకు ఏర్పడుతుంది. ఈ లింకును ఆత్మలోకంలోని ఉన్నత ఆత్మలు కాపాడుతుంటాయి. అందువల్ల కిందిస్థాయి లేదా ప్రేతాత్మలు జోక్యం చేసుకుని మిమ్మల్ని తప్పుదారి పట్టించవు. ఆత్మలోకంలో ఉండే మాకు వ్యతిరేక ఆత్మలతో లింకు నేర్పరచుకొనడానికి అనుమతి లేదు.


అప్రయత్న లేఖనంలోని వివిధ దశలు



దశ 1



దశ 2



దశ 3

దశ 4

Cool & calm must, as you
know you have to control
yourself & keep cool
listen my dear sister you
are a good & sensible

దశ 5 – టెలిపతిక్

ఖోర్షీద్ భావనగరి అందుకున్న టెలిపతి సందేశం ఆమె చేతి రాతలో. ఇక్కడ ఆత్మలోకంలోని ఆత్మలు తమ ఆలోచనలను నేరుగా భూలోకంలోని ఆత్మకు చేరవేస్తాయి. దీనిని టెలిపతి అంటారు.

గుజరాతీలో అందుకున్న సందేశం (ఖోర్షీద్ భావనగరి మాతృభాష)

అప్రయత్న లేఖనం భూలోకంలోని ఆత్మలకు సర్వశక్తిమంతుడైన భగవంతుడిచ్చిన ప్రతిభ. దీని ద్వారా వారు తమ ప్రియతములతో మాట్లాడవచ్చు. ఉన్నత ఆధ్యాత్మిక స్థాయిలలోని ఆత్మలోక ఆత్మలకు, భూలోకంలో సన్మార్గంలో నడిచే వారికి మాత్రమే ఇలా మాట్లాడడానికి అనుమతి ఉంటుంది. అప్రయత్న లేఖనం నేర్చుకొనడం వలన కలిగే ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే, చనిపోయిన మీ ఆత్మీయులతో మాట్లాడుతూ, వారి మార్గదర్శకత్వం పొందవచ్చు. భూలోకంలోని వారికి ఇది ఎంతో ఓదార్పునిస్తుంది. ఏది ఏమైనా, ఆత్మలోక ఆత్మల మార్గదర్శకత్వంలో జరిగే అప్రయత్న లేఖనం పరమోద్దేశ్యం ఏమిటంటే మిమ్మల్ని **ఆధ్యాత్మికంగా మెరుగుపరచడం,** తద్వారా ఇతరులకు కూడా సాయం చెయ్యడం. మీరు రాస్తున్నపుడు మీ ఉపచేతనాత్మక మనస్సు పనిచేయడం మొదలుపెడుతుంది. మీకు రక్షణ లభిస్తుంది (వ్యతిరేక శక్తి మీకు హాని చెయ్యకుండా) ఉపశమనం లభిస్తుంది.

మీరు గనుక సన్మార్గంలో ఉంటే, కాలక్రమంలో ఇతరులకు సాయం చెయ్యగలరు. ఇతరుల కోసం సందేశాలను అందుకోగలరు. ఆధ్యాత్మిక జ్ఞానము, మార్గదర్శకత్వం అవసరమైన వారికి మీరు సాయం చెయ్యగలరు. దురదృష్టవశాత్తు చాలామంది నేడీ ప్రతిభను దుర్వినియోగం చేస్తున్నారు. వారు అప్రయత్న లేఖనం ఆరంభించారో లేదో, ఇతరులకు సందేశాలివ్వడం మొదలుపెడతారు. ఈ సందేశాలు వారి భౌతిక మనస్సు నుంచే వచ్చి ఉండవచ్చు. పూర్తిగా తప్పు కూడా అయి ఉండవచ్చు. కొందరు ఈ ప్రతిభను తమ అహాన్ని తృప్తిపరచుకొనడానికి, అధికారాన్ని పొందడానికి, సఫలత, కీర్తి పొందడానికో ఇతరులను నియంత్రించడానికో వాడుతున్నారు. ఇలా జరిగితే భూలోకంలోని ఆత్మతో ఆత్మలోక ఆత్మ మాట్లాడడం మానివేస్తుంది. దీనివల్ల రెండు విషయాలు జరగవచ్చు. మొదటిది భూలోకంలోని వ్యక్తి తనంతట తానే తన భౌతిక మనస్సు ఇచ్చే సందేశాలను రాయడం మొదలుపెడతాడు. ఇది పూర్తిగా తప్పు సందేశం అయి ఉంటుంది; రెండవది భూలోకంలోని ఆత్మకు వ్యతిరేకప్రేతాత్మ సందేశాలను పంపుతూ ఉంటుంది. అంతేగాకుండా భూలోక ఆత్మను తప్పుదారి పట్టిస్తుంది.

అప్రయత్న లేఖనం ఆధ్యాత్మిక అనుభవం అనడం సబబేనా?

సబబే. కచ్చితంగా ఇది అదే. ఆత్మలోక ఆత్మలు భూలోకంలోని ఆత్మలకు సాయం చెయ్యాలని దేవుడి కోరిక. మీకు మార్గదర్శకులుగా ఉండడం మా బాధ్యత. అప్రయత్న లేఖనం చెడు అలవాటని మా ప్రగతికి అది ఆటంకం కలిగిస్తుందని నమ్మేలా భూలోకంలోని ఆత్మలకు నూరిపోయడం జరిగింది. ఆధ్యాత్మిక ఎదుగుదల అంతిమ లక్ష్యం. షాక్ వల్లో, విచారం వల్లో మనుషులు చనిపోయిన తమ ఆత్మీయులతో

మాట్లాడినా, కాలక్రమంలో ఈ ఆత్మీయులు ఇప్పుడు ఆధ్యాత్మిక మార్గదర్శులుగా, రక్షకులుగా సేవ చేయడం గమనిస్తారు.

ౘ చనిపోయినవారు అందరూ తమ ఆత్మీయులతో ఎందుకు మాట్లాడరు? భూలోకంలోని తమ ఆత్మీయుల బాధను, విచారాన్ని తగ్గించాలని అన్ని ఆత్మలు అనుకోవా?

భూలోకంలోని కొన్ని ఆత్మలకు వాహకాలుగా పనిచేసే ప్రతిభ ఉంటుంది. వారు ఆత్మలోకం నుంచి సందేశాలను అందుకోగలరు. కొందరికి జన్మతః వచ్చే ప్రతిభ ఇది – ఈ ప్రతిభను ఎన్నో జన్మల ద్వారా సంపాదించి ఉంటారు. ఇది వారి ఆధ్యాత్మిక ధ్యేయం. భూలోకంలోని వారందరూ (ఆత్మలన్నీ) మరణానంతర జీవితాన్ని గాని, దేవుడిని గాని నమ్మరు. జనం నమ్ముతామని అంటారు గాని, దానికనుగుణంగా జీవితాన్ని గడపరు, అందువల్ల పరీక్షలో వారు తప్పుతారు. ఫలితంగా వారి ప్రియతములకు వారితో మాట్లాడే అనుమతి లభించదు. **ఆత్మలోకంలోని ఆత్మలకు కావలసినది విశ్వాసం.** రుజువు కోసం చూస్తే అది మీకు ఎన్నడూ దొరకదు. **మీరు మనిషి అని మీరనవచ్చు. దానికి మీకు రుజువు అవసరం.** కాని సత్యమేమిటంటే మీకు రుజువు కావాలి. దాని **అవసరం మీకు లేదు.** మీ హృదయానికి తెలుసు దేవుడున్నాడని, ఆత్మలోకానికి వెళ్ళినవారు ఇంకా సజీవులేనని. కేవలం తర్కం మిమ్మల్ని దానిని అంగీకరించనివ్వదు. మేము మీకు రుజువు చూపిస్తే పరీక్ష ఉండదు. తమ ప్రియతములు చనిపోగానే కొందరు ద్వేషం, కోపంతో రగిలిపోతూ దేవుడిని నిందిస్తారు. కష్టకాలంలో ఆయన సాయం కోరకుండా ఆయనకు దూరమవుతారు. బాధపడడం సహజమే కాని, ద్వేషం, కోపం తెచ్చుకోకుండా ఉండడానికి ప్రయత్నించండి. ఇలా చేయడం చాలా కష్టమైనదైనా ఇతరులకు సాయం చెయ్యడానికి ఈ బాధను ఉపయో గించండి. ఆ బాధకు లోబడి దేవుణ్ణి నిందించకండి. మానవసత్తకు, ఆత్మసత్తకూ మధ్య నిజమైన ప్రేమ ఉంటేనే మాట్లాడగలరు. వారి ఆత్మలు పరస్పరం మాట్లాడు కోవాలని తహతహలాడతాయి. ఆరంభంలో భూలోక ఆత్మకు ఓదార్పునివ్వాలని ఆత్మసత్త కోరుకుంటుంది. కాని కాలక్రమంలో రెండు ఆత్మలూ ఆధ్యాత్మిక పురోగతిని సాధించడమే లక్ష్యం. అయితే, భూలోక ఆత్మ గనుక చాలా కింది ఆవరణలో పడిపోతే, మాట్లాడడానికి అనుమతి ఉండదు, ఎందుకంటే భూలోక ఆత్మ యొక్క ఉపచేతనాత్మక మనస్సు, నిద్రపోయేందుకు సిద్ధంగా ఉంటుంది.

మీరు దృఢంగా, కపటం లేకుండా ఉండగలిగితే, మీ విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు మిమ్మల్ని చేరడానికి మాకు అనుమతినిస్తారు. ఇక్కడొక ఆధ్యాత్మిక నియమం పనిచేస్తుందని అర్థం చేసుకోండి దయచేసి. ఈ నియమం తటస్థం – పక్షపాతం

లేనిది. మీరు సన్మార్గంలో ఉంటే, ఆత్మలోకంలోని ఆత్మలు మిమ్మల్ని చేరడానికి తాము చేయగలిగినంత చేస్తాయి. మీరు బాధపడుతున్నా, అందుకోవడానికి మీరు సిద్ధంగా ఉండాలి. ఎన్నో ఆత్మలోక ఆత్మలు భూలోకంలోని తమ ఆత్మీయులను ఓదార్చడానికి వారిని చేరాలని ప్రయత్నిస్తుంటాయి. కాని భూలోకవాసులు మరణానంతర జీవితాన్ని నమ్మరు గనుక తరచుగా ఇలా వీలుపడదు. వారి మనసులు ఇది సాధ్యమవుతుందని నమ్మవు గనుక మాట్లాడటమనే ప్రశ్నే రాదు. మీ వైపు ఎన్నో అడుగులు వేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. కాని మొదటి అడుగు – నిష్కపటమైన మనస్సుతో విశ్వసించడం మీరు చెయ్యాలి. అదే ఆధ్యాత్మిక నియమం.

అప్రయత్న లేఖనం వలన ప్రయోజనాలేమిటి?

1. ఆత్మలోకంలోని మంచి ఆత్మలకు, భూలోకంలోని వ్యక్తులకు ఆధ్యాత్మిక పురోగతికి, నిస్వార్థసేవకు ఈ ప్రతిభ లభిస్తుంది.

2. అప్రయత్న లేఖనం ఒక ఆధ్యాత్మిక అనుభవం. దీని ద్వారా భూలోకంలోని ఆత్మలకు ఆత్మలోక ఆత్మలు మార్గదర్శకత్వం ఇస్తాయి. అయితే, ఈ మార్గదర్శకత్వం కేవలం ఒక సూచన అయినా కావచ్చు. అందువల్ల పూర్తిగా దీనిపైనే ఆధారపడకూడదు.


3. భూలోకంలోని ఆత్మలు తమ పరీక్షలు, శిక్షణ, కర్మ ధైర్యంగా, చిరునవ్వుతో ఎదుర్కొనేలా ఆత్మలోక ఆత్మలు సాయం చేస్తాయి. ఇంకా భూలోక ఆత్మ అతడు / ఆమె ఎవరైనా సరే తమ ఆధ్యాత్మిక ధ్యేయం ఏమిటో తెలుసుకొనేలా సాయం చేస్తాయి.

4. సర్వశక్తిమంతుడైన భగవంతుడి నిజమైన నియమాలను భూలోక ఆత్మలకు ఆత్మలోక ఆత్మలు తెలియజేస్తాయి.

5. అప్రయత్న లేఖన ప్రక్రియ జరుగుతున్నప్పుడు భూలోక ఆత్మకు ఆత్మలోక ఆత్మ ఉపశమనం కలిగిస్తుంది.

6. ఉపచేతనాత్మక మనస్సును కూడ మరింతగా తెరచి ఉంచుతుంది.

ఆత్మలోకం



"భూలోకం మన పాఠశాల : మన నిజమైన ఇల్లు ఆత్మలోకం".

"నిజాయితీగా కోరితేనే సాయం లభిస్తుంది".

❀ ఆత్మసత్తను కచ్చితంగా ఎలా నిర్వచించగలం?

మీరెవరో, చెబితేనే దీని గురించి మీకు వివరించగలం. ముందు మీరు 'మానవులు' కాదని తెలుసుకొనడం అవసరం. మీరు మానవరూపంలో ఉన్న ఆత్మసత్త, భూలోకంలో అందరూ ఇంతే. మీకు ఒక్క శరీరమే ఉండదు. మూడు శరీరాలు ఉంటాయి:

1. మానవ శరీరం

2. ప్రేత శరీరం

3. ఆత్మ శరీరం

మీరు చనిపోగానే మానవ శరీరం నుంచి ప్రేతశరీరంలోకి తరవాత ఆత్మరూపంలోకి మారతారు. ఇది సహజమైన పరిణామం. చనిపోయిన తరువాత పాంచభౌతిక శరీరం, భౌతిక శరీరం చనిపోతాయి. పాంచభౌతిక శరీరం ప్రేత శరీరం కన్న, ఆత్మ శరీరం కన్న బరువుగా ఉంటుంది. మీ పాంచభౌతిక శరీరాన్ని, భౌతిక మనస్సును వదిలెయ్యగానే మీరు ప్రేతసత్తగా మారతారు. భూలోకంలో చనిపోయినపుడు మానవ శరీరం ఏ రూపంలో ఉందో ప్రేతసత్త ఆ రూపంలోనే ఉంటుంది. ప్రేత శరీరం మానవ శరీరంలానే ఉంటుంది కాని దానికన్న బరువు తక్కువగా ఉంటుంది. ప్రేతసత్త నుంచి ఆత్మ, ఉపచేతనాత్మక మనస్సు, ఆత్మసత్తగా మారతాయి. పాంచభౌతిక శరీరం కన్న, ప్రేత శరీరం కన్న ఆత్మ శరీరం బరువు చాలా తక్కువ. పక్షి ఈక కన్న తేలికగా ఉంటుంది. ఉన్నత ఆధ్యాత్మిక స్థాయిలోని ఆత్మసత్తకు భూలోకంలో కన్న వయసు చాలా తక్కువగా ఉంటుంది. వారి రూపం కూడా ఆత్మ పరిణతిని ప్రతిబింబిస్తుంది. ఆత్మ ఎంత ప్రగతిని సాధిస్తే, ఆత్మరూపం

అంత కాంతిమంతంగా వయస్సు అంత తక్కువగా కనిపిస్తుంది.

స్వర్గం నరకం ఉంటాయా?

మేము మాట్లాడేటప్పుడు 'స్వర్గం', 'నరకం' అనే పదాలను వాడాము, దయచేసి దీని వెనుక ఉన్న వాస్తవాన్ని అర్థం చేసుకోండి. ఆత్మలోకంలో దేవుడు ఒక నియమం పెట్టాడు. వ్యతిరేక ఆత్మ, సదాత్మ ఒకే చోట ఉండకూడదు అని. అందువలన మానవులు తమ సంకల్ప స్వేచ్ఛను ఉపయోగించి వెలుగు నుంచి దూరంగా వెళ్ళినప్పుడు, వారి సామూహిక స్పందన వల్ల ఒక వ్యతిరేక ప్రదేశం పుట్టింది. మరో రకంగా చెప్పాలంటే, ఏడు ఆవరణలను కూడా వాటిలో ఉండే ఆత్మలే తయారు చేసుకున్నాయి. ఏడు ఆవరణలు మాత్రమే ఉన్నాయి. స్వర్గం, నరకం అనేవి ఆత్మ ఆలోచనలు, మాటలు, పనుల ప్రతిబింబాలు – అంతకన్న ఎక్కువ, అంతకన్న తక్కువ కావు. మీరు సన్మార్గంలో నడుస్తుంటే, భయపడాల్సిన పని లేదు. **నిజం చెప్పడం భయపెట్టడానికి కాదు; మిమ్మల్ని జాగృతం చేయడానికి.** ఏడు ఆవరణలున్నట్లుగానే, ఏడు విశ్వాలున్నాయి. మీరు ఆధ్యాత్మిక ప్రయాణం మొదలు పెట్టినప్పుడు మొదటి విశ్వంలో మొదలుపెట్టి, ఏడో విశ్వాన్ని చేరాలనే ధ్యేయాన్ని కలిగి ఉంటారు. ప్రతి విశ్వానికీ భిన్నమైన పరిమితులుంటాయి. భూమికి మూడు పరిమితులున్నాయి. మూడో విశ్వం ఇది.

భూలోకంలో సదాత్మలు, చెడు ఆత్మలు కలిసి ఉండేలా దేవుడెందుకు అనుమతించాడు?

సదాత్ముల ధ్యేయం ఆధ్యాత్మికంగా ఏది సరైనదో దానిని చేస్తూ వ్యతిరేకతను ఎదుర్కొనడం. వ్యతిరేకత లేకపోతే, ఆధ్యాత్మికంగా మిమ్మల్ని పరీక్షించడం ఎలా? వ్యతిరేక ఆత్మలను మార్చి, దైవిక సన్మార్గాన్ని అనుసరించేలా సాయం చేసే అవకాశాన్ని సదాత్మలకు ఇవ్వడం జరిగింది. వ్యతిరేక ఆత్మలు గనుక ఒక దయాపూరిత చర్యనో, నిస్వార్థంగా చేసే మంచి పనినో చూస్తే, సన్మార్గంలో నడవాలనే ప్రేరణ లభించవచ్చు.

ఈ ఆత్మలు బాగుపడే ఆశ ఏమైనా ఉందా?

ఉంది. బాగుపడాలని నిజాయితీగా కోరుకున్నప్పుడు మాత్రమే. కింది ఆవరణల నుంచి హృదయపూర్వకంగా సాయం చెయ్యమని కోరితే, ఆ పిలుపును విని ఆత్మలోకంలోని ఆత్మలు సాయం చేస్తాయి. మారడానికి కింది స్థాయిలోని ఆత్మ వెయ్యవలసిన మొదటి అడుగు అది – బాగుపడాలనే ఉద్దేశ్యము, కోరిక రెండూ హృదయపూర్వకంగా ఉండాలి. అందువల్ల ఆత్మలోకంలోని కింది ఆవరణలలో ఉంటే విచారించవద్దు. శాశ్వతంగా

మీరు అక్కడే ఉండిపోరు. శాశ్వతంగా దూషించబడేదేదీ లేదు. ఎదగడానికి, మంచిని ఎంచుకోవడానికి, ఆధ్యాత్మికంగా ఎదగడానికి ఎప్పుడూ అవకాశం ఉంటుంది.

భూలోకంలో ఆత్మలోకాన్ని ఎందుకు గుర్తుచేసుకోము?

ఆత్మలోకంలోని ఆత్మలు ఎంత తేలికగా ఉంటాయో మానవులు గనుక ఒక్క సెకను పాటు అనుభవించగలిగితే మీ భౌతిక శరీరాలలో ఒక్క క్షణం కూడా ఉండరు. ఆత్మలోకంలో మీ అస్తిత్వ వివరాలను ప్రతిదానిని మీరు గుర్తుంచుకోగలిగితే, భూలోకంలో ఒక్క సెకను కూడా బతకాలని అనుకోరు. అందువల్లే ఆత్మలోక జ్ఞాపకాలు మీకు గుర్తుండవు. కంటికి కనిపించే రుజువు లేకపోయినా మరణానంతర జీవితం ఉందని, ఇంకా దేవుడిని నమ్ముతున్నారని నిర్ధారించే పరీక్ష మీకు ఇది. ఆత్మలోకం సత్య ప్రదేశం. భూలోకం పరీక్షా ప్రదేశం.

ఒకవేళ ఆత్మలోకమే మన నిజ నివాసమైతే, మనం చనిపోయి నప్పుడు దానిని గుర్తించమెందుకని?

మరణించిన తర్వాత శరీరం చనిపోతుంది. అయితే, భూలోకంలో మనిషి సంపాదించిన జ్ఞానం, జ్ఞాపకాలు, అనుభవాలు చనిపోవు. మీ ఆత్మ వీటిని ఉంచుకుంటుంది. ఇంకా మీ గుణాలు లేక **ఆత్మలక్షణాలు** మీతోనే ఉంటాయి. మీ ఆత్మతో సంబంధం కలిగి ఉన్న ఉపచేతనాత్మక మనస్సు ఒక్కొక్కటిగా, నిదానంగా ఆత్మలోక జ్ఞాపకాన్ని, సమాచారాన్ని బయటపెడుతుంది. కాని స్వభావతః మీరు పెంకి వారైతే, భూలోకంతో బాగా విడదీయరాని అనుబంధముంటే, ఉపచేతనాత్మక మనస్సు ఏం చెబుతుందో అర్థం చేసుకొనడం కష్టం. మీరు ఆధ్యాత్మికంగా ఎదిగితే, మీ ఉపచేతనాత్మక మనస్సు బాగా తెరుచుకుంటుంది. అప్పుడు ఆత్మలోకాన్ని మీ నిజ నివాసంగా సులభంగా గుర్తిస్తారు.

ఆత్మలక్షణాలు ఎలా అలవడతాయి?

ఎన్నో జన్మలలో మీ ఆత్మకు మీరిచ్చిన శిక్షణను ఆధారం చేసుకొని మీరు సంపాదించిన గుణాలు ఆత్మలక్షణాలు. మీ ఆత్మకు సకారాత్మక, వ్యతిరేక కోణాలు రెండూ ఉంటాయి. ఉదాహరణకు మీరు నిస్వార్థంగా, సకారాత్మకంగా, ధైర్యంగా ఉండడం మీ ఆత్మకున్న సకారాత్మక కోణాలు. వ్యతిరేక కోణాలు భౌతిక మనస్సు నుంచి పుట్టినా అవి మీతో చాలాకాలంగా ఉండడంతో అవి కూడా మీ ఆత్మలో భాగాలే. అందువల్ల మీరు గర్వంగా, మొండిగా, అధిక విశ్లేషణాపరులుగా ఉండవచ్చు. భూలోకంలో మీకున్న వ్యతిరేక గుణాలు అంతబలంగా లేకున్నా ఆత్మలోకంలో కూడా ఉంటాయి. మీరు

పరిపూర్ణులు కారని గుర్తుంచుకోండి. ఆత్మలోకంలో నివసించే ఆత్మగా ఉన్నా సరే ఏవో లోపాలు ఉంటాయి. ఆత్మలోకంలో కూడా నిరంతరం ఎదుగుతూ ఉంటారు. ఏది ఏమైనా, మీరు గనుక ఉన్నత ఆవరణలో ఉంటే, అంటే భూలోకంలోనే ఈ లక్షణాలను మార్చుకొనే ప్రయత్నం చేసి ఉంటే, రేఖామాత్రంగా ఉన్న వ్యతిరేకతను సులభంగా పోగొట్టుకొనవచ్చు. ఉన్నత ఆవరణలలో ఉన్న ఆత్మలోక ఆత్మలు ఉన్నత ప్రకృతికి సంబంధించిన విషయాలను నేర్చుకుంటాయి.

ఒక వ్యక్తి చనిపోయి, అన్నిటికన్న కింది ఆవరణకు వెళుతున్నానని తెలుసుకుంటే, అప్పుడు అతడు / ఆమె ఎందుకు వెళతారు?

సదాత్మ తానే ఆవరణకు వెళ్ళాలో వెళ్ళిపోతుంది. సదాత్మలకు అక్కడ తమకోసం శాంతి నిరీక్షిస్తుందని తెలుసు. కిందిస్థాయిలో ఉన్న ఆత్మ, కింది ఆవరణకు వెళ్ళకూడదని నిర్ణయించుకోవచ్చు. ఈ ఆత్మ ప్రేతరూపంలో ఉండిపోవచ్చు - కింది ఆవరణల నుంచి తప్పించుకొనడానికి. దెయ్యం అని పిలుస్తారు చూడండి అలా ఉండిపోవచ్చు. సంకల్ప స్వేచ్ఛా నియమం ప్రేత లోకంలో కూడా ఉంది. ఇంక దానిలో "న్యాయం ఏది?" అని మీరడగవచ్చు. ఈ వ్యతిరేక ఆత్మలు ఎన్నడూ ఆధ్యాత్మికంగా ఎదగలేవు. కర్మను చెల్లించలేవు. సత్యాన్ని అర్థం చేసుకోవాలి. అప్పుడే అది సాధ్యం. దయచేసి అర్థం చేసుకోండి. కొంతకాలానికి తాము చేసిన కర్మల ఫలితాన్ని అనుభవించి వారు ఆత్మలోకానికి వెళతారు. ఇంక వారెంత ఎక్కువకాలం ప్రేతరూపంలో ఉంటారో, అంత ఎక్కువ వ్యతిరేక కర్మను పోగు చేస్తున్నారు. అందువల్ల ఎప్పుడూ న్యాయం జరుగుతుంది.

మనం చనిపోయినప్పుడు మన ఆత్మీయులు మనను తీసుకెళ్ళడానికి వస్తారా?

అనారోగ్యం వచ్చి చనిపోతే, చనిపోయిన మీ స్నేహితులు, బంధువులు ఆత్మలోకంలోకి మీకు స్వాగతం పలకడానికి వస్తారు. మీకు ప్రాణగండం (చనిపోయేరోజు) ఎప్పుడో వారికి తెలుసు గనుక మీరు భూలోకాన్ని విడిచివెళతారని వారికి తెలుసు. అయితే, మీరు హఠాత్తుగా చనిపోతే - మా విషయంలో జరిగినట్లుగా - స్వాగతం పలకడానికి ఆత్మలు కొంచెం ఆలస్యంగా వస్తాయి. మీరు సదాత్ములైతే వారు ఆహ్వానించడానికి సిద్ధంగా ఉంటారు. కొన్ని సెకన్లపాటే మీరు ఒంటరిగా ఉంటారంతే. ఒకవేళ మీరు వ్యతిరేక ఆత్మలయితే సదాత్మ వచ్చి ఆహ్వానిస్తుందని అనుకోకండి. చివరికి చనిపోయిన మీ ఆత్మీయులు కూడ మిమ్మల్ని ఆహ్వానించడానికి రారు. కాని వ్యతిరేక ఆత్మలు వచ్చి మీరెక్కడికి వెళ్ళాలో అక్కడికి తీసుకెళతాయి.

మీరు ఆత్మలోకానికి చేరగానే విశ్రాంతి మందిరానికి తీసుకొని వెళ్ళారని చెప్పారు. ఈ ప్రదేశం గురించి మరికొన్ని విషయాలు చెప్పగలరా?

భూలోకంలో ఒక వ్యక్తి హఠాత్తుగా చనిపోతే, ఆ ఆత్మను విశ్రాంతి మందిరానికి తీసుకొని వెళతారు. ఈ ఆత్మలకు గాయాలు అవుతాయి కనుక వారికి ఉపశమనం కలిగించడానికి స్వస్థత కిరణాలను ప్రసరింపజేస్తారు. ఇవి సూర్యకిరణాలే. కాని ఆత్మలోకంలో మరింత స్వచ్ఛంగా ఉంటాయి. మేము చనిపోయాక అమ్మానాన్నల కోసం చాలా వేదన చెందాము. వారిని సంరక్షించడానికి ఎవరూ లేరు. వాళ్ళెలా బ్రతుకుతారని చింతించాము. అందువల్ల మా ఆందోళన తగ్గించడానికి మాకు స్వస్థత కిరణాల ప్రసారం అవసరమైంది.

అదేవిధంగా గాయపడిన లేదా ఆందోళన పడుతున్న ఆత్మలు ప్రశాంత పరిస్థితికి చేరుకోలేకపోతే, ఇంక భూలోకంలో తాము లేమనే విషయాన్ని అర్థం చేసుకోలేరు. వారిలాగే ఉంటే ఆత్మలోకానికి సంబంధించిన సమాచారాన్ని అర్థం చేసుకొనడం వారికి సాధ్యపడదు. కొత్త పరిసరాలను అంగీకరించడానికి, గుర్తించడానికి, పనిచేసుకోడానికి వారికి ఇష్టం ఉండదు. అందువల్ల విశ్రాంతిమందిరంలో మీ ఆత్మకు స్వస్థత చేకూర్చి పునఃశక్తిమంతం చేస్తారు. విశ్రాంతిమందిరం నుంచి బయటికి వచ్చేసరికి ఆత్మలకు పునరుత్తేజం, ఉదాత్తమైన ప్రశాంత భావన కలుగుతుంది. ప్రతి ఆవరణకు దాని విశ్రాంతిమందిరం ఉంటుంది. అయితే 1వ ఆవరణ నుంచి 4వ ఆవరణ 4వ దశ వరకూ విశ్రాంతిమందిరం ఉండదు. అందువల్ల 4వ ఆవరణ 5వ దశ నుంచి, ఆ పై స్థాయిలకు వచ్చేవారినే విశ్రాంతి మందిరానికి తీసుకొని వెళతారు. అవసరమైన దానికన్న ఎక్కువసేపు విశ్రాంతి మందిరంలో ఉండలేరు.

ఆత్మలోకానికి అలవాటుపడిన తరువాత ఆత్మలకు ఏమవుతుంది?

ఆత్మలోకానికి అలవాటుపడిన తరువాత ఆత్మలు కొత్త పరిసరాలను గురించి తెలుసుకోవాలి. ఆత్మలోకానికి అప్పుడే వచ్చిన ఆత్మలకు చాలా ప్రశ్నలుంటాయి. ఈ ఆత్మలకు సహాయం చేయడానికి శిక్షణ పొందిన ప్రత్యేక ఆత్మలు కూడా కొన్ని ఉంటాయి. కాని **జ్ఞానమందిరానికి** వెళ్ళి కూడా ఈ ఆత్మలు సమాచారాన్ని పొందవచ్చు. దీనిలో దైవ నియమాలను గురించి, విశ్వ స్వభావాన్ని గురించి, దైవసృష్టిలోని ప్రతి చిన్న అంశం గురించిన జ్ఞానం లభిస్తుంది. అయితే ఆత్మకున్న అవగాహనాశక్తిని బట్టి సమాచారం తెలుస్తుంది. ఆత్మలోకంలోని ప్రతి ఒక్క సదాత్మకూ జ్ఞానమందిర ద్వారాలు తెరచి ఉంటాయి. 4వ ఆవరణ 4వ దశ నుంచి ప్రతి ఆవరణకూ విశ్రాంతిమందిరం ఉన్నట్లే, జ్ఞానమందిరం కూడా ఉంటుంది. అత్యంత జ్ఞానులైన ఆత్మసత్తలు ఈ మందిరాలకు వచ్చి దేవుడి ప్రేమను, విచక్షణను గురించి

ఆత్మలోకంలోని ఆత్మలకు చెప్పి స్ఫూర్తినిస్తారు. ఆత్మలోక సత్యాలను బాగా అర్థం చేసుకొనే శక్తి ఈ మందిరాలలో పుష్కలంగా ఉంటుంది. మీ ఉపచేతనాత్మక మనస్సును మరింతగా తెరవడం ఎలాగో, అంతకుముందున్న మీ నైపుణ్యాన్ని పెంచుకొనడమో, సమస్యా పరిష్కారాలకు సలహాలనో, మీ ఆధ్యాత్మిక ధ్యేయాన్ని ఎలా అనుసరించాలో మీరు నేర్చుకోవచ్చు. ఇక్కడ ఎన్నో చేయవచ్చు. నిజంగానే ఇది గొప్ప జ్ఞానమందిరం. ఎన్నో ఆత్మలు ఇక్కడకు వచ్చి తమ అనుభవాలను పంచుకుంటాయి. ఇతర గ్రహాలు, వాటి పరిమితులు (డైమన్షన్స్) గురించి సమాచారాన్ని చెబుతాయి. జ్ఞానమందిరం మొదటగా చేసే పని మీ లోపల ఆధ్యాత్మిక జాగృతిని కలిగిస్తుంది. జ్ఞానమందిరంలో జ్ఞానాన్ని పొందాక, భూలోక అభిప్రాయాలు ఎంత ఛాందసంగా ఉన్నాయో వారు అర్థం చేసుకుంటారు. జ్ఞానమందిరం పూర్తిగా ఆధ్యాత్మిక సత్యాలున్న గ్రంథాలయం వంటిది.

ఆత్మలోకంలో దేవదూతలు ఉంటారా?

ఉంటారు. సర్వశక్తిమంతుడైన భగవంతుని సందేశాలను తీసుకొని వచ్చి మార్గ దర్శకత్వం, సాయం చేసే సదాత్మలు దేవదూతలు. కొన్నిసార్లు వారు మానవ రూపంలో వస్తారు. మరికొన్నిసార్లు అదృశ్యంగా ఉంటారు. 5వ ఆవరణ 7వ దశ, ఆపైన దేవదూత లుంటారు. 7వ ఆవరణ 5వ దశ ఆపై నుంచి అత్యవసరమైనప్పుడు దేవదూతలు దైవిక అత్యున్నత సదాత్మ అనుమతితో ఏ రూపంలోనైనా భూలోకానికి రాగలరు. దేవదూతలకు మహిమలు చేసే శక్తి సామర్థ్యాలుంటాయి.. 5వ ఆవరణ, 6వ ఆవరణ లోని ఆత్మలు ఆత్మలోకం నుంచి మాత్రమే భూలోకంలోని ఆత్మలకు సాయం చెయ్యగలరు. అవి భూలోకానికి రాలేవు.

దేవదూతలకు రెక్కలుండవు. వస్త్రాలు ధరిస్తారు. వారు వేగంగా ఎగురుతున్నప్పుడు ఈ వస్త్రాలు రెక్కల్లా అనిపిస్తాయి. కొన్ని సమయాల్లో దేవదూతలు రెక్కలున్న వివిధ రూపాలు, ఆకారాలలో కనిపిస్తారు. ఎందుకంటే వారిని మీరలా భావిస్తారు కనుక. ప్రతీకాత్మకంగా దేవదూతలను సూచించడానికి రెక్కలు ఉపయోగిస్తారు. దేవదూతలు తమను కాపాడుతుంటారని తెలిసేలా ఇవి చేస్తాయి. భూలోకంలో ఉండే కొన్ని ఆత్మలు దేవదూతలను చూశారు. ప్రతి ఆత్మకూ వ్యక్తి అవసరాలను బట్టి వస్త్రాన్ని ఇస్తారు. ఈ వస్త్రాలకు శక్తిని గ్రహించేశక్తి అత్యధికంగా ఉంటుంది. ఉన్నత ఆవరణలలో ఉండే ఆత్మలు ధరించే వస్త్రాలకు ఎక్కువ శక్తిని గ్రహించి, నిలుపుకొనే శక్తి ఉంటుంది. కిందిస్థాయులలోని వారు ధరించే వస్త్రాలకు ఈ శక్తి ఉండదు. ఎంత పైకి వెళితే, అంత మెరుగైన స్పందనలు, అంత కాంతిమంతమైన వస్త్రాలు ఉంటాయి. అదేవిధంగా వస్త్రాలు శక్తిని ఎక్కువగా గ్రహించి, ఎక్కువ సానుకూల

శక్తిని నిల్వచేసుకుంటాయి. ఇంతేకాకుండా ఆత్మలోక సదాత్మలు కింది ఆవరణలకు వెళ్ళినప్పుడు, భిన్నమైన వస్త్రాలు అవసరమవుతాయి. ఈ వస్త్రాలు శక్తిని గ్రహించవు, పరావర్తనం చేస్తాయి. వీటిని భిన్నమైన పదార్థంతో తయారుచేస్తారు. ఆత్మ ఎంత కింది ఆవరణను సందర్శించాలను కుంటే, వస్త్రానికి అంత ఎక్కువ పరావర్తన శక్తి ఉండాలి. వ్యతిరేక శక్తిని పరావర్తనం చేస్తూ సదాత్మల స్పందనలు మారకుండా ఈ వస్త్రాలు చూస్తాయి. ఈ వస్త్రాలు భిన్నమైన రంగుల్లో ఉంటాయి. ఈ రంగులలో కొన్ని రంగులు భూలోకంలో ఉండవు.

❀ దేవదూతలు, ఆత్మమార్గదర్శులు భిన్నమైనవారా?

అవును. వాళ్ళిద్దరూ వేర్వేరు. భూలోకంలో ఉండే ప్రతి ఆత్మకూ ఆత్మలోకంలో ఒక సంరక్షకుడుంటారు. భూలోకంలోని ఆత్మను ఆత్మలోకంలోని సంరక్షక ఆత్మ కాపాడుతూ ఉంటుంది. ఈ సంరక్షకుడిని **ఆత్మమార్గదర్శి** అంటారు. మీకు సన్మార్గానికి దారిచూపడం అతడి / ఆమె బాధ్యత. భూలోకంలో మీరు పుట్టగానే ఆత్మలోకంలో ఉండే ఒక ఆత్మకు జననం నుంచి మరణం దాకా మీకు ఆత్మ మార్గదర్శిగా ఉండే బాధ్యతను అప్పగిస్తారు. ఆ ఆవరణలోని ఉన్నత సదాత్మ ఈ పని చేస్తారు. మీ ఆత్మ మార్గదర్శి ఎవరో మీకు ఎన్నటికీ తెలియదు. మీ ఆత్మమార్గదర్శి మీతో జీవితమంతా ఉంటారు. అయితే, మీరు తప్పుదారి పట్టినప్పుడు మీ ఆత్మమార్గదర్శికి సాధ్యం కాదు. ఎందుకంటే ఇవన్నీ ఉపచేతనాత్మక మనస్సు ద్వారానే మనుషులకు లభిస్తాయి. ఇదే ఆత్మలోకంతో మీకుండే ప్రధాన లింకు. మీ ఉపచేతనాత్మక మనస్సు మూసుకొనిపోయినప్పుడు, ఆత్మ మార్గదర్శి మిమ్మల్ని ప్రభావితం చేయడానికి మీ భౌతిక మనస్సు ద్వారా చాలా కష్టపడాల్సి ఉంటుంది. ఇది ఒక భౌతిక సంకేతం ద్వారా కాని భూలోకంలో ఉన్న వ్యక్తి ఒకరు మీకు సరైన మార్గం చూపడం ద్వారా కాని, మేల్కొలిపే పిలుపు ద్వారా కాని కావచ్చు.

మీరు అప్పటికీ మారకపోతే మీ ఆత్మమార్గదర్శి ఏమీ చేయలేరు అందువల్ల, వ్యతిరేక ప్రభావాల నుంచి ప్రతి మనిషికీ దేవుడు రెట్టింపు రక్షణనిచ్చాడు. మొదటిది శక్తిమంతమైన ఉపచేతనాత్మక మనస్సు. రెండవది మీ ఆత్మ మార్గదర్శి.

మిమ్మల్ని పర్యవేక్షిస్తూ, మార్గదర్శనం చేస్తూ, రక్షిస్తూ ఉండడం, భూలోకంలో మీ ధ్యేయం పూర్తికావడానికి మీ జీవితాంతం తోడ్పడడం ఆత్మమార్గదర్శి బాధ్యత. మీకు సలహా అవసరమైనప్పుడు, హృదయపూర్వకంగా దేవుని ప్రార్థించి సాయం కోరాలి. మీకు అవసరమైన మార్గదర్శకత్వం ఇవ్వడానికి ఆత్మ మార్గదర్శి చేయగలిగినదంతా చేస్తారు. వారు భూలోకంలోని ఆత్మలకు మార్గదర్శకంగా ఉండే ప్రత్యేక శిక్షణ పొంది ఉంటారు. ఆత్మలోకంలో వారి ప్రధానమైన పని ఇది. ఈ

ప్రక్రియలో భాగంగా వారూ నేర్చుకుని పరిణతిని సాధిస్తూ ఉంటారు. చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో ఇతర వివేక వంతులైన ఆత్మలను సంప్రదించి సలహా తీసుకుంటారు. చాలామంది భూలోకంలో ఒంటరిగా ఉన్నామనుకుని బాధపడుతూ ఉంటారు. అందుకని ఈ సమాచారాన్ని మీకిస్తున్నాము. సలహా కోసం ఎవరిని అడగాలో తెలియడం లేదని వారు బాధపడతారు. కాని ఉపచేతనాత్మక మనస్సును పెంపొందించుకుంటే దేవుడిని ప్రార్థించి, ఆత్మమార్గదర్శిని సాయం కోరవచ్చు. ఈ మార్గదర్శకత్వం మీకెలా లభిస్తుందో చూసి ఆశ్చర్యపోతారు, మరీ ముఖ్యంగా, మీ సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనగలిగే శక్తి మీకు లభిస్తుంది.

భూలోకంలోని ఆత్మకు ఆత్మలోకంలోని కవలఆత్మ ఆత్మ మార్గదర్శిగా ఉండగలదా?

ఉండగలదు. కాని చాలా అరుదైన కేసులలో మాత్రమే.

కవలఆత్మ అంటే ఏమిటి? ఇది సమూహాత్మలాంటిదేనా?

ఈ విశ్వం (మూడో విశ్వం)లోని ప్రతి ఆత్మ నిజానికి ఒక ఆత్మలో సగం మాత్రమే. ఒక ఆత్మ 4వ ఆవరణ 5వ దశలో తన ప్రయాణం మొదలుపెట్టగానే ఇది రెండుగా విడిపోతుంది: ఒక పురుష ఆత్మ, ఒక స్త్రీ ఆత్మ. అసలైన ఈ ఆడ, మగ ఆత్మలు 7వ ఆవరణ, 9వ దశలో మళ్ళీ కలుసుకొని సంపూర్ణ ఆత్మగా రూపొందుతాయి. ఈ ఆత్మలను **కవలఆత్మలు** అంటారు. ఇది ఎన్నో జీవితకాలాల తరువాత, రెండు ఆత్మలూ విడిగా భూలోకంలో తమ శిక్షణను పూర్తి చేసిన తరువాత, కొన్నిసార్లు మగవారిగా, మరికొన్నిసార్లు ఆడవారిగా పుట్టి తమ కర్మను చెల్లించిన తరువాత జరుగుతుంది. అప్పుడే రెండు ఆత్మలు 7వ ఆవరణ 9వ దశలో మళ్ళీ కలిసి సంపూర్ణ ఆత్మగా మారగలవు. 7వ ఆవరణ 9వ దశకు చేరిన తరువాత, కలిసి పోవడానికి కొంచెం ముందుగా, మీరు ముందున్న విధంగా పురుష ఆత్మగానో, స్త్రీ ఆత్మగానో మారతారు. ఆ పిమ్మట తరువాతి విశ్వానికి వెళతారు.

భూలోకంలో మీరు అనుకొనే సన్నిహితాత్మకూ కవలఆత్మకూ చాలా తేడా ఉంది. **సన్నిహితాత్మ (సోల్ మేట్)** అంటే మీకు సన్నిహితంగా ఉండే ఆత్మ అనే అర్థంలో మీరు వాడతారు. ఆ వ్యక్తి మీ కవలఆత్మ అయి ఉండనవసరం లేదు; అతడు లేదా ఆమె **సమూహాత్మ** కావచ్చు. వారితో మీకు గతజన్మల అనుబంధం ఉండవచ్చు. దేవుడు ఒకే సమయంలో నిర్దిష్ట సంఖ్యలో కొన్ని ఆత్మలను సృష్టించాడు. ఈ ఆత్మలు భూలోకంలో కలిసికట్టుగా ఒకే సమూహంలో ఒక జన్మ తర్వాత మరోజన్మలో పుడుతుంటాయి. ఒకరిపట్ల ఒకరికిగల ప్రేమ కారణంగా ఇలా పుడతాయి. కలిసి

ఉంటే ఒకరికొకరు సాయం చేసుకొంటూ ఆధ్యాత్మికంగా ఎదుగుతూ మరింత మెరుగ్గా జీవించవచ్చని భావిస్తారు. కొన్నిసార్లు, మనం ఎప్పుడూ కలుసుకోని వారిని కూడా ఒకసారి చూడగానే వారు ఆత్మీయులనిపిస్తారు. బహుశ వారు మీ సమూహాత్మ కావచ్చు. తల్లిదండ్రులు, పిల్లలు, ఇరుగు పొరుగు, స్నేహితులు మీ సమూహాత్మలు కావచ్చు. ఒక వ్యక్తికి ఒకే కవలఆత్మ ఉంటుంది. కాని చాలా సన్నిహితాత్మలు లేదా సమూహాత్మలు ఉండవచ్చు.

మీ కవలఆత్మను కలిసినప్పుడు అది చాలా ప్రత్యేక బంధం. ఒకవేళ రెండు ఆత్మలు మంచిస్థాయిలో ఉంటే వారు పరస్పరం భూలోకంలో సాయం చేసుకుంటూ ఆధ్యాత్మికంగా ఎదుగుతారు, వారి ఆత్మలు ఒకదానినొకటి గుర్తిస్తాయి కనుక నిజమైన నమ్మకం, స్నేహం వారి మధ్య ఏర్పడతాయి. ఇది భౌతికత్వానికి అతీతమైంది - రెండు ఆత్మల కలయిక. తామిద్దరూ ఒక్కరే అని గుర్తించడం. కొంతమంది విషయంలో రెండు ఆత్మలూ కనుక కిందిస్థాయిలో ఉంటే, వారి బాంధవ్యం అస్సలు బాగా ఉండకపోవచ్చు. కవలఆత్మలు భిన్నస్థాయులలో అభివృద్ధి చెందుతూ ఉండే అవకాశం ఉంది.

సాధారణంగా ఒక ఆత్మ భూలోకంలో జన్మిస్తే, రెండోది ఆత్మలోకంలోనే ఉండి భూలోక ఆత్మకు మార్గదర్శిగా ఉంటుంది. ఒక వ్యక్తి మీ కవలఆత్మ అని తెలుసుకొనే ఒకే ఒక మార్గం అప్రయత్న లేఖనం. చాలా అరుదైన సందర్భాలలో అవసరమైనప్పుడు మాత్రమే ఇలా తెలియజేయడం జరుగుతుంది. ఉదాహరణకు, ఆ కవలఆత్మ మీకు తెలిసి ఉండి, ఆ కవలఆత్మ ఆధ్యాత్మికంగా దిగజారిపోతూ ఉంటే, ఆ ఆత్మకు నేర్పుగా సాయం చేయమని మీకు చెప్పడం జరుగుతుంది.

ప్రతి ఆత్మను దేవుడు రెండుగా చేయడానికి కారణం రెండూ కలిసి బ్రతకడం నేర్చుకోవాలని. మీరే పరస్పర ప్రగతికి బాధ్యులు. కలిసి ఉండే కవలఆత్మలు ఎంతో సాధించగలవు. ఒకవేళ వాటిలో ఒక ఆత్మ తప్పు చేస్తే, ఆధ్యాత్మికంగా రెండూ నష్టపోతాయి. ఎందుకంటే 7వ ఆవరణ 9వ దశకు చేరిన తరువాత మీరు కవల ఆత్మతో కలిసిపోయి సంపూర్ణ ఆత్మ కావలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే మీరు తరువాతి విశ్వాన్ని (నాలుగో విశ్వాన్ని) చేరగలరు. ఒకవేళ మీరు 7వ ఆవరణలో 9వ దశలో ఉన్నా, మీ కవలఆత్మ ఆధ్యాత్మికంగా కిందిస్థాయిలో ఉంటే, మీ కవలఆత్మ కోసం మీరు నిరీక్షించవలసి ఉంటుంది. 7వ ఆవరణ 9వ దశకు చేరడానికి దానికి ఎన్ని జీవిత కాలాలు పట్టినా దానికోసం మీరు నిరీక్షించాల్సిందే. ఇది కటువుగా, అన్యాయంగా అనిపించవచ్చు. వాస్తవానికి ఇది మీ ఆధ్యాత్మిక పురోగతిని రక్షించడానికే. ఏది ఏమైనా, మీకోసం ప్రార్థించే వారు, మీరు ఆధ్యాత్మికంగా

ఎదగడానికి సాధ్యమైనంతగా ప్రయత్నించే వారు, ఒకరుంటారు. ఇది మీకు **బాధ్యతను, సహజీవనాన్ని, నిస్వార్థాన్ని బోధిస్తుంది.**

ఆత్మలోకంలో కూడా మీ ఇద్దరినీ విస్పి, రతూ అనే పిలుస్తారా? మీకు వేరే ఆత్మనామాలుంటాయా?

ప్రతి ఆత్మ రెండుగా విడిపోయే ముందుగా దానికొక ప్రత్యేకమైన పేరు పెట్టడం జరుగుతుంది. ఇది **ఆత్మనామం.** కవలఆత్మలు తమ ఆత్మనామాన్ని పంచుకుంటాయి- ఆత్మ రెండుగా విడివడినట్టే, పేరు కూడా, మీరున్నంతకాలం ఇది ఒకే విధంగా ఉంటుంది. భూలోకంలో చివరి జన్మలో ఏ పేరుతో ఉన్నారో ఆత్మలోకంలో కూడా మీ పేరు అదే ఉంటుంది. ఆకాశిక్ రికార్డులలో మీ ఆత్మనామం కింద మీరు చేసిన పనులు రికార్డు చేయబడతాయి. భూలోకంలో మీ ఆత్మనామం భూలోకంలో ఉన్నపుడు మీకు తెలియదు; మళ్ళీ ఆత్మలోకానికి తిరిగి వెళ్ళినప్పుడే మీకు ఆత్మనామం తెలుస్తుంది.

ఆకాశిక్ రికార్డులంటే ఏమిటి?

ఆకాశిక్ రికార్డులనే స్మృతులమందిరం అనీ, సమాచారమందిరం అనీ అంటారు. ప్రతి ఆవరణకూ ప్రత్యేక మందిరం ఉంటుంది. ప్రతి ఆత్మ భూలోకంలో ఎత్తిన జన్మల వివరాలు ఒక పుస్తకంలో ఉంటాయి. మీ ఆత్మనామం కింద మీరు చేసిన మంచి, చెడ్డ పనుల వివరాలు ఉంటాయి. ఆత్మ ఉన్న ఆవరణలో ఈ రికార్డులు ఉంటాయి. ఆత్మ పురోగతిని సాధించినప్పుడు గాని, కిందికి పడిపోయినపుడుగాని, ఉన్నత, నిమ్న ఆవరణలకు వెళ్ళినప్పుడుగాని రికార్డులు దానితో పాటు వెళతాయి. భూలోకంలో మీ జన్మల స్మృతులన్నీ ఆకాశిక్ రికార్డులలో ఉంటాయి. భూలోకంలో ఆత్మలు గాఢమైన, స్వప్నరహితమైన నిద్రలో ఉన్నప్పుడు వారి ఉపచేతనాత్మక మనస్సులు ఆకాశిక్ రికార్డులలో ఆరోపాలు రాస్తాయి. భూలోకంలో ఉండే ఆత్మలోని ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణమైపోతే, ఆ వ్యక్తి యొక్క ఆత్మ మార్గదర్శి ఆకాశిక్ రికార్డులలో తాజా సమాచారం చేరుస్తారు. ఎవరూ ఇంకొకరి రికార్డులను చూడలేరు. ఆ ఆవరణలోని ఉన్నత సదాత్మ అనుమతితో ప్రత్యేక సందర్భాలలో ఆత్మ పురోగతికి సాయం చేయడానికి ఇలాచేయవచ్చు. ఆత్మ మరో విశ్వానికి వెళ్ళినపుడు కూడా రికార్డులు వారి వెంట వెళతాయి.

ఆత్మలోకంలోని ఆత్మలు ఏం పని చేస్తాయి?

ఆత్మలోకంలోని ఆత్మలకు అవసరాలు, కోరికలు ఉండవని ముందుగా చెప్పాలి. మాకు ఆకలి, దాహం, అలసట ఉండవు. మా ఆత్మ లక్ష్యం సేవ. అయితే మాకూ

భూలోకంలోని వారికిలానే పోషణ కావాలి. ఆత్మకు సూర్యకాంతి శక్తిమంతమైన బలవర్ధకం. ఇక్కడ చాలాపళ్ళు, రకరకాల వాసనలతో లభిస్తాయి. ఆత్మలు బ్రతకడానికి ఆహారం అవసరం లేదు. కాని ఈ పండ్ల నుంచి వచ్చే అమృతరసం ద్వారా సానుకూల శక్తి లభిస్తుంది. మేము నిరంతరం ఆరోగ్యంగా ఉంటాం. మేము సంపూర్ణ ఆధ్యాత్మిక ఆరోగ్యంతో ఉంటాం. ప్రార్థన, నీటితో మా ఆత్మ శరీరాలను పవిత్రం చేసుకొని ఇలాగే ఉంటాం. నీటికి స్వచ్ఛతనిచ్చే గుణం ఉంది. మాకు పునః శక్తి కావలసినపుడు సరస్సులో మునిగి పైకి వస్తాం. నీటికి మా స్పందనలను పూర్తిగా శుభ్రం చేసే శక్తి ఉంటుంది. కనుక పునరుత్తేజం, మరింతగా సానుకూల శక్తి లభిస్తాయి. నీటి నుంచి బైటకు రాగానే పూర్తిగా పొడిగా, శక్తిమంతంగా ఉంటాం.

మా పని విషయానికి వస్తే, మా ఆవరణకు చెందిన ఉన్నత సదాత్మతో మా నైపుణ్యాలను గురించి చెప్పి, దానికి సంబంధించిన పనిని ఎంపిక చేసుకుంటాం. ఆత్మలోక ఆత్మలు చేసే పనులు కొన్ని ఇక్కడిచ్చాం చూడండి:

1. భూలోకంలోని వారితో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచుకుంటాం. వారు దైవ నియమాలు అర్థం చేసుకొనడానికి సాయపడతాం.
2. అప్రయత్న లేఖనం వంటి ప్రక్రియల ద్వారా ఆత్మలతో సంభాషిస్తాం.
3. ఆత్మమార్గదర్శులుగా పనిచేస్తాం.
4. అప్పుడే ఆత్మలోకానికి వచ్చిన ఆత్మలతో కలిసి పని చేస్తూ, వారు గాయపడి ఉన్నా, అయోమయంలో ఉన్నా వారెక్కడ ఉన్నారో అర్థం చేసుకొనేలా సాయం చేస్తాం.
5. భూలోకంలోని ఆత్మలకు దారిచూపుతూ, వారి ఉపచేతనాత్మక మనస్సు ద్వారా ముఖ్యమైన సందేశాలను వారికి చేరవేస్తాం. ఉదాహరణకు ఆత్మ లోకంలోని ఒక ఆత్మ, ఒక శాస్త్రవేత్తకు అతడు కనుగొనాలనుకున్న వ్యాధి చికిత్సకు అతని ఉపచేతనాత్మక మనస్సు ద్వారా సమాధానాలు పంపి అతనికి సాయం చేయవచ్చు.
6. భూలోకం నుంచి హృదయపూర్వకంగా సాయం కోరిన వారికి సాయం చేస్తాం. ఆత్మలోక ఆత్మలకు ఈ విషయంలో ప్రత్యేక శిక్షణ ఉంటుంది. అప్పుడే ఆత్మలోకానికి వచ్చిన వారికి కూడా ఈ విషయంలో అనుభవమున్న వారు శిక్షణనిస్తారు.
7. విశ్రాంతిమందిరంలో పనిచేస్తారు. ఆకాశిక్ రికార్డులను నిర్వహిస్తారు.
8. ఆత్మహత్య చేసుకోవాలని భావించే మానవుల కోసం ప్రార్థిస్తారు. వారు సక్రమ

మార్గంలో నడిచేలా సాయం చేస్తారు.

9. భూలోకంలోని ఆత్మీయులను రక్షించే మార్గాలను కనుగొంటారు.

10. భూలోకంలోని ఆత్మీయుల కోసం ప్రార్థిస్తారు. ప్రార్థించడానికి మాలో ప్రేమ, శ్రద్ధ, ఏకాగ్రత, ప్రయత్నమూ ఉండాలి.

11. కింది ఆవరణలలోని వ్యతిరేక ఆత్మలతో వ్యవహరించే తీరులో శిక్షణ పొందుతారు.

12. జ్ఞానమందిరం ద్వారా వివేకాన్ని పొందుతారు. విస్తృతమైన ఉపచేతనాత్మక మనస్సు ద్వారా, ఆత్మలోకంలోని ఆత్మలు ఎంతో సమాచారాన్ని పొంది దానిని క్రియాశీలంగా ఉపయోగిస్తారు.

13. మళ్ళీ జన్మించాలనుకునే వారికి మార్గదర్శకంగా ఉంటారు.

14. భూలోకంలో పథభ్రష్టులైన వారి కోసం మహిమలు చేస్తారు. ఈ చిన్న మహిమలు ఆత్మలు తమ నమ్మకాన్ని తిరిగి పొందేలా సాయపడతాయి.

15. చనిపోతున్న ఆత్మను సముదాయించడానికి భూలోకానికి వస్తారు. ప్రార్థన, సానుకూల ఆలోచనల ద్వారా ఆత్మలోకానికి వచ్చే విధానాన్ని వీలైనంత సౌకర్యంగా ఉండేలా చూస్తారు.

16. ఆత్మలోకంలోని పిల్లలను సంరక్షిస్తారు.

17. స్వస్థత చేకూర్చే నూతన మార్గాలను నేర్చుకుంటారు, కనుగొంటారు.

18. కళాసృష్టిలోను నృత్యం, ఒపేరా, సంగీతం, పాటలు, క్రీడలు, నిర్మాణ విజ్ఞాన సంబంధ అంశాలలో పాల్గొంటారు.

19. భూలోకంలోని జంతు ప్రపంచంతో కలసి పనిచేస్తారు. జంతువుల ఆత్మ లోకంలో సాయం చేస్తారు.

20. ఆత్మలోకంలోని ఉద్యానవనాలను పెంచడంలో సాయపడతారు.

21. భూలోక నిజచరిత్రను, ఇతర గ్రహాలచరిత్రను తెలుసుకుని చర్చిస్తారు.

ఆత్మలోక ఆత్మలు ఏ పని ఎంపిక చేసుకున్నా, మాకు ఒకటే లక్ష్యం : సేవ. భూలోకంలో తమ ఉద్యోగాలను పని అనుకుంటారు. కాని మేము చేసే పనిని నిజంగానే ప్రేమిస్తాము. సృష్టికర్తకు మేమివ్వగలిగేది ఇదేనని ఇది మాకు వచ్చిన అవకాశంగా భావిస్తాం. ఇది మాకు నిజమైన ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తుంది. అహం ఉండదు, పోటీ ఉండదు, అసూయ ఉండదు, వాదనలుండవు, విమర్శ ఉండదు. ఎవరూ ఎక్కువ, ఎవరూ తక్కువ

కాదు. మేము పరస్పరం గౌరవించుకుంటూ బృందంగా మానవాళి సంక్షేమానికి పనిచేస్తాం.

🙏 పునర్జన్మ ఎందుకు అవసరం? ఆత్మలోకంలోనే ఆధ్యాత్మికంగా ఎందుకు ఎదగలేం?

భూలోకానికి మళ్ళీ మళ్ళీ మీరు ఎందుకు వస్తారంటే మీ ఆత్మ పురోగతి కోసం వస్తారు. ఆధ్యాత్మికంగా పురోగతి సాధించడానికి ఒకే ఆత్మసత్త వందలు, వేలసార్లు భూలోకానికి వస్తుంది. ఈ ఆత్మ మగ / ఆడ రూపంలో దేనిలోనైనా ఉండవచ్చు. అది ఎంపిక చేసుకునే దానిని బట్టి, పురోగతికి దానికి ఏం కావాలో, దానికోసం, భిన్నదేశాల్లో, భిన్నమతాల్లో భూలోకంలో జన్మిస్తారు. పునర్జన్మ అంటే ఇదే – ఒకే ఆత్మసత్త భూలోకంలో ఒక జన్మ తరువాత మరోజన్మ నెత్తుతూ ఉండడం. భూలోకానికి మీరు రావడం ఇది మొదటిసారి కాదు: మీరు పునర్జన్మించిన ఎన్నో జన్మలలో ఇది ఒకటి.

చాలామంది విషయంలో ఆత్మలోకంలోని 5,6,7 ఆవరణలలో పురోగతి నిదానంగా ఉంటుంది. స్పందనలు మంచివి కనుక మంచి పని చేయడం కష్టం కాదు. భూలోకంలో చెడు ఎక్కువగా ఉంటుంది. అక్కడ సదాత్మ చిన్న మంచిపని చేసినా, త్వరగా పైకి వెళ్ళగలదు. ఇంకా భూలోకంలో వ్యతిరేక స్పందనల వలన, భౌతిక మనస్సుకున్న పరిమితుల వలన ఆత్మ తీసుకునే నిర్ణయం తప్పు కావచ్చు. దానివల్ల అతడికి పరీక్ష మరింత కష్టతరం కావచ్చు. భూలోకంలో భౌతిక మనస్సుకన్న ఉపచేతనాత్మక మనస్సును ఎక్కువగా ఉపయోగిస్తే ఆధ్యాత్మికంగా పురోగతి సాధిస్తారు. అయితే ఒక సదాత్మ భూలోకంలో పునర్జన్మించడానికి నిర్ణయం తీసుకుంటే ఒక ప్రమాదం కూడా పొంచి ఉంటుంది. ఆ వ్యక్తి ఒకోసారి ఆధ్యాత్మికంగా ఉన్న స్థితికన్న కిందికి పడిపోవచ్చు. అతడు ఆత్మలోకంలోనే ఉండిపోతే, పురోగతి నిదానంగా ఉన్నా, ఇంక ఎన్నడూ కిందికి పడిపోడు. ఇది ఎవరికి వారు తమ సంకల్ప స్వేచ్ఛను ఉపయోగించి నిర్ణయించుకోవాలి. ఆత్మలోకంలోనే ఉండి నిదానంగా పురోగతి సాధించాలా లేక భూలోకానికి వచ్చి ప్రమాదాన్ని ఎదుర్కొని త్వరితంగా పురోగ మించాలా అని ఆత్మ స్వయంగా నిర్ణయం తీసుకోవాలి. పునర్జన్మ చక్రం భూలోకంలో మీ ధ్యేయం పూర్తయినపుడు, కర్మను చెల్లించేసినపుడు, 7వ ఆవరణ 9వ దశకు చేరినపుడు మాత్రమే పూర్తవుతుంది. అప్పుడే మీరు నిజంగా భూలోక అనుభవాన్ని అధిగమించుతారు – అంటే భూలోకంలో ఆత్మసత్తలా ఆలోచించి, జీవించ గలిగినపుడు. మేము పరిపూర్ణత గురించి చెప్పడం లేదు. ఏ మనిషీ పరిపూర్ణుడు కాడు. మీరు చెయ్యగలిగినంత చెయ్యాలని, తరువాతి విశ్వానికి సిద్ధంగా ఉండేలా మీ ఆత్మకు శిక్షణ నివ్వాలని చెబుతున్నాం. భూలోకంలో ఇది

మీకు పూర్తిగా అర్థం కాదు; మీరు ఆత్మలోకానికి వెళ్ళినప్పుడే మీ స్థితి ఏమిటో మీకు తెలుస్తుంది.

భూలోకంలో మళ్ళీ జన్మించాలంటే, ఆత్మలన్నీ పునర్జన్మ ప్రక్రియ అనే నిర్దిష్ట విధానాన్ని అనుసరించాలి.

1. పునర్జన్మ కోసం మీ ఆవరణలోని ఉన్నత సదాత్మకు దరఖాస్తు చేయాలి.

2. పునర్జన్మ ఎందుకోసం కావాలనుకుంటున్నారో కారణాలు చెప్పాలి. ప్రధాన కారణం కర్మను చెల్లించడం, ధ్యేయాన్ని పూర్తి చేసుకోవడం, ఆధ్యాత్మికంగా ఎదగడం. ఆత్మకు గనుక చెల్లించవలసిన కర్మ చాలా ఉంటే, ఆత్మలోకంలో దానిని చెల్లించడం సాధ్యం కాదు. అందువల్ల మళ్ళీ భూలోకంలో జన్మించాల్సిందే. కొన్నిసార్లు చెల్లించవలసిన కర్మ అంతగా లేకపోయినా, భూలోకంలోని ఆత్మీయులెవరైనా తప్పుదారిలో వెళుతుంటే ఆత్మ మళ్ళీ జన్మించి వారికి సాయం చెయ్యాలనుకుంటుంది.

3. మీరొక తల్లిని ఎంపిక చేసుకోవాలి. ఆధ్యాత్మికంగా మంచిస్థాయిలో లేని ఆత్మ లేక ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయిలో ఉన్న తల్లిని ఎంపిక చేసుకుని ఆత్మను మెరుగుపరచుకోవాలని భావించవచ్చు. కొన్నిసార్లు ఒక సదాత్మ వ్యతిరేక తల్లిని ఎంపిక చేసుకుని ఆమెను మెరుగుపరచాలని భావించవచ్చు; ఈ రకంగా ఆ ఆత్మ కర్మను చెల్లించవచ్చు. పరీక్షలు ఎదుర్కొని శిక్షణ పొందవచ్చు. చాలా కేసుల్లో, ఆత్మ ఆధ్యాత్మికంగా కిందికి పోతుంది కనుక ఇది చాలా ప్రమాదకరం. కొన్నిసార్లు తండ్రికి సన్నిహితంగా ఉండాలని, ఆత్మ తల్లిని ఎంపిక చేసుకుంది. అంటే ఆత్మ నిజానికి తండ్రిని ఎంపిక చేసుకుందని అర్థం.

4. మీకు ఎటువంటి శిక్షణ, పరీక్షలు కావాలో మీరు చెప్పాలి. ఉదాహరణకు మీ ధ్యేయానికి అవసరమైన అనుకూల లక్షణాలున్నవారిని, అనుభవాలను మీరు ఎంపిక చేసుకుంటే భూలోకానికి మీరు వెళ్ళిన పనికి నిజంగా సరిపోతుంది. అహాన్ని పరీక్షించుకోవడానికి వెళుతుంటే, మీ అహానికి దెబ్బకొట్టే పరీక్షలే ఎదురై మీకు వినయం నేర్పుతాయి.

5. మీరొక సదాత్మప్రవేశం కోరాలి. భూలోకంలో పరిస్థితి జటిలమైనప్పుడు, మీరు దానిని నియంత్రించుకోలేని స్థితిలో ఉంటే, మీరు సన్మార్గంలో ఉంటే ఆత్మలోకంలోని ఒక సదాత్మప్రవేశం జరుగుతుంది. ఆ సదాత్మ మీ శరీరంలో

ప్రవేశించి అవసరమైనంత కాలం మీలో ఉంటుంది. ఇది చాలా అరుదుగా, ఆ పరిస్థితి భూలోకంలోని ఆత్మ సామర్థ్యానికి మించినదైనప్పుడు జరుగుతుంది. అది మీకు పరీక్ష కాదు. శిక్షణ కాదు. మీ కర్మ కాదు. ఉపచేతనాత్మక మనస్సు భూలోకంలోని ఆత్మకు తెలియకుండానే సాయం చేయమని కోరుతుంది.

6. మీరు పుట్టేరోజుని, చనిపోయే రోజుని మీరే నిర్ణయించుకుంటారు. మీరు చనిపోయే రోజును ప్రాణగండము ఉన్న రోజు అని కూడా అంటారు.

1వ ఆవరణ నుంచి 7వ ఆవరణ వరకు అన్ని ఆత్మలకు పునర్జన్మ ప్రక్రియను అనుభవించే అవకాశం ఉంది. అయితే 1వ ఆవరణ లోని ఆత్మలకు కింది ఆవరణలలోనే ఉండే అవకాశం గాని, బరువులు మోసే జంతువులుగా భూలోకానికి వచ్చే అవకాశం గాని ఉంది. అప్పుడు వీరికి తాము గతజన్మలో చేసిన పాపాలు, 1వ ఆవరణలో తాము ఉన్న అనుభవం అన్నీ గుర్తుంటాయి. 1వ ఆవరణలో కొన్ని ఆత్మలు కర్మను త్వరగా చెల్లించుకోవడానికి దీనిని ఎంపిక చేసుకుంటాయి. 1వ ఆవరణ, గత జన్మలను గురించి జ్ఞాపకం ఉంటే తామెందుకు బరువులు మోసే జంతువుల్లా పుట్టారో వారికి తెలిసి, బాధలెందుకు పడుతున్నారో అర్థమవుతుంది. ఈ స్మృతివల్ల భూలోకంలో ఈ కష్టమైన జన్మలో పడే బాధను భరించే శక్తి వారికి లభిస్తుంది. వారి కర్మ పూర్తిగా తుడిచిపెట్టుకుని పోదు; వారి కర్మ అత్యంత తీవ్రమైనదైతే, ఈ ఆత్మలకు దానిని చెల్లించడానికి వందలాది జన్మలు కావాలి.

ఈ ప్రక్రియ అంతా సమస్యాత్మకంగా అనిపించవచ్చు. కాని వీటినన్నిటినీ మీరే స్వయంగా ఎంపిక చేసుకొనలేరు. మీ ఆవరణలోని ఉన్నత సదాత్మతోను, అదే ఆవరణలోని మరో ముగ్గురు వివేకం గలిగిన ఆత్మలతోను చర్చించి మీరేమి చేయాలనుకుంటున్నారో చెబుతారు. ఉదాహరణకు మీరు ఆధ్యాత్మికంగా త్వరితంగా ఎదగాలని తీవ్రంగా కోరుకుంటే, మీకు చాలా కష్టమైన మార్గాన్ని మీరు ఎంపిక చేసుకోవచ్చు, కాని ఆ మార్గం మీ శక్తికి మించినదై ఉండవచ్చు. ఉన్నత సదాత్మ, మిగిలిన మూడు ఆత్మలు ఇలా చేయవద్దని చెప్పి, మీకు ప్రత్యామ్నాయం సూచించవచ్చు. అయినాగాని, మీరు పునర్జన్మ కావాలనుకుని పట్టుబడితే, మీ సంకల్ప స్వేచ్ఛతో మీరు నిర్ణయించుకున్నారు గనుక మిమ్మల్ని ఆపరు. ఒకవేళ పునర్జన్మకు రిజిష్టరు చేసుకున్నా భూలోకంలో జన్మించ కూడదనే నిర్ణయం తీసుకోవచ్చు. ఉదాహరణకు ఒక తల్లిని ఎంపిక చేసుకున్నారు, ఆమె ఆధ్యాత్మికంగా తప్పుదారిలో ఉంది, మీకు ఆమె దగ్గరకు వెళ్ళాలనిపించలేదు, మీ రిజిస్ట్రేషను రద్దు చేసుకోవచ్చు. బహుశా ఆమె ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితిలో ఉందని అనుకొని మీరు ఎంపిక చేసుకుని ఉండవచ్చు. మీకు జ్ఞానాన్ని ప్రసాదించే వారు మీకు కావాలి. మీకు సన్మార్గాన్ని

చూపాలి అనుకున్నారు. కాని ఒకవేళ ఆమె చెడుమార్గంలో తప్పులు చేస్తుంటే, మీరు ఆమెకు జన్మించడంలో అర్థం లేదు.

భూలోకంలోని పిల్లలు ఆత్మలోకంతో ఎలా మాట్లాడతారు?

తల్లిగర్భంలో ఉన్న బిడ్డ ఆత్మలోకంతో మాట్లాడగలదు. ఆ సమయంలో పరిస్థితి తన ఆధ్యాత్మిక ఎదుగుదలకు అవరోధంగా కనిపిస్తే బిడ్డ ఆత్మలోకానికి తిరిగి వచ్చెయ్యవచ్చు. ఆ బిడ్డ శరీరంలోకి మరో ఆత్మ ప్రవేశించవచ్చు. బిడ్డకు తల్లి అసవరం లేదు గనుక ఆమెకు చనిపోయిన బిడ్డ పుట్టాలని లేదు. ఒకవేళ అది ఆమె కర్మ కాకపోతే, మరో ఆత్మ ఆ బిడ్డ శరీరంలోకి ప్రవేశిస్తుంది. గర్భంలోని బిడ్డకు ఉపచేతనాత్మక మనస్సు బాగా తెరచుకొని ఉంటుంది గనుక చాలా రిసెప్టివ్‌గా ఉంటాడు. ఆ బిడ్డ ఇంకా ఆత్మలోకంతో సంభాషిస్తూ, తల్లిండ్రుల చర్యలను గమనిస్తూ ఉంటాడు. సానుకూలంగా, సంతృప్తితో ఉండండి. ఎటువంటి వ్యతిరేకత బిడ్డ దారికి రానీయవద్దు. మీరు బాధపడితే బిడ్డ ఆ శక్తిని గ్రహిస్తాడు. తల్లి ఆలోచనలు, భావాల ప్రభావానికి బిడ్డ బాగా లోనవుతాడు. మీరు నిరంతరం వ్యతిరేకంగా, చెడు మార్గంలో ఉంటే, సదాత్మ అయిన ఆ బిడ్డ ఆత్మలోకానికి తిరిగి వచ్చెయ్యవచ్చు. ఆధ్యాత్మికంగా కింది స్థాయిలో ఉన్న మరొకరు ఆ బిడ్డ స్థానంలోకి రావచ్చు. ఏ ఆత్మ కూడా రాకపోతే, చనిపోయిన బిడ్డ పుట్టవచ్చు. బిడ్డ పుట్టిన తరువాత మాటలు వచ్చేవరకు ఆత్మలోకంతో సంభాషిస్తూ ఉంటుంది. ఆ తర్వాత ఆత్మలోక స్మృతులు రానీయకుండా భౌతిక మనస్సును ఉపచేతనాత్మక మనస్సు నియంత్రిస్తుంది.

మనం మాట్లాడడం మొదలు పెట్టగానే ఆత్మలోకంతో సంబంధాలన్నీ తెగిపోతాయా?

తెగిపోవు. మీరు గాఢంగా, కలలు లేని నిద్ర పోతున్నప్పుడు భూలోకానికి, ఆత్మలోకానికి మధ్య ఉండే ఒక ప్రదేశాన్ని సందర్శిస్తారు. మీ ఆత్మ శరీరం నుంచి లేచి ఆత్మలోక ఆత్మలను కలుసుకొనడానికి పైకి ప్రయాణిస్తుంది. మీరు నిద్రపోతున్నప్పుడు, ఆత్మలోకంలోని మీ ఆత్మీయులు ఉపచేతనాత్మక మనస్సు ద్వారా మీకు మార్గదర్శకత్వం ఇస్తారు. వారు నిరంతరం మీతో మాట్లాడుతూ ఉంటారు. మీ ఆత్మ వారిని కలవడానికి శరీరం నుంచి బైటకు వచ్చినప్పుడు అది మీ భౌతిక శరీరంతో వెండి రజ్జువు ద్వారా కలపబడి ఉంటుంది. ఈ వెండి రజ్జువు మీ శరీరాన్నీ ఆత్మను కలిపి ఉంచే కాంతి రేఖ. మీరు చనిపోయినప్పుడు ఈ సంబంధం తెగిపోతుంది. మీ ఆత్మీయులను కొన్ని నిముషాలపాటో, కొన్ని గంటల పాటో, మీరు కలవవచ్చు. ఇది మీ నిద్ర మీద ఆధారపడి ఉంటుంది. అది గాఢంగా, కలలు లేకుండా ఉండాలి. కలుసుకునే వారి మధ్య పరస్పరం

ప్రేమ ఉండాలి. ఒకవేపు నుంచే కాదు. ఆత్మలోకంలో మీ ప్రియతములెవరైనా ఉంటే వారిని మీరు క్రమం తప్పకుండా కలుస్తుంటారు. సందేహం లేదు. ఈ ప్రియతములు ఈ జీవితకాలంలో చనిపోయినవారు మాత్రమే కానవసరం లేదు; గత జన్మలలో మీకు సన్నిహితులు కావచ్చు ఇప్పుడు వారు మీకు ఆత్మలోకం నుంచి సాయపడే ప్రయత్నం చేస్తుండవచ్చు. వెండి రజ్జువు ఎన్నో కాంతి రేఖలను కలిగి ఉంటుంది. అవన్నీ కలిసి పొడవైన రేఖలా కనిపిస్తాయి. శరీరంలో తలపై భాగాన ఈ వెండిరజ్జువు అతికి ఉంటుంది. తలలోని ఈ మృదువైన భాగం గుండా ఆత్మ బైటికి, లోపలికి తిరుగుతూ ఉంటుంది. (పిల్లలలో తలపై మాడు మృదువుగా ఉంటుంది. అక్కడే ఈ వెండి రజ్జువు ఉంటుంది). నిద్రలో చాలాసార్లు ఒక్క ఉదుటున లేచి కూర్చుంటారు. గుండె దడదడ కొట్టుకుంటుంది. మీరెక్కడి నుంచో పడిపోతు న్నట్టుగా భావిస్తారు. అప్పుడే దిగినట్టుగా అనిపిస్తుంది. ఆత్మ తన భౌతిక శరీరంలోకి చేరుతున్నప్పుడు, సహజంగా ప్రయాణించి తన ప్రియతములను కలిసి వచ్చినప్పుడు ఇలా జరుగుతుంది. వెండిరజ్జువు తెగిపోతే, మీరు చనిపోతారు. ఆత్మలోకంలోని మీ దేవదూతలు ఎంతో మెరిసే తెల్లని కాంతితో వెండి రజ్జువును కాపాడుతూ ఉంటారు. ఇది రక్షక తేజోవలయాన్ని సృష్టించి, వ్యతిరేకత దరిచేరకుండా చూస్తుంది. అసాధారణ పద్ధతులలో ధ్యానం చేస్తున్నప్పుడు, ప్రేత (ఆస్ట్రల్) ప్రయాణం చేస్తున్నప్పుడు (మీ అంతట మీరే శరీరాన్ని వదిలినప్పుడు) మీ ప్రాణాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు. ఎందుకంటే ఈ వెండిరజ్జువు బలహీనం, వ్యతిరేక ఆత్మలు మళ్ళీ మిమ్మల్ని మీ శరీరంలోకి వెళ్ళకుండా నివారించడానికి వెండిరజ్జువును తెంచేయవచ్చు. వ్యక్తి అసహజంగా, కావాలని శరీరాన్ని వీడితే దానిని ప్రేత ప్రయాణం అంటారు. వెండిరజ్జువును తెంచేస్తే భూలోకంలో మీ ధ్యేయం పూర్తి కాకుండానే ముందుగానే మీరు చనిపోయే ప్రమాదం ఉంది.

☙ ప్రతి వ్యక్తికీ భూలోకంలో నిర్ధారిత సమయం ఉంటుందా?

మీరే రోజున పుట్టాలని ఎలా నిర్ణయించుకుంటారో, అలాగే చనిపోయే రోజును కూడా నిర్ణయించుకుంటారు. దీనినే ప్రాణగండం అని కూడా అంటారు. అయితే ప్రతి మనిషికీ మూడు ప్రాణగండాలుంటాయి. ఇవే బయటికి వెళ్ళే సమయాలు. మొదటి రెండు గండాల్లో ఏదైనా అనారోగ్యమో, ప్రమాదమో జరిగి మీరు బయట పడతారు. అయితే, మీ ఉపచేతనాత్మక మనస్సు గనుక మీరు తప్పు మార్గంలో వెళుతున్నారని, సన్మార్గంలోకి వచ్చే అవకాశం తక్కువని భావిస్తే, మీరు మొదటి రెండు ప్రాణగండాలలో ఒకదానిలో చనిపోవాలని, భూలోకం విడిచిపెట్టాలని అను కుంటారు. మూడో ప్రాణగండం నిశ్చయమైంది. అయితే చివరి ప్రాణగండం కంటె ముందు మనిషి మరో మనిషి నుంచి 'సమయాన్ని ఆదానం' చేసుకోవచ్చు. ఇది ఆ మనిషికి తెలియకుండా

జరుగుతుంది. ఉపచేతనాత్మక మనస్సు ఒక స్నేహితుడితోనో, బంధువుతోనో, నూతన వ్యక్తితోనో మాట్లాడి భూలోకంలో వారికి మిగిలి ఉన్న సమయాన్ని తీసుకుంటుంది. దీనికోసం, మీ ఆవరణలోని ఉన్నత సదాత్మ అనుమతి మీకు అవసరం. ఇది చాలా అరుదుగా, ప్రత్యేక ఆధ్యాత్మిక ధ్యేయాలున్నప్పుడు మాత్రమే జరుగుతుంది. ఇది మా కుటుంబంలో, మేము జీవించి ఉన్నప్పుడు చాలా ఏళ్ళ కింద జరిగింది.

ఒకానొక సమయంలో మా నాన్నగారికి శస్త్ర చికిత్స చేయించుకోవలసిన అవసరం ఏర్పడింది. ఆయన అందరితో తనకు సమయం దగ్గర పడిందని చెబుతుండేవారు. "చివరిసారి మీ అందరినీ కలుస్తున్నాను" అనేవారు. అది ఆయనకు మూడో ప్రాణగండం. శస్త్ర చికిత్సకు ఒక రోజు ముందుగా ఆసుపత్రిలో చేరారు. సాయంత్రం అమ్మ కజిన్స్ గోళా, మణి ఆయనను చూడడానికి వచ్చారు. వాళ్ళు నవ్వుతూ కబుర్లు చెప్పి ఇంటికి వెళ్ళిపోయారు. ఆ మర్నాడు నాన్నగారికి శస్త్ర చికిత్స జరుగుతున్నప్పుడు గోళ హఠాత్తుగా చనిపోయిందని ఫోను వచ్చింది. అప్పుడు దాని గురించి అంతగా ఆలోచించలేదు. ఇప్పుడు ఆత్మలోకంలో ఉన్నాము గనుక మాకు ఈ విషయం గురించి తెలిసింది. గోళ జీవించి చేసేదేమీ లేదు. మా నాన్నకు మా కుటుంబం ఉంది. ఆయన ఆధ్యాత్మిక ధ్యేయం సాధించడానికి కూడా జీవించాలి. గోళకు కూడా ఆధ్యాత్మిక ధ్యేయం ఉంది - అన్ని ఆత్మలకూ ఉంటుంది - కాని తన ఆత్మకు భూలోకంలో ధ్యేయాన్ని పూర్తి చేయగలిగేంత శిక్షణను ఆమె ఇవ్వలేదు. అందువల్ల ఆమె ఉపచేతనాత్మక మనస్సుకు ఆమె ఆత్మలోకానికి వెళ్ళడం మంచిదనిపించింది. అక్కడ ఆమె ఆత్మకు మరింత శిక్షణనిచ్చి, మళ్ళీ భూలోకంలో జన్మించవచ్చుననుకుంది. వాళ్ళిద్దరి ఉపచేతనాత్మక మనస్సులు మాట్లాడుకొన్నాయి. నాన్నగారి ఉపచేతనాత్మక మనస్సు భూలోకంలో గోళకు మిగిలిన జీవిత కాలాన్ని ఆదానం చేసుకుంది. ఇది మీకు వింతగా అనిపించవచ్చు కాని ఇది నిజం. ఇది చేతనాత్మకంగా చేయాలంటే ఎన్నటికీ జరగదు. అందువల్ల ఇతరుల జీవితకాలాన్ని ఆదానం చేసుకోవాలని ప్రయత్నించకండి.

ఇటువంటి ఆదాన కాల ఏర్పాట్లు మీరు జీవించాల్సి రావడానికి తగిన కారణంపై ఆధారపడి ఉంటాయి. మీ ధ్యేయాన్ని పూర్తి చేయాల్సి ఉండవచ్చు, మీ ఆత్మీయులను రక్షించవలసి ఉండవచ్చు, మరింత ఉన్నత ఆవరణకు వెళ్ళడానికి ఇంకా బాగుపడవలసి ఉండవచ్చు. ముఖ్యంగా, జీవితకాలాన్ని ఆదానం చేసే వ్యక్తి తన ధ్యేయాన్ని పూర్తి చేసి ఉండాలి. జీవించడానికి కారణం ఏమీ లేకుండా ఉండాలి. లేదా తమ ఆధ్యాత్మిక ధ్యేయాన్ని పూర్తి చేసేంతటి శిక్షణ వారి ఆత్మకు తగినంతగా ఉండకుండా ఉండాలి. ఇటువంటి ఆదానానికి ఆత్మలోకంలో ప్రత్యేక అనుమతి తీసుకోవాలి.

పిల్లలు చనిపోయినపుడు వారికేమవుతుంది?

భూలోకంలో పిల్లలుగా చనిపోయినవారు ఆత్మలోకంలోకి పిల్లలుగానే వెళతారు. అక్కడ పెరుగుతారు. పరిణత ఆత్మలు అయ్యేవరకూ వారిని **ఆత్మలోక తల్లులు** సంరక్షిస్తారు. దీనికి చాలా తక్కువ కాలం పడుతుంది. పెరిగిన ఆత్మలు తమ తమ ఆవరణకు వెళ్ళిపోతాయి. భూలోకంలో చనిపోయి ఆత్మలోకానికి వచ్చిన కొందరు పెద్దలు తాము చనిపోయామని నమ్మడానికి అంగీకరించరు. రతూ ఈ ఆత్మలతో కలిసి పనిచేస్తాడు. అదేవిధంగా పిల్లలకు కూడా వారున్న పర్యావరణాన్ని గురించి చెప్పడానికి ఆత్మలోక తల్లుల అవసరం ఉంది. కొద్దికాలంలోనే ఈ ఆత్మలు పెరిగి సహజమైన ఆత్మలుగా రూపొందుతాయి.

జంతువులు చనిపోయినప్పుడు వాటికేమవుతుంది?

జంతువులకు వాటి సొంత ఆత్మలోకం ఉంటుంది. మానవాత్మలు ఎలాగైతే భిన్న ఆవరణకు వెళతాయో జంతువులు కూడా అలాగే వెళతాయి. కాని వాటికి మూడు ఆవరణలే ఉన్నాయి: నిమ్న, మధ్య, ఉన్నత ఆవరణలు. భూలోకంలో పెంపుడు జంతువులైతే కొన్ని జంతువులను మానవ ఆత్మలోకంలో ఉండనిస్తారు. కాని ఇది చాలా అరుదు. ఆ జంతువు, మనిషి కూడా మంచిస్థాయులలో ఉండాలి. వారి మధ్య సంబంధం గాఢంగా ఉండాలి. ఇద్దరి మధ్య నిష్కళంకమైన ప్రేమ ఉండాలి.


ఆత్మలోకంలోని ఆత్మలు అన్నివేళలా సంతోషంగా ఉంటాయా?

మేము ఎప్పుడూ సంతోషంగానే ఉంటాము. కాని మనుషులు వ్యతిరేకమైన దారి పడుతున్నప్పుడు మాకు విచారం కలుగుతుంది. ఆత్మలోక ఆత్మలకు కూడా విచారం కలుగుతుంది ఎప్పుడంటే, మనుషులు ఆధ్యాత్మికంగా తప్పు చేస్తున్నప్పుడు, భూలోకంలో మా ఆత్మీయులు న్యాయం చేయమని విలపిస్తున్నప్పుడు, వ్యతిరేక ఆత్మల చేతిలో బాధలు పడుతున్నప్పుడు. ఇవన్నీ లేనపుడు మేము సంతోషంగా, సకారాత్మకంగా ఉంటాం. మాకు నిజంగా తెలుసు దేవుడున్నాడని, అంతిమంగా ఆయనను చేరడానికి మేము పురోగమిస్తున్నామని. దీనితో మేమెంతో ఆనందంగా ఉంటాం.

ఆత్మలోక ఆత్మలన్నీ దేవుడిని కలిశాయా?

లేదు. ఉన్నత ఆవరణలలోని కొన్ని ఆత్మలు దేవుడిని కలిశాయి. కాని మేము ఆత్మలోకంలో ఉన్నాం గనుక దేవుడున్నాడని అందరికీ తెలుసు. ఆయన సృష్టి సౌందర్యాన్ని, తెలివిని మేము చూడగలం. ఆయన ఉన్నాడని, మమ్మల్ని సంరక్షిస్తూ ఉంటాడని మా ఉపచేతనాత్మక మనస్సులకు తెలుసు.

ఆత్మ - ఉపచేతనాత్మక మనస్సు



"భూలోకంలో పునర్జన్మించడం ప్రమాదం. అందుకని దేవుడు చెడు నుంచి మీకు రెట్టింపు రక్షణనిచ్చాడు: మీ ఉపచేతనాత్మక మనస్సు, మీ ఆత్మ మార్గదర్శి."

"అంతఃప్రేరణను ఎన్నడూ అణచవద్దు. ప్రజలు మిమ్మల్ని పిచ్చివారనో, వింతగా ఉన్నారనో అంటారని ఎన్నడూ భయపడవద్దు. అంతఃప్రేరణ దేవుడిచ్చిన ప్రతిభ".

"భౌతిక మనస్సుకు యజమానిగా ఉండండి. బానిసగా కాదు."

"ఆధ్యాత్మిక అభ్యున్నతికి ఒకే ఒక కారణం మనసులో హృదయపూర్వకంగా కోరిక ఉండడమే అంటే ఉపచేతనాత్మక మనస్సులో కలగాలి. ప్రపంచానికి చూపించడానికి మారకండి, అదే ప్రపంచం కనుక మారండి."

ఉపచేతనాత్మక మనస్సు, ఆత్మ రెండూ ఒకటేనా?

ఉపచేతనాత్మక మనస్సు గురించి భూలోకంలో ఎన్నో నిర్వచనాలు, అపోహలు ఉన్నాయి. ఇంతకుముందే మీకున్న అభిప్రాయాలను వదిలిపెట్టమని మిమ్మల్ని అందరినీ కోరుతున్నాం. ఉపచేతనాత్మక మనస్సు మీ **అంతరాత్మ**. దీనినే ఉన్నత మనస్సు, ఉన్నత ఆత్మ లేదా ఆంతరిక వాణి అని కూడా అంటారు (ఈ ఉపచేతనాత్మక మనస్సు ఇచ్చే భావనలను అంతఃప్రేరణ అంటారు).

మీరు భూలోకంలో భౌతిక శరీరంలో ఉన్న ఆత్మసత్త. దేవుడు మిమ్మల్ని ముందుగా ఆత్మసత్తగా సృష్టించాడు. మానవసత్తగా కాదు. మీరు **ఆత్మ**గా సృష్టింపబడ్డారు. ఆ ఆత్మకు ఒక ఉపచేతనాత్మక మనస్సు ఉంది. ఆత్మ శాశ్వతమైన మీ ఆత్మశరీరం. భూలోకంలో భౌతిక శరీరం ఉన్నట్లుగానే, మీ ఆత్మశరీరాన్ని ఆత్మ అని అంటారు. అది శాశ్వతమైంది. ఉపచేతనాత్మక మనస్సు మీ నిజమైన ఆధ్యాత్మిక మనస్సు. శరీరాన్ని

భౌతిక మనస్సు నడిపినట్లుగానే, ఆత్మను ఉపచేతనాత్మక మనస్సు నడిపిస్తుంది. ఆత్మ ఉపచేతనాత్మక మనస్సు రెండూ శాశ్వతంగా కలిసి ఉంటాయి.

ఉపచేతనాత్మక మనస్సు చేసే పని ఏమిటి?

మిమ్మల్ని రక్షించే, మీకు **దారి చూపే** వెలుగు ఉపచేతనాత్మక మనస్సు. ఇది ఆధ్యాత్మిక రాడర్‌లా పనిచేస్తుంది. ఆధ్యాత్మికంగా తప్పు నిర్ణయం తీసుకున్నప్పుడు ఇది మిమ్మల్ని హెచ్చరిస్తుంది; అలా అది మీ ఆత్మను రక్షిస్తుంది. కాని ఆధ్యాత్మిక మార్గమంటే దురాకర్షణు ప్రతిఘటించడమే కాదు. తప్పు చేయకుండా ఉండడం సరిపోదు. మిగిలిన వాటి అన్నిటికన్నా దైవమార్గంలో ఆధ్యాత్మికంగా సరైనదేదో అది చెయ్యాలి. అందువల్ల చెడుపనులు చేయకుండా ఆత్మను నివారించి కాపాడడమే కాకుండా, నైతికంగా సరైనదాని వైపు ఉపచేతనాత్మక మనస్సు మీకు దారిచూపిస్తుంది.

ఉపచేతనాత్మక మనస్సు, మన చేతనాత్మక మనస్సు వంటిదేనా?

ఉపచేతనాత్మక మనస్సు, చేతనాత్మక లేదా భౌతిక మనస్సు రెండూ వేర్వేరు. ఒక వ్యక్తికి బాగా అభివృద్ధి చెందిన తెలివైన భౌతిక మనస్సు ఉండవచ్చు, కాని అభివృద్ధి చెందని ఉపచేతనాత్మక మనస్సు ఉండవచ్చు. ప్రాపంచిక జ్ఞానాన్ని సంపాదించి భౌతిక మనస్సును అభివృద్ధి చేసుకోవచ్చు. కాని ఉపచేతనాత్మక మనస్సును అభివృద్ధి చెయ్యలేము. **ఆధ్యాత్మిక జ్ఞానం ఒక్కటే మీ ఉపచేతనాత్మక మనస్సు రూపొందడానికి సాయపడదు.** ఆ జ్ఞానాన్ని మీరు ఆచరణలో పెట్టినప్పుడే ఉపచేతనాత్మక మనస్సు ఎదుగుతుంది. అందువల్ల ఆధ్యాత్మిక ప్రగతికి కీలకమైనది స్వచ్ఛమైన క్రియ. మీ ఉపచేతనాత్మక మనస్సు ఎంతగా తెరచుకొని ఉంటే అంతగా ఆత్మలోకం నుంచి మార్గదర్శకత్వం, రక్షణ మీకు లభిస్తాయి. మీ ఉపచేతనాత్మక మనస్సు మీ భౌతిక మనస్సును నియంత్రించాలి. భౌతిక మనస్సుకు మిమ్మల్ని బానిసగా చేసుకునే అవకాశం ఇవ్వవద్దు. ఆత్మలోకానికీ మీకూ ఉన్న లింకు మీ ఉపచేతనాత్మక మనస్సు. దాని ద్వారానే ఆత్మలోక ఆత్మల నుంచి మీకు రక్షణ, మార్గదర్శకత్వం లభిస్తాయి.

భూలోకంలో ప్రతి ఒక్కరికీ ఉపచేతనాత్మక మనస్సు ఉంటే, ప్రజలు తప్పుదారిలో ఎందుకు వెళతారు?

భౌతిక మనస్సుకు, ఉపచేతనాత్మక మనస్సుకు అభిప్రాయభేదాలు వచ్చే సమయాలు వస్తాయి. దీనికి కారణం భౌతిక మనస్సు తార్కికమైనది - తర్కసహమైన మార్గాన్ని అనుసరించాలనో, పనిని చేయాలనో అది అనుకోవచ్చు - కాని ఉపచేతనాత్మక మనస్సుకు ఇది ఇష్టం కాకపోవచ్చు. రెండు మనసులూ యుద్ధం చేస్తున్నట్లుగా అనిపించవచ్చు. ఇది మంచి విషయం. ఉపచేతనాత్మక మనస్సుకూ, భౌతిక

మనస్సుకూ యుద్ధం జరగకపోతే, మీ ఉపచేతనాత్మక మనస్సు పనిచేయడం లేదని, మీ భౌతిక మనస్సు దానిని పూర్తిగా నియంత్రిస్తోందని అర్థం. భూలోకంలో ఏ మనిషీ పూర్తిగా ఉపచేతనాత్మక మనస్సు చెప్పిన విధంగా నడుచుకోలేదు. ఎందుకంటే సగటు మనిషి ఉపచేతనాత్మక మనస్సు చాలా కొంచెం (1% నుంచి 2%) తెరచుకొని ఉంటుంది. అయితే, ఉపచేతనాత్మక మనస్సు ఎంత శక్తిమంతమైనదంటే ఇది రేఖామాత్రంగా తెరచుకొని ఉన్నాగాని, 100% తెరచుకొని ఉన్న భౌతిక మనస్సును హెచ్చరించగలదు.

❀ ఈ రెండు మనసులు నిరంతరం యుద్ధం చేస్తుంటే మనమెలా ప్రశాంతంగా ఉండగలం?

భౌతిక మనస్సుకు, ఉపచేతనాత్మక మనస్సుకు జరుగుతున్న యుద్ధం గురించి తెలుసుకుని, ప్రార్థన ద్వారా నిశ్చయాత్మకంగా పనిచేస్తూ ఉపచేతనాత్మక మనస్సు గెలిచేలా చూడాలి. మిమ్మల్ని తన బానిసగా చేసుకొనడానికి భౌతిక మనస్సు ఆత్రుత పడుతుంది. మీ చెడు పనులన్నిటికీ సమర్థనలు చెప్పి ఆధ్యాత్మికంగా దిగజారే మార్గంలో మిమ్మల్ని నడిపిస్తుంది. ఉపచేతనాత్మక మనస్సు మాటవినడం నేర్చుకుని, సక్రమంగా నడిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుంది.

❀ ఉపచేతనాత్మక మనస్సుకు వ్యతిరేకంగా భౌతిక మనస్సు పనిచేస్తే, మరి అది మనకెందుకు?

భౌతిక మనస్సుకు బాగా శిక్షణనివ్వకపోతే ఇది అననుకూలమై ఉపచేతనాత్మక మనస్సుకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. కాని భౌతిక మనస్సును బాగా ఉపయోగించుకోగలిగితే, ఉపచేతనాత్మక మనస్సుకు మంచి సహాయకురాలిగా పనిచేస్తుంది. భౌతిక మనస్సు తెలివి తేటలు ఉపచేతనాత్మక మనస్సు మార్గదర్శకత్వానికి సమస్థితిలో పనిచేస్తే ఈ రెంటి కలయిక ఎంతో శక్తిమంతమైంది. అందువల్ల భౌతిక మనస్సును బాగా ఉపయోగించగలిగితే అది కానుక. భౌతిక మనస్సు ఒక పరీక్ష కూడా. మీ సంకల్ప స్వేచ్ఛను ఉపయోగించి ఉపచేతనాత్మక మనస్సు మార్గదర్శకత్వాన్ని ఎంపిక చేసుకోవాలని దేవుడు భావిస్తాడు. ఇది ప్రతి మనిషికీ ఉండే పరీక్ష. **భౌతిక మనస్సును మీరు నియంత్రించాలి; మిమ్మల్ని అది నియంత్రించే అవకాశం ఇవ్వవద్దు.** భూలోకంలో జనం ఆధ్యాత్మికంగా తప్పుదారి పట్టడానికి కారణం వారి ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణం కావడం. మరో రకంగా చెప్పాలంటే, ఉపచేతనాత్మక మనస్సు మూసుకొని పోతుంది. ఏ మనిషీ ఆధ్యాత్మికంగా తప్పు చేయడానికి ఉపచేతనాత్మక మనస్సు అనుమతించదు. కాని మనుషులు తమ భౌతిక, తార్కిక మనస్సులు చెప్పినదానినే ఎక్కువగా వింటారు. ఉపచేతనాత్మక

మనస్సు చెప్పే దానిని వినరు. దాని మార్గదర్శ కత్వాన్ని తిరస్కరించి, తమ పాపపు లేదా చెడు మార్గాలనే అనుసరిస్తారు. ఉపచేతనాత్మక మనస్సు దీనిని సహించదు కనుక అది మౌనంగా ఉండిపోయి, నిద్రపోతుంది. క్రమంగా పూర్తిగా నిద్రాణమైపోతుంది. తర్వాత ఇంక మీరు తప్పు పనులు చేస్తున్నా హెచ్చరించ లేదు. ఇది అత్యంత ప్రమాదకరం.

ఉపచేతనాత్మక మనస్సు తెరచుకొని ఉన్నపుడే వ్యక్తి అంతరాత్మ అతడిని హెచ్చరిస్తుంది. ఇదెలా జరుగుతుందో తెలిపే చిన్న ఉదాహరణ: మీరు ఎవరినైనా బాధపెట్టినప్పుడు, వారి గురించి చెడుగా ఆలోచించినప్పుడు మీ ఉపచేతనాత్మక మనస్సు మిమ్మల్ని హెచ్చరిస్తుంది. మీకు అపరాధం చేశామనే భావన కలుగుతుంది. అంటే మీ ఉప చేతనాత్మక మనస్సు పనిచేస్తుందని అర్థం. ఆ అపరాధ భావం మిమ్మల్ని నమిలెయ్య నివ్వకూడదు. ఈ అపరాధ భావనకు ప్రత్యేకమైన ప్రయోజనం ఉంది. అది మీరు చేసిన తప్పును సరిదిద్దుకోవాలనే కోరిక మీలో కలిగించాలి. దాని నుంచి పాఠం నేర్చుకుని ఆ పొరపాటును మళ్ళీ చేయకుండా ఉండాలి. ఒకసారి ఇలా చేస్తే అపరాధం పోతుంది. అపరాధ భావనతో వ్యవహరించవలసిన సరైన పద్ధతి ఇది.

మీ అపరాధ భావనను అణచిపెట్టి, మొదటి నుంచి నిర్లక్ష్యం చేసి తప్పు చేశామని తెలిసినా ఉపచేతనాత్మక మనస్సును మౌనంగా ఉండమని చెబితే; దాని సలహాను మీరు తిరస్కరిస్తున్నారు. ఇలా పదే పదే చేస్తే ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణమైపోతుంది. ఒకవేళ మీరు పాపం చేసినా, మీ ఉపచేతనాత్మక మనస్సు ఇంక మిమ్మల్ని హెచ్చరించని పరిస్థితి ఉంటుంది. అపరాధం కనిపించదు. పైగా అది కనిపించదు కనుక మీరు అపరాధం ఏమీ చేయలేదని భావిస్తూ, మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటారు తప్పేమీ చేయలేదని. వాస్తవానికి, మీ ఆధ్యాత్మిక రాడర్‌ను మీరు పనిచేయకుండా ఆపేశారు.

అయితే, అన్నిసార్లూ అపరాధ భావన ఉపచేతనాత్మక మనస్సు నుంచే రాదు. కొంతమంది అపరాధ భావనతో సతమతం కానక్కరలేని విషయాలకు అపరాధ భావాన్ని కలిగి ఉంటారు.

మీరు అన్నీ సక్రమంగానే చేసినా ఒకోసారి భౌతిక మనస్సు మీరు అపరాధం చేసినట్లుగా భావించేలా చేస్తుంది. మీరేదో తప్పు చేసినట్లుగా, చేయాల్సినంత చేయనట్లుగా భావిస్తుంటారు. ఈ అపరాధ భావన మీకు మీరో, లేకపోతే ఇతరులో, వ్యతిరేకతో రుద్దినది. ఇది ప్రోగ్రాం చేసిన అపరాధ భావన. భౌతిక మనస్సు ద్వారా కలిగే అపరాధ

భావన మీ ఎదుగుదలకు ఆరోగ్యకరమైనది కాదు. ఉపచేతనాత్మక మనస్సు ఇచ్చే మార్గదర్శకత్వం ద్వారా కలిగే అపరాధ భావనకు, భౌతిక మనస్సు ద్వారా కలిగే అపరాధ భావనకు మధ్యగల తేడాను తెలుసుకొనే విచక్షణ మీకు ఉండాలి. ముందు కలిగేది సంకేతం రెండోది ట్రిక్ (మోసం). తప్పు ఆలోచనవల్ల, నమ్మకాలవల్ల, ఇది కలుగుతుంది. మీరు ఎదగకుండా ఇది నివారిస్తుంది. అపరాధ భావన కలిగినపుడు మిమ్మల్ని మీరు విశ్లేషించుకుని, మీరు నమ్మే వారెవరితోనైనా మాట్లాడండి. మిమ్మల్ని సంతోషపెట్టాలనుకునేవారితో, మీరు వినాలనుకున్నది చెప్పేవారితో మాట్లాడవద్దు. మీకు సత్యం చెప్పేవారితో, నిజమైన జ్ఞానం ఉన్నవారితో మాట్లాడండి.

ఔ మనుషులు పెద్దవారవుతున్న కొద్దీ ఉపచేతనాత్మక మనస్సు అభివృద్ధి చెందుతుందా?

కచ్చితంగా చెప్పలేం. దాని మార్గదర్శకత్వాన్ని మీరెలా అనుసరిస్తున్నారనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. అది కండరం లాంటిది. ఎంత బాగా దానితో వ్యాయామం చేస్తే, అంత ఆరోగ్యంగా, బలంగా ఉంటుంది. వాస్తవానికి, పసిబిడ్డ ఉపచేతనాత్మక మనస్సు చాలా శక్తిమంతం (ఆ బిడ్డ గనుక మంచి ఆధ్యాత్మిక స్థాయిలో ఉంటే) ఎందుచేతనంటే ఆత్మలోకం నుంచి భూలోకానికి ఆ బిడ్డ ఇప్పుడే వచ్చాడు కనుక. కాని ఆ బిడ్డకు అనుచిత శిక్షణనిచ్చి తప్పు చేయనిస్తే, ఉపచేతనాత్మక మనస్సు మౌనంగా ఉండిపోయి క్రమక్రమంగా బలహీనంగా అయిపోతుంది.

ఔ భూలోకంలో ఉండే ఆత్మలు అన్నీ నిద్రిస్తున్నప్పుడు ఆత్మలోకంలోని ప్రియతములను కలుసుకుంటాయని చెప్పారు కదా. ఇదెలా జరుగుతుంది?

మీరు గాఢంగా, కలలు లేకుండా నిద్రిస్తున్నప్పుడు, మీ భౌతిక మనస్సు మూసుకుని పోతుంది. మీ ఉపచేతనాత్మక మనస్సు మాత్రమే పనిచేస్తుంటుంది. ఉపచేతనాత్మక మనస్సు దారి చూపుతుండగా మీ ఆత్మ మీ పాంచభౌతిక శరీరాన్ని వీడి భూమికీ, ఆత్మలోకానికీ మధ్యన ఉండే ఒక ప్రదేశానికి ప్రయాణిస్తుంది. అక్కడ మీ ప్రియతములను మీరు కలుస్తారు. వారు మిమ్మల్ని ఓదార్చి, మీ ఉపచేతనాత్మక మనస్సుకు మార్గదర్శకంగా ఉంటారు. నిద్రలేవగానే మీరిదంతా మర్చిపోతారు మీ భౌతిక మనస్సు నిద్రలో మూసుకుపోయి ఉండడమే దీనికి కారణం. నిద్రించేటప్పుడు దానికి గుర్తుపెట్టుకోవడానికి అనుమతి లేదు. మనుషులందరికీ కొన్ని సమయాల్లో ఇలా జరుగుతుంది: నిద్రనుంచి ఒక్కసారి హఠాత్తుగా మేల్కొంటారు. గుండె దడదడలాడుతుంది. ఉపచేతనాత్మక మనస్సు మార్గదర్శకత్వం చూపిస్తుండగా మళ్ళీ మీ భౌతిక శరీరంలోకి ప్రవేశించిన మీ ఆత్మ ఇది.

☙ వ్యక్తి ఎప్పుడు చనిపోతాడో అతడి / ఆమె ఉపచేతనాత్మక మనస్సుకు తెలుస్తుందా?

తెలుస్తుంది. మీకున్న ప్రాణగండాలు మూడూ మీ ఉపచేతనాత్మక మనస్సుకు తెలుసు. మీ ప్రాణగండానికి ముందుగా కూడా మీరు చనిపోవచ్చు. ప్రమాదము, హత్య మొదలైన వాటివల్ల. అయితే మరో ఆధ్యాత్మిక నియమం ఉంది. ఇది మీ రక్షణ కోసం చేసినది. 7వ ఆవరణ, 6వ ఆవరణలకు చెందిన సదాత్మలు నరకానికి వెళ్ళాలనుకోవు, అందువల్ల 7వ ఆవరణలో పుట్టిన ఆత్మలు భూలోకం నుంచి వెనక్కి తీసుకుని రాబడతాయి గాని 5వ ఆవరణ కన్న కిందికి పడిపోవు అని దేవుడు నియమం పెట్టాడు. అదేవిధంగా ఒకవేళ మీరు 6వ ఆవరణలో పుట్టి ఉంటే 4వ ఆవరణలో పడిపోవడానికే అనుమతి ఉంటుంది. మీరు గనుక పాపం చేస్తూనే పోతే, మళ్ళీ ఆత్మలోకానికి తిరిగి వెళ్ళిపోవాలని మీ ఉపచేతనాత్మక మనస్సు అనుమతి కోరుతుంది. అయితే, 5వ ఆవరణ, అంతకు కింది ఆవరణల్లో ఉన్నవారికి ఈ రక్షణ ఉండదు. వాళ్ళు పాపాలు కొనసాగిస్తూ ఉంటే, ఉపచేతనాత్మక మనస్సు మూసుకొని పోతుంది. వారు అత్యంత కింది ఆవరణలలో పడిపోవచ్చు (1వ ఆవరణ). **అందుకనే భూలోకంలో జీవించడం ప్రమాదమని అంటాం. కాని ఆధ్యాత్మికంగా పురోగతి సాధించడానికి ఆత్మలు ఈ ప్రమాదాన్ని స్వీకరిస్తాయి.**

ఒకవేళ ఉపచేతనాత్మక మనస్సు మూసుకొనిపోయి, వ్యక్తి చనిపోతే, అతడుగాని, ఆమెగాని ప్రేతరూపంలో ఉండిపోవడానికి నిర్ణయించుకోవచ్చు. వాళ్ళు తమ ఆవరణకు వెళ్ళాలనుకోకపోవడమే కాకుండా, భూలోకాన్ని కూడా వదలాలని అనుకోరు. మీరు ఆధ్యాత్మికంగా ఎంత కిందికి పడిపోతే అంత ఎక్కువగా భూలోకం వదలాలని కోరుకోరు. చెడు ఆత్మలు జలగల్లా భౌతిక శరీరాలను అంటిపెట్టుకుని ఉంటాయి. ఈ ఆత్మలకు తాము చనిపోతే ఎక్కడికి వెళ్ళాలో తెలుసు గనుక భౌతిక ప్రపంచాన్ని వదలడానికి భయపడి, ప్రేత ప్రపంచంలో ఉండిపోవాలనుకుంటాయి. కొన్ని కేసులలో మానవులు చనిపోయినప్పుడు తాము చనిపోయినట్లుగా వారికి తెలియదు. ఆ వ్యక్తి ఇంకా ఆత్మసత్త కాలేదు: ఇంకా ప్రేతరూపంలోనే ఉన్నాడు.

☙ చెడు ఆత్మలే ప్రేతరూపాన్ని పొందుతాయా?

లేదు. చనిపోయినప్పుడు మానవ సత్తలన్నీ ప్రేతరూపాన్ని పొందుతాయి. తరువాత ప్రేత శరీరాలను వదలి ఆత్మసత్తలుగా మారతాయి. అందువల్ల ఒక మనిషి చనిపోయినపుడు సహజంగా జరిగే మార్పు ఇలా ఉంటుంది:

మానవ సత్తలు → ప్రేత సత్తలు → ఆత్మసత్తలు

ప్ర ఉన్నత ఆవరణలలోని ఆత్మలు ప్రేతరూపంలో ఉండాలనుకుంటాయా?

లేదు. ఉన్నత ఆవరణల నుంచి వచ్చిన ఆత్మలు సాధారణంగా ప్రేతరూపంలో ఉండాలనుకోవు. వారు వీలైనంత త్వరగా ఆత్మసత్తలుగా మారాలనుకుంటారు.

ఆత్మలోకంలో ఉన్న వ్యక్తి ప్రియతములకు ఆ వ్యక్తి భూలోకంలో చనిపోతున్నాడని తెలుస్తుంది. అందువల్ల ఆ వ్యక్తి రాకకు ఈ ఆత్మలోక ఆత్మలు సిద్ధంగా ఉంటాయి. కొందరు ప్రియతములైతే ఆత్మలోకం వదలి భూలోకానికి వచ్చి చనిపోబోతున్న వ్యక్తిని తీసుకువెళతారు. (అయితే హఠాత్తుగా చనిపోతే అంటే ఇది దైవ ప్రణాళికలో లేదు కనుక ప్రమాదము, హత్య వంటివి జరిగితే ఇలా రాలేరు.) ఈ ఆత్మసత్తలు ఆ వ్యక్తి ఏ ఆవరణకు వెళ్ళాలో అక్కడకు తీసుకొని వెళతాయి. చనిపోయిన వ్యక్తి ఉపచేతనాత్మక మనస్సే వారు భూలోకంలో చేసిన పనులనుబట్టి వారికి తగిన ఆవరణ ఏదో సూచిస్తుంది. ఇది వినడం వినకపోవడం ఆత్మ ఇష్టం; బలవంతం చేయకూడదు. ఆత్మ గనుక ఉపచేతనాత్మక మనస్సు మాట విని తగిన ఆవరణకు వెళితేనే మళ్ళీ ఆత్మసత్త కాగలదు.

ఆత్మలోకానికి వెళ్ళడానికి ఆత్మ అంగీకరించకపోతే, అది ప్రేతరూపంలోనే ఉంటుంది. ఎందుకంటే మీరు చనిపోయిన తరువాత కూడా దేవుడు మీకు సంకల్పస్వేచ్ఛను ఇస్తాడు గనుక. భూలోకంలో కంటికి కనిపించే ప్రేతరూపాలను దెయ్యాలు అంటారు. **ప్రేతాత్మలు** దారితప్పిన ఆత్మలు. తమ ఉపచేతనాత్మక మనస్సు మాట విననివి. ఆత్మసత్తలుగా మారడానికి అంగీకరించనివి. ఇలా చేస్తూ అవి వ్యతిరేక కర్మను పోగు చేసుకుంటాయి. మీరు ప్రేతాత్మలను చూడలేరు కాని అవి మిమ్మల్ని చూడగలవు. అయితే ప్రేతాత్మలు ఆత్మలోకాన్ని చూడలేవు. ఒకసారి అవి ఉపచేతనాత్మక మనస్సు మాట వినకుండా ఆత్మలోకానికి వెళ్ళేందుకు అంగీకరించకపోవడంతో వాటికి ఆత్మలోకం కనిపించదు. అది నియమం. అవి ఆత్మలోకానికి వెళదాం అని నిశ్చయించుకున్న తర్వాతే అది వాటికి కనిపిస్తుంది. ఇది కూడా ఒక పరీక్షే.

ప్ర చెడు ఆత్మలు చనిపోయినపుడు కింది ఆవరణల నుంచి ఆత్మలోక ఆత్మలు వచ్చి చనిపోయిన వారిని తీసుకొని వెళతాయి. దీని ఉద్దేశ్యమేమిటి?

భూలోకంలో ఒక చెడు ఆత్మ ఉన్న వ్యక్తి చనిపోతే, కిందిస్థాయిలలో ఉండే సమూహాత్మలు వచ్చి ఆ చెడు ఆత్మను తీసుకొని వెళతాయి. అయితే ఈ ఆత్మలు ఆధ్యాత్మికంగా కింది స్థాయిలో ఉంటాయి గనుక, ఈ పని చేస్తున్నప్పుడు వాటిని జాగ్రత్తగా పర్యవేక్షించవలసి ఉంటుంది. ఈ ఆత్మలు భూలోకం నుంచి ఒక కిందిస్థాయి ఆత్మను ఆత్మలోకానికి తేవాలని అనుకుంటే తమ ఆవరణలోని ఉన్నత

సదాత్మ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ పనికోసం ఉన్నత సదాత్మ ఒక సహాయకుణ్ణి ఎంపిక చేస్తుంది – వీరు 4వ ఆవరణ, 5వ దశ, 5వ ఆవరణ 5వ దశలోని వారై ఉంటారు – చెడు ఆత్మలు తమ ఆవరణలకు వెళ్ళేలా చూడడం వీరి పని. ఇది ఒక పరీక్షలా చేస్తారు. ఈ ఆత్మలకు ఒక పనిని అప్పగించి చేయమంటారు. ఈ బాధ్యతను నిర్వర్తించడం ద్వారా వారు మార్పును కోరుకుంటున్నట్లుగా తెలియజేయడం జరుగుతుంది. దీనితో వారిని మార్గంలోని ప్రతి దశలోను పరీక్షిస్తారు.

మనం పుట్టినపుడు ఇటువంటి సహజమైన పురోగమనం వర్తిస్తుందా? మనం ఆత్మసత్తలుగా మొదలై, తర్వాత ప్రేత సత్తలై, చివరికి మానవ సత్తలవుతామా?

లేదు. ఆత్మ సత్త భూలోకంలో జన్మించాలంటే ప్రేత దశలోకి వెళ్ళదు. వ్యక్తి ఆత్మ ఉపచేతనాత్మక మనస్సు రెండూ కలిసి భూలోకంలోని మానవసత్త యొక్క భౌతిక శరీరంలో ప్రవేశిస్తాయి. అంటే పరివర్తన ఆత్మసత్త నుంచి మానవసత్తకు నేరుగా జరుగుతుంది.

ఆత్మలు ప్రేతరూపంలో ఎందుకు ఉండాలనుకుంటాయి?

1. అవి భౌతిక ప్రపంచంపై అత్యంత మమకారం కలిగి ఉంటాయి.

2. భూలోకంలోని తమ ప్రియతములను రక్షించాలనుకుని అదే భౌతిక ప్రదేశాన్ని ఆక్రమిస్తే తాము సాయం చేయగలమనే అపోహలో ఉంటాయి.

3. వారు (ఆత్మలు) కిందిస్థాయి ఆధ్యాత్మిక ఆవరణకు వెళ్ళవలసి ఉంటుందని ఉపచేతనాత్మక మనస్సు వారికి చెబుతుంది. అక్కడికి వెళితే కష్టపడవలసి ఉంటుంది గనుక అలా చేయడం వారికి ఇష్టముండదు. వారికి సంకల్పస్వేచ్ఛ ఉంటుంది గనుక వారిలా చేయవచ్చు. అయితే, ఒక ఆత్మ గనుక ప్రేతరూపంలో ఉండాలను కుంటే, ఆ ఆత్మ కిందికి పడిపోతూనే ఉంటుంది. వ్యతిరేక (చెడు) కర్మ పోగవుతూ ఉంటుంది. వ్యక్తి తన ఉపచేతనాత్మక మనస్సు మాట వినకుండా, ఆధ్యాత్మిక నియమాన్ని ఉల్లంఘించడమే దీనికి కారణం. వ్యక్తి మానవ శరీరం నుంచి ప్రేత శరీరం, తర్వాత ప్రేత శరీరం నుంచి ఆత్మసత్తగా మారడం అనే సహజమైన పురోగమనాన్ని అతడు పాటించడం లేదు.

4. లేదు. ఆ వ్యక్తులు గనుక చెడు ఆత్మలైతే, వారు ప్రేతరూపంలో ఉండాలను కుంటారు. భూలోకంలోని మానవులకు హాని చేయాలనుకుంటారు. ఇలా మరోసారి ప్రేతాత్మ ఆధ్యాత్మికంగా పడిపోయి, వ్యతిరేక (చెడు) కర్మను పోగు చేసుకుంటుంది.

5. భూలోకంలో ఉన్నపుడు వారికి మాదక ద్రవ్యాలు వాడడం, మద్యం తాగడం వంటి దురలవాట్లు ఉంటాయి. దానితో అదే అనుభవం కావాలని పదే పదే అనుకుని, వాటికి బానిసలైన మనుషులను పట్టుకుని ఉంటారు.

మీ భౌతిక మనస్సు, ఉపచేతనాత్మక మనస్సుతో సహకరించేలా ఎలా చేయగలరు?

భౌతిక మనస్సు స్వభావాన్ని మీరు తెలుసుకోవాలి. ఉపచేతనాత్మక మనస్సు ఆధ్యాత్మిక మైనది, సకారాత్మకమైనదీ అయినట్లే, భౌతిక మనస్సు ప్రాపంచికమైనది, వ్యతిరేకమైనది లేదా నకారాత్మకమైనది. దీనిని పర్యవేక్షించకపోతే అది మిమ్మల్ని కిందికి పడతోస్తుంది. ఉదాహరణకు, మీరొక పాపం చేస్తే, మీరు తప్పు చేశారని ఉపచేతనాత్మక మనస్సు హెచ్చరిస్తుంది. ఆ తప్పును సరిదిద్దుకోవాలని మీరు ప్రయత్నిస్తున్నప్పుడు, పాఠం నేర్చుకుంటున్నప్పుడు, మీ భౌతిక మనస్సు అత్యంత శక్తిమంతమైన ఆయుధాన్ని ప్రవేశపెడుతుంది: అదే అహం. ఈ అహం మీరు చేసిన తప్పు పనులు సమర్థిస్తూ, మీరు తప్పు చేయలేదని, సరైనదే చేశారని మిమ్మల్ని నమ్మిస్తుంది. తెలివైన, తర్క సహమైన వాదన వినిపించి మీరు నోరెత్తకుండా చేస్తుంది. మీ ఉపచేతనాత్మక మనస్సు స్వరం పెరిగి, బయటికి చెబుతుంది కాని భౌతిక మనస్సు చెప్పిన కారణాలతో దాని నోరు మీరు మూయిస్తారు. తర్కాన్ని చూపించి మీరు సరిగ్గా చేశారని అది చెబుతుంది.

తర్కం (లాజిక్) చెడ్డదని మేము అనడం లేదు. కాని తర్కమూ సత్యమూ ఒకటి కావు. దురదృష్ట వశాత్తు సత్యం నుంచి పారిపోవడానికి జనం తర్కాన్ని ఉపయోగిస్తారు. భౌతిక మనస్సు తర్కాన్నిస్తుంది; ఉపచేతనాత్మక మనస్సు సత్యాన్ని చెబుతుంది. ఉదాహరణకు దురాకర్షణకి గురైతే భౌతిక మనస్సు సమర్థిస్తుంది. దురాకర్షణ మీ కోరిక కాదని, అత్యవసరమని మిమ్మల్ని నమ్మిస్తుంది. దురాకర్షణ ఆధ్యాత్మికంగా తప్పేమీ కాదని చెబుతుంది, అంతేకాకుండా దురాకర్షణ తప్పుదారి పట్టించే కోరిక అని చెప్పకుండా దాని గురించి నిజం దాచిపెడుతుంది.

భౌతిక మనస్సుకున్న మరో ఆయుధం సందేహం. మీ విశ్వాసాన్ని, విచక్షణను సవాలు చేసే విధంగా అది సందేహమనే బీజాన్ని మీలో నాటుతుంది. ఉపచేతనాత్మక మనస్సు సత్యపీఠం. దానికి అన్నీ తెలుసు; సందేహాన్ని పోగొట్టుకోవడానికి అది మీకు సహాయం చేస్తుంది. అయితే అది మీ ఆత్మను నడపడానికి మీరు దానిని అనుమతించాలి. సందేహమనే విత్తనాన్ని పెంచి పోషించితే, ఆత్మలోకంతో మీకున్న సంబంధం నిదానంగా తెగిపోతుంది ఎందుకంటే సందేహం వల్ల ముఖ్యంగా ఒక ప్రశ్న ఉదయిస్తుంది: దేవుడంటే నాకు నమ్మకం ఉందా? ఉపచేతనాత్మక మనస్సు మీ యజమాని కనుక దాని మాట వినండి. అది మీ జీవాత్మకూ, పరమాత్మకూ సంబంధాన్ని ఏర్పరుస్తుంది. భౌతిక

మనస్సుకు బలహీనతలుంటాయి. ఈ జన్మలో మీ లక్ష్యం ఒకటే ఉపచేతనాత్మక మనస్సును పెంపొందింపజేసుకుంటూ ఈ బలహీనతలు పారదోలడం.

భౌతిక మనస్సుకున్న అత్యంత హానికరమైన లక్షణం ఏమిటంటే తొందరగా దురలవాట్లకు లోనై అవే సౌకర్యవంతంగా అనిపించడం. అదిలా అంటుంది, "నాకు పొగరుగా ఉండడం ఇష్టం. ఎందుకు మారడం?" అంటుంది. ఉపచేతనాత్మక మనస్సు ఎన్నడూ తన మార్గాలను స్థిరంగా ఉంచుకోదు – అది పెరుగుతూ ఉంటుంది. **"మీ తోటివారిని మోసగించవచ్చు. మిమ్మల్ని మీరు మోసగించుకోవచ్చు. కాని దేవుడిచ్చిన ఉపచేతనాత్మక మనస్సును ఎన్నడూ మోసం చేయలేరు.** వ్యక్తికి సంబంధించిన ఆకాశిక్ రికార్డులలో ఎప్పటికప్పుడు తాజా సమాచారం చేర్చేది ఉపచేతనాత్మక మనస్సే. మనుషులు తమను దేవుడు శిక్షిస్తున్నాడనుకుంటారు. కాని వాస్తవమేమిటంటే, తప్పు చేసినప్పుడు వారి ఉపచేతనాత్మక మనస్సులే వారిని శిక్షిస్తాయి ఎందుకంటే వారి స్వభావం వాటికి బాగా తెలుస్తుంది. ఆత్మలోక స్మృతి, గత జన్మల స్మృతి మీకు లేకుండా భౌతిక మనస్సు అడ్డుకుంటుంది. మీ ఉపచేతనాత్మక మనస్సుకు ఆత్మలోకం జ్ఞాపకం ఉంటుంది. భూలోకంలో మీరు ఎత్తిన జన్మలన్నిటికీ సంబం ధించిన ప్రతి వివరమూ దానికి తెలుసు. కాని ఈ సమాచారాన్ని భౌతిక మనస్సుకు కింది కారణాల వల్ల చెప్పడం కుదరదు:

1. మీ గత జన్మలోని పాపాలు మీకు తెలిస్తే ఆ స్మృతులు మిమ్మల్ని వెన్నాడి, ఎదగకుండా ఆపుతాయి. ఉదాహరణకు, గత జన్మలో మీరెవరినైనా బాగా బాధపెడితే, ఆ అపరాధ భావన ఈ జన్మలో మీరు భరించలేనిదై మిమ్మల్ని మీరు క్షమించుకోలేక పోవచ్చు. అన్ని ఆత్మలూ చీకూ చింతా లేకుండా ప్రయాణం ఆరంభించాలని దేవుడి కోరిక.

2. మీ భౌతిక మనస్సు పరిమితమైంది; ఉపచేతనాత్మక మనస్సుకు తెలిసిన అన్ని విషయాలూ అది అర్థం చేసుకోలేదు.

3. ఆత్మలోకం గురించి, అక్కడి సంతోషం, శాంతి గురించి గుర్తు ఉంటే (మీరు మంచి ఆవరణలో ఉండి ఉంటే) భూలోకంలో ఒక్క సెకను కూడా జీవించి ఉండలేరు. ఆత్మలోకానికి వెళ్ళిపోవాలనే తపన మిమ్మల్ని భూలోకంలో నిలవనీయదు.

4. మీ భూలోక జీవితం ఒక పరీక్ష. కర్మ గురించి, పరీక్ష గురించి మీకు ముందుగా తెలిసిపోతే భూలోక ప్రయాణానికి అర్థం ఉండదు. పైగా మీకు ముందుగానే చెబితే అది పరీక్ష అవదు. భూలోకంలో అనుభవం సంపాదించడానికి, ఆత్మకు శిక్షణ నివ్వడానికి, పైకి ఎదగడానికి ఆత్మను పరిశుద్ధం చేసుకొనడానికి మీరు భూలోకానికి

వెళ్ళారు. గత జన్మలు గుర్తు ఉంటే అవే తప్పులు మళ్ళీ చెయ్యరు. ముందుగానే మీకు హెచ్చరిక ఉంటుంది గనుక ఆ తప్పులు చెయ్యరు. అప్పుడు నిజమైన ఎదుగుదల ఉండదు. మీ జీవితం సాంకేతికం అయిపోతుంది, మీ ఎంపికలు యాంత్రికంగా ఉంటాయి. మీరు యంత్రంలా జీవిస్తారు.

భూలోకంలో కొన్ని ఆత్మలకు ఇతరులకన్న మరింతగా పరిణతి చెందిన ఉపచేతనాత్మక మనస్సు ఉంటుంది. కొన్నిసార్లు ఈ ఆత్మలకు భూలోకంలో తమ గతజన్మలు గుర్తుంటాయి, వారికి ఆత్మలోక స్మృతులు కూడా ఉంటాయి కాని ఇది చాలా అరుదు. నిర్దిష్ట కారణంతో, జనానికి నమ్మకం కలిగించడానికి, దైవిక జ్ఞానాన్ని వ్యాప్తి చెయ్యడానికి సహకరించడానికి ఇలా జరగడానికి అనుమతినిస్తారు.

ఈ వ్యక్తి ఉపచేతనాత్మక మనస్సు తెరచుకొని ఉండకపోతే, ఆ వ్యక్తి ఎలా మారతాడు?

సూరదాస్ కథను ఉదాహరణగా తీసుకోండి. అతని విషయంలో అతను చేసిన పాపకర్మల వల్ల ఉపచేతనాత్మక మనస్సు నిద్రపోయింది. అతనికి భౌతికమైన కుదుపు అవసరం. అది కారు ప్రమాదం రూపంలో వచ్చి అతడిని మేల్కొలిపింది. ఆ ప్రమాదం వల్ల వరుసగా కొన్ని సంఘటనలు జరిగి అతనొక గుహలోపలికి వెళ్ళాడు. మృత్యువు తప్పదని తెలిసినపుడు చివరికి తాను చేసిన తప్పులు తెలుసుకున్నాడు. అతని ఉపచేతనాత్మక మనస్సు పూర్తిగా నిద్రపోవడంతో ఇంత బాధాకరమైన కుదుపు (దెబ్బ) అవసరమైంది. కాని వ్యక్తి ఉపచేతనాత్మక మనస్సు కొంచెం తెరచుకొని ఉన్నా, ఆత్మ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని ఆత్మ తాను చేసిన తప్పు ఒప్పుకోవాలి అప్పుడు భౌతికమైన దెబ్బ నుంచి తప్పించుకొనవచ్చు. 'ఒప్పుకొనడం' అన్నపుడు మార్పుకు మనం మనస్ఫూర్తిగా అంగీకరించామని అర్థం. సూరదాస్ నిజంగానే పశ్చాత్తాపం చెంది మారాలని భావించినప్పుడే సహాయం అందించారు దైవిక ఉన్నత సదాత్మ. తన తప్పులన్నీ ఒప్పుకొని మారాలనుకున్నాడు, కాని తనకుతానే చీకటి గుహలో, అడవి మధ్యలో క్రూర జంతువుల మధ్య ఒప్పుకొన్నాడు. అది దేవాలయం కాదు. ఎవరూ అతను తన తప్పుని ఒప్పుకొనడం వినలేదు - అతని ఉపచేతనాత్మక మనస్సు మాత్రమే విన్నదామాటలు. భూలోకంలో మత గురువు / ప్రీస్ట్ దగ్గర తప్పులు ఒప్పుకుంటే తప్పులు క్షమించబడతాయనే అపోహ ఉంది. ఇది పూర్తిగా అబద్ధం. ప్రీస్ట్‌కు ఇటువంటి శక్తి లేదు. అతను కూడా మనిషే. ఆ ప్రీస్ట్‌కి ఆధ్యాత్మిక జ్ఞానం ఉంటే, ఆయన మీకు మార్గాన్ని నిర్దేశించగలడు. మీరు 'ఒప్పుకున్నపుడు' మీరు మీ ఉపచేతనాత్మక మనస్సు ముందు తప్పు చేశానని చెబుతున్నారు. మారడానికి సాయం చేయమని దానిని కోరుతున్నారని అర్థం చేసుకోండి.

భూలోకంలో 'పశ్చాత్తాపం' అనే పదాన్ని కూడా చాలా తప్పుగా అర్థం చేసుకుంటారు.

పశ్చాత్తాపం అంటే చేసిన కర్మలకు విచారించడం మాత్రమే కాదు; నిజంగా మారి, చేసిన తప్పును దిద్దుకొనడం, మళ్ళీ ఎన్నడూ ఆ తప్పులు చేయకుండా ఉండడం. ఆత్మ నుంచి మాత్రమే మానవ సత్తను మెరుగుపరచుకొనే అవకాశం ఉంటుంది. ఎవరూ ఆ ఆత్మను ఆధ్యాత్మికంగా ఎదగమని బలవంతం చేయలేరు. ఇది ఆ ఆత్మకు ఎంత మంచిదైనా సరే అలా చేయలేరు. ఇది సంకల్పస్వేచ్ఛా నియమం. దేవుని సహాయకులకు ఆ ఆత్మ నిజంగా బాగుపడాలని కోరుకుంటే తెలుసుకొనే శక్తి ఉంది. అంటే ఆత్మలోకంలోని ఆత్మలకు మారాలని ఒక ఆత్మ తీసుకునే నిర్ణయంలోని బలహీనతగాని, శక్తిగాని నిర్ణయించే శక్తి ఉంటుంది. ఆధ్యాత్మిక ప్రగతికి హృదయ పూర్వకంగా మారాలనుకోవడమే కీలకం; అప్పుడు మాత్రమే ఉపచేతనాత్మక మనస్సు వెలుగువైపు ఆత్మను నడిపించగలదు.

ఉపచేతనాత్మక మనస్సును తెరవడం ఎలా?

ఆధ్యాత్మికంగా ఎదగడానికి మనిషి చేయవలసిన ముఖ్యమైన పని **ఉపచేతనాత్మక మనస్సును తెరవడం.** ఉపచేతనాత్మక మనస్సును తెరవడానికి చేయవలసిన పనులు:

1. ప్రార్థించడం.

ఉపచేతనాత్మక మనస్సును తెరవడానికి సాయం చేయమని దేవుని ప్రార్థించండి:

"సర్వశక్తిమంతుడైన భగవంతుడా, నీ మంచి మార్గానికి నాకు దారిచూపు. మంచి పనులు చేసేలా చెయ్యి. నాకున్న తప్పుడు కోర్కెలు, భావాలు పోగొట్టుకొనేలా సహకరించు. నీ వివేకాన్ని నాకు ప్రసాదించు; నీ వెలుగు మార్గాన్ని చూపించు నాకు. ఎన్నడూ తప్పు చేయకుండా నా ఉపచేతనాత్మక మనస్సును మేల్కొలపటానికి నాకు సాయం చెయ్యి. ఓ సర్వశక్తిమంతుడైన భగవంతుడా, దయచేసి నాకు సాయం చెయ్యి."

2. మనస్సును ఖాళీగా ఉంచండి ("మనస్సును ఖాళీగా ఉంచడం ఎలా?" 157 పుటను చూడండి)

మీకు ఎలాంటి ఆలోచనలూ ఉండకూడదు. మనస్సు పూర్తిగా ఖాళీగా ఉంచాలి. ఒకవేళ మనసులో ఆలోచనలు తలెత్తినా వాటి మానాన వాటిని ఉండనీయండి - వాటిని వదుల్చుకోవాలని గాని, వాటి గురించి ఆలోచించడంగాని చేయవద్దు. సానుకూల స్పందనలున్న ప్రదేశాలలో 2 నిముషాలకన్న ఎక్కువసేపు మీ మనస్సును ఖాళీగా ఉంచవద్దు. ఆ ప్రదేశంలో సానుకూల స్పందనలున్నాయో, వ్యతిరేక స్పందనలున్నాయో తెలుసుకొనడానికి అంతఃప్రేరణతో తెలుసుకొనడానికి ప్రయత్నించండి. వ్యతిరేక స్పందనలున్నాయనిపించిన చోట ఒక్క నిముషంకన్న ఎక్కువసేపు మనసును ఖాళీగా ఉంచకండి. సూర్యోదయానికీ, సూర్యాస్తమయానికీ మధ్యకాలంలోనే మనసుని ఖాళీగా ఉంచండి.

3. ఉపచేతనాత్మక మనస్సుతో మాట్లాడండి.

ఉపచేతనాత్మక మనస్సుతో మాట్లాడడం ద్వారా మీరు దాని ఉనికిని గుర్తిస్తున్నారు. తర్వాత దానికి పూర్తిగా లోబడి ఉండండి. మీకు మార్గదర్శకంగా ఉండమని దానిని కోరండి.

4. ఉపచేతనాత్మక మనస్సు ఇచ్చే సలహాను వినండి.

వినడం అంటే అది చెప్పిన దానిని పాటించడం. అది చెప్పిన సలహాను పాటించి ప్రతిసారి మీరు దానిని బలోపేతం చేస్తున్నారు దాని సలహాను పెడచెవిన పెట్టిన ప్రతిసారి మీరు దానిని బలహీనపరుస్తున్నారు.

5. భౌతిక మనస్సును అదుపులో ఉంచండి. మీరు దానికి యజమాని అని, బానిస కాదని చెప్పండి.

భూలోకంలో మీ భౌతిక మనస్సు 100 శాతం తెరచుకొని ఉంటుంది. కాని సగటు మనిషిలో ఉపచేతనాత్మక మనస్సు 1 శాతం నుంచి 2 శాతం మాత్రమే తెరచుకొని ఉంటుంది. ఒకవేళ మీరు చాలా బాగా సదాత్ములైతే భూలోకంలో మీ ఉపచేతనాత్మక మనస్సు గరిష్టంగా 7 శాతం నుంచి 9 శాతం వరకు తెరుచుకొని ఉంటుంది. అందువల్ల ఉపచేతనాత్మక మనస్సు లేశమాత్రంగా తెరచుకొని ఉన్నా, మీరు తలచుకుంటే అది భౌతికమనస్సును నియంత్రించగలదు. ఆత్మ 7వ ఆవరణ 9వ దశకు చేరినా ఉపచేతనాత్మక మనస్సు 20 శాతం మాత్రమే తెరచుకొని ఉంటుంది. మీరు మరో విశ్వంలో పరిణామం చెందుతూ ఉంటారు. 7వ విశ్వంలోని తుది దశలో మాత్రమే మీ ఉపచేతతనాత్మక మనస్సు పూర్తిగా (100 శాతం) తెరచుకొంటుంది. అప్పుడే మీరు దైవాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలరు. ఆయన సమక్షంలో నివసించగలరు.

మనస్సును ఖాళీగా ఉంచడం ఎలాగో తెలిపే సూచనలు కింద ఇచ్చాం:

సూర్యోదయం తరవాత, సూర్యాస్తమయానికి ముందు మాత్రమే మనస్సును ఖాళీగా ఉంచడం ముఖ్యం. ఎందుకంటే, సూర్యాస్తమయం తరవాత భూలోకంలో స్పందనలు మారి మరింత వ్యతిరేకమవుతాయి. ఈ చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే మీరు మరింత ప్రశాంతంగా ఉంటారు.

1. రక్షించమని, ఉపచేతనాత్మక మనస్సుని తెరవడానికి సాయపడమని దేవుడిని మీకు తోచిన విధంగా వేడుకోండి.

2. మీకు తోచిన విధంగా ఎలాగైనా క్లుప్తంగా, హృదయపూర్వకంగా ప్రార్థించండి.

3. మనస్సును ఖాళీగా ఉంచండి. మనస్సును ఖాళీగా ఉంచడానికి, సుదూరంగా ఉన్న శబ్దాలను వినడం మంచిది. దేనినీ విశ్లేషించకండి. ఆలోచన వస్తే రానీయండి, అదేపోతుంది. బలవంతంగా దానిని దూరం చేయాలని ప్రయత్నించవద్దు. ప్రశాంతంగా ఉండండి.

4. సానుకూల స్పందన ఉన్నచోటే 2 నిముషాలు మనసును ఖాళీగా ఉంచండి. వ్యతిరేక (చెడు) స్పందనలున్నచోట మీ మనసును ఒక నిముషం కన్న ఎక్కువసేపు ఖాళీగా ఉంచకండి. ఇది మీ రక్షణ కోసమే.

5. సర్వశక్తిమంతుడైన భగవంతుడికి కృతజ్ఞతలు అర్పించండి. క్లుప్తమైన, హృదయ పూర్వకమైన ప్రార్థనతో ముగించండి.

6. మనస్సును ఖాళీగా ఉంచే సమయాల మధ్య కనీసం మూడు గంటల వ్యవధి ఉండాలి.

7. మనస్సును ఖాళీగా ఉంచేటప్పుడు దక్షిణం వైపుకు ముఖం ఉండకూడదు. ఉత్తరం వైపుకు ఉంటే మంచిది.

8. చుట్టూ జనం ఉంటే, తెలియకుండా వ్యతిరేక (చెడు) స్పందనలకు లోనవుతారు కనుక అప్పుడు మనస్సును ఖాళీగా ఉంచే ప్రయత్నం చేయవద్దు.

9. సహజమైన వెలుగు తప్పనిసరిగా ఉండేలా చూసుకోండి. కొవ్వొత్తి, దీపం వంటివి మీకు దగ్గరగా ఉంటే మంచిది. మనసును ఖాళీ చేస్తున్నప్పుడు వెలుగు మిమ్మల్ని రక్షిస్తుంది.

సరైనది ఎంపిక చేసుకునే మార్గదర్శకత్వం మీకు లభిస్తుంది. సరైన పని చేసే శక్తి లభిస్తుంది. మీ ఆలోచనలను సకారాత్మకమైన ఆధ్యాత్మిక క్రియగా మలచుకొనే శక్తి లభిస్తుంది.

ఉపచేతనాత్మక మనస్సుకు, భౌతిక మనస్సుకు మధ్య ఉన్న తేడాలను కింద చూపాం. ఈ రెండు మనసుల మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోండి. ఏ మనసు మాట వినాలో, ఏ మనసుకు శిక్షణ నివ్వాలో మీకు అర్థమవుతుంది.

ఉపచేతనాత్మక మనస్సు	భౌతిక మనస్సు
దీనినే అంతరాత్మ, ఉన్నత మనస్సు, ఉన్నత ఆత్మ అని కూడా అంటారు.	దీనినే చేతనాత్మక మనస్సు అని కూడా అంటారు.
ఆధ్యాత్మికం	భౌతికం
ఆంతరిక చేతనాత్మక మనస్సు అవగాహన అనంతం	బాహ్య, చేతనాత్మక మనస్సు అవగాహన పరిమితం
శాశ్వతం	తాత్కాలికం
సత్యాన్ని చెబుతుంది. స్థిరంగా ఉంటుంది.	సత్యాన్ని చెప్పకపోవచ్చు స్థిరంగా ఉండదు.
నిస్వార్థమైనది	చాలావరకు స్వార్థపూరితం
ఉపచేతనాత్మక మనస్సు	భౌతిక మనస్సు
ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది	ఆందోళనగా, అస్థిరంగా ఉంటుంది
దేవుడి ఉనికికి రుజువులు కోరదు	రుజువులు కావాలి. దేవుని ఉనికిని నిరంతరం సందేహిస్తూ ఉంటుంది.
సరైన పని చేసే వరకూ సహనంతో ఉంటుంది.	వదిలేస్తుంది. సులభంగా జరిగి పోవాలనుకుంటుంది. చెడు ఆలోచనలు, పనులను సమర్థిస్తుంది.
ఆత్మలోకంతో సంబంధం కలిగి ఉంటుంది.	భూలోకానికి పరిమితం
ఆంతరిక శక్తినిస్తుంది దురాకర్షణలకు దూరంగా ఉండేలా సాయపడుతుంది.	బలహీనపరుస్తుంది దురాకర్షణకి లొంగిపోతుంది
తనంతటతాను ఆలోచించి గ్రహిస్తుంది. భౌతిక ప్రపంచంపై ఆధారపడదు.	పూర్తిగా భౌతిక ప్రపంచంపై ఆధారపడుతుంది.

సంకల్పస్వేచ్ఛ



"మీ పరిణామాలకు మీరే సృష్టికర్త."

"నిజమైన స్వేచ్ఛ అంటే, సరైన పని చేసే స్వేచ్ఛ మీకు ఉన్నదని అర్థం"

"దురాకర్షణను, చెడును వదలడానికి సంకల్పస్వేచ్ఛనుపయోగించడానికి మీరు భూలోకంలో ఉన్నారు".

"దేవుడు మీకు సంకల్పస్వేచ్ఛను, ఎంపిక చేసుకునే స్వాతంత్ర్యాన్ని ఇచ్చాడు. తెలివైన ఆత్మ తన స్వేచ్ఛను చెడును వదిలి మంచిని ఎంపిక చేసుకోవడానికి ఉపయోగించుకొని ఆధ్యాత్మికంగా నిరంతరం పురోగమించడానికి ప్రయత్నిస్తుంది".

"భూలోకంలో తాత్కాలికంగా దొరికే సంతోషం కోసం చెడు మార్గంలో నడవకండి, దీనివల్ల ఆత్మలోకంలో వందలాది ఏళ్ళు కింది ఆవరణలలో బాధలనుభవిస్తూ ఉండాల్సి వస్తుంది".

భూలోకంలో మన జీవితానికీ, సంకల్పస్వేచ్ఛకు ఉన్న సంబంధమేమిటి?

మీకు సంకల్పస్వేచ్ఛ ఉన్నదంటే, మీ మనస్సు, శరీరము, ఆత్మ మీ అదుపులో ఉన్నాయని, మీ చర్యల పరిణామాలను మీరు అనుభవించాలని అర్థం. భూలోకం ఒక పాఠశాల, ఆత్మలోకం నుంచి మీ కర్మను చెల్లించుకోడానికి, పరీక్షింపబడటానికి, శిక్షణ పొందడానికి మీ ఆధ్యాత్మిక ధ్యేయాన్ని పూర్తి చేసుకోవడానికి మీరు వచ్చారు. దీనినెలా అనుభవిస్తారో అది పూర్తిగా మీ ఇష్టం. మీకెదురయ్యే సవాళ్ళను చిరునవ్వుతో ధైర్యంగా ఎదుర్కోవచ్చు లేదా ఫిర్యాదు చేస్తూ మీ మీద మీరే జాలిపడుతూ ఉండవచ్చు. శక్తిమంతమైన నైతిక అవకాశాలు కల్పించుకుంటూ ఆత్మను మెరుగుపరచుకోవచ్చు లేదా ప్రలోభానికి లోనై అహాన్ని తృప్తిపరుస్తూ ఈ ప్రక్రియలో భాగంగా ఆత్మను బలహీనపరుచుకోవచ్చు. మీరు ఎంపిక చేసుకొనే అవకాశాలు మిమ్మల్ని దైవానికి దగ్గర చేయడమో, దూరం చేయడమో చేస్తాయి. ఆత్మను పెంపొందించుకొనడమో, నాశనమవుతుంటే చూడడమో మీ చేతిలోనే ఉంది. మీ పరీక్షలలో పాసుకావడమో, ఫెయిలవడమో మీ ఇష్టం. మీ

పరిణామాలకు మీరే సృష్టికర్త. భూలోకంలోను, ఆత్మలోకంలోను మీరు ఎంపిక చేసుకొనే విధానాలను బట్టే మీ ఆత్మప్రగతిని మీరు నిర్ణయించుకోగలరు.

సంకల్పస్వేచ్ఛ భూలోకంలో పునర్జన్మించాలని ఆత్మలోకంలో ఉన్న ఆత్మ నిర్ణయించుకొన్నప్పుడే పనిచేయడం మొదలవుతుంది. భూలోకంలో జీవించడం ప్రమాదం. కాని ఈ ప్రమాదాన్ని మీరు ఎంపిక చేసుకున్నారు. మేము మీలో ఎవరినీ భయపెట్టాలనుకోవడం లేదు. కాని భూలోకంలోని ఆత్మలను జాగ్రత్తగా ఉండమని కోరుతున్నాం. చెడుకు మిమ్మల్ని పాలించే శక్తి ఎంతగా ఇస్తే అంతగా ఆధ్యాత్మిక మార్గంలో నడవడం మీకు కష్టమవుతుంది. చెడు భూలోకంలోనే ఉంటుంది ఎందుకంటే మీరు దానిని ప్రతిఘటించగలరు గనుక. ఆ రకంగా మీరు ఆధ్యాత్మిక శక్తిని పొందగలరు. మీ ఆత్మస్ఫూర్తిని మీరు ఆచరణలో పెట్టకపోతే, భౌతిక మనస్సుతో పనిచేస్తూ, బలహీనమైన నైతిక ఎంపికలు చేసుకుంటారు. ఒక్క బలహీనక్షణం జీవితకాలానికి సరిపడా పరిణామాలు కల్పించగలదు. తప్పుడు మార్గంలో వేసే ఒక్క అడుగు మిమ్మల్ని మంచి మార్గంలోకి రానీయకుండా ముప్పుతిప్పలు పెడుతుంది. ప్రలోభానికి లోనైతే దారితప్పడం చాలా సులువు. దేవుడి పేరు మీద, మతం పేరు మీద కొన్ని ఆత్మలు భయంకరమైన తప్పులు చేశాయి. తమ కుటుంబాలకే హానిచేసిన, ఇంకా చేస్తున్న ఆత్మలెన్నో ఉన్నాయి. పిల్లలను, వృద్ధులను హింసిస్తున్న ఆత్మలెన్నో ఉన్నాయి. ఈ ఆత్మలు నిమ్నాతినిమ్న ఆవరణలలో ఉంటాయి. రెండు ప్రధాన కారణాల వలన అవి ఆధ్యాత్మికంగా ఎదగలేవు. మొదటిది వారు చేసే పనుల వల్ల వారి ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణమైపోవడం. రెండవది, ఈ ఆత్మలు నిమ్నాతి నిమ్న ఆవరణలలో ఉండడం వల్ల ఇటువంటి ఆత్మలే ఈ ఆత్మల చుట్టూ ఉంటాయి – భూలోకంలో కూడా ఆత్మలోకంలో వలెనే ఉంటుంది. తమ సంఖ్య పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో ఉన్న ఈ ఆత్మలకు (మనుషులకు) తాము బాగుపడాలని గాని, పోనీ ఇతరులు బాగుపడాలని గాని ఉండదు.

ఇతరులను చెడుగా ప్రభావితం చేస్తూనో, బలవంతంగానో, మోసం చేసో తమ చుట్టూ ఉన్న వారి ఆధ్యాత్మిక ఎదుగుదలను వారు ఆపుతారు – ఈ రకంగా సంకల్పస్వేచ్ఛా నియమాన్ని ఉల్లంఘిస్తారు. భూలోకంలో ఇటువంటి పాపాత్మలకు దైవనియమాల పట్ల పూర్తిగా తిరస్కార భావం ఉంటుంది. ఎందుచేతనంటే వారు దైవాన్ని నమ్మకపోవడం, ఆధ్యాత్మికత అంటే అపోహలుండడం. అయితే వారు దైవాన్ని నమ్మినా, నమ్మకపోయినా సరే ఒక విషయం అర్థం చేసుకోవాలి – ఒక మనిషి చనిపోయిన తరవాత, అతని ఉపచేతనాత్మక మనస్సు అతను చేరాల్సిన చోటికి చేర్చేంతగా మేల్కొని, అతనిని అక్కడికి చేరుస్తుంది. ఇది దైవన్యాయం. ఇది అనంతం.

ఈ దేవుడే ఆత్మలన్నిటినీ సృష్టిస్తే, కొన్ని ఆత్మలు పాపాత్మలు ఎందుకవు

తాయి?

జీవించడమంటే ఆధ్యాత్మికంగా ఎదగడం, దేవుడివైపు నడవడం. ఇవిల్ అనే పదం (evil) 'లివ్' అనే పదానికి (live) పూర్తిగా భిన్నమైనది. ఇవిల్ (పాపం) అంటే తిరోగమనం. ఇది ఒక ఆత్మ చేసే వ్యతిరేక ప్రయాణాన్ని అంటే దేవుడికి దూరంగా వెళ్ళడాన్ని సూచిస్తుంది. వ్యతిరేక ఆలోచనలు, పదాలు, పనుల వల్ల ఇది జరుగుతుంది. ఆత్మ నిత్యం. ఎన్నటికీ నాశనం కాదు. కాని అది మసిబారవచ్చు. అనైతిక విధానాలు అవలంబించినపుడు, భూలోకంలో మీరు పరీక్షలలో తప్పినపుడు ఇది మసక బారవచ్చు. మీరు చేసే ఆలోచనలు, మాట్లాడే మాటలు, చేసే పనులన్నీ కలిపే కదా మీరు? మీ ఆత్మ నుంచి పనులను ఎలా విడదీయగలరు? మీరు చేసే పనుల వల్ల మీ ఆత్మ శక్తిమంతం కావడం లేదా బలహీనపడడం జరుగుతుంది. అందువల్ల మీరు వీటిని విడిగా చూడడం కుదరదు.

వ్యక్తులు చెడుమార్గంలో పడిపోయి, తమ పనులను సమర్థించుకుంటారు. బలహీన క్షణంలో ప్రలోభానికి లోనయ్యామని చెబుతారు. ఇంకా "నేనెలా ఉన్నానో మీకు అర్థం కాదు" అంటారు. కాని అనైతికమైన పనులకు పరిస్థితులను సాకుగా వాడుకోరాదు. మీరు చేసిన పనులన్నిటికీ మీరు బాధ్యత వహించాలి. మీరు వర్తమానంలో ఉన్నారు. వర్తమానంలో మీరిప్పుడు చేసే పనులను మీ నుంచి విడిగా ఉంచలేరు. ఈ క్షణంలో మీరు తప్పుదారిలో ఉంటే, గతంలోకి చూసి అప్పుడెప్పుడో మంచి వ్యక్తిగా ఉన్నానని చెప్పలేరు. మీరు వర్తమానంలో జీవిస్తున్నారు. దానికనుగుణంగానే ఉపచేతనాత్మక మనస్సు తీర్పు ఉంటుంది. అప్పుడు కర్మ మీదే, ఇప్పుడు కర్మ మీదే, మీరాలోచించేది, మాట్లాడేది, చేసేదాని ఫలితాన్ని బట్టి మీరుంటారు.

ప్రతివారికీ సాయం చేయడం దైవత్వం అంటారు. **మీతోటి వారికి సాయం చెయ్యడం మంచిది. కాని మీతోటి వారందరికీ మీరు సాయం చెయ్యలేరు ఎందుకంటే చాలామంది పూర్తిగా వ్యతిరేక (చెడ్డ) దృక్పథం కలిగి ఉంటారు.** చెడుగా ఎవరున్నారో, ఎవరు లేరో నిర్ణయించడం మీ పని కాదని, అది తీర్పు చెప్పడం అవుతుందని మీరనుకోవచ్చు. తీర్పులు చెప్పవద్దు. కాని మీ విచక్షణను ఉపయోగించండి.

తేడా చాలా సులభం. మరో మనిషి మంచివారా కాదా అని మీరు విశ్లేషించు తున్నప్పుడు వారిని తక్కువ చెయ్యాలని ఆత్మాధిక్యతను ప్రదర్శించడం కాదు, జాగ్రత్తంగా ఉండడం కోసం చేస్తున్నారు. ఇది మీ ఆత్మను, మీ చుట్టూ ఉండే ఆత్మలను రక్షించుకొనడానికి దేవుడిచ్చిన ఆధ్యాత్మిక అంతఃప్రేరణ చెడు ఆత్మలకు సాయం చేయడం వలన వారికి మీరు మనుగడ నిస్తున్నారు. అంటే చెడు పనులు చేసే అవకాశం కలిగిస్తున్నారు. వారిని ప్రోత్సహిస్తున్నారు. అలా చేస్తే నైతికంగా ఒక నిర్ణయానికి కట్టుబడకుండా

ఉంటున్నారు కనుక ఆధ్యాత్మికంగా మీరు కిందిస్థాయికి పడిపోతారు. చెడ్డ ఆత్మకు మీరు సాయం చెయ్యవలసిన ఒకే ఒక్క సమయం ఎప్పుడంటే – వారు తాము చేసిన పనులకు నిజాయితీగా, హృదయపూర్వకంగా పశ్చాత్తాపం చెంది బాగుపడాలని కోరుకున్నప్పుడు మాత్రమే. అప్పుడు వారిని ఆ చెడు ప్రభావం నుంచి బయటపడవేసి, ఉన్నత స్థాయికి పురోగమించేలా చేయవలసిన బాధ్యత మీదే. **మంచి తీర్పు సత్యసంబంధమైంది; అన్నిటిపైన తీర్పులు చెప్పడం అహానికి సంబంధించినది.** భూలోకంలో మీరు ఎంచుకునే మార్గాలు ఆత్మలోకంలో మీ ఇంటికి పునాదులు. భూలోకంలో, భౌతిక మనస్సుకు బానిసగా ఉండడమో, ఉపచేతనాత్మక మనస్సుకు విద్యార్థిగా ఉండడమో మీరే నిర్ణయించుకోవాలి. సంకల్పస్వేచ్ఛ అనే కానుక మనది. దాన్ని తెలివిగా వాడుకోవాలి.

కర్మ



"నాటిన విత్తనాన్ని బట్టి పంట ఉంటుంది"

"కర్మ అంటే శిక్ష కాదు – నేర్చుకొనడం. గుడ్డిగా శిక్షించే నియమం కాదిది. మీరెక్కడ తప్పు చేశారో చెప్పి, ఆత్మస్థాయిలో మీ తప్పును, అర్థం చేసుకొనేలా చేసేది"

"క్షమించడం అనే దానికి అర్థం లేదు"

"దైవ న్యాయం పరిపూర్ణమైంది – ఎవరూ దీనిని తప్పించుకోలేరు"

"ఇతరుల సంతోషాన్ని మీరు చూడలేకపోతే, మీరూ సంతోషంగా ఉండలేరు"

కర్మ అంటే ఏమిటి?

మనం ఏ విత్తనం నాటితే, అదే పంటను పొందుతాం అనే సూత్రంపై ఆధారపడినది కర్మ. కార్యము కారణము అనే పదాలతో దీనిని వివరించవచ్చు. కార్యము మీ పనులను చెబితే కారణం మీ పనుల పరిణామాలను చెబుతుంది. కర్మ అంటే మీరు చేసిన అప్పు కావచ్చు లేదా మీరు పొందే ఆశీస్సు కావచ్చు. రెండు రకాల కర్మ లుంటాయి. సానుకూలం, వ్యతిరేకం. వ్యతిరేక లేదా చెడు కర్మ మీరు చేసే చెడు పనులకు మీరు ఎదుర్కోవాల్సిన పరిణామాలకు సంబంధించినది. సానుకూల లేదా మంచి కర్మ మీరు చేసే మంచి పనులకుగాని, నిస్వార్థమైన పనులకుగాని మీకు లభించే ఆధ్యాత్మిక ఆశీస్సులకు సంబంధించినది.

దేవుడు తాను సృష్టించిన విశ్వాన్ని పాలించడానికి కొన్ని నియమాలు పెట్టాడు. ఆయన సృష్టిలోని వారందరికీ ఈ నియమాలు పాటించాల్సిన బాధ్యత ఉంది. ఇది వారి బాధ్యత కాని ఏదీ చేయమని ఎవరినీ బలవంతం చేయడం ఉండదు – ఇదే సంకల్పస్వేచ్ఛ స్వభావం. అందువల్ల ఏం చేయాలనుకున్నా మీ ఇష్టం. కాని దేవుడి నియమాలు పాటించకూడదని అనుకున్నా మీరు వాటికి లోబడే పనిచేస్తారు. ఆధ్యాత్మిక నియమానికి అతీతమైన ఆత్మ ఏదీ ఉండదు.

కర్మ ఎలా పనిచేస్తుంది? మంచి కర్మ, చెడు కర్మ ఒకదానినొకటి కొట్టివేయగలవా?

ఈ రెండూ ఒకదానినొకటి కొట్టేయలేవు. చెడ్డ పనులకు మీ కర్మను మీరనుభవించాలి. మంచి కర్మలకు ఆధ్యాత్మిక ఆశీస్సులు మీకు అందుతాయి. మంచికర్మ, చెడుకర్మ పూర్తిగా వేరు. ఆలోచనల మూలంగా కూడా వ్యక్తి కర్మను పోగుచేసుకోవచ్చు. కర్మ అంటే కేవలం పనులే కాదు, ఆలోచనలు, మాటలు కూడా. మూడు కలిసే ఉంటాయి.

వ్యక్తి చెడుకర్మను ఎలా అనుభవిస్తాడు?

ఇది మానసిక, భౌతిక, ఉద్వేగాత్మక నొప్పిగానో, ఆరోగ్యం, కుటుంబం, ధనం, చట్టం మొదలైన సమస్యల రూపంలోనో అనుభవానికొస్తుంది. మీ కర్మ రుణాన్ని అనారోగ్య రూపంలో మీరు చెల్లించుకోవాలని మీరు అనుకొని ఉండవచ్చు. చెడు కర్మ వెనుక ఉన్న ఉద్దేశ్యమిదే – ఈ ప్రాపంచిక జన్మను రుణం చెల్లించుకోవడానికి మీరు ఉపయోగించుకుంటున్నారు. ఈ రుణం మీరు గత జన్మలలో చేసింది మాత్రమే కాదు, ఈ జన్మలో కూడా చేసి ఉండవచ్చు. గత జన్మల చెడు కర్మలకు మాత్రమే రుణం చెల్లిస్తున్నామని అనుకోవద్దు. మీరు భూలోకానికి వచ్చినప్పుడు అనుభ వించాల్సిన కర్మ కొంచెమే ఉండవచ్చు, కాని ఇప్పుడు చెడు మార్గంలో ఉంటే, చెడు కర్మను మళ్ళీ పోగు చేసుకుంటున్నారని అర్థం. కర్మను అర్థం చేసుకొనడం వలన మనుషులకు ఎంతో ఉపయోగం కొన్నిసార్లు కలిగే బాధ ఎందుకో మీకు అర్థం కాదు. ఈ బాధ మీరు కోరుకున్నదే. ఇది మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు అత్యవసరం. ఇది తెలిస్తే మీరు ఈ బాధను హుందాగా అనుభవిస్తారు. మీరు చేసిన తప్పులు దిద్దుకునే అవకాశం వస్తే ఎన్నడూ వదిలిపెట్టవద్దు. భూలోకంలో ఈ జీవితంలోనే గత సమస్యలను పరిష్కరించుకొనే అవకాశం రావడం అదృష్టం. దానిని అహంకరించి దూరంగా తోసెయ్యకూడదు. ప్రతి వ్యక్తితోనూ ఈ జన్మలోనే కర్మను పరిష్కరించు కోవాలి. ఈ రకంగా చేస్తే కర్మను సులభంగాను, త్వరితంగాను అనుభవించడం జరుగుతుంది. మరో జన్మలో అనుభవిద్దామని నిరీక్షించడం కన్న ఇది ఎంతో మేలు. ఇప్పుడు చేసిన తప్పును ఇప్పుడు దిద్దుకొనకపోతే, మీ చెడు కర్మ పెరుగుతుంది. దేవుడిచ్చిన అవకాశాన్ని మీరు తిరస్కరించారు కదా.

చెడు కర్మను దానధర్మాలు చేసి పోగొట్టుకోవచ్చునని చాలామంది భావిస్తారు. నిజమా?

కాదు. మీరెన్ని దానధర్మాలు చేసినా చేసిన పాపానికి ఫలితం అనుభవించవలసిందే. ఈ పద్ధతిలో ఎన్నడూ కర్మను తుడిచి వెయ్యలేరు. వేలాది రూపాయలు దానధర్మాలు

చేస్తే స్వర్గానికి వెళతామని చాలమంది అనుకుంటారు. మీరు మంచి పని చేస్తున్నప్పుడు ఈ భావం ఉంటే, స్వర్గాన్ని చూడాలనే కోరిక మర్చిపోవచ్చు. మీ లోకంలో ఎంతో తెలివైన న్యాయమూర్తులు చెప్పిన తీర్పులు కూడా అన్నివేళలా సరైనవి కాకపోవచ్చు, కాని దైవ నియమాలు నిర్దుష్టం. ఈ న్యాయం కర్మరూపంలో మీకు లభిస్తుంది. మీతోటి మనిషి నుంచి మీరేదైనా దాయగలరు. అది దాగి ఉండవచ్చు. కాని దేవుడి నుంచి ఏదీ దాచలేరు. ప్రతి ఆలోచన, పదం, పని అన్నీ మీ ఉపచేతనాత్మక మనస్సు ఆకాశిక్ రికార్డులో రాసి ఉంచుతుంది. మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇది నిజం.

"మీ సమస్యలన్నిటినీ ధైర్యంగా, చిరునవ్వుతో ఎదుర్కొనండి" అని మీరు చెప్పారు కదా. మనుషులు బాధపడుతున్నపుడు ఇదెలా సాధ్యం?

మీ కష్టాలను ధైర్యంగా చిరునవ్వుతో ఎదుర్కొనడం చాలా ముఖ్యం ఎందుకంటే కర్మను చెల్లించాల్సిందే. దానికి విసుగు పనికి రాదు. ఫిర్యాదు చేయడం, గొణుక్కోవడం, మీమీద మీరే జాలిపడడం, నిస్పృహ చెందడం వలన మీ బాధను ఎక్కువచేసికొని మీ ఆత్మీయులు, మీకు సాయం చేయాలనుకొనేవారి జీవితాలను దుర్భరం చేస్తారు. మీరు మీ కర్మను అనుభవించడం లేదు సరికదా దానికి మరింత చెడు కర్మను కలుపుతున్నారు. ఒకవేళ మీరు కర్మను చెల్లిస్తున్నా, ఈ చెల్లింపు నిదానంగా జరుగుతుంది. మీ బాధ ఎప్పటికీ తగ్గనట్లు అనిపిస్తుంది. మీ బాధను ఇలా పీడగా మార్చుకుంటున్నారు మీరు. కాని మీరు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటే, ధైర్యాన్ని ప్రదర్శిస్తూ ఆత్మను బలోపేతం చేసుకుంటున్నారు. ఆ సమస్యల స్వభావం మీకు తెలుసు. ఆ సమస్యలను ఉన్నతమైన ఆధ్యాత్మిక దృక్కోణంలో మీరు పరిష్కరించుకుంటున్నారు. అందువల్ల సమస్యలు వచ్చినా చిరునవ్వుతో ఎదుర్కొనండి. ఆశావహ దృక్పథంతో ఉండండి. బాధను హుందాగా భరించండి. హుందాగా ప్రవర్తించడం అంటే గౌరవంగా ఉంటూ దైవం పట్ల, ఆయన న్యాయం పట్ల నమ్మకం కలిగి ఉండండి. పరిస్థితిలోని ప్రాముఖ్యాన్ని గుర్తించి, హాస్య చతురతతో వ్యవహరించండి. క్లిష్టమైన పరిస్థితుల్లో మామూలుగా ఉండండి. ఇలా చేస్తే మీరు మీ కర్మను అనుభవించడానికి, ఆత్మలోక ఆత్మలు సాయం చేయడానికి వీలవుతుంది. మీరు ధైర్యాన్ని, హుందాతనాన్ని ప్రదర్శిస్తే, ఎవరినీ నిందించకుండా, కోపాన్ని, వ్యతిరేకతను చూపకుండా మీకు కలిగే సమస్యలను ఆధ్యాత్మిక పద్ధతిలో పరిష్కరించుకొనే సామర్థ్యం మీకు ఉందని దేవుడికి మీరు తెలియజేస్తున్నారు. ఉపచేతనాత్మక మనస్సు చెప్పినట్లుగా మీరు పనిచేస్తున్నారు, సమస్యల నెదుర్కొనే శక్తిని మీకు ఇవ్వమని ఆత్మలోక ఆత్మలు ప్రార్థిస్తాయి. ఆత్మలోక ఆత్మలు మీ సమస్యలు దూరం చెయ్యలేవు కాని ఆత్మలోకం నుంచి లభించే రక్షణ, వారు చేసే ప్రార్థన ద్వారా మీకు మరింత శక్తి లభిస్తుంది. దానితో సమస్యలను పరిష్కరించుకుంటూ, కర్మను సులువుగాను, త్వరితంగాను చెల్లించుకోగలుగుతారు. దీని అర్థం మీ కర్మ తగ్గిపోతుందని

కాదు; దీనిని త్వరితంగా, ఇంకా బాగా చెల్లించుకోవడానికి తగినంత శక్తి, వివేకం మీకు లభిస్తాయని అర్థం.

☺ కొన్నిసార్లు మనుషులు అనూహ్యమైన బాధకు లోనవుతారు. అప్పుడు "చేసుకున్న దాని ఫలితం అనుభవిస్తున్నాను. నాకిలా జరగాల్సిందే" అనుకోవడం క్రూరంగా అనిపిస్తుంది.

అవును. మీరు చెప్పేది మాకు అర్థమైంది. మిమ్మల్ని మీరు నిందించుకోవాలని మేము అనడం లేదు. ఆత్మలోక నియమాలు తెలుసుకొని ఉండాలని కోరుతున్నాం - మనుషులకు వారు ఎంపిక చేసుకొనే మార్గాలను బట్టి కొన్ని పరిస్థితులు ఎదురవుతాయి. అంటే మీకు జరిగే చెడు అంతా మీ తప్పుల మూలంగా జరుగుతుందని కాదు. మీకున్న అవగాహన లోపం వల్ల అలా జరుగుతుంది. ఆ సమయంలో తప్పు చేస్తున్నామని మీకు తెలియకపోవచ్చు లేదా, అది తప్పని తెలిసినా, సరైన విధంగా చేసే శక్తి మీకు లేకపోయి ఉండవచ్చు. ఏది ఏమైనా, మనుషులు ఒక్కోసారి తమ కర్మ కాకపోయినా, అనూహ్యమైన కష్టాలు అనుభవించే పరిస్థితులు ఉంటాయి. మరొక మనిషి తన సంకల్ప స్వేచ్ఛను తప్పుగా ఉపయోగించి ఇంకొకరికి హాని చేయాలని అనుకోవడం వల్ల ఇలా జరుగుతుంది. దురదృష్టవశాత్తు, భూలోకంలో పునర్జన్మించడం వలన వారెదుర్కొనే ఇబ్బంది ఇది. దీనికున్న ఒకే ఒక పరిష్కారం ధైర్యంగా ఉండడం, దేవుడిని నిందించకుండా ఉండడం. రక్షించమని, ఉపశమనం కలిగించమని దేవుడిని ప్రార్థించాలి. కొన్నిసార్లు చెడుకర్మను గురించే కాకుండా, జీవితంలో జరిగే మంచి విషయాలను గురించి కూడా మనుషులు భయపడతారు. ఏ క్షణంలో అయినా ఇదంతా పోతుందని భయపడుతూ ఉంటారు. చెడుకర్మను ధైర్యంగా అనుభవించడం ముఖ్యం. అలాగే మంచికర్మను హుందాగా అంగీకరించడం కూడా అంతే ముఖ్యం. తమకు జరిగే మంచి విషయాలను ఎలా అంగీకరించాలో తెలియని మనుషులు ఎంతోమంది ఉన్నారంటే ఆశ్చర్యం కలగకమానదు.

అన్నిటికన్న ముందు, **మీ జీవితంలో జరిగే మంచికి దేవుడికి కృతజ్ఞతలు చెప్పండి.** ఇది చాలా చాలా ముఖ్యం. భూలోకంలో పరిస్థితులు బాగా లేనపుడు వ్యక్తులు దేవుడిని సాయం చేయమని వేడుకుంటారు. అంతా బాగున్నప్పుడు దేవుడిని మర్చిపోతారు. బాధలలో ఉన్నపుడు దేవుడిని స్మరిస్తే, బాగున్నపుడు కూడా దేవుడిని స్మరించండి. ఆనందాన్ని ఆయనతో పంచుకోండి. మనందరం ఆయన బిడ్డలమే కదా. మనం ఆధ్యాత్మికంగా ఎదుగుతున్నప్పుడు గాని, మన ధ్యేయాన్ని పూర్తి చేసినపుడుగాని ఆయన సంతోషిస్తాడు. మనం భరించగలిగేటంత ఆనందాన్ని, ఆశీస్సులను ఆయన మనకివ్వాలనుకుంటాడు.

రెండవది, మీ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు చెప్పండి - మీ కుటుంబం, స్నేహితులు, ఇంకా మీకు సాయం చేసిన వారికి - ఆత్మలోకంలోని మీ దేవదూతలకు వారికి కృతజ్ఞతలు చెప్పడం ముఖ్యం. మీకు తెలియకుండానే మీ దేవదూతలు ఎన్నోసార్లు హాని జరక్కుండా మిమ్మల్ని కాపాడారు. మీకు అత్యవసర సమయంలో ఎంతో సాయం చేశారు. అందువల్ల వారికి కృతజ్ఞతలర్పించండి. వారిని ఆశీర్వదించమని దేవుని ప్రార్థించండి. భూలోకంలోని ఆత్మలు ఆత్మలోకంలోని తమ ప్రియతములను తమ ఆత్మమార్గదర్శులను, ఇతర దేవదూతలను ఆశీర్వదించమని సర్వశక్తిమంతుడైన భగవంతుని కోరవచ్చు.

మూడవది, మంచికర్మను అనుభవిస్తున్నప్పుడు అపరాధ భావన వేధిస్తుంది. భూలోకంలో అనవసరమైన కారణాలకు మనుషులు అపరాధ భావంతో సతమతమవుతుంటారు. ఇతరులు అపరాధ భావంతో సతమతమయ్యేలా చేసి సంతోషాన్ని పొందేవారు కొందరుంటారు. వారు మీకెంత సన్నిహితులైనా వారికి లొంగకండి. వీరు తమ ప్రయాణాన్ని (జీవితాన్ని) మీ ప్రయాణంతో పోల్చుకుని మీకు జరిగిన శుభాలని గురించి మీరు బాధపడేలా చేస్తారు. మీరు సక్రమమైన మార్గంలో నడుస్తూ ఉండి, మీకు ఏదైనా మంచి జరిగినపుడు, దానికి మీరు తగినవారు కనుక అది మీకు జరిగిందని బాగా స్పష్టంగా గ్రహించండి. మీరెందుకు అపరాధం చేసినట్లుగా భావించాలి? మీకు లభించిన ఆశీస్సులవంటివి మరొకరికి లభించలేదంటే దానికి కారణం ఉండవచ్చు. వారు తమ ఆధ్యాత్మిక ప్రయాణంలో వేరే దశలో ఉండి ఉంటారు, బోలెడంత కర్మను చెల్లించి వేస్తూండవచ్చు లేదా తీవ్రమైన పరీక్షను ఎదుర్కొంటూ ఉండవచ్చు. శిక్షణ పొందుతూ ఉండవచ్చు. వారికి అన్ని రకాలుగా సాయం చెయ్యండి. మద్దతు నివ్వండి. **కాని వారు తమ మీద తాము చూపిస్తున్న జాలికి లొంగిపోవద్దు. మీ జీవితంలో మీకు జరిగిన మంచిని ఎందుకు జరిగిందని అనుకోవద్దు. కొన్ని ఆత్మలు చెడు మార్గంలో ఉండి, తాము చేసిన చెడు కర్మల ఫలితాన్ని అనుభవించవలసి ఉంటుంది.** వారు మంచి మార్గంలోకి వస్తే వారి జీవితాలలో కూడా మార్పు వస్తుంది. ఆత్మలోకంలో వారేది ఎంపిక చేసుకున్నారో మీకు తెలియదు. మీకు జరిగిన మంచిని అనుభవించండి. దానికి కృతజ్ఞులుగా ఉండండి. మీకు లభించిన మంచి అదృష్టానికి కృతజ్ఞత చూపడమంటే దానికి మరో సదాత్మతో పంచుకొనడం, మీ జీవితంలో కచ్చితంగా ఏం జరుగు తుందో వారికి చెప్పనవసరం లేదు; ప్రతి వివరమూ చెప్పనవసరం లేదు. వాస్తవానికి బాగా నమ్మకస్థులైన వారికి తప్ప మంచిని గురించి ఎక్కువగా బయటికి చెప్పకూడదు. లేకపోతే చెడుశక్తిని మీరాకర్షిస్తారు. కాని ఒక మంచి జరిగినందుకు మీరు సంతోషంగా ఉంటే ఆ భావాన్ని చెప్పండి. వారిని కూడా సంతోషపెట్టండి.

మీరు శక్తిమంతులైతే, ఆ శక్తిని ఇతర సదాత్మలను సంతోషపెట్టడానికి ఉపయోగించండి. అందువల్లే మిమ్మల్ని ఆ స్థితిలో ఉంచడం జరిగింది. మీకు లభించే ఆధ్యాత్మిక ఆశీస్సులను అనుభవించండి. వాటిని ఇతర సదాత్మలకు సాయం చెయ్యడానికి ఉపయోగించండి.

ఆ చెడు కర్మను సృష్టించేవి ఏవి?

1. మిమ్మల్ని మీరు బాధించుకొనడం. ఉదాహరణకు, మీ ఆరోగ్యాన్ని సరిగా చూసుకొనకపోవడం. మత్తుమందులు వేసుకోవడం, పొగతాగడం, మద్యం తాగడం, అతిగా తినడం, పోషకాహారం తినకపోవడం, వ్యాయామం చెయ్యకపోవడం, మరీ ముఖ్యంగా వ్యతిరేక ఆలోచనలు, పనులు చేయడం, మీ ఆత్మను నిజంగానే నాశనం చేస్తాయి.

2. ఇతరులను బాధించడం. శారీరకంగా ఇతరులకు హాని చేయడం లేదా ఉద్వేగపరంగా బాధించడం వ్యతిరేక కర్మను తయారుచేస్తుంది. ఉద్వేగపరమైన బాధ కూడా శారీరక బాధలాంటిదే.

3. పరిస్థితులకు సంబంధించిన వాస్తవాన్ని అంగీకరించకుండా వాటిని ఎదుర్కొనకుండా సమస్యల పరిష్కారానికి తగిన విధంగా కృషి చేయకపోవడం.

4. వ్యతిరేక ఆత్మల చెడు ప్రవర్తనను సహించడం. వారెక్కడ తప్పు చేస్తున్నారో చెప్పడానికి ప్రయత్నించాలి. వారు మీ మాట వినకపోతే అది వారిష్టం. కాని వారు మిమ్మల్ని ఉపయోగించుకోవడానికి అంగీకరించవద్దు. చెడును ప్రోత్సహించకండి. చెడ్డ వ్యక్తితో మంచిగా ఉండవద్దు. ఒకవేళ మీరు చెడ్డ వ్యక్తితో మంచిగా ఉంటే, మీరు అతడిని ప్రోత్సహిస్తున్నారు. చెడ్డ వ్యక్తిని ప్రోత్సహిస్తున్నారంటే మీరు కూడా అదే పాపాత్ముల కోవలోనికి వస్తారు. అందువల్ల ఉపచేతనాత్మక మనస్సును తొందరగా అభివృద్ధి చేసుకోండి. అప్పుడు మీరు సులభంగా చెడ్డ వ్యక్తిని గుర్తించ గలుగుతారు.

5. బాధ్యతను తప్పించుకొనడం. ఉదాహరణకు, మీ తల్లిదండ్రులు, పిల్లలు, ప్రియతముల పట్ల మీ బాధ్యతను వదిలిపెట్టడం.

6. తప్పు చేయమని ఇతరులను ప్రోత్సహించడం, తప్పుదారిలో నడిపించడం ఉదా. మాదక ద్రవ్యాలు అమ్మడం.

7. పిల్లలను చెడగొట్టడం. పిల్లలకు మంచి శిక్షణ నివ్వడం మీ బాధ్యత. కాని ఇలా చేయకుండా కర్మను పోగుచేసుకుంటారు. పిల్లలేం చెబుతున్నారో తల్లిదండ్రులు వినాలి, ఎందుకంటే పిల్లల ఉపచేతనాత్మక మనస్సు తెరచుకొని ఉంటుంది. వారు అంతః ప్రేరణతో పనిచేస్తారు. అయితే పిల్ల / పిల్లవాడు తన స్వార్థపూరిత ప్రయోజనాల కోసం మిమ్మల్ని మోసగించకుండా చూసుకోవాలి.

8. భూలోకంలో మీ ఆధ్యాత్మిక ధ్యేయం ఏమిటో గుర్తించి, పూర్తి చేయలేకపోవడం.

9. ఆత్మహత్య చేసుకొనడం. దీనివల్ల చాలా పెద్ద మొత్తంలో చెడు కర్మను సృష్టించుకుంటారు. మీ ఆత్మను ప్రయాణం పూర్తి చేయకుండా నిరోధిస్తున్నారు కనుక **ఒక ఆవరణ మొత్తం నుంచి మీరు కిందపడిపోతారు.** మీరు ఎంచుకున్న జీవితాన్ని, పరిస్థితులను మీరే అంతం చేస్తున్నారు. దైవనియమాల ప్రకారం మీ ప్రాణగండాలను మీరే ఎంపిక చేసుకున్నారు. మీకు జీవితాన్నిచ్చింది దేవుడు. దానిని తీసేసుకోవడం మీ పని కాదు.

10. ఏమీ చేయకుండా ఉండిపోవడం. కొన్నిసార్లు వ్యక్తులు బాధ్యతగా ఉండరు. లేదా సరైన పని చేసే ధైర్యం ఉండదు. సరైన పని ఏదో తెలిసి కూడా తమ సంకల్ప స్వేచ్ఛను ఉపయోగించకుండా చూస్తూ ఉండిపోతారు. వారు తప్పు చేస్తున్నారు.

11. 'వినోదం' కావాలనుకోవడం. యువత తాము వయసులో ఉన్నపుడే "జీవితాన్ని అనుభవించాలి" అనుకుంటారు. చేయకూడని పనులు చేయడానికి దీనిని సాకుగా చెబుతారు. **"భూలోక ప్రయాణాన్ని సంతోషంగా జరపడం ముఖ్యమే, కాని ఆత్మకు హాని చేస్తూ ఇలా చేయకూడదు".**

మీరు అజ్ఞానంలో ఉన్నప్పటికన్న, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించిన తర్వాత తప్పు మార్గాలను ఎంచుకుంటే మీరు బాగా కిందికి పడిపోతారు. కర్మను కూడా బాగా పోగుచేసుకుంటారని ఎప్పుడూ గుర్తుంచుకోండి.

మనిషి భూలోకంలో కర్మను ఎలా చెల్లిస్తాడు?

కర్మను ఎలా చెల్లించాలో చెప్పే మార్గదర్శక సూత్రాలు:

1. సమస్యను అంగీకరించండి. అడ్డంకి ఏదైనా సరే దాని నుంచి పారిపోవద్దు.

2. పరిస్థితిని మార్చాలని నిజాయితీగా, హృదయపూర్వకంగా అనుకుంటూ ప్రయత్నించాలి.

3. మీ ఎదుగుదల కోసం మీరే ఆత్మలోకంలో దీనిని కోరుకున్నారని అర్థం చేసుకోండి. లేదా వర్తమాన జీవితంలో మీరు ఎంచుకున్న అవకాశాన్ని బట్టి ఈ ఫలితం వచ్చిందని అనుకోండి. పరీక్షించడం, శిక్షణనివ్వడం మీరు బాగుపడడానికి సాయం చేసే అవకాశాలు. ఇలా ఎందుకు జరుగుతుందో తెలిసినపుడు ప్రతిఘటన అంతగా ఉండదు అంతేకాకుండా సమస్యల గురించి మీరు చెడుగా కూడా అనుకోరు.

4. ప్రతి అడ్డంకిని పరీక్షగా అనుకోండి. పరీక్ష తప్పితే మళ్ళీ మళ్ళీ అదే పరీక్ష ఎదురవుతుంది. మరింత కష్టతరం అవుతుంది.

5. ఆశావహంగా ఉండండి. దేవుడిని నమ్మండి. ప్రార్థించండి. శక్తిని, వివేకాన్ని ఇవ్వమని కోరండి.

6. మరింత కర్మను పోగు చేసుకోవద్దు. వివేకంతో ప్రవర్తించండి. చిన్న పాపమైనా లెక్కకు వస్తుందని గుర్తుంచుకోండి. బిందువూ బిందువూ కలిసి సముద్రమైనట్లే కర్మ కూడా పెద్దదవుతుంది. అతి చిన్న పని మంచిదైనా, చెడ్డదైనా పరిణామాలుంటాయి.

7. ఇతరుల జీవితాలతో పోల్చుకోవద్దు. మీకెందుకు బాధ ఉందని, ఇతరుల కెందుకు లేదని ప్రశ్నించవద్దు. ఆ ఆలోచనే తప్పు. అదే మిమ్మల్ని ఎదగనివ్వదు.

8. భౌతిక మనస్సును నియంత్రించి, ఉపచేతనాత్మక మనస్సు మాట వినండి. క్లిష్ట పరిస్థితిలో అది ప్రశాంతంగా ఉండి మీకు మార్గం చూపిస్తుంది.

9. మీ జీవితంలో జరిగే వాటికి ఇతరులను నిందించవద్దు. మీ జీవితానికి మీరే బాధ్యత వహించాలి. మీరెప్పుడు మారాలనుకుంటే అప్పుడు మారవచ్చు. చాలామంది బలహీనంగా ఉంటారు ఎందుకంటే వారలా ఉండాలని అనుకుంటారు కాబట్టి.

10. మీకు సమస్యలు వచ్చినప్పుడు, బాధ కలిగినప్పుడు కూడా దయతో చిన్న చిన్న పనులు చేస్తూ ఇతరులకు సాయం చెయ్యండి. ఇలా దృష్టి మరల్చుకోవడం కూడా మీకు సాయం చేస్తుంది. మీ ఉద్దేశ్యం పవిత్రంగా ఉండాలి. మీరు ఇతరులకు సాయం చేస్తే, సమస్యలను ఎదుర్కొనే శక్తిని దేవుడు మీకిస్తాడు. సమస్యలు సులభంగా తీరడమే కాకుండా, సాయం చేసిన వారి ఆశీస్సులు కూడా మీకు లభిస్తాయి.

11. పనిచెయ్యండి. శక్తివంచన లేకుండా చేసి మిగిలింది దేవుడికి వదిలెయ్యండి.

పరీక్షించడం, శిక్షణ నివ్వడం కూడా కర్మ వంటివేనా?

అవి కర్మలాంటివి కావు. కాని కర్మతో సంబంధం ఉన్నవి. మీరు ఆత్మలోకంలో ఉన్నపుడు కింది పనులు చేయాలనుకుని భూలోకానికి వచ్చారు.

1. కర్మను చెల్లించడం.
2. పరీక్షింపబడడం, శిక్షణ పొందడం
3. మీ ఆధ్యాత్మిక ధ్యేయాన్ని నెరవేర్చడం – భూలోకానికి మీరు వచ్చిన అసలైన ఉద్దేశ్యం ఇది.
4. మీ ఆత్మీయులను రక్షించడం.

ఈ నాలుగు విషయాలు కలిసి భూలోకంలో మీ మార్గాన్ని రూపొందిస్తాయి.

మీకు వచ్చే అన్ని సమస్యలు కర్మ సంబంధితమైనవి కావు. కష్టమైన పరిస్థితులు కొన్ని

మీకు దేవుడు పెట్టే పరీక్షలు లేదా ఆయనిచ్చే శిక్షణ. వీటివల్ల మీలో ఉన్న బలహీనతలు గాని, ప్రతికూలమైన ఆత్మ లక్షణాలుగాని తెలుసుకొని, సానుకూలమైన ఆత్మ లక్షణాలు పెంపొందించుకొనగలుగుతారు. కర్మ మీరు చెల్లించవలసిన రుణం గాని, మీరందుకోవలసిన ఆశీస్సుగాని అయితే శిక్షణ మిమ్మల్ని సంసిద్ధం చేస్తుంది. ఇది మీరు ఒక నిర్దిష్ట పరీక్ష పాసుకావడానికి తయారయేందుకు ఎంచుకున్న మార్గం. ఆత్మలోకంలోని ఉన్నత సదాత్మల సహాయంతో భూలోకంలో మీరు పూర్తి చేసే జీవితానికి సంబంధించి మీరు శిక్షణలోని రకాలను ఎంపిక చేసుకుంటారు. దేనికి సంబంధించిన పరీక్ష జరగాలో కూడా మీరే ఎంపిక చేసుకుంటారు. అంటే నిర్దుష్టమైన ఆత్మ లక్షణాలు. అయితే, పరీక్షలు ఎలా ఉండాలి, వాటి తీవ్రత, అవి వచ్చే సమయాన్ని మీరు నిర్ణయించుకోరు. మీ ఉపచేతనాత్మక మనస్సే అప్రయత్నంగా చేస్తుంది. ఉదాహరణకు యూనివర్సిటీకి వెళ్ళినపుడు ఏ కోర్సులు చదవాలో మీరు నిర్ణయించుకుంటారు; కోర్సు చివరలో జరిగే పరీక్షలో వచ్చే ప్రశ్నలు మీరు ఎంపిక చేసుకోలేరు. మీ జీవితంలోని వివిధ సమయాల్లో ఇటువంటి పరీక్షలెన్నో ఉంటాయి. వాటిలో మీరు బాగా పాసయ్యే వరకు అవి వస్తూనే ఉంటాయి. శిక్షణ వల్ల ఆత్మ బలంగా మారి కొన్ని సత్యాలు మీకు అర్థమవుతాయి; శిక్షణ వల్ల మీ ఆత్మకు అత్యవసరంగా కావలసిన కొన్ని అర్హతలు లభించి పరీక్షలు పాసయి, మీ ధ్యేయం పూర్తవుతుంది. క్రమంగా వచ్చే కొన్ని పరిస్థితుల రూపంలో శిక్షణ ఉంటుంది. వీటిని మీరు భరించవలసి ఉంటుంది. ఇవి మీకు నేర్చుకొనడానికి, ఎదగడానికి దోహదపడతాయి. మీ ఆత్మకున్న అవసరాల దృష్ట్యా మీరు ఎంపిక చేసుకున్న దానిని బట్టి, శిక్షణ పలురూపాలలో ఉంటుంది. అప్పుడు మీరు ఈ సత్యాలనుగాని, పాఠాలను గాని నేర్చుకున్నారా లేదా అని, ఇవి మీ సత్తలోని (అస్తిత్వంలోని) భాగమయ్యాయా అని పరీక్షించడం జరుగుతుంది.

మీరు ఆధ్యాత్మిక పాఠాలను నేర్చుకున్నారా లేదా అని పరీక్షించడానికి పరీక్షలు ఉంటాయి.

మీరు ఒక పాఠం నేర్చుకుంటే, పరీక్ష మళ్ళీ జరగదు. ఒక నిర్దిష్ట పరిస్థితిని మీరు అనుభవించి దానికి అతీతంగా ఉన్నారు, అంటే ఆ సంఘర్షణకున్న ఉన్నత ప్రయోజనాన్ని మీరు అర్థం చేసుకున్నారన్నమాట.

మీ విజయానికి మీరు గర్విస్తున్నారనుకుందాం. మీకు అపజయం కలిగే పరిస్థితులు (మీ శిక్షణ) కూడా మీరనుభవిస్తారు. ఈ అపజయం స్వభావాన్ని మీరు అర్థం చేసుకుంటే గనుక, అంటే మీకు వినయం నేర్పడానికి, అణకువగా ఉండడం నేర్పడానికి ఇది వచ్చింది. ఈ పాఠం మీరు నేర్చుకుంటే మీరు పరీక్ష పాసయినట్టే. మీరు ప్రతికూల ఆత్మ లక్షణం (గర్వం) స్థానంలో సానుకూల ఆత్మ లక్షణాన్ని పొందుతారు. ఈ మార్పు హృదయపూర్వకంగా జరిగితే, మీరు నిజంగా పరీక్ష పాసయినట్టే. మీ ఆత్మకు శిక్షణ

ఇలా ఇవ్వడం జరుగుతుంది. మీరు ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఎదుగుతున్న కొద్దీ, మీ శిక్షణ కూడా ఉన్నత స్వభావం కలిగి ఉంటుంది, మీకు ఆత్మలోకం నుంచి అదనంగా సాయం అందుతుంది. మీ నైతిక బలాన్ని నిర్ణయించడానికి కూడా పరీక్షలుంటాయి. నైతికంగా తప్పని తెలిసినా సులభమైన మార్గాన్ని ఎంపిక చేసుకుంటారా? లేక కష్టమైనదైనా సరైన మార్గాన్ని ఎంపిక చేసుకుంటారా? కర్మ, పరీక్ష, శిక్షణ ఒకదానితో ఒకటి సంబంధించి ఉంటాయి కాని అన్నీ ఒకటి కావు. తాత్పర్యమేమిటంటే – ఏ పరిస్థితి వచ్చినా ధైర్యంగా, చిరునవ్వుతో ఎదుర్కోండి. కాని ఎల్లవేళలా జాగృతంగా ఉండండి. **మీరస్సలు ఊహించని పరిస్థితుల్లోనే పరీక్షలు వస్తాయి.**

ఆధ్యాత్మిక పరీక్ష అనుకోకుండా పెట్టే పరీక్ష. ఆధ్యాత్మిక పాఠాలు నిజంగా నేర్చుకున్నారా లేదా అని మీరు కచ్చితంగా తెలుసుకొనే మార్గం ఇది. ఆధ్యాత్మికంగా జాగృతంగా ఉండడానికి, ఉపచేతనాత్మక మనస్సు ద్వారా పనిచేయండి. అప్పుడు సహజంగానే సరైన పని చేస్తారు. ఒక ఆధ్యాత్మిక పరీక్ష ఎదురైతే దానిని ఎదుర్కొనడానికి భౌతిక మనస్సును ఉపయోగించి పరిష్కరించుకోవాలంటే కుదరదు. మీరు పూర్తిగా అపజయం పాలవుతారు. ఒక పరీక్ష వచ్చినప్పుడు భయంతో కదలలేని స్థితిలో ఉండవచ్చు. లేదా కోపం, విసుగు కలగవచ్చు. ఇలా జరిగిన క్షణంలో ఉపచేతనాత్మక మనస్సుతో ఈ సంబంధం తెగిపోయి మీరు తప్పుదారి పట్టినట్టే. మీరు భౌతిక మనస్సు అనే తప్పు ఆయుధాన్ని ప్రేరేపించారు. ఆరంభమే అన్నీ చేస్తుంది – తప్పు ఆయుధాన్ని ప్రేరేపించారు కనుక దానిని ఉపయోగిస్తుంటారు. చివరికి పరీక్షలో తప్పిన తరువాత మీరేం చేశారో మీకు తెలుస్తుంది. ఒక పరీక్ష తప్పితే, అది మళ్ళీ మీకెదురవుతుంది. అది ఎప్పుడూ మరింత కఠినంగానే ఉంటుంది. నేర్చుకోవలసిన పాఠం ఒకటే, కాని పరీక్ష మరో రూపంలో వస్తుంది. ఆధ్యాత్మిక పరీక్ష ఇలా అనుకోకుండా ఎదురయ్యే పరీక్ష. మీరు పాఠం నేర్చుకునే వరకూ ఒకేలాంటి సమస్యలు మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటాయి వాటిని మీరు అధిగమించే వరకూ.

మరొక నియమమేమిటంటే, మీరు ఆధ్యాత్మికంగా ఎంత ఉన్నతస్థితికి చేరితే, మీ పరీక్షలు అంత కఠినంగా ఉంటాయి. స్కూల్లో తరగతి పెరిగితే పరీక్షలు కష్టమైన విధంగా, మీకు ఆధ్యాత్మిక జ్ఞానం ఉండి కూడా సమస్యల నుంచి పారిపోతే మీరు వేగంగా కిందపడిపోతారు. పారిపోవడానికి భయమో, అహమో కారణమేదైనా కావచ్చు ఆధ్యాత్మిక నియమమేమిటంటే, మీకు జ్ఞానముంటే, కర్మను బాగా అంగీకరించవలసిన బాధ్యత ఉంది, శిక్షణ పొందాలి. ఆధ్యాత్మిక పరీక్షలు పాసవ్వాలి.

భూలోకంలో అద్భుతమైన జ్ఞానం ఉన్న వ్యక్తులు చాలామంది ఉన్నారు. కాని వీరు కింది ఆవరణలలో ఉన్నారు. వారికి జ్ఞానం ఉన్నా, బాగుపడడానికి వారు ఆ జ్ఞానాన్ని

ఉపయోగించడం లేదు. వారు తప్పుదారిలో ఉంటే వారు తమ జ్ఞానాన్ని ఇతరులతో పంచుకున్నాసరే వారిని ఏదీ రక్షించలేదు. అందువల్ల ఆధ్యాత్మిక జ్ఞానం మిమ్మల్ని మరింత కిందికి పడవేయగలదు. జ్ఞానం ఉండి కూడా తప్పు చేస్తున్నారంటే ఆధ్యాత్మిక నియమాలను పూర్తిగా అగౌరవపరుస్తున్నట్టే. మీ కర్మ రుణం కూడా పెరిగిపోతుంది. ఒకేలాంటి తప్పులు చేసిన ఇద్దరు వ్యక్తులు కిందికి పడిపోవడంలో తేడా ఉండవచ్చు; ఎక్కువ జ్ఞానం ఉన్న వ్యక్తి ఆధ్యాత్మికంగా మరింత కిందికి పడిపోయి మరింత చెడు కర్మను సృష్టించుకుంటాడు.

ఆధ్యాత్మిక పరీక్షలకు కొన్ని ఉదాహరణలు చెబుతారా?

1. భయం. మీరు ధైర్యం నేర్చుకోవాలి కనుక మీ భయాలకు పరీక్ష ఉంటుంది.

2. అధికారం. అధికార స్థానంలో ఉంచి, అధికారాన్ని మరింత మంచి చేయడానికి ఉపయోగిస్తారా లేదా అని పరీక్షించడం జరుగుతుంది.

3. ధనం. మీకు బాగా ధనం ఇచ్చి దాని వల్ల మీరు వ్యక్తిగా ఏమైనా మారారా అనీ, లేదా ధనం ఎక్కువ ఇవ్వకుండా మీరు తృప్తిగా ఉన్నారా అనీ పరీక్షించడం జరుగుతుంది.

4. ప్రతిభ. మీకు ఒక ప్రతిభను, నైపుణ్యాన్ని ఇచ్చి వెలుగు కోసమా, అంధకారం కోసమా దేనికోసం ఉపయోగిస్తారో పరీక్షించడం జరుగుతుంది.

5. క్షమించడం. మీకు బాగా సన్నిహితులు మిమ్మల్ని బాధపెడతారు. ఆ వ్యక్తిని ద్వేషించకుండా, వారి గురించి చెడుగా అనుకోకుండా, వారిని క్షమించి సరైన పద్ధతిలో ఉంటారా, అంటే, మీ ఆంతరిక స్థితిని మార్చుకుని సానుకూలమైన ధోరణిలో ఆలోచిస్తారా?

కర్మను చెల్లించడంలో ఉపచేతనాత్మక మనస్సు నిర్వర్తించే పాత్ర ఏమిటి?

సదాత్మగా ఉంటే ఉపచేతనాత్మక మనస్సు తెరచుకొని ఉంటుంది గనుక మీకు కర్మ త్వరగా వస్తుంది. అంటే మీరు ఏ చిన్న తప్పు చేసినా, వెంటనే కర్మను అనుభవించవలసి ఉంటుంది. మీరు కర్మను త్వరగా చెల్లించుకోవచ్చు. అయితే మీ ఉపచేతనాత్మక మనస్సు నిద్రిస్తూ ఉంటే, మీ కర్మ సంచితమవుతూ ఉంటుంది. మీరు దానిని చెల్లించడానికి ఆలస్యం చేస్తూ ఉంటారు. అయితే చివరికి ఏమైనా సరే మీ కర్మను మీరు అనుభవించవలసి ఉంటుంది. పాపాత్మలకు శిక్షపడడం లేదని భావించవద్దు; వాళ్ళు అనుభవించవలసిన కర్మను పోగుచేసి పెట్టుకుంటున్నారు.

అయితే ఒకరు ఎదుర్కొనే పరీక్షలకు, శిక్షణకు ఇదే నియమం వర్తించదు. ఒక మనిషి తన పరీక్షను, శిక్షణను తప్పించుకొనవచ్చు. మీ ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణంగా ఉంటే, మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు కావలసిన పరీక్ష, శిక్షణలవైపు అది మిమ్మల్ని నడిపించలేదు. మీరు భూలోకంలో ఎందుకున్నారో మీ ఆధ్యాత్మిక ధ్యేయమేమిటో ఎన్నడూ గుర్తించలేరు. మీరు ఆధ్యాత్మిక ప్రయాణంలో లేకుండా, ఆత్మలోకంలో మీ అంతట మీరు ఎంపిక చేసుకున్న మార్గాన్ని సంకల్పస్వేచ్ఛతో మార్చుకున్నారు; ఇంక ఆ తరవాత మీ ఆత్మకు శిక్షణనిచ్చే పరిస్థితులుగాని, వ్యక్తులుగాని తారసపడరు. దీనికి మారుగా మీ అహాన్ని తృప్తిపరచే మనుషులు, పరిస్థితులు తారసపడి మీరు పూర్తిగా ప్రాపంచిక విషయాలనే ఆలోచిస్తూ భౌతిక ప్రపంచానికే పరిమితమైపోతారు. మీ ఆత్మకు ఏమీ ప్రాధాన్యమివ్వరు. ఆత్మకు పోషకంగా ఏమీ చెయ్యక పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. ఈ స్థితిలో మీరు సంతోషంగా ఉంటారు. కాని ఈ సంతోషం ఒక భ్రమ. ఎందుకంటే ఇది భౌతిక మనస్సు నుంచి వస్తుంది. ఆధ్యాత్మిక మార్గం నుంచి దూరంగా పారిపోయి భూలోకంలో కొంతమంది ఊపిరి పీల్చుకుంటారు కాని, భౌతిక మనస్సు నుంచి వచ్చే అబద్ధమైన శాంతి ఇది. ఎందుకంటే వారికి మారడానికి, బాగుపడడానికి సంఘర్షించవలసి ఉండదు. తమ సమస్యలను సక్రమమైన పద్ధతిలో పరిష్కరించుకోవడం వారికి ఇష్టం ఉండదు. సులభమైన మార్గాన్ని ఎంచుకుంటారు. ఇటువంటి అబద్ధపు శాంతిని మీ అహం మీకు కలిగిస్తుంది ఎందుకంటే దానికి నాశనం కావడం ఇష్టం ఉండదు.

ఈ కిందిస్థాయిలో ఉండే ఆత్మలకు నిద్రాణంగా ఉండే ఉపచేతనాత్మక మనస్సు ఉంటుంది. అందువల్ల వాటికి పరీక్ష గాని, శిక్షణ గాని ఉండదు. కనుక భూలోకంలో అన్యాయం ఎక్కువగా ఉంటుందా?

ఇది అన్యాయం అనిపిస్తుంది, కాని వాస్తవానికి ఈ ఆత్మలు చెడుకర్మను తయారు చేసుకుంటున్నాయని గుర్తుంచుకోండి. అవి వాటి పరీక్షను గాని, శిక్షణనుగాని తీసుకోవడం లేదు. ఇదంతా రికార్డయి ఉంటుంది. ఇదంతా సంచితమవుతుంది. చెడు (వ్యతిరేక) ఆత్మలు చివరికి ఈ సత్యాన్ని తెలుసుకోక తప్పదు. అయితే భూలోకంలో ఈ ఆత్మలకు అధికారం ఉంటుంది. సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తాయి. అంతేకాకుండా భూలోకంలోని స్పందన కూడా ఇప్పుడు వ్యతిరేకంగా ఉంటుంది. ఈ వ్యతిరేక స్పందన చెడు ఆత్మలకు సాయం చేస్తుంది. దురదృష్టవశాత్తు ఇదే వ్యతిరేక స్పందన సదాత్మలకు హాని చేస్తుంది. ఈ చెడు ఆత్మలు ఇతరులకు హాని చేయడానికి తమ సంకల్పస్వేచ్ఛను ఉపయోగిస్తాయి. తత్ఫలితంగా సదాత్మలకు ఇది వారి పరీక్షగాని, శిక్షణగాని, కర్మగాని కాకపోయినా బాధ కలుగుతుంది.

ఉదాహరణకు దైవప్రణాళికలో హత్య ఎన్నడూ ఉండదు. కర్మను చెల్లించుకోవడానికి గాని, పరీక్ష, శిక్షణ కోసం గాని ఆత్మలోకంలో మీరు దీనిని ఎంపిక చేసుకోరు. ఒక మనిషి ఎవరినైనా హత్యచేస్తే, అది ఆత్మరక్షణ కోసం కాకపోతే, అంటే ముందుగానే ప్రణాళిక వేసుకొని చేసినా, ప్రతీకారేచ్ఛతో చేసినా ఏ పరిస్థితుల్లోనైనా సరే హంతకుడు నేరుగా అత్యంత కింది ఆవరణకు చేరతాడు. ఎంతో చెడు కర్మను తయారుచేసు కుంటాడు. ఈ జన్మలో ఎవరినైనా హత్య చేస్తే భవిష్య జన్మలో మిమ్మల్ని గాని మీ సన్నిహితులనిగా హత్య చేస్తారని కాదు. హత్య వంటి పాపకర్మను దేవుడు ఆధ్యాత్మిక ప్రణాళికలో చేర్చడు. ఇటువంటి వాటిని ఆత్మలోకంలో ఎంపిక చేసుకొనడం కుదరదు. ఈ కిందిస్థాయిలో ఉన్న ఆత్మ భూలోకంలోని తరువాతి జన్మలో అమితమైన పరీక్షను, వేదనను అనుభవిస్తుంది. ఆ ఆత్మ 4వ ఆవరణను చేరడానికి కూడా చాలాకాలం పడుతుంది.

☸ కోల్పోకూడని ఆత్మీయమైన వ్యక్తిని కోల్పోయిన సదాత్మలకు ఏం జరుగుతుంది?

ఆత్మలోకంలో ఉన్నపుడు భూలోకం ఎలాంటిదో మీకు తెలుసు; ఏ ఇబ్బందులు ఉంటాయో మీకు తెలుసు, చెడు ఆత్మ తన సంకల్పస్వేచ్ఛనుపయోగించి మీకు హాని చేయవచ్చునని కూడా మీకు తెలుసు. ఇదంతా తెలిసి కూడా భూలోకానికి రావాలనుకున్నారు. ఎందుకంటే ఆత్మలోకంలో కన్న భూలోకంలో త్వరితంగా పైకి ఎదగగలరు కనుక. ఇబ్బందులు వద్దనుకుంటే మీరు ఆత్మలోకంలోనే ఉండిపోతారు. మీ ప్రగతి నిదానంగా (అరుదైన కేసులలో తప్ప) ఉంటుంది. అందువల్లే చాలా ఆత్మలు పునర్జన్మ వద్దనుకుంటాయి. ఆత్మలోకంలో కూడ సంకల్పస్వేచ్ఛ ఉంటుంది కనుక ఇది వారి ఇష్టం. సంకల్పస్వేచ్ఛ ప్రతి ఒక్క విశ్వంలోనూ ఉంటుంది.

ఒక యువకుడు హత్యకు గురయ్యాడనుకుందాం. అతనికి ప్రాణగండం ఇంకా లేదు. భూలోక ప్రయాణం పూర్తికాకుండానే అతని జీవితం అంతమైంది. ఈ యువకుడికి తల్లిదండ్రులున్నారు. వారింకా బతికే ఉన్నారు. ఇలా బాధపడడం వారి కర్మలో లేదనుకుందాం. సహజమరణం ద్వారా బిడ్డను కోల్పోయే కర్మ ఆ తల్లిదండ్రులకు ఉంది అంటే శారీరక అనారోగ్యం వల్ల. కాని అసహజ మరణం వల్ల కాదు. తల్లిదండ్రులు గనుక సదాత్మలైతే, దేవుడు తన దూతలను పంపి ప్రార్థనల ద్వారా వారికి అదనపు స్పష్టత చేకూరుస్తాడు, వారికి ఎంతో శక్తినిచ్చి ఆ బాధ నుంచి తేరుకొనేలా చేస్తాడు. ఆ తల్లిదండ్రులు చెల్లించవలసిన కర్మ ఇంకా ఉంటే (భూలోకంలోని ఏ మనిషికీ చెల్లించలేని కర్మ ఉండదు) ఆ తల్లిదండ్రులు అంగీకరిస్తే ఈ బాధనుపయోగించి వారు తమ కర్మను తుడిచి వెయ్యవచ్చు. ఇది వారికి పైకి తెలియకుండా జరిగే ఒప్పందం

– ఇది వారి ఉపచేతనాత్మక మనస్సుకు, ఆ ఆవరణకు చెందిన ఉన్నత సదాత్మకు మధ్య జరుగుతుంది. వారు అదనపు ప్రార్థనలు, రక్షణతో జీవితం కొనసాగిస్తారు, భూలోక ప్రయాణాన్ని పూర్తిచేస్తారు. ఈ ప్రయాణాన్ని సజావుగా చేస్తే వారి కర్మలో ప్రధాన భాగం తుడిచిపెట్టుకుపోతుంది.

అత్యంత కష్టాన్ని పొందిన వారి విషయంలో సదాత్మ ప్రవేశం మరో అవకాశం.

మీరు భూలోకంలో ఉన్న సదాత్మ అనుకుందాం. మీరు అత్యంత క్లిష్ట స్థితిలో మీ సామర్థ్యాలు, అవగాహనకు మించిన స్థితిని ఎదుర్కొంటున్నారనుకుందాం. ఉదాహరణకు 5వ తరగతిలో ఉన్నపుడే 10వ తరగతి పరీక్ష రాయమంటే అసాధ్యమైనది కదా. అప్పుడు ఒక సదాత్మ ప్రవేశం లేదా ఆత్మలోకంలోని 5వ ఆవరణ నుంచి గాని, ఆపై ఆవరణ నుంచి గాని ఒక సదాత్మ భూలోకానికి వచ్చి మీ శరీరంలో చేరుతుంది. మీ మానవాత్మ తాత్కాలికంగా ఆత్మలోకానికి వెళుతుంది. క్లిష్ట పరిస్థితి దాటిపోగానే మీ ఆత్మ శరీరంలో చేరి ఆత్మలోకం నుంచి వచ్చిన ఆత్మను అక్కడికి పంపుతుంది. కేవలం మీ ఉపచేతనాత్మక మనస్సుకే ఇది తెలుస్తుంది. మీ ఉపచేతనాత్మక మనస్సుకు, ప్రవేశించిన ఆ సదాత్మ ఉపచేతనాత్మక మనస్సుకు మధ్య పరస్పర అవగాహన ఉంటుంది. సదాత్మ ప్రవేశాలు అరుదుగా జరుగుతాయి. కొన్ని కష్టమైన పరిస్థితులలోనే అవి భూలోకానికి వస్తాయి. ఆత్మలోకంలో ఉన్నప్పుడే ఇక్కడ పుట్టకముందే, పరిస్థితులు చేజారినపుడు ముందు జాగ్రత్త కోసం మీక్కావలసిన సదాత్మ ప్రవేశాన్ని మీరు ఎంపిక చేసుకుంటారు.

సదాత్మ ప్రవేశము, ఆత్మ ఆవహించడము ఒకటేనా?

కాదు. ఆవహించడం, సదాత్మ ప్రవేశం ఒకటి కానే కాదు. ఆవహించడం సంకల్ప స్వేచ్ఛకు వ్యతిరేకంగా జరుగుతుంది. ఆత్మలోకంలోని ఆత్మలు భూలోకంలోని వ్యక్తులను ఎన్నడూ ఆవహించవు. ప్రేతాత్మలు ఇలా చేస్తాయి. ప్రేతాత్మలు చెడు వ్యక్తులను మాత్రమే ఆకర్షిస్తాయి. భూలోకంలోని ఆవ్యక్తి శరీరాన్ని ఆవహిస్తాయి. ఇది ఆధ్యాత్మికంగా తప్పు. ఎందుకంటే భూలోక ఆత్మ యొక్క ఉపచేతనాత్మక మనస్సు అనుమతిని అవి పొందలేదు. పైగా ఇది సంకల్పస్వేచ్ఛకు పూర్తిగా వ్యతిరేకం.

విధి అంటే ఏమిటి? కర్మ, పరీక్ష, శిక్షణ విధి కన్నా వేరా?

విధిని నమ్మేవారు శక్తిహీనులుగా జీవితాలను వెళ్ళదీస్తారు. వారు ఏం చేసినా "జరగాల్సింది జరుగుతుంది" అని నమ్ముతారు. ఇది సరైన ఆలోచనా పద్ధతి కాదు. ఎందుకంటే ఇప్పటి మీ పనులను బట్టి భవిష్యత్తులోని పరిస్థితులుంటాయి. మీరు

సదాత్మ అయితే, మీ ఉపచేతనాత్మక మనస్సు తెరచుకొని ఉంటేనే మీకు పరీక్ష, శిక్షణ ఉంటాయి. మీ కర్మ మీ వద్దకు వస్తుంది. మీరు దానిని త్వరితంగా చెల్లించ గలుగుతారు. మీరు ప్రస్తుత పరీక్షను, శిక్షణను అత్యంత బాగా పొందగలిగితేనే మీకు అదనపు పరీక్ష, శిక్షణ ఉంటాయి. ఏదీ ముందుగానే నిర్ణయింపబడే ప్రశ్నే లేదు; ప్రతిదీ మీరు ప్రస్తుతం చేసే పనులను బట్టే ఉంటుంది. చెడు కర్మగాని, మంచికర్మగాని మీరు గతంలోగాని, ఇప్పుడు గాని చేసిన పనులను బట్టే కలుగుతుంది. అయితే సమస్యలను చక్కగా పరిష్కరించుకుంటే వ్యతిరేక పరిస్థితులను తప్పించుకొనే అవకాశం ఉంటుంది. ఆత్మలోక ఆత్మలు మీకు శక్తినిస్తాయి. విధిపై నమ్మకం ఉండడం వల్ల ఏం చేసినా పరిస్థితులు మారవు. అటువంటప్పుడు మీ సమస్యలు ఎన్నడూ తగ్గవు. కొనసాగు తున్నట్లుగా అనిపిస్తుంది. **విధి కాదు – మీరే – మీ పరిస్థితులకు సృష్టికర్త.** భూలోకంలో మీకు దొరికే ఆశీస్సులు, వచ్చే సమస్యలు అన్నీ ఆత్మలోకంలో మీరు ఎంపిక చేసుకున్నవే. గత జన్మలోనో, ఈ జన్మలోనో మీరు చేసిన మంచి చెడులను బట్టి ఇలా జరుగుతుంది. మీరు విధిని నమ్మితే, పరిణామాలన్నీ ముందే నిర్ణయింపబడ్డాయనీ, మీరు చేసే పనులకు వీటికి సంబంధం లేదని నమ్ముతారు.

మనుషులు జీవితంలో అనుభవించే బాధను గురించి కర్మకు సంబంధించిన సమాచారం కొంతవరకు చెబుతుందని ఆశిస్తున్నాం. కర్మను విచారంగానో, భయంతోనో, ఆందోళనతోనో చూడరాదు. ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఇది అత్యవసరం. ఎవరినైనా మీరు మానసికంగా, శారీరకంగా, ఉద్వేగాత్మకంగా, ఆధ్యాత్మికంగా గాని బాధపెడితే అది తిరిగి మీకు వస్తుంది. అలాగే దయాపూరితమైన చిన్న చిన్న పనులు పవిత్రమైన ఉద్దేశ్యంతో చేసిన వాటి ఫలితంగా ఆశీస్సులు వస్తాయి.

ఆధ్యాత్మికమైన ఆశీస్సులు, బహుమతులు భౌతిక స్వభావం కలవి కావు. అవి సంతోషంగా ఉండే కుటుంబం, నిజాయితీగల స్నేహితులు, నైపుణ్యాలు, సౌకర్యాలు, పెంపుడు జంతువులు, సద్గురువు (నకిలీ కాదు) లభించడం, మానసిక సామర్థ్యాలైన అప్రయత్న లేఖనం, బాలమేధావి, మంచి సంభాషణాచాతుర్యం, స్వస్థత చేకూర్చే శక్తి ఉండడం, మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు చేయడం, మంచి ఆరోగ్యం, మీకు, మీ ప్రియతములకు చెడు నుంచి రక్షణ ఉండడం, మార్గదర్శకత్వం, ఆధ్యాత్మిక జ్ఞానం, సమస్యలు పరిష్కరించుకొనే శక్తి దైవం ఇవ్వడం, కర్మను త్వరగా చెల్లించే అవకాశాలు రావడం, మీ ధ్యేయాన్ని బాగా పూర్తి చేస్తూ ఇతరులకు సాయపడడం వంటి వాటి రూపంలో వస్తాయి.

రుణాలు తీర్చవలసిందే. పరీక్షల నుంచి పారిపోయి, బాధ్యతలు వదిలి, చెడు మార్గం పట్టి రుణాలను మరోజన్మకు పొడిగించకండి. మీ అనారోగ్యాన్ని తగ్గించుకోవడానికి

మందులు అవసరం. మందులు కొన్నిసార్లు చేదుగా ఉంటాయి. అయితే మందు వేసుకున్నాక మీకు బాగుంటుంది. అదే విధంగా కర్మ సంబంధిత రుణాల వల్ల మీకు బాధ కలుగుతుంది. కాని వాటిని సక్రమంగా నెరవేర్చిన తరువాత మీకు భారం దిగినట్టుగా, బలంగా, ఉన్నతస్థాయి అవగాహన కలిగి ఉంటారు. మీకు ఎదురైన ప్రతిదానితో వ్యవహరించగలిగే శక్తి మీకు ఉంటుందని గుర్తుంచు కోండి. ఆత్మలోకంలో మీ ఆవరణలోని ఉన్నత సదాత్మతో పాటు మరో ముగ్గురు వివేకులైన ఆత్మలు మీ సామర్థ్యాన్ని బట్టి మార్గాన్ని ఎంపిక చేసుకొనడానికి సలహా ఇచ్చారు. సాయం చేశారు. మీ పరీక్ష, శిక్షణ, కర్మ అన్నీ మీ శక్తిని బట్టే మీకు ఇచ్చారు. మీ జీవితంలో మీ శక్తికి మించినదేదీ రాదు. దేనినైనా చేయలేను అనిపించినపుడు మళ్ళీ ఆలోచించండి; బహుశ మీరెక్కడ తప్పు చేస్తున్నారో మీరే విశ్లేషించుకొని చూసుకొనాల్సిన అవసరం ఉండవచ్చు.

భూలోకంలో మీ ధ్యేయం



"మనమందరం దేవుడి ఉపకరణాలుగా జన్మించాం. కాని ఆయన ఉపకరణాలుగా కొనసాగే నిర్ణయం పూర్తిగా మనదే"

"చెడ్డవారితో ఎన్నడూ మంచిగా ఉండవద్దు. ప్రోత్సహించవద్దు. చెడును ఎదిరించండి."

భూలోకంలో మీ ధ్యేయం ఏమిటి?

చాలామంది తమ జీవితానికి అర్థం లేదని, సమస్యలు తప్ప ఇంకేమీ లేవని అనుకుంటారు. ఈ ఆత్మలు వారి జీవితాలకు అర్థాన్నెలా కనుగొంటాయి?

అన్నిటికన్న ముందు చెప్పే విషయం, మీకు ఎదురయ్యే అడ్డంకులను చూసి బెదిరిపోవద్దు; అవి మిమ్మల్ని మరింత శక్తిమంతులను చేయడానికే ఉన్నాయి. భూలోకంలో వేదననుభవించడానికే ఉన్నామని అనుకోవద్దు. కర్మ, పరీక్ష, శిక్షణ మీ ఆత్మను శుద్ధి చేయడానికి, మీరు మారేందుకు తోడ్పడడానికే ఉన్నాయి. అయినా దేవుడు మీకు భూలోకంలో **ఆధ్యాత్మిక ధ్యేయం** అనే అద్భుతమైన పనిని ఇచ్చాడు.

ప్రతి మనిషి తన జీవితం అర్థవంతంగా ఉండాలనుకుంటాడు. మీ ప్రయోజనం మీరు కనుగొన్నప్పుడు ఇలా ఉంటుంది. ఈ ప్రయోజనాన్నే ధ్యేయం అంటాం. మీ ఆత్మకు దైవానికి మధ్య జరిగిన వాగ్దానం ఇది. భూలోకానికి వచ్చేముందుగా ఆత్మలోకంలో మీరు వేసిన ఒట్టు. ప్రతి ఆత్మకూ ఆధ్యాత్మిక అన్వేషణ ఉంటుంది. పునర్జన్మించక ముందు ఈ మార్గాన్నే మీరు ఆత్మలోకంలో ఎంపిక చేసుకున్నారు.

భూలోకానికి వచ్చిన తర్వాత ఎందుకు పుట్టాలనుకున్నారో ఆ కారణాన్నే మర్చిపోతారు; మీ ఆత్మ పురోగమనం కోసం పుట్టారు. ప్రతి మనిషికి మూడు ధ్యేయాలున్నాయి.

1. ఆధ్యాత్మికంగా మెరుగవడం

2. నిస్వార్థంగా ఇతరులకు సేవ చేయడం

3. వ్యక్తిగత ప్రతిభా నైపుణ్యాలను ఇతరుల ఎదుగుదల కోసం ఉపయోగించడం.

మెరుగైన మార్పుకోసం మనుషులు భూలోకంలో ఉన్నారు. మీరు లోపలి నుంచి మారితే తప్ప భౌతిక శరీరంలో ఉన్న ఆత్మసత్తగా మీ పూర్తిసామర్థ్యాన్ని మీరు గుర్తించలేరు.

ఆత్మోన్నతి – మీ మొదటి ధ్యేయం – జీవితంలో ఎటువంటి పరిస్థితులు, అడ్డంకులు ఉన్నా సరే మారి దైవ నిర్దేశిత మంచిమార్గంలో నడవాలి. భూలోకంలో ఎప్పుడూ ప్రతికూల (చెడు)శక్తులు ఉంటాయి. భూలోకం ఆధ్యాత్మిక యుద్ధరంగం. మీ నైతిక శక్తిని నిరూపించుకొనే ఒకే ఒక మార్గం – అంధకారం ఎక్కువవుతున్నప్పుడు వెలుగును ఎంపిక చేసుకోవడం. చెడును ఎదుర్కొనడమంటే దానితో మాటల యుద్ధం చెయ్యమని కాదు, వ్యక్తుల గుణగణాలు తెలుసుకోండి. చెడు ఉంటే బయటికి చెప్పడానికి జంకవద్దు. **చెడును బయటపెట్టడం ముఖ్యం, కాని అది మీకో, మీ ప్రియతములకో ప్రమాదంగా పరిణమించకూడదు.** అయితే దీనిని మీ పిరికితనానికి సాకుగా ఉపయోగించు కోకూడదు. చెడుతో పోరాడే ఉత్తమ మార్గం ధైర్యంగా ఉండడం, ప్రతిసారి సరైన పని చేయడం. దైవనిర్దేశిత మంచి మార్గంలో ఉండటమంటే ఇదే. మార్పు లేకుండా ఎదుగుదల ఉండదు.

ఉపచేతనాత్మక మనస్సు మార్గదర్శకత్వాన్ని అనుసరించినపుడు మార్పు మీ సత్త (అస్తిత్వం)లో సహజమైన అంశమై, ఒక్కో అడుగికీ మీరు హుందాగా మారతారు. మీరు హుందాగా మారుతున్నపుడు పరీక్షలను, శిక్షణను తట్టుకొనే సామర్థ్యం కలిగి ఉంటారు. చెడు కర్మను బాగా చెల్లించి వేయగలుగుతారు. దీనికి కారణం మీ ఉపచేతనాత్మక మనస్సును ఉపయోగించడమే. అత్యున్నతమైన మంచి కోసం మీ మంచి కర్మను, మీ ఆధ్యాత్మిక ప్రతిభను, ఆశీస్సులను ఉపయోగించవచ్చు. మీరు సన్మార్గంలో ఉన్నపుడే ఇవన్నీ మీకు లభిస్తాయి. మీరు హుందాగా మారుతున్నారంటే, దైవ ప్రణాళికను శక్తిమేరకు అమలుపరుస్తున్నట్లే.

ఉపచేతనాత్మక మనస్సు మార్గదర్శకత్వాన్ని మీరు అనుసరించకపోతే, మార్పును ప్రతిఘటిస్తున్నట్లు. భౌతిక మనస్సు చెప్పే తప్పుడు సమర్థనలు విని మీరు మార్పును ప్రతిఘటిస్తున్నారు. తప్పేమీ లేదని, మార్పు అవసరం లేదని అది మీకు చెబుతుంది. భౌతిక మనస్సుకు మార్పు ఇష్టం ఉండదు; అందువల్ల మీరు ఉపచేతనాత్మక మనస్సుతో పనిచేయకపోతే, సహజంగా మీలో మార్పు రాదు. మీరు హుందాగా మారలేరు. అయితే మీరు దుష్టాత్మ కాదు గనుక, మీ ఉపచేతనాత్మక మనస్సు ఇంకా కొంచెం తెరచుకొనే ఉన్నది గనుక మీకు భౌతికమైన ఆపద కలుగుతుంది. మీకు జీవితంలో షాక్‌గాని, దెబ్బగాని అంటే ఆర్థిక నష్టమో, ఆరోగ్య హానో జరిగి మీ కళ్ళు తెరుచు కుంటాయి.

మనుషులకు సంబంధించిన విచారకరమైన అంశమేమిటంటే, వాళ్ళు మార్గదర్శ కత్వాన్ని, సంతోషాన్ని, ఆశీస్సులను అంటే తమకు జరిగే మంచిని అన్నిటినీ సులభంగా మర్చిపోయి నొప్పిని మాత్రం మర్చిపోలేరు. అందువల్ల మిమ్మల్ని మేల్కొలపటానికి

బాధ వస్తుంది. ఒక్కసారి మేల్కొన్నాక, తప్పుదారిలో నడుస్తున్నట్లు మీరు తెలుసుకొని, మారవలసిన అవసరం ఉందని గుర్తిస్తారు. ఉపచేతనాత్మక మనస్సు మాట విని ఉంటే, మేల్కొనడానికి బాధతో అవసరం ఉండేది కాదు. ఒకవేళ, భౌతికమైన దెబ్బ (కష్టం) తగిలిన పిమ్మట కూడా మీరు మారడానికి అంగీకరించకపోతే, కష్టాలు రావు ఎందుకంటే మీ ఉపచేతనాత్మక మనస్సు నిద్రాణమైపోయి ఉంటుంది. అందుకని బాహ్య జీవితంలో అంతా బాగుంటే మీరు సన్మార్గంలోనే ఉన్నారని భావించకండి. మీరింకా బాగా చెడిపోయి ఉండవచ్చు అప్పటికే.

మీరు తెలిసి కూడా చెడు మార్గంలో నడిస్తే ఇలా జరుగుతుంది. మీరు బాగా చెడ్డవారై ఒక పరిమితిని దాటి ప్రవర్తిస్తుంటే మీ ఉపచేతనాత్మక మనస్సు పూర్తిగా మూసుకొని పోతుంది. మీరు చనిపోయి, ఆత్మలోకంలో అతి నిమ్నస్థాయి ఆవరణకు వెళ్ళినప్పుడే ఇదంతా మీకు తెలుస్తుంది. భూలోకంలో ఉన్నపుడు సన్మార్గంలో ఉన్నామని భావించే ఆత్మలు, ఆత్మలోకంలో తామెక్కడికి చేరామో తెలుసుకొని షాక్ అవుతారు.

ఆత్మోన్నతి లేదా మార్పును సక్రమ కారణాలతో చేయాలి. కొన్నిసార్లు వ్యక్తులు తప్పు కారణాలతో పనులు చేస్తారు; ఇతరులు తమను గౌరవించాలనుకుంటారు; అహాన్ని తృప్తిపరచుకోడానికి ఆధ్యాత్మిక మార్గంలో నడవాలనకుంటారు. వివేకులము, పండితులము అనిపించుకోవాలని జ్ఞానార్జన చేస్తారు; నరకానికి వెళతామని భయపడి స్వర్గానికి వెళ్ళాలని మంచి పనులు చేస్తారు. మారడానికి సరైన కారణాలు ఇవి కావు. మంచితనంపై నమ్మకముండి, మెరుగైన మనిషిగా ఉండాలని మీరు మారాలి. మంచితనం కోసమే మంచితనంతో ఉండండి. ఆధ్యాత్మిక ఆకాంక్షలతోను, ఏదో లక్ష్యాన్ని సాధించాలని కాకుండా, జీవితాన్ని బాగా ఉంచుకొనడానికి మారండి; ప్రయాణం సుఖంగా చేయండి. గమ్యస్థానమైన 7వ ఆవరణ 9వ దశపై దృష్టి కేంద్రీకరించవద్దు - నడిచే మార్గంపై గాని, మార్పుపైగాని దృష్టికేంద్రీకరించండి.

ఈ కొన్నిసార్లు "నేను మారాలనుకుంటున్నాను కాని మారలేకపోతు న్నాను" అని వ్యక్తులు అంటుంటారు. వాళ్ళు నిజాయితీగానే ఇలా అంటున్నారా?

ఇలా అనేవారికి మంచి ఉద్దేశ్యాలు ఉంటాయి కాని వారికి అంతరంగంలో మార్పు రాక అయోమయంలో ఉంటారు. దీనికి ఒక చిన్న కారణం ఉంది. నిజమైన మార్పు ఉపచేతనాత్మక మనస్సు నుంచి వస్తుంది, కాని దానికి భౌతిక మనస్సు సహకరించాలి. వ్యక్తులు మారలేకపోతున్నారంటే, వాళ్ళు అంకితభావంతో మారాలనుకోవడంలేదు - హృదయపూర్వకంగా కోరుకొనడం లేదు. వాళ్ళు మారాలనుకున్నారు కాని అది హృదయపూర్వకంగా కాదు; మంచికోసం హృదయపూర్వకంగా మారాలనే నిబద్ధత కలిగి ఉండాలి.

ఇందుకోసం చేయాల్సిన మొదటి పని: దైవ నిర్దేశిత సన్మార్గంలో నడవడానికి మారడానికి మీకు **జ్ఞానం** కావాలి. తప్పు ఒప్పులను వేరు చేసి సాయపడే జ్ఞానం కావాలి. అందుకని మొదట ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించాలి. ఆ జ్ఞానం లభించే మూలాన్ని మీరు తప్పనిసరిగా విశ్వసించాలి. ఈనాడు భూలోకంలో ఆధ్యాత్మికత రూపంలో తప్పుడు జ్ఞానం ప్రచారమవుతోంది. దేవుడు నిజమైన జ్ఞానాన్ని తెలుసుకొనేందుకు మీకు ఉపచేతనాత్మక మనస్సునిచ్చాడు. సులభంగా పనైపోవాలని, మార్పును తిరస్కరిస్తే, మీరు నిజమై సాధకులు కారు. మీ భౌతిక మనస్సు మిమ్మల్ని తప్పుడు జ్ఞానం వైపు నడిపిస్తుంది. అరకొర జ్ఞానం ప్రమాదకరం. మీ అహానికి కాకుండా ఆత్మకు ఏది మంచిదో దానిని చేయండి.

❁ వ్యక్తి సద్గురువును ఎలా గుర్తిస్తాడు?

కొద్దిమందికి మాత్రమే జీవితంలో సద్గురువులు లభిస్తారు. కాని ఆధ్యాత్మిక జ్ఞానం ఎప్పుడూ సంసిద్ధంగా దొరుకుతుంది. జ్ఞానాన్ని గురువుగా చేసుకోండి, నిజంగా కోరుకుంటే, సత్‌జ్ఞానం మీకు లభిస్తుంది. సద్గురువు కోసం లోకజ్ఞానాన్ని ఉపయోగించండి. జ్ఞానమున్న వారెందరో ఉన్నారు కాని వారు జ్ఞానాన్ని తప్పు మార్గంలో ఉపయోగిస్తున్నారు. సద్గురువులు ఎవ్వరూ భౌతిక సంపదల కోసం జ్ఞానాన్ని ఉపయోగించరు. **సద్గురువులు నిస్వార్థంగా ఉంటారు.** ఇతరులకు, తమకు ఆధ్యాత్మిక ఎదుగుదల కోసమే జ్ఞానాన్ని ఉపయోగిస్తారు. **గురువు మిమ్మల్ని చెడపడు; ఆయన మీ ఆత్మకు శిక్షణనిస్తాడు.** చాలామంది తమకు సరైన గురువు దొరికారని నమ్ముతారు. ఎందుకంటే ఆ గురువు చెప్పేది వారికి నచ్చుతుంది; ఆ జ్ఞానం తొందరగా అర్థమవుతుంది, దానికి మనిషి మారవలసిన పని లేదు, దానిలో భౌతిక ప్రయోజనం ఉంటుంది. మీరు నిజంగా సత్యాన్ని అన్వేషిస్తే, సత్యం అంత తొందరగా లభించేది కాదని మీ లోకజ్ఞానం మీకు చెప్పాలి. మీకు అహం ఉంటే సత్యాన్ని అంగీకరించడం కష్టం. అహం మిమ్మల్ని సరిగ్గా అర్థం చేసుకోనివ్వకుండా నివారిస్తుంది.


నిజమైన గురువు (సద్గురువు) మిమ్మల్ని దుర్బలపరచడు. మీ లోపలి ఉన్న గురువును మీరు తెలుసుకొనేలా సాయం చేస్తాడు. మీరు ఎవరిపైన ఆధారపడి ఉండరు. ఆత్మ నిర్భరులుగా ఉంటారు. సత్యాన్ని చెప్పే గురువు నుంచి పారిపోవద్దు. మీ అహాన్ని తృప్తిపరచే గురువు నుంచి పారిపోండి. మీ ఆత్మను దుర్బలపరచి, మీ ఆత్మగౌరవాన్ని, ఆత్మ విలువను తగ్గించే గురువుకు దూరంగా వెళ్ళండి. మీ లోకజ్ఞానాన్ని, అంతః ప్రేరణను ఉపయోగిస్తే మీకు సరైన గురువు లేదా జ్ఞానము లభిస్తాయి.

కొన్నిసార్లు మనుషులు ఆత్మలోక ఆత్మలతో మాట్లాడితే భౌతికసాయం, ఇతరుల గురించిన సమాచారం అందుతుందని అనుకుంటారు. కాని ఇది సాధ్యం కాదు, ఆత్మలోక ఆత్మలు ఇతరుల గురించి సమాచారాన్ని ఎన్నడూ చెప్పవు. భౌతిక విషయాలను చర్చించవు.

భవిష్యత్తును గురించి జోస్యం చెప్పవు. ప్రేతాత్మలు ఇలా చేస్తాయి. ఆత్మలోక ఆత్మలు కేవలం ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం మాత్రమే ఇస్తాయి. అందువల్ల మిగిలిన విషయాలు చెబుతామనే గురువుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. ఆత్మలోక ఆత్మలు ఉన్నాయా అనీ, దేవుడున్నాడా అనీ రుజువుల కోసం చూడవద్దు. రుజువుల కోసం చూస్తున్నారంటే మీ పరీక్షలో తప్పుతున్నారు; మీకు విశ్వాసం ఉంటే, మీరు అస్సలు ఊహించని వేళలో అది మీకు లభిస్తుంది.

ఆత్మోన్నతి గురించి తరువాతి దశకు వెళదాం. జ్ఞానం ఒక్కటే చాలదు. సానుకూల మార్పుకు జ్ఞానం మొదటి అడుగు. రెండో అడుగు **లోపాలను అంగీకరించడం.**

కింద ఉన్న బొమ్మ ఆధ్యాత్మిక జ్ఞానచక్రాన్ని, మార్పును చెబుతుంది.



కిందికి సూచిస్తున్న బాణం గుర్తు ఆత్మలోకం నుంచి భూలోకానికి ప్రవహిస్తున్న జ్ఞానాన్ని సూచిస్తుంది. ఈ జ్ఞానం దైవదత్తం, ఇది మొదట దేవుడి నుంచి ఆత్మలోక ఆత్మలకు, తరువాత భూలోక ఆత్మలకు లభిస్తుంది. భూలోకంలో ఆత్మలు ఈ జ్ఞానానికి మార్గం ఏర్పరుస్తాయి. అంధయుగంలో వెలుగు నింపడానికి ఇవి భూలోకంలో పునరవతరిస్తాయి, ఈ ఆత్మలను మీరు గుర్తించాలి. వారి నుంచే అసలైన జ్ఞానం మీకు లభిస్తుంది. విద్యార్థికి నిజంగా నేర్చుకోవాలని ఉంటే, అంటే అతడు ఈ జ్ఞానానికి సంసిద్ధంగా ఉంటే గురువు కనిపించి ఆధ్యాత్మికంగా పురోగతి సాధించడానికి సాయపడతాడు. ఒకసారి ఈ ఆధ్యాత్మిక జ్ఞానం లభించిన తరువాత మీరు చేసే దానిలో ఒప్పేమిటో, మీరే విషయంలో తప్పు చేస్తున్నారో తెలుసుకోవడానికి దీనిని ఉపయోగించాలి. రెండో అడుగు లోపాలను అంగీకరించడం. మనుషులందరికీ లోపాలుంటాయి. ఆ లోపాలను విశ్లేషించుకొని పోగొట్టుకోండి, వాటిని పోగొట్టుకోవాలంటే చర్య తీసుకోవాలి. చర్య తీసుకొనడం ముఖ్యమైన మూడో అడుగు. మనిషికి తనలో కొన్ని లోపాలున్నాయని తెలుసు కాని వాటిని సవరించుకొనే శ్రద్ధ ఉండదు.

దీనివల్ల అనంగీకారం వ్యక్తమవు తుంది. లోపాలను నిజంగా ఒప్పుకొంటే వాటిని పోగొట్టుకొనేలా పని చేయాలి. అవసరమైన ఆధ్యాత్మిక చర్య అది. ఇతరులకు సాయం చెయ్యాలంటే ముందు మీకు మీరు సాయం చేసుకోవాలి. ఇతరులపై సానుకూల ప్రభావం చూపాలంటే మీకు ఆధ్యాత్మిక శక్తి ఉండాలి. మీకు ప్రియమైన వ్యక్తిగాని, స్నేహితుడుగాని వినయంగా ఉండాలని అనుకొని, వారి లోపాన్ని మీరు నిపుణంగా చెబితే మంచిదే. కాని మీరు గర్విష్టి అయితే గనుక ఇతరులు మారతారని అనుకోవద్దు. ఉదాహరణప్రాయంగా ఉండి వారికి చెప్పండి. మీకంటే ముందుగా ఇతరులు మారాలని నిరీక్షించవద్దు. వినయం లేకుండా ఏ మార్పు సంభవం కాదు అని గుర్తుంచుకోండి. ఒక్కసారి మీరు చర్య తీసుకుంటే, మీరు చక్రాన్ని పూర్తిచేస్తారు. అప్పుడు మళ్ళీ మొదలుపెట్టే అవకాశం లభిస్తుంది. మీకు మరింత ఆధ్యాత్మిక జ్ఞానం లభిస్తుంది. మళ్ళీ మిమ్మల్ని మీరు విశ్లేషించుకొని మరింత చర్య చేపట్టవచ్చు. ఈ చక్రం ఎన్నో జన్మల పర్యంతం కొనసాగుతుంది.

కొన్నిసార్లు పురోగతి సాధించలేనని మీరు అనుకోవచ్చు. మారాలనుకుంటారు, కాని మెరుగవడానికి బదులుగా జారిపోతున్నట్టుగా అనిపిస్తుంది మీకు. మీకు కొంత ఆధ్యాత్మిక జ్ఞానం ఉంది కాని మీ లోపాలను మీరు అంగీకరించనందుకు ఇలా జరుగుతుంది. మీరు చర్య తీసుకోవడం లేదు గనుక దైవ నియమాలను కూడ మీరు పరిమితంగానే అవగాహన చేసుకోగలరు. జ్ఞానం అంటే సమాచారం. ఆ సమాచారాన్ని పంచుకుంటే జ్ఞానం అవుతుంది. ఆ జ్ఞానాన్ని మీ దైనందిన జీవితంలో ఆచరణలో పెడితే, మీరు నేర్చుకోవలసిన ఆధ్యాత్మిక పాఠాలను మీరు నేర్చుకొంటే, మీకు వివేకం లభిస్తుంది. అప్పుడే ఆత్మలోక ఆత్మలు మీకు ఎక్కువ జ్ఞానాన్ని ఇవ్వగలవు. ఆత్మ ప్రగతికి మీరిలా జీవించాలి. ఈ మూడు అడుగులు - జ్ఞానము, అంగీకారము, చర్య కలిపి మీ మొదటి ధ్యేయం ఆత్మోన్నతిని సాధించగలవు.

మీ రెండవ ధ్యేయం **నిస్వార్థమైన సేవ.**

తృప్తికి సేవ కీలకం. కాని మీ భౌతిక ప్రపంచంలో జనానికి ఇది అర్థం కాదు. నిజమైన తృప్తి నిస్వార్థమైన సేవ వల్ల లభిస్తుంది. భూలోకంలో ఎన్నో ఆత్మలు మంచివారు. వారు ఎవరికీ హాని చేయరు. నిరాడంబరంగా, ప్రశాంతంగా, తమ కుటుంబాలతో కలిసి జీవిస్తారు. తమకు తాము హాని చేసుకుంటూ ఇతరులకూ హాని చేస్తూ అంధకారాన్ని పెంచే వారికన్న వీరెంతో మంచివారు. కాని ఈ సదాత్మలకు తమ నిజమైన శక్తిసామర్థ్యాలు తెలియవు.

కేవలం మీ బాధ్యతలను నిర్వర్తించడం మూలంగానే ఆధ్యాత్మికంగా పురోగమించ లేరు.

దురదృష్టవశాత్తు ఈనాడు ప్రపంచం ఎటువంటి స్థితిలో ఉన్నదంటే, ఒక మనిషి తన బాధ్యతలను నిర్వర్తిస్తే చాలు ఎవరికీ హాని చేయకుండా ఉంటే చాలు దైవికమైన వ్యక్తి అనుకుంటారు. కాని అటువంటి వ్యక్తి కనీసం దైవత్వానికి సగం దారిలో కూడా లేడు. మీరు ఇతరులకు సాయం చేయాలి – నిస్వార్థమైన సేవ చేయాలి. దేవుడి ఉపకరణాలుగా ఇతరులకు నిశ్శబ్దంగా సాయం చేయడానికి మీరు భూలోకంలో ఉన్నారు. గుర్తింపు కోసం నిరీక్షించకుండా పనిచేయండి. **వెలుతురు కోసం పనిచేసేవాడు నిశ్శబ్దంగా పనిచేస్తాడు.** దేవుడి ఉపకరణంగా పనిచేసేవాడు ఏది సరైనదో దానినే చేస్తాడు. తన మంచి పనుల ద్వారా అంధకారాన్ని అధిగమిస్తాడు, తన మంచి పనులను గురించి బయటకు చెప్పడు; వాటిని మళ్ళీ మనసులో విశ్లేషించుకోడు. అలా చేస్తే గర్వం వస్తుంది. దేవదూతలు మిమ్మల్ని మీ పనులను కూడా గమనిస్తారని గుర్తుంచుకోండి. ఇది గనుక మీకు తెలిస్తే, మీ ఆత్మ గుర్తింపు కోసం తపించదు. మీ అహమే దీనిని **కోరుతుంది.** మీరు చేసిన మంచి పని గురించి చెప్పిన క్షణంలో లేదా దాని గురించి బాగా ఆలోచించినపుడు దాని విలువ పోతుంది. ఎవరికి సాయం కావాలో వారికి సాయం దొరికినా, మీరు పురోగమించలేరు ఎందుకంటే నిస్వార్థసేవకు అసలైన అర్థం మీకు అవగాహన కాలేదు. 'నిస్వార్థం' అంటే తాను ఇతరులకు చేసిన దాని గురించి తక్కువ ఆలోచించడం. ఇదే దైవభక్తికి నిజమైన అర్థం. ఇతరులకు సేవ చేస్తూ మీరు దైవసేవ చేస్తారు.

☙ *భక్తి అంటే ఏమిటి?*

భూలోకంలో దైవభక్తి పూజలు, వ్రతాలకు సంబంధించి ఉంటుంది. పెద్ద మొత్తంలో ధనం ఖర్చుపెట్టడం, పెద్ద ఎత్తున పూజలు, వ్రతాలు, ఉత్సవాలు నిర్వహించడం సేవ[15] కాదు. దానధర్మాలకు, ఉత్సవాలకు ఎంత ఎక్కువ ఖర్చు పెట్టారనే దానిపై మీ దైవభక్తి ఆధారపడి ఉండదు. మౌనంగా, నిస్వార్థంగా మీరు చేసే సేవపై ఆధారపడి ఉంటుంది. ఇతరులకు సాయం చేసేటప్పుడు ఏమీ ఆశించకండి. ఇతరులకు సాయం చేస్తే నాకేం లాభం వస్తుందని అనుకున్న క్షణంలోనే మీ ఉద్దేశ్యం అపవిత్రమైపోతుంది. ఇంక ఆ పని గురించి మర్చిపోండి. మంచి పని చేస్తే మీకు సంతోషంగా అనిపిస్తుంది. మరొకరి జీవితంలో మంచి మార్పు తీసుకొని వస్తే మీకు బాగా అనిపించడం సహజం. కాని ఆ ఆలోచన మీకు గర్వాన్ని తెప్పించకూడదు. **తన పనిలో దేవుడు మిమ్మల్ని ఉపకరణంగా చేసుకున్నందుకు ఆయనకు కృతజ్ఞులుగా ఉండండి.** దీనివలనే మీకు ఆశీస్సులు

15. సేవ అంటే నిస్వార్థంగా పనిచేయడం

లభించాయి. ఆ ఆశీస్సును, బాగా అనిపించ దాన్ని మరొకరికి సాయం చేయడానికి ఉపయోగించండి. ఆ భావాన్నే మనసులో ఉంచుకొని, ఇంకెవరికీ సేవ చేయకుండా ఉంటే, ఆ భావం త్వరగా పోతుంది. ఆధ్యాత్మిక ప్రగతిలానే సేవ కూడా అనంతమైన చక్రం, మీ పని పూర్తయింది, విశ్రాంతి కావాలంటే ఆగండి. మీ పని ఎన్నటికీ పూర్తి కాదు. చెయ్యాల్సింది ఎంతో ఉంటుంది ఎప్పుడూ. పునరుత్తేజం పొందండి. విశ్రమించకండి. వ్యక్తిగతమైన బాధ ఉంటే ఆ బాధను సేవగా మార్చుకోవడానికి ప్రయత్నించండి. మీరు చేయగలిగే నిస్వార్థమైన పని అదే.

దేవుడు మీకిచ్చిన ప్రతిభలను, నైపుణ్యాలను ఉపయోగించి మీ బాధను సేవగా మార్చుకోవచ్చు. ఇది మీ మూడో ధ్యేయం: **ప్రతిభలను, నైపుణ్యాలను ఇతరుల ఎదుగుదలకు ఉపయోగించడం.** మొదటి రెండు ధ్యేయాలు ఆత్మోన్నతి, నిస్వార్థ సేవ అందరికి ఉంటాయి. ప్రతివారికీ మూడో ధ్యేయం కూడా ఉంటుంది కాని మూడో ధ్యేయం ఎవరికి వారికి భిన్నంగా ఉంటుంది. ఇది మీ ప్రతిభకు సంబంధించి ఉంటుంది. ఈ ప్రతిభ మీకున్న నైపుణ్యం కావచ్చు – ఉదాహరణకు – పాడడం, నృత్యం చేయడం, రాయడం, నటించడం, ఆటలాడడం మొ॥నవి. మీ ప్రతిభ వృద్ధులతో ప్రత్యేక సంబంధం కలది కావచ్చు, పిల్లలతో అనుబంధం కావచ్చు, జంతువులతో కావచ్చు, బాగా వంట చేయడం గాని, తోట పని బాగా చేయడం కాని, వడ్రంగి పని చేయడంగాని కావచ్చు. ఇది మీకు బాగా ఉన్న ప్రతిభ. అంతేకాకుండా ఎన్నో జన్మల ద్వారా సాధించిన ప్రతిభ ఇది. **భూలోకంలోని ప్రతి మనిషికీ ప్రతిభ ఉందని గుర్తుంచుకోండి. దేవుడు తన బిడ్డను ఆశీర్వదించకుండా భూలోకానికి పంపడు.**

మీరు చేసే చెడు పనులు చెడు కర్మను సృష్టించినట్లే, మీరు చేసే మంచి పనులు సత్కర్మను సృష్టిస్తాయి. **ఈ సత్కర్మ మీకు ఆధ్యాత్మిక ప్రతిభగా లభిస్తుంది.** ఈ నైపుణ్యం మీకు ఆత్మతృప్తినివ్వడమే కాకుండా ఇతరులకు సాయపడుతుంది. మీకు ఏదైనా పని బాగా వచ్చి ఉంటే దానిని మీ ఆత్మ ఎన్నో జన్మల ఫలితంగా పొంది ఉంటుంది. ఈ జన్మలో మాత్రం ఈ విషయం మీ భౌతిక మనస్సుకు మొదటిసారి తెలిసి ఉంటుంది. మీ ప్రతిభను మొదటిసారి కనుక్కోవడం లేదు. మళ్ళీ కనుక్కుంటున్నారు. మీ ప్రతిభ ఏదైనా సరే దానిని ఎక్కువమందికి మంచి చేయడానికి ఉపయోగించాలి. నైపుణ్యం ఉన్న చాలామంది డబ్బు సంపాదనకు, పేరు గడించడానికి దానిని ఉపయోగిస్తారు. కాని అది మీ అంతిమ ప్రయోజనం కాదు. మానవాళికి ఉపయోగపడేలా దానిని తయారు చెయ్యండి. పేరు గడించే అదృష్టం ఉంటే దానిని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రచారం చేసే వేదికగా ఉపయోగించండి. మీ హోదాను జనానికి స్వస్థత చేకూర్చడానికి, సంతోషంగా ఉంచడానికి, పైకి తీసుకురావడానికి ఉపయోగించండి. మీ ప్రతిభను వివేకంతో ఉపయోగించి దేవుడి ఉపకరణంగా ఉంటూ దాన్ని సరిగ్గా ఉపయోగించాలి.

మీరు చేసే పనిలో శిఖరాగ్ర స్థితిని చేరాలి కాని ప్రాపంచిక ప్రయోజనాల కోసం మీ ప్రతిభను ఉపయోగించవద్దు. మీ ప్రతిభ పరమోద్దేశాన్ని కనుగొనండి.

☸ *మన మూడో ధ్యేయాన్ని తెలుసుకొనే మార్గం ఏదైనా ఉందా?*

మీ మూడో ధ్యేయం సహజంగా మీరు చేయాలనుకునేది, మీకు బాగా ఇష్టమున్నది. ఆఫీసులోనో, ఫాక్టరీలోనో పనిచేస్తూ దైనందిన జీవితం గడుపుతూ ఉండవచ్చు. అయినా గాని, మీ సామర్థ్యాలతో సానుకూల ప్రభావం వేయండి. సానుకూల ప్రభావం అంటే, ఇతరులకు స్ఫూర్తినివ్వడం, దయార్ద్రమైన చర్యతో ఆశను కల్పించడం. మీరు గర్విష్ఠులైనా, భయస్థులైనా ప్రాపంచిక సంపదలపై ఆసక్తిగలవారైనా మీ భౌతికమనస్సు మిమ్మల్ని మీ ధ్యేయానికి దూరంగా తీసుకువెళుతుంది. **భూలోకంలో మీరు మీ ఆధ్యాత్మిక ధ్యేయాన్ని పూర్తి చేయకపోతే, భూలోకంలో మీరేం సాధించినా మీ జీవితం వ్యర్థం, మీ ప్రయాణం పూర్తవదు.**

☸ *భూలోకంలో కొందరికి తమ ధ్యేయం తెలుసు. కొందరికి తెలియదు. ఎందుకని?*

1. మీ ధ్యేయం తెలియడానికి మీరు మంచి ఆధ్యాత్మిక స్థాయిలో ఉండాలి. మీరు తప్పుదారిలో ఉంటే, ఆత్మోన్నతి అనే మొదటి ధ్యేయానికి చాలాదూరంగా ఉంటారు కనుక సేవ ప్రశ్నే ఉదయించదు.

2. ఉపచేతనాత్మక మనస్సు తెరచుకొని ఉంటే మీ ధ్యేయాన్ని మీరు గుర్తించగలరు. మీరు బాగా తార్కికులై, మీ అంతఃప్రేరణను పట్టించుకొనకపోతే, మీ అసలైన ఉద్దేశ్యం నుంచి మీరు పారిపోతున్నారు. అతిగా విశ్లేషిస్తూ పోయినప్పుడు భౌతిక మనస్సు అడ్డంకిగా మారుతుంది.

3. మీరు సంసిద్ధంగా ఉన్నపుడే మీ ధ్యేయం తెలుస్తుంది. త్వరగా తెలిస్తే మీరు అబ్బురపడవచ్చు లేదా గర్వితులు కావచ్చు. ఆ ధ్యేయం ఇచ్చే బాధ్యతను మీరు అంగీకరించాలి. దానిని నిర్వర్తించే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి.

4. మీ నిబద్ధత స్థాయి కీలకం. ఆధ్యాత్మిక మార్గంలో మీరెంత అంకిత భావంతో ఉన్నారు? మీరు ఒకే విధంగా ఉంటూ, మీ జీవితంలో ఆధ్యాత్మికతకే ప్రాధాన్యం ఉంటే, మీ ధ్యేయం వైపు మీకు మార్గం చూపడం జరుగుతుంది. కొన్నిమార్లు మనుషులు తమ ధ్యేయాలను అర్థం చేసుకోవాలని నిజాయితీగా ప్రయత్నించరు, అందువల్ల వారు ముందుకు సాగరు, బాగుపడరు.

భూలోకంలో దైవకార్యం నెరవేరడానికి మీరాక మార్గం; ఒకవేళ మీరు చెడుమార్గంలో పడి మిమ్మల్ని మీరు కలుషితం చేసుకుంటే, మీ ధ్యేయాన్ని పూర్తి చేసే అవకాశాన్ని తిరస్కరిస్తున్నారు, మీ ప్రతిభను కోల్పోతారు. మీరు గనుక అపవిత్ర మార్గమైతే మీ ధ్యేయం వైపు మిమ్మల్ని నడిపించి, దానిని సాధించేలా చేయగలదైన ఆత్మలోకం నుంచి వచ్చే మార్గదర్శకత్వం మీకు అందదు. ప్రతి ఆత్మకూ ఒక ఉద్దేశ్యం ఉంటుంది. ఆ ఉద్దేశ్యం మీరు ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మొదలుపెట్టినప్పుడు మాత్రమే మీకు తెలుస్తుంది. ఒకసారి మీరా ఉద్దేశ్యాన్ని కనుగొంటే ఇంక ధ్యేయం పూర్తి చేస్తూ పోతారు. మీరు నిజంగా సంతోషంగా, శాంతితో ఉంటారు.

ⓢ *వ్యక్తులు తమను తాము కలుషితం చేసుకుంటారని మీరన్నారు. మంచివక్తలు కూడా తప్పు చేస్తారా?*

చేస్తారు. ఉదాహరణకు భూలోకంలో ప్రకృత్యతీత ప్రతిభావంతులెందరో (psychics) ఉన్నారు. వారు గనుక నిరంతరం తమ పనికి భౌతిక సంపదలు కోరితే వారి ప్రగతి పరిమితమై పోతుంది. వాళ్ళు మంచి పని చేస్తారు, గాని వారికి సంపద కావాలి పూర్తిగా నిస్వార్థంగా చెయ్యరు కనుక కావలసినంత ప్రగతి లభించదు. సంపదతో ప్రమేయం లేకుండా మంచి పని చేస్తే, ఉపచేతనాత్మక మనస్సు ధ్యేయాన్ని గుర్తిస్తుందనడంలో సందేహం లేదు. కాని ఒకసారి సఫలత సాధించారంటే, ఆ సఫలతే ఒక పరీక్ష. అది మిమ్మల్ని చెడు మార్గంలో నడిపించడానికి మీరు అంగీకరించకూడదు. ప్రతిభలు మనం వాటిని ఎలా ఉపయోగిస్తామో తెలుసుకొనే పరీక్షలు.

ⓢ *బాధ్యత, సేవ రెండూ ఒకటేనా?*

కాదు. తేడా ఉంది. మీ ఆరోగ్యాన్ని కాపాడుకొనడం మీ మొదటి బాధ్యత. మీ ఆత్మ ధరించే వస్త్రం శరీరం. దీనిని దేవుడిచ్చాడు. దీనిని సంరక్షించుకుంటూ, జాగ్రత్తగా చూసుకోవాలి. మీ ధ్యేయాన్ని పూర్తి చేసేందుకు ఆత్మకు సాయపడే సాటిలేని ఉపకరణమిది. అనారోగ్యంగా ఉన్న శరీరం మనసుని పాడు చేస్తుంది. ఇది ఆత్మ మళ్ళీ ఎందుకు జన్మించిందో తెలుసుకోలేని పరిస్థితికి చేర్చి అసంతృప్తికి, అజ్ఞానానికి లోను చేస్తుంది. మీ శరీరం దేవాలయం. దానిని గౌరవించాలి.

ఎవరినైనా సంరక్షించడం అంటే తల్లిదండ్రులనో, తాతనో, బిడ్డలనో సంరక్షించడం మీ బాధ్యత. ఏదో త్యాగం చేస్తున్నామనే భావన లేకుండా ఈ బాధ్యతను నిర్వర్తించాలి. మనుషులెంత స్వార్థపరులైనారంటే ఎవరైనా కొంచెం దయచూపిస్తే, ఆశ్చర్యపడే పరిస్థితిలో ఉన్నాం. స్వభావసిద్ధంగా మీరు దయ, సానుభూతి లేనివారైతే, ఎక్కడ తప్పు చేశారో ప్రశ్నించుకోండి. మీ కుటుంబానికి, స్నేహితులకు సాయం చేసే అవకాశాన్ని కోల్పోతే ఒక వాగ్దానం భంగం చేసినట్లే.

వ్యక్తికి వీరి బాధ్యత ఉంది

1. పిల్లలు

2. తల్లిదండ్రులు

3. దాంపత్య భాగస్వామి

4. ఇతర కుటుంబ సభ్యులు

5. స్నేహితులు.

సన్మార్గంలో ఉన్న వారి పట్లే మీకు బాధ్యత ఉందని గుర్తుంచుకోండి. వాళ్ళు దారి తప్పితే దారి చూపండి. అయితే తెలిసి కూడా వారు చెడుదారి పడితే విచక్షణను ఉపయోగించండి. వ్యక్తులు మిమ్మల్ని ఉపయోగించుకొనే అవకాశం ఇవ్వద్దు. ఇతరులకు సాయం చేయడం మీ బాధ్యత అని గుర్తుంచుకోండి. నిజానికి 'సాయం' అనేదేదీ లేదు. ఈనాడది అరుదైంది కనుక 'సాయం' అనే భావనను మీరు రూపొందించు కున్నారు. తొలినాళ్ళలో సాయం బాధ్యతే. సాయమని విడిగా ఏదీ లేదు. తల్లిదండ్రులు, పిల్లలు, స్నేహితులుగా అవసరమైంది చేయడం మీ బాధ్యత. ఇది సహజంగా చేయాల్సినది. ఆలోచించి జాగ్రత్తగా చేసేది కాదు. దురదృష్టవశాత్తు ఈనాడు జనం తీసుకోవడం, ఇవ్వడం వంటి వాటిలో అనూహ్యంగా ప్రవర్తిస్తున్నారు కనుక జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఏర్పడుతున్నది. అయినాగాని ఇది మానవులందరికీ స్వభావ సిద్ధంగా రావాల్సిన గుణం.

సేవ, సాయం వ్యక్తి బాధ్యతే. కాని జనానికి ఈ సంగతి తెలియదు కనుక తేడా చూస్తున్నారు. మనుషులు స్వార్థపరులయ్యారు. ఆత్మసత్తలు ఇతరులకు సేవ చేసి స్ఫూర్తిని పొందుతాయి. భూలోకంలోని ఆత్మలకు దైవ నియమాల పట్ల జాగృతిని పెంచడం ఆత్మసత్తల ధ్యేయం. తిరిగి ఆ ఆత్మలు ఈ జ్ఞానాన్ని ఇతరులకు పంచి, తాము కూడా మారతాయనే ఆశ వారిది.

ఈ వ్యక్తి తన ధ్యేయానికి తయారుగా ఉండే మార్గం ఉందా?

మీరు ఆధ్యాత్మిక మార్గంలో ఉంటే ఇది సహజంగానే జరుగుతుంది. పరీక్ష, శిక్షణ మిమ్మల్ని మీ ధ్యేయం వైపు నడిపిస్తాయి. మీరు తయారు కావడానికి సాయం చేస్తాయి. ఉదాహరణకు, మీరు ఆత్మలోకంలో ఉన్నపుడు న్యాయం చెయ్యడం మీ ధ్యేయం అనుకున్నారు. భూలోకంలో మీరు పరీక్షకు నిలబడి, శిక్షణ పొంది మీ ధ్యేయానికి తయారవుతారు. ఇవి దానిని గుర్తించడానికి మీకు సాయపడతాయి. బహుశ పసిబిడ్డగా ఉన్నపుడో, కిశోరప్రాయంలోనో మీకు అన్యాయం జరగవచ్చు. భూలోకంలో ఎంతగా అన్యాయం ఉందో మీరప్పుడు గుర్తిస్తారు. ఈ పరిస్థితులన్నీ మీకు శిక్షణ కోసం

ఎదురవుతాయి.

మీ పరీక్ష ఇది : అహానికి అన్యాయాన్ని భరించడం చాలా కష్టం; న్యాయం పొందడానికి అక్రమమైన గాని, అనైతికమైన గాని పద్ధతులను అవలంబిస్తారా? పోలీసు అధికారో, వకీలో, న్యాయమూర్తో అయిన తర్వాత అవినీతిపరులవుతారా? మీరు గనుక ఉపచేతనాత్మక మనస్సును ఉపయోగిస్తే నేర్చుకొనే ప్రక్రియగా ఈ ప్రతికూల అనుభవాన్ని భావిస్తారు. నిజాయితీగల వ్యక్తిగా శాంతిభద్రతలు కాపాడే వ్యక్తిగా కావాలనుకొన్న మీ ధ్యేయానికి ఇది దారి చూపుతుంది.

మీ ధ్యేయాన్ని బట్టి పరీక్షలు, శిక్షణలో తీవ్రత ఉంటుంది. దానిని సాధించడానికి కావలసిన అర్హతలు, ఆత్మ లక్షణాలపై ఇవి ఆధారపడి ఉంటాయి. అహాన్ని చంపడమే ఈ పరీక్షలు, శిక్షణలో ఉంటుంది. ఎందుకంటే అహం మీపై ఆధిపత్యం చలాయిస్తుంటే ఆత్మకు శిక్షణ ఇవ్వడం కుదరదు మీకు.

ఆధ్యాత్మిక శిక్షణ పొందుతున్నపుడు ఇది మరింత ఉన్నత ప్రయోజనాన్ని నేర్చుకొనడానికి జరుగుతున్నదని గుర్తుంచుకొనడం మొదటి అడుగు. దేనికోసం శిక్షణ పొందుతున్నారో అర్థం చేసుకోండి. మీరున్న క్లిష్ట పరిస్థితిని విశ్లేషించుకోండి. మిమ్మల్ని వ్యతిరేకంగాను, అదుపు తప్పేలా చేస్తున్న బలహీనత ఏమిటో నిర్ధారించుకోండి. సానుకూలంగా పరిస్థితి నుంచి బైటపడేలా పనిచేయనివ్వకుండా మీకు అడ్డుపడుతున్నదేమిటో ప్రశ్నించుకోండి. అదే మీ బలహీనత. ఆ విషయంలోనే మీ ఆత్మకు శిక్షణ కావాలి. ఆ పాఠమే మీరు నేర్చుకోవాలి. ఆ విషయంలోనే మీకు పరీక్ష ఉంటుంది.

ఇంకో విషయంలో కూడా భూలోకంలోని ప్రతిమనిషి పరీక్షింపబడతాడు. ఇది విశ్వాస పరీక్ష - మీ అత్యున్నత పరీక్ష. ఈ విశ్వాస పరీక్ష దేవుడిపై మీ నమ్మకానికి సంబంధించినది. దేవుడిని మీరు చూడకపోయినా ఆయనను విశ్వసించేంత వినయము, నమ్మకము మీకున్నాయా? మీరు గనుక ఈ పరీక్షలో తప్పితే ఆధ్యాత్మిక ప్రయాణం ఉండదు. భూలోకంలో దేవుడిని నమ్మని మనుషులున్నారు, కాని ఏది సరైనదో దానినే చేస్తారు. దేవుణ్ణి నమ్ముతామని చెప్పి ఆయన పేరున ఇతరులకు, మీకు హాని చేసుకొనడం కన్న ఇది చాలా మేలు. దేవుడిని నమ్మకపోవడమంటే విశ్వాస పరీక్ష అనే పెద్ద పరీక్షలో తప్పినట్టేనని తెలుసుకోండి. చాలామంది దేవుడు తమకు కనిపించి, లేదా ఉన్నానని తన అస్తిత్వానికి రుజువు చూపిస్తే నమ్ముతామని అంటారు. కాని ఇది పరీక్ష. అందుకనే మీ ఉపచేతనాత్మక మనస్సు ఆత్మలోక స్మృతులను భౌతిక మనస్సుకు తెలియనివ్వదు.

విశ్వాస పరీక్ష పాసవడానికి భౌతిక మనస్సుకన్న ఉపచేతనాత్మక మనస్సుకు మీరు ప్రాధాన్యమివ్వాలి. ఉపచేతనాత్మక మనస్సును తెరవగానే, దేవుడున్నాడని మీకు

తెలుస్తుంది. ఎందుకంటే ఉపచేతనాత్మక మనస్సుకు దేవుడున్నాడని తెలుసు; మీ భౌతిక మనస్సుకే ఎప్పుడూ రుజువులు కావాలి. మీరు కేవలం భౌతిక మనస్సునే పెంచుకుంటే విశ్వాస పరీక్షను తప్పుతారు.

మీ బలహీనతలే మీ దురాకర్షణలు.

మీ బలహీనతలను పరీక్షించడం జరుగుతుందని గుర్తించండి. దురాకర్షణలు అనగానే చాలామంది సెక్స్, మత్తుమందులు, ఆహారం, మద్యం, డబ్బు మొదలైనవి దురాకర్షణలని అనుకుంటారు. ఇవి కచ్చితంగా దురాకర్షణలే. అయితే దురాకర్షణలు మరోస్థాయిలో కూడా ఉంటాయి. గర్వం, సందేహం, కోపం, ప్రతీకారం, ఈర్ష్య మొ॥నవి. ఇవి మీ వ్యతిరేక ఆత్మ లక్షణాలు. దైవనిర్దేశిత సన్మార్గానికి దూరం చేసేదేదైనా సరే దురాకర్షణే. నిరంతరం మిమ్మల్ని ఈ విషయాలలో పరీక్షించి, శిక్షణనిచ్చి మీ తప్పులను మీరు తెలుసుకొనేలా చేయడం జరుగుతుంది. నిరంతరం మిమ్మల్ని మీరు నిజాయితీగా, ధైర్యంగా తరచి చూసుకోండి. మీ లోపాలను అంగీకరించే ధైర్యం కలిగి ఉండండి. తప్పేమిటో తెలియకపోతే దానినెలా సరిచేస్తారు?

అంతేకాక, తప్పుని నియంత్రించడం గురించి మాత్రమే ఆలోచించకండి. దానిని మరో ఉన్నత స్వభావం కలదానిని అలవరచుకొనడం ద్వారా వదలండి. మీకు గర్వం ఉంటే దానిని నియంత్రించుకొనడమే కాదు వినయాన్ని అలవరచుకోండి. మీలో ఉన్న మంచిని కూడా గుర్తించండి. స్వయం విలువ, స్వయంప్రేమ అంటే తమ ఆత్మను తాము ప్రేమించి, గౌరవించుకొనడం. ఇది చాలా ముఖ్యం. మీ బలాలను ఉపయోగించండి. బలహీనతలు మిమ్మల్ని ఉపయోగించుకోకూడదు. మీలో ఉన్న వ్యతిరేక లక్షణాలను పోగొట్టుకొనడానికి మీలోని మంచిని, సానుకూల లక్షణాలను మీరు ఉపయోగించుకోవాలి.

ఆత్మహత్య

"ప్రాణం తీసుకోవడం పూర్తిగా దైవ నియమాలకు విరుద్ధం"

"దేవుడు మీకు ప్రాణం పోశాడు. తీసేయడానికి అది మీది కాదు"

"మీ సమస్యలను మీరు పరిష్కరించుకోవాలి. చెడుతో పోరాడాలి. ఆత్మను పవిత్రీకరించుకోవాలి"

భూలోకంలో ఎంతోమంది, ప్రత్యేకించి చిన్న పిల్లలు ఎందరో ప్రాణాలు తీసుకుంటున్నారు. వీరి ఆత్మలు ఏమవుతాయి?

ఆత్మలోకానికి రాగానే ఈ ఆత్మలకు తాము పూర్తిగా ఒంటరులైపోయామనిపిస్తుంది. తాము పొరపాటు నిర్ణయం తీసుకున్నామని వీరు అప్పుడు గుర్తించడమే దీనికి కారణం. భూలోకంలో ఉండి తమ ప్రయాణం పూర్తి చేయకుండా ప్రాణం తీసుకుని వాళ్ళు దాన్ని ఆపేశారు. భూలోకంలో మీరు తీసుకొనే అత్యంత తప్పు నిర్ణయాలలో ఇది ఒకటి. మీ ఆత్మకు మీరే స్వయంగా చేసుకొనే హాని ఆత్మహత్య చేసుకోవడం.

మానవులకు సంకల్ప స్వేచ్ఛ ఉందని జనం వాదిస్తారు. మన ప్రాణం తీసుకొనే స్వేచ్ఛ మనకుండదా?

జీవితాన్ని అంతం చేసుకోవాలనుకోవడం మీ ఇష్టం, కాని మీరు దైవ నియమాలననుసరించి పనిచేస్తారు, ఆ నియమాలను ఉల్లంఘించినపుడు కొన్ని పరిణామాలుంటాయి. మీ దేహమే మీ దేవాలయం. మీ ఆత్మకు ఇది ఆరోగ్యకరమైన వాహనంలా ఉండాలని దేవుడు దీనిని ఇచ్చాడు. ఆ దేవాలయాన్ని నాశనం చేసినపుడు, సృష్టి పరమ ప్రయోజనమైన ప్రాణాన్ని మీరు తిరస్కరిస్తున్నారు. ఆత్మహత్య చేసే అసలైన హాని మీ ఆత్మకే. ఆధ్యాత్మికంగా ఒక ఆవరణ మొత్తం నుంచి మీరు పూర్తిగా కిందపడిపోతారు. అంతేకాకుండా ఎంతో చెడు కర్మను కూడా మీ ఆత్మకు కలుగచేస్తారు. మళ్ళీ మీరు భూలోకానికి వచ్చి, రెట్టింపు తీవ్రతతో అదే పరిస్థితులను ఎదుర్కొనాల్సి ఉంటుంది.

మీ పరీక్ష, శిక్షణ కూడా రెట్టింపు కఠినంగా ఉంటాయి. ఆత్మహత్య చేసుకునేవారు దేవుడికిచ్చిన మాటను తప్పుతున్నారు.

కొన్నిసార్లు మానవులు పడే వేదన భరించలేనిదై ఉంటుంది. కర్మను చెల్లించుకొనడానికి మనమందరం భూలోకానికి వస్తాం. ఆత్మ ఎదుగుదల కోసం పరీక్షింపబడతాం, శిక్షణను పొందుతాం. కొన్నిసార్లు మనం అనుభవించాల్సిన కర్మ ఎంతో ఉంటుంది. లేదా మనం కఠినమైన పరీక్షలను ఎంచుకుంటాం. మనం అనుభవించే బాధ, పరిస్థితులు చాలా తీవ్రంగాను, పరీక్షించే విధంగాను ఉన్నాగాని ఎలాగైనా సరే మనం మాత్రం ప్రయాణాన్ని పూర్తిచేయాలి. మనుషులకు అర్థం కానిదేమిటంటే తాము ఆత్మహత్య చేసుకున్న తర్వాత ఇతరులు పడే బాధ కన్న, తమ బాధ అంత భరించలేనిది కాదని.

ఆత్మహత్య స్వార్థపూరితమైన చర్య

మనిషి తనకు బాధగా ఉంటే ఇతరుల గురించి ఆలోచించడు. మీరు పడే బాధ మీ గురించి మాత్రమే ఆలోచించేలా చేస్తుంది. మీ ప్రియతముల సంగతేంటి? మీరు వదిలి వెళ్ళిపోయే మిగిలిన వారి సంగతేంటి? ఇలా చేస్తూ మీరు ఆత్మకు హాని చేసుకోవడమే కాకుండా ఇతరుల ఆత్మలకు హాని చేస్తూ మరింతగా కర్మను పెంచుకుంటున్నారు, కొంతమంది తమకెవరూ లేరని, కేవలం ఆ ఒక్క కారణంతోనే ప్రాణం తీసుకోవాలనుకుంటారు. కాని బహుశ అదే వారి కర్మ ఏమో, లేకపోతే ఒంటరిగా ఉన్నా వారెంత ధైర్యంగా ఉండగలరో పరీక్షింపబడుతున్నారేమో. స్వార్థం ఉంటే మీ సమస్యలు ఉన్నదానికన్నా చాలా పెద్దగా అనిపిస్తాయి.

ఈ రోజుల్లో ఒంటరితనం పెద్ద సమస్య. వ్యక్తులకు కుటుంబాలున్నాగాని ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. భూలోకంలో ఇంత ఒంటరితనం ఎందుకుంది?

ఇలా అనిపించడానికి రెండు కారణలున్నాయి. మొదటిది భూలోకంలో మీరు పూర్ణమైన ఆత్మ కాదు. కవల ఆత్మల భావన మీకు తెలుసు గనుక, మీరు ఒక ఆత్మలో సగమేనని అర్థం చేసుకుంటారు. ఆ రెండో సగం కోసమే మీరు ఒంటరితనంతో తపిస్తారు. ఏది ఏమైనాగాని, ఒకసారి ఈ విషయం మీకు అర్థమైందంటే, భూలోకంలో పరిపూర్ణంగా ఉన్నాననే భావాన్ని సాధించడానికి కృషి చేయండి. ఇది మీ పరీక్ష. మీ ఆధ్యాత్మిక ధ్యేయాన్ని పూర్తి చేస్తే భూలోకంలో పరిపూర్ణతా భావన మీకు కలుగుతుంది. ఒకసారి **మీ జీవిత పరమార్థాన్ని గుర్తిస్తే, మీకు ప్రశాంతంగా ఉంటుంది.** భూలోకంలో మీ ధ్యేయాన్ని పూర్తి చేయలేకపోతున్నారని ఉపచేతనాత్మక మనస్సు చెప్పగానే, మీకు ఒంటరిగా ఉన్నామనే భావం కలుగుతుంది. మరో విషయం, భూలోకం మీ అసలు

నివాసం కాదని ఉపచేతనాత్మక మనస్సుకు తెలుసు. ఉన్నత ఆవరణలలో లభించే శాంతికోసం, సమూహాత్మల సాన్నిహిత్యం కోసం, ప్రియతముల సమక్షం కోసం అది ఆత్మలోకానికి వెళ్ళాలని తపిస్తుంది.

అయితే మీరు అసంతృప్తితో ఉండడానికి ఇది సాకుగా చెప్పకూడదు; భూలోకంలో ఉండే అతి పెద్ద పరీక్ష తృప్తిగా ఉన్నామా లేమా అని. దానిని మనం తప్పకూడదు. మీరు శాంతి కోసం చావుకి ఎదురుచూడకూడదు. ఆత్మలోకంలో ప్రశాంతంగా ఉండాలంటే, మొదట భూలోకంలో ప్రశాంతంగా ఉండడం నేర్చుకోవాలి. ఒంటరితనం కూడా ఆ యుద్ధంలో భాగమే. దాన్ని సక్రమంగా నిభాయించుకోవాలి.

అంటే భూలోకంలో ఎప్పుడూ మనం ఒంటరితనంతో బాధపడు తుంటామని అర్థమా?

కానే కాదు. భూలోకంలో సంతోషంగా ఉండలేరని, ఎప్పుడూ ఒంటరితనంతో బాధపడతారని కాదు. కాని ఒంటరితనం వల్ల దుఃఖం, నిరాశ కలుగుతాయి. ఈ నిరాశ ఎక్కువైతే, ఆత్మహత్యకు ప్రేరేపిస్తుంది.

ప్రాణం తీసుకోవడానికి మనిషికి చాలా శక్తి, ధైర్యమూ కావాలనేది నిజమేనా?

నిజం కాదు. ప్రాణం తీసుకోవాలని అనిపించిందంటే, **ఆత్మను శక్తిమంతం చేసుకోవాల్సిన అవసరం ఉందని** అర్థం. ఈ శక్తి మీలోనే ఉంటుందని నమ్మండి. మీరు ఎదుర్కోలేని పరిస్థితిని దేవుడు ఎన్నడూ కల్పించడని తెలుసుకోండి. మీకు శక్తి ఉంది. దాన్ని ఉపయోగించండి. కొన్నిసార్లు ఆత్మహత్యే గౌరవప్రదమని చెప్పే అపోహ కూడా ఉంది. ప్రాణం తీసుకోవడంలో 'గౌరవం' ఏమీ లేదు. భూలోకంలో తన బాధ్యతలను ధ్యేయాన్ని పూర్తి చేయడానికి పనికి వచ్చే వాహనాన్ని ధ్వంసం చేసి మీ ఆత్మకు అపకారం చేసుకోవద్దు. గౌరవనీయమైన వ్యక్తిగా ఉండాలంటే బాధ్యతగా ఉండాలి, ఆధ్యాత్మికంగా ఏది సరైనదో దానిని చేయాలి. చేతులార తమ ప్రాణాలు తీసుకున్న చాలామంది ఒత్తిడికి తట్టుకొనలేక, ఇతరులు, సమాజము నమ్మే అపనమ్మకాలకు తలొగ్గి మాత్రమే ఇలా చేస్తున్నారు. దానిలో గౌరవించదగింది ఏముంది? దీనికి బదులుగా ఆధ్యాత్మిక జీవితాన్ని గడపండి. దేవుడిని గౌరవించండి.

ఆయన అభిప్రాయమే లెక్కలోకి వస్తుంది. భూలోకంలో ఆత్మ ఒక్కోసారి శరీరంలో ఉండలేనంతగా బాధపడుతుంది. దీనిలో సందేహం లేదు. కాని ఇది మార్పు కావాలని గట్టిగా చెప్పే సూచన. ఆత్మహత్య చేసుకొనడం దీనికి సమాధానం కాదు.

⚘ జీవితంలో అతి కింది స్థితికి (లోయెస్ట్ పాయింట్) చేరినప్పుడు ఏం చెయ్యాలి?

జీవితంలో అతి కింది స్థితికి చేరారంటే, దేవుడు మీ శక్తిని పరీక్షిస్తున్నాడని అర్థం. మీరు చేయాల్సినదల్లా ఒకే ఒక సానుకూలమైన అడుగు వెయ్యడం అంటే ధైర్యం ఉందని, గెలుస్తానని భావించడం. ఒక్కసారి మీ కర్మను చెల్లించి వేస్తే, పరీక్ష పాసయితే, మీ పరిస్థితులు మారతాయి. దేవుడు తన దూతలను మీకు సాయంగా పంపిస్తాడు. ఆత్మహత్య చేసుకోవాలనుకునే మనస్తత్వం ఉన్నవారితో కలిసి పనిచేయాలనుకునే ఆత్మలోక విశిష్ట ఆత్మలు కొన్ని ఉంటాయి. ఈ ఆత్మలోక ఆత్మలకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. అవి ఆ వ్యక్తికున్న ఆత్మలోక మార్గదర్శితో కలిసి పనిచేస్తాయి. ఆ వ్యక్తిని ప్రభావితం చేస్తూ (ప్రొజెక్షన్), ప్రార్థనల ద్వారా భూలోకంలోని పరిస్థితులకు తట్టుకొనేలా చేస్తాయి. ఉపచేతనాత్మక మనస్సు ద్వారా సందేశాలను పంపి ఆ వ్యక్తికి శక్తినిస్తూ బ్రతకడానికి దోహదపడతాయి. భూలోకంలోని ప్రజలు ఆత్మహత్యలు చేసుకునే పొరపాటు చేయడం దేవునికి ఇష్టం ఉండదు కనుక ఈ విశిష్ట ఆత్మలు ఉంటాయి. ఎందుకంటే **ఈ చర్యకు తీవ్ర పరిణామాలుంటాయి.** కళ్ళు తెరవండి. జీవించి ఉండాల్సిన కారణాలు తెలుసుకోండి. మీ ఆధ్యాత్మిక ధ్యేయం, సేవ, ఎదుగుదల ఇవి కారణాలు. ఇంకా కొన్నిసార్లు మీరు ఆత్మహత్య చేసుకోవాలనుకునే కారణాలు అర్థరహితమైనవని కూడా గుర్తించండి. ఉదాహరణకు, పరీక్షల్లో తప్పితే పిల్లలు తల్లిదండ్రులకు భయపడి ఆత్మహత్య చేసుకుంటారు. ఈనాడు చాలామంది తల్లిదండ్రులు పిల్లలతో కఠినంగా వ్యవహరిస్తూ వారిని భయపెట్టి పిల్లలు తప్పు పనులు చేయడానికి కారణమవుతున్నారు. కొందరు పిల్లలు లైంగిక హింసకు, మానభంగాలకు, బ్లాక్‌మెయిల్‌కు గురవుతున్నారు. హాని పాలవుతున్నారు. అటువంటి సమయాల్లో చెప్పుకోవడానికి ఎవరూ లేక ఆవేశంతో ఆత్మహత్య వంటి నిర్ణయాలు తీసుకుంటారు. తల్లిదండ్రుల మార్గదర్శకత్వం అంటే కఠినంగా ఉండమని కాదు – ఆ బిడ్డను అర్థం చేసుకోవడం, ఆ బిడ్డ ఆత్మకు ఏది శ్రేష్టమో దానిని చేయడం. కొన్నిసార్లు తల్లిదండ్రుల అజ్ఞానం, క్రూరత్వం, అవగాహనా లోపం బిడ్డను ఆత్మహత్యకు పురికొల్పుతాయి.

తల్లిదండ్రుల నస, భరించలేని క్రూరత్వం వల్ల కొందరు పిల్లలు కిటికీలోంచి దూకి చనిపోవాలనుకుంటారు. అటువంటి సమయాల్లో ఆత్మ శరీరంలో ఉండడానికి చాలా కష్టపడుతుంది. స్వల్ప విషయాలకు చాలామంది ప్రాణం తీసుకుంటున్నారు. ఆత్మలోకంలోకి వెళ్ళిన తర్వాత తాము ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించామో, తమ భయాలు ఎంత అర్థరహితమో వారికి అర్థమవుతుంది. ఓటమి తాత్కాలికమని, విజయానికి పునాది రాయి అని వారు గుర్తించాలి. బాధని అనుభవిస్తే తప్ప సంతోషం ఏమిటో తెలియనట్లే ఓటమి రుచి చూస్తేనే విజయం లభిస్తుంది. ఓటమి పాఠం నేర్పే

అనుభవం అంతే. తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రేమను పంచాలి. భయాన్ని కాదు. వారికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించాలి. ఈ జ్ఞానం గనుక మనసులో నాటుకుంటే వారు నిర్భయంగా ఉండి మనసులో మాట చెప్పగలుగుతారు. మంచి మనిషిగా ఉండాలనే అతి ముఖ్యమైన అంశాన్ని తల్లిదండ్రులు మరచిపోతున్నారు. పిల్లలకు ప్రాపంచికమైన లక్ష్యసాధనే పరమావధిగా చెప్పి తప్పుమార్గంలో వెళ్ళేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. ఈ విధంగా విజయానికి తప్పు అర్థాలు చెప్పి పిల్లలను తప్పుదారి పట్టిస్తున్నారు.

ఈ ఆత్మలకు సాయం చెయ్యడం ఎలా?

కొన్నిసార్లు **దయార్ద్రంగా చేసే చిన్న** పని నిరాశా నిస్పృహల నుంచి మనిషిని బయట పడేస్తుంది. ఇతరులపైన, తమపై తమకు తిరిగి వారిలో నమ్మకం ఏర్పడుతుంది. ఎవరైనా బాగా కష్టపడుతున్నట్లు మీకు అనిపిస్తే, వారితో మాట్లాడడానికి ప్రయత్నించండి. ఎవరైనా బాధననుభవిస్తున్నప్పుడు వారికి సాయం చేయగలిగితే మీకు దేవుని ఆశీస్సులు లభిస్తాయి. ఇతరుల ఆత్మహత్యకు కారణమైన వ్యతిరేక ఆత్మల విధిని మనం ఊహించలేం.

ఒక వ్యక్తిని ఆత్మహత్యకు పురికొల్పే వ్యక్తి పాపం చేస్తున్నాడు. ఇది హత్యకు సమానమైన పాపం.

కొన్నిసార్లు ఆత్మహత్య చేసుకుంటామని కొందరు మానసికంగా బెదిరిస్తుంటారు. ఎవరి దృష్టినో తమవైపు తిప్పుకోవాలని, ఒక విషయాన్ని స్పష్టం చెయ్యాలని, లేదా ఎవరి మీదో ప్రతీకారం తీర్చుకోవాలని వ్యక్తులు ఆత్మహత్యా ప్రయత్నం చేయడమో, ప్రాణం తీసుకోనడమో చేస్తారు. ఇతరులు తప్పు చేసినట్లుగా భావించాలని వారిలా చేస్తారు. దీనివల్ల వారింకా కిందికి పడిపోతారు. ఎంతో కర్మను పోగు చేసుకుంటారు.

వ్యతిరేకమైన లేదా ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు కలిగినపుడు ఇక్కడ చెప్పే కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. ఈ ఆలోచనలు వెంటనే ఆపేయాలి లేకపోతే అవి మిమ్మల్ని పెడదారిలో పడేస్తాయి.

1. వ్యతిరేక ఆలోచన రాగానే వెంటనే దాన్ని పారదోలండి. మనసును మరల్చుకుని సానుకూలమైన పని చేయండి. దాన్ని గురించి ఎంతగా విశ్లేషిస్తే, అంతగా దానికి శక్తి లభిస్తుంది. ఆ ఆలోచనలు వదిలి మనసును మరో విషయంపై లగ్నం చెయ్యండి. శారీరకంగా ఏదో ఒక పనిచేయండి. మారడానికి ఎప్పుడైనా తగిన సమయమే.

2. చదవండి. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించండి. మీ జీవితంలో కొన్ని సంఘటనలు ఎందుకు జరుగుతాయో అర్థమైతే వాటిని అంగీకరించడం, భరించడం తేలికవుతుంది. ఉదాహరణకు కర్మ సిద్ధాంతం తెలిసి ఉంటే, కష్టాలున్నప్పుడు అంతగా బాధపడరు.

3. మీ ఉపచేతనాత్మక మనస్సును తెరవండి. మీ అసలైన శక్తి దానిలోనే ఉంది. కష్టకాలంలో కావలసిన మార్గదర్శకత్వాన్ని, శక్తిని ఉపచేతనాత్మక మనస్సు ఇస్తుంది.

4. జనం ఏమనుకుంటారోనని భయపడకండి. వాళ్ళు మిమ్మల్ని తక్కువగా చూసే అవకాశం ఇవ్వకండి. మీరు చేసేది సరైన పని, మంచిదీ అయితే మీరు దైవ నిర్దేశిత సన్మార్గంలో ఉన్నట్లే. చివరికి మీ తల్లిదండ్రులు దానిని వ్యతిరేకించినా దృఢ నిశ్చయంతో ఉండండి. అయితే నిజంగానే మీరు దైవ నిర్దేశిత సన్మార్గంలో ఉన్నారని గర్వంతో మిమ్మల్ని మీరు మోసం చేసుకోవడం లేదని నిర్ధారించుకోండి.

5. ఒకవేళ మీరు తప్పుచేస్తే, ఒప్పుకోండి. మారండి. అంతేకాని అపరాధ భావం మిమ్మల్ని తినేయనివ్వకండి. తప్పులు చేయడం మానవ సహజం. పాఠం నేర్చుకుని, అదే తప్పులు మళ్ళీ చేయకుండా ఉండడం ముఖ్యం. తప్పును కప్పి పుచ్చాలనుకోవద్దు; అలా చేస్తే ఇంకా చాలా తప్పులు జరిగే ఆస్కారం ఉంది. బాధ్యతను అంగీకరించండి.

6. దేవుడిని నిజాయితీగా, హృదయపూర్వకంగా, చిత్తశుద్ధితో ప్రార్థించండి. సాయంకోసం దేవదూతలను పంపమని కోరండి. మార్గదర్శకత్వాన్ని, రక్షణను ఇవ్వమని దేవుడిని కోరడం ముఖ్యం.

7. ఇరవై నాలుగు గంటలూ దీపం వెలిగించి ఉంచండి. దీపం ప్రతికూలశక్తిని హరించివేసి, మీ చుట్టూ ఉన్న చెడు స్పందనను పోగొడుతుంది.

8. చెడ్డ వ్యక్తులు, తప్పుదారి పట్టించే వారి సావాసం చెయ్యకండి.

9. సమస్య వచ్చినపుడు మీకు నమ్మకం ఉన్నవారితో చర్చించండి. మీకు కావలసిన స్పష్టత వారి ద్వారా లభించవచ్చు. ఒకవేళ భూలోకంలో మీరు నమ్మగలిగే వ్యక్తి లేకపోతే, మీరు మాట్లాడగలిగే మంచి వ్యక్తి మీ ఉపచేతనాత్మక మనస్సే. అది ఆత్మలోకంతో సంబంధం కలిగి ఉంటుంది.

10. బాధ తాత్కాలికమని గుర్తుంచుకోండి. అలాగే మంచి రోజులు కూడా ఎక్కువకాలం ఉండవు. సమస్యలు తీరిపోతాయి.

11. భౌతిక మనస్సును ఖాళీగా ఉంచవద్దు. ఏదైనా పనికివచ్చే పని చెయ్యండి. మీరు ఖాళీగా ఉంటే అది మిమ్మల్ని పెడదారి పట్టిస్తుంది. ఎప్పుడూ మంచివారితో కలిసి ఉండండి.

12. వ్యాయామం చెయ్యండి. చురుగ్గా ఉండండి. నడవండి. తాజా గాలిని పీల్చండి. ఎప్పుడూ ఇంట్లోనే ఉండవద్దు. మనసుకు, శరీరానికి, ఆత్మకు యోగ మంచిది.

13. వైద్యసహాయం తీసుకొనడానికి భయపడవద్దు. ప్రార్థనలు చాలాశక్తిమంతమైనవే కానికొన్నిసార్లు వైద్య సహాయం కూడా మీకు అవసరమవుతుంది. తీసుకోవడానికి సిగ్గుపడకండి. అదేదో మీ ఓటమి అనుకోవద్దు. ఒక్కసారి సమస్య తీరితే, మీకు మరింత శక్తి వస్తుంది. వివేకం వస్తుంది. మారవచ్చు. అయితే, ఎన్నడూ మందులకు బానిసలు కావద్దు.

14. ఆరోగ్యం కాపాడుకోండి. భూలోకంలో చాలామంది మద్యపానం, మాదక ద్రవ్యాలు, సిగరెట్లు తాగుతూ శరీరాన్ని నిదానంగా నాశనం చేసుకుంటున్నారు. అతిగా తినడం కూడా హానికరమే. ఇవన్నీ కూడా ఆత్మహత్యా సదృశాలే. ఎందుకంటే నిదానంగా శరీరాన్ని చంపుతున్నారు. జీవితకాలాన్ని తగ్గిస్తున్నారు. ప్రయాణాన్ని పూర్తిగా కొనసాగించకుండా మీ ఆత్మను నివారిస్తున్నారు. మీరు మాదకద్రవ్యాలు, మద్యం ప్రభావంలో ఉన్నపుడు వివేకం పని చేయదు. అత్యంత బలహీనంగా ఉంటారు. వ్యతిరేక శక్తి మిమ్మల్ని లోబరచుకొని వ్యతిరేక ఆలోచనలు వచ్చేలా చేస్తుంది. దానితో మీరు ఆ వ్యతిరేకతా ప్రభావంతో మీ ప్రమేయం లేకుండా అనాలోచితంగా పనులు చేస్తారు. భూలోకంలో జాగ్రత్త తీసుకోవలిసిన మరో విషయం వ్యభిచారం. ఒక్క బలహీనక్షణం మీకు జీవితకాల బాధను మిగల్చవచ్చు. మానవులు తక్షణమే కోరికలకు బానిసలై పోతారు. శరీరాన్ని సంరక్షించుకొనే విషయంలో చాలా అశ్రద్ధగా ఉంటారు. వ్యభిచారం కూడా ఒక రకమైన ఆత్మహత్యే. ఎందుకంటే ప్రతిసారీ ఒక జబ్బు అంటుకునే ప్రమాదం ఉంటుంది. అది మీ జీవితాన్ని అంతం చేయవచ్చు, మళ్ళీ ఇతరుల ప్రాణాలకు ప్రమాదం. ఇది మీ కర్మ కాదు. మీరు బాధ్యతారహితంగా ఉండాలనుకున్నారు. ఈ పరిణామాలు మీరు కోరుకున్నవాటి ఫలితాలే.

15. మీకెంత బాధ ఉన్నాసరే మరొకరికి సాయం చెయ్యాలి. అలా మిమ్మల్ని మీరు శక్తిమంతం చేసుకుంటారు. మీరు బాధపడుతున్నా ఇతరుల పట్ల సహానుభూతితో ఉండాలి. అప్పుడు తప్పనిసరిగా దేవుడు మీకు సాయపడతాడు. మీ ఉద్దేశ్యం నిస్వార్థమై ఉండాలి.

మానవ శరీరాన్ని గౌరవించాలి. ఆనందించాలి. మీరు బాగా జీవిస్తారని, ఇతరులకు సేవ చేస్తారని భావించి మనస్సు, శరీరం, ఆత్మ ఇవ్వడం జరిగింది. భూలోకంలో కొన్నిసార్లు మనుషులు ఎంతో వేదన చెందుతుంటారు, ప్రత్యేకించి తమ ప్రియతములు చనిపోయినపుడు. దీనికి దేవుడిని నిందించకుండా, "నాకే ఎందుకీ కష్టం పెట్టావు?" అని ప్రశ్నించకుండా ధైర్యంగా జీవితంలో మంచివైపు చూడండి. ఆత్మలోకంలోకి వెళ్ళిన

పిమ్మట మీ జీవితాన్ని సమీక్షించుకుంటే, ఎంతో చేయగలిగి ఉండేవారని, ఆత్మహత్యే దీనికి సమాధానం కాదని గుర్తిస్తారు. మీ జీవితం దేవుడిది. దానిని అంతం చేసే అధికారం ఎవరికీ లేదు. ఆత్మహత్య ఆత్మకు తిరోగమనం.

దేవుడు మీకు జీవితమనే కానుకనే కాకుండా అందమైన ఉపచేతనాత్మక మనస్సును, ఆత్మ మార్గదర్శిని ఇచ్చాడు. అంతేకాక జ్ఞానాన్ని సంపాదించగల భౌతిక మనస్సు నిచ్చాడు. దీనికి శిక్షణనిచ్చి ఉపచేతనాత్మక మనస్సు చెప్పిన ప్రకారం చేయించగలిగితే తప్పు ఒప్పు తెలుసుకొనడానికి సాయపడుతుంది. మీకు ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదుర్కొనగలమనే నమ్మకాన్ని కలిగించడానికి దేవుడు ఎంతో సహాయాన్ని, రక్షణను మీకు అందించాడు.

దేవుడు



"దేవుడు మనకు తనను తాను నిరూపించుకోవలసిన అవసరం లేదు. మనని మనం దేవుడి ముందు నిరూపించుకోవాలి".

"రుజువు కోసం అడిగితే అది మీకు దొరకదు. దానికోసం అడక్కుండా, నమ్మకముంచితే అప్పుడు మీకు రుజువు దొరుకుతుంది".

"దేవుడు మిమ్మల్ని శిక్షించడు; మీ ఉపచేతనాత్మక మనస్సే మిమ్మల్ని శిక్షిస్తుంది".

"మీ తోటి వారిని మోసగించగలరు, మిమ్మల్ని మీరు మోసగించుకోగలరు, కాని సర్వశక్తిమంతుడైన భగవంతుని ఎన్నడూ మోసగించలేరు".

"గంటల కొద్దీ ఏకాగ్రత లేకుండా చేసే ప్రార్థన కన్న, జనాన్ని, సర్వశక్తిమంతుడైన భగవంతుని మోసం చేయడానికి వేలాది రూపాయలు దానం చేయడం కన్న సాధారణ మైన, నిజాయితీగల, కరుణాపూరితమైన, నిస్వార్థమైన పని ఎంతో ముఖ్యమైంది".

తొలిగా ఇచ్చిన సందేశాల్లో ఒకటి : "ఆత్మలోకంలో మతం లేదు. మేము ఒక దేవుడినే పూజిస్తాం" మరి భూలోకంలో ఇన్ని మతాలు ఎందుకున్నాయి?

భిన్నమతాలున్నా అన్నీ చివరికి ఒకే దేవుడిని చేరతాయి. మీ భూలోకంలో చక్రభ్రమణా లెన్నో ఉంటాయి – మంచి, చెడు, మంచి, మళ్ళీ చెడు ఇలా. భూలోకంలో చెడు చాలా పెరిగిపోయినపుడు ఒక ఉన్నత విశ్వం నుంచి మనుషులకు మార్గదర్శిగా ఉండమని దేవుడు ఒక అత్యంత ఉన్నతాత్మను భూలోకానికి పంపిస్తాడు. అతడిని ప్రవక్త అంటారు. ఆయన ప్రజలకు వివేకం కలిగించి, వారు బాగుపడి సదాత్మలు అయేలా చేస్తాడు. ఒక్కో ప్రవక్త అనుయాయులను ఒక్కో పేరుతో పిలుస్తారు. దురదృష్టవశాత్తు ఎన్నో శతాబ్దాల తరబడి ప్రవక్తల బోధనలెన్నిటినో మనుషులు మార్చివేశారు. ఏది ఏమైనా ఆత్మలోకంలో మతం లేదు.

మనుషులెందుకని దేవుడిని సులువుగా నమ్మలేరు?

జీవితంలో కాలం గడుస్తున్న కొద్దీ దేవుడిని గురించి మీ దృక్పథం మారుతూ ఉంటుంది. కొందరికి చిన్నవారుగా ఉన్నపుడు దేవుడంటే అమితమైన నమ్మక ముంటుంది, కాని ఎదుగుతున్న కొద్దీ ఆయనపై నమ్మకం కోల్పోతారు. దేవుడిని బాగా ప్రార్థించి కోరుకున్నది లభించకపోతే దేవుడు మీ ప్రార్థన వినలేదని ఆయన లేడని అనుకోవడం వల్ల ఇలా జరుగుతుంది. కాని సత్యమేమిటంటే ఒక ప్రార్థనకు సమాధానం లభించకపోతే బహుశా మీరు కోరేది మీ ఆ ఆధ్యాత్మిక ఎదుగుదలకు మంచిది కాకపోయి ఉండవచ్చు. అన్యాయం జరిగినపుడు కూడా దేవుడిపై నమ్మకం ఉండదు. దేవుడు న్యాయం ఎందుకు చేయలేదని కూడా మిమ్మల్ని లోలోపల ప్రశ్నించుకుంటారు. ఆ అన్యాయం మీ కర్మ కావచ్చు. పరీక్ష కావచ్చు. శిక్షణ కావచ్చు. కొన్నిసార్లు మీ ఆరోగ్యం క్షీణించినపుడు బాగపడాలని ప్రార్థిస్తారు. ఆరోగ్యంలో మార్పులేకపోతే దేవుడిపై నమ్మకం కోల్పోతారు. మీరు ఆరోగ్య సమస్యలు అనుభవిస్తున్నపుడు చెడు కర్మను చెల్లించి వేస్తున్నారని గుర్తుంచుకోనడం మర్చి పోతున్నారు. కొందరికి చిన్నతనంలో దేవుడిపై నమ్మకముండదు. కాని కాలక్రమంలో వచ్చే అనుభవాల పరంపరల వల్ల వారికి నమ్మకం ఏర్పడుతుంది. మీ అనుభవాలు ఎలాగున్నా సరే, దేవుడిని నమ్మాలా వద్దా అనేది మాత్రం నిర్ణయించు కోవాల్సినది ముఖ్యంగా మీరే. మీరు భూలోకంలో ఉన్నపుడు ఆత్మలోకం గురించి భౌతిక మనస్సుకేమీ గుర్తుండదు. అయితే ఉపచేతనాత్మక మనస్సు ద్వారా మాత్రం మీకు దీనితో సంబంధం నిలిచి ఉంటుంది. ఉపచేతనాత్మక మనస్సు భూలోకంలో మీకు మార్గం చూపుతూ దేవుడున్నాడని నమ్మడానికి మీకు సాయం చేస్తుంది.

ఈనాడున్న పెద్ద సమస్యేమిటంటే మనుషులకు ఎప్పుడూ దేవుడున్నాడని చెప్పేందుకు శాస్త్రీయమైన వివరణగాని రుజువుగాని కావాలి. ఉపచేతనాత్మక మనస్సు అపారం. కాని విజ్ఞానశాస్త్రం మానవమేధ నుంచి పుట్టింది పరిమితమైంది. మానవుల తెలివితేటలు దేవుడిని అర్థం చేసుకునేంతటి సామర్థ్యం కలవికావు.

దేవుడు తనను తాను మనకు నిరూపించుకోనవసరం లేదు. మనని మనం దేవుడికి నిరూపించుకోవాలి.

అందువల్లే మనం భూలోకంలో ఉన్నాం. దేవుడిని పరీక్షించడానికిమనమిక్కడలేం. భౌతిక మనస్సు చెప్పినది వినకుండా ఉపచేతనాత్మక మనస్సు చెప్పిన మాట వింటున్నామా లేదా అని పరీక్షింపబడుతున్నాం. కొందరు బాగా విశ్లేషణాత్మకంగా ఉంటూ అన్నిటికీ తర్కసహమైన సమాధానాలు కావాలంటారు. విశ్వాసానికిగాని, అంతః ప్రేరణకుగాని వారి దైనందిన జీవితాలలో కొంచెంకూడా చోటులేదు. వీళ్లు పూర్తిగా భౌతిక మనస్సుతోగాని, మేధతోగాని పనిచేస్తుంటారు. వీరికి పూర్తిగా భిన్నంగా కొందరు

అన్నిటికీ తర్కసహమైన సమాధానాలు అవసరం లేనట్లుగా ప్రవర్తిస్తారు. వారు విచక్షణకు, ప్రాపంచిక తర్కానికి అతీతంగా ఆత్మావరణకు సమీపంగా వెళ్ళ గలరు. ఉపచేతనాత్మక మనస్సుద్వారా మాత్రమే దేవుడిని మీరు తెలుసుకొనగలరు. భూలోకంలో దేవుడిని పూర్తిగా అర్థం చేసుకోలేరు, అయితే మంచితనాన్ని ఆచరిస్తూ ఆయనను తెలుసుకోగలరు. మేధస్సు గొప్ప ప్రతిభ. దీనిని ఉపచేతనాత్మక మనస్సు ఇచ్చే విశ్వాసం, విచక్షణలనే ప్రతిభలతో కలిపి సామరస్యంగా ఉపయోగిస్తేనే దీని ఫలితం బాగుంటుంది. దేవుడిని మీరు చూడలేరు గనుక దేవుడు లేడని కాదు. మీకు కనిపించనంత మాత్రాన సత్యం లేకుండా పోదు. మన ఆంతరిక వాణి చెప్పేది విని, చూడలేని దానిని నమ్మడమే మనం భూలోకంలో ఎదుర్కొనే పరీక్ష.

కొన్నిసార్లు మనుషులు దేవుడిని బాగా నమ్ముతారు. కాని వారికి ఏదైనా బాధ కలిగించే సంఘటన జరిగినపుడు – బిడ్డను పోగొట్టుకొనడం, భార్యనో, భర్తనో పోగొట్టుకొనడం, బాగా అన్యాయం జరగడం – వంటి వాటివల్ల ఆ వ్యక్తి దేవుడిని నిందించి నమ్మకం కోల్పోతారు. మీకు బాధ కలిగింది, నిజమే, కాని ఆ బాధ వల్ల దేవుడిపై నమ్మకం కోల్పోకూడదు. బదులుగా ఆ బాధను భరించేశక్తిని ఇవ్వమని ప్రార్థించండి. చాలా అన్యాయం జరగడానికి అవకాశమున్న ప్రదేశం భూలోకం. మంచివాళ్ళు బాధపడతారు. చెడ్డవాళ్ళు తరచుగా అధికారాన్ని అనుభవిస్తారు. ఆనందంగా ఉంటారు. భూలోకంలో ఇప్పుడెంతో అసమతౌల్యం ఉంది. ఈ అసమతౌల్యమే మన పరీక్ష, మన సంఘర్షణ, మన శిక్షకురాలు. మీరు చూసిన అన్యాయాలు తర్వాత కూడా దేవుడిని నమ్మే ధైర్యమూ, ఆయన న్యాయంపై విశ్వాసమూ మీకుందా?

చెడుమీద మంచి విజయం సాధించేరోజు ఒకటి వస్తుంది. కాని ఆ రోజు వచ్చేవరకు అంధకారం ఒక సవాలు. దేవుడు అంధకారాన్నెందుకు ఉండనిస్తాడంటే సదాత్మలు పరీక్షింపబడాలి. శిక్షణ పొందాలి. చివరికి, భూలోకంలో మంచి సమృద్ధిగా ఉన్నపుడు, దేవుడిని నమ్మడం తేలికవుతుంది. అప్పుడు తప్పకుండా ఆయన ఉనికిని మీరు బాగా అనుభవిస్తారు. కాని ఇప్పుడు దేవుడిని మీరు నమ్మకపోతే, మీరు పరీక్ష పాసవనట్లే.

జీవితంలో మీరెన్నో చూస్తారు. పిల్లలు బాధపడడం, అమాయకులైన ఆడ, మగ యుద్ధానికి బలికావడం, అమాయకులు జైలు పాలవడం, హత్యలు చేసినవారు శిక్షపడకుండా తప్పించుకోవడం మీరు చూస్తారు. ఘోరమైన నేరాలు, అన్యాయాలు చూసి : దేవుడెక్కడున్నాడు? దేవుడే ఉంటే ఆయనేమీ చేయడెందుకు? దేవుడెందుకు ఇవన్నీ ఆపడు? అనుకుంటారు.

ఇదంతా మొదలు పెట్టింది దేవుడు కాదు. మనుషులు. దేవుడు మనుషులకు సంకల్ప స్వేచ్ఛను ఇచ్చాడు. దాన్ని వారు చెడు పనులకు ఉపయోగించుకుంటున్నారు. ఇప్పుడు చెడు పెరుగుతోంది. సదాత్మలు పరీక్షకు లోనవుతున్నారు. వారి నమ్మకం

ఊగిసలాడుతోంది. వారు భయపడుతున్నారు. కోపంగా ఉన్నారు, దీనితో చెడు మార్గంలో వెళ్ళాలనే ప్రలోభానికి లోనవుతున్నారు. **ప్రకృతే స్వయంగా చెడును తుడిచి పెట్టే సమయం ఒకటి వస్తుంది.** ఆ సమయంలో మరిన్ని ఆత్మలు ఆధ్యాత్మిక మార్గంలోకి వస్తాయి. కాని ఆ క్షణంకోసం ఎదురు చూడవద్దు. ఇప్పుడే మంచి మార్గాన్ని ఎంపిక చేసుకోండి. ఆ క్షణం వచ్చేటప్పటికి మీరు పరీక్ష పాసయి ఉంటారు. వెలుగు బాగా ఉన్నపుడు, ప్రలోభం తక్కువగా ఉన్నపుడు వెలుగు వైపు వెళ్ళడం తేలిక. కాని భూలోకంలో వెలుగు అరుదైపోతున్నపుడు, చెడు ఆత్మలు మిమ్మల్ని దాని నుంచి దూరంగా లాగాలని అవి చేయగలిగినంత ప్రయత్నం చేస్తున్నపుడు వెలుగును కౌగిలించుకోవడం చాలా కష్టం.

భూలోకాన్ని మీ ఆధ్యాత్మిక యుద్ధరంగంగా, మీరు యోధుడిగా అనుకోండి.

సులభంగా ఉందని అంధకారానికి లొంగిపోతారా, బలం, అధికారం ఉందనే భ్రమ కలిగిస్తుందని అంధకారానికి లొంగిపోతారా? భయంతో లొంగిపోతారా? లేకపోతే అంధకారం ఒక పరీక్ష అని గ్రహించి, దానితో యుద్ధం చేసే, దేవుడిని ఎంపిక చేసుకునే, వెలుగును కోరుకునే వివేకాన్ని ధైర్యాన్ని కలిగి ఉంటారా? కష్టమైనాసరే ఇలా చేయగలరా?

నిజమైన సాధకుడి శక్తి అతడి ఉపచేతనాత్మక మనస్సుపై ఆధారపడి ఉంటుంది. అందుకనే ఆత్మలోకంలో మీరు దానిని పెంచుకుంటూ చాలాకాలం గడుపుతారు - ఎందుకంటే మీరు ఎటువంటి ప్రదేశానికి వెళుతున్నారో, ఎందుకు వెళుతున్నారో మీకు తెలుసు. అందుకనే మంచి, చెడు రెండూ ఉంటాయి. చెడు నుంచి దూరంగా వెళ్ళి మీరు మంచిని ఎంపిక చేసుకుంటారని ఇలా ఉంటుంది.


మీ సంకల్ప స్వేచ్ఛను పరీక్షించేందుకు చెడు (నెగిటివిటీ) ఉంటుంది. చెడు లేకపోతే ప్రలోభం ఉండదు. సంకల్ప స్వేచ్ఛను ఉపయోగించే అవకాశమూ ఉండదు.

సరైనదానిని ఎంపిక చేసుకోండి. ముందుగా ప్రతిఘటన వస్తుంది. ప్రలోభాన్ని/దురాకర్షణను ప్రతిఘటించండి. క్రియ తర్వాత వస్తుంది. దేవుడు మన సృష్టికర్త. ఆయన అత్యుత్తమ సత్త, విచక్షణ, న్యాయము, ప్రేమ కలవాడు. మంచితనం ద్వారా ఆయనను అర్థం చేసుకొనవచ్చు. దేవుడిని ఎంతగా విశ్లేషించుతూ పోతే, అంతగా మీరు దేవుడికి దూరమవుతారు, ఆయన ఇచ్చే శాంతిని అంతగా వద్దనుకుంటారు. దేవుడు కేవలం ఒక భావం కాదు, ఆలోచన కాదు. ఆయనకు రూపం ఉంది, కాని భూలోకంలో ఒక కారణంవల్ల అదృశ్యంగా ఉన్నాడు. అది మన పరీక్ష.

మనందరినీ దయగల, వివేకియైన, న్యాయశీలియైన భగవంతుడు సంరక్షిస్తూ ఉంటాడు. ఆయన నిజంగానే సర్వశక్తిమంతుడు. తాను సృష్టించిన అన్ని ప్రాణులనూ ఆయన

సంరక్షిస్తాడు. మనందరం సరైన మార్గాన్ని అనుసరించాలని కోరుకుంటాడు. మనందరికీ ఆయన ఆశీస్సు పొందే అవకాశం ఉంది; కాని ఆయన ఆశీస్సు కావాలంటే ముందుగా మనం చేయాల్సింది మంచితనాన్ని అవలంబించడం. దేవుడిని తెలుసుకోవడమంటే మనకు మనం తెలుసుకోవడం, మనమెవరో తెలుసుకొనడం, ఆయన మంచితనాన్ని మనలో కనుగొనడం.

ప్రార్థన



"మరొకరి ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం చేసే ప్రార్థన

అన్ని ప్రార్థనల కన్న మిన్న అయిన ప్రార్థన."

"జనం గొప్పకోసం ప్రార్థిస్తారు, తామెంతో పవిత్రంగా ఉన్నామని ఇతరులుకు నిరూపించాలని ప్రార్థిస్తారు. ప్రార్థనలు క్లుప్తంగా, మధురంగా సానుకూలంగా, నిజాయితీగా, నిస్వార్థంగా ఉన్న భావాలు కలిగి ఉండాలి"

ప్రార్థన ప్రయోజనం ఏమిటి?

ఆధ్యాత్మికతకున్న అతిముఖ్యమైన రూపాలలో ప్రార్థన ఒకటి. ప్రార్థించకుండా ఎదగలేరు. మానవ శరీరానికి ఆహారం ఎలా అవసరమో, ఆత్మకు కూడా ప్రార్థన అలా అవసరం. మనందరం దేవుణ్ణి ప్రార్థించాలి. ఆయన మనకు భూలోకంలో, ఆత్మలోకంలో ఆధ్యాత్మికంగా ఎదిగే శక్తిని వివేకాన్ని ప్రసాదిస్తాడు. భూలోకంలో చెడు శక్తి చాలా బలంగా ఉంటుంది. సదాత్మలు సరైన పని చేయడం రోజు రోజుకీ కష్టమవుతూ ఉంది. అయితే సదాత్మలు తప్పు ఒప్పుల మధ్య తేడాను తెలుసుకోలేరని కాదు. వారు తప్పు ఎంపికలు ఎందుకు చేసుకుంటారని అంటే దురాకర్షణలు తప్పించుకొనే శక్తి వారికి లేదు కనుక ప్రార్థించడం ముఖ్యం. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రార్థన సాయం చేస్తుంది. ఇది ఆధ్యాత్మిక శక్తిని కలిగిస్తుంది. ఒక్కసారి మీకు ఆధ్యాత్మిక శక్తి లభించిందంటే దురాకర్షణలు ఎన్ని ఉన్నా సరే మీరు సరైన పని మాత్రమే చేస్తారు. పనికి ప్రత్యక్ష ఫలితంగా అంటే జ్ఞానాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా ఆత్మకు బలం లభిస్తుంది. ప్రార్థన ఆత్మను పరిపోషించుతుంది. ప్రార్థన నిజాయితీగా హృదయపూర్వకంగా చేయవలసి ఉంటుంది. ఇది కేవలం చేతులు జోడించి మొక్కడం మాత్రమే కాదు. ప్రార్థనద్వారా పొందిన బలంవల్ల సరైన పనిచేసి మీకు మీరు శాంతిని, ఆత్మకు ఎదగుదలను కలుగజేసుకుంటారు ఇది ఒక చక్రం.

భూలోకంలో జనం అనుకునే విధంగా ప్రార్థన కంటికి కనిపించనిది కాదు.

మీరు ప్రార్థించేటపుడు మీ ఆలోచనలు, మాటలు, భావాలు కాంతి కిరణంలా ఆత్మలోకానికి ప్రయాణిస్తాయి. ఆత్మ లోకంలో ఉన్నమాకు, మిలియన్ల కొద్దీ కాంతి కిరణాలు భూలోకం నుంచి మావైపు రావడం కనిపిస్తుంది. ప్రతి కాంతి కిరణపు వెలుగు మాత్రం ప్రార్థనలోని నిజాయితీ, అత్యవసరంగా చేసే విధానాన్ని బట్టి ఉంటుంది.

ఆత్మలోకంలో ఉన్న సదాత్మలను తనతో కలిసి పనిచేస్తూ, ఈ ప్రార్థనలకు సమాధానం చెప్పడానికి సాయపడడానికి దేవుడు ఎంపిక చేసుకున్నాడు. సాయం కోరి మానవులు చేసే ప్రార్థనలకు సమాధానం చెప్పే ప్రత్యేక శిక్షణ ఈ ఆత్మలోక ఆత్మలకు ఉంటుంది. ఒక ప్రార్థనకు సమాధానంగా, ఈ ఆత్మలు భూలోకంలోని వ్యక్తికి తిరిగి సానుకూల కిరణాలను పంపుతారు. అందువలనే ప్రేయర్ (Prayer) అనే పదంలో రే (ray) అనేది ఉంటుంది. ప్రార్థనలు ముఖ్యంగా సానుకూలమైన వెలుతురు కిరణాలు.

దేవుడు మన ప్రార్థనలు వింటాడా?

మీరు ప్రార్థించినపుడు దేవుడు మీ ప్రార్థనలు వింటాడు. అయితే ఈ ప్రార్థనలను తన దేవదూతలద్వారా వింటాడు. కొన్నిసార్లు వ్యక్తులు ప్రాణంకోసం ప్రార్థిస్తారు. తాము బతకాలనిగాని, తమ ప్రియతములు బతకాలని గాని కోరతారు. వారు గనుక సదాత్మలైతే వారికి స్వస్థత చేకూరే శక్తిని ప్రసాదిస్తాడు. లేకపోతే వారు కర్మను అనుభవించవలసి ఉంటే శారీరక బాధను భరించే సహనాన్ని ఇస్తాడు.

కొన్నిసార్లు వ్యక్తులు ఏం చేయాలో తెలియక ప్రార్థిస్తారు. తమకు తాముగాని, తమ సన్నిహితులకుగాని సాయమెలా చేయగలమో వారికి తెలియదు. అందువల్ల వారి ప్రార్థనకు మార్గదర్శకత్వం రూపంలోకాని, ఉపచేతనాత్మక మనస్సుకు సందేశమిచ్చిగాని సమాధానమిస్తాడు. ఈ సందేశాన్ని అందుకున్న పిమ్మట ఆ వ్యక్తికి స్పష్టత లభిస్తుంది.

సాయంకోసం చేసే కొన్ని ప్రార్థనలు ఎంత అత్యవసరమైనవిగాను, క్లిష్టంగాను ఉంటాయంటే, ఆత్మలోక ఆత్మలు తక్షణమే ఆ ఆవరణలోని ఉన్నత సదాత్మను సంప్రదించవలసి ఉంటుంది. కాని చివరికి, ప్రార్థనలకు సమాధానమిచ్చే అన్ని ఆత్మలు దేవుడి మార్గదర్శకత్వము, ఆశీస్సులతోనే పనిచేయవలసి ఉంటుందని అర్థం చేసుకోండి. అందువల్ల **"మీ ప్రార్థన నిజాయితీగా, హృదయపూర్వకంగా ఉంటే ఆయన మీ ప్రార్థనలు వింటాడు."**

ప్ర: చాలా ప్రార్థనలు ఎందుకు నెరవేరవు? కొందరు ఎంతో హృదయ పూర్వకంగా ప్రార్థించారు. హృదయాంతరాలలో నుంచి అయినాగాని అవి నెరవేరలేదు. ఎందుకని?

మీ ప్రార్థనలు నెరవేరాలంటే;

1. మీరు కోరేది మీకు మంచిదై ఉండాలి.

చాలాసార్లు మనుషులు తమకు మంచిదనిపించిన దాని గురించి ప్రార్థిస్తారు. మీరు మీకు మంచిదని అనిపించిన దాని గురించి ఆలోచిస్తే, ప్రాపంచిక దృక్పథంతోనే ఆలోచిస్తారు. కాని ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఏ రకంగానైనా అవరోధమైతే ఆ ప్రార్థనలు ఎన్నటికీ నెరవేరవు. అందువల్ల మళ్ళీ దేనికోసమైనా ప్రార్థించినపుడు దానికి సమాధానం (నెరవేరకపోతే) రాకపోతే అది మీ ఆత్మకు మంచిది కాదని, అందుకని నెరవేరలేదని తెలుసుకోండి. అంతేకాకుండా సరైన సమయంలో ప్రార్థన నెరవేరడం మీ చేతులలో లేదు

అది దేవుడి చేతులలో ఉంది. నెరవేరని ప్రార్థన ఉంటే దేవుడు దానిని నెరవేర్చడానికి సరైన సమయం కాదనుకున్నాడు అని గుర్తించండి. కొన్నిసార్లు మనుషులకు తాము అత్యంత ప్రార్థించేది లభించినా ఎలా నిభాయించుకోవాలో తెలియదు. **మీకేది మంచిదో దానిని ప్రసాదించమని దేవుడిని వేడుకోండి.** ఈ పద్ధతిలో కోరితే ఏం జరిగినా ఆధ్యాత్మిక ఎదుగుదలకోసమే జరుగుతుందనేది కచ్చితం. మీకేది మంచిదో అది చేయమని దేవుడిని కోరుతున్నారంటే, జీవితాన్ని అన్నీ తెలిసిన అత్యున్నత శక్తికి అప్పగిస్తున్నారని అర్థం; ఇది ఆత్మ సమర్పణ ప్రార్థన.

2. మీ ప్రార్థన నిజాయితీగా, హృదయపూర్వకంగా ఉండాలి. ఇది చాలా చాలా ముఖ్యం. మీ ప్రార్థన హృదయపూర్వకంగా చేయాలి. దీనిని శ్రద్ధలేకుండా, యాంత్రికంగా చేయరాదు. మీ ప్రార్థనలో నిజాయితీ, నమ్మకము దానికి శక్తినిస్తాయి. సాయంకోసం మీరు చేసే అభ్యర్థనలలో స్వచ్ఛత, దాని ఉద్దేశ్యాలను బట్టి దేవదూతలు ప్రతిస్పందిస్తారు. ఒకవేళ మీరు హృదయపూర్వకంగా ప్రార్థించినా, దానికి సమాధానం రాకపోతే, ఆ కోరిక మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు అంత మంచిది కాదని అర్థం.

3. మీ ప్రార్థన నిస్వార్థంగా, ప్రాపంచిక ప్రయోజనరహితంగా ఉండాలి. భూలోకంలో బ్రతకడానికి కూడు, గూడు, బట్ట కావాలి. అంతే కాని విలాసాలు కోరడం తప్పు. విలాసం వల్ల మీ ఎదుగుదలకు అవరోధంగా ఉండే అసమతౌల్యం ఏర్పడుతుంది.

మీకు సౌకర్యంగా ఉండడానికి తగినంత కోరుకోండి. అంతేకాకుండా మీరు భౌతిక సంపదల కోసమే కోరితే ఆ ప్రార్థనలు నెరవేరవు. ఇతరుల ఆధ్యాత్మిక ఎదుగుదలకు మీరు ప్రార్థించడం ముఖ్యమని గుర్తుంచుకోండి. ఇలా చేస్తేనే ప్రార్థన నిస్వార్థమవుతుంది.

4. ఈ ప్రార్థన మీ కర్మకు సంబంధించి ఉండకూడదు.

భూలోకంలో మీరుండడానికి ప్రధాన కారణాలలో ఒకటి కర్మను చెల్లించడం. ఎంతగా ప్రార్థించినా దేవుడెందుకు సాయం చెయ్యడం లేదని అనుకొంటారు కొందరు. మీరు ప్రార్థించే విషయం మీ కర్మకు సంబంధించినది అయితే గనుక మీరు దానిని అనుభవించవలసిందే. మీరు ప్రార్థించకపోయినా, ప్రార్థన నెరవేరదని దేవుడిపై నమ్మకం కోల్పోయినా, దేవదూతలు మీకు వెలుగును పంపలేరు. దానితో భూలోకం లోని అడ్డంకులను దాటడం మీకు కష్టమవుతుంది. భూలోకంలో చాలామంది చెడుపని చేసి దైవాన్ని ప్రార్థిస్తారు. ప్రార్థనతోపాటు పాపాలు తుడిచిపెట్టుకు పోతాయని భావిస్తారు. **ప్రార్థనద్వారా మీ కర్మ నశించదు.** హృదయపూర్వకంగా ప్రార్థిస్తే కర్మను అనుభవించగలిగే శక్తి వస్తుంది. ప్రార్థనలు కర్మను తుడిచి పెట్టలేవు.

5. మీరు సన్మార్గంలో ఉండాలి.

భూలోకంలో చాలా మంది పెడదారిలో ఉన్నారు. తమకేమైనా కావాలంటేనే వారు ప్రార్థిస్తారు. అటువంటి వారి ప్రార్థనలు నెరవేరవు. పెడదారిన నడిచే అటువంటివారు కోరవలసినది వివేకం కోసం మాత్రమే. అప్పుడే వారు మెరుగవుతారు. ఈ ఒక్క ప్రార్థనే ఆధ్యాత్మికంగా తక్కువస్థాయిలో ఉన్నవారు చేస్తే ఆత్మలోక ఆత్మలు నెరవేరుస్తాయి. అయితే మీరు దైవ నిర్దేశిత సన్మార్గంలో ఉంటే మీకు రక్షణ, ఉపశమనం అవసరం. కనుక మీ ప్రార్థనకు సమాధానం లభిస్తుంది.

దేవదూతలు మీ ప్రార్థనలు వింటున్నారని నిజంగా మీరు నమ్మితే హృదయపూర్వకంగా ప్రార్థించడానికి కష్టమేమీ ఉండదు. మీ దేవదూతలు మీ ప్రార్థనలు విని సమాధానంగా దైవ నియమాలకు లోబడి చేయగలిగినంత చేస్తారు. అందువల్ల ఎవరో ఒకరు మీ ప్రార్థన వింటున్నారని నిశ్చింతగా ఉండండి. ఆత్మలోకం నుంచి వారు అంతా చూడగలరు. వారికి వివేకం ఉందని మీ కేది మంచిదో దానిని చేస్తారని విశ్వసించండి. ఇది నమ్మలేనంత శక్తి ఉన్న వీటన్నిటినీ మించి ప్రార్థనకున్న శక్తిని తెలుసుకోండి. వెలుగు. దానికి జీవితాలను మార్చే శక్తి ఉంది. దానిని హృదయపూర్వకంగా నమ్మి తీరాలి.

మనుషులు రోజూ ప్రార్థన ఎందుకు చెయ్యరు?

పరిస్థితులు అన్నీ బాగున్నపుడు మనుషులు దేవుడిని మర్చిపోతారు. ప్రార్థించవలసిన అవసరం లేదని అనుకుంటారు. అందువల్ల రోజూ ప్రార్థన చెయ్యరు. పరిస్థితులు బాగోక పోతే అప్పుడు మేల్కొని దేవుడిని గుర్తుచేసుకుంటారు. మనుషులకు ఎప్పుడూ ఒకేలా ఉండడం సమస్య. మీరు సన్మార్గంలో నడవాలనుకుంటారు. ఆధ్యాత్మికతకు జీవితంలో పెద్దపీట వేస్తారు, కాని ఆధ్యాత్మిక పద్ధతులను క్రమం తప్పకుండా ఆచరించరు. దీనికి సులభమైన పరిష్కారం ఉంది. **ఆధ్యాత్మికతకున్న శక్తి విలువ మీకు అర్థం కాలేదు. అందుకని మీరు రోజూ ప్రార్థన చెయ్యరు.**

ప్రార్థన కష్టమని, పని అని, సమయం పట్టేస్తుందని భావిస్తే మీకు దాని విలువ అర్థం కాలేదు. ప్రార్థన చేస్తున్నారు అంటే మీరు సర్వశక్తిమంతుడైన భగవంతునితో మాట్లాడుతున్నారు – అంతకన్నా ముఖ్యమైన పని ఉంటుందా? ఇది తెలిస్తే దేవుడు మీ మాట వింటున్నాడని నమ్మితే, ప్రార్థన చెయ్యడానికి బద్ధకించరు. అంతే కాకుండా ప్రార్థన వల్ల మీకేం లభించిందో తెలిస్తే సహజంగానే ప్రార్థన మానకుండా చేస్తారు.

ప్రార్థనలు మనకెలా తోడ్పడతాయి?

ప్రార్థన వల్ల కలిగే మంచి ఫలితాలు.

1. ప్రశాంతంగా ఉంటారు.

భూలోకంలో భౌతిక సంపదలు ఎన్ని ఉన్నా, మీ స్థితి, హోదా ఎంత గొప్పగా ఉన్నా, దైవ నిర్దేశితమైన సన్మార్గంలో ఉంటేనే మానసిక శాంతి లభిస్తుంది. ఈ భౌతిక ప్రపంచంలో మనిషి కష్టసుఖాలనుభవిస్తాడు. అయితే, ప్రార్థనను మీ జీవితంలో భాగంగా చేసుకుంటే, మీరు ఉపచేతనాత్మక మనస్సును మేల్కొలుపుతారు. అది జీవితంలో వచ్చే కష్టసుఖాల స్వభావాన్ని అర్థం చేసుకొనేలా మీకు తోడ్పడుతుంది. కష్టం వచ్చినపుడు కుంగిపోకుండా, విజయం లభిస్తే అహంకరించకుండా ఉండగలుగుతారు.

ప్రార్థన మిమ్మల్ని ప్రశాంతంగా ఉంచుతుంది. కష్టం వచ్చినపుడు ప్రశాంతత అవసరం. కష్ట సమయాల్లో ప్రశాంతంగా, సానుకూలంగా ఉండి సరైనపని చేస్తే మీరు పరీక్ష పాసవుతారు; పరీక్ష పాసవగానే కష్టం తీరిపోతుంది. అంటే బాహ్య కారణాల (కష్టాల) స్వభావాన్ని మీ లోపలున్న శక్తి (ప్రశాంతత) తో మీరు మార్చగలిగారు.

మీరు శాంతంగా ఉండకపోతే కష్టాలు లేదా ప్రతికూల బాహ్య శక్తులు మీ ప్రశాంతతను భగ్నం చేయడానికి అవకాశమిచ్చినట్లు మీరు ఆందోళన, అయోమయాల్లో పడతారు

- ఆధ్యాత్మిక పరీక్షను పాసవడానికి కావలసిన ప్రశాంతత మీకుండదు. పరీక్ష పాసయేంత వరకు కష్టాలు తప్పవు. వాస్తవానికి మీరు పరీక్ష పాసవడానికి ఎంత ఎక్కువ కాలం తీసుకొంటే, మీ పరీక్ష అంత ఎక్కువ కష్టంగా ఉంటుంది. కష్టాలు మరింత కఠినంగా ఎందుకు మారతాయంటే, మీ ఆంతరిక శాంతిని కల్లోలితం చేయడానికి బాహ్య శక్తులను మీరు అనుమతించారు కనుక.

2. మీ స్పందనలు మెరుగవుతాయి.

ప్రతి ప్రార్థనకు ఒక స్పందన లేదా శక్తి ఉంటుంది. మీరు ప్రార్థించినపుడు ఆ ప్రార్థనలు సానుకూల శక్తిని సృష్టిస్తాయి. ఈ సానుకూల స్పందనలవల్ల మీకు మీ చుట్టూ ఉన్నవారికి స్వస్థత ఉపశమనం కలుగుతుంది. అంటే మీ చుట్టూ ఉన్న ప్రతికూల శక్తిని మీరు పారద్రోలుతున్నారు. మీ చుట్టూ ప్రతికూల (చెడు) వ్యక్తులుంటే వారి శక్తివల్ల మీరు ప్రభావితులై నీరసించిపోతారు. అందువల్ల ప్రతికూల శక్తినిచ్చే వ్యక్తులతో చాలా జాగ్రత్తగా ఉండాలి. మీరు గనుక స్వభావతః భయస్థులు, గర్వం, కోపం, నిరాశా నిస్పృహలు మొదలైనవి గలవారైతే మీ స్పందనను మీరే తగ్గించుకుంటు న్నారు. ఆత్మను బలహీనం చేసుకుంటున్నారు. ప్రార్థన చేస్తే మీ చుట్టూ ఉండే ప్రతికూల శక్తి పోయి, సానుకూల స్పందనలు కలిగేలా ప్రార్థన దోహదపడుతుంది.

3. విచక్షణాశక్తి మెరుగవుతుంది.

మీరు ప్రార్థిస్తున్నపుడు మీ స్పందనలు బాగవుతాయి. మీలోని వ్యతిరేకత పోతుంది. మీ చుట్టూ నల్లని మేఘంలా కమ్ముకొన్న వ్యతిరేకత పోయి, మీ ఉన్నతాత్మ క్రియాశీలమవుతుంది - అంటే మీ ఉపచేతనాత్మక మనస్సు మేల్కొంటుంది. మీరు ఆందోళన లేకుండా ప్రశాంతంగా, స్పష్టంగా ఉంటారు. మీ విచక్షణ మెరుగవుతుంది. మీకు విచక్షణ పెరిగితే మీరు ఎంపిక చేసుకొనేవి కూడా సానుకూలంగా ఉంటాయి. నిస్వార్థంగా మంచి పనులు చేసే మెరుగైన స్థితిలో మీరుంటారు. ఫలితంగా మీరు ఆధ్యాత్మికంగా ఎదుగుతారు.

4. ఆత్మలోకం నుంచి రక్షణ లభిస్తుంది.

సృష్టికర్తను చేరడానికి మీరు చేసే ప్రయత్నం ప్రార్థన. దేవుడిని మార్గం చూపమని, రక్షించమని మీరు అడగాలి. అడగకుండా ఇది మీకు లభ్యం కాదు. ఒకవేళ ఏదైనా మీకు మంచిదనిపించినా, దానికి మీరు అర్హులైనా, మీరు అడగకుండా ఆత్మలోక ఆత్మలు దానిని మీకీయలేవు - అలా చేస్తే అవి మీ సంకల్ప స్వేచ్ఛకు వ్యతిరేకంగా పనిచేసినట్టవుతుంది. అందువల్ల మీకేది మంచిదో అది చేయమని దేవుడిని అడగండి. మీరు రక్షణ కోరితే, ఆత్మలోక ఆత్మలు పంపే ఉపశమన శక్తులు, ప్రార్థన ద్వారా వచ్చే

సానుకూల స్పందనలు రెండూ కలిసి ప్రతికూల శక్తుల నుంచి మీ చుట్టూ రక్షణ కవచాన్ని నిర్మిస్తాయి.

5. అనారోగ్యానికి పరిష్కారం

విశ్వాసంతోను, నిజాయితీగాను ప్రార్థిస్తే, దానికున్న స్వస్థత చేకూర్చే శక్తిని చూసి మీరు ఆశ్చర్యపోతారు. మందు ముఖ్యమే, కాని ప్రార్థనకున్న శక్తికి సాటివచ్చేదేదీ ఈ లోకంలో లేదు. దాని శక్తిపై నమ్మకముంటే, మీకు స్వస్థత పొందే అర్హత ఉంటే, అది మీకు లభిస్తుంది. మీ భౌతిక మనస్సు ప్రశాంతంగా అలజడి లేకుండా ఉండేలా చూసుకోండి. ఉపచేతనాత్మక మనస్సును మరింతగా తెరవండి. ఇది స్వస్థత కలిగేలా గాని, ఆ ప్రక్రియకు మిమ్మల్ని సమీపం చేయడంగాని చేస్తుంది.

6. మీ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఆచరణలో పెట్టే శక్తి లభిస్తుంది. ఆధ్యాత్మిక జ్ఞానం ఉంటే సరిపోదు. తప్పు, ఒప్పుల మధ్య తేడా మీకు తెలిసి ఉండవచ్చు. కాని దురాకర్షణలను తిరస్కరించడానికి, సరైనదాన్ని ఎంపిక చేసుకోవడానికి మీకు శక్తి కావాలి. ప్రార్థన మీకాశక్తిని ఇస్తుంది. మీ ఉపచేతనాత్మక మనస్సు ఇచ్ఛను పూర్తి చేసే శక్తిని అది ఇస్తుంది.

7. మీకు విశ్వాసం ఏర్పడుతుంది.

ఏ విశ్వాసంతో అయితే మీరు ప్రార్థిస్తున్నారో అది అత్యంత ముఖ్యమని మీరు గుర్తుంచుకోవాలి. విశ్వాసంతో ప్రార్థిస్తే, ప్రార్థన శక్తిమంతంగా ఉండి తప్పక నెరవేరుతుంది. అలా నెరవేరిన ప్రార్థన ద్వారా విశ్వాసం మరింతగా ఏర్పడి ఈ చక్రం నిరంతరం కొనసాగుతూ ఉంటుంది.

8. చేతబడి నుంచి రక్షణ లభిస్తుంది.

భూలోకంలోని స్పందన చాలా తక్కువస్థాయిలో ఉండడానికి కారణం, చాలామంది చేతబడికి గాని, మంత్రతంత్రాలకుగాని పాల్పడుతున్నారు. ఇది ఒకరి సంకల్ప స్వేచ్ఛకు వ్యతిరేకంగా, దైవ నియమాలకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. అంతేగాక స్వలాభం కోసం నియంత్రించడానికి, హాని చేయడానికి, మోసగించడానికి అంధకారాన్ని ఉపయోగిస్తుంది. చేతబడిలో ప్రతికూలశక్తి అత్యధికంగా ఉంటుంది. ఇది నిజంగా ఉందని నమ్మలేరు మీరు. సాంకేతిక యుగంలో ఇటువంటిది సాధ్యం కాదని మీ తార్కిక మనస్సు చెబుతుంది. భూలోకంలో ఉండి ఉంటే మేము కూడా దీనిని నమ్మలేకపోయేవాళ్ళం. చేతబడి అత్యంత ప్రమాదకరం. ఇది వేలాది సంవత్స రాలుగా భూలోకంలో ఉంది. ప్రజలకు దీని గురించి చెప్పి, ప్రార్థన, సానుకూల ఆలోచనా

విధానం ద్వారా తమను తాము రక్షించుకోవాలని తెలపాలి. తాంత్రిక విద్యలన్నీ దైవనియమాలకు పూర్తి విరుద్ధాలు. ప్రార్థన ద్వారా వెలుగు ఎంత అపరిమితంగా వస్తుందో, చేతబడి ద్వారా ప్రతికూల శక్తి అంతగా సృష్టింప బడుతుంది. భయపడనవసరం లేదు.ఈ ప్రతికూల శక్తి నుంచి కాపాడుకోవడానికి ప్రార్థన అత్యవసరమని అర్థం చేసుకోవాలి. వ్యక్తి ఎల్లప్పుడూ సానుకూలంగా నిర్భయంగా ఉండాలి.

ఎంతసేపు ప్రార్థన చెయ్యాలి?

గంటల కొద్దీ ప్రార్థించనవసరం లేదు. ప్రార్థనలు చిన్నగా, నిజాయితీగా ఉండాలి. ఎంత ఎక్కువసేపు ప్రార్థిస్తే అంత పవిత్రంగా ఉంటామని అనుకోవడం అపోహ. కొంచెం సేపు హృదయపూర్వకంగా, క్రమం తప్పకుండా ప్రార్థన చేయండి. ఇలా చేస్తే మీ దైనందిన జీవితంలో మీరు చేసే పనులకు ప్రార్థన వల్ల లభించే శక్తి తోడ్పడుతుంది. కొందరికి ఎక్కువసేపు ప్రార్థించాలని ఉంటుంది – నిజాయితీగా చేస్తే అలా చేసినా ఫరవాలేదు. మనసు ఎక్కడెక్కడో తిరుగుతుంటే, పెదాలు వల్లె వేస్తే కుదరదు. ప్రశాంతంగా, ఏకాగ్రతతో చెయ్యండి. ప్రార్థించేటప్పుడు సంతోషంగా ఉండండి. భయం వేస్తున్నపుడు ప్రార్థించకుండా ఉండేందుకు ప్రయత్నించండి.

ప్రార్థించాలంటే గుడికి వెళ్ళాలా?

ప్రార్థన క్రతువులకు సంబంధించినది కాదు. దేవాలయాలను ఎందుకు నిర్మిస్తారంటే జనం ఒకచోట సమూహంగా చేరి ప్రార్థిస్తారని, అలా చేస్తే వారు తమ ఉపచేతనాత్మక మనస్సుల ద్వారా మరింత సానుకూల శక్తిని సృష్టిస్తారు. అంతేకాక సమూహంగా చేరి ప్రార్థిస్తే ప్రార్థనకు శక్తి పెరుగుతుంది. ఒకవేళ దేవాలయానికో మరో ప్రార్థనా స్థలానికో వెళ్ళలేకపోయామని బాధపడవద్దు. ఇంటిలో ప్రార్థించడం కూడా ఎంతో సాయం చేస్తుంది. మీరు ఎక్కువ సమయాన్ని గడిపే ఇంటిలోని స్పందనలను ఈ ప్రార్థన శుద్ధి చేస్తుంది. ఎక్కడుంటే అక్కడే ప్రార్థించండి. కారులో, పనిచేసే చోట, పాఠశాలలో ఎక్కడైనా సరే ప్రార్థించండి. అయితే ఇంటిలో ప్రార్థించితే రోజూ ఒకే చోట కూర్చుని ప్రార్థించండి. ఆ చోటును పుణ్యస్థలంగా చేయండి. రకరకాల విగ్రహాలతో కాదు. మీ విశ్వాసాన్ని, పవిత్రమైన ఉద్దేశ్యాన్ని నిలిపి ఉంచి ప్రార్థించండి. మీ ప్రార్థనే మీ పూజాస్థలాన్ని నిర్మిస్తుంది.

ఇక్కడొక అసాధారణ విషయాన్ని మీతో చెప్పాలనుకుంటున్నాం.

ఉదయం నిద్రలేవగానే, పక్కమీది నుంచి దిగకుండా అంటే మీ పాదాలు భూమిని

తాకకముందే ప్రార్థన చెయ్యాలి. అప్పుడే మీ తేజోవలయం ఈ ప్రార్థనను గ్రహించి రోజంతా దానిని ఉంచుతుంది. ఒకసారి మీ పాదాలు నేలను తాకితే మీ రక్షణ భూమిలోకి పీల్చబడుతుంది. ఎందుకంటే భూలోక స్పందనలు ప్రతికూలం. మీ పాదాలు నేలను తాకకముందుగా మీ ప్రార్థన ఒక రక్షణ కవచాన్ని ఏర్పరుస్తుంది. మీ ప్రార్థన అలాగే ఉంటుంది. ఆ మంచి శక్తిమంతమైన స్పందన రోజంతా మీ తేజోవలయంలో ఉంటుంది. మీరోజును ఈ పద్ధతిలో ప్రారంభించడం ముఖ్యం.

అదేవిధంగా రాత్రి నిద్రించే ముందు రక్షణ కోసం, మానసిక శాంతి కోసం ప్రార్థించండి. మీ తేజోవలయం దానిని కూడా నిలిపి ఉంచుతుంది. తర్వాత రోజంతా చిన్న చిన్న ప్రార్థనలు నిజాయితీగా చేస్తుండండి. నిదానంగా ప్రార్థించండి. తొందరపడవద్దు. అనే ప్రతిమాట మనస్ఫూర్తిగా అనండి. ఏం అంటున్నారో, ఏం కోరుకుంటున్నారో, దేవుడు మీకోసం ఏం చెయ్యాలనుకుంటారో అర్థం చేసుకోండి. ప్రార్థనలు ఎప్పుడూ నిస్వార్థంగా ఉండాలి. గుర్తుంచుకోండి – మరొక మనిషికి ఆధ్యాత్మిక ఎదుగుదల ఉండాలని చేసే ప్రార్థన అత్యంత శక్తిమంతమైంది. చిన్నగా, సరళంగా ఉండి మిమ్మల్ని రక్షించి, ప్రశాంతంగా ఉంచే ప్రార్థన ఒకటి ఇచ్చాం. ఆత్మలోకంలో మతం లేదని గుర్తుంచుకోండి, ఈ ప్రార్థన ఎవరైనా చేయవచ్చు.

ఈ ప్రార్థనను రోజూ మూడుపూటల వరుసగా మూడుసార్లు చెయ్యాలి.

నాకు ప్రీతిపాత్రమైన సర్వశక్తిమంతుడవైన భగవంతుడా,
దయచేసి పాపం చేయకుండా మమ్మల్ని కాపాడు.
పాపాత్ముల నుంచి మమ్మల్ని రక్షించు.
మమ్మల్ని నీ శరణాగతిలోనికి తీసుకొని మార్గం చూపు.
దేవుడా, మేము నీ వాళ్ళం.
నిరంతరం నీవారిగానే ఉంటాం.
దైవమా, మమ్మల్ని శాశ్వతంగా నీతోనే ఉండనీ.
అప్పుడు సదా మేము నీ కృపకు పాత్రులమవుతాము.
కేవలం నీ మార్గదర్శకత్వం, సాయం మాత్రమే మాకు లభిస్తాయి.
సర్వశక్తిమంతుడవైన భగవంతుడా కృతజ్ఞతలు.

ఈ ప్రార్థనలో ఎక్కడా 'నేను' అనేది లేదు. కుటుంబం, స్నేహితులు, భూలోకంలోని సదాత్మల కోసం ప్రార్థించడం ముఖ్యం.

"నీ చేతులలోకి తీసుకొని మార్గదర్శకుడిగా ఉండు" అంటే మన సంకల్పస్వేచ్ఛను ఉపయోగించి దేవుడికి మనల్ని మనం సమర్పించుకుంటున్నాం. మన సంకల్పస్వేచ్ఛ ద్వారా పూర్తి విశ్వాసంతో మనల్ని దేవుడి అధీనంలోకి సమర్పించుకుంటున్నాం.

ప్రార్థన వంటి సానుకూలమైన విషయంలో చెడు అనే పదాన్ని ఎందుకు ఉపయోగించాలని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవచ్చు. భూలోకంలో ఉండే ప్రతికూల శక్తులు ఆధ్యాత్మిక మార్గంలో నడవకుండా మనల్ని నివారిస్తాయి. చెడు (evil) జీవించడం (live) అనే దానికి వ్యతిరేకం.

ఎదుగుదల మార్గం నుంచి తప్పించేదేదైనా చెడే. ప్రతికూల శక్తుల నుంచి రక్షించమని దేవుడిని మనం కోరాలి.

చివరగా దేవుడిని 'శాశ్వతంగా' మనల్ని తనతోనే ఉండనివ్వమని కోరుతున్నాం. మనం హృదయపూర్వకంగా మార్గం చూపమని, ఈ జీవితంలోను, తరవాత, శాశ్వతంగా కాపాడమని ఆయనను కోరుతున్నాం.

ప్రార్థన చివరిలో సరైన పని చేసే విచక్షణను, బలాన్ని ఇవ్వమని దేవుని ప్రార్థించండి. కుటుంబము, ఆప్తుల కోసం ప్రార్థించండి. చివరగా మీ కుటుంబం, స్నేహితులు కాకుండా, నిరాడంబరులై సహాయం కోసం ఎదురుచూసే సదాత్మలకు సాయం చేయమని ప్రార్థించండి. ప్రార్థనలో గుర్తుంచుకోవలసిన శిలాక్షరం – ఆ వ్యక్తికి ఏది మంచిదో దానిని చేయమని దేవుని కోరండి. భూలోకంలో వ్యక్తికర్మ ఏమిటో, పరీక్ష, శిక్షణ ఏమిటో మీకు తెలియవు. దేవుడిని ఏది మంచిదో అది చెయ్యమని కోరడం ద్వారా ఆ వ్యక్తి కర్మ, పరీక్ష, శిక్షణలతో జోక్యం చేసుకోకుండా సానుకూల శక్తిని పంపుతూ అతనికి సాయం చేస్తున్నారు. దీనిని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. ఏది ఏమైనా, మరొకరి ప్రయాణాన్ని మీరు అర్థం చేసుకొనలేరు, అందువల్ల మీకు, మీ కుటుంబానికి, మీ ఆత్మీయులకు, మరెవరికైనా సరే ఏది మంచిదో దానిని ప్రసాదించమని కోరాలి. ప్రార్థించేటప్పుడు ఆశ కలిగి ఉండాలి. అవ్వాలని కోరు కోవడం మిమ్మల్ని కిందికి చేరుస్తుంది. కాని ఆశ మాత్రం నడిపిస్తుంది. దేవుడు మీకేది మంచిదో అది చేస్తాడని గుర్తుంచుకోండి. అందుకనే ముందుగానే ఆయనకు కృతజ్ఞతలు చెబుతారు – మీ ప్రార్థన ఆయన విన్నాడని, మిమ్మల్ని ఎన్నడూ కాదనడని మీకు తెలుసు. కష్టకాలంలోనే కాదు, ఎప్పుడూ ప్రార్థించండి. మంచి జరిగినపుడు కూడా దేవుడికి కృతజ్ఞతలు చెప్పండి. చేయగలిగినంత ప్రార్థన చేయండి. ఎప్పుడూ దైవ ప్రణాళికను మన్నించండి. దానికి అడ్డుగా నిలవకుండా దేవుణ్ణి సాయం చెయ్యనివ్వండి.

సానుకూలంగా ఆలోచించండి



"సానుకూలంగా ఉండండి".

"మనసుని నియంత్రించండి. అన్ని వేళలా శాంతిని సాధించడానికి ప్రయత్నించండి. ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉండండి. బాగా నిద్రపొండి"

ఆలోచనలు శక్తిమంతాలెలా అవుతాయి?

మీ ఆలోచనా విధానమే మీ అభివృద్ధికి కీలకం. మీ ఆలోచనలు, మాటలు, పనులు అన్నీ కలిస్తేనే మీరు. ముందుగా ఆలోచనలు వస్తాయి. తరవాత ఆలోచనల నుంచి అంటే సానుకూల లేదా ప్రతికూల ఆలోచనల నుంచి మాటలు, పనులు ఉత్పన్న మవుతాయి. అందువల్లే సానుకూలంగా ఆలోచించడం ముఖ్యం. చివరికి అన్ని ఆలోచనలూ శక్తిని సృష్టిస్తాయి. అందుకని ఏ రకమైన శక్తిని సృష్టిస్తున్నారో జాగ్రత్తగా గమనించుకోండి.

ముందు భూలోకంలోని వారికి ప్రతికూలత ఎందుకు కలుగుతుందో అర్థం చేసుకొన డానికి ప్రయత్నించండి.

ప్రతికూలత లేదా వ్యతిరేకత ఒక ఆత్మ లక్షణం కావచ్చు లేదా ఈ జన్మలో పొందిన చెడు శిక్షణ వల్ల రావచ్చు. కాని, మనుషులకు తాము కోరినది దొరకని పక్షంలో ప్రతికూలంగా తయారవుతారు. సానుకూలంగా ఆలోచించడం సమస్యలుంటాయని అంగీకరించే మొదటి అడుగు. సమస్యలు లేనట్టు కనిపించేవారు తమ సమస్యలను చక్కగా పరిష్కరించుకుంటూ ఉండి ఉండాలి. లేదా వాటి నుంచి పారిపోతూ అయినా ఉండాలి.

చాలామంది తమ ఆధ్యాత్మిక ప్రయాణంలో ముందుకు కదలకపోవడానికి ఈ ప్రతికూలమైన ఆలోచనా ధోరణే కారణం.

ప్రతికూలత లేదా వ్యతిరేకత సాధారణమైన ఆత్మ లక్షణం. తప్పుగా అర్థం చేసుకొనడం, బలహీనమైన, నియంత్రణ లేని, శిక్షణ లేని మనస్సు ఉండడం ఫలితంగా ఇది వస్తుంది.

అంతేకాక భూలోకంలోని స్పందనలు చాలా ప్రతికూలమైనవి కావడంతో మనుషులలో ఉండే ప్రతికూలత ఇంకా ఎక్కువగా కనిపిస్తుంది. సానుకూలంగా ఆలోచించి దీనిని ఎదుర్కొనడం మీ బాధ్యతే. ఎందుకంటే మీ ఆలోచనలు క్రమంగా ఉద్వేగాత్మకంగా బయటపడి, మీ ఆత్మకు రూపమిస్తాయి.

ఈ తాను ప్రతికూలంగా ఆలోచిస్తున్నానని వ్యక్తికి ఎలా తెలుస్తుంది?

కింద చెప్పేవి ప్రతికూలతా సంకేతాలు.

1. భయం

ప్రతికూలమైన ఆలోచనలవల్ల, విశ్వాసం లేకపోవడం వల్ల, అవగాహన లేకపోవడం వల్ల భయం వేస్తుంది. దేవుడి మీద సంపూర్ణమైన విశ్వాసముంటే భయపడాల్సిన పనిలేదు. మీరు మనుషులు, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోవాలి. మీకు గనుక విశ్వాసం ఉంటే ఈ పరిస్థితులను ఎదుర్కొనే ధైర్యం మీకు లభిస్తుంది. భయాన్ని పోగొట్టుకొనడానికి ముందుగా చేయాల్సింది విశ్వాసాన్ని పెంచుకొనడం. ఈనాడు మానవ అస్తిత్వంలో భయం ఇంతగా ఉండడానికి కారణముంది. భూలోకంలో ప్రతికూల స్పందనలు ఎక్కువుంటాయి కనుక సదాత్ములు భయపడతారు. ఈ ప్రతికూల స్పందనలే మిమ్మల్ని అస్థిమితంగా చేస్తాయి. మీకంటే భిన్నమైన శక్తి మీ చుట్టూ ఉండడమే దీనికి కారణం. చెడు మార్గంలో వెళతామేమోనని కూడా భయపడతారు. మీ ఉపచేతనాత్మక మనస్సు ఈ భయాన్ని అర్థం చేసుకుంటుంది. కాని మీ భౌతిక మనస్సు అర్థం చేసుకోదు – దానికి కేవలం తాను భయపడుతున్నానని మాత్రమే తెలుసు. ఏది ఏమైనా మీ ఉపచేతనాత్మక మనస్సు మాత్రం ఎన్నడూ భయపడదు. అది జాగరూకంగా ఉంటుంది.

సానుకూల స్పందనలున్న ప్రదేశంలో నివసిస్తే భయం వెయ్యదు. మీ ఇంటిని నిరాడంబరంగా, శుభ్రంగా ఉంచుకోండి. సూర్యరశ్మి, మొక్కలు సానుకూల స్పందనలు కలిగిస్తాయి. దీనివల్ల భయం వెయ్యదు. రక్షక ప్రేరణల రూపంలో కూడ భయం కలుగుతుంది, ఇవి మీ భద్రతకు అవసరం. ఉదాహరణకు నిప్పులో చేయిపెట్టడానికి భయపడతారు; ఇది బతకాలనే ప్రేరణ.

ఇలా చెబితే వింతగా అనిపించవచ్చు కాని, సానుకూలంగా ఉండేందుకు భయపడే మనుషులు కూడా ఉంటారు. బహుశా వారికి గతంలో జరిగిన దురదృష్టకర అనుభవాల మూలంగా, ఆశావహంగా ఉండడానికి భయపడతారు. అందుకని జీవితం బాగోదని నమ్మడానికి సిద్ధపడి ఉంటారు. తమ జీవితాలలో సానుకూలంగా ఏదీ జరిగే అర్హత తమకు లేదని అనుకుంటారు. నిరాశకు తమను తాము సిద్ధం చేసుకుంటారు. తాము

వాస్తవాన్ని చెబుతున్నామని సమర్థించుకుంటారు, కాని కాదు. వాస్తవిక దృక్పథం అంటే జీవితంలో కష్టసుఖాలు ఉంటాయని తెలుసుకొనడం, మంచి కాలం రావాలని ఆశావహ దృక్పథంతో ఉండడం సహజం. మీ గతానుభవాలు ఎలా ఉన్నా మానవ మనుగడకు ఆశ అత్యవసరం. కొన్నిసార్లు ప్రతికూల పరిస్థితిలోనే భద్రంగా ఉన్నామను కొని వ్యక్తులు మారడానికి భయపడతారు.

2. చింత

నిరంతరం చింతిస్తూ ఉంటే కూడా కిందికి పడిపోతారు. విశ్వాసం కోల్పోయి, ఫలితాలపై మమకారం పెంచుకుని జనం బాధపడుతూ ఉంటారు. ఫలితాలు మీ చేతులలో లేవు. ప్రక్రియ మీ చేతుల్లోనే ఉంది. అందుకని మీరు చేయగలిగినదంతా చేసి, భగవంతుని మీద భారం వెయ్యండి. పూర్తిగా దేవుడి మీద భారం వేయడమంటే మీరు చేయగలిగినదంతా చేసి, మీకేది మంచిదో దానిని దేవుడే చేస్తాడని నమ్మడం. ఫలితాన్ని ఆయనకు సమర్పించండి. ఎప్పుడూ ఈ సమర్పణ జరగాలి. దేవుడిపైన, మీ దేవదూతలపైన, ప్రియతములపైన, మీపైన మీకు విశ్వాసం ఉండడం ముఖ్యం. మిమ్మల్ని ముందుకు నడిపించి, శాంతిని చేకూర్చే శక్తి విశ్వాసం. విశ్వాసం లేకపోవడమంటే, కారులో పెట్రోలు పోయకుండా, అది నడవాలని కోరుకోవడం లాంటిది. **మీరు చేయగలిగినదంతా చేసి మిగిలినది దేవుడికి వదిలిపెట్టండి.**

3. సంశయం

నిరంతరం మిమ్మల్ని మీరు, మీ ఆధ్యాత్మిక గురువుని, ముఖ్యంగా దేవుడిని సంశయిస్తూ ఉంటే మీరు ప్రతికూలంగా ఉంటున్నట్లు. ప్రశ్నిస్తే ఫరవాలేదు కాని ఆధ్యాత్మిక మార్గంలో ఉంటే సంశయం స్థానంలో విశ్వాసాన్ని నిలుపుకోండి. **మార్గదర్శులను నమ్మండి.** వాళ్ళు మీకు జ్ఞానాన్ని ప్రసాదించిన పిమ్మట సంశయిస్తూ, రుజువులు కోరుతున్నారంటే మీరు ప్రతికూలంగా ఉంటున్నట్లు.

ఒక వ్యక్తి ప్రతిరాత్రి బాగా ప్రార్థన చేస్తాడు. ప్రార్థన చివర్లో నాకేది మంచిదో దానిని చెయ్యి అని దేవుని కోరతాడు. అయితే అతని జీవితంలో ఏదీ అతనికి అనుకూలంగా జరగడం లేదు. తన ప్రార్థనలను దేవుడెందుకు నెరవేర్చడం లేదో అతనికి అర్థం కాలేదు. ఒకరోజు ఒక దేవదూత అతని ముందు ప్రత్యక్షమైనాడు.

"నీకోసం కానుక తెచ్చాను" దోసిలి పట్టమన్నాడు. ఆ వ్యక్తి కూడా ఏదో తీసుకోవా లన్నట్లుగా దోసిలి పట్టాడు. దేవదూత అతని దోసిలి చూసి దానిలో ఊది, "మిమ్మల్ని స్వాగతిస్తున్నాను" అన్నాడు - తన దోసిలిలో ఏమీ లేకపోవడం చూసి ఆ వ్యక్తి

అయోమయానికి లోనై, "నా కానుకేది?" అన్నాడు. "మీకు ఇచ్చేశానుగా ఇప్పుడే" అన్నాడు దేవదూత. "మీ దోసిలి నిండా సంశయాలే. సంశయాలన్నీ పోగొట్టాను. కొన్నిసార్లు మీ నుంచి తీసేసినది కూడా, ఇచ్చిన వాటికన్న పెద్ద కానుక" అని చెప్పాడు.

దేవుడిని విశ్వసించండి. సందేహించకండి. నిరంతరం సంశయిస్తూ ఉంటే, మీ ఆత్మ బలహీనపడుతుంది. దేవుడి మీద నమ్మకంతోనే ఆత్మ జీవిస్తుంది.

4. నసపెట్టడం

నసపెట్టడం ఆధ్యాత్మికంగా తప్పు. ఇది ఒకరకంగా మానసికమైన వేధింపు – మాటలతో చిత్రహింస పెట్టడం. ఇది అహం నుంచి పుడుతుంది. అవగాహన లోపంతో, స్వార్థంతో ఏది ఏమైనా సరే మీ మాట జరిపించుకోవాలని ఇలా చేస్తారు. తల్లిదండ్రులు పిల్లలకు సాయం చేయాలనే ఉద్దేశ్యంతోనైనా సరే నసపెట్టడం హానికరం. నసపెడుతున్నారంటే దేవుడిచ్చిన సంకల్పస్వేచ్ఛకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. మీరెవరితో నసపెడుతున్నారో ఆ వ్యక్తి మీ మాట వినకుండా పెడచెవిని పెట్టి, నస కొనసాగుతూనే ఉంటే చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా చేయవచ్చు.

5. నిరంతరం ఫిర్యాదు చేస్తూ, గొణుగుతూ ఉండడం

ప్రతికూలంగా ఆలోచించే వ్యక్తికి సంతోషమంటే ఏమిటో తెలియదు. జీవితమంతా ముక్కుతూ, మూలుగుతూ ఉంటే, కష్టాలను ఆకర్షిస్తారు. కొందరు ఇతరులపై జాలిని చూపిస్తూ ఈ లక్షణాన్ని ప్రోత్సహిస్తుంటారు. మీకు జరిగే మంచిని గుర్తుంచుకోవడం అత్యవసరం. సానుకూలంగా ఉన్న వాటిని తలచుకోండి. ఎప్పుడూ ప్రతికూల విషయాలనే గుర్తు చేసుకోవద్దు.

6. అవసరమైన దానికన్న ఎక్కువ కష్టాలుపడడం.

కొందరు తామెంత పనిచేస్తున్నామో ఇతరులకు చూపించాలనుకుంటారు, ఎంత కష్టపడుతున్నామో చెప్పాలనుకుంటారు. వాళ్ళు తమకు తాము హాని చేసుకుంటు న్నారు. సాయం కోసం అడగలేకపోతే మీరు గర్వంగా, ప్రతికూలంగా ఉన్నట్లు. భూలోకంలో మీరు కలిసి జీవించడానికి ఉన్నారు. మీరొక్కరే అన్నీ చేసుకోవడానికి కాదు. అన్నీ మీరొక్కరే చేసుకోగలరని నిరూపించాలనుకోవడం అంటే మీ అహం మాట్లాడుతుందని అర్థం. ఇది అసహజం. మీరు మానవాతీత మనిషిగా ఉండాలని ఎవరూ అనుకోరు.

7. అసూయ

వ్యక్తుల నుంచి సంతోషాన్ని దూరం చేసే వాటిలో అసూయ ఒకటి. మిమ్మల్ని నిరంతరం మరొకరితో పోల్చుకుంటూ ఉంటే మీ ప్రయాణం వెనుకబడుతుంది. మీకున్న వాటితో తృప్తిపడండి. అంతేకాక ఇతరులు సాధించేవాటిని చూసి సంతోషాన్ని, స్ఫూర్తిని పొందడానికి ప్రయత్నించడం నేర్చుకోవాలి. ఆత్మలోక ఆత్మలు ఇలాగే జీవిస్తాయి. దీనివల్ల మనకు నిజమైన ఆనందం లభిస్తుంది. మీకున్నదానికి దేవుడికి కృతజ్ఞతలు చెప్పండి. తృప్తిగా ఉండే కళను నేర్చుకొనండి.

8. ఇతరులను నిందించడం

మిమ్మల్ని మీరు తరచి చూసుకుంటే మీకు బాధ ఎందుకు కలుగుతుందో గుర్తిస్తారు. బాధ మీ లోపల ఉంటేనే, ఇతరుల వల్ల అది పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల బాధకు మూలం ఏమిటో తెలుసుకోండి. ఇతరులను నిందించవద్దు. మీలో ఉన్న లోపాన్ని సవరించుకొని, మిమ్మల్ని మీరు సరిచేసుకుని, ఇతరులు కూడా మారడానికి సాయపడండి.

9. ప్రతికూలమైన ఆలోచనలకు బానిసలవడం

ఎప్పుడూ ప్రతికూలంగా ఆలోచించే వ్యక్తులు, చివరికి అవి లేకుండా ఉండలేని స్థితికి వస్తారు. సమస్యలేమీ లేకపోతే సమస్యలు స్వయంగా సృష్టించుకొని బాధపడతారు. చాలా కేసుల్లో తనమీద తాను జాలిపడడం, నిరాశా నిస్పృహలు అలవాటుగా మారతాయి. అవి చిన్నగా మొదలై చాలా పెద్దవి అవుతాయి.

10. అసహనం

సహనంతో ప్రవర్తించడం అలవాటు చేసుకుంటే, మీరు మరింత ప్రశాంతంగా ఉండగలుగుతారు. అసహనం వల్ల నిగ్రహం కోల్పోతారు. సరైన సమయంలో జరగాల్సినవి జరుగుతాయని గుర్తుంచుకోండి: ఎప్పుడు జరగాలనేది దేవుడి చేతిలో ఉంది. అసహనం కలిగి ఉంటే, మీరు దేవుడికి షరతులు విధిస్తున్నారని అర్థం. ఆయన ప్రణాళికను పక్కనపెట్టి, మీ ప్రణాళికను అమలు చేయమని కోరుతున్నారు. మీ ప్రణాళిక ఎప్పుడూ పరిమితమైనది. దేవుడి ప్రణాళిక అపరిమితమైనది.

ఈ మనకు శారీరకంగా, ఉద్వేగపరంగా, ఆధ్యాత్మికంగా వ్యతిరేకత ఎలా హాని చేస్తుంది?

వ్యతిరేకంగా ఆలోచించడం ఒక అలవాటు అయిపోతుంది. చాలామంది జీవిత విధానమిది. వారి జీవితాలలో బాధపడాల్సినదేమీ లేకున్నా, వారు నిరాశతో, చెడు

గురించి ఆలోచిస్తూ, ద్వేషంతో, ఓడిపోతున్నట్లుగా ఉంటారు. వారు నిరంతరం ప్రతికూల ఆలోచనాశక్తిని వ్యక్తం చేస్తుండడమే దీనికి కారణం. మీ ఆలోచనలే మీకు వచ్చే ఫలితాలను నిర్దేశిస్తాయి. (Like attracts like) అందువల్ల ప్రతికూలంగా ఆలోచించేవారు అలా ఆలోచించేవారిని, ఆ పరిస్థితులను ఆకర్షిస్తూంటారు. ఇలా జరగడం వారి ఆత్మలకు హానికరం. ఇలా జరగనివ్వకూడదు. సానుకూలంగా ఆలోచించండి: మార్పుకు భయపడవద్దు. వ్యతిరేకమైన ఆలోచనల వల్ల వచ్చే ఫలితాలు:

1. మీ విచక్షణ పొరపడుతుంది

మీరు వ్యతిరేకంగా ఆలోచిస్తుంటే, మీ విచక్షణ తప్పవుతుంది. దైనందిన జీవితంలో మీరు తీసుకొనే నిర్ణయాలు తప్పవుతాయి. ఆధ్యాత్మికంగా కిందిస్థాయికి పడిపోతారు.

2. చిన్న బహుమతులు కోల్పోతారు

జీవితంలో ఎన్నో చిన్న కానుకలు (మీకు జరిగే మంచి విషయాలు) మీ కోసం ఎదురు చూస్తుంటాయి. మీరు ప్రతికూలంగా ఆలోచిస్తున్నప్పుడు ఇవి మీకు ఎదురుగానే ఉంటాయి కాని మీరు వాటిని చూడలేరు. గ్రహించలేరు. మీరు వ్యతిరేకంగా ఉంటే, మిమ్మల్ని ఈ కానుకలవైపు నడిపించే ఉపచేతనాత్మక మనస్సు మార్గదర్శకత్వాన్ని మీరు వినలేరు. కాలం గడిచే కొద్దీ మీ శక్తి ఎంత నల్లగా తయారవుతుందంటే, ఆ చీకటిలో మీకు కానుకలు కనిపించవు, అవి వెలుతురు స్వభావం కలిగి ఉండడంతో మీ దగ్గరకు రాలేవు. ప్రతికూల ఆలోచనలకు ప్రతికూల ఫలితాలే వస్తాయి గనుక మీరు మంచికి బదులుగా సమస్యలను ఆకర్షిస్తారు.

3. మీలో సంతులత లేదని జనం గుర్తిస్తారు

వినయంలా, సానుకూలంగా ఉండడం కూడా సత్తలోని స్వభావం. మంచి వారికి మీలోని ప్రతికూల స్పందన తెలిసిపోతుంది. వారికి అసౌకర్యం అనిపించి, మీతో తక్కువ సమయం గడుపుతారు. మీరు సరైన నిర్ణయం తీసుకోలేరు గనుక ఇలా ఎందుకు జరుగుతుందో అర్థంకాక, మీలోనే సంతులత లేదని తెలుసుకోలేక ఇతరులతో ప్రతికూల ధోరణిలో ప్రవర్తిస్తుంటారు.

4. మీ ఆరోగ్యం దెబ్బతింటుంది

ఆలోచనలు చాలా చాలా శక్తిమంతమైనవి. మీ ఆలోచనలు, భావాలు ఎప్పుడూ శారీరకంగా బయటపడతాయి. ప్రతికూల ఆలోచనలు, భావాలు అనారోగ్యం / గాయాల రూపంలో బయటపడతాయి. మీలో ద్వేషం, కోపం ఉంటే అది మీ శరీరంలో

కనిపిస్తుంది. మిమ్మల్ని మీరో, ఇతరులనో క్షమించలేకపోతే శరీరం శిథిలమవుతుంది. క్షమించడం ద్వారా స్వస్థత చేకూరుతుంది. ఇది మీకు మంచిది, మీ ఎదుగుదలకు అత్యవసరం.

5. పరీక్షలో మీరు ఫెయిలవుతారు

క్లిష్టమైన పరిస్థితిలో సానుకూలంగా వ్యవహరిస్తారా లేదా అని పెట్టే పరీక్ష అత్యంత మౌలికమైన పరీక్ష. ఆ పరిస్థితి వారి కర్మ కాకపోవచ్చు. అది వారి ఆత్మకు పరీక్ష గాని, శిక్షణగాని అయి ఉండవచ్చు. వారు దానికి వ్యతిరేకంగా స్పందించి, ఆ ప్రక్రియలో ఫిర్యాదు చేస్తూ, తమపై తాము జాలిపడుతూ ఉంటే, వారు ఆ పరిస్థితి నుంచి పాఠం నేర్చుకునే వరకూ అదే పరిస్థితి మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటుంది. క్లిష్టమైన పరిస్థితులలో కూడా సానుకూలంగా ఉండగలరా లేదా అనేది పరీక్ష – ఆ పరిస్థితి కాదు.

ఈ పరిస్థితిని మీరెలా ఎదుర్కొంటారనేది ముఖ్యం. ఉదాహరణకు ఎవరికీ అనారోగ్యంగా ఉండాలని ఉండదు, కాని అనారోగ్యంతో ఉన్న ప్రతిసారి మీ చుట్టూ ఉన్న వారి జీవితాలు దుర్భరం చేస్తుంటే మాత్రం, మీరు నేర్చుకోవలసిన పాఠమేమి టంటే అనారోగ్యం వచ్చినప్పుడు సానుకూలంగా ఉండండి. ఇతరులు మీకు చేస్తున్న సాయాన్ని ప్రశంసించండి. అనారోగ్యంతో ఉన్నపుడు సానుకూల దృక్పథం కలిగి ఉండడం పరీక్ష. మరొక పరీక్ష భయానికి సంబంధించినది. మీరు మెడికల్ రిపోర్టులు చూసి భయపడితే, మళ్ళీ మళ్ళీ వైద్య పరీక్షలు చేయించుకోవలసిన పరిస్థితి వస్తుంది. ఈ ప్రక్రియ కొనసాగేటప్పుడు భయపడకుండా ఉండడం పరీక్ష.

6. అతిగా విశ్లేషించుకొనడం

అంతరంగంలోకి తరచి చూసుకొనడం మంచిదే, కాని అతిగా విశ్లేషించుకుంటే ఏమీ చెయ్యలేరు. ఆలోచిస్తూ ఉండిపోయి, పనిచేయడంలో విఫలమైపోతారు. పరిస్థితిని గురించి అతిగా ఆలోచించి, ఎందుకు అని ప్రశ్నించుకుంటూ, ఉన్నదానిని ఉన్నట్లుగా అంగీకరించకుండా, ముందుకు కదలకుండా, ఆ పరిస్థితిని దాటడానికి ఏమి చెయ్యాలో చెయ్యకుండా ఉండిపోతారు.

7. ఉపచేతనాత్మక మనస్సును బలహీనపరుస్తారు.

ప్రతికూలమైన ఆలోచనలు భౌతిక మనస్సు నుంచే వస్తాయి. ఎంతో క్లిష్టమైన పరిస్థితిలో కూడా ఉపచేతనాత్మక మనస్సుసానుకూల ధోరణిలోనే ఆలోచిస్తుంది. అందువల్ల మీరు వ్యతిరేక ఆలోచనలకు ప్రాధాన్యమిస్తే, మీరు ఉపచేతనాత్మక మనస్సును కాదని భౌతిక మనస్సును కోరుకుంటున్నారు. భౌతిక మనస్సుకేం కావాలో అది దొరుకుతోంది. దానిని మీరు పాడు చేస్తున్నారు. ఉపచేతనాత్మక మనస్సును నిర్లక్ష్యం చేస్తున్నారు.

ప్ర వ్యతిరేక (ప్రతికూల) ధోరణిలో ఆలోచించే వ్యక్తి మంచిగా ఎలా మారతాడు?

మీ జీవితంలో తప్పులు చేయకుండా అన్ని రకాలుగా అదుపుచేసే అతి సామాన్య పదం ఒకటి ఉంది: నియంత్రణ. **భౌతిక మనస్సును నియంత్రించి, శిక్షణ ఇచ్చి మీ ఆలోచనలను అదుపు చేయండి.** ప్రతికూలమైన ఆలోచన రాగానే దానిని విశ్లేషించకండి. వెంటనే దానిని వదిలిపెట్టండి. అలవాటుగా ఆలోచనను కొన సాగిస్తారు కాని ఆ అలవాటును ఆపేయడం నేర్చుకోండి. మొదట్లో అది కష్టమని పిస్తుంది. ఈ వ్యతిరేక ఆలోచనలు వదిలేటప్పుడు మీక్కొంచెం భయం కూడా వేయవచ్చు. "ఒకవేళ దీనిని గురించి విశ్లేషించుకోవాలేమో? ఇలా జరిగితే ఎలా? ఒకవేళ జరిగితే?" మొదలైన విధంగా. కాని ఇలా బాధపడుతుంటే జరిగే మంచేమిటి? ఏమీ మంచి జరగదు. అందువల్ల వ్యతిరేక ఆలోచనని నియంత్రించండి. అది మొదటి అడుగు. తర్వాతి అడుగు, ఇంకా ముఖ్యమైనది వ్యతిరేకమైన ఆలోచనల స్థానంలో సానుకూల ఆలోచనలు వచ్చేలా చేయండి. సానుకూలంగా ఉండడమంటే, పరిస్థితులకు సంబంధించి ఉదాత్తమైన స్వభావాన్ని అర్థం చేసుకొనడం. మీరే మార్గంలో నడిచినా, ఆధ్యాత్మిక దృక్పథంతో చూడడం నేర్చుకోండి. దీనివల్ల సమస్యలు విలువలేనివని అర్థమై వాటినెదుర్కొనడం మీకు సాధ్యమవుతుంది. సమస్యలు వచ్చినపుడు, మానసికంగా, శారీరకంగా పనిచేస్తుండండి.

సమస్యలు మీ మార్గాన్ని ఆపవు. అవే మీ మార్గం.

మీకు జరిగే మంచి విషయాలు, ఎదురయ్యే సమస్యలు ప్రయాణంలో భాగాలే.

ఆశాభంగాలు జరుగుతుంటే మీరెలా సానుకూలంగా ఉండగలరు? ఆశాభంగాలు కూడా నేర్చుకునే ప్రక్రియలో భాగమని తెలుసుకోవాలి. ఏమీ అనుకోకుండా పనులు చేయండి. ఆశ మంచిది. దానిని సజీవంగా ఉంచాలి. కాని ఇలాగే జరగాలి అనుకోవడం మాత్రం మీ అహం నుంచి వచ్చే కోరిక. ఆశ ఫలితానికి సంబంధించినది కాదు. ప్రక్రియ జరుగుతున్నంతసేపూ సానుకూలంగా ఉండడం, ఫలితం మీ ఎదుగుదలకు మంచిదని నమ్మడం. ఫలితాన్ని దేవుడికి అర్పించి, ప్రక్రియ జరుగుతున్నంతసేపు సానుకూలంగా, ఆశతో ఉండాలి. మీ ఆత్మను సజీవంగా ఉంచేది ఆశ. ఇలాగే జరగాలి అనుకోవడం వల్ల ఆత్మ కింది స్థాయికి పడిపోతుంది.

మీకు ఇష్టం లేని ఉద్యోగం చేస్తున్నారనుకోండి, ఆ సమయంలో సానుకూలంగా ఉండటమంటే, బహుశ ఇది మీ పరీక్ష అనుకొనడం, కర్మ రుణాన్ని చెల్లిస్తున్నానను కొనడం, మీకు జరిగిన మంచిని గురించి సంతోషించడం, బహుశా ఇతరులకు సాయం చెయ్యడానికి అక్కడున్నారనుకొనడం.

బాగా సన్నిహితులను కోల్పోవడం దుర్భరం. అప్పుడు అంతా కోల్పోయినట్లు అనిపించడం సహజం. కాని ఆత్మలోక ఆత్మలు వారి కోసం మీరు విచారంగా ఉండాలని అనుకోరు. వారి సదాత్మలైతే వారు ఇంకా మంచి ప్రదేశంలోనే ఉంటారు. అందువల్ల మీరు విచారాన్ని ఉపశమింపచేసుకోండి. తప్పనిసరిగా ఉపశమనం పొందాలని కోరుకోండి. మీ ప్రియతములు మీ నుంచి ఇదే కోరుకుంటారు. భూలోకంలోని ఆత్మలు తమ కోసం జీవితాంతం దుఃఖం అనుభవిస్తూ ఉండాలని ఆత్మలోక ఆత్మలు కోరుకోవు. మీకు చేయి తెగితే రక్తం కారుతుంది. కాని కాలక్రమంలో గాయం మానుతుంది. దుఃఖం కూడా ఇలాగే కొంతకాలం ఉంటుంది. తర్వాత ఉపశమిస్తుంది.

ఆత్మలోకానికి రాగానే మేము చాలా సంతోషంగా ఉన్నాం. సజీవంగా చాలా బాగున్నాం. అన్నిటికన్న ముఖ్యంగా మేము మీతోనే ఉన్నాం. ఇది మీరు నమ్మాలని కోరుకుంటున్నాం. బాధ భరించరానిదైతే, ఈ సత్యాన్ని నమ్మి, గుర్తుంచుకోండి. దుర్భరమైన దుఃఖంలో కూడా సానుకూలంగా ఉండండి అని చెప్పడంలో మా ఉద్దేశ్యం ఇదే. మేము ఇంకా మీతోనే ఉన్నామని, మీరు కోరితే మీకు మార్గదర్శకంగా ఉంటామని నమ్మి ధైర్యంగా ఉండండి. మా అమ్మానాన్నలు మేము లేకుండా చాలా దుఃఖాన్ని అనుభవించారు. ఆత్మలతో సంభాషించడం అనేది లేకపోతే వారిని ఓదార్చడం, సంతోషంగా ఉండేలా చేయడం మాకు చాలా కష్టమయ్యేది. వాళ్ళు బాధపడినపుడు, మాకూ విచారం కలిగిందని మేము వారికి చెప్పాం. ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే భూలోకంలో ఉన్నప్పటికన్న ఇప్పుడు మేము వారికి చాలా దగ్గరగా ఉన్నామని, వారిని అమితంగా ప్రేమిస్తున్నామని వారికి తెలియ జెప్పాం.

అన్నీ బాగున్నపుడు సానుకూలంగా ఉండడం సులభం. పరిస్థితి బాగోనపుడు, జీవితం దుర్భరంగా అయినపుడు సానుకూలంగా ఉండగలగడం నిజమైన పరీక్ష. ఈ విధంగా మీరు వ్యక్తిగా రూపొందుతూ ఉంటారు. **పరిస్థితి ఎలాంటిదైనా చేయాల్సినది సానుకూలంగా ఉండడం.**

కొన్నిసార్లు మీ మనసుని నియంత్రించుకోలేరు, కొన్నిసార్లు మనసును నియంత్రించు కోగలిగినా, సానుకూలంగా ఎలా ఉండాలో మీకు తెలియదు. దీనికి చాలా సామాన్య కారణం ఉంది. ఇది ఎంపికకు సంబంధించినది. మీరు పూర్తిగా మార్పుకు నిబద్ధంగా ఉండాలి. మీ సంకల్పాన్ని ఉపయోగించాలి. దీనికి భౌతికమనస్సు కూడా మీకు సహకరించాలి. వ్యక్తులు విఫలమవడానికి కారణం వారి నిబద్ధత బలహీనంగా ఉంటుంది. వారి ప్రయత్నాలు హృదయపూర్వకం కావు, మార్పుకు పూర్తి నిబద్ధత వారికి ఉండదు. సానుకూలంగా ఉండాలని అనుకోండి. ఎవరినైనా క్షమించాలని అనుకోండి. వినయంగా ఉండాలని అనుకోండి. సంతృప్తిగా ఉండాలని అనుకోండి.

మీరు అనుకొనేదానిలో ఉన్న బలాన్ని బట్టి మీ సఫలత, వైఫల్యం ఉంటాయి. ఉదాహరణకి మిమ్మల్ని బాధపెట్టిన వారిని క్షమించడం మీకు కష్టమనిపించింది. అన్నీ తెలిసినా, మీరు క్షమించలేకపోతున్నారంటే, క్షమించడం ఎలాగో మీకు తెలియక కాదు, క్షమించడం ఇష్టం లేదు కనుక క్షమించలేకపోతున్నారు.

పరిస్థితులు అనుకూలంగా లేనపుడు, ధైర్యంగా ఉండి సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండడమే నిజంగా సానుకూలంగా ఉండడం. పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా సరే ఆశను కోల్పోకూడదు.

సానుకూలంగా ఆలోచించడానికి మార్గాలు :

1. దేవుడిపై సంపూర్ణ విశ్వాసముంచండి. మీకేది మంచిదో దానిని ఆయన చేస్తాడని నమ్మండి.

2. మీ కర్మను, పరీక్షలను, శిక్షణలను అంగీకరించండి. వీటిని ప్రతిఘటించవద్దు.

3. ప్రార్థించండి. శక్తినివ్వమని దేవుడిని ప్రార్థించండి. ఒక పరిస్థితిలో సానుకూలంగా ఉండడానికి కావలసిన శక్తిని ప్రార్థన ద్వారానే పొందగలరు. అది కూడా మీరు అడిగినపుడే ఇవ్వడం జరుగుతుంది. మీ ప్రార్థన వల్ల మీ చుట్టూ సానుకూల స్పందనలు ఏర్పడి, మీ వివేకం మెరుగై, మీరు సరైన పని చేస్తారు.

4. ఉపచేతనాత్మక మనస్సును పనిచేయించండి. సమస్యలు వచ్చినపుడు దీనిని ఉపయోగించండి. భౌతిక మనస్సుకున్న పరిమిత అవగాహనను ఉపయోగించవద్దు.

5. సమస్యలను ఎదగడానికి అవకాశంగా భావించండి.

6. వ్యాయామం చెయ్యండి. యోగ (మంచి గురువును పొందడం కీలకం), నృత్యాలు, ఈత, క్రీడలు వంటి శారీరక వ్యాయామం చెయ్యండి. మనస్సు, శరీరం, ఆత్మ మూడూ ఆరోగ్యంగా ఉండాలి.

7. దేవుడికి విధేయులుగా ఉండండి. విధేయులుగా ఉండడమంటే, దైవ నిర్దేశితమైన సన్మార్గాన్ని అనుసరించడం. మీ సామర్థ్యం మేరకు ప్రతి పనినీ చేసి, ఫలితం సంగతి దేవుడికి విడిచిపెట్టడం.

8. మీకు నచ్చిన పనులు చెయ్యండి. ఖాళీగా ఉండవద్దు. ఆ పనులు మీకు ప్రశాంతతను కలిగించే సాధారణమైన పనులై ఉండాలి. చదవడం, సంగీతం వినడం, వంట చేయడం, తోట పని, ఈత కొట్టడం వంటివి లేదా మీ హృదయాన్ని, ఆత్మను పెంపొందించేవి ఏవైనా చెయ్యండి.

9. ఇతరులతో కలిసి ఉండడం నేర్చుకోండి. మీకు నమ్మకమున్న వారితో కలిసి సమయాన్ని, అనుభవాలను పంచుకోండి. మీకు స్ఫూర్తినిచ్చేవారు, సానుకూల ప్రభావాన్ని వేయగల వారితో కచ్చితంగా కొంత సమయం గడపండి.

10. ఇతరులకు సాయం చెయ్యండి. కొన్నిసార్లు మీరు బాధపడుతున్నపుడు మీరు చెయ్యగలిగే మంచి పని ఇది. మరో విషయం పైన దృష్టి కేంద్రీకరిస్తే మీ బాధ తగ్గుతుంది. నిస్వార్థంగా ఉండడం నేర్చుకోగలుగుతారు.

11. నవ్వుతూ సరదాగా ఉండండి.

జీవితాన్ని సంతోషంగా గడపండి. మీకు, ఇతరులకు మీ వల్ల హాని జరగకుండా జీవితాన్ని అనుభవించడానికే మీరు భూలోకంలో ఉన్నారు. మీకేది సంతోషం కలిగిస్తుందో, ఏది విచారం కలిగిస్తుందో తెలుసుకోండి. **భూలోకంలో కష్టాలు పడడానికే ఉన్నానని అనుకోవద్దు. నిజమే మీ కర్మ రుణాన్ని చెల్లించెయ్యాల్సిందే, కాని మీ భూలోక ప్రయాణం సంతోషంగా జరగాలి. జీవితాన్ని మరీ అంత కష్టమని భావించవద్దు. హాస్యకుశలత కలిగి ఉండండి. సరదాగా ఉండండి. సంతులత అనేది కీలకం.** ఏ పరిస్థితినీ చాలా తీవ్రంగా తీసుకోవద్దు; అలాగని తమాషాగానూ తీసుకోవద్దు. బాధ్యత నుంచి తప్పించుకోవద్దు.

భూలోక ప్రయాణాన్ని బాగా సంతోషంగా గడపండి. హాస్యకుశలత సరదాగా ఉండడం వెలుగులో ముఖ్యభాగాలు. ఆత్మలోకంలో అందరికీ హాస్యకుశలత ఉంటుంది. మేము చేసే పనిని ప్రేమిస్తాం. మా అస్తిత్వాన్ని ప్రేమిస్తాం. బాగా నవ్వుతూ ఉంటాం. పాటలు, నృత్యాలు, పండుగలు ఉంటాయి. ఆత్మలోకానికి వచ్చినపుడు పండుగ అంటే ఏమిటో మీరు అర్థం చేసుకుంటారు. పండుగ ఎందుకంటే – మిమ్మల్ని దేవుడు సృష్టించాడని తెలుసుకున్నందుకు, మీరాయన పని చేస్తున్నందుకు, ఇంకా మీకు తెలియనిది, మాకు కూడా తెలియనిది చాలా ఉన్నందుకు. నిజంగానే తెలియనిదానిని, మన ప్రయాణంలో మనకోసం నిరీక్షిస్తున్న దానిని గురించి పండుగ చేసుకుంటాం. సంతోషంగా ఎందుకున్నామంటే, ప్రయాణంలోని ఈ దశలోనే ఈ అస్తిత్వంలోనే ఇంత సంతోషంగా ఉన్నామంటే, మనం ఏడవ విశ్వానికి చేరి దేవుడికి సన్నిహితంగా వెళుతున్నప్పుడు ఇంకెంత ఆనందంగా ఉంటామో ఊహించుకుని ఆనందంగా ఉంటాం. ఇది కచ్చితంగా పండుగ చేసుకోవాల్సిన విషయం.

గర్వం - వినయం



"గర్వాన్ని జేబులో పెట్టుకోండి"

"వినయాన్ని నటించవద్దు. వినయంగా ఉండండి".

మనుషులకు గర్వం లేదా అహం ఎందుకుంటాయి?

మనుషులకు సాధారణంగా ఉండే అవలక్షణాలలో గర్వం ఒకటి. ప్రతి వ్యక్తికీ గర్వంగాని, అహంగాని ఏదో ఒక రూపంలో ఉంటుంది. దీనిని వెంటనే నియంత్రించు కొనకపోతే చాలా ప్రమాదం. వినయం లేకుండా ఏ ఆధ్యాత్మిక ప్రయాణమూ ఉండదు. గర్వం జీవితకాలంలో ఏదో ఒక సమయంలో మనుషులందరికీ ఉంటుంది. కొందరికి డబ్బుందని గర్వం, కొందరికి అందంగా ఉన్నామని గర్వం, కొందరికి తెలివిగలవారమని గర్వం. కాని విచిత్రంగా చాలామంది గర్వించదగినదేమీ లేకపోయినా గర్విస్తూంటారు. అభద్రతాభావం, మానసికమైన న్యూనతా భావాల వలన ఇలా జరుగుతుంది. తాము సృష్టించుకున్న అబద్ధపు ప్రతిష్టను రక్షించే రక్షక వ్యూహంలోని భాగంగా వాళ్ళు గోడలు నిర్మిస్తారు. వారు నిజాయితీగా ఉండరు. సత్య మార్గం నుంచి దూరంగా పోతుంటారు. ఈనాటి ప్రపంచంలో ప్రతి ఒక్కరు తాము చేసేది అంతా సక్రమం అనుకుంటారు కనుక గర్విస్తూ బాగా పతనమవుతూ ఉంటారు. ఈ గర్వాన్ని నియంత్రించుకొనకపోతే, వారి వివేకం సక్రమంగా పనిచెయ్యదు. పొరపాటు పడుతుంది. నిజమైన అవగాహన ఏమిటో వారికి అనుభవంలోకి రాదు. భూలోకంలో హోదా లేని సామాన్య వ్యక్తి వినయం గలవాడైతే ఆత్మలోకంలో గౌరవింపబడతాడు, గర్విష్టి అయిన వ్యక్తి ప్రాపంచిక విషయ దృష్ట్యా చూస్తే సఫలుడైనా అతనికి ఇటువంటి గౌరవం దక్కదు. వినయం గల వ్యక్తి మంచివారిని ఆకర్షిస్తాడు. ముఖస్తుతి చేసే వారిని కాదు. నిజాయితీగా ఉండే సలహా కోసం వ్యక్తులు వారి దగ్గరకు వస్తారు. గర్విష్టులుగా ఉండేవారు ఒంటరులైపోతారు. చుట్టూ ఉన్నవారిని అనుమానిస్తూ ఉంటారు. ఎవరూ వారిని నిజంగా ఇష్టపడరు. జనం గర్వం పెంపొందించుకొనడానికి భూలోకంలో వచ్చే కీర్తి, విజయం కూడా కారణమే. కొన్నిసార్లు వ్యక్తులకు సమానమైన నైపుణ్యాలున్నా సఫలతా స్థాయిలు భిన్నంగా ఉంటాయి. దీనికి వారి పరీక్షలు, శిక్షణ, కర్మ కారణం. ఓటమి ఒక

పరీక్ష. విజయం కూడా పరీక్షే. ఈ రెంటినీ మీరెలా తీసుకుంటారో చూడడం జరుగుతుంది. విజయం, ఓటమి మిమ్మల్ని గొప్పవారిగానో, తక్కువవారిగానో చేయవు. సరిగ్గా అర్థం చేసుకోగలిగితే ఓటమి నిజంగా ఆశీస్సు. ఇది మీ అహాన్ని నాశనం చేస్తుంది. వినయాన్ని నేర్పుతుంది. అంతేకాక ఆ సమయంలో విజయం లభించడం మీకు మంచిది కాకపోవచ్చు. వినయంగా ఉండడం నేర్చుకుంటే మీకు లభించిన విజయాన్ని సరిగ్గా తీసుకోగలుగుతారు. అందువల్ల కొన్ని లక్ష్యాలు సాధించినపుడు గర్వాన్ని దరిచేరనివ్వద్దు. బదులుగా, ఇప్పుడున్న స్థితికి చేరడానికి మీకు ఉన్నతమైన శక్తి ఏదో సాయం చేసిందని గుర్తించండి. మీరేదైనా సాధించినపుడు, మీ దృష్టిలో పడాలని కొందరు మీకు అర్హత లేని ప్రాధాన్యమిస్తారు. వారితో జాగ్రత్తగా ఉండండి. మీకు విజయం లభించిందంటే అది పరీక్షేనని గుర్తుపెట్టుకోండి. కొన్నిసార్లు పెద్ద ప్రయత్నం లేకుండా త్వరగా లభించే విజయం చూసి మీకెవరూ సాటిలేరని నమ్ముతారు. ఇలా త్వరగా లభించే విజయం ఒక పరీక్ష. ఇది గర్వానికి దారితీయగూడదు. అందువల్ల విజయాల నిచ్చెన ఎక్కడానికి మెట్లను నిదానంగా, స్థిరంగా ఒకదాని తరువాత ఒకటిగా ఎక్కాలి. **ఆధ్యాత్మిక విజయం నిజమైన విజయం. భూలోకంలో లభించే విజయం కాదు.** భూలోకంలో, భౌతిక ప్రపంచంలో ఉన్నా ఆధ్యాత్మికంగా ఎదగాలనేది ఉద్దేశ్యం. అందువల్ల భూలోకంలో విజయం లభించినా, ఆధ్యాత్మికంగా ఎదగాలని దృష్టిపెట్టాలి. భూలోకంలో లభించే విజయాన్ని మానవాళి శ్రేయస్సుకు ఉపయోగించాలి. అలా చేయడం ద్వారా భూలోకంలో సంతులత కలిగిన జీవితం గడపగలుగుతారు. అహం వల్ల మనిషి చేసే తప్పులు అనంతం. మీరు గనుక తెలివైన మనిషి అయితే, ఈ తప్పులు అత్యంత ప్రమాదకరమని, ఇవి నిదానంగానే అయినా, కచ్చితంగా ఆత్మను చంపివేస్తాయని తెలుసుకుంటారు. ప్రతిసారి అహం మీరు అజేయులనే భావం కలిగిస్తుంది. మీరు మానవమాత్రులని, జీవితం ఒక్క సెకనులో మారిపోయే అవకాశం ఉందని గుర్తుంచుకోండి. **గొప్పవారమని భావించకుండా కృతజ్ఞత కలిగి ఉండండి.**

⊛ *గర్వం ఎలాంటి హానిచేస్తుంది?*

గర్వం వల్ల జరిగే నష్టాలు:

1. విచక్షణాజ్ఞానాన్ని కోల్పోవడం

గర్వం ఉంటే పూర్తిగా భౌతిక మనస్సు చెప్పినట్లే చేస్తారు. భౌతిక మనస్సు సరైన ఆధ్యాత్మిక నిర్ణయాలు తీసుకోలేదు. మీ నిర్ణయాల్లో ఆధ్యాత్మికత లోపిస్తుంది. ఎందుకంటే మీరు ఉపచేతనాత్మక మనస్సును ఉపయోగించడం లేదు. మీ అహం మిమ్మల్ని ఎవరి మాటా వినసీయదు; మీరు అనుకునేదొక్కటే సరైనదని భావించేలా అది చేస్తుంది.

అంతేకాకుండా, ఇతరులేమి అనుకుంటున్నారోనని, వారు మీ గురించి ఏమి అనుకోవాలని కోరుకుంటే అలా మీరు నిర్ణయాలు తీసుకుంటారు. మీ నిర్ణయాలకు సత్యంతో సంబంధం లేకుండాపోతుంది.

2. ఆధ్యాత్మికంగా పతనం చెందడం

మీరు దేవుడున్నాడని నమ్మకుండా గర్వం నియంత్రిస్తుంది. అసలు ఉన్నతమైన శక్తి ఉండే ప్రసక్తే లేదని అది మిమ్మల్ని నమ్మిస్తుంది. మీరు మేధావి అని నమ్మబలుకుతుంది. దేవుడిని నమ్మడానికి హేతుబద్ధమైన కారణాలు మీకు కావాలని చెబుతుంది. గర్వం తెలివితేటలకు అధిక ప్రాధాన్యమిచ్చి, దేవుడున్నాడని తెలిసిన ఉపచేతనాత్మక మనస్సుకు అస్సలు ప్రాధాన్యమివ్వదు. నిజంగా సంయమనంతో వ్యవహరించే మనిషి మేధ, అతని ఉపచేతనాత్మక మనస్సు, రెండూ ఒకేలా పనిచేస్తాయి.

3. తక్కువస్థాయి స్పందనలు

మీరేదైనా వ్యతిరేకమైన పని (చెడు పని) చేస్తే ఫలితం వ్యతిరేకం (చెడు)గా ఉంటుంది. ఈ వ్యతిరేక శక్తిని మీ తలచుట్టూ కమ్ముకున్న నల్లని మేఘం అనుకోండి. అది వెలుతురుని చేరనివ్వదు. వెలుతురు (వివేకం) రాకపోతే, మీ నిర్ణయం మరింత లోపభూయిష్ఠంగా ఉంటుంది. దీనివల్ల ఒక చక్రం సృష్టింపబడుతుంది. దానితో మరిన్ని బలహీనమైన నిర్ణయాలు తీసుకుంటారు. తప్పు పనులు చేస్తే వ్యతిరేక స్పందనలు పుడతాయి. తక్కువస్థాయి స్పందనలు మిమ్మల్ని, మీ చుట్టూ ఉన్నవారిని ప్రభావితం చేస్తాయి. వారు ఈ వ్యతిరేక మేఘాన్ని గ్రహించి మీకు దూరంగా ఉంటారు. మీ చుట్టూ ఉండే వ్యతిరేక శక్తి మరింత వ్యతిరేక శక్తిని ఆకర్షిస్తుంది.

4. అన్యాయం

ఏది ఏమైనా సరే, మీరు చేసేది రైటని నమ్మేలా అహం మిమ్మల్ని నమ్మిస్తుంది. అందువల్ల మీరు పరిస్థితులను గురించి పరిమితమైన అవగాహన మాత్రమే కలిగిఉంటారు. మీ అభిప్రాయాలను ఇతరులపై రుద్దుతారు, ఎవరి అభిప్రాయాన్ని పరిగణించరు. దీనితో మీరు వారి సంకల్పస్వేచ్ఛకు విరుద్ధంగా ప్రవర్తించి తీరని అన్యాయం చేస్తారు. దురదృష్టవశాత్తు అహం మీ కళ్ళు మూసేయడం వల్ల దీనిని మీరు అలా చూడలేరు.

5. అసూయ

అహం మీ ప్రయాణాన్ని ఇతరులతో పోల్చి చూస్తుంది. మీకు జరిగిన మంచి విషయాలను కృతజ్ఞతతో స్వీకరించకుండా, మీకు లేని దానిపైనే అహం మీ దృష్టిని కేంద్రీకరింపచేస్తుంది. అంతేకాక ఇతరులకు జరిగే మంచిని, వారు సాధించే విజయాలను మీరు సహించలేని విధంగా మిమ్మల్ని తయారుచేస్తుంది. అహం మిమ్మల్ని

అభద్రతాభావంలోకి, అసూయకు లోను చేస్తుంది.

6. అసంతృప్తి

భూలోకంలో మనిషి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠాలలో తృప్తి కలిగి ఉండడం ఒకటి. భౌతిక మనస్సు వల్ల అహం పుడుతుంది. అది మీరు ఇంకా ఇంకా కోరుకొనేలా చేస్తుంది. మీకు అహం ఉంటే, మీరు భౌతిక మనస్సుని వాడుతున్నారు. దానికి ఎక్కువ అధికారాన్నిస్తున్నారు. భౌతిక మనస్సు ప్రాపంచిక అవసరాలు దాటి కోరికలను సృష్టిస్తుంది. మీరు ఆ కోరికలకు లోబడిపోయి సంపద, అధికారం, కీర్తి సంపాదిస్తారు; అయినా తృప్తి చెందరు. అహం మీకు కోరికలను పెంచుతుంది. అవి తీరితే, కొత్త కోరికలను సృష్టిస్తుంది. మీరు ఆ కోరికలను తీరుస్తూ వాటికి మరింత ప్రాముఖ్యాన్నీ, శక్తిని ఇస్తుంటారు. కాని మీరు గనుక వినయంగా ఉండి, ఉపచేతనాత్మక మనస్సు మాట వింటే, దాని అవసరం చాలా చిన్నది. ఆధ్యాత్మికంగా ఏది రైటో దానిని చేస్తే చాలు దానికి. **అంతేకాక మీరు ఉపచేతనాత్మక మనస్సు సలహా వినేంతటి వినయాన్ని కలిగి ఉంటే అది బదులుగా మీకు శాంతి భావనను ఇస్తుంది. ఉపచేతనాత్మక మనస్సు సలహా వింటే ఫలితంగా తృప్తి లభిస్తుంది.**

మీకు ఉపచేతనాత్మక మనస్సు సలహా ఇస్తుంది.



మీరు వినమ్రంగా ఉంటారు గనుక ఆ సలహాను పాటించి సానుకూలమైన ఆధ్యాత్మిక చర్యను చేపడతారు.



సానుకూలమైన పని చేసినందుకు ఫలితంగా ఉపచేతనాత్మక మనస్సు మీకు శాంతి భావనను ఇస్తుంది.



మళ్ళీ మీరు ఉపచేతనాత్మక మనస్సు మాట వినే శక్తిని ఆ శాంతి భావన ఇస్తుంది. దానితో మరింతగా ఆధ్యాత్మిక చర్యను చేపట్టి ఆధ్యాత్మికంగా ఎదగగలరు.

7. శత్రువులు

దురుసుగా, అనాలోచితంగా ప్రవర్తిస్తే శత్రువులు ఏర్పడతారు. ఆ సమయంలో మీ అహం "ఏం ఫరవాలేదు" అంటుంది కాని సమయం మించిపోయాక మీరు బాధపడాల్సి వస్తుంది.

8. బంధుత్వాలు నష్టపోవడం.

బంధుత్వాలు కలిసి ఉంటేనే నిలుస్తాయి. గర్వం కలిసి ఉండటానికి వ్యతిరేకం. ఎందుకంటే గర్వం ఆధిక్యతాభావంతో వస్తుంది. అందువల్ల అహం అడ్డుగోడలు సృష్టిస్తుంటే మంచి సంబంధాలు ఏర్పడవు.

9. ఆశలు

అహం వల్ల ఆశలు కలుగుతాయి. దానికి స్థిరమైన ఎజెండా ఉంటుంది. ఏది ఏమైనా ఇది చెయ్యాలి; ఇది నాకు దక్కాలి అనే విధంగా అహం ఆలోచిస్తుంది. బాధలకు మూలకారణమిదే ఎందుకంటే తన ఎజెండా పూర్తికాకపోతే అహం భరించలేదు. అసహనం కలుగుతుంది. ఎప్పుడు జరగాలనేది ఉన్నతశక్తి చేతిలో ఉందని దానికి అర్థం కాదు. ఆశల వల్ల వ్యాకులత కలుగుతుంది, అవి అనవసరమైన వత్తిడిని కలిగిస్తాయి. మీ నుంచి, ఇతరుల నుంచి మీరు ఏవేవో కోరుకొనేలా కూడా అహం చేస్తుంది. ఇతరులు కోరుకున్నట్టుగా మీరుండాల్సిన ఒక అబద్ధపు అవసరాన్ని కూడా అహం సృష్టిస్తుంది. ఆశలు సృష్టించుకోవద్దు. కాని ఆశను సజీవంగా ఉంచండి ఎప్పుడూ. ఆశకు అర్థం అహానికి తెలియదు. మీరు ఫలితానికి పూర్తిగా లోబడి ఉండాలి, దైవ ప్రణాళికకు చోటు వదలాలి కనుక మీరు చేయలేనిదానిపై ఆధారపడి ఉండాలి. అహానికి తనను, ఇతరులను నియంత్రించడం మాత్రమే తెలుసు కనుక ఈ పని అది చేయలేదు.

ఆశ ఉండటమంటే ఏమిటి?

ఆశ అంటే వదలకుండా పట్టుకొనడం కాదు; వదలడం. ఇది వింత భావన అనిపించవచ్చు. ఎందుకంటే సాధారణంగా 'ఆశను వదలవద్దు' అని కదా అంటారు. ఆశ ఉండడం తప్పు కాదు. కాని ఫలితం రావాలనుకోవడం ఆశ కాదు. ప్రక్రియను ఉత్సుకంగా, కుతూహలంగా కొనసాగించడం ఆశ. నిత్యం మనిషి ఆశతో ఉంటూ భవిష్యత్తుపై విశ్వాసం కలిగి ఉండడమన్నమాట. 'ఆశను సజీవంగా ఉంచడం' అంటే ఏ పరిస్థితినైనా సానుకూలంగా కొనసాగించడం, చేయగలిగినంత బాగా చేయడం, మీకేది మంచిదో దేవుడికి తెలుసని ఆయన చేస్తాడని అనుకోవడం. ఈ రకంగా మీకు ఫలితంతో సంబంధం ఉండదు, కాని ప్రక్రియ ప్రాధాన్యాన్ని మీరు అర్థం చేసుకున్నారు. అహం ఎప్పుడూ ఫలితాన్ని పట్టుకొని వేలాడుతుంది; దీనికి భిన్నంగా ఉపచేతనాత్మక మనస్సుకు శరణాగతి సహజ విధానం.

అహంతో ఎలా వ్యవహరించాలి?

అహానికి, ఉపచేతనాత్మక మనస్సుకు మధ్య జరిగే పోరాటం జీవితకాలం జరుగుతూనే ఉంటుంది. అహాన్ని వదిలేవరకు మీరు ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మొదలుపెట్టలేరు. ఈ మార్గంలో ప్రయాణం మొదలుపెట్టేందుకు ఇక్కడ మూడు సరళమైన దశలను సూచించడం జరిగింది:

1. మిమ్మల్ని మీరు విశ్లేషించుకోండి

అహంలో చాలా స్థాయులు ఉంటాయి – కొందరికి అహం ఎక్కువగా ఉంటుంది. మరికొందరికి తక్కువగా ఉంటుంది. మనుషులందరికీ గర్వం అనేది ఉంటుంది. సంపదలు, కీర్తి, అధికారం, సౌందర్యం, ప్రతిభానైపుణ్యాల వలన గర్వం కలుగుతుంది. కాని అన్నిటికన్న చెడ్డ గర్వం ఆధ్యాత్మిక గర్వం – 'నేను' అనే ఆలోచనా గర్వం – "నేను రైటు", "నేను వినయంగా ఉంటాను", "ఇది నా వల్లే జరిగింది", "ఎందరో సాయం కోసం, మార్గదర్శకత్వం కోసం నా దగ్గరకు వస్తారు", "నేనెంతో సామాజిక సేవ చేస్తాను", "నేను ఎంతో గొప్పగా స్వస్థత చేకూరుస్తాను", "ఎందరో నా వద్దకు వస్తారు", "నేను ప్రజల కోసం ఎన్నో ఆసుపత్రులు, పాఠశాలలు కట్టించాను", "నేనెంతో ధార్మికుణ్ణి", "నాకు తెలుసు", "నేనెంతో సాధించాను", "నా పనిని / ఉద్యోగాన్ని / వృత్తిని ఎంతో బాగా చేస్తాను" అని ఆలోచించడం.

'నేను' అనేది వచ్చిందంటే, ఇది గర్వానికి సంకేతం, మీ ఆధ్యాత్మిక పతనంలో మొదటి దశ ఇది. విజయాలు, నైపుణ్యాలు అన్నీ దైవదత్తం. మనం ఆయన చేతిలో ఉపకరణాలం. మన ప్రతిభలను మానవసేవకు ఉపయోగించాలి. మనకు ఇవన్నీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పాలి. వినయంగా ఆయన ఆశీస్సులు పొందాలి. కాని 'నేనే' ఇదంతా చేశానని అనుకోరాదు.

ఇప్పుడు మిమ్మల్ని మీరు విశ్లేషించుకుని మీరు గర్విష్ఠి అని ఒప్పుకోండి. సరిగ్గా ఆలోచిస్తే ఇంతగా గర్వించడం తెలివి తక్కువతనం అని మీకే అనిపిస్తుంది. దేవుడిని ప్రార్థించండి. దారి చూపమని వేడుకోండి. మీరు గర్వంగా ఉన్నారని **గుర్తించడం, అంగీకరించడం, మీరు నిజంగా మారాలనే కోరిక కలిగి ఉన్నారని** చెప్పడం కష్టమైనది. ఆధ్యాత్మిక మార్గంలో నడవడం మొదలుపెట్టడం కష్టం ఎందుకంటే ఇలా చేయడానికి మారాలి. అహానికి ఇది తెలుసు; చివరికి తనని వదిలి పారేస్తారని దానికి తెలుసు గనుక దానికి ఇది ఇష్టం ఉండదు. అందుకని మార్పును మీరు అంగీకరించకుండా చేస్తుంది. ఇందువల్ల మీ అహానికన్న, మీ నిశ్చయం దృఢంగా ఉండాలి.

2. గర్వాన్ని నియంత్రించుకోండి

గర్వం ఆలోచనలో ఉంటుందని అర్థం చేసుకోండి. మీరేదైనా మంచి పని చేసినప్పుడు, ఏదైనా సాధించినపుడు గర్వం కలుగుతుంది. కాని గర్వంగా ఆలోచించకండి. ప్రవర్తించకండి. దీనికి పూర్తిగా భిన్నంగా ఉండే దానిపై మనసును లగ్నం చెయ్యండి. మొదట కొన్నిసార్లు మిమ్మల్ని మీరు నియంత్రించుకొనడం కష్టం - అలవాటైన చెడ్డ అలవాటును ఆపుకోవడానికి ప్రయత్నించడంలా అనిపిస్తుంది. ఇది లేకపోతే మీకు జరగదని మీరు నమ్మేంతగా మీ భౌతిక మనస్సు దీనికి అలవాటుపడిపోయింది. నిదానంగా ఈ ఆలోచనలు పోయి, అదృశ్యమైపోతాయి. కోరిక ఉంటుంది కాని, దానికి లొంగకుండా ఉండడమే పరీక్ష. ఒకవేళ మొదట్లో కొన్నిసార్లు ఓడిపోయినా, కోపం తెచ్చుకోవడం, వ్యతిరేకంగా ఆలోచించడం చెయ్యవద్దు; బదులుగా **ఆరంభంలో ఓడిపోతామని అంగీకరించి వినయంగా ఉండండి.** కొంచెం ఆగి మళ్ళీ ప్రయ త్నించడం కీలకం. మీరు సానుకూలంగా, నిరంతరం ప్రయత్నిస్తే విజయం సాధిస్తారు. అన్నీ మీకు స్పష్టంగా, సులభంగా అనిపిస్తాయి. మీరు సరైన మార్గంలో నడవడం ఆరంభిస్తారు.

3. గర్వపు ఆలోచనల స్థానంలో వినయంతో కూడిన ఆలోచనలు ఉండేలా చూసుకోండి


అస్పష్టంగా ఉన్న ఆలోచనలు, పనులను రాసిపెట్టుకోండి, వాటి స్థానంలో మంచి ఆలోచనలు, అవగాహన కలగటానికి అవకాశం ఉంటుంది. ఈ పద్ధతిని ఆచరిస్తే చిన్న గర్వపు ఆలోచన అహంగా మారదు. గర్వపు ఆలోచనలు ఎప్పటికప్పుడు వస్తూనే ఉంటాయి. గాని మీ మనసు నియంత్రించుకొనడమెలాగ మీకు తెలుస్తుంది. మీ ప్రయత్నం మాత్రం కొనసాగిస్తూనే ఉండండి.

మనుషులు జన్మతః గర్విష్ఠులుగా పుడతారా? లేకపోతే కాలక్రమంలో గర్విష్ఠులవుతారా?

మనుషులకు భౌతిక మనస్సు ఉన్నదంటేనే అర్థం భూలోకంలో అహంకార పూరితులవడానికి బాగా అవకాశముందని కొందరికి గర్వం తక్కువగా ఉంటుంది. కొందరికి ఎక్కువగా ఉంటుంది. కొందరు గత జన్మలలో అహాన్ని చంపుకొనడానికి కృషి చేసి ఉంటారు. ఇప్పుడు వారు వినమ్రంగా ఉంటారు. కొందరు ఈ పనిలో ఓడిపోయి అహాన్ని చంపాలనే ఉద్దేశ్యంతోనే పునర్జన్మిస్తారు. దురదృష్టవశాత్తు, భూలోకంలో అహం బాగా పుంజుకొని, దీనివల్ల మరెన్నో తప్పులు చేస్తారు. ఇక్కడొక చిన్న ఉదాహరణ చూడండి:

ప్రతీకారం ముందుగానే రచింపబడుతుంది గనుక ఇది పాపాలకెల్ల అతి పెద్ద పాపం. ఇది చెడు చేయాలనే ఉద్దేశ్యంతో చేస్తారు. ఆధ్యాత్మికంగా 4వ ఆవరణ 5వ దశలో ఉన్న ఒక వ్యక్తి విషయం చూద్దాం. అతను ప్రతీకారేచ్ఛ ఉన్న వ్యక్తి కానవసరం లేదు, అంటే అతని ఆత్మకు ప్రతీకార స్వభావం లేదు. కాని ఎలాగో అతను గర్విష్ఠి అవుతాడు.

అతడి బాహ్య ప్రపంచంలో ఏదో జరుగుతుంది. ప్రాపంచికంగా ఏదో సాధించాడనుకుందాం. దానివల్ల అతనికి అహం ఏర్పడింది. అతని ఉపచేతనాత్మక మనస్సు గర్వం పెరుగుతున్నదని అతనికి సూచిస్తున్నా, గర్వాన్ని ఆనందంగా అనుభవిస్తున్నందున అతను దాని సలహా వినడు. గర్వం వల్ల వచ్చే సమస్య ఇది. అది మీరు శక్తిమంతులని భావించేలా చేస్తుంది. దానికి మీరు అలవాటు పడిపోతారు. కాలం గడిచే కొద్దీ గర్వం పెరుగుతూ ఉంటుంది. అహం క్రూరంగా మారి చుట్టూ జరుగుతున్న విషయాలన్నీ పరిశీలిస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఇతరులేం చేస్తున్నారని చూస్తుంది. మరొకరెవరైనా ఏదైనా, మంచి పని చేస్తే అహం దెబ్బతింటుంది. ఎందుకంటే ఎప్పుడూ తానే నెంబర్‌వన్‌గా ఉండాలని దానికుంటుంది. ఇది మరింత ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. దేవుడు ప్రతి మనిషినీ ప్రత్యేకంగా, సమానంగా సృష్టించాడని అది గుర్తించదు. అందువల్లే పోల్చుకొనడం తప్పు. అహం పోల్చుకోవడం మొదలుపెట్టగానే అసూయ అడుగుపెడుతుంది. ఈ పోల్చుకోవడం దినదినం జరుగుతూ ఉంటే ఆ వ్యక్తి లోపల్లోపల రగులుతూ ఆగ్రహం పెంచు కుంటాడు. ఆ రగలడం, తీవ్రమైన ఆ వ్యతిరేక భావం పెరిగి కార్చిచ్చులా మారి ద్వేషంగా రూపుదాల్చుతుంది. మీలో ద్వేషం గూడుకట్టుకునే స్థాయికి చేరారంటే, ఉపచేతనాత్మక మనస్సును అదృశ్యం చేసుకున్నట్టే. దాని ప్రభావం మీపైన ఏమీ ఉండదు. తార్కికంగా ఎంత చెప్పినా మీరు శాంతించలేరు. ద్వేషంతో కళ్ళు కప్పబడిపోతాయి. ప్రతీకారం వైపు నడుస్తుంటారు. ఎవరి మీదనైనా ఒకసారి ప్రతీకారం తీర్చుకున్నారంటే ఉపచేతనాత్మక మనస్సు మూసుకుపోతుంది. మళ్ళీ తెరచుకొనే అవకాశం చాలా తక్కువ. అందువల్ల 4వ ఆవరణ 5వ దశలో ఉన్న ఆ ఆత్మకు ప్రతీకారం ఆత్మలక్షణం కాదు. కాని తన గర్వాన్ని అదుపులో ఉంచుకోలేకపోయినందువల్ల ఆధ్యాత్మికంగా పతనం చెందవలసి వచ్చింది.



మానవ లక్షణాలలో అతి హీనమైన లక్షణం ప్రతీకారం. ప్రతీకారేచ్ఛగల వ్యక్తుల పట్ల ఆధ్యాత్మిక నియమం సహనం చూపదు. అందువల్ల గర్వం విషయంలో జాగ్రత్తగా ఉండండి. ఎందుకంటే దీనిని తక్షణమే విడిచిపెట్టకపోతే, అత్యంత శక్తిమంతమైన ప్రతికూలశక్తిగా మారి ఆత్మకు హాని చేస్తుంది. వ్యక్తి రకరకాలుగా ప్రతీకారాన్ని తీర్చుకోవచ్చు. ప్రతీకారం శారీరక హానికి సంబంధించినది కాదు. ఇది కంటికి కనిపించే అంశం. ఇతరులను లోకువగా చూడడం, తక్కువ వారని భావించేలా చేయడం; చెడు పనులు చేసేలా మోసగించడం ఇవన్నీ ప్రతీకారమే. కావాలని ఎవరికైనా శారీరకంగా, మానసికంగా, ఉద్వేగపరంగా, ఆధ్యాత్మికంగా హాని చేస్తే మీరు ప్రతీకారం తీర్చుకుంటున్నారు.

వినయంగా ఉండటమంటే ఏమిటి?

1. ఉన్నత శక్తి మిమ్మల్ని సృష్టించిందని తెలుసుకుని ఉండడం.

ఆధ్యాత్మిక మార్గంలో నడిచే నిజమైన సాధకుడు ఎంతో వినమ్రంగా ఉంటాడు. అటువంటి వ్యక్తికి సృష్టి అంటే ఏమిటో స్పష్టంగా తెలుసు. తనను దేవుడు సృష్టించాడని అతనికి తెలుసు. వినయంగా ఉండటమంటే ఈ సత్యాన్ని నిరంతరం గుర్తుంచుకొనడం. మనందరినీ దేవుడు సృష్టించాడు. మనందరం ఆయనకే చెందుతాం. విచక్షణగల, న్యాయశీలుడైన, దయార్ద్రహృదయంగల దేవుడి రక్షణలో ఉండడం అదృష్టం. వినయంగా ఉంటూ ఈ సంబంధాన్ని కొనసాగించుకోవలసినది మనమే.

2. గర్వం స్వార్థానికి సంబంధించినది, వినయం నిస్వార్థానికి సంబంధించినది.

దేవుడిని గురించి, ఆయన లక్షణాలను గురించి తెలుసుకోవాలంటే, ఆయన లక్షణాలను కలిగి ఉండాలి. దేవుడి మొదటి లక్షణం వినయం. అస్తిత్వానికి వినయం సహజరూపం. ప్రకృతిని పరిశీలిస్తే, దేవుడు సౌందర్యాన్ని సృష్టించాడు, తన సృష్టిలో పైకి కనిపించే సౌందర్యంతోపాటు, వినయంగా అన్నీ సమకూర్చే ప్రకృతి కూడా ఉంది. అది పూర్తిగా నిస్వార్థమైనది. ఆధ్యాత్మికత సారాంశం నిస్వార్థమైన లక్షణం. ఇంకా ప్రకృతి అన్నిటితో సహజీవనం చేస్తుంది : ఏరులు నదులవుతాయి. సమతౌల్యం, ఏకత్వం, సామరస్యం, అన్నిటినీ మించి ప్రకృతిలో వినయం ఉంది. ఏరు ఎప్పటికీ తాను మహాసముద్రం కావాలని అనుకోదు. విశ్వంలో తన స్థానం దానికి తెలుసు, తన పనిని వినయంగా, సంతోషంగా చేస్తుంది. ఎంతో గొప్పగా ఎంతో సేవ చేస్తూనే ఉంటుంది. మనుషులు కూడ ఇలా జీవించాలని దేవుడు కోరుకుంటాడు. నిజమైన ఆధ్యాత్మిక కళ నిస్వార్థసేవ – ప్రకృతికున్న అపారమైన సుగుణం ఇది.

3. వినయం నటించకండి. వినయంగా ఉండండి.

ఆలోచనలో గర్వం ఎలా ఉంటుందో, వినయం కూడా అలాగే ఉంటుంది. అహం తన అపవిత్ర ఉద్దేశ్యాలకు పవిత్రమైనవి, మంచివి అనే దొంగవేషం వేసి మీరు చేసేది రైటేననిపింపజేసి మిమ్మల్ని మోసం చేయడంలో దిట్ట. ఎందుకంటే అహం స్వార్థం కలది, ఎంత నష్టం జరిగినా సరే తను చెయ్యాలనుకున్నదానిని అది చేసి తీరాలనుకుంటుంది. ఈ నష్టం మీ ఉపచేతనాత్మక మనస్సుకు, ఆత్మకు జరగవచ్చు. అందువల్ల చాలామంది మనుషులు వినయం అనే ముసుగును తొడుక్కుంటారు. వాళ్ళ మాటలు, చేతలు వారెంతో వినయంగా ఉన్నట్టుగా అనిపింపజేస్తాయి. కాని వారి ఆలోచనల నిండా తాము అధికులమనే గర్వమే ఉంటుంది. వారు జనాలను కొంతకాలం పాటు మోసగించగలరు. కాని చివరికి అసలురంగు బయటపడక తప్పదు.

4. మీరు గనుక ఆధ్యాత్మిక మార్గంలో ఉంటే, గర్వంగా ఉండవద్దు. ధార్మికులమని అనుకోవద్దు.

మీరు ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తూ ఉంటే అలా ఉన్నందుకు గర్వపడవద్దు. భూలోకంలో జీవితం గడపడానికి కావలసిన జ్ఞానం మీకుంది కూడా, తప్పు చేయాలనుకున్నారంటే ఆధ్యాత్మికంగా మీరు త్వరగా ఎంతోకిందికి పడిపోతారు. భూలోకంలో చాలామంది తాము దైవకార్యం చేస్తున్నామని అనుకుంటారు. జనానికి ఎలా జీవించాలో చెబుతూ తాము జ్ఞానాన్ని వెదజల్లుతున్నామని అనుకుంటారు. కాని ఇలా చెప్పుకునే ఆధ్యాత్మిక గురువులకు తమకు జ్ఞానం ఉందని గర్వం. ఇది ఆధ్యాత్మిక గర్వం. నీచాతినీచమైన గర్వం. అత్యున్నత స్థాయిలో ఆత్మ చేసే అవినీతి ఇది. ఆధ్యాత్మిక జ్ఞానం కావాలంటే, బాగుపడాలంటే మంచి గురువును ఎంపిక చేసుకొనడం ముఖ్యం. చాలామంది గురువులకు అధికార దాహం ఎంతగా ఉంటుందంటే, విద్యార్థిని ఎలా మోసం చేయాలో వారికి బాగా తెలుసునని గ్రహించుకోండి. విద్యార్థి అహాన్ని తృప్తి పరిచి, మీ భయాలే మిమ్మల్ని మోసం చేసేలా చేయగలరు. ఆధ్యాత్మిక మార్గం సులువైనది కాదు. దీనిలో కఠినమైన సత్యాలుంటాయి. మీలోపలికి మీరే తరచి చూసుకుని, మీ తప్పులు మీరే అంగీకరించాలని ఇది కోరుతుంది. చెడ్డ గురువు మీరేం వినాలనుకుంటే అదే చెబుతాడు. మీకు అవసరమైనది చెప్పడు. **నిజమైన గురువు కూడా ఎల్లప్పుడూ విద్యార్థే.** గురువు వినయంగా ఉన్నాడా లేదా అని తెలుసుకొనడానికి ఇది మొదటి సంకేతం.

5. మీరు దేవుడి విద్యార్థి అని నిరంతరం గుర్తుంచుకోండి.

మీకున్న జ్ఞానము, మీకున్న నైపుణ్యాలు, మీలో ఉన్న మంచితనము మీవి కావు. ఇవి మీ ద్వారా ప్రవహిస్తాయి. మీ మనస్సు, శరీరం, ఆత్మ అదృష్టవశాత్తు మంచితనానికి వాహికలుగా ఉన్నాయి. ఈ ప్రవాహం మిమ్మల్ని సరైన మార్గంలో ఉంచుతుంది. కాని ఆ ప్రవాహానికి మీరే సొంతదారు అని భావించడం మొదలు పెట్టగానే, ఆ ప్రవాహాన్ని నెమ్మదిగా తగ్గిస్తున్నారు. ఒక నాటికి అది చుక్కలుగా మారి పూర్తిగా ఆగిపోతుంది. ఆ మంచితనపు ప్రవాహం మిమ్మల్ని వదలలేదు. మీరే దానిని వదిలారు. గర్వంతో మీరు దానిని వదిలారు. ఆధ్యాత్మిక నియమాను సారం ఆ ప్రవాహం వల్ల వినయం లభిస్తుంది. ఆ ప్రవాహం మరొక మార్గాన్ని, సేవా దృక్పథాన్ని అర్థం చేసుకునేంతగా తెరచుకొని ఉన్న వాహికను ఎంచుకుంటుంది. వాహికలుగా మీరు సేవ చేస్తారు. సేవ ద్వారా మీరు సహ-సృష్టికర్తలవుతారు. కాని మీరు గర్వించిన క్షణంలోనే, ఒంటరిగా పని చేయాలనుకొంటారు, దేవుడితో సంబంధం తెగిపోతుంది, మీరు మీ మనస్సు, శరీరాలతో ఒంటరులైపోతారు, అవి చాలా పరిమితమైనవి. మనస్సు, శరీరాలకన్న వేగంగా మీ ఆత్మ క్షీణించిపోతూ ఉంటుంది. ఎందుకంటే అది దేవుడు లేకుండా ఉండలేదు, మూలం నుంచి దానికి పోషణ నిరంతరం అందుతూ ఉండాలి.

విలువ ఉండాలంటే మీకు ఆధ్యాత్మిక సంపత్తి, బలము అవసరం. అహానికి నియంత్రణాధికారం కావాలి. అందుకని అది దేవుడిని గుర్తిస్తే మీరు శక్తిహీనులవుతారని చెబుతుంది మీకు. దేవుడి నుంచి దూరం జరిగితే, శక్తి లభించినట్లుగా అహం మీకు భ్రాంతి కలిగిస్తుంది. భౌతిక సంపదలు, కీర్తి సాధించేలా అవిశ్రాంతంగా శ్రమించేలా చేస్తుంది; అది మిమ్మల్ని ఆందోళితం చేస్తుంది. ఆ ఆందోళనను సానుకూల ప్రేరణగా గ్రహించి మీరు భౌతిక ప్రపంచంలో మరెంతో సాధించాలని ఇంకా ఇంకా ప్రయత్నిస్తుంటారు. అహాన్ని పనిచేయిస్తూ, ఉపచేతనాత్మక మనస్సు కన్న భౌతిక మనస్సుకు మరింతగా ప్రాధాన్యమిస్తూ, పూర్తిగా ఆత్మను నిర్లక్ష్యం చేస్తూ, ప్రమాదకరమైన గర్వాన్ని బలపరుస్తూ ఉంటారు. ఈ భ్రాంతి మీరు చనిపోయాకే పోతుంది. మీ ఆత్మ మూల్యాంకనం జరిగాక మీ భ్రాంతి పూర్తిగా తొలగిపోతుంది. ఆ భ్రాంతి తొలగిపోయిన క్షణమే సత్యం - అది చాలా ఆలస్యంగా వచ్చింది. ఆత్మే నిత్యమని, అదే నిజమైన విలువ కలిగినదని మీరు గుర్తిస్తారు. మీ జీవితమంతా తాత్కాలిక విషయాల కోసం వెచ్చించారు. శక్తినంతా శారీరక, భౌతిక అధికార సంపాదనకు ఉపయోగించారు. **అధికారాన్ని గురించి ఆలోచించకండి. ఆధ్యాత్మిక శక్తిని గురించి ఆలోచించండి.** మీరు చూసే వస్తువులన్నీ తాత్కాలికం; మీకు కనిపించనివి అన్నీ శాశ్వతం. ఈ సత్యాన్ని తెలుసుకుని జీవిస్తే, అంతం లేని భౌతిక సంపదలు, కీర్తి కోసం దురాశ పడరు. వాస్తవానికి ఆ కీర్తి, సంపద మీకు లభిస్తే, మీరు కృతజ్ఞులుగా ఉంటారు, ఇతరులకు స్ఫూర్తినిచ్చే స్థితిలోను, దైవకార్యాన్ని

నిర్వహించే స్థితిలోను ఉన్నానని గుర్తిస్తారు. దైవకార్యం నిర్వహించడమంటే మీ బలమైన స్థితిని ఉపయోగించి ఇతరులు ఎదిగేలా చేయడం. ఇతరుల ఆత్మను స్వస్థత పరచి, బలపరచి, సహాయం చేయడమే ప్రతి మనిషికి అంతిమలక్ష్యం.

ప్ర *వినయంగా ఉండడం బలహీనత అని కొందరనుకుంటారు. ఎందుకని?*

ఎందుకంటే, వినయానికి నిజమైన అర్థం వారికి తెలియదు. వినయము, ఆత్మగౌరవమూ రెండూ కలిసే ఉంటాయి. అంటే ఎట్టి పరిస్థితులలోనూ మీ ఆత్మకు గాని, ఇతరుల ఆత్మకు గాని హాని చేసే పనులు మీరెన్నడూ చేయరు. సరైన నిర్ణయం తీసుకొనడం, మీ పరిధులు తెలుసుకొనడం, మరొకరికి హాని చేయకుండటం, అగౌరవపరచకుండా ఉండటమని అర్థం. వినయాన్ని బలహీనతగా చూడకూడదు. వాస్తవానికి తప్పులను అంగీకరించకుండా అడ్డుపడే అహమే మీ బలహీనత. వినయం మీరు ఉపచేతనాత్మక మనస్సు చెప్పినట్లుగా నడవడానికి సాయపడుతుంది. ఉపచేతనాత్మక మనస్సుకు పైపైన కనబడేవి అవసరం లేదు - అది అహాన్ని నాశనం చేసి ఏది రైటో అదే చేస్తుంది. కొన్నిసార్లు మీరు తప్పులను ఒప్పుకుంటారు కాని లోపల్లోపల ఆగ్రహిస్తూ ఉంటారు. తప్పులను ఒప్పుకుంటే శాంతి లభించాలి. ఆగ్రహం కాదు. తాము చాలా తప్పు చేశామని తెలుసుకొనడానికి కొందరికి చాలాకాలం పడుతుంది. అహం బాగా పనిచేస్తుందనే దానికి ఇదే సంకేతం. వినయం వల్ల మీలో ఉన్న నైతిక సత్యం మీరు తెలుసుకోగలుగుతారు. మీకు మీరు మార్గదర్శిగా ఉండేలా సాయం చేస్తుంది కనుక ఇది అమూల్యమైనది. అది బలహీనత ఎలా అవుతుంది? మీతో మీరు నిజాయితీగా ఉండేలా వినయం సహకరిస్తుంది. మీ అహానికి దెబ్బతగిలినా, మీ నమ్మకాలు స్థిరంగా అనిపించినా ఒక క్షణంలోనే మీరు తెలుసుకోగలుగుతారు. నైతికతకు కట్టుబడి ఉండడం మంచి విషయం ఎందుకంటే మీరు అప్పుడు ఆధ్యాత్మికంగా ప్రతిస్పందిస్తున్నట్లు. **వినయంగా ఉండటమంటే చెడుని సహించడం కాదు.** చాలామంది పిరికిగా ఉంటూ, అది వినయమని తప్పించుకో జూస్తారు కాని అది బలహీనత. వినయమంటే చెడుని ప్రోత్సహించకుండా ఎదిరించడం, అలా ఎదిరించే బలం దేవుడి నుంచి వస్తుందని తెలుసుకొని ఉండడం.

ప్ర *వ్యక్తికి తాను గర్వంగా ఉన్నానని ఎలా తెలుస్తుంది?*

గర్వానికి సంకేతాలు:

1. దేవుడి ఉనికిని నమ్మరు.
2. మీ తప్పులని మీరు అంగీకరించరు.

3. మీరు (చేసినది) తప్పని, మరెవరో (చేసినది) రైటని తెలిస్తే మీరు తట్టుకోలేరు.
4. సత్యాన్నుంచి పారిపోతారు.
5. ఇతరులకంటె అధికులమనుకుంటారు.
6. మీకే ప్రతిభ ఉందని అనుకుంటారు.
7. మీకెవరూ సాటిలేరని అనుకుంటారు.
8. అన్నీ మీకే తెలుసునని అనుకుంటారు. ఆధ్యాత్మిక జ్ఞానం సంపాదించాలనే కోరిక ఉండదు.
9. మీ అభిప్రాయమే సరైనది అనుకుంటారు.
10. ఇతరులను తక్కువగా చూస్తూ, వారు తాము తక్కువ వారమని అనుకునేలా చేస్తారు.
11. ఎవరినైనా బాధపెట్టినా లెక్కపెట్టరు.
12. మీకు జరిగే మంచి అంతటికీ మీరే కారణమని అనుకుంటారు.
13. మీకంటె కొన్ని విషయాలలో మరొకరు గొప్ప అని మీరు అంగీకరించరు.
14. ప్రార్థన ముఖ్యం కాదు అనుకుంటారు.
15. అందరికీ లోపాలుంటాయని, అందరూ తప్పులు చేస్తారని మీరు అర్థం చేసుకోలేరు.
16. మీరు మీ గురించి మాత్రమే ఆలోచిస్తారు.
17. మీరు అసహనంతో, విసుగ్గా (వ్యక్తుల లోపాలను విసుక్కుంటారు) మొండిగా ఉంటారు.
18. మార్పును ప్రతిఘటిస్తారు.
19. ఎవరైనా మీతో ఏకీభవించకపోతే తట్టుకోలేరు.

వినయం ఎలా వస్తుంది?

1. ఉపచేతనాత్మక మనస్సును తెరవండి. ఉపచేతనాత్మక మనస్సు చెప్పినట్టుగా పనిచేస్తే మీ అస్తిత్వానికి సహజస్థితి వినయం అవుతుంది.

2. ప్రార్థన చేయండి. మీరు నిజాయితీగా, క్రమం తప్పకుండా ప్రార్థన చేస్తే, మిమ్మల్ని దేవుడు సృష్టించాడనే వాస్తవం నిరంతరం గుర్తు ఉంటుంది. ఇది మిమ్మల్ని వినయంగా ఉంచుతుంది.

3. సహజీవనం, ఐకమత్యాలను అర్థం చేసుకోండి. దేవుడు అందరినీ సమానంగా సృష్టించాడు. ఇతరులకన్నా మీరు అధికులనే ఆలోచన వచ్చిన క్షణంలోనే మీ ఆలోచన తప్పుగా ఉంటుంది. మనందరం భూలోకంలో ఎదుర్కొనే పరీక్షల కోసం శిక్షణ కోసం, పూర్తి చేయాల్సిన ధ్యేయం కోసం వివిధ రకాల ప్రతిభలతో పుడతాం. అందువల్ల అధికులమనే ప్రసక్తే లేదు.

4. ఇతరులకు ఎలా సేవ చేయాలో నేర్చుకోండి. అహం తన కోర్కెలు తీర్చుకోవాలనుకుంటుంది, కాని వినయం సేవామార్గం వైపు నడిపిస్తుంది.

5. నిష్కపటంగా ఉండి, ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకోండి.

6. మీ తప్పులను అంగీకరించండి; అప్పుడు మాత్రమే మారగలరు.

7. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించడానికి నిరంతరం సిద్ధంగా ఉండండి. వినయశీలి నిరంతర విద్యార్థి. **అయితే ఆధ్యాత్మికతలోనికి లోతుగా వెళ్ళవద్దు.** అంటే సిద్ధాంతం దగ్గరే ఆగిపోవద్దు అని దీని అర్థం. విద్యార్థిగా మీరు నేర్చుకున్నదానిని ఒక్కొక్కటిగా ఆచరించండి. నేర్చుకున్నది **ఆచరించిన తర్వాత మీ ఆత్మను బలోపేతం చేస్తారు. ఒకవేళ జ్ఞానంతోనే గుంజాటనపడుతూ ఉంటే, అంతరంగంలో మారడానికి ప్రయత్నించకపోతే అహాన్ని బలోపేతం చేస్తున్నట్టుగా తెలుసుకోండి.**

8. సహానుభూతి కలిగి ఉండండి. ఇతరుల అభిప్రాయాలను గ్రహించండి. దయతో వారి పరిస్థితులను అర్థం చేసుకోండి.

9. సహనంతో ఉండండి. వ్యక్తులు వారి ఆధ్యాత్మిక అభివృద్ధిలో వివిధ స్థాయులలో ఉన్నారని, వారి పరీక్షలు, శిక్షణ, కర్మ, భిన్నంగా ఉంటాయని గ్రహించండి. వారికి ఆధ్యాత్మిక జ్ఞానం కూడా భిన్నస్థాయులలో ఉంటుంది. **వారి మీద తీర్పు చెప్పకండి; వారు ఎదగడానికి సాయం చెయ్యండి.**


10. మీకు మంచి జరిగినపుడు, భూలోకంలో మీరేదైనా సాధించినపుడు దేవుడికి కృతజ్ఞతలు చెప్పండి. ఇంకా భూలోకంలో మీకు సాయం చేసిన వారికి, ఆత్మలోకం నుంచి మీకు సాయం చేసిన వారికి కృతజ్ఞతలు చెప్పండి.

11. ఏ విషయంలోనైనా సందేహం ఉంటే, మీకు నమ్మకమున్న వ్యక్తిని సలహా అడగండి. ఇతరుల సాయం కోరడానికి, సలహా అడగడానికి అహం అడ్డురావటమే ఈనాడు పెద్ద సమస్య అయింది. అది బలహీనతగా అనుకుంటారు. మీకు సాయం కావాలని అడగటానికి చాలా బలం ఉండాలి. ఎవరినీ సాయం అడగకుండా, ఎవరి సాయం లేకుండా సమస్యలు పరిష్కరించుకోగలనని అనుకోవడం గర్వానికి సంకేతం.

12. దేవుడిని శరణువేడండి. సన్మార్గంలో ఉండేందుకు వీలైనంతగా ప్రయత్నించండి. ఫలితం దేవుడి చేతుల్లో ఉందని తెలుసుకోండి. మీ మనసులో ఉన్నదానికన్న ఆయన ప్రణాళిక ఉన్నతమైనది.

ఆధ్యాత్మికతలో అహాన్ని చంపవలసి ఉంటుంది. గర్విష్ఠులకు అది భరించలేనిది. మీరు గనుక గర్విష్ఠులైతే, ఆధ్యాత్మిక ప్రయాణం మొదలుపెట్టడం చాలా కష్టం. గర్వం ఉన్న వ్యక్తి మారడం అసాధ్యం కాదు, కాని వారు మారడానికి చాలా కష్టపడాలి. ఎందుకంటే వారు మారకుండా నిరోధించడానికి వారి అహం కూడా అదనంగా చాలా ప్రయత్నిస్తుంది. ఏళ్ళ తరబడి మీరు అహం వల్ల భౌతిక లౌకిక ప్రపంచంలో పాతుకు పోయి ఉన్నారు. ఆధ్యాత్మికత అంటే ఈ వేర్లను తెంపేయడం, మరింత ఉన్నతమైన అవగాహనతో నూతనమైన వాటిని పెంచడం. అహం ఉంటే ఆధ్యాత్మికంగా ఎదగలేరు. వినయం ఎదగనిస్తుంది, అదే సమయంలో లౌకిక స్థితికి దూరం చెయ్యదు.

అక్షం మార్పు




"ఈ మార్పు పూర్తిగా మనిషి చేసినదే, మనిషి చేసిన పనులవల్ల సృష్టించబడిన శక్తి వల్ల ఇది జరుగుతుంది. నేరాలు, పాపాలు ఎంత ఎక్కువైతే అంత త్వరగా మార్పు వస్తుంది".

"ఈ మార్పు నుంచి బతికి బట్టకట్టాలంటే దైవ నిర్దేశితమైన సన్మార్గంలో ఉండాలి".

అక్షం మారడమంటే ఏమిటి?

ప్రకృతి సజీవమైనది. అందువల్ల శక్తి వల్ల తొందరగా ప్రభావితమవుతుంది. ప్రకృతి తటస్థంగా ఉంటుంది కనుక, మనుషులు పెడదారిలో నడుస్తున్నపుడు వారి పనుల వల్ల చెడు స్పందనలు ఏర్పడతాయి. ఈ చెడు స్పందనలను ప్రకృతి గ్రహిస్తుంది. మనుషులకు ప్రకృతిగతిని మెరుగుపరచగల, నాశనం చేయగల సామర్థ్యం ఉంది. మనుషులు నిరంతరం పెడదారిలో నడుస్తూ, దేవుడి మీద, తోటివారి మీద, ప్రకృతి మీద గౌరవం లేకుండా ఉంటే పెద్ద మొత్తంలో వ్యతిరేకశక్తి ఏర్పడుతుంది. దీని ఫలితంగా ప్రకృతి ప్రతిస్పందన కూడా వ్యతిరేకంగా ఉంటుంది. భూకంపాలు, వరదలు, టోర్నడోలు, అగ్నిపర్వతాలు బద్దలవడం, అగ్ని ప్రమాదాలు మొ॥న ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువవు తాయి. మనుషులను ఆగి, ఆలోచించి, మారమని ప్రకృతి చెప్పే విధానమిది. మానవులు సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించి ఉండవచ్చు కాని అది నిజమైన ప్రగతి కాదు. శక్తిని మానవ సంక్షేమానికి ఉపయోగించాలి స్వలాభానికి గాని, చెడు ప్రయోజనాలకు గాని ఉపయోగించరాదు.

మంచితనం, ప్రేమ, నిస్వార్థం, స్నేహం వంటి మౌలిక పునాదులు భూలోకంలో కనుమరుగయ్యాయి. ఇది ప్రగతి సంకేతం కాదు. వినాశనానికి సంకేతం. ప్రకృతి మానవుల ప్రతిబింబం. మీలో ఏముందో అది మీకు చూపిస్తుంది. మీ ప్రపంచంలో జరిగే ఉత్పాతాలన్నీ మానవులలో ఉన్న అశాంతికి సూచనలు. అంతేకాకుండా మీ నుంచి ఉత్పన్నమయే దానిని ప్రకృతి గ్రహిస్తుంది – మీరు సానుకూలశక్తిని బయటికి పంపితే, శాంతి, సామరస్యాల రూపంలో ప్రకృతి దానిని ప్రతిబింబిస్తుంది. మీరు ప్రతికూల శక్తిని వదిలితే, ప్రకృతి ప్రతిస్పందన కూడా ప్రతికూలంగా ఉంటుంది. మీరు ఒక చోట అణు పరీక్షలు జరిపితే, మరొకచోట భూకంపం వస్తుంది. ఈ గ్రహమంతా మన ఇల్లు అనీ, మనందరికీ సంబంధం ఉందని దురదృష్టవశాత్తు మనం


ఉ
ముందు
భూమధ్యరేఖ
ద


తరువాత
ఉ
భూమధ్యరేఖ
ద

మర్చిపోతున్నాం. ఇప్పుడు మనుషులు సన్మార్గం నుంచి బాగా దూరమవుతున్నారని ప్రకృతి సంకేతమిస్తోంది. దేవుడి గురించి మాట్లాడేందుకు ఆధ్యాత్మిక మార్గంలో నడవడానికి భయపడే, ఇబ్బందిపడే లోకంలో మీరున్నారు. మరి కొందరు దేవుడిని నమ్ముతామని చెబుతారు, కాని ఆయన బోధనల ప్రకారం ఒక్క సెకను కూడా ఉండరు. ఆయన మంచితనంతో వారికి సంబంధం ఉండదు. ఊహించలేని ఎన్నో పనులు చేస్తారు. మరికొందరు తమ అహాన్ని తృప్తిపరచడానికో, విధులు, బాధ్యతలు తప్పించుకుని దేవుడిని చేరుతున్నామని సర్ది చెప్పుకుంటూ ఉత్తుత్తి ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తూ ఉంటారు. మనుషులు నిర్దిష్ట పరిధి దాటితే నియంత్రించడానికి దైవ నియమాలున్నాయి. మంచితనంతో సామరస్యం లేకపోయినా, బాగా అసమతౌల్యం ఉన్నా, పెడమార్గంలో నడుస్తున్నారని ప్రకృతి హెచ్చరికలు చేస్తుంది. ఒకవేళ మనుషులు మారకపోతే, ఈ అసమతౌల్యాన్ని ప్రకృతి శుద్ధి పరచే ప్రక్రియ ద్వారా సరిచేస్తుంది. ఎందుకంటే దైవసృష్టి (మానవులు, ప్రకృతి) అంతా నిర్దేశించిన విధంగానే, పవిత్రంగా, ఉదారంగా, శాంతి యుతంగా ఉండాలి. శాంతిని స్థాపించడానికి ముందుగా ప్రతికూల శక్తులను తుడిచిపెట్టాలి. శుద్ధి చేసే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది కాని ఈసారి మాత్రం భూమి అంతా మరొకసారి పవిత్రంగా మారేవరకూ ప్రకృతి విశ్రమించదు – అంటే మనుషులు సామరస్యంగా ఉండే ప్రదేశం అయ్యేవరకు, సర్వశక్తిమంతుడైన భగవంతుడినిజమైన ఉపకరణాలుగా ఉండేవరకు. నిజమైన ఉపకరణం అంటే నిస్వార్థంగా, అందరికీ మంచి చేస్తూ, దేవుడిని పూర్తిగా విశ్వసిస్తూ ఉండడం.

మనిషి ప్రకృతితో సమతౌల్యం కలిగి ఉండాలి. సన్మార్గంలో నడవాలి. ఆధ్యాత్మికంగా ప్రగతి సాధించాలి. అయితే, భూలోకంలో జీవిత చక్రం ఎలా ఉంటుందంటే ఒక్కోసారి మంచి ఎక్కువగా ఉండి, ప్రతికూలత (చెడు) తక్కువగా ఉండవచ్చు. ఒక్కోసారి పూర్తిగా దీనికి భిన్నంగా ఉండవచ్చు. ఇలా ఈ చక్రం ఒకదాని తర్వాత ఒకటి వస్తూ పోతుంటాయి. ఏదో ఒక సమయంలో వ్యతిరేకత బాగా ఎక్కువైపోతుంది. ఈ వ్యతిరేకత పెరగడం వల్ల దీనిని తుడిచి పెట్టడానికి శుద్ధి ప్రక్రియ మొదలవుతుంది. ఈ శుద్ధి ప్రక్రియను చేపట్టవలసినది ప్రకృతి కనుక, ప్రకృతి వైపరీత్యాలు పెద్ద పరిమాణంలో జరుగుతాయి. ఫలితంగా "ధృవాల స్థల మార్పు" జరుగుతుంది. భౌతికంగా భూ అక్షం మారుతుంది. ఈ అసమతౌల్యాలవల్ల భూకంపాలు వస్తాయి. తర్వాత వరదలు, పెద్ద అలలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, అగ్ని పర్వతాలు బద్దలవడం వంటివి జరుగుతాయి. దీనివల్ల వ్యతిరేక శక్తిలో చాలా భాగం నాశనమవుతుంది. ఈ సమాచారం మిమ్మల్ని భయపెట్టటానికి కాదు. మేల్కొని మారమని చెప్పడానికి.

భూ అక్షం మారడానికి కారణం దేవుడా? మనిషా?

దేవుడు మనిషికి సంకల్పస్వేచ్ఛనిచ్చి కావలసినది తీసుకోమన్నాడు. అందువల్ల మార్పు పూర్తిగా మనిషి చేసినదే, మనిషి చేసిన పనుల వల్ల ఈ ప్రతికూల శక్తి ఏర్పడింది. ఈ మార్పుకు కార్య, కారణ సంబంధం ఉంది. మానవుడు చేసిన దానికి సహజమైన ప్రతిస్పందనగా మార్పు జరిగింది. ఇది పూర్తిగా మానవుల చేతుల్లోనే ఉంది. ఉపచేతనాత్మక మనస్సు చెప్పిన మాట వినకుండా, ఆధ్యాత్మిక మార్గం నుంచి మనుషులు పూర్తిగా దూరంగా పోతున్నారు. మార్పు త్వరగా జరగడానికి ఇదే ప్రధాన కారణం. అద్భుతమైన, సున్నితమైన ప్రకృతి సమతౌల్యాన్ని దెబ్బతీస్తే, ఘోరమైన దుష్పరిణామాలుంటాయి.

మార్పు వ్యవధి ఎంతసేపు?

వినాశనంలో చాలాభాగం కొన్ని గంటల్లోపే జరుగుతుంది. ఇది చాలా వేగంగా జరుగుతుంది. చాలామంది తమ సన్నిహితులను, ప్రియతములను కోల్పోతారు. మంచివారు వారిక మార్గం చూపి, ఓదారుస్తారు. బ్రతకడానికి ధైర్యమిచ్చి ఆశ వదల వద్దని చెబుతారు.

భూఅక్షం ఎప్పుడు మారుతుంది?

ఎప్పుడనేది పూర్తిగా మనుషుల చేతిలోనే ఉంది. నేరాలు, పాపాలు ఎంత ఎక్కువగా ఉంటే అంత త్వరగా అక్షం మార్పు జరుగుతుంది.

అక్షం మారినపుడు ఎవరు బ్రతికి ఉంటారు?

బ్రతికి ఉండడం పూర్తిగా మీ చేతుల్లోనే ఉంది. శుద్ధి ప్రక్రియ అంటే ప్రతికూలతలోని చాలాభాగం తుడిచిపెట్టుకుపోతుంది. బ్రతకి ఉండడానికి, తుడిచి పెట్టుకుపోయే వ్యతిరేకతలో మీరు భాగం కాకుండా ఉండాలి. ఆధ్యాత్మికంగా ఎదగండి.

ప్రపంచ జనాభాలో ఎంతశాతం బ్రతుకుతారు?

ప్రపంచ జనాభాలో 25% మంది బ్రతుకుతారు.

అక్షం మార్పు ఎక్కడ మొదలవుతుంది?

జలప్రళయం, భూకంపంతో ప్రపంచంలో అన్ని చోట్ల ఈ మార్పు ఒకేసారి ఆరంభమవుతుంది. తర్వాత ప్రపంచమంతా గొలుసుకట్టు ప్రతిస్పందనలూ ఉత్పాతాలు జరుగుతూ, పూర్తిగా శుద్ధి ప్రక్రియ పూర్తయ్యేవరకు కొనసాగుతూనే ఉంటాయి. భూమిని సముద్రం ఆక్రమిస్తుంది; దావానలం వ్యాపిస్తుంది; అణ్వాయుధాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి నిలువ చేసిన చోట్లలో పెద్ద పెద్ద పేలుళ్ళు సంభవిస్తాయి. వినాశం మర్చిపోలేని విధంగా ఉంటుంది.

❦ అక్షం మార్పు జరుగుతున్నప్పుడు, జరిగిన తర్వాత ప్రపంచంలో ఎక్కడ సురక్షితంగా ఉంటుంది?

సానుకూల స్పందనలున్న ప్రదేశాలు సురక్షితం. ఉదాహరణకు కెనడాలోని కొన్ని ప్రదేశాలు, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ప్రతికూల స్పందనలు తక్కువ ఉన్న ప్రదేశాలు.

❦ అక్షం మార్పు జరిగిన తర్వాత సురక్షితమైన ప్రదేశాలలో మందులు అవసరమా?

ఆరంభంలో మందులు అవసరమే. ఇంట్లో కొన్ని మందులు ఉంచుకొనడం మంచిది. అంతేకాకుండా ప్రథమ చికిత్స, విపత్తు నిర్వహణ కోర్సులను చేయడానికి ప్రయత్నించండి. ఎవరైనా గాయపడితే ఏం చేయాలో మీకు తెలుస్తుంది.

❦ మన ఆధ్యాత్మిక అభివృద్ధికి అక్షం మార్పుకు సంబంధమేమిటి?

మారడం కష్టమైన ప్రతికూల సమయంలో కూడా మరింత మెరుగ్గా మారగలుగుతారనే ఉద్దేశ్యంతో మీరందరూ భూలోకంలో ఇప్పుడు జన్మించారు. ఈ విధంగానే మీరు ప్రగతిని సాధిస్తారు: కష్టకాలాల్లో భూలోకానికి వచ్చి సానుకూల, ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ ప్రగతి సాధిస్తారు. మీరు చేయాల్సిన మొదటి పని మారడం. దీన్ని త్వరగా అక్షం మారకముందే చేయాలి. ఎందుకంటే ఇది మీ పరీక్ష. ఇది మీరు ఎంపిక చేసుకున్న పరీక్ష. ఒకసారి అక్షం మారిందంటే శుద్ధి ప్రక్రియ మొదలై, భూలోక స్పందనలు మారి ప్రలోభాలు తక్కువవుతాయి; అందుకని ఇప్పుడు మారడం పరీక్ష. ఆత్మలోక ఆత్మలు మీరు మారడానికి సాయపడతాయి, కాని మాకు మీ సహకారం అవసరం. మెరుగైన స్థితికి చేరాలనే కోరిక మీకు లేనట్లయితే మేము బలవంతపెట్టలేం. ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ఆలోచించే సమయం దొరకలేదని ఎన్నడూ అనవద్దు. భౌతికమైన అస్తిత్వంలో బాగా చిక్కుకుని ఉంటే, భూలోకానికి ఎందుకు వచ్చారో మర్చిపోతారు. కష్టకాలంలో జన్మించినందుకు మీరు అదృష్ట వంతులని భావించండి. మీరు ఆధ్యాత్మికంగా ప్రగతి సాధిస్తూ ఉన్నపుడు, లౌకిక విషయాలకు తక్కువ ప్రాధాన్యమిస్తూ, మీ విధులను నిర్వర్తించి, భూలోకంలో మీ ధ్యేయాన్ని పూర్తి చేస్తారు. ఇప్పుడు అంటే ప్రతికూలత శిఖరస్థాయిలో ఉన్నపుడు చేసిన మంచి పని త్వరితంగా ప్రగతి సాధించడానికి తోడ్పడుతుంది. అదే మంచి పనిని తర్వాత దశలో (అక్షం మారిన తర్వాత) స్పందనలు సానుకూలంగా, మంచి పెరుగుతున్నపుడు చేస్తే ఇంత త్వరితంగా ప్రగతి సాధించలేరు.

❦ అక్షం మారుతున్నపుడు భూలోకంలోని వారికి సాయపడడానికి ఆత్మలోక ఆత్మలు ఏం చేస్తున్నాయి?

ప్రస్తుతం, అక్షం మారినపుడు భూలోకంలోనివారు జీవించి ఉండేలా వారి ఆత్మలను మెరుగుపరచడానికి చాలా ప్రయత్నిస్తున్నాం. సదాత్మలను మంచి ప్రదేశాలకు పంపడానికి

కూడా యత్నిస్తున్నాం. మీకు తెలియకుండా భూలోకంలో చాలా ప్రయత్నం జరుగుతున్నది. ప్రస్తుతం మేము ఎంతో అప్రమత్తంగా ఉన్నాం. భూలోకంలో జరిగే ప్రతి చిన్న మార్పును గమనిస్తున్నాం. అక్షం మార్పు ఆవశ్యకమైన శుద్ధి ప్రక్రియ. మీ గ్రహ చరిత్రలో ఇది కొన్ని సమయాలలో క్రమబద్ధంగా జరిగింది; అయితే ఈసారి మాత్రం మానవులు తమకు జీవమిచ్చిన, సాయం చేసిన, ఎదగడానికి తోడ్పడిన గ్రహాన్ని పూర్తిగా నాశనం చేయడానికి సిద్ధమవుతున్నారు. మానవులు ప్రకృతితో ఐకమత్యంగా, సామరస్యంగా జీవించడం నేర్చుకోవాలి. అందువల్ల జీవితాలను సరళం చేసుకుని, సన్మార్గంలో నడవాల్సినది మీరే. మళ్ళీ చెబుతున్నాం, జీవించి ఉండాలంటే మెరుగ్గా ఉండేలా మారాలి. సన్మార్గంలో నడవాలి.

ॐ అక్షం మారే సమయంలో మానవులకు మార్గదర్శకత్వం, సాయం ఎలా లభిస్తాయి?

ఉన్నత ఆవరణలలో ఉన్న వ్యక్తులు రక్షింపబడతారు. ప్రమాదకరమైన ప్రదేశాలలో చిక్కుకున్న సదాత్మలను ఖాళీ చేయించడానికి యుఎఫ్ఓలు (UFOs) బరువులేని దూలాలు పంపుతాయి. ఈ దూలాలు చూసి అందరూ భయపడతారు కాని ఉన్నత ఆవరణలలో ఉన్న సదాత్మలకు వీటిని చూడగానే తామేం చేయాలో తెలుస్తుంది. సదాత్మలు శిథిలాల కింద ఉండి మానవ కంటికి కనిపించకపోయినా వారిని 'చూసి', రక్షించడం జరుగుతుంది. ఈ ఆత్మలను దూలాలవైపు మళ్ళించుతారు. అవి వాటిని అంతరిక్ష నౌకలలోనికి చేరుస్తాయి. ఉన్నత ఆవరణలలో లేనివారు, చెడు స్పందనలు ఉన్నవారు ఈ దూలాలు చూసి భయపడతారు. వీటిని స్పృశించను కూడా లేరు. వెళ్ళాలనుకున్నా వీటిలోపలికి వెళ్ళలేరు. అంతరిక్ష నౌకలోకి చేరిన తర్వాత వారికి బ్రతికి ఉండే నైపుణ్యాలు నేర్పుతారు. తర్వాత సముద్రంలో ఏర్పడిన దీవులలోకి వారిని చేరుస్తారు. మనుషులు ఎదుర్కొనే అత్యంత కష్టమైన పరీక్షలలో ఇది ఒకటి. దీనికి అక్షం మార్పుకు ముందు, తరువాత ఎంతోశక్తి, సానుకూల దృక్పథం అవసరం. త్వరగా మెరుగైన స్థితికి రమ్మని ఎందుకు చెబుతున్నామో ఇప్పుడు మీకు అర్థమైందా?


ॐ అక్షం మారిన తర్వాత ఒక కుటుంబం కలిసే ఉంటుందా?

ప్రతి వ్యక్తీ ఎంత మంచివారు అనేదానిపై ఇది ఆధారపడి ఉంటుంది. అక్షం మారినపుడు మీ ఆవరణనే పరిగణనలోనికి తీసుకొనడం జరుగుతుంది. మీ ఆవరణను బట్టి మీరు కుటుంబంతో కలిసి ఉండటమో, విడిగా ఉండడమో జరుగుతుంది.

ॐ గర్భవతియైన స్త్రీకి చెడు స్పందనలు ఉండి, ఆమె గర్భంలోని బిడ్డ సదాత్మ అయితే వారికేమి జరుగుతుంది?

అక్షం మారే సమయంలో ఏ సదాత్మ కూడా పాపాత్మురాలైన తల్లి ద్వారా పునర్జన్మించరు

ఖోర్షీద్ రుమి భావనగరితో ముఖాముఖి



జనానికి సాయం చెయ్యడం ఎలా మొదలుపెట్టారు?

మా అబ్బాయిలు చనిపోయిన తర్వాత నేను, నా భర్త చాలా వేదన చెందాం. ఎలా జీవిస్తామో మాకు అర్థం కాలేదు. మా అబ్బాయిలు మాతో మాట్లాడుతూ, ఆశ, ధైర్యాల సందేశాలనిస్తూ మాకు సాయం చేశారు. తర్వాత కాలంలో అప్రయత్న లేఖనంలో నాకు నైపుణ్యం వచ్చిన తర్వాత వాళ్ళు మాతో "భూలోకంలోని వారికి మీ ఇద్దరి ద్వారా ఆత్మలోకం నుంచి సాయం చేయడం మా ధ్యేయం" అని చెప్పారు.

మీ అబ్బాయిల సందేశాలు అందుకున్నపుడు మొదటిసారి ఎలా ప్రతిస్పందించారు? సైకిక్ (మనస్సంబంధ) విషయాల్లో మీకు నమ్మకముందా?

మేమెంతో సంతోషించాం. మేము సైకిక్ విషయాలను నమ్ముతాం. వాళ్ళు చనిపోక ముందు విస్పి, నేను చనిపోయిన తర్వాత జీవితం గురించి, పునర్జన్మ గురించి చర్చించుకొనేవాళ్ళం. నాకు ఏడేళ్ళ వయస్సు నుంచి ఈ రకమైన జ్ఞానానికి సంబంధించిన తపన నాలో ఉంది. ఈనాటికీ నేను మర్చిపోలేని అనుభవం ఒకటి ఉంది నాకు. కొందరు బంధువులతో కలిసి నేను, పిల్లలు, రుమి ఎక్కడికో వెళుతున్నాం. ప్రయాణించేటప్పుడు ఎప్పుడూ మిఠాయిలు తీసుకెళతాను. ఈసారి మిఠాయిలు తేవడం మర్చిపోయాను. అందుకని కారాపి, కొన్ని మిఠాయిలు తీసుకోమని రుమికి చెప్పాను. నేను కారులో ఒక్కదాన్నే ఉన్నాను. వాళ్ళకోసం నిరీక్షిస్తున్నాను. అప్పుడు ఏడుస్తున్న ఎద్దునొకదానిని చూశాను. ఎద్దు ముఖం నిండా కన్నీళ్ళతో నిలబడి ఉంది. ఇలా ఎందుకు చేస్తోంది. అదేమైనా బాధపడుతోందా? అనుకున్నాను. ఎద్దు నా వైపు తల తిప్పి, తన దవడను నా చేయి పెట్టిన కారు కిటికీకి ఆనించి నావైపు చూసింది: నేనెందుకు బాధపడుతున్నానో నీకు తెలుసు. నేనెంతో కష్టపడుతున్నాను అని చెప్పాలనుకున్నట్లుగా ఉంది. ఆ క్షణంలో రుమి, పిల్లలు, చుట్టాలు వచ్చారు. ఎద్దుతో నేను మాట్లాడడం చూసి ఆశ్చర్యపోయారు. వ్యతిరేక ఆత్మలు త్వరగా ప్రగతి సాధించడానికి భూలోకంలో బరువులు మోసే పశువుల్లా జన్మిస్తాయని విస్పి నాతో చెప్పాడు). ఈ అనుభవం ద్వారా బరువులు మోసే పశువులు ఎంతో బాధననుభవిస్తాయని తెలుసుకున్నాను, కాని చాలాకాలం తర్వాత గాని నేను దీనిని గుర్తించలేక పోయాను.

అబ్బాయిలు చనిపోయిన నెల తర్వాత మీకెలా అనిపించింది? విస్పి మీ బాధను, దుఃఖాన్ని ఎలా పోగొట్టాడు? వాళ్ళతో మాట్లాడుతున్నానని మీరెలా నమ్మారు?


మాతో మాట్లాడుతున్నప్పుడు తనకు మాత్రమే తెలిసిన సంగతులు విస్పి చెప్పాడు. కొత్త వారి పేర్లు చెప్పి వారిని పిలిచి వారికి కొన్ని సందేశాలివ్వమని కూడా చెప్పారు. మాకు పూర్తిగా తెలియని కొత్తవారిని కనుక్కొని ఇవ్వమన్న సందేశాలు మేము వారికి అందజేశాం. వీళ్ళు నిజంగానే ఉన్నారనే దానికి రుజువు ఇది. విస్పి సందేశాలు సరిగ్గానే ఉన్నాయి. మేము దుఃఖిస్తున్నపుడు మా అబ్బాయిలు జోక్స్ చెప్పి మమ్మల్ని నవ్వించారు. మా జీవితాలు సంతోషంగా ఎలా గడపాలో చూపించారు. మమ్మల్ని నవ్వించి, మార్గం చూపి, ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో చెప్పారు.

చనిపోయిన వారిని ఎందుకు విసిగిస్తున్నారని మిమ్మల్ని తరచుగా జనం అడిగేవారా?


అడిగేవారు. చాలా తరచుగానే అడిగేవారు. మాట్లాడడం ద్వారా వారి ప్రగతిని అడ్డుకుంటున్నామా అని, వారికి హాని చేస్తున్నామా అని, ఏ రకంగానైనా వారి ప్రగతిని ఆపుతున్నామా అని నేను విస్పిని ఎప్పుడూ అడిగేదాన్ని. ఒకవేళ అలా జరిగితే, మాకెంత ఇష్టమున్నా వారితో మాట్లాడడం మానివేసేవాళ్ళం. విస్పి ఇలా చెప్పాడు, "మనం మాట్లాడుకొనడం ద్వారా మేమందరం త్వరగా ప్రగతిని సాధిస్తాం ఎందుకంటే సెకన్లలోనే మేము మీకు మార్గదర్శకం చేయగలం. మేమెలాగైనా మీకు సాయం చెయ్యాలి. వినడానికి మీకు రోజులు, నెలలు పట్టవచ్చు. అయినా మీరు సరైనది చేయకపోవచ్చు. కాని ఇలా ఇద్దరం మాట్లాడుకోవడం వల్ల పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. "వారి ప్రగతికి ఏదీ హాని చెయ్యదని హామీ ఇచ్చాడు. తను చెప్పింది నమ్మి నేను వాళ్ళతో మాట్లాడడం కొనసాగించాను. భూలోకంలోనే త్వరగా, సులభంగా ఆధ్యాత్మికంగా ఎదగగలమని ఇక్కడ మనమెలా జీవిస్తామనే దానిపై అది ఆధారపడి ఉంటుందని కూడా చెప్పాడు.

ఇతరుల కోసం సందేశాలు తీసుకొనడం మీకెలా అనిపించింది? ఇది చాలా పెద్ద బాధ్యత కదా?

నిజమే. అందుకనే వ్యక్తులకు సాయం చెయ్యాలంటే మరింత ఎక్కువ ఆధ్యాత్మిక జ్ఞానం సంపాదించడం అవసరం. మొదట్లో, ఎవరికైనా తప్పు సందేశాన్ని ఇస్తున్నానేమో అని చాలా భయపడేదాన్ని. కొందరు నేను ఇచ్చిన సందేశాలను నమ్మేవారు కాదు. నా మాట వినే వారు కాదు; తర్వాత నా సందేశాలు విననందుకు పశ్చాత్తాపం చెందేవారు. దీనితో నేనిచ్చే సందేశాలు కచ్చితమైనవేనని రుజువైంది. మొదట్లో విస్పి కలాన్ని



రుస్తుంబాగ్ పెవిలియన్లో విస్పి భావనగరి



తన కారులో రతూ భావనగరి

కదిపేవాడు. కొంతకాలం తర్వాత నా పరిస్థితి మెరుగైంది. టెలిపతి ద్వారా సందేశాలను గ్రహించడం తెలుసుకున్నాను. ఇప్పుడు అవి నాకు మనసులోనే వినపడతాయి.

ఒక వ్యక్తి మంచివాడా, చెడ్డవాడా అని నిర్ణయించడానికి తీర్పు చెప్పడానికి మనమెవరం?

ఇక్కడ 'తీర్పు' అనే పదాన్ని వాడకూడదు. నేనెవరిపైనా తీర్పు చెప్పడం లేదు. కాని, విస్సీ, రతూల మార్గదర్శకత్వంలో ఆ వ్యక్తి స్పందనలు మంచివా, చెడ్డవా అని వాళ్ళ స్థాయి తక్కువగా ఉందా అని వెంటనే తెలుసుకోగలను.

ఆధ్యాత్మికంగా ఎదుగుతున్న కొద్దీ, మరింతగా జ్ఞానాన్ని పొందుతున్న కొద్దీ, మీ ఉపచేతనాత్మక మనస్సే మార్గదర్శకురాలిగా ఉంటుంది. మీ అంతఃప్రేరణలనే మీరు నమ్ముతారు. వ్యతిరేక వ్యక్తులతో మీకు అసౌకర్యంగా ఉంటుంది. వారికి దూరంగా ఉండాలనిపిస్తుంది. తమని తాము బాగు చేసుకోవాలనుకునే మంచివారితో ఈ పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అంతఃప్రేరణతో మీరు వారి పట్ల ఆకర్షితులవు తారు.

కొందరు ఆత్మలోకాన్ని ఎందుకు నమ్మరు? నమ్మేవారు పిచ్చివారని ఎందుకంటారు?

జనం నమ్మకపోవడానికి చాలా కారణాలున్నాయి. కొందరికి తాము చూడలేని దానిని, తమకు అర్థం కాని దానిని నమ్మాలంటే భయం. కొందరికి చిన్నప్పుడే నమ్మవద్దని నూరిపోస్తారు; కొందరు పైకి దేవుదున్నాడని నమ్మలేనని అంటారు; కొందరు కుటుంబం, స్నేహితులు తమని చూసి నవ్వుతారని. నమ్మినా నమ్మలేదంటారు. కొందరు అపరాధ భావంతో ఈ నమ్మకాన్ని అంగీకరించరు; కొందరికి వారు బలహీనంగా ఉన్నందున పెడదారి (చెడుమార్గంలో)లో ఉండడమే సులువుగా అనిపిస్తుంది. నా దగ్గరకు వచ్చేవారిలో ఎక్కువమంది యువతీయువకులే. ఇరవై, ముప్ఫయ్ ఏళ్ళలోపు వారే. వృద్ధులు చాలా తక్కువగా వస్తారు. పెద్దవారికి వారి ఆలోచనా విధానం ఎప్పుడో స్థిరమైపోయి ఉంటుంది. మరణానంతర జీవితాన్ని నమ్మరు, పైగా వారికి ఆత్మలోకం అంటే భయం ఉంటుంది. అపరాధ భావంతో ఉన్నవారు రారు. తమ తప్పు వారికి తెలుసు గనుక తమ అపరాధాన్ని ఒప్పుకోవడానికి భయం; వాళ్ళు చెడ్డపనులు చేస్తూనే ఉంటారు, ఇతరులకు తమ గురించి తెలియడం వారికి ఇష్టం ఉండదు, అందుకని వారు ఈ జ్ఞానాన్ని వద్దనుకుంటారు.

విస్సీ, రతూ, పాప్పీలకు ఇష్టమైన పనులేమిటి?

మా కుటుంబంలో అందరికీ సంగీతం, డ్రైవింగ్ అంటే ఇష్టం. మగవారికి క్రీడల పట్ల

ఆసక్తి. విస్పికి, నాకు పుస్తకాలు చదవడం ఇష్టం. జిమ్ రీవ్స్, నాట్‌కింగ్ కోల్‌ల సంగీతమంటే విస్పికి ఇష్టం. విస్పికి, కారు, ఓడ నమూనాలు తయారుచేయడం కూడా ఇష్టం. సొంతంగా స్పీకర్లు కూడా తయారుచేసుకున్నాడు. తను చేసిన మ్యూజిక్ రికార్డింగులు పేర్కొనదగ్గవి. నా దగ్గర వాటిలో కొన్ని ఇంకా ఉన్నాయి. మా అందరికీ జంతువులంటే ఇష్టం. ముఖ్యంగా కుక్కలు. కోలీలు, పొమెరినియన్లు, అల్సేషియను లాసా అప్సో వంటివి చాలా ఉన్నాయి. విస్పి వీటికి మంచి శిక్షణ ఇచ్చాడు.

రతూ కన్న విస్పి గురించి ఎక్కువగా వింటుంటాం, మాట్లాడు కుంటాం ఎందుకని?

రతూ కన్న ఎక్కువగా విస్పి భూలోకంలోని ఆత్మలకు సాయం చేయడం సందేశాలి వ్వడం చేస్తున్నాడు అందుకని విస్పి గురించి ఎక్కువగా వింటుంటాం. రతూ చేసే పని వేరు. అప్పుడే ఆత్మలోకానికి వచ్చిన వారికి మార్గదర్శకుడిగా ఉండి సాయం చేయడం రతూ బాధ్యత. విస్పితో కలిసి భూలోక ఆత్మలతో కూడా తను మాట్లాడతాడు.

ఇతరుల కోసం మొదటిసారిగా ఎప్పుడు మాట్లాడారు?

1981లో నా కజిన్ కోసం, కొంతమంది చుట్టాల కోసం మొదటిసారి మాట్లాడాను.

మీ దగ్గరకు ప్రధానంగా ఏ విషయాలు తెలుసుకోవాలని జనం వస్తారు?


నా దగ్గర 50 శాతం మంది ఆధ్యాత్మిక జ్ఞానం తెలుసుకోవాలని, సందేశాల ద్వారా ఉపశమనం పొందాలని వస్తారు. మిగిలిన 50 శాతం మందిలో సమస్యలున్న వారుంటారు. కుటుంబంలో అశాంతి, తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య తీవ్రమైన సమస్యలు, వివాహ సమస్యలు, అన్నిటికన్న మించి చెడ్డవారు తమ ప్రతికూలశక్తిని ఇతరులపైకి పంపడం వంటి ఎన్నో సమస్యలతో వస్తుంటారు. అన్ని రంగాల్లోని వ్యక్తులు మార్గదర్శకత్వం కోసం వస్తారు. వారు ఒప్పుకుని, నేర్చుకొని, బాగుపడడానికి ఇష్టపడితే నేను వారందరికీ సాయం చేయడానికి ప్రయత్నిస్తాను.

పాఠకులకి మీరిచ్చే సందేశం ఏమిటి?

భూలోకంలో తమ ప్రియతములను కోల్పోయిన సదాత్మలు ఎందరో ఉన్నారు. ఆ బాధను తట్టుకొనలేక చెడుమార్గం పడతారు. వారు ఒంటరులు కారని మేము హామీ ఇస్తున్నాం. వారి ప్రియతములు ఇంకా వారితోనే ఉన్నారు, ఆత్మలోకం నుంచి వారిని కాపాడుతూ ఉన్నారు. ఎన్నో ఏళ్ళ కిందట విస్పి నాకు చెప్పిన విషయాన్ని ఎప్పుడూ

గుర్తుంచుకోండి: "నిజమైన, అసలైన ప్రేమ ఎన్నడూ చనిపోదు. భూలోకంలో మీరు చనిపోయిన తరువాత కూడా. ప్రేమ చావుకన్న గొప్పది. ప్రేమ శాశ్వతం. మృత్యువు ఒక పరివర్తన - ఒక ప్రపంచం నుంచి మరొక ప్రపంచానికి, ఒక శరీరం నుంచి మరొక శరీరానికి. మృత్యువేమీ గొప్పది కాదు, ప్రేమ విశిష్టమైనది".

ముఖ్యమైన పదాలు



ఆకాశిక్ రికార్డులు

ఆకాశిక్ రికార్డులనే స్మృతులమందిరం అనీ, సమాచార మందిరం అనీ అంటారు. ఇక్కడ మీరు చేసే ప్రతి మంచి, చెడు పనులన్నీ మీ ఆత్మనామం కింద రికార్డయి ఉంటాయి. భూలోకంలో మీ జన్మల స్మృతులన్నీ ఆకాశిక్ రికార్డులలో వుంటాయి. భూలోకంలోని ఆత్మలు కలలు లేని గాఢనిద్రలో ఉన్నపుడు వారి ఉపచేతనాత్మక మనస్సు ఆకాశిక్ రికార్డులలో నమోదు చేస్తుంది.

దేవదూతలు

5వ ఆవరణ 7వ దశలో కాని దానిపై దశలో కాని ఉన్న సదాత్మలు దేవదూతలు. వారికి మహిమలు చేసే సామర్థ్యము, శక్తి ఉంటాయి. అత్యవసర పరిస్థితులలో అత్యున్నత సదాత్మ అనుమతితో వీరు భూలోకానికి వచ్చి మానవులకు సాయం చేయగలరు. కిందిస్థాయిలో ఉండే ఆత్మలు దేవదూతలు కాలేరు. భూలోకంలోని ఆత్మలకు మార్గదర్శకత్వం చెయ్యడం ఎలాగో బాగా తెలుసుకోవడానికి వారికి శిక్షణ అవసరం.

ప్రేతాత్మలోకం

ప్రేతాత్మలోకం భూలోకానికి పైన, ఆత్మలోకానికి కింద ఉంటుంది. అంటే భూలోకానికి ఆత్మలోకానికి మధ్య ఉంటుంది. ఇక్కడ ప్రేతాత్మలు ఉంటాయి. ఇవి ప్రేతాత్మలోకం నుంచి భూలోకాన్ని చూడగలవు కాని ఆత్మలోకాన్ని చూడలేవు.

ప్రేతాత్మ (సత్త)లు

చనిపోయినవారు. వీరు ఉపచేతనాత్మక మనస్సు సలహాని పెడచెవిని పెట్టి ఆత్మ సత్తలుగా మారకుండా ఉన్నవారు, ప్రేతాత్మ సత్త అంటే భూలోకంలోని శరీరాన్ని వదిలిపెట్టి, ఇంకా ఆత్మ సత్త కానిది. చనిపోయేటపుడు మానవ శరీరం ఎలా ఉందో ఇది కూడా అలాగే ఉంటుంది.

తేజోవలయం

జీవించి ఉన్న ప్రతి సత్త చుట్టూ ఆవరించి ఉండే శక్తి తేజోవలయం. ప్రస్తుతం ఉన్న మానసిక, ఔద్వేగిక, శారీరక స్థితిని బట్టి దీని రంగు ఉంటుంది. మానవులు కొందరికి

ఈ తేజోవలయాలను చూడగలిగే సామర్థ్యం ఉంటుంది.

అప్రయత్న లేఖనం

భూలోకంలోని మనుషులతో మాట్లాడడానికి ఆత్మలోకంలోని వారు వాడే ప్రక్రియ అప్రయత్నం లేఖనం. మీరు మాట్లాడే ఆత్మ సత్త మీరు పట్టుకున్న కలాన్ని పేజీ మీద తేలికగా కదుపుతుంది. నిదానంగా కొంత సమయం తర్వాత పదాలు, వాక్యాలు రాయడం వస్తుంది.

అప్రయత్న లేఖనాన్ని మీ అంతట మీరు స్వయంగా ప్రయత్నించవద్దు. రక్షకలింకు లేకుండా అప్రయత్న లేఖనాన్ని ప్రయత్నించడం ప్రమాదం.

చేతబడి

దైవ నియమాలకు పూర్తిగా విరుద్ధమైన తాంత్రిక విద్య చేతబడి. ప్రతికూల ప్రేతాత్మలను, ప్రాణులను తమ ప్రతికూల ఆలోచనలు, స్వార్థ ప్రయోజనాల కోసం ఇతరులకు హాని చేయడానికి మానవులు దీన్ని వాడతారు.

మార్గం

ఆత్మలోకంలోని వారు భూలోకంలోని వారితో మాట్లాడడానికి ఉపయోగించే మాధ్యమం.

అంతఃకరణ / అంతరాత్మ

దీనినే ఉపచేతనాత్మక మనస్సు అని కూడా అంటారు. చూడండి. ఉపచేతనాత్మక మనస్సు

ఇంద్రియాతీత గ్రహణశక్తి (ఇఎస్‌పి)

స్పర్శ, రుచి, వినికిడి, దృష్టి, వాసనలనే పంచేంద్రియాతీత విషయాలను గ్రహించగలిగే సామర్థ్యం ఇంద్రియాతీత గ్రహణశక్తి.

దెయ్యాలు

చూడండి. ప్రేతాత్మ (సత్త)లు

సమూహాత్మలు

దేవుడు కొన్ని ఆత్మలను ఒకేసారి సృష్టించాడు. ఈ ఆత్మలు భూలోకంలో, ఒక జన్మ తరువాత మరో జన్మలో ఒకే సమూహంలో కలిసి పుడతాయి. ఈ రకంగా ఒకరికొకరు తమ కర్మను చెల్లించుకొనడానికి సాయం చేసుకుంటూ ధ్యేయాన్ని పూర్తి చేసుకుంటూ

ఆధ్యాత్మికంగా ఎదుగుతారు. సమూహాత్మలను, సోల్ మేట్స్ (Soul Mates) అని కూడా అంటారు.

సమాచార మందిరం

చూడండి. ఆకాశిక్ రికార్డులు

జ్ఞానమందిరం

జ్ఞానమందిరం అంటే ఆత్మలోక ఆత్మలకు కావలసిన సమాచారాన్ని అందించే ప్రదేశం. ఇది ఆత్మలోకంలో ఉంటుంది. ఆధ్యాత్మిక సత్యాలు ఉండే గ్రంథాలయం లాంటిది. దైవ నియమాలు, విశ్వస్వభావం, దైవసృష్టికి సంబంధించిన ప్రతి చిన్న విషయానికి సంబంధించిన జ్ఞానం దీనిలో ఉంటుంది. ఆత్మకున్న అవగాహనా సామర్థ్యాన్ని బట్టి సమాచారం అందుబాటులోకి వస్తుంది.

స్మృతుల మందిరం

చూడండి. ఆకాశిక్ రికార్డులు

విశ్రాంతి మందిరం

భూలోకంలోని వ్యక్తి గనుక ఆకస్మికంగా, హఠాత్తుగా చనిపోతే అతడి ఆత్మను ఈ మందిరానికి తీసుకెళతారు. ఈ ఆత్మ ఆందోళితమవుతుంది గనుక ఉపశమనం కోసం స్వస్థత కిరణాలను ప్రసరింపచేస్తారు.

ఉన్నత సదాత్మ(లు)

ఉన్నత సదాత్మ అంటే 6వ ఆవరణ 7వ దశలో ఉన్న ఆత్మ సత్త.

ఆ ఆవరణలోని ఉన్నత సదాత్మ

ప్రతి ఆవరణలో ఉండే పాలకుడు, రాజు లేదా అధిపతిని ఆ ఆవరణలోని ఉన్నత సదాత్మ అంటారు – తరువాతి విశ్వం నుంచి వచ్చిన సంపూర్ణ ఆత్మ

అత్యున్నత సదాత్మ

7వ ఆవరణకు, ఇతర ఆవరణలకు పాలకుడు, రాజు, అధిపతి. తరువాతి విశ్వం నుంచి వచ్చిన సంపూర్ణాత్మ

ఉన్నతాత్మ

చూడండి. ఉపచేతనాత్మక మనస్సు

అంతఃప్రేరణ

ఉపచేతనాత్మక మనస్సుకు తోచే దైవదత్తమైన అంతఃభావన. ఈ భావన మీకు, మీ చుట్టూ ఉండేవారికి రక్షణగా ఉంటుంది.

కర్మ

ఆత్మ చేసే ఆలోచనలు, మాట్లాడే మాటలు, చేసే పనుల ఫలితం కర్మ. ఏ విత్తనం నాటితే ఆ పంట పండుతుంది అనే సూత్రం దీనికి ఆధారం. కర్మ మీరు తీర్చవలసిన రుణం కావచ్చు, మీకు లభించే ఆశీస్సు (మంచి) కావచ్చు.

లింకు

భూలోకంలోని ఆత్మలకు, ఆత్మలోకంలోని మంచి ఆత్మలకు మధ్య సురక్షితంగా సంభాషణ జరగడానికి అప్రయత్న లేఖన ప్రక్రియలో ఉన్నత ఆత్మసత్తలు ప్రార్థనల ద్వారాను, సానుకూల శక్తిద్వారాను రక్షణను కల్పిస్తారు. ఈ లింకును ఆత్మలోకం నుంచి అనుమతి లభించిన తర్వాత, అనుభవం ఉన్న అధీకృత అప్రయత్న లేఖకుడు మాత్రమే కలపగలరు.

గురువు

ఆధ్యాత్మిక గురువు. ఆత్మలోకం లోని ఉన్నత ఆవరణల నుంచి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించి, వ్యాప్తి చేయాలనే ధ్యేయంతో భూలోకానికి వచ్చిన పరిణతాత్మ.

వాహకం

భూలోకం నుంచి ఆత్మలోకంతో సంభాషించగల వ్యక్తి.

ఉద్దేశ్యం

ఒక వ్యక్తి ఆలోచనలు, మాటలు, చేతల వెనుక ఉన్న నిజమైన ఉద్దేశ్యం, కారణం, ప్రేరకశక్తి.

గత జన్మ స్మృతి

ఒక ఆత్మకు గత జన్మలోని సంఘటనో, దానిలో కొంత భాగమో గుర్తుకు రావడం.

ప్రవక్త

భూలోకంలో ప్రతికూలశక్తి తీవ్రంగా ఉన్నపుడు, భూలోకంలోని వారికి మార్గదర్శిగా ఉండేందుకు దేవుడు ఉన్నత విశ్వం నుంచి ఎంతో ఉన్నత ఆత్మను భూలోకానికి పంపుతాడు. వారే ప్రవక్త. ఈ ప్రవక్త భూలోకంలోని వారికి ఆధ్యాత్మికంగా మెరుగయ్యేలా జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ప్రవక్తలు భూలోకానికి అరుదుగా వస్తారు. భూగ్రహంలో ఆధ్యాత్మిక సంక్షోభం ఏర్పడినపుడే వారు వస్తారు.

ఆవరణలు

ఆత్మలోకంలో ఏడు ఆవరణలున్నాయి. ఒకటవ ఆవరణ అన్నిటికన్న కింద ఉంటుది. ఏడవ ఆవరణ అన్నిటికన్న పైన ఉంటుంది.

ఆత్మలతో ఆధ్యాత్మిక సమావేశం

చనిపోయిన తమ ప్రియతములతో మాట్లాడాలనుకునే, లేదా ఇతర ప్రకృత్యాతీత శక్తులతో మాట్లాడాలనుకునే వ్యక్తుల సమూహం. ఈ సమూహానికి ఆత్మలకు మధ్య ఒక్క వ్యక్తి మాత్రమే వాహకంగా ఉండి సమావేశం నిర్వహించుతారు.

అక్షం మారడం

దైవం నియమాలను ఎలా తయారుచేశాడంటే - మనుషులు ఆధ్యాత్మికంగా తప్పు చేస్తున్నపుడు, నిర్దిష్ట పరిమితిని దాటి ప్రవర్తిస్తున్నప్పుడు వారు తప్పుదారిలో వెళుతున్నారని ప్రకృతి వారికి హెచ్చరికలు జారీచేస్తుంది. ఒకవేళ మనుషులు మారకపోతే శుద్ధి ప్రక్రియ ద్వారా ప్రకృతే అసమతౌల్యాన్ని సరి చేస్తుంది. శుద్ధి ప్రక్రియను ప్రకృతి చేపడుతుంది కనుక భూఅక్షం మారి 'ధృవాలు మారే' విధంగా ఘోరమైన ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి.

వెండి రజ్జువు

మీ ఆత్మకు, మీ భౌతిక శరీరానికి మధ్య సంబంధాన్ని ఏర్పరచే వెలుగు కిరణం వెండి రజ్జువు.

ఆత్మ

శాశ్వతమైన ఆత్మ శరీరం. భూలోకంలో భౌతిక మనస్సు చెప్పినట్టు నడుచుకునే భౌతిక శరీరం ఎలా ఉటుందో, ఆత్మ కూడా అలాగే శాశ్వతమైన మీ ఆత్మ శరీరం. దీనిని మీ

ఉపచేతనాత్మక మనస్సు నడిపిస్తుంది.

ఆత్మ లక్షణాలు

ఆత్మ లక్షణాలంటే గుణాలు - సానుకూల ప్రతికూల / వ్యతిరేక లక్షణాలు. వీటిని ఎన్నో జన్మల ద్వారా ఆత్మ పొందుతుంది.

ఆత్మనామం

ఆత్మ సృష్టించబడినపుడు ప్రతి ఆత్మకు ఒక పేరు పెట్టడం జరుగుతుంది. ఆత్మ ఎలా రెండుగా విభజింపబడుతుందో, పేరు కూడా అలాగే, ఇది మీరున్నంతకాలం ఉండిపోతుంది. మీ ఆత్మనామం కింద మీరు చేసే పనులన్నీ అకాశిక్ రికార్డులలో నమోదు చేయడం జరుగుతుంది.

ఆత్మలోక ఆత్మ

ఆత్మలోక ఆత్మలో మీ ఆత్మ, మీ ఉపచేతనాత్మక మనస్సు ఉంటాయి.

ఆత్మమార్గదర్శులు

భూలోకంలో ఉండే ప్రతి ఆత్మకూ ఆత్మలోకంలో ఒక సంరక్షకుడు ఉంటారు. పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకు వీరు భూలోక ఆత్మకు మార్గదర్శిగా ఉంటారు. ఈ సంరక్షకుడిని ఆత్మ మార్గదర్శి అంటారు. ఆధ్యాత్మిక మార్గదర్శనం చేయడం వీరి పని.

ఆత్మలోకం

మన అసలైన ఇల్లు. ఇది 7ఆవరణలుగా విభజింపబడి ఉంటుంది. ప్రతి ఆవరణలో 10 దశలు ఉంటాయి.

ఉపచేతనాత్మక మనస్సు

ఉపచేతనాత్మక మనస్సునే అంతరాత్మ, ఉన్నతాత్మ, ఆంతరిక వాణి అంటారు. ఇది మీ అసలైన ఆధ్యాత్మిక మనస్సు. మీ ఆత్మకు మార్గదర్శనం చేస్తుంది.

టెలిపతి

ఆత్మసత్తల నుంచి ప్రొజెక్ట్ చేయబడిన ఆలోచనలను సందేశాల రూపంలో గ్రహించగల సామర్థ్యం టెలిపతి, ఈ సందేశాలను ఉపచేతనాత్మక మనస్సు గ్రహిస్తుంది.

కవల ఆత్మలు

4వ ఆవరణ 5వ దశ నుంచి ఆత్మ మానవలోకంలో ప్రయాణం ఆరంభించినపుడు రెండుగా విభజింపబడుతుంది; ఒక మగ ఆత్మ, ఒక ఆడ ఆత్మ. ఈ రెండు ఆత్మలు విడిగా ఉంటాయి. 7వ ఆవరణ 9వ దశ చేరే వరకూ విడిగానే తమ భూలోక ప్రయాణాన్ని కొనసాగిస్తాయి. అక్కడ మళ్ళీ రెండూ కలిసి ఒకే పూర్ణాత్మగా మారి తరువాతి విశ్వానికి చేరుతుంది.

స్పందనలు

సజీవమైనా, నిర్జీవమైనా ప్రతి వస్తువుకూ స్పందన ఉంటుంది. స్పందన అంటే వివిధ వేగాలలో ప్రవహించే శక్తి తరచుదనం. ఈ స్పందనలు మంచివి, చెడ్డవి రెండూ ఉండవచ్చు. మంచి స్పందన, మీకు సుఖంగా, సానుకూలంగా అనిపిస్తుంది. చెడు స్పందన అసౌకర్యంగా, ప్రతికూలంగా అనిపిస్తుంది. (వీటిని మీరు సదాత్ములైతేనే, ఉపచేతనాత్మక మనస్సు తెరచుకొని ఉంటేనే గుర్తించగలరు)

సదాత్మ ప్రవేశం

భూలోకంలో మీరు తట్టుకోలేని పరిస్థితి వచ్చినపుడు, మీరు సన్మార్గంలోనే ఉంటే, ఆత్మలోకం నుంచి ఒక సదాత్మ వచ్చి మీ శరీరంలో చేరి మీ కష్టకాలం పూర్తయ్యేవరకూ ఉండి సాయం చేస్తుంది. ఇది చాలా అరుదుగాను, చాలా అత్యవసరమైతేను తప్ప జరగదు.

చదవదగిన పుస్తకాలు



ఎ సెర్చ్ ఫర్ ద ట్రూత్ : రూత్ మాంట్ గోమరీ

హియర్ అండ్ హియర్ ఆఫ్టర్ : రూత్ మాంట్ గోమరీ

ఎ వరల్డ్ బియాండ్ : రూత్ మాంట్ గోమరీ

ద వరల్డ్ బిఫోర్ : రూత్ మాంట్ గోమరీ

స్ట్రేంజర్స్ ఎమాంగ్స్ట్ అజ్ : రూత్ మాంట్ గోమరీ

బోర్న్ టు హీల్ : రూత్ మాంట్ గోమరీ

త్రెషోల్డ్ టు టుమారో : రూత్ మాంట్ గోమరీ

కంపానియన్స్ ఎలాంగ్ ద వే : రూత్ మాంట్ గోమరీ

హెరాల్డ్ ఆఫ్ ద న్యూ ఏజ్ : రూత్ మాంట్ గోమరీ

ఏలియన్స్ ఎమాంగ్ అజ్ : రూత్ మాంట్ గోమరీ

ద వరల్డ్ టు కమ్ : రూత్ మాంట్ గోమరీ

డు ద డెడ్ సఫర్? : లారెన్స్ బర్ట్

టీచింగ్ ఆఫ్ సిల్వర్ బిర్చ్ : సిల్వర్ బిర్చ్

గైడెన్స్ ఫ్రమ్ సిల్వర్ బిర్చ్ : సిల్వర్ బిర్చ్

ఫిలాసఫీ ఆఫ్ సిల్వర్ బిర్చ్ : సిల్వర్ బిర్చ్

మిస్టరీ ఆఫ్ లైఫ్, డెత్ అండ్ ద బియాండ్ : ఎఫ్ రుస్తుంజీ

లైఫ్ ఆఫ్టర్ లైఫ్ : రేమండ్ మూడీ జూనియర్, ఎండి

డెత్ అండ్ ఇట్స్ మిస్టరీ బిఫోర్ డెత్: కేమిల్లె ఫ్లేమేరియన్

యు విల్ సర్వైవ్ ఆఫ్టర్ డెత్ : షేర్ వుడ్ ఎడ్డీ

లైఫ్ ఇన్ ద వర్ల్డ్ అన్ సీన్ : ఆంథోనీ బోర్జియా

ఎ లైఫ్ ఆఫ్టర్ డెత్ : డా. ఎస్. రాల్ఫ్ హార్ల్

ట్వంటీ కేసెస్ సజెస్టివ్ ఆఫ్ రి ఇన్‌కార్నేషన్ : ఇయాన్ స్టీవెన్సన్, ఎండి

ఫెయిత్ ఈజ్ ద ఆన్సర్ : నార్మన్ విన్సెంట్ పీలె

మెనీ లివ్స్, మెనీ మాస్టర్స్ : బ్రియాన్ వెయిస్, ఎండి

మెసేజెస్ ఫ్రమ్ ద మాస్టర్స్ : బ్రియాన్ వెయిస్, ఎండి

ఎడ్గార్ కేసీ : ద స్లీపింగ్ ప్రొఫెట్ : జెస్ స్టెర్న్

మెనీ మేన్షన్స్ : ద ఎడ్గార్ కేసీ స్టోరీ ఆఫ్ రీ ఇన్‌కార్నేషన్ : జినా సెర్మినారా

ఆన్ అట్లాంటిస్ : ఎడ్గార్ కేసీ

ఎర్త్ ఛేంజెస్ అప్ డేట్ : హగ్ లిన్ కేసీ

వియ్ ద ఆర్క్ ట్యూరియన్స్ : డా. నోర్మా మిలెనోవిచ్ (విత్ బెట్టీ రైస్ అండ్ సింథియా ఫ్లోస్కి)

చివరి సందేశం



ఖోర్షీద్ ఆంటీ ఎప్పుడూ "ఆధ్యాత్మికత సులభమైన విషయం. దానిలోకి లోతుగా వెళ్ళవద్దు" అని చెప్పేవారు. ఆధ్యాత్మికత అంటే పర్వతాల మీదికి పారిపోవడం కాదు. ప్రజల మధ్యలో ఉంటూ, సమస్యలను ఎదుర్కొంటూ, మీ విధులు బాధ్యతలు పూర్తి చేస్తూ జీవించటం. భూలోకంలో మీ ఆధ్యాత్మిక ధ్యేయాన్ని పూర్తి చేయడానికి సంబంధించినది ఇది. ఈ సున్నితమైన సంతులనాన్ని మీరు అర్థం చేసుకుంటే మీ జీవితం ఆనందంగా ఉంటుంది.

ఆధ్యాత్మికతను గురించి వెయ్యి పుస్తకాలు చదివితేనో, ఆధ్యాత్మికత ప్రధానోద్దేశాలైన నిస్వార్థమైన సేవ, నిజమైన ఆచరణలను వదిలి ఆధ్యాత్మిక సమూహంలో చేరితేనో ఆధ్యాత్మికులు అవలేరు. మీకు తెలిసిన జ్ఞానాన్ని కూడా విచక్షణతో వడపోసి ఏది రైటో, ఏది తప్పో అంతఃప్రేరణతో గ్రహించాలి. పుస్తకాలలోని జ్ఞానం గురించి ఛాందసంగా ఆలోచించడంలో ఉపయోగం లేదు. అంతా మీకే తెలుసునని అనుకునేలా మీ అహానికి అనుమతినివ్వకూడదు. తెలిసిన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టి చూడాలి. చాలామంది తాము చదివిందే నిజమనుకుని చెప్పేది ఆచరించకుండా తమని తాము టీచర్లుగా చెప్పుకుంటారు. అహం వల్ల కళ్ళు మూసుకుపోతాయి, తెలిసిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఆచరణలో పెట్టనందువల్ల జ్ఞానార్జనకు వెచ్చించిన ఏళ్ళన్నీ వ్యర్థం, పైగా ఆధ్యాత్మిక ఎదుగుదల కూడా ఉండదు. ఇదంతా ఆధ్యాత్మిక అహం వల్ల జరుగుతుంది. మనిషికి సంభవించే పెద్ద పతనం ఇది. మిమ్మల్ని ఆధ్యాత్మికులుగా తయారుచేసేది మీ పని. నిజాయితీగా నిస్వార్థంగా చేసే పని వల్ల నిజమైన మార్పు వస్తుంది.

చిన్న చిన్న దయార్ద్రమైన పనులంటే ఖోర్షీద్ ఆంటీకి ఇష్టం. ఏ సమస్యను గురించైనా కొద్ది కొద్దిగా పూర్తి విశ్వాసంతో పని చెయ్యమని చెప్పేవారు. ఆధ్యాత్మికత నిదానంగా అలవడుతుంది. కాని కచ్చితంగా ఎదుగుదల ఉంటుంది. మనందరిలో లోపాలు ఉంటాయి. అందరం తప్పులు చేస్తాం. మనల్ని మనం, ఇతరులను కూడా క్షమించు కుంటూ, నిరంతరం మరింత ముందుకు సాగుతూ మన లక్ష్యాలను సాధించాలి. దేవుడు, ఆయన పంపే దేవదూతల సాయంతో మనం దీనిని చేయగలం.

ఎలాగైతే గొంగళి పురుగు గూడును పగులగొట్టి బయటకు సీతాకోక చిలుకలా మారి ఎగురుతూ వస్తుందో, అలాగే మీ ఆత్మ కూడా సృష్టికర్తలో లీనమయ్యేవరకూ భౌతిక పరిమితులను బద్దలు కొట్టి స్వేచ్ఛగా ఉన్నత ఆవరణలలోనికి ఎదుగుతూనే ఉంటుంది.

దేవుడు చల్లగా చూడాలని కోరుతూ

షయామక్.

రచయితను గురించి



ఖోర్షీద్ భావనగరి భారతదేశంలోని ముంబయి (బొంబాయి)లో 1925లో జన్మించారు. టీచరుగా కాని, మానసిక శాస్త్రవేత్తగా కాని, డిటెక్టివ్‌గా కాని కావాలని బాల్యంలో కలలు కన్నారు. తోటపని, వంట చేయడం, సంగీతం ఆమె అభిరుచులు. హవాయి గిటార్ అంటే మరీ ఇష్టం. క్రికెట్ కూడా బాగా చూసేవారు. 1949లో రుమి భావనగరిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు విస్పి, రతూ. కుటుంబమంతా అమితంగా ఇష్టపడే ఆటోమొబైల్స్, డ్రైవింగ్ అంటే తనకు చాలా ఇష్టమని గుర్తించారు. 1980లో కుమారులు ఇద్దరూ కారు ప్రమాదంలో చనిపోయారు. ఆ తరవాత నుంచి ఆమె వారితో అప్రయత్న లేఖన ప్రక్రియ ద్వారా మాట్లాడడం ఆరంభించారు. భూలోకంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం ఆవిడ ధ్యేయమని కొడుకులు ఆమెకు చెప్పారు. 1998లో, 72 ఏళ్ళ వయస్సులో కెనడాలోని వేంకూవర్‌కు వెళ్ళి తన ధ్యేయం పూర్తి చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తూ, 2007 ఆగస్టులో చనిపోయారు. ఈ పుస్తకాన్ని వీలైనంతమంది చదవాలని శ్రీమతి ఖోర్షీద్ భావనగరి గారి కోరిక.

మేము చెప్పే ముందస్తు జాగ్రత్త



ఈ పుస్తకంలో ఉన్న సందేశాలన్నీ అప్రయత్న లేఖన ప్రక్రియ ద్వారా అందినవి. రచయితవి గాని, / విఆర్ఆర్పి స్పిరిచ్యువల్ లెర్నింగ్ వారి అభిప్రాయాలుగాని కావు. దీనిలోని విషయాల కచ్చితత్వానికి వారంటీ, హామీ లాంటివేమీ విఆర్ఆర్పి స్పిరిచ్యువల్ లెర్నింగ్ ఇవ్వదు. ఈ సందేశాలలోని విషయాల సంపూర్ణతకు గాని, సందర్భోచితత్వానికి గాని ఎటువంటి ప్రాతినిధ్యము, బాధ్యత వహించదు.

ఈ పుస్తకం చదివి, పైన చెప్పిన హెచ్చరికను పాఠకుడు అంగీకరించాలి. తరవాత అతడు / ఆమె చేపట్టే ఏ చర్యకైనా వారిదే బాధ్యతగా నిర్ధారించుకోవాలి. ఈ పుస్తకంలో రాసిన విషయాలకు సంబంధించిగాని, పాఠకుడుగాని, వారిచే ప్రేరితులైన ఇతరులు గాని చేపట్టే చర్యలకు గాని విఆర్ఆర్పి స్పిరిచ్యువల్ లెర్నింగ్‌ను బాధ్యురాలిగా చేయరాదని తెలియజేస్తున్నాం.

"జీవాత్మ ప్రపంచ నియమాలు" పుస్తకంలో చెప్పిన జ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి నిబద్ధులైన వ్యక్తుల సమూహం విఆర్ఆర్పి స్పిరిచ్యువల్ లెర్నింగ్. వీరు తమ ప్రియతములను కోల్పోయిన వ్యక్తులకు సాయం చేసి, ఓదార్చి, ఆధ్యాత్మిక మార్గదర్శ కత్వాన్ని ఇస్తారు. కొందరు విఆర్ఆర్పి స్పిరిచ్యువల్ లెర్నింగ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పి మోసగించిన సందర్భాలున్నాయి. అటువంటి వాటికి విఆర్ఆర్పి బాధ్యత వహించదు. ఇటువంటి వారిని సంప్రదించే ముందుగా విఆర్ఆర్పి స్పిరిచ్యువల్ లెర్నింగ్ సమూహాన్ని సంప్రదించి వారు అసలైన వారా, కాదా అని నిర్ధారించుకోవాలి.

అప్రయత్న లేఖనం రచయిత చేతనాత్మక మనస్సు నుంచి రాదు. ఇది ఆత్మలోకం నుంచి వచ్చే సమాచారం. దీనికి అభ్యాసము, నియంత్రణ కావాలి. మార్గదర్శకత్వం, పర్యవేక్షణ అవసరం. కేవలం అధీకృతమైన అనుభవం ఉన్న, లింకు ఉన్న విఆర్ఆర్పి ప్రస్తుత సభ్యులు మాత్రమే మీ అప్రయత్న లేఖనం లింకును కలపగలరు. **అప్రయత్న లేఖనాన్ని సొంతంగా చేయడానికి ప్రయత్నించవద్దు.**